# మధుబాబు



# ఆనంద జ్యోతి

# ఆనంద జ్యోతి

## మధుబాబు

# ఆనంద జ్యోతి

సాయం సమయం అవటానికి ఇంకా కొద్దివ్యవధి మాత్రమే వున్నదనగా ధనదుపురపు రాచవీధిలో చెలరేగింది ఒక కలకలం.

"రండి రండి... అందరూ రండి... రాజభవనంలో హేమసుందరి నృత్యం చేస్తోందిట... చూసి వద్దాం...రండి రండి...."అని కేకలు పెడుతూ పరుగులు ప్రారంభించారు కొందరు పౌరులు.

చేస్తున్న పనుల్ని మధ్యలోనే వదిలేసి వారిని అనుసరించారు చాలామంది. తన దురదృష్టాన్ని తల్చుకుని నిట్టూర్పులు విడిచారు అలా చేయడానికి వీలుపడని మరికొందరు.

రాచవీధికి పడమటి పక్కగా వున్న ఒక చిన్న భవనంలో కూర్చుని మద్యాన్ని సేవిస్తున్నాడు ధనదుపుర సేనాపతి కుమారుడు నాసీరుడు.

వీధిలోని కలకలాన్ని గమనించి ప్రశ్నార్థకంగా చూశాడతను తనపక్కనే కూర్చుని వున్న స్నేహితుడి వంక.

"ఆరుమాసాల క్రితం రాజమహేంద్రవర ప్రాంతాలనుంచి మన నగరానికి వచ్చింది శివకామిని అనే వారకాంత ఒకర్తె. ఆమె కుమార్తె హేమసుందరి సంగీత నృత్యాలలో అందెవేసిన చేయి. అందచందాలలో అప్సరస" తడుముకోకుండా తెలియచేశాడా స్నేహితుడు.

"ఈ విషయాన్ని నువ్వు నాకు ముందే ఎందుకు చెప్పలేదు?" కనుబొమలు ముడివేస్తూ కోపంగా అడిగాడతన్ని నాసీరుడు.

"సంవత్సరకాలం క్రితం తాతగారి ఇంటికిపోయి నిన్నకాక మొన్న నగరానికి తిరిగివచ్చావు నువ్వు. ఈ రోజు మధ్యాహ్నం వరకూ మనం కలుసుకోవడానికి కుదరలేదు. హేమసుందరిని గురించి ఇక నీకు ఎలా చెప్పగలను?" నిష్కపటంగా సమాధానం ఇచ్చాడా స్నేహితుడు.

మద్యపుపాత్రలో మిగిలివున్న మద్యాన్ని ఒకేసారి గొంతులోకి వంపుకుంటూ లేచి నిల్చున్నాడు నాసీరుడు. వెంటనే అతని ఎదుటికి వచ్చి వినయంగా చేతులు జోడించాడు ఆ భవన యజమాని.

"మద్యాన్ని సేవించి మీరు వీధుల్లో సంచరిస్తే మీ తండ్రిగారు ఆగ్రహిస్తారు. ఏదో ఒక నేరాన్ని నామీద మోపి చెరసాలకు పంపించేస్తారు. దయచేసి కూర్చోండి. చీకటి పడేదాకా ఇక్కడే కాలక్షేపం చేసి వెళ్లండి" విధేయత నిండిన కంఠంతో విన్నవించుకున్నాడు.

వినిపించుకోలేదా మాటల్ని నాసీరుడు. రొంటిన వున్న చిన్నపట్టుగుడ్డ మూటలోనుంచి వెండినాణేన్ని తీసి అతనికి అందిస్తూ భవనము బయటికి బయలుదేరాడు.

"మద్యశాల యజమాని చెప్పిన మాటల్లో అసత్యం ఏమీలేదు మిత్రమా... వెలుగు వుండగా మనం వీధుల్లో సంచరించడం ఏమంత మంచిదికాదని నాకు కూడా అనిపిస్తోంది" తడబడుతున్న అడుగులతో రాజభవనంవైపు నడక మొదలుపెట్టిన నాసీరుడిని హెచ్చరించాడు అతని స్నేహితుడు.

ఆ మాటల్ని కూడా పట్టించుకోలేదు నాసీరుడు. సూటిగా పోయి రాజభవనం ఎదుటవున్న ఒక నేరేడువృక్షం కింద నిలుచున్నాడు.

ఇసుక వేసినా రాలనంతగా కిక్కిరిసివున్నారు హేమసుందరి నృత్యాన్ని వీక్షించటంకోసం అచటికి అరుదెంచిన పౌరులు. ఒకరినొకరు తోసుకుంటున్నారు, తొక్కిసలాడుకుంటున్నారు.

పొడవాటి రాజదండాలను బిగించి పట్టుకుని వారిని అదుపులో పెట్టటానికి విపరీతంగా శ్రమిస్తున్నారు రాజభటులు. నోటికి వచ్చిన పరుషపదాలతో ఇష్టం వచ్చినట్లు నిందిస్తున్నారు.

అనుకోని విధంగా నేరేడుచెట్టు దగ్గిర ప్రత్యక్షం అయిన నాసీరుడిని గుర్తించి గబగబా ముందుకు వచ్చాడు ఒక భటుడు.

"చాలా ఆలస్యంగా వచ్చారు మీరు. అయిపోవచ్చిందట హేమసుందరి నృత్యం... సభ ముగిసిపోబోతున్న సూచనలు కనిపిస్తున్నాయి" అంటూ చేయి పట్టుకొని సభాభవన ద్వారం దగ్గిరికి తీసుకుపోయాడు.

మద్యం సేవించి మహారాజు ఎదుటికి పోవటం మహానేరమని మరచి పోలేదు నాసీరుడు. ముఖద్వారం పక్కనే వున్న ఒక చలువరాతి స్తంభం దగ్గిర ఆగిపోయాడు అతను.

జతగాడి భుజంమీద చేయివేసి ముందుకు చూశాడు.

అప్పుడే నృత్యాన్ని ఆపింది శివకామిని కుమార్తె హేమసుందరి. సింహాసనాన్ని అధివసించివున్న మహారాజుకు, సభలో వున్న పెద్దలందరికీ వయ్యారంగా నమస్కారాలు చేస్తోంది.

శాపవశాన మానవజన్మ ఎత్తిన గంధర్వాంగన మాదిరి ముగ్ధమనోహరంగా అగుపిస్తున్న ఆ సుందరిని చూసేసరికి ఊపిరి ఆగిపోయినంత

పని అయింది నాసీరుడికి. గుండెల్ని ఎవరో గట్టిగా అదిమిన అనుభూతి కూడా కలిగింది.

అతని ముఖంలో ప్రతిఫలించిన భావాలను గమనించాడు కాబోలు, చిన్నగా నవ్వేశాడు అతని మాదిరిగానే ఆ చలువరాతి స్తంభం దగ్గిర నిలుచునివున్న పౌరుడు ఒకతను.

"ఇంకో పది నిముషాలు ముందుగా రాకపోవటం మీ దురదృష్టం. గణగణమని మండుతున్న జ్యోతుల్ని అరిచేతుల్లో వుంచుకుని ఆమె చేసిన నృత్యం మరెవ్వరూ చేయలేరు..." అంటూ వుండగా, రాజదండాలను నేలకు తాటించి నిశ్శబ్దంగా వుండమని హెచ్చరించారు కొందరు భటులు.

పరువప్రాయపు మిన్నాగు మాదిరి కదిలింది హేమసుందరి. ముఖంమీద స్వేదబిందువుల్ని సన్నపాటి దుకూలంతో అద్దుకుంటూ సింహాసనాన్ని సమీపించింది. సభలోని వారందరికీ వినిపించేలా పెద్దకంఠంతో ఆమె నైపుణ్యాన్ని ప్రశంసించాడు మహారాజు.

"కరుకు కరవాలంతో శత్రువుల తలల్ని తుంచటం, పగవారి గుండెలు పగిలిపోయేటట్లు సింహనాదాలు చేయటంతప్ప సున్నితమైన మాటల్ని ఉపయోగించటం మాకు చేతకాదు. నువ్వు మా నగరంలో నివసిస్తున్నందుకు మేము చాలా గర్విస్తున్నాం" అంటూ ప్రక్కనే వున్న సేవకులకు సైగ చేశాడు.

పెద్ద వెండిపెళ్ళెం నిండా బంగారునాణేల్ని పోసి ముందుకు తీసుకువచ్చారు. దోసిలి ఒగ్గి వినయంగా నిలబడివున్న హేమసుందరికి అందించారు.

కరతాళధ్వనులతో దద్దరిల్లిపోయింది సభాభవనం. మహారాజు దాతృత్వాన్ని ప్రశంసించటంలో తలమున్నలైపోయింది.

మందారపువ్వు మాదిరి ఎర్రబడిపోయిన ముఖాన్ని క్రిందికి దించుకుని పరుగులాంటి నడకతో వెనక్కి వచ్చేసింది హేమసుందరి.

సంగీత వాద్యకళాకారులతో కలిసి ఒకప్రక్కగా నిలుచునివున్న తల్లిని చేరుకుని మహారాజు బహుకరించిన పళ్లెరాన్ని ఆమెకు అందించింది.

సింహాసనం మీది రాజుకు, సభాసదులకు సవినయంగా నమస్కరించి, కూతురి నొసటిని ముద్దు పెట్టుకున్నది తల్లి.

"ఇంటికి పోగానే నీకు దిష్టి తీసివేయాలి... ఆలస్యంచేస్తే అనర్థకం సంభవిస్తుంది... పద పద..." అని తొందరపెడుతూ, సభకు మరోసారి నమస్కరించి ముఖద్వారం వైపు తిరిగింది.

నోరు తెరుచుకు నిలబడిపోయి వున్న నాసీరుడు వెంటనే అగుపించాడు ఆమెకు.

ఆవులిస్తే ప్రేవులు లెక్కబెట్టగల ఆమెకు,అతను ఉన్నతమైన కుటుంబంలో నుంచి వచ్చినవాడిని వెంటనే అవగతమైంది.

"మన సేనాధిపతుల వారి ఏకైక కుమారుడు నాసీరదేవుడు. ఆకతాయి తనంగా తిరుగుతూ చెడు సహవాసాలు చేసి పరువు మర్యాదల్ని మట్టిలో కలుపుతున్నాడని మాతామహులవారి దగ్గరికి పంపించివేయబడ్డాడు. నిన్ననో,మొన్ననో తిరిగి వచ్చాడని ఎవరో అటుంటే విన్నాను..." నొసలు విరుస్తూ తనకేసి చూసిన శివకామిని చెవిలో ఊదింది హేమసుందరి చెలికత్తె సౌదామిని.

ముఖం చిట్లించి తలను పక్కకు తిప్పుకున్నది ఆ మాటల్ని ఆలకించిన హేమసుందరి.

"వయసులో వుండగా ఆకతాయిపనులు చేసినవారే ఇప్పుడు పెద్దలని పిలువబడుతున్న వారందరూ. బాధ్యతలు పైనపడిన తర్వాత బుద్ధి తెచ్చుకుని నీతులు వల్లిస్తూంటారు..." అంటూ నాసీరుడి పక్కనుంచి బయటికి వెళ్ళిపోయింది శివకామిని.

హేమసుందరిని చూసిన క్షణంనుంచీ అదోలా అయిపోయిన నాసీరుని భుజాల్ని గట్టిగా కుదిపి ఈ లోకంలోకి తీసుకువచ్చాడు అతని స్నేహితుడు.

"సభ ముగిసే సమయం దగ్గిరికి వచ్చేసింది. ఇక్కడే నిలబడివుంటే మీ తండ్రిగారి దృష్టిలో పడతాం. బయటికి వెళ్ళిపోదాం..." అంటూ బలవంతంగా అతన్ని ఇవతలికి తీసుకువచ్చాడు.

అంతకుముందు రెండుమాసాలక్రితం మహారాజు బహూకరించిన పల్లకీని ఎక్కి నగర శివార్లలో వున్న తమ ఇంటికి వెళ్లిపోతున్నది హేమసుందరి.

తనకు తెలియకుండానే ఆ పల్లకీని అనుసరించబోయిన నాసీరుడిని చటుక్కున చేయిపట్టుకుని ఆపేశాడు అతని స్నేహితుడు.

"నువ్వు ఏం చేస్తున్నావో నీకు అర్థం అవుతోందా?" ఆశ్చర్యం నిండిన కంఠంతో ప్రశ్నించాడు.

"నా మనసు ఆ జగదేకసుందరిమీద లగ్నమైపోయింది. ఆమె నాకు కావాలి... ఆమెను నేను స్వంతం చేసుకుని తీరాలి.." నిద్రలోనుంచి లేచిన వాడిలా నేత్రాలను నులుముకుంటూ జతగాడికి తన హృదయాన్ని ఎరుక పరిచాడు నాసీరుడు.

"నీ తాతగారి ఇంటిదగ్గిర చక్కటి శిక్షణను పొందివచ్చావని, మంచి మర్యాదలను నేర్చుకున్నావని అనుకుంటున్నారు మీ తండ్రిగారు. ఇప్పుడు నీ మాటల్ని గనుక వింటే ఆయనకు బాధ కలుగుతుంది. వచ్చినదారినే నువ్వు తాతగారి ఇంటికి వెళ్లిపోవటం తప్పనిసరి" అంటూ హెచ్చరించాడు ఆ స్నేహితుడు.

"హేమసుందరి పొందు నాకు కావాలి. పిచ్చి పిచ్చి సలహాలతో సమయాన్ని వృధా చేయకుండా చక్కటిమాట చెప్పు..."

పదిక్షణాలపాటు ఆలోచించి చిన్నగా అతనిచెవిలో గుసగుసలాడాడు అతని స్నేహితుడు.

పాతిక సంఖ్యకు పైగానే వున్న చమురు కాగడాలను ఒక్కసారిగా వెలిగించి నట్లు గప్పున కాంతివంతం అయింది నాసీరుడి వదనం.

"చక్కటి మాట చెవిన వేసి నాకు ఎనలేని సహాయాన్ని చేశావ్...రేపీపాటికీ హేమసుందరి నా స్వంతం అయ్యే ఉపాయాన్ని చెప్పి నన్ను ఆదుకున్నావ్..." అంటూ అదేపనిగా మెచ్చుకున్నాడు స్నేహితుడిని. చీకట్లు నగరాన్ని చుట్టి ముట్టిన తరువాత భవనంలోనుంచి బయటికి వచ్చి తన నివాసంవైపు అడుగులు వేశాడు.

## 2

తూర్పుదిక్కు తెల్లబడుతున్న సమయంలో ధనదుపుర సేనాపతి భవంతిలో చెలరేగింది ఒక గందరగోళం. అర్ధరాత్రి సమయంలో ఎవరో బందిపోటు దొంగ భవనంలోకి ప్రవేశించి ఖజానాను కొల్లగొట్టటానికి ప్రయత్నించాడట. సేనాపతులవారి ముద్దులబిడ్డను నాసీరదేవుడు మేలుకొని వెంటపడటంతో మూడొంతుల సొత్తును భవనప్రాంగణంలోనే జారవిడిచి పారిపోయాడట!

గుంపులు గుంపులుగా పోగుపడటం మొదలు పెట్టిన పౌరుల్ని దూరంగా తరమటానికి భటులను ఏర్పాటుచేసి తలను రెండు చేతులతోను పట్టుకు కూర్చున్నాడు సైన్యాధిపతి.

పట్టణంలో శాంతిభద్రతలను పరివేక్షించవలసిన తన భవనంలోనే దొంగతనం జరిగింటే ఎంత అనుమానం?అటు పొక్కి ఇటుపొక్కి ఆ వార్త పరాయి దేశాలవరకూ పాకితే ఎంత తలవంపు??

కంటిమీద కునుకులేకుండా భవనంచుట్టూ కాపలా కాయవలసిన భటులందర్నీ పేరుపేరునా పిలిచి నోటికి వచ్చిన పదాలతో ఘాటుగా తిట్టిపోశాడు సేనాపతి.

"వేతనాలు దండుకోవటానికి తప్ప బాధ్యతలను భరించాటానికి మీరు సిద్ధంగా లేరు... జమాజట్టీలవంటి మీరు పదిమంది కాపలా వుండగా భవంతిలోకి ఎలా జొరబడగలిగాడు ఆ దొంగ?" ఖంగుమంటున్న కంఠంతో అప్పటికి పదకొండోసారి ప్రశ్నించాడు.

తూర్పుదిక్కున వేగుచుక్క పొడిచేటంతవరకూ తామూ తమ తమ స్థానాల్లోనుంచి కదలలేదని సవినయంగా మనవి చేసుకున్నారు ఆ భటులు. తమకు తెలిసి ఒక్క పురుగుకూడా భవనం దరిదాపులకు రాలేదని విన్నవించుకున్నారు.

ఆ మాటల్నివిని ఆలోచనలో పడాల్సిందిపోయి,ఇంకా ఇంకా రెచ్చిపోయాడు సైన్యాధిపతి.

"మీరు చూస్తూండగా ఒక్కపురుగు కూడా లోపలికి రాకపోతే,మా ఖజానా తలుపులు బార్లా తీసి వుండటం ఎలా సంభవించింది?నా బిడ్డడు ధైర్యంచేసి ఆ దుర్మార్గుడిని అడ్డుకొని వుండకపోతే ఏమయ్యేది నా పరువు?"

భవంతి పైకప్పు ఎరిగి ఆవల పడిపోయే శృతిలో బిగ్గరగా అరిచి,దూరంలో నిలుచున్న దళపతి ఒకతనికి సైగ చేశాడు.

"విధులను విస్మరించి కాకమ్మకథలు అల్లుతున్న ఈ దుర్మార్గుల్ని కొరడాలతో కొట్టించు. తిరిగి ఇంకెప్పుడూ యిలా చేయకుండా గట్టిగా బుద్ధి చెప్పు" అని ఆజ్ఞలు జారీచేస్తూ,లోపలిగదిలో వున్న తన కుమారుడి దగ్గిరికి పోయాడు.

దొంగతనం చేస్తున్న బందిపోటును ఎదుర్కోవటంతో తల గోడకు పొడుచుకుని పగిలిపోయినంత పని అయిందిట. పెద్ద కట్టు కట్టించుకుని మెత్తటి శయ్యమీద పరుండి వున్నాడు నాసీరుడు.

చెమ్మగిల్లిన కనులను పయ్యెద కొంగుతో అద్దుకుంటూ తనపక్కనే కూర్చుని వున్న తల్లికి,ఆమె పరిచారికలకు జరిగింది ఏమిటో సవివరంగా వివరించి చెప్పుకొన్నాడు.

"బాణాకర్ర ఎత్తున వున్నాడు ఆ దుండగీడు. కండలు తిరిగిన శరీరంతో తుమ్మమొద్దు మాదిరి కనిపించాడు... నిప్పుకణికెలవంటి కనులతో నావంక క్రూరంగా చూసేసరికి కొంచెం బెదురుకలిగిన మాట వాస్తవం... అతగాడిని వదిలేస్తే మన పరువు పోతుందనే మాట ఒక్కటే నాకు ఎనలేని ధైర్యాన్ని యిచ్చింది. సరయిన ఆయుధాన్ని అందుకునే వ్యవధి లేకపోవటంవల్ల వట్టి చేతులతోనే అతని మీద కలబడ్డాను... ముష్టిఘాతాలతో ముఖం పచ్చడి చేశాను. భుజాల మీది మూటను వదిలేసి పిక్కబలం చూపించాడు వాడు. నా కేకలు విని

అప్పుడు తీరికగా లోపలికి వచ్చారు మనభటులు..." అంటూ తండ్రి ఆగమనాన్ని గమనించి మాటల్ని మింగేశాడు.

"ఎలా వున్నది నీకు? బాధ అధికం అయినట్టు అనిపిస్తోందా?" ముఖంలోని కోపం మటుమాయం అయిపోతుండగా అనునయస్వరంతో కుమారుడిని పరామర్శించాడు ఆ తండ్రి.

తల ఊడి కిందపడిపోయేటంత బాధను పెదవి కదపకుండా భరిస్తూ,గభాలున శయ్యమీదినించి దిగి వినయంగా నిలుచున్నాడు నాసీరుడు.

"తలకు తగిలిన బలమైన దెబ్బకంటే మన మర్యాదకు తగిలిన దెబ్బ నాకు ఎక్కువ బాధను కలిగిస్తోంది. అవసర సమయంలో సరయిన ఆయుధం చేతికి అందకపోవడంవల్ల ఆ దుర్మార్గుడిని పారిపోనివ్వాల్సి వచ్చింది. అందుకు ఎంతగానో సిగ్గుపడుతున్నాను" తలవంచుకుని అస్పష్టమైన మాటలతో తన అంతరంగాన్ని ఎరుకపరిచాడు.

ముగ్ధుడైపోయాడు సేనాపతి ఆ మాటల్ని వినేసరికి. జరిగిన దురంతాన్ని గురించి క్షణకాలంపాటు పూర్తిగా మరిచిపోయాడు.

"నీ మాతామహుడు నాకు యిచ్చిన మాట నిలబెట్టుకున్నాడు. నీ మాటలే అందుకు సాక్ష్యం" అంటూ కుమారుడి భుజాన్ని ఆప్యాయంగా అదిమి,భార్యకు సైగ చేశాడు.

"వంట యింటి నాటువైద్యాలు చేసి బిడ్డడిని మరింత బాధ పెట్టడం నాకు యిష్టంలేదు. ఒకసారి రాజవైద్యుల వారికి కబురు పంపిస్తే బాగుంటుందని నా అభిప్రాయం" ముందుగదిలోకి వస్తూ చిన్నకంఠంతో విన్నవించుకున్నది ఆమె.

ఆ మాటలతో తిరిగి ప్రస్తుతంలోకి వచ్చేశాడు సైన్యాధిపతి. "నేను నిద్రలేచే సరికి దొంగిలింపబడిన సొత్తును తిరిగి ఖజానాలోకి చేర్పించేశాడు నాసీరుడు.. ఏమిపోయిందో,ఎంత పోయిందో నాకు అర్థం గావటంలేదు" అన్నాడు.

రెండు క్షణికాలపాటు తటపటాయించి దొంగతనపు వివరాల్ని బయట పెట్టింది అతని భార్య.

"బంగారునాణేల మూటలు చెక్కుచెదరలేదు... మా పుట్టినింటివారు పెట్టిన కాసులపేరు పోయింది. పచ్చల పతకం, ముత్యాలు పొదిగిన కరకంకణం ఒకటి కనిపించటంలేదు."

పచ్చలపతకం,ముత్యాల కరకంకణం రెండూ మాయమయ్యాయని తెలిసే సరికి నిర్ఘాంతపడి నిలిచిపోయాడతడు. కాంచీరాజ్యాన్ని పరిపాలిస్తున్న కులోత్తుంగ చోళచక్రవర్తి స్వహస్తాలతో అతనికి బహుమతిగా యిచ్చిన ఆభరణాలు అవి.

శత్రురాజులకు చెందిన గ్రామాలమీద పడి దోపిడీలు సాగించి ప్రజల గుండెల్లో భయోత్పాతాలు సృష్టించినందుకు అమితంగా మెచ్చుకుని ఆదర పూర్వకంగా,అందరిముందు యిచ్చిన అపూర్వజ్ఞాపికలు. ఎంతో ప్రయత్నంతో అదుముకున్న కోపం తిరిగి తాచుపాములా తల ఎత్తేసరికి ఎర్రగా కంది పోయింది సేనాపతి వదనం.

"ఎవరక్కడ? ఎవర్రా అక్కడ?" ఖంగుమంటున్న కంఠంతో పిలిచాడు.

వెంటనే మందిరద్వారంలో ప్రత్యక్షం అయ్యాడు ఒక భటుడు. తలవంచి అభివాదం చేశాడు.

"దళపతిని పిలుచుకురా... వెంటనే రమ్మనమని చెప్పు. వెళ్ళు" విసురుగా ఆజ్ఞ యిచ్చి దగ్గిర్లో వున్న ఒక ఆసనంమీద కూర్చున్నాడు సేనాపతి.

అతని ఆలోచనలు తను చెప్పిన మాటలమీద కాకుండా ఇంకో అంశం మీదికి వెళ్ళిపోతున్నాయని గ్రహించి తొందరపడింది అతని భార్య.

"రాచవైద్యులవారిని ఒక్కసారి పిలిపించి,మన బిడ్డడిని చూసిపొమ్మని చెపితే బాగుంటుందని నా ఉద్దేశ్యం..." అంటూ మాటల్ని ప్రారంభించబోయి,అతను ఉరిమి చూసేసరికి ఒక్కసారిగా మిన్నకుండిపోయింది.

"నాసీరుడికి తగిలిన దెబ్బలు ఏమంత ప్రమాదకరమైనవి కావు. వాటిని గురించి తీరికగా ఆలోచిద్దాం. ముఖ్యమైన మరో విషయాన్ని గురించి ఇప్పుడు దళపతితో మాట్లాడాలి,ఇక నువ్వు వెళ్ళు" ఏదో పనిమీద తన ఎదుటికి వచ్చిన పరాయిమనిషిని అదిలించినట్లు విసురుగా అన్నాడు సేనాపతి.

అతను ఆ కంఠంతో మాట్లాడటం మొదలు పెట్టిన తర్వాత అభ్యంతరాలు తెలియచేయటం బహుప్రమాదకరమని బాగా తెలుసు అతని సహధర్మచారిణికి . ఒక్కసారిగా పైకి ఉబకబోయిన కన్నీటిని బలవంతంగా కనుల్లోనే అదుముకుంటూ గిరుక్కున వెనుతిరిగి లోపలి మందిరంలోకి వెళ్లిపోయింది.

"మీరు ఆజ్ఞ యిచ్చినట్లు కొరడాలతో కొట్టించాను మన కావలివారిని. తిరిగి యిటువంటి పొరపాటు యింకోసారి జరగనీయమని ప్రమాణాలు కూడా చేయించాను"లోపలికి వస్తూనే సేనాపతికి విన్నవించుకున్నాడు దళపతి.

"దొంగతనం జరిగిందనే కోపంతో మనవాళ్ళమీద విరుచుకుపడ్డానే గాని,స్థిమితంగా ఆలోచిస్తే ఈ పనిచేసింది ఎవరో గుండెలు తీసినబంటు అయి వుంటాడని నాకు అనిపిస్తోంది. పోయిన వస్తువులను గురించి ఆరాతీస్తుంటే

స్ఫురించింది నాకు ఈ విషయం. తప్పు మన కావలివారిమీద వేయటం అనవసరం. వాళ్ళ కళ్ళకు కనబడే దొంగకాదు రాత్రి మన భవనంలోకి వచ్చింది,అమితమైన మేధాశక్తి సంపన్నుడు ఎవరో ప్రవేశించాడు" ఒక్కోమాటను తూచి తూచి ఉపయోగిస్తూ అన్నాడు సేనాపతి.

గట్టిగా నిట్టూర్పును విడిస్తే ఒంటికి తగిలేటంత దగ్గిర్లో నిలబడి వినయాతి వినయంగా తలవూపాడు దళపతి.

"ఏలినవారి ఆలోచనకు తిరుగువుండదు. ఇప్పుడు నన్ను ఏం చేయమని సెలవు?" అని అడిగాడు.

"తెరిచివున్న ద్వారాలలోనుంచి ఇళ్ళల్లో జొరబడి చేతికి అందిన సొత్తును అపహరించుకుపోయే సామాన్యమైన దొంగల్ని గురించి మనం ఆలోచించకూడదు. ఆవలిస్తే ప్రేవులు లెక్కబెట్టగల అసాధారణ ప్రజ్ఞావంతుల్ని గురించి యోచించాలి. అటువంటివారు మన దేశంలోగాని,మన సరిహద్దుల్లోగాని ఎవరైనా వున్నారేమో తెలుసుకోవాలి" సాలోచనగా అన్నాడు సేనాపతి.

ఆయన చెపుతున్న లక్షణాలు అన్నీవున్న హస్తకళా విన్యాసపరులు తన ఎరికలో ఎవరైనా వున్నారేమోనని తరిచి చూసుకున్నాడు దళపతి.

ఒక్క ముఖముకూడా గుర్తుకు రాకపోయేసరికి దిగాలుపడిపోయాడు.

ఆ విషయాన్ని గమనించికూడా గమనించనట్లే ఆసనంలోనుంచి లేచి తిరిగి మందిరంలో నెమ్మదిగా పచార్లు ప్రారంభించాడు సేనాపతి.

"కత్తియుద్ధంలోగాని,కర్రయుద్ధంలోగాని మనకు తెలియని మెలకువల్ని గురించి తెలుసుకోవాలంటే ఏం చేయాలి మనం?" మాట్లాడుతున్న విషయాన్ని ప్రక్కకుపెట్టి చటుక్కున యింకో అంశంలోకి వెళ్లిపోయాడు.

హడావుడిగా తన ఆలోచనల్ని కూడదీసుకున్నాడు దళపతి. "ఆయుధవిద్యలు వేటిలోనైనా మనకు తెలియని మెలకువల్ని గురించి తెలుసుకోవాలంటే సరైన గురువును వెతుక్కోవాలి. ఆ విద్యల్లో అనుభవం గడించిన వారిని కలుసుకుని మాట్లాడాలి" తనకు తోచిన మాటల్ని గబగబ వల్లించేశాడు.

ఆ సమాధానం తనకు నచ్చినట్లు పచార్లు చేయటం ఆపి, మెచ్చుకున్నట్లు అతని భుజంమీద బలంగా అదిమాడు సేనాపతి.

"లక్షల విలువచేసే మాటలు చెప్పావిప్పుడు నువ్వు. నాకు సంతోషాన్ని కలుగచేశావు. ఆయుధవిద్యల మాదిరిగానే దొంగతనాలు చేయటం కూడా ఒక విధమైన విద్యే. ఆ విద్యను గురించి తెలుసుకోవాలంటే ఏం చేయాలి మనం?" వున్నట్లుండి మరొకప్రశ్న వేశాడు.

దొంగతనాలు చేయటంలో ఆరితేరినవారి దగ్గిరికి పోవాలని అనబోయి,ఆ ఆరితేరివారు ఎవరో,ఎక్కడ వుంటారో తెలియకపోవడం వల్ల నోరు తెరుచుకుని నిలబడిపోయాడు దళపతి.

అతని ముఖంమీది భావాల్ని గమనించి పెద్దగా నవ్వేశాడు సేనాపతి.

"రాజులు రాజమందిరాల్లో వుంటారు. రైతులు తమ తమ పొలాల్లో కనిపిస్తుంటారు,అలాగే చట్టవిరుద్ధమైన పనులు చేసేవారు పట్టుబడడం అంటూ సంభవిస్తే చెరసాలల్లో మగ్గిపోతూ వుంటారు. అవునా?" అని అడుగుతూ ఒకప్రక్కగా గోడకు తగిలించి వున్న తన కరవాలాన్ని తీసుకుని,చేయి ఊపాడు.

అప్పుడు,ఆయన అలా చెప్పినప్పుడు అర్థమైంది దళపతికి ఆయన మాటల్లోని రహస్యం.

"మన చెరసాలకు వెళ్లి అక్కడ శిక్షలు అనుభవిస్తున్న వారిలో ఆరితేరిన దొంగలు ఎవరైనా వుంటే వెంటనే కలుసుకోవాలి. బెదిరించో,భయపెట్టో మన భవంతిలో దొంగతనం చెయ్యగల నేర్పు ఎవరెవరికి వుంటుందో తెలుసుకోవాలి" అంటూ ఆ మందిరం బయటికి వెళ్లిపోయాడు.

కరవాలాన్ని దట్టీకి అమర్చుకుని, జలతారు ఉత్తరీయాన్ని భుజంమీద వేసుకుని సేనాపతి భవంతిలోనుంచి వచ్చేసరికి, సిద్ధంగా నిలబెట్టాడు అతను జోడుగుర్రాల సరహాయంతో పరుగులు తీసే రథంవంటి బండినొకదానిని.

కొరడాదెబ్బలు తినటానికి తీసుకుపోబడినవారి స్థానంలో కొత్తగా వచ్చి నిలుచున్న మరో పదిమంది కావలివారు తనకు శిరస్సులు వంచి నమస్కారాలు చేస్తుండగా బండిలో కూర్చుని నెమ్మదిగా చేయి ఊపాడు సేనాపతి.

స్వయంగా నడిపాడు దళపతి బండిని. పావుఘడియ తరువాత ధనదుపుర పడమటిభాగంలో నిర్మించబడి వున్న అధునాతన కారాగృహ కట్టడాలముందు ఆపి అక్కడి కావలివారికి సైగచేశాడు.

* * *

కారాగృహ కట్టడాలన్నింటిలోకి అతి పెద్దదైన కట్టడంలో చక్కటి ఆసనాన్ని వేయించి సేనాపతిని ఆసీనులు కండని అర్థించాడు కారాగృహాధిపతి.

సిద్ధంగా నిలబడిన తన అనుచరుల్ని పంపి తమవద్ద శిక్షలు అనుభవించే దొంగలందర్నీ వరుసగా ఆ కట్టడంలోకి తెప్పించాడు.

పల్లె పట్టులలో తిండిగింజలను దోపిడీ చేసే చిన్నతరహా దొంగల దగ్గిర్నించి,గుంపులు గుంపులుగా సంచరిస్తూ బందిపోట్ల మాదిరి భ్రమింపచేసే

వీరాధివీరుల వరకూ చాలామందిని పరిశీలనగా చూసి అబ్బే అన్నట్లు పెదవి విరిచాడు సేనాపతి.

"లాగిపెట్టి కొడితే తిరిగి లేచి నిలబడటం చేతకాని ఈ అర్భకులు కాదు నాకు కావల్సింది. దొంగల్లో రారాజులవంటివారు... కన్నుమూసి,కన్ను తెరిచేటంతలో మన ఎదుటినుంచి మటుమాయం కాగల శక్తివంతులు" ప్రక్కనే నిలబడిన కారాగృహాధిపతితో అన్నాడు అతను.

ఎందుకనో కాస్తంత కలవరపాటుకు గురి అయ్యాడా అధికారి. వెంటనే సమాధానం యివ్వటానికి కొద్దిగా తటపటాయించాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్? ఎవరూ లేరా మన దగ్గిర అటువంటి వ్యక్తులు?" సేనాపతి ప్రశ్నించేసరికి గాఢంగా నిట్టూర్చి తన అనుచరులకు సైగచేశాడు.

వెంటనే ఆ కట్టడం వెలుపలికి పోయి,పది నిమిషాల తర్వాత పట్టుకువచ్చారు వారు ఒక సన్నపాటి వ్యక్తిని. గాలి గట్టిగా వీస్తే ఎగిరిపోయేటట్లుగా అగుపిస్తున్న ఆ బలహీనవ్యక్తి కాళ్ళూ,చేతులకు బలమైన సంకెళ్ళు తగిలించబడి వుండటాన్ని గమనించి ఆశ్చర్యపోయాడు ధనదుపురపు సేనాపతి.

ఒరలలోనుంచి తీసిన కరవాలాల్ని అతని వెన్నుకు ఆనించి అడుగుల్లో అడుగులు వేస్తూ వస్తున్న భటుల్ని కూడా చూసి నొసలు ఎగురవేశాడు.

"చిటికెలో కనుమాయ చేసి మనందరినీ మట్టి తినిపించగల మహాచతురుడు యితడు. కొన్నాళ్ళక్రితం మన కోశాగారానికి కన్నం వేసి పారిపోతుండగా,అదృష్టవశాత్తు అశ్వంమీద నుంచి పడిపోయి మనకు దొరికాడు. విచారణ పూర్తికావస్తోంది. బహుశా ఉరిశిక్ష పడవచ్చని అందరూ

అనుకుంటున్నారు" సేనాపతి వెనుక నిలబడి రెండోచెవికి చేరకుండా అతి రహస్యంగా విన్నవించుకున్నాడు కారాగృహాధిపతి.

"అధికారులంటే ఇసుమంత కూడా భయంలేని మనిషి యితను. అధికారం చెలాయించ చూసినవారిని,నోటికి వచ్చిన మాటలతో దారుణంగా అవమానించటం ఇతనికి బాగా అలవాటు" అతన్ని ముందుగానే అక్కడికి పిలిపించకపోవడానికి కారణాన్ని కూడా వెల్లడించాడు అతను.

కరచరణాలకు తగిలించిన సంకెళ్ళు గణగణమని మ్రోతలుచేస్తుండగా ముందుకు వచ్చి తన ఎదుట నిలబడిన ఆ అపరిచితుడివంక కోరగా చూసి తలవూపాడు సేనాపతి.

"నాపేరు గర్గుడు...దొంగతనాలు చేయటం నా వృత్తి. అంతకుమించి నాగురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎవరికీ లేదు. పట్టుబడ్డాను కాబట్టి మీకు చేతనైన శిక్షను నిరభ్యంతరంగా వేసుకోండి. పట్టుబడ్డానని చెప్పి అలుసు చేయకండి. మర్యాదగా వుండదు" జంకు గొంకు అనే మాటలకు అర్థం తెలియనట్లు మహా పొగరుగా చెప్పాడు ఆ వ్యక్తి.

దారుణమైన కోపంతో కంపించిపోతూ సేనాపతి ఆసనంమీదినుంచి లేచి అతని చెంపలు పగలగొడతాడని వూహించాడు కారాగృహాధిపతి. అటువంటి పని ఏదీ చేయకపోగా,ఆ వ్యక్తి మాటలకు చిరునవ్వులు చిందించాడు సేనాపతి.

"ఇతనితో నేను కాస్తంత ఏకాంతంగా మాట్లాడాలి. అన్యధా భావించకుండా అవతలికి పోండి మీరంతా" అంటూ కారాగృహాధిపతి వంక చూశాడు.

ఆ మాటలు విని విపరీతమైన భయంతో నల్లబడిపోయింది అధికారి వదనం.

"ప్రభూ! వీడు సామాన్యుడు కాడు. వీడితో మీరు ఒంటరిగా వుండటం చాలా ప్రమాదం. వీడు..." అని అభ్యంతరం తెలుబోతుండగా చేతిని ఎత్తి వారించాడు సేనాపతి.

అధిక ప్రసంగం చేస్తే అందుకు ఎటువంటి మూల్యం చెల్లించాల్సి వస్తుందో తెలుసు కాబట్టి,మారు మాట్లాడకుండా తన అనుచరులతో ఆ మందిరంలో నుంచి బయటకి వెళ్లిపోయాడు కారాగృహధిపతి.

సేనాపతి దగ్గిరే నిలుచున్న దళపతి కూడా మందిర ద్వారం దాటి ఆవలికి పోయేదాకా ఆగి చిన్నగా నవ్వాడు గర్గుడు.

"కంచిని పాలించే కులోత్తుంగ చోళచక్రవర్తి మీకు బహూకరించిన ఆభరణాలు మటుమాయం అయ్యాయి... వాటి జాడల్ని తెలుపకోరటానికి యిక్కడికొచ్చారు మీరు."

సేనాపతి నోటివెంట ఒక్కమాట కూడా వెలువడకముందే తనంతట తను చెప్పాడు.

అతని శక్తియుక్తులు ఎటువంటివో అంతకుముందే కారాగృహాధిపతి నోటి వెంట వినటం జరిగినా, అవి ప్రత్యక్షంగా తన ఎదుట ప్రదర్శితమయ్యేసరికి మతిపోయినంత పని అయింది సేనాపతికి.

నేర్పుగా సర్దుకున్నాడతను తన ఆలోచనల్ని. గర్గుడిముందు తేలికపడకుండా తప్పుకోగలిగానని అనుకున్నాడు గాని, మరోసారి నవ్వనే నవ్వాడు ఆ దొంగ. "ఆయుధ విద్యల్లో అపారమైన అనుభవం సంపాదించి అనేక

యుద్ధాల్లో మహావీరులనే కీర్తిని గడించిన మీ ఎదుట నీతినియమాలకు సంబంధించిన మాటల్ని చెప్పటం తప్పేనని అనిపిస్తున్నా,మా దొంగలకు సంబంధించిన ప్రస్తావన వస్తోంది కాబట్టి ఒకే ఒకమాట చెప్పదలచుకున్నాను. చెప్పమంటారా ప్రభూ?" వినయంగా అడిగాడు.

తను నోరు తెరిచి ఒక్కమాట కూడా మాట్లాడకముందే అతనలా గడగడా మాట్లాడేస్తూండటాన్ని గమనించి నిరుత్తరుడైపోయాడు సేనాపతి.

"ఇతరుల శ్రమను దోచుకోవటమనే అన్యాయపు వృత్తిలో వున్నా, మాకు ఒకే ఒక నియమం వుంది. ప్రాణాలుపోయే పరిస్థితి ఎదురయినా, మెడకు ఉరిత్రాడు తగిలించబడే తరుణం ఆసన్నమైనా ,పొరపాటున కూడా తోటిదొంగలను గురించి అధికారులకు వెల్లడి చేయమని. ఇక ఈ విషయంలో మీరు అనవసరమైన శ్రమకు గురికాకుండా యింటికి మరలిపొండి. మీ ఇంటి పరిస్థితుల్ని చక్కదిద్దుకోండి" అంటూ రెండు అడుగులు వెనక్కి వేశాడు గర్గుడు.

ఆ కదలికకు గలగలలాడిన ఇనుపసంకెళ్ళ మ్రోతను ఆలకించి, లోపలకి వచ్చేశాడు కారాగృహాధిపతి. కత్తిని దూసి గర్గుడి మెడకు ఆనించాడు.

"మీ సేనాపతిగారికి చెరుపు చేయటంలేదు నేను. నిలుచున్న చోటినించి వెనక్కి జరిగానంతే.." నవ్వుతూనే అతనికి చెప్పాడు గర్గుడు.

ఎత్తిన కత్తిని దించకుండా అనుమతి కోసం తనకేసి చూసిన కారాగృహాధిపతికి సైగచేసి ఆసనంమీదనించి లేచాడు సేనాపతి.

"నా ఇంట జరిగిన దొంగతనాన్ని గురించి నాకంటేనీకే ఎక్కువ తెలిసినట్లు నాకు అర్థమైంది. నీ మనసు మార్చటానికి ప్రయత్నించదలుచుకోలేదు నేను. నీ

అంతట నువ్వు మార్చుకుని నాకు కావల్సిన విషయాన్ని వెల్లడిస్తే చాలా సంతోషిస్తాను" నడుముమీద చేతులు వేసుకుంటూ అన్నాడు.

మెడకు ఆనించివున్న కరవాలాన్ని లెక్కచేయక యింకో రెండు అడుగులు వెనక్కి వేశాడు గర్గుడు.

"మీ నీతినియమాల గురించి ముందుగానే హెచ్చరించాను మిమ్మల్ని. కొన్ని కొన్ని సమయాల్లో ముక్కుకు సూటిగా పోవడం,సాంప్రదాయబద్ధంగా ఆలోచించటం పనికిరాదు. మీరు వెంటనే వెళ్ళి మీ ఇంటికి చక్కదిద్దుకోండి. వెళ్ళండి" అంటూ తలను ప్రక్కకు తిప్పుకున్నాడు.

మాట మాటకు చివర అతను తన ఇంటికి చక్కదిద్దుకోమనటం ఏమిటో అర్థంకాక తల విదిలిస్తూ, ఆ కట్టడంలోనుంచి వచ్చేశాడు సేనాపతి.

"వాడు వట్టి మొండిమనిషి. నోటిని తెరిస్తే ఎటువంటి మాటలు వెలువడతాయో తనకే తెలియని బండరాయి" గుర్గుడి ప్రవర్తనకు సంజాయిషీ యిచ్చుకోవటం కోసం బయటికి వచ్చిన కారాగృహాధిపతి భుజం తట్టి తన బండిలో కూర్చున్నాడు.

కునికిపాట్లు పడుతున్న అశ్వాలను అదిలించి ఇంటిదోవ పట్టించాడు అతని దళపతి. పావుఘడియలో ఇంటికి చేర్చాడు.

* * *

సూర్యుడు పడమటి దిశకు మరలిన ఒక ఘడియకు రాచవీధిలోని మద్యశాల ముందుకు పోయాడు నాసీరుడు.

అతని కోసమే ఎదురుచూస్తున్నాడు అతని స్నేహితుడు. కూర్చున్న ప్రదేశంలోనుంచి ఛెంగున లేచి ఎదురువచ్చాడు.

"నువ్వు చెప్పిన పనిని చెప్పినట్లుగా చేసేశాను. నామీద ఎవరికీ ఎటువంటి అనుమానం రాకుండా చాలాజాగ్రత్తలు తీసుకున్నాను."

దుస్తులచాటున దాచివుంచిన ఒక పట్టుగుడ్డ మూటను తడముకుంటూ ఆనందంగా అతనికి చెప్పాడు నాసీరుడు.

"దొంగతనం జరిగిందని పదిమందికీ తెలిస్తే పరువులు పోతాయన్న భయంతో మౌనంగా వుండిపోతాడని అనుకున్న మీ తండ్రిగారు అలా చేయటంలేదు. నా ఊహకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాడాయన. కనిపించిన వారందరికీ చెప్పి యాగీ చేసేస్తున్నాడు" అంటూ అతని చేతిని పట్టుకుని లోపలికి తీసుకుపోయాడు స్నేహితుడు.

"ఆచితూచి అడుగులు వేయకపోతే నీ గుట్టు రట్టయిపోతుంది. నీకు సలహా యిచ్చినందుకు నేను అన్యాయమైపోతాను. హేమసుందరిని గురించిన ఆలోచనల్ని కొద్దిరోజులపాటు ఆపుకోవటం చాలా మంచిది. మీ నాన్నగారి హడావిడి సద్దుమణిగేటంతవరకూ బుద్ధిగా ఇంటిపట్టునే వుండటం శ్రేయస్కరం."

చక్కటి వెండిపాత్రల్లో మద్యాన్ని నింపి,తమ ఎదుటికి తెచ్చిన మద్యశాల యజమాని అవతలకి పోయేదాకా ఆగి, రహస్యంగా తన అభిప్రాయాన్ని తెలియచేశాడు.

మద్యం గొంతులోకి పోయేటంతవరకూ బుద్ధిగానే తలవూపాడు నాసీరుడు. గొంతులోకి పోయిన వెంటనే కనులు చిట్లిస్తూ కోరగా చూశాడు.

"అనుకున్న పనిని అనుకున్నట్లుగా చేయటం తప్ప మధ్యలో మాటలు మర్చటం నాకు అలవాటులేదు. నేను ఈరోజున హేమసుందరి దగ్గిరికి వెళ్ళి

తీరవల్సిందే" పట్టుదలగా అంటూ పాత్రను అవతలికి విసిరి చివ్వున లేచి నిలబడ్డాడు.

అతన్ని బలవంతంగా ఆపటానికి ప్రయత్నించినందువల్ల అల్లరి అవటం తప్ప మరేవిధమైన ఉపయోగము వుండదని గ్రహించి గాఢంగా నిట్టూర్చాడు అతని జతగాడు.

"కడుపునిండా మద్యం సేవించి ఆ మైకంలో అల్లరి చేసేవారినీ,హద్దులు మీరి ప్రవర్తించేవారినీ ఎంతోమందిని చూసివున్నాంగానీ,మద్యపు పాత్రను పెదవులకు ఆనించుకున్న వెంటనే రెచ్చిపోయేవారిని ఇంతకు ముందెన్నడూ చూడలేదు,ఇదే ప్రథమం."

మద్యశాలలో మరోమూలన కూర్చున్న పరదేశీయుడు ఒకతను మెల్లిగా మాటలు ప్రారంభించబోయేసరికి చూపులతోనే మాట్లాడవద్దన్నట్లు వారించాడు మద్యశాల యజమాని.

"మా ధనదుపుర సేనాపతులవారి ఏకైక సంతానం అతను. లేకలేక కలిగినందువల్ల అతి గారాబంగా పెరిగాడు. బుద్ధి కొంచెం,అహంకారం అధికం అయిపోయింది."

తన స్నేహితుడితో కలిసి నాసీరుడు వెళ్ళేదాకా ఆగి,తన అభిప్రాయాన్ని వెల్లడించాడు అతను.

వెయ్యిపడగల ఆదిశేషుడు భూమిని రక్షిస్తున్నట్లుగా,తన అసమాన శౌర్య సాహసాలతో ధనదుపుర సామ్రాజ్యాన్ని పరిరక్షించే సేనాపతులవారి కుమారుడు పట్టపగలు పదిమందీ చూస్తుండగా మద్యశాలల్లో కాలక్షేపం చేయటమా?

విపరీతమైన ఆశ్చర్యంతో వెడల్పు అయ్యాయి ఆ పరదేశీయుడి కనులు.

"అదుపు తప్పిన ఆశ్వం రౌతుకు హాని చేస్తుంది. పద్ధతి తప్పిన పెంపకం కులానికి కీడు కలిగిస్తుంది. ఈ చిన్నవిషయం కూడా మీ సేనాపతులవారికి తెలియదా?" వుండబట్టలేక అడిగాడు పరదేశీయుడు మద్యశాల యజమానిని.

"ఈ రాజ్యంలో ఏ మూల ఏం జరిగినా వెంటనే తెలిసిపోతుంది మా సేనాపతులవారికి. తన కుమారుడు చేసే పనులను గురించి మాత్రం తెలియదు. మితిమీరిన వాత్సల్యం వల్ల కాబోలు..." అంటూ ఇంకో ఇద్దరు పౌరులు భవనంలోకి వచ్చేసరికి మాటల్ని ఆపేశాడు మద్యశాల యజమాని.

తనను గురించి,తన తండ్రిని గురించి అక్కడ జరుగుతున్న సంభాషణ ఏమిటో తెలియని నాసీరుడు మాత్రం వడివడిగా అడుగులు వేస్తూ నగరద్వారం దగ్గరికి వెళ్లిపోయాడు.

పోడుగాటి బరిశెల్ని,పదునైన ఖడ్గాల్ని పట్టుకుని కాపలా వున్నారక్కడ అనేకమంది సైనికులు.

అక్కడికి అల్లంతదూరంలోనే అగుపిస్తున్న హేమసుందరి నివాసాన్ని కనులతోనే నాసీరుడికి చూపించాడు అతని స్నేహితుడు.

"మీ సైనికులు చూస్తుండగా అక్కడికి పోవటం మంచిదికాదు. చీకటిపడే వరకూ ఇక్కడే నిలబడదాం" లోగొంతుకతో హెచ్చరించాడు.

తనను గుర్తుపట్టి అభివాదాలు చేస్తున్న సైనికుల్ని సాదరంగా పలుకరించాడు నాసీరుడు.

"పరాయి రాజ్యాలనుంచి పౌరులు వస్తున్నారా మన పట్టణానికి?" అంటూ పరామర్శించాడు.

ఇతర నగరాలనుంచి అక్రమంగా ప్రవేశించేవారిని అడ్డుకోవటానికి,నగరంలోకి తీసుకురాబడే వ్యాపార వస్తువులమీద సుంకం విధించి,వసూళ్ళు చేయటానికి నియమించబడినవారు ఆ సైనికులు.

రాకరాక వచ్చిన సేనాపతులవారి ముద్దుబిడ్డడికి తాము చేస్తున్న పనులన్నిటి గురించి విశదంగా చెప్పారు ఆ సైనికులు. ఆ రోజు వసూలైన సుంకపు మొత్తాలను కూడా చూపించారు.

"మీ పనితీరు నాకు బాగానచ్చింది. ఏదో ఒకరోజు మీ గురించి మా తండ్రిగారికి తప్పకుండా తెలియజేస్తాను" గంభీరమైన కంఠంతో వారిని మెచ్చుకుంటూ అన్నాడు నాసీరుడు.

విపరీతమైన సతోషంతో విప్పారాయి ఆ సైనికుల ముఖాలు. వంగి వంగి నమస్కారాలు చేస్తూ వినయవిధేయతల్ని ప్రదర్శిస్తుండగా నగరద్వారాల్ని సమీపించాయి కొన్ని వ్యాపార శకటాలు.

ఒకరివెనుక ఒకరుగా ఆ శకటాల దగ్గిరికిపోతున్న సైనికులకు అగుపించకుండా నాసీరుడి చేతిని పట్టుకున్నాడు అతని స్నేహితుడు.

"మరో అర్ధఘడియవరకూ తీరిక వుండదు వీరికి. శకటాలలోని వస్తువుల్ని చూడాలి. శకట యజమానుల ఆరాలు తెలుసుకోవాలి. అవతలికి పోవటానికి మనకు ఇంతకంటే మంచి సమయం మరొకటి లభించదు" అంటూ ఇవతలికి తీసుకువచ్చాడు.

ఒకదాని వెనుక ఒకటిగా నిలబడిన వ్యాపార శకటాల్ని చూసేటందుకు సైనికులతోపాటు గుంపుగా పోగుపడుతున్నారు ఆ చుట్టుపట్ల నివసించే పౌరులు.

ఆ సందడి మధ్యలో చల్లగా వారాంగనలు నివసించే వీధిలోకి వెళ్ళారు స్నేహితులు ఇద్దరూ. ఇంద్రభవనం మాదిరి అందంగా అగుపిస్తున్న హేమసుందరి భవంతిని చేరుకుని ముఖద్వారాన్ని తట్టారు.

వెంటనే తెరుచుకున్నాయి తలుపులు.

విసుగ్గా చూస్తూ తల బయటికి పెట్టింది హేమసుందరి తల్లి శివకామిని.

నాసీరుడిని గుర్తుపట్టిన వెంటనే ఆమెముఖంలో ప్రత్యక్షమయ్యాయి అనేక రకాల భావాలు.

"రండి... లోపలికి రండి. తమవంటి పెద్దలు మా ఇంట అడుగుపెట్టడం మా పూర్వజన్మ సుకృతం" అంటూ లోపలికి ఆహ్వానించింది.

స్నేహితుడితో కలిసి ముఖద్వారాన్ని అధిగమించాడు నాసీరుడు. విశాలంగా వున్న ఒక సుందర మందిరంలోకి అడుగుపెట్టి, శివకామిని చూపించిన ఒక చక్కని ఆసనంమీద కూర్చున్నాడు.

"సేనాపతులవారికి ముద్దుల బిడ్డవై వుండికూడా నా కుమర్తె నృత్యాన్ని చూడటానికి సామాన్యుల వలె సభాభవనం ద్వారం దగ్గిర నిలబడిన సౌందర్యోపాసకులు మీరు. మమ్మల్ని వెదుక్కుంటూ మా ఇంటికి రావటం మా అదృష్టం" అందమైన వింజామర నొకదాన్ని అందుకుని స్వయంగా విసురుతూ ఉపచార వాక్యాలు మొదలు పెట్టింది శివకామిని.

మాటలతో కాలక్షేపం చేయటం అనవసరమని భావిస్తున్నట్లు,ఆసనంలో అసహనంగా అటూఇటూ కదిలాడు నాసీరుడు.

"మీ అమ్మాయి అందం నా మనస్సును దోచుకున్నది. మీకు అభ్యంతరం లేకపోతే... " అంటూ సాభిప్రాయంగా చూశాడు.

చేతిలోని వింజామరను ప్రక్కన పెట్టి,వెంటనే చేతుల్ని తట్టింది శివకామిని.

రెండు క్షణాల తర్వాత ఆ మందిరంలోకి వచ్చిన సౌదామినిని చూసి చేయివూపింది.

"ఇంతకుముందు లోపల పెట్టమని నీకు ఇచ్చిన పళ్ళెరాన్ని తీసుకురా" అని ఆజ్ఞ ఇచ్చింది.

పట్టుతెరలతో అలంకరించి వున్న మరో మందిరంలోకి పోయి ఒక పెద్ద పళ్ళెరాన్ని తీసుకువచ్చింది సౌదామిని. ఆ పళ్ళెరంమీద కప్పివున్న జలతారు వస్త్రాన్ని తొలగించింది శివకామిని.

రవ్వలు , కెంపులు పొదిగిన కంఠహారాలున్నాయి ఆ పళ్ళెరంలో. పట్టుగుడ్డ మూటల నిండుగా బంగారు నాణేలున్నాయి.

"నా కుమార్తె నృత్యాన్ని చూసి పరవశించిపోయిన నలుగురు కళా హృదయులు ఇంతకుముందే పంపిన కానుకలు ఇవి... సమాధానం ఇవ్వటానికి కొద్దిపాటి వ్యవధి కావాలని అడిగాను" అంటూ నాసీరుడి ముఖం లోకి చూసింది.

తడుముకోలేదు నాసీరుడు. తన రొంటిన వున్న మూటను తీసి ఆ పళ్ళెరం మీదికి విసిరాడు.

ఆ అదటుకు తనంతట తనే ఊడిపోయింది ఆ మూటకు వున్న ముడి. కనులు చెదిరిపోయే కాంతుల్ని వెలువరిస్తూ బయటికి వచ్చింది కులోత్తుంగ చోళ చక్రవర్తి సేనాపతికి స్వహస్తాలతో బహూకరించిన పచ్చలపతకం.

దాన్ని వెన్నంటి బయటికి తొంగిచూసింది ముత్యాలు పొదిగిన కరకంకణం.

ఆ రెండింటినీ చూసి వాటి విలువను మనసులోనే గుణించుకునే సరికి ఊపిరి ఆగిపోయినంత పని అయింది శివకామినికి. దూరంగా నిలబడిపోయిన సౌదామినిని దగ్గిరికి పిలిచి అతిథులకు సపర్యలు చేయమని సూచించిందామె.

"మీ గురించి మా హేమసుందరికి ఒకమాట చెప్పి చిటికెలో వస్తాను. కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటూ వుండండి" అంటూ పరుగులాంటి నడకతో పై అంతస్థులోకి వెళ్లింది.

తన తండ్రిగారి పచ్చలపతకం, ముత్యాల కరకంకణం ఆమె మతిని పోగొట్టినట్లు గ్రహించి ముసిముసిగా నవ్వుకున్నాడు నాసీరుడు. ఆసనం వెనక్కి చేరగిలబడి విశ్రాంతిగా కూర్చున్నాడు.

పై అంతస్తులోని శయనమందిరంలో కూర్చుని పంజరంలోని రామచిలుకకు మాటలు నేర్ప ప్రయత్నిస్తోంది హేమసుందరి. సంభ్రమంగా వచ్చిన తల్లిని చూసి నొసలు విరిచింది. ఆమె చెక్కిళ్ళను పుణికి మెటికలు విరిచింది శివకామిని. నుదుటిని చుంబించి దగ్గిరికి తీసుకున్నది.

"ఏమిటమ్మా యిది? ఏమిటి ఈ ఆనందం?" ఆశ్చర్యంగా చూస్తూ అందమైన కంఠంతో ప్రశ్నించింది హేమసుందరి.

"మామూలు ఆనందం కాదు తల్లీ యిది. ఈ వయసులో కూడా కాలికి గజ్జెకట్టి నృత్యం చేయాలని అనిపిస్తున్న ఆనందం. గొంతెత్తి గానం చేయాలని కోరిక పుట్టిస్తున్న సంతోషం" మరోసారి కూతురి చెక్కిళ్ళను పుణుకుతూ చెప్పింది శివకామిని.

అర్థంకాలేదా మాటలు హేమసుందరికి.

"కట్టుబట్టలతో ఈ నగరానికి వచ్చినందుకు మనకు తగిన హోదా ఈనాడు లభించింది. మన సేనాపతులవారి ముద్దుబిడ్డడు నీమీద మనసు పడి, అపూర్వమైన బహుమతులను తీసుకువచ్చాడు. అతనితో సంబంధం మన పరపతిని పెంచుతుంది. నువ్వు వెంటనే క్రిందికి వచ్చి అతగాడిని పలుకరించు" అసలు విషయాన్ని చెప్పింది శివకామిని.

ఆమె మాటలు విని ఒక్కసారిగా కాంతివిహీనం అయింది హేమసుందరి వదనం.

"కట్టుబట్టలతో యిక్కడికి వచ్చినా, రాజాశ్రయం లభించటంవల్ల అంతులేని సంపద మన హస్తగతమైంది. ఇప్పుడు మన పరపతికి వచ్చిన తక్కువతనం ఏముందమ్మా?" తడబడుతున్న కంఠంతో భయపడుతూ మెల్లిగా అడిగింది.

చటుక్కున మాయమైపోయింది శివకామిని వదనంలోని ఆనందం. చిటికెలో కెంపురంగును సంతరించుకున్నాయి ఆమె కనులు.

"రాజాశ్రయం లభించిందన్న గర్వంతో మిడిసిపడకూడదు. నిన్ను మించిన నాట్యకత్తె ఇంకెవరైనా అగుపిస్తే మరుగైపోతుంది రాజుగారికి నీ మీద వున్న అభిమానం. ఆ తరువాత మనం బ్రతికేది ఎలా?" కరుకుగా ధ్వనిస్తున్న కంఠంతో ప్రశ్నించింది.

"ఇప్పటివరకూ నేను సంపాదించిన ధనం మనం హాయిగా జీవించేటందుకు సరిపోదా అమ్మా?" గద్గదకంఠంతో అడిగింది హేమసుందరి.

"సరిపోదు. నువ్వు పుట్టిన క్షణంనుంచీ నేను చాలా కష్టాలు పడ్డాను. తిండి తినీ తినకా నిన్ను పెంచి పెద్దచేశాను. సంగీతనృత్యాలు నేర్పించాను. నా

మనసుకు తృప్తిని కలిగించేలా నువ్వు జీవించాలి" ఖచ్చితమయిన కంఠంతో చెపుతూ కూతురు చేయి పట్టుకుని తల్పంమీదినించి లాగింది శివకామిని.

ఎంత ప్రయత్నించినా ఆగకుండా హేమసుందరి చెక్కిళ్లమీదికి వచ్చేశాయి కన్నీళ్ళు.

"సేనాపతులవారి తనయుడు వట్టి ఆకతాయి అని అందరూ అంటూ వుంటారట. తండ్రికి వున్న అధికారాన్ని అడ్డుపెట్టుకుని అతను చేసే చెడుపనుల్ని భరించటం చాలా కష్టం అనికూడా చెప్పుకుంటూ వుంటారట. అటువంటి మనిషి దగ్గరకి నన్ను రమ్మనమని పిలవటం నీకు భావ్యమా?" తల్లిచేతిని వదిలించుకోవటానికి ప్రయత్నిస్తూ అడిగింది.

ఒక్కక్షణం తగ్గించుకున్నది శివకామిని తన వేగాన్ని.

"అయితే సేనాపతులవారి బిడ్డడిని ఏదో ఒకవిధంగా అవతలికి సాగనంపుతాను. అతనికి కాస్తంత ముందుగా వచ్చిన కోశాధికారి బహుమతుల్ని అంగీకరించు. అతన్ని మన ఇంటికి రమ్మని కబురు పంపించు" సాలోచనగా సలహా చెప్పింది.

మరింతగా కాంతివిహీనమైంది హేమసుందరి వదనం. కోశాధికారి ప్రవర్తన చాలా అసహ్యకరంగా వుంటుందట. ఆయన దర్శించని ఇల్లు అంటూ మన వీధిలో ఏదీ లేదట..." అని చెప్పబోతుండగా, చటుక్కున చేతిని జాచి ఆమె పయ్యెదను గట్టిగా పట్టుకున్నది శివకామిని.

"నువ్వు మనసులో ఒకటి పెట్టుకుని బయటికి ఇంకోమాట మాట్లాడుతున్నావు. చిన్నపిల్లవు కదా అని ఓర్పు వహించి వూరుకున్నాను. అసలు విషయం ఏమిటో వెంటనే చెప్పు. సేనాపతి కుమారుడినీ, కోశాధికారినీ కాదని

నువ్వు ఎవరిని చేపట్టాలని అనుకుంటున్నావ్?" వున్నట్లుండి వికృతంగా మారిపోయిన కంఠంతో విసురుగా ప్రశ్నించింది.

తల్లిచేతిలో బిగుసుకుపోయిన పయ్యెదను వదిలించుకోవటానికి ప్రయత్నించిన హేమసుందరి తల వంచుకుని మౌనంగా వుండిపోయింది.

"కావాలని వచ్చిన అతిథుల్ని క్రింద కూర్చోబెట్టి వచ్చాను. ఆలస్యం చేయకుండా నీ మనసులోని మాటను చెప్పు. ఏం చేయాలని అనుకుంటున్నావ్?" క్షణక్షణానికీ అధికమైపోతున్న కోపాన్ని అణుచుకోలేక హుంకరించినట్లు అడిగింది శివకామిని.

"నేను ఎవరి ఆశ్రయంలోనూ బ్రతకాలని కోరుకోవటంలేదు. వివాహం చేసుకుని గృహిణిగా జీవించాలని అనుకుంటున్నాను" జారిపోయిన ధైర్యాన్ని కూడదీసుకుంటూ అన్నది హేమసుందరి.

ఆశ్చర్యంతో కనుల్ని పెద్దవిచేసి చూసింది శివకామిని. "నువ్వు... నువ్వు వివాహం చేసుకుంటావా? ఒళ్ళు అమ్ముకోవాల్సిన వారాంగన వివాహం చేసుకుంటుందా? మతి వున్నదా హేమా నీకు?" అని అడుగుతూ నుదుటిమీద చేయివేసి చూసింది.

ఆ చేతిని అవతలకు జరిపి తలను ప్రక్కకు తిప్పుకున్నది హేమసుందరి.

"ఒళ్ళు అమ్ముకుని బ్రతకమని ఎవరినీ శాసించలేదు సృష్టికర్త. జరుగుబాటు లేక,మరోలా బతకటం చేతకాక వృత్తిలోకి లాగబడ్డారు మనలాంటివాళ్ళు. వివాహం చేసుకుని ఒకే మనిషికి కట్టుబడి వుంటానంటే ఎవరూ అభ్యంతరపెట్టరు" అని అంటూ వుండగా కట్టలు తెంచుకున్నది ఆమె తల్లి క్రోధం.

"వివాహం చేసుకుంటావా? ఒకే మనిషికి కట్టుబడి వుంటావా? ఇంత కాలం నీమీద ఎన్నో ఆశలు పెట్టుకుని నీ కోసమే బ్రతుకుతున్న నన్ను నడివీధిలోకి నెట్టి యాచకురాలిగా జీవించమంటావా? ఎంత ధైర్యం వచ్చిందే నీకు?

ఈ మాటల్ని ఎవరు బోధిస్తున్నారే?" అంటూ కూతురు చెంపలమీద బలంగా కొట్టింది.

ఆ అదటుకు తల్పంమీద వెల్లికిలా పడిపోయింది హేమసుందరి.

కుంకుమ పూసినట్లు ఎర్రగా కందిపోయిన ఆమె చెంపల్ని చూసిన తర్వాత కూడా తగ్గలేదు శివకామిని కోపం.

"పిచ్చి పిచ్చి మాటలతో, పిచ్చి పిచ్చి ఆలోచనలతో కాలక్షేపం చేస్తే వూరుకుంటానని, ఓర్పు వహిస్తానని అనుకోబోకు. నేను చెప్పినట్లు చేయకపోతే నీ అంతు చూస్తాను. నా కంఠంలో ప్రాణం వుండగా నీ ఆటలు సాగవు.

రేపు సాయంత్రం ఇదే వేళకు సేనాపతులవారి బిడ్డడు ఇక్కడికి వస్తాడు. అతన్ని ఆహ్వానించు. అతని ఆదరాభిమానాల్ని సంపాదించు. అందుకు భిన్నంగా జరగటానికి ఎంతమాత్రమూ వీలులేదు. జాగ్రత్త."

ఖంగుమంటున్న కంఠంతో కడసారిగా చెప్పి ఆ మందిరంలో నుంచి బయటికి వచ్చేసింది.

ఆసనం వెనక్కి వాలి కూర్చున్న నాసీరుడు ఆమె అడుగుల సవ్వడిని ఆలకించి ముందుకు వంగాడు.

వదనంలో గూడుకట్టుకుని వున్న అలజడి అతని కనులకు అగుపించకుండా జాగ్రత్తపడింది శివకామిని. చిరునవ్వును పులుముకున్నది.

"అనుకోని విధంగా వచ్చిన మీకు వెంటనే స్వాగతం పలకటానికి బిడియపడుతున్నది హేమసుందరి.

రేపు ఇదే సమయానికి రాగమరేమో అడిగిరమ్మని అంటోంది.

మక్కువ కలిగినవారికి మరొక్కరోజు ఆగటం ఏమంత కష్టం కాబోదని చెప్పి వచ్చాను" నయగారాలను ఒలికిస్తూ చెప్పింది ఆమె.

ఆత్రుతగా చూసిన నాసీరుడికి ఆశాభంగం అయింది.

అతని ముఖం చిన్నబోయింది.

"అనుకున్న పనిని అనుకున్నవెంటనే సాధించి తీరాలన్న పట్టుదల మీ వంటి ప్రభువులకు వుండటం చాలా సహజం. పువ్వులకంటే సుకుమారమైన స్త్రీ హృదయాన్ని జయించటానికి తొందరపాటు పనికిరాదని కూడా మీకు తెలిసే వుంటుంది" అతని ముఖంలోని భావాలను గమనిస్తున్న శివకామిని వెంటనే సర్దిచెప్పింది.

"రేపు... రేపు ఇదేవేళకు రమ్మనమని చెప్పిందా?" ఎంతోప్రయత్నంమీద తన మనసును కూడదీసుకుంటూ అడిగాడు నాసీరుడు.

"తప్పకుండా ఒక్కక్షణం కూడా అటు ఇటు కాకుండా రావచ్చు. మీ రాకకోసం,మీరు అందించే బహుమతులకోసం మా హేమ ఆశగా నిరీక్షిస్తూ వుంటుంది."

తన ముఖంలోని భావాల్ని గ్రహించిన జతగాడు మెల్లగా భుజాన్ని స్పృశించడంతో తడబాటును అణుచుకుని తలవూపాడు.

# 3

నాసీరుడినీ, అతని జతగాడినీ ముఖద్వారం వరకూ వెళ్ళి సాదరంగా సాగనంపింది శివకామిని. వీధి చివరికి పోయి వారిద్దరూ కనుమరుగు కాగానే తలుపులు మూసి ఒక ఆసనంలో కూలబడిపోయింది.

"ఏమయిందమ్మా?" ఆందోళనగా అంది సౌదామిని.

"సేనాపతి కుమారుడి అండన చేరి ఆనందంగా కాలం గడపమంటే, పెళ్ళి చేసుకుంటాననీ, గృహిణిగా బ్రతుకుతాననీ పిచ్చిమాటలు మాట్లాడుతోంది హేమసుందరి" నిరసనగా చెప్పింది శివకామిని.

"చిన్నపిల్ల కదా అమ్మా... గారాబంగా పెరిగిన ముగ్ధరాలు. చనువుకొద్దీ పలికి వుంటుంది. సర్దిచెపితే సరిపోతుంది" అనునయంగా అన్నది సౌదామిని.

ఆ మాటలతో మాయమైపోయింది శివకామిని ముఖంలోని నీరసభావం. ఒక్కసారిగా ఎరుపురంగును పులుముకున్నాయి ఆమె కనులు.

"అది చిన్నపిల్లకాదు. వట్టి మూర్ఖురాలు. పట్టు పట్టిందంటే ప్రాణాలు పోయినా మనసు మార్చుకోదు. అసలు ఇటువంటి పాడుమాటలు దాని నోటివెంట ఎలా వెలువడ్డాయో నాకు అర్థంగావటంలేదు" కరుకు కంఠంతో అంటూ లేచింది.

అటునుంచి అటు పై అంతస్తుకు పోయి మరోసారి హేమసుందరితో తగవు పడుతుందేమోనని గబగబా సర్దిచెప్పటానికి ప్రయత్నించింది సౌదామిని.

"హేమసుందరి తప్పు అయివుండదు ఇది. రాజాశ్రయం మనకు లభించిన క్షణంనుంచీ ఈ వాడలో నివసిస్తున్న వారి ఏడుపుకు అంతు అంటూ లేకుండా వున్నది. మన ఉన్నతిని చూసి సహించలేని వారెవరో ఏదో పాడుపని చేసి

వుంటారని నాకు అనిపిస్తోంది. ఏ దయ్యాన్నో భూతాన్నో హేమసుందరి మీదికి పంపకం చేసివుంటారని నా అభిప్రాయం" అని అన్నదామె.

తన కూతురి మాటలకు ఆమె మంకుపట్టు కారణం కాదనీ, పరాయివారి అసూయాద్వేషాల ఫలితమనీ వినేసరికి చేత్తో తీసివేసినట్లు మాయం అయిపోయింది శివకామిని మనసులోని ఆందోళన.

"ఇప్పుడు ఏం చేయాలే సౌదామినీ? ఏం చేస్తే ఈ గందరగోళం నుండి మనం బయటపడతాం?" ఆశగా చూస్తూ వెంటనే అడిగింది.

సరైన సమయంలో సరైన మాటల్ని వుపయోగించి ఆమె కోపాన్ని అణిచి వేయగలిగిన తన తెలివితేటల్ని తనకు తనే అభినందించుకుంటూ ఏం చేయాలో వివరించింది సౌదామిని.

సానివాడకు తూర్పుదిశలో వుంటుంది ఒక చిన్న కొండగుట్టు. ఆ గుట్టమీద భక్తులు ఎవరో తొలిపించిన చిన్నగుహలో కాపురముంటున్నాడు వీరభల్లటుడు అనే జైనసిద్ధుడు ఒకతను.

"మంత్రతంత్రాల్లో ఆరితేరిన చేయి ఆయనది. ఎటువంటి క్షుద్రగ్రహమైనా ఆయన పేరుచెపితే గడగడలాడుతూ వెయ్యి ఆమడల దూరం పారిపోతుంది. జరిగింది ఏమిటో చెప్పి ఆయన సహాయాన్ని అర్థించండి" అని సూచించింది.

క్షణం ఆలస్యం చేయకుండా బాడుగబండీ నౌకదాన్ని పిలిపించుకుని ప్రయాణానికి సిద్ధం అయింది శివకామిని. ఒక పళ్ళెరంనిండా పూజాద్రవ్యాలు, గుప్పెడు బంగారునాణేలు తీసుకుని బయలుదేరింది.

"నేను తిరిగివచ్చేవరకూ అమ్మాయిని ఒకకంట కనిపెట్టుకుని వుండు. మన ఇరుగుపొరుగు వారినెవరినీ ఇంట్లోకి రానీయకు" అని సౌదామినికి జాగ్రత్తలు చెపుతూ బండి ఎక్కింది శివకామిని.

ఆమె దృష్టిపథంనుంచి దూరం అయ్యేవరకూ వీధిలోనే నిలబడింది సౌదామిని. ముఖద్వారాన్ని మూసి యింటిపనులలో నిమగ్నం అవబోతుండగా వినవచ్చిందామెకు ఒక అలికిడి. వంట యింటిలోనుంచి ఇవతలకు వచ్చి చుట్టూ చూసేసరికి అగుపించింది ఆమెకు మధ్యమందిరంలో రెక్కల్ని తపతపలాడిస్తూ గిరికీలు కొడుతున్నరామచిలుక ఒకటి.

హేమసుందరి మందిరాన్ని వదిలి ఎన్నడూ రాని ఆ చిలుక, ఆరోజు అక్కడ కనిపించడం విచిత్రం అనిపించి, దాన్ని పట్టుకున్నది సౌదామిని.

"హేమ గదిలో ఏం చేస్తోంది? పంజరంలోనుంచి నువ్వు ఎలా బయటకు వచ్చావ్?" అని అడుగుతూ పై అంతస్తుకు పోయి, హేమసుందరి మందిర కవాటాన్ని గట్టిగా తట్టింది.

అసురసంధ్యవేళ నిద్రపోవటం హేమసుందరికి అలవాటులేదు. ఒకవేళ బద్ధకంగా పరుండివున్నా, కవాటాలు తట్టిన సవ్వడిని వినగానే చటుక్కున లేచి సమాధానం ఇస్తుంది. ఇప్పుడు అటువంటిది ఏమీ జరగకపోవడంతో జల్లుమన్నది సౌదామిని శరీరం. కీడును శంకించనారంభించింది ఆమె హృదయం.

"హేమసుందరీ? హేమా! ఏం చేస్తున్నావ్ తల్లీ?" అని పిలుస్తూ, నాలుగడుగుల దూరంలో వున్న ఒక గవాక్షం దగ్గిరికి పోయి లోపలికి చూసింది.

పెద్ద పెద్ద వింజామరలను బిగించటానికి అనువుగా మందిరపు పై కప్పుకు అమర్చివున్న ఒక ఇనుపకొక్కేనికి తన జలతారు చీరెను ముడివేసి ఉరి పోసుకోవటానికి ప్రయత్నిస్తోంది హేమసుందరి.

జల్లుమన్నది సౌదామిని శరీరం.

"అయ్యో...అయ్యో...అదేం పని హేమా? ఆగమ్మా...ఆగు తల్లీ..." బెంబేలుగా అరుస్తూ గవాక్షంమీద అరిచేతులతో కొట్టింది.

కన్నీటి చారికలతో మలినమైన వున్న ముఖాన్ని తిప్పి ఆమెకేసి చూసింది హేమసుందరి, వెంటనే తలను ప్రక్కకు తిప్పుకుని, చీరె ముడిని తన కంఠానికి తగిలించుకున్నది. మైకం ముంచుకువస్తున్నట్లు అనిపించింది సౌదామినికి. శరీరంలోకి శక్తి అంతా ఆవిరి అయిపోతున్న అనుభూతి కలిగింది.

"తప్పు హేమా... నువ్వు చేస్తున్నది చాలా పెద్ద తప్పు... ఆగు తల్లీ ఆగు" అని బిగ్గరగా అరుస్తూ,మళ్లీ మందిరం కవాటాల దగ్గిరకి వచ్చింది.

ఇంక ఏ మాత్రం ఆలస్యం చేసినా హేమసుందరి ప్రాణవాయువులు అనంతవిశ్వంలో కలిసిపోతాయన్న భయం ఆమెకు అపూర్వమైన శక్తిని ప్రసాదించింది ఆ సమయంలో.

ఇద్దరు బలాఢ్యులు ఒకేసారి మొత్తినా చెక్కుచెదరనంత బలంగా వుండే లోపలి గడియ,రెండే రెండు భుజపు దెబ్బలకు వికృతశబ్దాలు చేస్తూ ఎగిరిపడింది. భళ్ళున తెరుచుకున్నాయి తలుపులు.

జలతారు చీరెకు వ్రేలాడబడిపోయిన హేమసుందరిని రెండంగల్లో సమీపించి అమాంతంగా పైకెత్తి పట్టుకున్నది సౌదామిని. ఎడమచేతిని పైకి పోనిచ్చి ఆ ముడిని ఒక్క గుంజు గుంజింది.

పరపరమని చిరిగిపోయిందా వస్త్రం. జర్రుమని జారి క్రిందికి పడిపోయింది ప్రాణంలేని బొమ్మ మాదిరి సౌదామిని చేతుల్లోనుంచి ప్రక్కనే వున్న తల్పంమీద పడింది హేమసుందరి.

దగ్గిర్లో వున్న చెక్కబల్లమీది మంచినీటి పాత్రను అందుకుని ఆ ముద్దరాలి ముఖంమీద నీటిని చిలకరించింది సౌదామిని. నాలుగు క్షణాల తరువాత కనులు తెరిచింది హేమసుందరి. వెంటనే బావురుమంటూ ముఖాన్ని చేతుల్లో దాచుకున్నది.

"ఎంతపని చేశావు తల్లీ... నేను రావటం గనుక కాస్తంత ఆలస్యం అయివుంటే ఎంత ప్రమాదం జరిగిపోయి వుండేది" ఆమె తల నిమురుతూ గద్గదకంఠంతో అన్నది సౌదామిని.

"నన్ను ఎందుకు రక్షించావు సౌదామినీ? నా తల్లి కోరికలకు అనుగుణంగా జీవించటానికా? నాకు ఇష్టంలేని జీవితాన్ని గడుపుతూ కృంగి కృషించిపోవటానికా?" ఏడుస్తూ అడిగింది హేమసుందరి.

తనకు ఇష్టంలేని పనిని చేసినవారిమీద బ్రహ్మరాక్షసిలా విరుచుకుపడిపోయే శివకామినిని చిటికెలో శాంతింపచేసి ఆవలికి పంపించగలిగిన సౌదామినికి ఎలా మాట్లాడాలో తెలియలేదు.

"ఆడపుటక అంటూ పుట్టిన తర్వాత జీవితాంతం ఎవరినో ఒకరిని ఆశ్రయించుకుని బ్రతకాల్సిందే కదమ్మా... పెంచి పెద్దచేసి ఆశలన్నింటినీ నీ మీదనే పెట్టుకు బ్రతికే నీ తల్లి మాటల్ని కాదని అనటం మంచిగా వున్నదా?" ఆమె తల నిమురుతూ అడిగింది రెండుక్షణాల తరువాత.

"నా తల్లి ఆశలు నా సుఖసంతోషాల మీద లేవు. నా ద్వారా సంపాదించే ధనంమీద వున్నాయి. ధనసంపాదనకు ఎటువంటి పనికైనా ప్రోత్సహిస్తుంది. మంచిచెడుల విచక్షణ అనవసరమని అంటుంది" ఏడుస్తూనే చెప్పింది హేమసుందరి.

"ఎంత కాదని అన్నా ఆమె నీ కన్నతల్లి. ఆమె మనసును కష్టపెట్టే పనులు చేయడం తప్పుతల్లీ... నీకు చేతనైతే ఆమెను ఒప్పించి నీ దారికి మళ్లించుకోవాలి గానీ,ఇలా ప్రాణాలు తీసుకోవడం మంచి పద్ధతా?" వెంటనే అడిగింది సౌదామిని.

"ధన సముపార్జనకు సంబంధించిన మాటల్ని తప్ప మరే విధమైన పలుకుల్ని వినిపించుకోదు నా తల్లి. ఆమెని ఒప్పించడం అసంభవం... సేనాపతి కుమారుడు రేపు సాయంత్రం ఇక్కడికి వచ్చేలోపల ప్రాణాలు తీసుకోవడం తప్ప నాకు మరో మార్గంలేదు" అన్నది హేమసుందరి.

విపరీతమైన వాత్సల్యంతో నిండిపోయింది సౌదామిని హృదయం. కన్నబిడ్డను కౌగలించుకున్నట్లు హేమసుందరిని బిగించి పట్టుకుని తన అక్కున చేర్చుకున్నది ఆమె.

"నీకు నేను సహాయం చేస్తాను. ప్రాణాలు తీసుకోనని మాట ఇస్తే నీ తల్లిని ఒప్పించటానికి నా తెలివినంతా ఉపయోగిస్తాను" అని వాగ్ధానం చేసింది.

తన తల్లిని ఒప్పించడం ఆమె అనుకున్నంత తేలికపని కాదని అనబోయి, ఆ మాటల్ని తనలోనే అదుముకున్నది హేమసుందరి.

"మన సానివాడకు సమీపంలోని కొండగుట్టమీద నివసించే వీరభల్లటుడి దగ్గిరకి వెళ్లింది నీ తల్లి. ఆమె తిరిగి వచ్చేలోపుగా ముఖం కడుగుకుని ముస్తాబు చేసుకో. జరిగింది ఏమిటో ఆమెకు తెలియనీయవద్దు. సమయం చూసుకుని నేను

గట్టిగా మాట్లాడతాను" అంటూ తల్పంమీదినుంచి లేచింది సౌదామిని. చిరిగిపోయిన జలతారు చీరను చుట్టి,ఒక మందసం చాటున పడేస్తూ వుండగా కనిపించాందామెకు హేమసుందరి భుజంమీదికి చేరిన రాచిలుక.

"దానిమూలంగానే ఈరోజు నీ ప్రాణాలు కాపాడబడ్డాయి. అదిగనుక క్రింది మందిరంలోకివచ్చి వుండకపోతే నీ గురించి ఆలోచించేదాన్నే కాదు" అంటూ క్రిందికి వెళ్లిపోయింది.

జలతారు చీరెతో ఉరిపోసుకోవాలని నిర్ణయించుకునేముందు తనే చిలుకను పంజరంలోనుంచి వదిలేసిన సంగతి చెప్పలేదు హేమసుందరి. చెక్కిట చేయి చేర్చుకుని అలాగే శూన్యంలోకి చూస్తూ కూర్చుండిపోయింది. రాత్రి మొదటి ఝాము గడిచిపోతున్న సమయంలో తిరిగివచ్చింది శివకామిని.

"తన దెబ్బకు దయ్యాలేకాదు, బ్రహ్మరాక్షస పటాలంకూడా దూరంగా పారిపోతాయని సగర్వంగా చెప్పాడు వీరభల్లటుడు. మంత్రించిన తాయెత్తు యిచ్చాడు. రేపుకూడా పూజలుచేసి మంత్రాక్షతలు ఇస్తానన్నాడు" ఆనందంగా అంటూ నవ్వి, నలుపురంగు దారానికి తగిలించి వున్న తాయెత్తునొకదాన్ని హేమసుందరి చేతికి కట్టింది.

నీటితో నిండుతున్న తన కనుల్ని చూస్తే ఆమె తిరిగి తిట్లు ప్రారంభిస్తుందేమోనన్న భయంతో వంచిన శిరస్సును పైకి ఎత్తకుండా మౌనంగా వుండిపోయింది హేమసుందరి.

అది వీరభల్లటుడి శక్తికి నిదర్శనంగా భావించి సంతోషంతో ఉప్పొంగి పోయింది శివకామిని.

"రేపటికల్లా మామూలుగా తయారైపోతుందని అన్నాడు. రేపటిదాకా ఆగాల్సిన అవసరమే లేదు. అప్పుడే పనిచేయటం మొదలు పెట్టింది ఆయన మంత్రశక్తి" పైనుండి క్రిందికి వస్తూ ఆనందంగా చెప్పింది సౌదామినికి.

బంగారు పళ్ళెరంనిండా తినుబండారాలను పేర్చుకుని హేమసుందరి ముందుంచింది సౌదామిని.

"పస్తులు పడుకోవటంవల్ల సమస్యలు పరిష్కరించబడవు. ఆహారం తీసుకోకుండా అలిగితే అమ్మకు అనుమానం కలుగుతుంది . నా పని మరింత కష్టతరవౌతుంది" అని హెచ్చరిస్తూ వెళ్లిపోయింది.

వీరభల్లటుడి శక్తిసామర్థ్యాలమీద అపరిమితమైన నమ్మకం ఏర్పడిన శివకామిని మాత్రం హాయిగా భుజించింది. అవకాశం చూసుకుని తనతో మాట్లాడటానికి చూస్తున్న సౌదామిని భావాల్ని కొంచెంకూడా గమనించకుండా, భుజించిన వెంటనే గుర్రుపెడుతూ నిద్రకు ఉపక్రమించింది.

ఒక్కోసారి అర్ధరాత్రి సమయంలో లేచి కూర్చోవటం అలవాటు ఆమెకు గాఢనిద్దురలో వున్న సౌదామినిని కూడా నిద్రలేపి కబుర్లతో కాలక్షేపం చేయటం పరిపాటి.

కంటిమీద కునుకు లేకుండా ఎదురుచూస్తూ కూర్చున్నది సౌదామిని. అర్ధరాత్రి కాదుకదా, చివరి యామం సమీపిస్తున్నా ఆమెకు మెలకువ రాకపోయేసరికి వికలమైన మనసుతో వీధివాకిలిని తెరిచి బయటికి వచ్చింది.

వెంటనే ఆమెకు కనిపించింది సౌధోపరిభాగంలో నిలబడి వున్న హేమసుందరి. నిద్రపట్టకపోవటం వల్ల అటూ ఇటూ పచార్లు చేస్తోందామె.

"ఏమైంది సౌదామినీ? అమ్మతో మాట్లాడావా?" బయటికి వచ్చిన సౌదామినిని పైనుంచే పలుకరించింది. ఏమని సమాధానం యివ్వాలో తెలియక తలవంచుకున్నది సౌదామిని. విషణ్ణవదనంతో తలను తిప్పుకుని నిట్టూర్చింది హేమసుందరి.

ఉబికి రాబోయిన కన్నీటిని బలవంతంగా అదుముకుంటూ తన శయన మందిరంవైపు కదలబోతుండగా గాలివాటున అలలు అలలుగా ఆమె కర్ణేంద్రియాలకు సోకింది ఒక శబ్దం.

తన కన్నీటిని గురించి మరిచిపోయింది ఆమె. తన బాధను విస్మరించింది.

"ఏమిటది సౌదామినీ? ఏమిటా శబ్దం?" క్రిందికి చూస్తూ కుతూహలంగా ప్రశ్నించింది.

చెవులు రిక్కించి శ్రద్ధగా వింటూ చిరునవ్వుతో తలవూపింది సౌదామిని.

"వైష్ణవదాసులు తెల్లవారుఝామున నగర సంచారానికి బయలుదేరారు తల్లీ. శ్రీరంగంలో నివసించే రామానుజులవారి శిష్యుడు మొదలియాండన్ స్వయంగా మన నగరంలోకి వచ్చారట. వారి ఊరేగింపే అది..." అంటూ వుండగా మరింత దగ్గిరికి వచ్చాయి ఆ శబ్దాలు.

చదువురాని సామాన్య ప్రజలకు కూడా అర్థం అయ్యే రీతిలో భగవద్భక్తిని ప్రబోధించటానికి పామరభాషను ఉపయోగించుకుంటున్నారు ఆ వైష్ణవ దాసులు. కఠినమైన సంస్కృతాన్ని వదిలి సామాన్యులకు చవిపుట్టించే పాటలు పాడుతున్నారు.

నిదురావస్థలో నిలిచిన ప్రాణులు
నీ కథ వినునా నిను ఓదార్చేనా

విధిలిఖితం అతి బలాపేతం

నిర్మలహృదయం నీ కర్తవ్యం

పతిత పావనుడు కావేటిరంగడు

సతతము భక్తుల బ్రోచే దేవుడు

అతులితమగు శక్తిసంపన్నుడు

వెతలను బాపే విజయకేతనుడు

అతని నమ్ముము అతని గనుము

అతని లీలల కథలను వినుము

అతని నామస్మరణము చేయుము. గతమును మరిచి ధైర్యము పొందుము. ఝల్లుమన్నది శ్రద్ధగా ఆలకిస్తున్న హేమసుందరి శరీరం.

ఎవరీ వైష్ణవదాసులు...? ఏమిటి వీరి పాటలు? ఎవరి గురించి పాడుతున్నారు? తన గురించేనా??

గాఢనిద్దరలో వున్న తల్లి లేస్తే నోటికి వచ్చినట్లు తిట్టిపోస్తుందన్న విషయం తెలిసికూడా, పరుగులాంటి నడకతో క్రిందికి రాకుండా వుండలేకపోయింది హేమసుందరి.

శ్రీరంగంలో నివసించే శ్రీరామానుజాచార్యుల వారిని గురించి చాలా కథలు వినివుంది.

రంగనాథుని విశాలనేత్ర యుగళిని కనులారా దర్శించిన మహనీయుడట ఆయన! కోరి దరికి చేరినవారికి భగవదనుగ్రహాన్ని సంపాదించిపెట్టే మహాయోగిట!

ఆయన శిష్యుడైన మొదలియాండన్‌కి కూడా అటువంటి శక్తివుండకపోతుందా? తన వెతలను మాయం చేయడా పాదాలమీదపడి ప్రార్థిస్తే??

విపరీతమైన ఉద్వేగంతో కంపిస్తున్న కరాలను ఒకటిగా చేర్చి తమ భవంతి ఎదుట నిలబడింది హేమసుందరి.

ఎంతోసేపు ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా,రెండు నిముషాల తర్వాత ఆ వీధిలోకి రానే వచ్చాడు రామానుజులవారి శిష్యుడు.

చిట్టితంబురాను చేత ధరించి ఆనందపరవశంతో అద్భుతంగా గానంచేస్తూ హేమసుందరి ఎదుటికి ఏతెంచాడు.

"ఆగు హేమసుందరీ... అమ్మకు ఇటువంటి పనులు నచ్చవు... కొంచెం ఆగు" అని వారిస్తున్న సౌదామిని మాటల్ని వినిపించుకోకుండా వీధిలోకి వెళ్లి, ఆయన పాదాలకు నమస్కరించింది హేమసుందరి.

"ఆర్తురాలిని స్వామీ...నా వెతలను మీరే తీర్చాలి" ఒక్కసారిగా గద్గదమైన కంఠంతో వేడుకున్నది.

అనుకోని విధంగా దారికి అడ్డువచ్చిన ఆ రమణీయమూర్తిని చూసి ఒకింత ఆశ్చర్యానికి గురయ్యాడు రామానుజులవారి శిష్యుడు. అంతలోనే తన ఆశ్చర్యాన్ని అణుచుకున్నాడు. అపూర్వమైన గేయం ఒకటి ఆలవోకగా వెలువడింది ఆయన పెదవులనుండి.

నమ్ముము నమ్ముము నారాయణుని

నమ్మి చరింపుము అతని శక్తిని

నమ్ముము నమ్ముము అష్టాక్షరిని

నమ్మి వీక్షింపుము ఆనందజ్యోతిని

ఆశీర్వదిస్తున్నట్లుగా ముందుకు జాచబడిన అతని దక్షిణహస్తాన్ని కనులకు అద్దుకుంటూ ఒక్కసారిగా కన్నీటిపాలయింది హేమసుందరి.

"ఈ ధనదుపుర రాజాస్థానంలో నృత్యంచేసి అందరి మనసులను రంజింప చేసే నర్తకి హేమసుందరి ఈమె..." లోగొంతుకతో మెల్లగా రామానుజులవారి శిష్యుడు మొదలియాండన్‌కి విన్నవించుకున్నాడు ప్రక్కనే వున్న భక్తుడు ఒకతను. చల్లని వెన్నెల వెలుగులా ఆ భక్త శిఖామణి పెదవులపై ప్రసరించిందొక చిరుదరహాసం.

"నగరంలో అడుగుపెట్టిన తర్వాత నీ గురించి అనేకమంది హరిభక్తుల నోట వినటం జరిగింది తల్లీ. ఆత్మను పరమాత్మతో ఐక్యం చేయగల అద్భుతమైన కళలో నిష్ణాతురాలివి నువ్వు.

ఇలా బేలమాదిరి బెంబేలుపడవలసిన అవసరంలేదు. నిండు మనసుతో ఆ దేవదేవుని ప్రార్థించు. కష్టాల కడలిని దాటించమని అర్థించు. సర్వం శుభప్రదమౌతుంది" వాత్సల్యపూరిత వచనాలతో ఉపదేశించాడు.

ఆయన మాటలతో కొండంత ధైర్యం వచ్చినట్లు కన్నీటితో మలినపడిన బుగ్గల్ని తుడుచుకుంటూ మరోసారి ఆయన పాదాలకు నమస్కరించింది హేమసుందరి. దారికి అడ్డు తొలగింది.

ఆమె తల్లిని గురించి ఆయనకు వివరించి ఆమె మనసును మార్చే విషయంలో ఏదైనా ఉపాయం చెపుతారేమో తెలుసుకోవాలని అనుకున్నది, వాకిటిలోనే నిలిచివున్న సౌదామిని. ఆమె ఆలోచనలను గురించి పట్టించు కోలేదా భక్తాగ్రేసరుడు.

తల్లీ తండ్రీ గురువు స్నేహము
అక్కా చెల్లీ చుట్టము బంధము
మన్నా మిన్నా అగ్ని జలము
జగతిని సర్వము దైవమయము
కరుణామయుడు కావేటిరంగడు
శరణన్నవారిని చేయి వదలడు
అష్టాక్షరి శుభమంత్ర జపం
ఆనందజ్యోతి సాక్షాత్కారం
అని పాడుకుంటూ సాగిపోయాడు.

ఆయనతో గొంతులు కలిపి కావేటిరంగని ఘనతను కీర్తిస్తున్న భక్తుజనులకు కూడా అంజలి ఘటించబోతున్న హేమసుందరి చేయి పట్టుకుని గబగబా ఇంటిలోకి తీసుకుపోయింది సౌదామిని.

అప్పుడే నిద్రలేచింది శివకామిని.

"తెల్లవారకముందే తలుపుల్ని తెరిచి ఎక్కడికి పోయివస్తున్నారే మీరు?" అనుమానం నిండిన కంఠంతో అడగనే అడిగింది.

"వైష్ణవదాసులు మన వీధిలో ఊరేగింపులా వస్తుంటే చూడటం కోసం వాకిట్లో నిలబడ్డాం" తడుముకోకుండా చెప్పింది సౌదామిని.

"కష్టపడటం ఇష్టంలేని వారందరూ వైష్ణవదాసుల పేర్లు పెట్టుకుని, ఊరి మీదపడి తిరగటానికి అలవాటుపడ్డారు. ఇంకెప్పుడూ అటువంటివారిని చూడటానికి వీధిలోకి వెళ్ళకండి. వాళ్ళు చెడటమే కాకుండా తమను వీక్షించ వచ్చిన వారిని కూడా చెడగొడతారు" తన ఇంటిముందు జరిగింది ఏమిటో

తెలిసినట్లు గడగడా మాట్లాడటం మొదలు పెట్టిన శివకామినిని చూసి తెల్లబోయింది సౌదామిని.

తన భక్తిగానంతో మోడుబారిన చెట్లను సైతం చివురింపచేయగల రామానుజులవారి శిష్యుడు పనీ పాటాలేని బద్ధకస్తుడా ??

అటువంటి వారితో మాట్లాడటం యిష్టం లేకపోతే నిర్మొహమాటంగా మాట చెప్పటం బాగుంటుంది గానీ అనవసరంగా లేనిపోని నిందల్ని వేయటం భావ్యంగా వుంటుందా??

వాదానికి దిగి తెలతెలవారుతున్న సమయంలో తిట్లు తినడం మంచిది కాదని అనుకుంటూ మౌనంగానే వుండిపోయింది సౌదామిని. రాత్రంతా నిద్దుర లేనందువల్ల ఇసుకరేణువులు పడినట్లు మెర మెరలాడుతున్న కనుల్ని పైటచెంగుతో అద్దుకుంటూ గృహకృత్యాలను ఆరంభించింది.

పొద్దు బారెడు దూరం పైకి లేస్తున్న సమయంలో బాడుగ బండీని పిలిపించుకున్నది శివకామిని.

వెండి పూలసజ్జనిండా పూజాద్రవ్యాలను తీసుకున్నది. ముందురోజు కంటే ఇబ్బడిగా బంగారు నాణేలను సిద్ధం చేసుకున్నది.

"ఇంకా ఎన్నిరోజులు పూజలు చేయవల్సి వుంటుందో గట్టిగా అడిగి తెలుసుకు రండమ్మా..." వంట ఇంటిలోనుంచి బయటికి తొంగిచూస్తూ ఆమెను హెచ్చరించింది సౌదామిని.

వాకిలి దాటబోతూ క్షణకాలం ఆగిపోయి ప్రశ్నార్థకంగా చూసింది శివకామిని.

"ఇంకో నాలుగైదు రోజులపాటు పూజలు చేయవల్సి వుంటుందని వీరభల్లటులవారు సెలవిస్తే సేనాపతుల బిడ్డడిని అన్నిరోజులు ఆపేద్దాం. హేమకు పూర్తి స్వస్థత చేకూరేవరకూ ఆగుదాం" అవకాశం లభించిందనే సంతోషంతో తను చెప్పదలచుకున్న దానికి పునాది వేసింది సౌదామిని.

ఉరిమి చూస్తున్నట్లు విసురుగా తల విదిలించి వాకిలిని దాటింది శివకామిని. బండీ ఎక్కి కొండగుట్ట దగ్గిరికి వెళ్లిపోయింది.

ముఖద్వారాన్ని మూసి ఒక పళ్ళెరంనిండా మధురఫలాల్ని,బంగారుపాత్ర నిండా క్షీరాన్ని హేమసుందరి దగ్గిరికి తీసుకుపోయింది సౌదామిని.

ఎప్పుడు చూసినా హేమా... హేమసుందరీ...అని వల్లిస్తూ వుండే రాచిలుక ఆ రోజు మౌనంగా వుండటం ఆశ్చర్యాన్ని కలిగించింది ఆమెకు.

అంతరంగంలోని ఆవేదన కారణంగా రాత్రి తెల్లవార్లూ సౌధోపరిభాగంలో నిలబడి వున్నందువల్ల కాబోలు, శయ్యమీద అడ్డదిడ్డంగా పడుకొని ఆదమరిచి నిద్రిస్తోంది హేమసుందరి.

చేతిలోని ఫలాలు వున్న పళ్లెరాన్ని,క్షీరపాత్రను పక్కనే వున్న చెక్కబల్లమీద పెడుతూ రాచిలుకను పలుకరించింది సౌదామిని.

"నిద్రలేపు నీ యజమానురాలిని. గట్టిగా పిలిచి కూర్చోబెట్టు..." అంటూ ప్రోత్సహించింది.

"జయము జయము... కావేటిరంగనికి జయము జయము" కనుల్ని ఆర్పుతూ వెంటనే ముద్దు ముద్దుగా పలికిందా రామచిలుక.

నివ్వెరపోయింది సౌదామిని. నోరు తెరుచుకుని రాతిబొమ్మలా నిలుచుండి పోయింది.

* * *

సూర్యుడు నడినెత్తిమీదికి వస్తున్న సమయంలో జైనసిద్ధుడి సమక్షంలో నుంచి తిరిగివచ్చింది శివకామిని. అతను ప్రసాదించిన మంత్రాక్షతలను హేమసుందరి తలమీద వుంచింది. మిగిలినవాటిని చిన్న మూటగా కట్టి ఆమె మందిర ద్వారానికి వేలాడదీసి తృప్తిగా నిట్టూర్చింది.

"ఈ రోజు సాయంత్రానికల్లా హేమను ఆవహించిన దుష్టగ్రహం మన రాజ్యసరిహద్దుల్ని దాటి వెళ్లిపోతుందని వీరభల్లటులవారు సెలవిచ్చారు. హేమ ముఖాన్ని చూస్తుంటే ఆ మాటలు నిజమనే అనిపిస్తున్నాయి" పైనుంచి వస్తూ అంది.

"మీ మాటలకు ఎదురు చెపుతున్నానని అనుకోకుండా స్థిమితంగా ఆలకించండి. హేమకు ఇంకా కొంచెం వ్యవధిని యివ్వటం బాగుంటుంది. నాలుగైదురోజుల వ్యవధి తీసుకుని నచ్చచెపితే తప్పకుండా మీ మాటకు తల వూపుతుందని నాకు అనిపిస్తోంది" చిన్నకంఠంతో తన అభిప్రాయాన్ని మరోసారి ఆమెకు తెలియచేసింది సౌదామిని.

ఒక్కసారిగా పెనుమార్పు వచ్చేసింది శివకామిని వదనంలో. ఎంతో ప్రసన్నంగా వున్న ఆమె ముఖకవళికలు వికృతంగా మారిపోయాయి ఆ మాటల్ని విన్న మరుక్షణంలో.

"నేను ఇంట్లోనుంచి అవతలికి పోయిన సమయంలో నీకు చెప్పిందా ఈ మాటల్ని? తనకు బదులుగా నిన్ను మాట్లాడమని ఉద్బోధించిందా? మంచిచెడు విచక్షణ తెలియని చిన్నపిల్ల తెలిసీ తెలియని మాటలు మాట్లాడుతుంటే తప్పని

చెప్పకుండా వత్తాసు పలుకుతున్నావా? పని చేయాలని లేదా నీకు నా ఇంట్లో?" భద్రకాళి మాదిరి భీకరంగా గొంతు చించుకుని అరిచింది.

ఖిన్నురాలై, వంచిన తల ఎత్తకుండా ఇంటివెనుక వున్న పూదోటలోకి వెళ్లిపోబోయిందామె.

పది అడుగులు కూడా వేయకముందే పేరుపెట్టి పెద్దగా పిలిచింది శివకామిని. "ఈ ఇంట్లో ఏది జరిగినా నా ఇష్టప్రకారం జరగాల్సిందే. ఎదురు పలికిన వారందరికీ నోటిమీద వాతలు పెట్టేస్తాను. అర్థం అయిందా...?" వెనుతిరిగిన సౌదామిని ముఖంలోకి చూస్తూ క్రూరంగా అన్నది.

పెదవులు విప్పే ధైర్యంలేక తల వూపిందామె.

"విపణి వీధికి వెళ్లి ఈ రోజు సాయంత్రం జరుగబోయే వేడుకకు అవసరమైన సామాగ్రిని తీసుకురా. పూలదండలు, పరిమళద్రవ్యాలు, అన్నిటినీ జాగ్రత్తగా తీసుకురావాలి" అంటూ ఇంకేదో ఆలోచన వచ్చినట్లు మాటల్ని ఆపింది రెండు క్షణాలపాటు.

"ఆరగించటానికి మధురపదార్థాలను ఏమైనా తీసుకురావాలా?" ఆమె ఆలోచన ఏమిటో అర్థంగాక మెల్లిగా అడిగింది సౌదామిని.

"నీకు నచ్చిన పదార్థాలు ఏమైనా లభిస్తే తీసుకురా... నేను ఆలోచిస్తున్నది వాటిని గురించి కాదు" అంటూ మరో రెండు క్షణాల తర్వాత బయటపెట్టింది శివకామిని తన మనసులోని మాటల్ని.

"విపణివీధికి దగ్గర్లోనే వుంటుంది సేనాపతులవారి భవంతి. ఆ పరిసరాల్లో నిలబడితే నాసీరులవారు నీకు అగుపించవచ్చు. హేమసుందరి ఎంతో మక్కువతో ఎదురుచూస్తున్నదని చెప్పవచ్చు. అలా చేస్తే మనబెట్టు చెడుతుందా?"

ఆలస్యం జరిగితే హేమసుందరి తన మాట వినకపోవచ్చనే సందేహం కలిగి ఆమె అలా ఆలోచిస్తున్నదని సౌదామినికి అర్థం అయింది. ఆమె మనస్సును మార్చటం తన శక్తికి మించిన పని అని కూడా అవగతమైంది. ముందు వెనుకలు చూసుకోకుండా హేమకి మాట యిచ్చి లేనిపోని ఆశలు కల్పించినందుకు ఎంతగానో చింతిస్తూ విపణివీధికి బయలుదేరిందామె.

అర్థఘడియలో పూర్తి అయిపోయాయి అక్కడి పనులు. వెంట వచ్చిన బడుగబండిలో పూలమాలల్ని, పరిమళ ద్రవ్యాలను, రుచికరమైన తినుబండారాలను ఇంటికి పంపి, తను సేనాపతులవారి భవంతి సమీపంలోకి పోయింది.

మరో అర్థఘడియ తర్వాత ఒక గవాక్షంలో నుంచి ఆమెను చూసి, వీధిలోకి వచ్చాడు నాసీరుడు.

"పట్టపగలు ఈ పరిసరాల్లోకి ఎందుకు వచ్చావ్? పెద్దవాళ్ళు ఇక్కడ నిన్ను చూస్తే ఏమనుకుంటారోనన్న ఆలోచన నీకు లేదా?"

ఆత్రుతను కప్పిపెట్టుకోవటానికి కోపాన్ని తెచ్చిపెట్టుకుంటూ అడిగాడు.

శివకామిని చెప్పమన్న మాటల్ని తూ. చా తప్పకుండా అతని చెవిన వేసింది సౌదామిని.

"మా హేమసుందరికి ఏదయినా చెప్పమంటే పోయి చెపుతాను" అంటూ చిరునవ్వు నవ్వింది.

ఎండవేడిమి తగిలిన పొగమంచు మాదిరి చటుక్కున మాయం అయి పోయింది నాసీరుడు తెచ్చిపెట్టుకున్న కోపం. ఏదో చెప్పటానికి ప్రయత్నం చేస్తుండగా, భవంతిలోనుంచి బయటికి వచ్చి, అతన్ని చూశాడు ఒక భటుడు.

"సేనాపతులవారు మిమ్మల్ని వెంటనే తమ దగ్గిరికి రమ్మనమని చెప్పారు" పెద్ద పెద్ద అడుగులు వేస్తూ దగ్గిరికి వచ్చి విన్నవించాడు.

తను తిరిగి వచ్చేటంతవరకూ సౌదామినిని అక్కడే వేచివుండమని సైగ చేస్తూ భవంతిలోకి వెళ్లి పోయాడు నాసీరుడు.తండ్రి కొలువుతీరిన మందిరంలో అడుగుపెట్టి వినయంగా నమస్కరించాడు.

తన ప్రక్కన కూర్చుని వున్న ఒక కొత్తమనిషిని అతనికి చూపించాడు సేనాపతి.

"వకుళాపురానికి నగరపాలకుడు యితను. పేరు విరూపాక్షుడు" అని పరిచయం చేశాడు.

ధనదుపురానికి దగ్గిర దగ్గిరగా యిరువది అమడల దూరంలో వుంటుంది వకుళాపురం. వర్తకవ్యాపారాలకు ప్రసిద్ధి చెందిన నగరం కావటంతో రాజప్రతినిధితో సరిసమానమైన గౌరవమర్యాదలు పొందుతూ వుంటాడు ఆ నరగ పాలకుడు.

తండ్రికి నమస్కరించినట్లు వినయంగా విరూపాక్షుడికి కూడా అభివాదం చేశాడు నాసీరుడు.

"మీ వంటి పెద్దలను కలుసుకోగలగడం నిజంగా నా అదృష్టం" అని కూడా అన్నాడు.

అతని ప్రవర్తనకు ముచ్చటపడ్డాడు విరూపాక్షుడు.

"మీ పేరుప్రతిష్టల్ని నిలబెట్టగలడని అనుకోవటంలో ఎటువంటి అనుమానమూ లేదు. జాతిరత్నంతో సమానమైన పుత్రుడిని పొందారు మీరు" అంటూ సేనాపతిని మెచ్చుకున్నాడు.

ముఖంలో ప్రతిఫలించబోతున్న సంతోషాన్ని బలవంతంగా అదుముకుని గంభీరంగా తలవూపాడు ధనదుపుర సేనాపతి.

"ఈ రోజు తెలతెలవారబోతున్న సమయంలో కాకలు తీరిన గజదొంగలు ఇద్దరు వకుళాపురం వర్తకుల ఇళ్ళల్లో దొంగతనం చేస్తూ నగరరక్షకులకు పట్టుబడ్డారట. మన భవంతిలో ప్రవేశించిన మనిషి వారిద్దరిలో ఎవరో ఒకరు అయివుంటారని మన విరూపాక్షుడు అనుమానపడుతున్నాడు" కుమారుడి వైపు తిరుగుతూ అతన్ని పిలిచిన కారణాన్ని వెల్లడించడం మొదలుపెట్టాడు.

"నువ్వు వెంటనే మన దళపతిని, మరికొంతమంది భటుల్ని వెంటబెట్టుకుని విరూపాక్షుడితో వకుళాపురానికి వెళ్ళాలి. బంధింపబడిన ఆ దొంగల్ని చూసి వారిలో నువ్వు ఎదిరించిన మనిషిని గుర్తుపట్టాలి. వెంటనే ప్రయాణానికి సిద్ధం అవటం మంచిది."

భయంకరమైన పిడుగు సూటిగా వచ్చి తన తలమీద పడిన అనుభూతి కలిగింది నాసీరుడికి.

వకుళాపురానికి ప్రయాణం అవడం అంటే రానుపోను రెండురోజులు పడుతుంది. అక్కడ దొంగల్ని చూడటం,వారితో సంభాషించటం అంటే అక్కడ మరోరోజు వుండిపోవడం!

మూడు దినాలవరకూ హేమసుందరిని కలుసుకోవటానికి వీలుపడని పరిస్థితి. చేతికి అందింది అనుకున్న మధురభక్షం నోటివరకూ రాకుండా పోతున్న దుస్థితి.

నోరు తెరిచి ఏదైనా అభ్యంతరాన్ని వెలువరిస్తే, తన గుట్టు రట్టు అవుతుందన్న భయంతో తలవూపి తన మందిరంలోకి వచ్చేశాడు నాసీరుడు.

వీధి చివరన నిలబెట్టి వచ్చిన సౌదామినిని కలుసుకుని తన హృదయంలోని బాధను ఎరుకపరుచుకునే వ్యవధి కూడా అతనికి లభించలేదు.

మెరికల వంటి భటుల్ని పదిమందిన సిద్ధంచేశాడు దళపతి. బలిష్టమైన అశ్వాన్ని భవనద్వారం ముందు నిలబెట్టి అతనికి కబురు అందించాడు.

తలఎత్తి చూస్తే తన హృదయంలోని భావాలు అందరికీ అవగతమైపోతాయన్న అనుమానంతో వంచిన తల ఎత్తకుండా అశ్వాన్ని అధిరోహించి నగర ద్వారాలవైపు పరుగులు తీయించాడు నాసీరుడు.

"సేనాపతులవారి బిడ్డడు ఎక్కడికంత వేగంగా వెళ్లిపోతున్నాడు? శత్రురాజులు ఎవరైనా మన నగరంమీదిరి దండు వెడలుతున్న వార్త వచ్చిందా?"

పలుకరించటం మాట అటుంచి, కనీసం తలతిప్పి తనవంక చూడను కూడా చూడని నాసీరుడి ప్రవర్తనకు ఆశ్చర్యపడుతూ, సేనాపతి భవనరక్షకుల్లో ఒకతన్ని పలుకరించింది సౌదామిని.

"వకుళాపురంలో పట్టుబడ్డ గజదొంగల్ని చూడటానికి ప్రయాణం అవుతున్నారు..." తనకు తెలిసినది ఆమెచెవిన వేసి వెళ్లిపోయాడు అతను.

వకుళాపురానికి ప్రయాణం అంటే తిరిగి రావటానికి ఎన్నిరోజులు పడుతుందో సౌదామినికి తెలుసు.

ఆ సమయంలో ఒక్కసారిగా ఆమె కనులముందు మెదిలాడు ఆ రోజు ఉదయం తమ ఇంటిముందుకు వచ్చిన రామానుజులవారి శిష్యుడు.

ఢంకా దెబ్బలమాదిరి ఆమె కర్ణేంద్రియాల్లో మార్మోగాయ మొదలియాండన్, హేమసుందరికి చెప్పిన మాటలు.

నిండుమనసుతో నిష్కల్మషంగా దేవదేవుని ప్రార్థించమని అన్నాడా భక్తాగ్రేసరుడు. కష్టాల కడలిని దాటించమని అర్థించమన్నాడు. సర్వ శుభప్రద మౌతుందని కూడా చెప్పాడు.

అప్రయత్నంగా అంబరవీధివైపు చూపుల్ని మరలించి చేతులు జోడించింది సౌదామిని.

హేమ పెంచుకునే రాచిలుక పలికిన పలుకులే ఆమె నోటివెంట వెలువడ్డాయి." జయము జయము...కావేటి రంగనికి జయము జయము."

"ఏమైంది తల్లీ? నడివీధిలో నిలబడి కావేటి రంగని తలుచుకోవాల్సినంత కష్టం ఏమొచ్చింది?" అంటూ అటుగా పోతున్న వృద్ధుడు ఒకతను దగ్గిరికి వచ్చి పలకరించటంతో ఉలిక్కిపడి,తన భావోద్వేగాన్ని అణుచుకున్నదామె.

"భగవంతుని తలుచుకోవటానికి ప్రత్యేకమైన ప్రదేశం కావాలా? నడివీధిలో నిలబడి తలుచుకోకూడదా?" తన తత్తరపాటును కప్పిపెట్టుకోవటానికి కోపం నటిస్తూ అతన్ని భయపెట్టింది.

బాడుగబండిని మాట్లాడుకోవాలనే మాటకూడా గుర్తుకు రాలేదామెకు.

ఉన్మత్తురాలివలెవ పెద్ద పెద్ద అడుగులు వేస్తూ కాలినడకన ఇంటికి వచ్చేసింది.

ఆ సమయంలో ఇంటివెనుక పూతోటలోని పూలను స్వయంగా సేకరించటానికి వెళ్లింది శివకామిని. ఆమెకు కనిపించలేదు.

సూటిగా హేమసుందరి మందిరంలోకి వెళ్లింది సౌదామిని. చెక్కిట చేయి చేర్చుకుని నిరాసక్తంగా కూర్చుని వున్న ఆ ముద్దరాలిని అమాంతంగా కౌగిలించుకుని ముద్దాడింది.

"ఏమిటి సౌదామినీ? ఏమైందీ రోజు నీకు?" ఆశ్చర్యం నిండిన కనులతో చూస్తూ అడిగింది సౌదామిని.

"రామానుజులవారి శిష్యుడికి నమస్కారం చేయి...ఆయన ఉపదేశించిన వాక్యాలను గుర్తుతెచ్చుకో..." కుదురుగా నిలబడటం తనకు అసాధ్యం అయిపోతున్నట్లు అటూ యిటూ తిరుగుతూ ఆనందం నిండిన కంఠంతో చెప్పింది సౌదామిని.

"ఈ రోజు నీకు ఏదో అయింది. అమ్మ నా మీద జల్లటానికి తెచ్చిన మంత్రాక్షతలను నీమీద కూడా పడేయించాల్సిందే..."

చిరుకోపంతో ముఖాన్ని ప్రక్కకు తిప్పుకుంటూ అన్నది హేమసుందరి.

సేనాపతి భవంతి దగ్గిరకు వెళ్లినప్పుడు తన చూసిన దృశ్యాన్ని, భవన రక్షకుడు చెప్పిన మాటల్ని ఆమెకు వివరించింది సౌదామిని.

"నీ ఆర్తిని ఆ కావేటిరంగడు గమనించి, మూడురోజుల వ్యవధిని ఇచ్చాడు. ఈ మూడురోజులు గడిచేలోపల మరోమార్గాన్ని తప్పకుండా చూపిస్తాడు. ధన్యురాలివైనావు హేమ... నీవు కోరుకున్నట్లు హాయిగా వివాహము చేసుకుని సుఖంగా జీవిస్తావు..." ఆర్ధ్రత నిండిన కంఠంతో అన్నది.

ఎంత బిగపట్టుకున్నా ఆగకుండా బుగ్గలమీదికి వచ్చేస్తున్న భాష్పధారలను అద్దుకుంటూ శయ్యమీదికి వాలిపోయింది హేమసుందరి.

గృహిణిగా జీవించాలనే తన కోరిక నెరవేరేటట్లయితే ఎటువంటి భర్త లభిస్తాడు తనకు?

పంజరంలోని రాచిలుక మాదిరి తన తల్లి అదుపు ఆజ్ఞలతో బ్రతికే తను ఏ విధంగా కలుసుకోగలుగుతుంది ఆ కాబోయే భర్తను?

అసలు ఎక్కడ వున్నాడు అతను?

ధనదుపురంలోనే వున్నాడా లేక చుట్టుపట్ల కనిపించే నగరాలలో నివసిస్తూ వుంటాడా??

అడ్డు అదుపు లేకండా సాగిపోతున్న తన ఆలోచనలను తలుచుకుని సిగ్గుపడుతూ తలగడలో ముఖాన్ని దాచుకున్నది హేమసుందరి.

## 4

"పారిపోండి... పారిపోయి అందరూ మీ ప్రాణాలు దక్కించుకోండి. పారిపోండి" అని కేకలు పెడుతూ, గోధూళి సమయంలో గోవిందపురి గ్రామ రచ్చబండ దగ్గిరికి పరిగెత్తుకొచ్చాడు ఒక గ్రామస్థుడు.

"ఏమైంది? పారిపోయి ప్రాణాలు దక్కించుకోవాల్సినంత ప్రమాదం ఇప్పుడు మన గ్రామంమీదికి ఏమొచ్చింది?" ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు అక్కడ కూర్చుని వున్నవారిలో ఒక పెద్దమనిషి.

"మన పెద్దరెడ్డి తిరుమలయ్య పశువులదొడ్డిలో వుండే మహా వృషభం కట్టు తాళ్ళను తెంచుకున్నది. పారిపోండి" అక్కడివారిని మరోసారి హెచ్చరించి పరుగుతీశాడు గ్రామస్థుడు. తమ చెవుల్ని తామే నమ్మలేనట్లు ఒకరిముఖాలు ఒకరు చూసుకున్నారు అక్కడ వున్న పెద్దలందరూ.

గోవిందపురి గ్రామానికి నాలుగు క్రోసుల దూరంలో వుండే లింగాపురంలో ప్రతిఏడూ వసంతోత్సవాల సమయంలో జరుగుతాయి బ్రహ్మాండమైన పశు ప్రదర్శనలు.

మూడేళ్ళనుంచీ క్రమం తప్పకుండా అక్కడ ప్రథమస్థానాన్ని పొందుతున్నది పెద్దరెడ్డి తిరుమలయ్య పశువులశాలలో వుండే మహావృషభం.

కోపం చాలా అధికం ఆ వృషభేంద్రునికి. కట్టుతాళ్ళను తెంచుకుంటే తిరిగి పట్టుకోవటం చాలా కష్టం. పాతికమంది బలాఢ్యులు అన్ని ప్రక్కలనుంచీ వచ్చి కమ్ముకుంటే తప్ప జరిగే పనికాదు అది.

అడ్డువచ్చిన సామాన్యులను తన కరుకు కొమ్ములతో పొడిచివేయటానికే చూస్తుంది అది. గిట్టలతో వాళ్ల ప్రాణాలు తీయటానికి ప్రయత్నిస్తుంది.

"పెద్దిరెడ్డి తిరుమలయ్యకు ఈ విషయం తెలియజేయండి... అతని పాలెకాపులందర్నీ పగ్గాలు పట్టుకుని వెంటనే రమ్మనమని చెప్పండి" అంటూ రచ్చబండ మీదినుంచి లేచారు కొందరు పెద్దమనుషులు.

వారి ఆదేశాలను ఆచరణలో పెట్టే అవకాశం అక్కడివారిలో ఎవరికీ లభించలేదు. ఆ మాటలు పూర్తికావస్తూ వుండగానే ఆ ప్రదేశంలో ప్రత్యక్షమయింది ఆ వృషభం.

దగ్గర్లో వున్న ఒక మట్టి గోడను తన కరుకుకొమ్మలతో కూలద్రోసి, గుండెలు జలదరించేట్లు రంకె వేసింది. వజ్రాయుధాలవంటి గిట్టలతో నేలు గీరుతూ రచ్చబండకేసి చూసింది.

అంతకుముందు అటుగా వచ్చి అందరినీ హెచ్చరించిన గ్రామస్థుడి మాదిరిగానే "పారిపోండి.. పారిపోయి ప్రాణాలు దక్కించుకోండి..." అని అరుస్తూ తలా ఒకప్రక్కకు పరిగెత్తారు అక్కడివారు.

వారిలో ఒక్కరినయినా నేలకు నెట్టి గిట్టలతో మట్టగించాలని ఉత్సాహపడిందా వృషభం. ఆపని సాధ్యపడకపోవడంలో మరింత అధికము అయింది దాని ఆగ్రహం. ఆ వీధిలోనే ఒక ప్రక్కగా ఆగివున్న శకటాన్ని పడగొట్టి ఎందుకూ పనికిరాకుండా పాడుచేసేసింది.

బలిష్టమైన కొండరాళ్ళతో కట్టబడిన ఒక రాతిగోడను నిర్దాక్షిణ్యంగా కూల్చి వేసింది. ఒక వత్సరకాలం పశువులకు గ్రాసంగా పనికివచ్చే పెద్ద గడ్డివామిని కొమ్ములతో చెల్లాచెదురు చేసి ప్రక్కవీథిలోకి పరుగిడబోతుండగా అగుపించాడు ఒక పసిబిడ్డడు.

గ్రామంలోని వారందరికీ అందమయిన వస్త్రాలు నేసి యిచ్చే మరిడయ్య కుమారుడు అతను. కనిపంచిన దేవుళ్ళందరికీ మొక్కులు మొక్కుకోగా మొక్కుకోగా లేకలేక పుట్టిన వంశోద్ధారకుడు.

వీధిలోని కలకలాన్ని ఆలకించి వచ్చీరాని తప్పటడుగులతో తమ ఇంటి గుమ్మాన్ని దాటాడు ఆ బిడ్డడు. మృత్యువుకు ప్రతిరూపంగా ఎదుట అగుపించిన వృషభాన్ని చూసి భయపడ్డాడు.

వెనుతిరిగి ఇంట్లోకి పారిపోవాలనే ఆలోచన చేయగల వయస్సు కాక పోవటంతో, నిలుచున్నచోటనే చతికిలబడి బిగ్గరగ యేడ్వసాగాడు.

"అయ్యో...అయ్యయ్యో..." అని భయంతో హాహాకారాలు చేయటమేగాని, తెగించి ముందుకు రాలేకపోయారు చుట్టుపట్ల గోడలచాటున తలలు దాచుకుని వున్న పౌరులు.

బిడ్డడి రోదన ధ్వని వినిపించి వాకిటిలోకి పరిగెత్తుకు వచ్చింది మరిడయ్య భార్య.

పిల్లవాడిని గుండెలకు అదుముకుని వెనక్కి పరిగెత్తే వ్యవధి ఆమెకు లభించలేదు. దిక్కులు దద్దరిల్లిపోయేటట్లు రంకెవేస్తూ, ఆమెమీదికి లంఘించింది ఆ మహావృషభం.

"అయిపోయారు.... మరిడయ్య భార్య, బిడ్డ యిద్దరూ దానికి బలి అయిపోయారు" గగ్గోలుగా అరిచారు గోడలచాటున వున్న జనం.

ఆ అరుపులు తన క్రోధాన్ని మరింత ఎక్కువచేస్తూ వుండగా, తలవంచింది వృషభం. తల్లీ బిడ్డలను కొమ్ములతో పొడిచి, గాలిలోకి ఎగురవేయటానికి ప్రయత్నించింది.

ఆ పైన ఆ దృశ్యాన్ని చూడలేకపోయాడు గ్రామస్థులందరితో పాటు తను కూడా ఒక ఇంటిచాటుకు చేరిన శ్రీధరుడు.

"వద్దు... ముందుకుపోయి నీ ప్రాణాలను పోగొట్టుకోవద్దు..." ఆందోళన నిండిన కంఠంతో హెచ్చరిస్తూ, వెనక్కి లాగబోయిన యిద్దరు స్నేహితులను బలవంతాన వదిలించుకుని సుడిగాలిలా వీధిలోకి వచ్చేశాడు.

"తప్పుకో తల్లీ... పక్కకు తప్పుకో" అని మరిడయ్య భార్యను హెచ్చరిస్తూ, పిడికిళ్ళు బిగించి ఆ మహావృషభం శిరస్సుమీద బలంగా మోదాడు.

సుతిమెత్తని శరీరాలకు బదులుగా, ఇనుపముక్కలవంటి చేతులు తన తలకు తగలటమే కాకుండా, కనులు బైర్లు కమ్మేటంతటి బాధకూడా కలగటంతో తత్తరపడి ఒక అడుగు వెనక్కి వేసిందా వృషభం.

మరిడయ్య ఇంటిముందు అగుపించిన ఒక కట్టె పేడును చేతుల్లోకి తీసుకుని, పూనకం వచ్చినట్లు విరుచుకుపడ్డాడు శ్రీధరుడు.

మొదటి దెబ్బకే తీవ్రంగా గాయపడిందా వృషభం. రెండవదెబ్బకు సగానికి సగం విరిగి వీధిలో పడిపోయింది ఒక కొమ్ము.

జమిలిపాములు బుసపెట్టినట్లు వికృత ధ్వనులు చేస్తూ తనమీదికి దుమికే అవకాశాన్ని ఆ జంతువుకు యివ్వలేదు శ్రీధరుడు.

దెబ్బమీద దెబ్బగా మరో నాలుగ దెబ్బల్ని వేసి, కుడికాలిని విరిచేశాడు. పదునైన బరిసె మాదిరి కట్టెపేడును గాలిలోకి ఎత్తి దాని కనులమీద పొడవబోతుండగా, పరుగు పరుగున వచ్చి అతన్ని అడ్డుకున్నాడు అతని స్నేహితుడు.

వడగళ్ల వానమాదిరి ఒంటిమీద పడిన దెబ్బలకు పూర్తిగా బెదిరిపోయింది పెద్దిరెడ్డి వృషభం.

విరిగిపోయిన కాలును ఎగరేసుకుంటూ వెనుతిరిగి,వచ్చిన దారినే పారిపోయింది.

"లింగాపురం వసంతోత్సవాల్లో తనకు ఎంతో పేరుప్రతిష్టల్ని తెచ్చిపెడుతున్న తన వృషభాన్ని కొట్టినందుకు పగపడతాడు మన తిరుమలయ్య. నీ అంతుచూసి తీరతాడు..." ఆందోళన నిండిన కంఠంతో తనను హెచ్చరించ బోయిన స్నేహితుడ్ని చూసి చిరునవ్వు నవ్వాడు శ్రీధరుడు.

"పేరుప్రతిష్టల్ని తెచ్చిపెట్టే వస్తువుల్నిగానీ, జంతువుల్ని గానీ తగు జాగ్రత్తలో వుంచి కాపాడుకోవాలి. పరాయివారి ప్రాణాలకు కీడును కలిగించే విధంగా వూరిమీదికి పంపకం చేయకూడదు.

అదృష్టం బాగుండబట్టి వట్టిచేతులతో కొట్టిన దెబ్బకు ఒక అడుగు వెనక్కి వేసిందది. అలాకాకుండా ముందుకే వచ్చివుంటే ఏమై వుండేది?" అని అడుగుతూ వెనుదిరగబోతుండగా, మరోసారి వీధిలోకి వచ్చింది మరిడయ్య భార్య.

చేతుల్లో వున్న బిడ్డడిని అతని పాదాలదగ్గర కూర్చుండబెట్టి, అమాంతంగా అతని పాదాలను స్పృశించబోయింది.

"నాకంటె పెద్దదానివి...నా పాదాలకు నువ్వు నమస్కరించటమేమిటమ్మా?" అంటూ వెనకడుగు వేశాడు శ్రీధరుడు.

"నీకంటే, నాకంటె పెద్దవాళ్ళు చాలా మంది చూశారు నన్ను, నా బిడ్డడని. ముందుకు వచ్చే ధైర్యం ఒక్కరికి కూడా లేకపోయింది. ధైర్యవంతులకు నమస్కరించటంలో తప్పు ఏముంది?" కన్నీటితో మలినమైన ముఖాన్ని పమిటచెంగుతో అద్దుకుంటూ ప్రశ్నించింది మరిడయ్య భార్య.

పాదాల దగ్గిరే వున్న బిడ్డడిని చేతుల్లోకి తీసుకున్నాడు శ్రీధరుడు. "మరిడయ్యను మించిన పనివాడుగా తయారవ్వాలి వీడు..." అంటూ బుగ్గల్ని ముద్దాడి ఆమెకు అందించాడు.

ఇళ్ళచాటునా, గోడలచాటునా తలదాచుకున్న గ్రామస్థులందరూ వీధిలోకి వచ్చి అతని సాహసాన్ని మెచ్చుకోవటం మొదలు పెట్టారు.

అదే సమయంలో పాతికమంది పాలెకాపులు తనవెనుక నడుస్తుండగా ధనదుపుర రాజ్యాధిపతి స్వయంగా యిచ్చిన రాజదండాన్ని చేతబట్టుకుని ఆ వీధిలోకి వచ్చాడు పెద్దరెడ్డి తిరుమలయ్య.

"వేయి బంగారు నాణేల విలువచేసే నా వృషభాన్ని హింసించి, గానుగ ఎద్దుగా కూడా పనికిరానివిధంగా మార్చిందెవరు??" రచ్చబండ ముందు నిలబడి అధికారం తొణికిసలాడుతున్న కంఠంతో అడిగాడు.

"ఇక్కడ జరిగింది ఏమిటో తెలుసుకోకుండా మీరు ఆగ్రహించకూడదు. అసలు మీ వృషభం..." అంటూ సర్దిచెప్పే ప్రయత్నం చేయబోయిన యిద్దరు పెద్దమనుషులవంక కోరగా చూసి నోళ్ళుమూసుకోమని సైగ చేశాడతను.

అవసరం అయితే రాజధానికి కబురుపంపి రాజభటులను పిలిపించుకోగల అతని అధికారానికి భయపడి తలల్ని వంచుకున్నారా పెద్దమనుషులు.

"నా వృషభాన్ని హింసించింది ఎవరని అడిగితే మట్టిబొమ్మల మాదిరి నిలబడిపోతారేమిటి? ఎవరు?" ఖంగుమంటున్న కంఠంతో మరోసారి అక్కడి వారందర్నీ ప్రశ్నించాడు తిరుమలయ్య.

చేతుల్ని పట్టుకుని వెనక్కి వెనక్కి లాగుతున్న స్నేహితుల్ని వారించి, నిబ్బరంగా రెండు అడుగులు ముందుకు వేశాడు శ్రీధరుడు.

"ఆ పని చేసింది నేనే... ఆఖరిక్షణంలో వెనక్కి పారిపోయింది. పారిపోక పోయినట్లయితే రెండవపాదాన్ని కూడా నుగ్గునుగ్గు చేసి వుండేవాడిని" నిఠారుగా నిలబడి నిర్భయంగా సమాధానం యిచ్చాడు.

చేతిలో వున్న రాజదండాన్ని వూపి, తన వెనుకనున్న పాలెకాపుల్ని అతని మీదికి ఉసికొల్పుతాడని వూహించారు గ్రామస్థులందరూ. తన వృషభానికి పట్టిన గతినే అతనికి కూడా పట్టిస్తాడని భావించారు. వాళ్ళు వూహించని విధంగా రాజదండాన్ని వూపలేదు తిరుమలయ్య. దాన్ని అతి జాగ్రత్తగా ఒక సేవకుడికి అందించి, శ్రీధరుడిని ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు.

"మదమెక్కిన ఏనుగులా గ్రామంమీదపడి నా పరువు ప్రతిష్టల్ని మట్టిలో కలిపేస్తున్న ఆ మొండివృషభానికి తగిన శాస్తి చేశావు. నా పాలెకాపులందరూ కలిసి కూడా ఆపలేని ఆ పొగరుబోతును ఒంటిచేత్తో నిలబెట్టగలగటం నిజంగా చాలా గొప్ప విషయం" అంటూ సేవకుడికి అందించిన రాజదండాన్ని తిరిగి తీసుకుని గాలిలో వూపాడు.

"పడిపోయిన గోడల్ని నా ధనంతో తిరిగి కట్టిస్తాను. విరిగిపోయిన శకటానికి బదులుగా నా పశువుల శాలలో వున్న కొత్త శకటాన్ని పంపిస్తాను.

చెల్లాచెదురైన గడ్డివామిని యధాప్రకారం నిలబెట్టిస్తాను. జరిగిపోయిన దురంతాన్ని మీరెవ్వరూ మనసులో వుంచుకోవద్దు" అంటూ తను చేయబోయే పనుల్నిగురించి తెలియచేశాడు.

పెద్దగా చప్పట్లు కొట్టి తమ ఆనందాన్ని వ్యక్తంచేశారు అక్కడ వున్న గ్రామస్థులు అందరూ.

వృషభాన్ని చూసి బెదిరిపోయిన మరిడయ్య కుటుంబాన్ని పరామర్శించడం కోసం ముందుకు కదిలాడు తిరుమలయ్య.

"విచిత్రంగా వున్నది ఈ రోజున యితని ప్రవర్తన. ఆగ్రహావేశాలతో రగులుకుపోతూ వుండాల్సిన మనిషి ఆప్యాయతను ఒలకబోయటం నాకు అర్థం కావటంలేదు" అనుమానం నిండిన కంఠంతో అన్నాడు శ్రీధరుడి స్నేహితుల్లో ఒకతను.

"ఇప్పటివరకూ వంశపారంపర్యంగా వస్తున్న పెద్దరెడ్డి పదవిని, ఇకముందు గ్రామస్థులందరికీ అనుకూలుడైన వ్యక్తికి కట్టబెడతారని ఒక నీలివార్త ప్రచారంలోకి వచ్చింది. అందుకని అహంకారాన్ని ప్రదర్శించి అందరినీ బెదరగొడితే వున్న పదవి వూడిపోతుందని భయపడుతున్నాడు" తన అభిప్రాయాన్ని వెంటనే తెలియచేశాడు మరొక స్నేహితుడు.

"ఇంత వరకూ చేసిన సాహసాలు చాలుగాని, ఇక ఇళ్ళకు వెళ్ళిపొండి. సందెచీకట్లు కమ్ముకునే వేళల్లో వీథుల్లో తిరగటం మంచిదికాదు" వున్నట్టుండి

వీధిలోకి వచ్చిన ఒక వృద్ధురాలు కఠినస్వరంతో హెచ్చరించటంతో రచ్చబండ దగ్గర్నించి ఇవతలికి వచ్చారు అందరూ.

ఎవరిదారిన వారు వెళ్లిపోదామని అనుకుంటుండగా, వారి దృష్టిని ఆకర్షించింది ఒక టముకు.

చీకటి పడకముందే అందరికీ తెలియచేయాలన్న ఉద్దేశంతో పడుతూ లేస్తూ ప్రక్కగ్రామం నుంచి పరిగెత్తుకు వచ్చాడు ఆ టముకు వేసే వ్యక్తి.

"సకాలంలో వర్షాలు కురిసి మన పంటచేలల్లో బంగారం పండాలనే కోరికతో మా గ్రామపు పెద్దరెడ్డి ఈ రోజు తోలుబొమ్మలాటను ఏర్పాటు చేయించాడు. వర్షాలను కురిపించే మహాభారత కథలోని విరాటపర్వాన్ని మీరందరూ వచ్చి చూడండి" రచ్చబండ దగ్గిరికి చేరుకోకముందే పెద్దకంఠంతో గ్రామంలోని వారందరికీ వినిపించేటట్లు తెలియజేశాడు.

"మహాభారత గాథను విని చాలాకాలం అయింది. ఇప్పుడు ఇళ్ళదగ్గిర మనం చేయవలసిన పనులేవీ లేవు కాబట్టి, అందరమూ కలిసి ఆ బొమ్మలాట దగ్గిరకి పోయివస్తే ఎలా వుంటుంది?" తిరుమలయ్య ప్రవర్తనకు తనకు తోచిన కారణాన్ని చెప్పి అందరినీ నవ్వించిన స్నేహితుడు ఉత్సాహంగా అనటంతో వెంటనే తలవూపాడు శ్రీధరుడు.

"భోజనాలు ముగించి గంగానమ్మ గుడిదగ్గిరికి వచ్చేయండి. ఆడుతూ పాడుతూ అర్ధఘడియలో వెళ్లిపోవచ్చు" అంటూ తన ఇంటివైపు మరలాడు.

మిగిలినవారు కూడా అవతలికి పోయినవెంటనే ఒక ఇంటి చాటునుంచి ఇవతలకు వచ్చాడు తిరుమలయ్య పాలెకాపుల్లో ఒకతను.

పరుగులాంటి నడకతో తన యజమానిని వెతుక్కుంటూ బయలుదేరాడు. చేనేతపని చేసుకుని బ్రతికే మరిడయ్య యింటికి పాతిక ధనువుల దూరంలో అగుపించాడు అతనికి పెద్దిరెడ్డి తిరుమలయ్య.

"మన వృషభాన్ని ఎందుకూ పనికిరాకుండా పాడుచేసిన ఆ ఆకతాయి శ్రీధరుడిని మీరు కౌగించుకోవటం, అందరిముందు ఆకాశానికి ఎత్తి మాట్లాడటం నాకు నచ్చలేదయ్యా. మీకు కోపం వచ్చినాసరే, నా మనసులోని మాటను బయట పెట్టకుండా వుండలేకపోతున్నాను..." తలకు చుట్టుకుని వున్న తలపాగాను తీసి చేతులతో పట్టుకుంటూ వినయంగా విన్నవించు కున్నాడు.

ఆ మాటల్ని వినికూడా విననట్లే అడుగులువేసి, అక్కడికి సమీపంలోనే వున్న తన భవంతిని చేరుకున్నాడు పెద్దిరెడ్డి తిరుమలయ్య.

తను వీధిలో వుండగానే సేవకులు సిద్ధంచేసి వుంచిన పట్టెమంచంమీద కూర్చుంటూ గాఢంగా నిట్టూర్చాడు.

"మీరు ఒప్పుకుంటే ఆ ఆకతాయి తల తీసేస్తామయ్యా...మనకు జరిగిన అవమానానికి ప్రతీకారం చేసేస్తాం" పట్టినపట్టు వదలకుండా మరోసారి అన్నాడు అతని పాలెకావు.

"సాముగరడీల్లో సాటిలేని మేటిగా పేరు తెచ్చుకున్న శ్రీధరుడు మీకు తేలికగా లొంగుతాడా? తల తీయటానికి వచ్చిన మిమ్మల్ని చూసి భయంతో వణికిపోతూ తన తలను మీకు అప్పగిస్తాడా?" వున్నట్టుండి ముందుకు వంగి అతని ముఖంలోకి చూస్తూ అడిగాడు తిరుమలయ్య.

అప్పుడు, అతనామాట అన్నప్పుడు చెప్పాడు ఆ పాలెకాపు రచ్చబండదగ్గిర తాను వినవచ్చిన సంభాషణను.

"తోలుబొమ్మలాట చూడటానికి స్నేహితులతో కలిసి ప్రక్కగ్రామానికి ప్రయాణం అవుతున్నాడు. అదును చూసుకుని వేటు వేద్దాం" అనికూడా అన్నాడు.

"అతని స్నేహితుల్లో ఎవరైనా మిమ్మల్ని గుర్తుపట్టి గ్రామంలో అందరికీ చెపితే ఏం జరుగుతుందో ఆలోచించావా?" వెంటనే అడిగాడు తిరుమలయ్య.

చన్నీళ్ళు చిలకరించినట్లయింది ఆ పాలెకాపు ఉత్సాహంమీద.

ఆ మాటల్ని విన్న మరుక్షణం అతని కనులముందు మెదిలాడు అపర భీముడిలాంటి శ్రీధరుడి తండ్రి వెంకటనాయకుడు. పెద్దరెడ్డి పదవిని అడ్డు పెట్టుకుని గ్రామాన్ని తన గుప్పెట్లోకి తెచ్చుకోవటంకోసం తిరుమలయ్య చేసే ప్రయత్నాలను అడ్డుకోగల వ్యక్తి అతనొక్కడే.

గ్రామస్థులందరి ముందు శ్రీధరుడిని తన యజమాని ఆ సమయంలో ఎందుకలా మెచ్చుకున్నాడో అప్పుడర్థమైంది ఆ పాలెకాపుకు.

"అయితే మనకు జరిగిన అవమానానికి ప్రతీకారం చేయటం సాధ్యపడదని అంటారా? మమ్మల్ని చూసి గ్రామస్థులందరూ ఎగతాళి చేస్తుంటే తలలు వంచుకోక తప్పదంటారా?" అడగలేక అడగలేక అడుగుతున్నట్లు అతి నెమ్మదిగా ప్రశ్నించాడు.

ఆ మాటల్ని ఆలకించేసరికి అదోరకమైన కాంతితో మిలమిల మెరిశాయి తిరుమలయ్య కనులు.

"అవమానం జరిగిందని ఆత్రుతపడితే మరిన్ని ఇబ్బందులు ఎదురుపడటం తప్ప మనపని సానుకూలపడదు. అదను చూసి వేద్దాం ఒకే ఒక వేటు..." అంటూ వుండగానే అతని మనసులో మెదిలింది ఒక ఆలోచన.

మల్లయుద్ధానికి సిద్ధపడే జమాజెట్టీ మాదిరి తొడను చరుస్తూ ఛివాలున మంచంమీది నుంచి లేచి నిలబడ్డాడు తిరుమలయ్య.

* * *

సన్నపాటి నూలువస్త్రాన్ని తెరమాదిరిగా బిగియగట్టి, వెలుతురు కోసం భగభగలాడుతున్న చమురు కాగడాలను ఆ తెరవెనుక నిలబెట్టారు తోలు బొమ్మలాట ప్రదర్శకులు. కంచుకంఠలతో పదివూళ్ళకు వినబడేలా పాటలు పాడుతూ విరాటపర్వగాథను హృదయరంజకంగా చూపిస్తున్నారు.

అర్ధరాత్రి దాటిపోతున్న సమయంలో విపరీతమైన దాహం వేసింది శ్రీధరుడికి. తలల్ని ప్రక్కలకు తిప్పకుండా చూస్తున్న స్నేహితుల్ని చెడగొట్టడం ఇష్టంలేక ఒంటరిగానే యివతలికి వచ్చాడతను గుంపుగా కూర్చున్న గ్రామస్థుల మధ్యలోంచి.

రచ్చబండకు కాస్తంత దూరంగా ఒక చెక్కబల్లను వేయించి, దానిమీద పెట్టించాడు ఆ గ్రామపు పెద్దరెడ్డి పెద్దగంగాళాన్ని. నిండా నీరు పోయించి త్రాగేందుకు నాలుగు మట్టి ముంతల్ని సిద్ధం చేయించాడు.

అక్కడికి పోయిన శ్రీధరుడి దగ్గిరికి ఆదరాబాదరాగా పరిగెత్తుకు వచ్చాడు ఒక ఆగంతకుడు.

అంతకుముందు ఎన్నడూ ఆ వ్యక్తిని చూసి వుండకపోవడం వల్ల, నొసలు విరుస్తూ ప్రశ్నార్థకంగా ఎగురవేశాడు శ్రీధరుడు.

"వెంకటనాయకులు కుమారుడు మీరేనా అయ్యా? శ్రీధరులవారంటే తమరేనా?" వినయవిధేయతలను ప్రదర్శిస్తూ ప్రశ్నించాడు ఆ ఆగంతకుడు.

మట్టిముంతను అందుకుని గంగాళంలో ముంచబోతున్నాడు శ్రీధరుడు. ఆ ప్రయత్నాన్ని వెంటనే విరమించుకుంటూ తలవూపాడు.

"మీరు వెంటనే నాతో రావాలయ్యా... మీ అమ్మగారిని ఏదో పురుగు ముట్టుకుందిట. లింగాపురం తీసుకుపోయి మంత్రం వేయించాలిట" ఎగదన్నుకు వస్తున్న ఆందోళనను బలవంతాన అదిమిపెట్టుకుంటూ తనువచ్చిన పనిని తెలియజేశాడు ఆ ఆగంతకుడు.

చేతిలో వున్న ముంతను చెక్కబల్లమీద పెట్టి, బొమ్మలాటను చూడటంలో మునిగిపోయి వున్న తన స్నేహితులను పిలవబోయాడు శ్రీధరుడు.

వెంటనే వారించాడతన్ని ఆ ఆగంతకుడు.

"మీ పక్కింటివాళ్ళ అశ్వాన్ని తీసుకువచ్చాను నేను. గ్రామం బయట మర్రిచెట్టుక్రింద వదిలివచ్చాను. ముందు మీరు దానిమీద ఇంటికి బయలుదేరండి. మీ స్నేహితులకు చెప్పి వెంటబెట్టుకు వస్తాను" చేయిపట్టుకుని లాగుతూ హెచ్చరించాడు.

రెండో ఆలోచన చేయలేదు శ్రీధరుడు. వింటినుంచి వెలువడిన బాణంలా అటునుంచి అటే గ్రామం బయట వుండే మర్రిచెట్టువైపు పరుగుతీశాడు.

ఆగంతకుడు చెప్పినట్లుగానే అక్కడ అగుపించిందతనికి ఒక అశ్వం. అతన్ని చూడగానే గిట్టలతో నేలను గీరుతూ చిన్నగా సకిలించింది.

మర్రిచెట్టు ఊడలకు కట్టివున్న కళ్ళేన్ని వూడదీసి ఛెంగున అధివసించాడు శ్రీధరుడు. మడమలతో ప్రక్కలను నొక్కి తన గ్రామంవైపు పరుగు తీయించాడు. గోవిందపురం ఇంకో యోజనదూరంలో వున్నదనగా వున్నట్లుండి ఆగిపోయిందా అశ్వం.

తల్లి ఆరోగ్యానికి సంబంధించిన ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరౌతూ అన్యమనస్కంగా వున్న శ్రీధరుడు వులిక్కిపడి ప్రస్తుతంలోకి వచ్చేసరికి అగుపించనే అగుపించారు ఆరుగురు దృఢకాయులు.

చేవతేరిన తుమ్మమొద్దుల మాదిరి కనిపిస్తున్నాయి వారి శరీరాలు. తలమీద దెబ్బలు పడకుండా దట్టమైన తలపాగాలు ధరించి వున్నారు వాళ్ళు.

ఆరుమూరల పొడుగుండే బాణాకర్రలను పట్టుకుని బ్రహ్మారాక్షసుల మాదిరి అతన్ని కమ్ముకున్నారు.

తత్తరపాటుతో చిందులు తొక్కనారంభించిన అశ్వంమీదినించి దూకి, ఎడమచేతితో ఒక బాణాకర్రను పట్టుకున్నాడు శ్రీధరుడు.

"వేసేయండి...ఒకే ఒక వేటుతో తలను పగులకొట్టేయండి" ఖంగుమంటున్న కంఠాలతో హెచ్చరించుకుంటూ, ఒకేసారి అతన్ని పడగొట్టటానికి ప్రయత్నం చేశారు ఆ దృఢకాయులు.

తనతల్లికి ఆపద సంభవించిందనే మాట వట్టి అభూతకల్పన అని అర్థమైంది శ్రీధరుడికి.

తనను మట్టుబెట్టటం కోసమే అటువంటి మాటను సృష్టించి అక్కడికి రప్పించారు. స్నేహితులను పిలువకుండా అడ్డుకున్నారు.

పట్టరాని కోపంతో పళ్ళుబిగపట్టి వారిని ఎదిరించాడు శ్రీధరుడు. భుజంమీద పడిన రెండుదెబ్బల్ని లక్ష్యపెట్టకుండా, ఒక దృఢకాయుడి చేతిలోనుంచి బాణాకర్రను వశపరచుకున్నాడు. కంటికి కనిపించనంత లాఘవంగా తిప్పుతూ రెండేరెండు క్షణాల్లో ఇద్దరిని గాయపరిచాడు. క్రిందపడి

గిలగిలా కొట్టుకుంటున్న తమ సహచరులను చూసేసరికి రెట్టింపు అయింది మిగిలినవారి పట్టుదల.

"కొట్టండి... తల బ్రద్దలు కొట్టండి..." అని అరుస్తూ ఛెంగున గాలిలోకి ఎగిరారు వారిలో యిద్దరు.

గాలిలో వుండగానే వారిద్దరి పాదాలను విరగగొట్టినంత పనిచేశాడు శ్రీధరుడు.

బాధను భరించలేక వారు అరిచిన అరుపుల్ని లక్ష్యపెట్టకుండా మిగిలిన వారిమీదికి లంఘించాడు.

ఎంతోసేపు కొనసాగలేదా పోరాటం. పదే పదిక్షణాల్లో పూర్తి అయిపోయింది. అతని బాణాకర్ర దెబ్బలకు ముఖం తీవ్రంగా గాయపడటంతో దూరంగా పారిపోయాడు ఒక దృఢకాయుడు. ప్రక్కటెముకలు విరిగిపోయినట్లు దారుణమైన ధ్వనుల్ని వెలువరిస్తూ చీకట్లలో కలిసిపోయాడు ఆఖరివ్యక్తి.

తాము తలపెట్టిన పని విజయవంతం కాకపోగా తమ ప్రాణాలకే ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడబోతున్నదని అర్థం అయింది అందరికీ. తగిలిన దెబ్బల్ని లక్ష్యపెట్టకుండా క్రిందినుంచి లేచి దూరంగా పరుగుతీశారు అంతకుముందు గాయపడిన వారందరూ.

మామూలు పరిస్థితుల్లో వారిని పారిపోనిచ్చి వుండేవాడు శ్రీధరుడు. బాణాకర్రను నేలకేసి అదిమి, తొడ చరుస్తూ వారి పిరికితనాన్ని పరిహసించి వుండేవాడు.

తల్లి పేరుచెప్పి తనను మోసం చేయచూశారన్న కక్ష అతన్ని నిలువనీయ లేదు ఇప్పుడు.

"ఆగండిరా... అక్కడే ఆగండి... అడుగు ముందుకు వేశారంటే మీ అందరి ప్రాణాల్ని బలిపుచ్చుకు తీరతాను" కరుకు కంఠంతో హెచ్చరిస్తూ, వారిని వెన్నంటాడు శ్రీధరుడు.

మరింతగా భయపడిపోయారా దృఢకాయులు. భయం తమ పాదాలకు నూతనశక్తిని ప్రసాదించినట్లు రెట్టించిన వేగంతో ఆ ప్రదేశాన్ని వదిలిపెట్టే ప్రయత్నం చేశారు.

కుడిచేతిలో వున్న బాణాకర్రను ఎడమచేతిలోకి మార్చుకుని బరిసెను విసిరినట్లుగా గాలిలోకి బలంగా ఎగురవేశాడు శ్రీధరుడు.

బరిసె మాదిరిగానే సూటిగా పోయి, అందరికంటే ఆఖర్లో వున్న దృఢకాయుడి పిక్కలకు తగిలిందది.

ఎంత ప్రయత్నించినా క్రిందపడకుండా వుండలేకపోయాడు.ముఖం పగిలే దెబ్బ తగలడంతో కదలిక లేకుండా నేలను కౌగలించుకున్నాడు.

పది అంగల్లో అతన్ని సమీపించి భుజాల్ని ఎడమపాదంతో గట్టిగా అదిమాడు శ్రీధరుడు.

ఆ వ్యక్తికి సమీపంలోనే పడివున్న బాణాకర్రను అందుకుని మెడమీద బలంగా పొడిచాడు.

"బుద్ధి గడ్డితిని మీమీదికి వచ్చాను. వదిలిపెట్టేయండయ్యా... మీ పాదాలు పట్టుకుంటాను. నన్ను చంపకండి సామీ" తల ఎత్తి అతనివంక చూసే సావకాశం లేకపోయినా, జాలి కలిగించే కంఠంతో దీనంగా ప్రార్ధించాడు ఆ వ్యక్తి.

చన్నీళ్ళు చిలకరించినట్లు చల్లారిపోయింది శ్రీధరుడి కోసం.

అతని భుజాల్ని అదుముతున్న ఎడమపాదాన్ని వెనక్కి తీసుకుంటూ అతన్ని లేపి నిలబడమని బాణాకర్రతో సూచించాడు. ముఖంమీదికి జారిపోయిన తలపాగాను వూడతీసి చేతుల్లో పెట్టుకుంటూ ఎంతో వినయంగా లేచి నిలుచున్నాడా వ్యక్తి.

"ఇంతకుముందు ఎన్నడూ నిన్ను చూడలేదు నేను. బాణాకర్రలతో దాడిచేసి ప్రాణాలు తీసుకోనాల్సినంత పగ ఏదీ మీకు నాకు వున్నట్లు కూడా నాకు తెలియదు..." నడుము మీద చేయివేసుకుంటూ అన్నాడు శ్రీధరుడు.

అంత చీకటిలోనూ ఆ వ్యక్తి ముఖం తెల్లగా పాలిపోవడం అగుపించి అతని ఆశ్చర్యాన్ని రెట్టింపు చేసింది.

"ఎవరు నువ్వు? ఎందుకు నా మీద దాడిచేశారు మీరు?" ఎడమచేతిలోని బాణాకర్రను పైకెత్తి సిద్ధంగా పట్టుకుంటూ వెంటనే అడిగాడు.

పారిపోవటం మంచిదేమోనన్న ఆలోచన వచ్చినట్లు కనుచివరల నుంచి చుట్టూ చూశాడు ఆ వ్యక్తి.

ఆ ఆలోచనను కార్యరూపంలో పెట్టే అవకాశం అతనికి లభించలేదు.

"నా ప్రశ్నకు సమాధానం ఇవ్వకపోతే నువ్వు ఇక్కడినుంచి ఒక్క అడుగు కూకడా వేయలేవు...

నీ నడుములు విరిచేసి గ్రామంలోకి తీసుకుపోతాను. రచ్చబండ దగ్గిర నిలబెట్టి అందరినీ పిలుస్తాను" బాణాకర్రతో అతని గుండెలను తాకుతూ హెచ్చరించాడు శ్రీధరుడు,.

మరింతగా పాలిపోయింది ఆ వ్యక్తి వదనం. ఎంతో దూరంనుంచి పరిగెత్తుకు వచ్చినట్లు చెమటలతో తడిసిపోయింది అతని శరీరం.

"మీ మీద దాడి చేసినందుకు మాకు పాతిక బంగారు నాణేలు బహుమతిగా యిస్తామని వాగ్ధానం చేశారయ్యా... పదిరోజులకు సరిపడే ఆహారపదార్థాలను కూడా అందిస్తామని ఆశచూపారు..." తడబడుతున్న కంఠంతో అస్పష్టంగా అన్నాడతను.

"ఎవరు వాళ్ళు? ఎక్కడ వున్నారు?" కనుబొమల్ని ముడివేస్తూ వెంటనే అడిగాడు శ్రీధరుడు.

"వాళ్ల పేర్లు ఏమిటో నాకు తెలియవు సామీ... పని పూర్తిచేసిన తర్వాత గంగానమ్మగుడి దగ్గిరికి రమ్మని మాత్రం చెప్పారు."

పోరాటం ప్రారంభం కాగానే బాణాకర్రల మ్రోతలకు బెదిరి అక్కడినుండి దూరంగా పారిపోయింది శ్రీధరుడు ఎక్కివచ్చిన అశ్వం. దాన్ని వెదికి పట్టుకునే ప్రయత్నం చేయలేదతను.

"గంగానమ్మ గుడి దగ్గిరికి పోదం మనిద్దరం. అక్కడ మీకోసం ఎదురు చూస్తూ వుండేవారిని నాకు చూపించు" అంటూ అతని చేతిని జాచి అతని గుండెలమీద పిడికిలితో ఒకపోటు పొడిచాడు.

రెండు మణుగుల బరువు వుండే కొండరాయి ఒకటి హఠాత్తుగా గుండెలకు తగిలినట్లు వెర్రిగా అరిచి వెనక్కి తూలాడా వ్యక్తి.

"చూపిస్తాను సామీ, తప్పకుండా చూపిస్తా. మాకు ఈ ఖర్మ పట్టించిన ఆ పెద్దమనుషుల్ని చూపిస్తాను... నాతో రండి సామీ..." భయం నిండిన కంఠంతో అంటూ వెనుతిరిగాడు.

అవకాశం దొరికిన వెంటనే అతను చీకట్లోకి పారిపోయి అదృశ్యం అవకుండా జాగ్రత్తలు తీసుకుంటూ అనుసరించాడు శ్రీధరుడు. గంగానమ్మ గుడిని

చేరుకోగానే, కనులు చిట్లిస్తూ ముందుకు చూశాడు. బరువైన కర్రలను పట్టుకుని గుడిముందర భాగంలోని వేపచెట్టు క్రింద కూర్చుని వున్నారు పెద్దిరెడ్డి పాలెకాపులు కొంతమంది.

చీకటి పడగానే కడుపునిండుగా మద్యాన్ని సేవించి నిద్రలు పోతూ వుండాల్సిన వారు, అక్కడ కూర్చుని వుండటానికి కారణం ఏమై వుంటుందిట?

శ్రీధరుడి ఆలోచనలకు సమాధానం లభించకముందే, అతని ముందున్న దృఢకాయుడిని గమనించారు పెద్దిరెడ్డి అనుచరులు.

"ఏమైంది? హతమారిపోయాడా వెంకటనాయకుడి కుమారుడు? ప్రాణాలు పోయాయా?" అని అడుగుతూ చెట్టుక్రిందినుంచి లేచి, ఆ దృఢకాయుని సమీపంలోకి వచ్చారు.

వచ్చిన వెంటనే అగుపించాడు వారికి వెనుకగా నిలబడివున్న శ్రీధరుడు.

అతని చేతిలోని బాణాకర్రను గమనించేసరికి , జరిగిందేమిటో అవగతం అయిపోయింది కాబోలు, గుండెలు జలదరించేలా సింహనాదాలు చేశారు వాళ్ళు.

"ఇంత జరిగిన తర్వాత ఇంకా చూస్తూ నిలబడటం అనవసరం... ఐదుగురం వున్నాం మనం... అతన్ని హతమార్చటం ఒక సమస్య కానేకాదు" అని హెచ్చరించుకుంటూ ముందుకు దూకారు.

ముక్కూ ముఖం తెలియని ఆగంతకుల్ని తనమీదికి పంపకం చేసింది ఎవరో వెంటనే అర్థమైపోయింది శ్రీధరుడికి.

"అందరిముందు ఆప్యాయతను ప్రదర్శించి, ఎవరికీ తెలియకుండా వెన్ను పోటు పొడిపిస్తాడా మీ పెద్దిపెడ్డి? మీరు వచ్చి నా ప్రాణాలు తీస్తారా?" అంటూ చేతిలోని ఆయుధంతో వారిని ఎదుర్కొన్నాడు.

ఎంతో నిశ్శబ్దంగా వున్న ఆ ప్రదేశం కాస్తా బాణాకర్రలతో దద్దరిల్లిపోవటం మొదలు పెట్టింది. రెక్కల్ని తపతపలాడిస్తూ గాలిలోకి ఎగిరిపోసాగాయి వేపచెట్టు మీద విశ్రాంతి తీసుకుంటున్న పక్షులు.

దారుణమైన ఈదురుగాలి వీస్తున్నట్లు భయంకరమైన శబ్దాన్ని వెలువరించటం మొదలు పెట్టింది శ్రీధరుడి చేతిలోని బాణాకర్ర.

అది అంత వేగంగా తిరుగుతున్న సమయంలో అడ్డు వెళ్లినవారి అవయవాలు కత్తిపెట్టి నరికినట్లు ముక్కలు ముక్కలయిపోతాయని తెలుసు పెద్దిరెడ్డి అనుచరులు అందరికీ.

"కొట్టండి... వెనుక నుంచి వేటు వేసేయండి... ఆలస్యం చేయవద్దు" అంటూ ఆపని తనే చేయటానికి ప్రయత్నించాడు వారిలో ఒకతను.

కుడిభుజానికి తగిలింది శ్రీధరుడి కర్ర. భుజపు టెముక విరిగిపోయింది వికృతశబ్దం చేస్తూ.

బాధతో గావురుమని అరుస్తూ వెనక్కి తూలాడు అతను. కాలికి ఒక చిన్న కొండరాయి అడ్డుపడటంతో వెల్లికిలా పడిపోయాడు.

అతను పడిన ప్రదేశంలోనే పాతిపెట్టి వుంది గంగానమ్మ మీది భక్తితో ఎవరో భక్తుడు తయారుచేయించిన ఒక పొన్ను కర్ర.

రెండుమూరల పొడుగున వుండే ఆ కర్ర పైభాగం సూదిమాదిరి చెక్కబడి వున్నది.

బరిసెలా పెద్దిరెడ్డి అనుచరుడి వెన్నులో దిగబడింది అది. క్షణాలమీద అతని ప్రాణాలను బలిపుచ్చుకున్నది.

"చంపేశాడు... వెంకటనాయకుడి కొడుకు మా మనిషి ప్రాణాలు తీసేశాడు" అని అరుస్తూ గ్రామంవైపు పరుగుతీశాడు మిగిలినవారిలో ఒకతను.

"వెంకటనాయకుడి కొడుకు చేయకూడని దారుణాన్ని చేసేశాడు. మా మనిషితోపాటు మమ్మల్ని కూడా చంపటానికి చూస్తున్నాడు. కాపాడండి" అని గావుకేకలు పెడుతూ అతన్ని అనుసరించారు అతని సహచరులు.

ఆ కేకలు విని ఒక్కసారిగా అణిగిపోయింది శ్రీధరుడిని ఆవరించుకుని వున్న ఆవేశం.

మాటలుమార్చి అవతలివారిని ఇరకాటంలో పెట్టటంలో తిరుమలయ్య పాలెకాపుల్ని మించినవారు ఆ చుట్టపట్ల మరెవ్వరూ లేరు.

తాము చేసిన ప్రయత్నాలు విఫలం అయిన వెంటనే వక్రభాష్యాలు మొదలు పెట్టారు వాళ్ళు. తమ సహచరుడిని తను అన్యాయంగా హతమార్చినట్లు అందరినీ నమ్మించే అరుపులు ప్రారంభించారు.

వారి నోళ్ళను మూయించాలంటే తనను అక్కడికి తీసుకువచ్చిన ఆగంతకుడిని వెంటనే గ్రామంలోకి లాక్కుపోవాలి.అందరిముందు నిలబెట్టి అసలు జరిగింది ఏమిటో అతని నోటివెంట చెప్పించాలి.

పొన్ను కర్ర దగ్గిరినుంచి ఇవతలకు వచ్చి ఆ చుట్టుపట్ల వున్న ప్రదేశాలన్నిటినీ గాలించాడు శ్రీధరుడు ఆ ఆగంతకుడి కోసం. పోరాటం ప్రారంభం అయిన మరుక్షణం పాదాలకు బుద్ధి చెప్పినట్లున్నాడు అతను. ఎంత వెతికినా అగుపించలేదు.

అధైర్యపడలేదు శ్రీధరుడు. 'ఈ గొడవ మీతోనే ప్రారంభం అయింది. ముగింపుకూడా మీతోనే జరగాలి...' అని తనలో తాను అనుకుంటూ, ఆగంతకులు అందరూ కలిసి తనను ఎదిరించిన ప్రదేశం దగ్గిరికి పరుగు తీశాడు.

బాణాకర్ర దెబ్బల్ని భరించటం చేతకాక ఆ ప్రదేశంలోనుంచి తలా ఒక ప్రక్కకు పారిపోయారు వాళ్ళు. వారు అనుసరించిన మార్గాలను గుర్తు తెచ్చుకుంటూ రెండు యోజనాల దూరం ముందుకు పోయాడు. తూర్పుదిక్కు తెల్లబడుతున్న సమయంలో ఒక చిట్టడవిని చేరుకున్నాడు.

విపరీతమయిన దాహంతో గొంతుక ఎండిపోతున్నా లక్ష్యపెట్టకుండా, ఆ అడవినంతా గాలించి, అవతలి పక్కన వుండే కొండగుట్టల్ని సమీపించాడు.

ఆ కొండగుట్టలకు అవతలిపక్కనే వుంటుంది వసంతోత్సవాలను అద్భుతంగా నిర్వహించే లింగాపురం. ఆలస్యం చేయకుండా అక్కడికిపోయి ఆ గ్రామస్థుల సహాయాన్ని అర్థిస్తే?

కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటే బాగుంటుందని అనిపిస్తున్నా, అలాగే కొండగుట్టలమీదికి పోయాడతను. సూర్యుడు పడమటిదిశకు మరలిపోతున్న సమయంలో లింగాపురంలో అడుగు పెట్టాడు.

రచ్చబండ దగ్గిర కూర్చునివుండే పెద్దమనుషులకు తన అవసరాన్ని వివరించి, వారి సహాయాన్ని అర్థించడం బాగుంటుందని అటుకేసి మరల బోతుండగా అతని చెవులకు చేరింది ఒక చాటింపు.

చేస్తున్న పనులన్నింటినీ చటుక్కున వదిలేసి, గుంపులు గుంపులుగా వీధిలోకి వచ్చేసిన గ్రామస్థులందరితోపాటు ఆ చాటింపును ఆలకించాడు అతను.

"గోవిందపురి పెద్దరెడ్డి తిరుమలయ్య పేరుమీద వేయబడుతున్న ఈ చాటింపును శ్రద్ధగా వినండి మీరందరూ..." భుజానికి తగిలించుకున్న టముకును చెవులు చిల్లులు పడేటట్లు పెద్దగా మ్రోగిస్తూ, పదివూళ్ళకు వినబడే కంఠంతో చెప్పాడు చాటింపు వేయటానికి వచ్చిన వ్యక్తి.

అతను పెద్దరెడ్డి తిరుమలయ్య దగ్గిర పనిచేసే పాలెకాపుగా గుర్తుపట్టి కించిత్ తత్తరపాటుకు గురి అయ్యాడు శ్రీధరుడు.

"శ్రద్ధగా వినండి.. శ్రద్ధగా వినండి మీరందరూ."

- అని అరుస్తూ తను చెప్పదలుచుకున్న విషయంలోకి వచ్చేశాడు తిరుమలయ్య పాలెకాపు.

"రాత్రి రెండు ఝాములవేళలో మా పెద్దరెడ్డి తిరుమలయ్య పాలెకాపు ఒకతన్ని దారుణంగా చంపి, దూరంగా పారిపోయాడు గోవిందపురి వెంకట నాయుడికి కుమారుడు శ్రీధరుడు. అతన్ని పట్టిచ్చినా, అతని జాడల్ని గురించి తెలియచేసినా బ్రహ్మాండమైన బహుమతి యివ్వబడుతుంది.

న్యాయాన్ని పరిరక్షించటంలో సహాయపడినవారిగా గుర్తించటం జరుగుతుంది. లింగాపురం గ్రామస్థులందరికీ తలవంచి నమస్కరిస్తూ తిరుమలయ్య చేసుకున్న విన్నపం యిదే..."

భుజానికి తగిలించుకున్న టముకును మరోసారి గట్టిగా మ్రోగించి, రచ్చబండ దగ్గిర వదిలిన తన అశ్వాన్ని అధిరోహించాడు ఆ వ్యక్తి. అతివేగంగా మరో గ్రామంవైపు వెళ్లిపోయాడు.

పాదాలమీద వున్న భూమి రెండుగా చీలుతున్న అనుభూతి కలిగి, పక్కనే వున్న ఒక గోడను గట్టిగా పట్టుకున్నాడు శ్రీధరుడు.

పెద్దరెడ్డి అనుచరులు తనమీదికి పంపకం చేసిన ఆగంతకులను పట్టుకోగలిగితే, పాలెకాపు మరణానికి కారణం అందరికీ అర్థం అవుతుందన్న నమ్మకంతో చెట్లవెంటా, పుట్టల వెంటా పరుగులు తీస్తున్నాడతను. ఈ విషయాన్ని తనకు అనుకూలంగా మలుచుకోనే మలుచుకున్నాడు. తిరుమలయ్య. ప్రాణాలు కాపాడుకోవటానికి పారిపోయినట్లుగా ప్రచారం ప్రారంభించనే ప్రారంభించాడు.

వెంటనే వెనక్కి వెళ్ళాలి తను. గంగానమ్మ గుడిదగ్గిర జరిగింది ఏమిటో అందరికీ తెలియచెప్పాలి. ఆలస్యం చేస్తే అనర్థకం వాటిల్లుతుంది. క్షణక్షణానికి ఉధృతమైపోతుంది ఆ అసత్య ప్రచారం.

ఆగంతకుల్ని వెదికే పనిని పక్కన పెట్టేశాడు శ్రీధరుడు. లింగాపురంలో నివసించే తన బంధువు తిక్కయ్యనాయకుడి దగ్గిరికిపోయి, అతని అశ్వాన్ని అడిగి తీసుకుని, తన గ్రామానికి తిరిగిపోవాలని నిర్ణయించుకుంటూ ముందుకు కదిలాడు. మూడు అడుగులు కూడా పూర్తిగా వేయకముందే అతన్ని గమనించారు లింగాపురం గ్రామస్థులు యిద్దరు.

"పెద్దరెడ్డి తిరుమలయ్య చాటింపు వేయించిన వెంకటనాయకుడి కొడుకు... పాలెకాపును హతమార్చి పారిపోయి వచ్చిన హంతకుడు శ్రీధరుడు.." కంచు గంటలవంటి కంఠాలతో బిగ్గరగా అరిచారు.

కలిసికట్టుతనానికి మారుపేరు ఆ లింగాపురం గ్రామస్థులు. ఎందుకు ఏమిటి అనే అనవసరమైన ప్రశ్నలు వేయకుండా ఉసుళ్ళ తెరల మాదిరి వచ్చి శ్రీధరుడిని చుట్టుముట్టారు.

మరో పది క్షణాలపాటు అలాగే నిలబడివుంటే పాలెకాపును చంపినందుకు పెద్దరెడ్డి తిరుమలయ్య వేయబోయే శిక్షను ఆ లింగాపురం గ్రామస్థులే

వేసేస్తారనిపించి ఒక్కసారిగా ఎదురు తిరిగాడతను . ఇనుపముక్కల వంటి అతని బహువుల వేగాన్ని అడ్డుకోవటం చేతకాక గొల్లుమన్నారు గ్రామస్థులు.

"లింగాపురం పౌరులమీద చేతులు వేసినవాడి తల తెగి మట్టిలో పొర్లాడవలసిందే...అందుకోండి మీ ఆయుధాల్ని..." గుండెలు జలదరింటే స్థాయిలో బిగ్గరగా అరుస్తూ తమ ఆయుధాలకోసం ఇళ్ళల్లోకి పరుగులు తీశారు.

తను పొరపాటు చేసినట్లు వెంటనే అవగతమైంది శ్రీధరుడికి. చేసిన పొరపాటును సరిదిద్దుకునే వ్యవధి అతనికి లభించలేదు.

తళతళ మెరుస్తున్న కత్తుల్ని, బలమైన కర్రల్ని, పదునైన బరిశెల్ని పట్టుకుని బిలబిలలాడుతూ వచ్చేశారు గ్రామస్థులు.

ఆ సమయంలో తన గోడు వారి చెవులకు అసలు చేరనే చేరదని గ్రహించి, వచ్చిన దారినే వెనక్కి పరుగుతీశాడు శ్రీధరుడు. కొండగుట్ట మీదికి పోయి, బండరాళ్ళ చాటున తలదాచుకున్నాడు.

చీకట్లు కొండగుట్టలలోకి అడుగుపెట్టేవరకూ గాలించి, మెల్లిగా వెనుతిరిగారు గ్రామస్థులు.

అర్ధఘడియ తరువాత యివతలిపక్కకు చేరుకున్నాడు శ్రీధరుడు.

ముళ్లపొదలతో నిండివున్న చిట్టడవిని అధిగమించిన కొద్దిసేపటికి అతను అనుసరిస్తున్న మర్గంలో ప్రత్యక్షం అయింది ఒక ఆకారం.

పక్కన కనిపించిన ఒక కొండరాయిని అమాంతంగా గాలిలోకి ఎత్తాడు శ్రీధరుడు.

నలుగురు వ్యక్తులు కలిసికట్టుగా ప్రయత్నిస్తే తప్ప పైకి లేవని ఆ కొండరాయి తనమీద పడితే ఏం జరుగుతుందో గ్రహించింది కాబోలు కీచుగా అరిచి వెనక్కి జరిగిందా ఆకారం.

"శత్రువును కాదు శ్రీధరయ్యా... స్నేహితుడినే...నీవల్ల మహోపకారం పొందిన మరిడయ్యని..." అంటూ హెచ్చరించింది.

బిగపట్టి వుంచిన ఊపిరిని తేలికగా బయటికి వదులుతూ చేతుల్లోని బండను కింద పెట్టేశాడు శ్రీధరుడు.

"పెద్దరెడ్డి తిరుమలయ్య దుర్మార్గాన్ని ఎదిరించి నిలబడగలిగిన వాడివని మేము ఎంతగానో సంతోషిస్తున్న సమయంలో ఇలా తల్లకిందులు అయిపోయావేమిటి శ్రీధరయ్యా?" ఆర్తిగా అడుగుతూ, అతన్ని బండమీద కూర్చోబెట్టి, తను కింద కూర్చున్నాడు మరిడయ్య.

గంగానమ్మ గుడిదగ్గిర జరిగింది ఏమిటో పూసగుచ్చినట్లు అతనికి ఎరుక పరిచాడు శ్రీధరుడు.

మొట్టమొదటగా అతన్ని ఎదిరించిన ఆగంతకుల పోలికల్ని వినగానే మిలమిల మెరిశాయి మరిడయ్య కనులు.

"నాలుగైదు రోజులక్రితం మన ఊరిపొలిమేరల్లో విడిదిచేసిన దొమ్మరివాళ్ళే అయివుంటారు వాళ్ళు. సందేహంలేదు. తమ తలలు ఎగిరిపోతాయన్న భయంతో తట్టాబుట్టా సర్దుకుని ఎటో పారిపోయి వుంటారు" అని చెప్పాడు.

ఆగంతకులు ఎదుట లేకపోయినా, వారెవరో అవగతం అయ్యేసరికి గుండెలమీద బరువంతా దిగిపోయినట్లు అనిపించింది శ్రీధరుడికి.

"ఇంటికిపోయి వాళ్ళందరికీ ఈ మాట చెపుదాం... ఎలాగైనా సరే ఆ దుర్మార్గుల్ని వెతికి పట్టుకుందాం" అంటూ బండమీదినుంచి లేవబోతుండగా, అతన్ని వారించాడు మరిడయ్య.

"ఇంటిదగ్గిర పరిస్థితి నువ్వు అనుకున్నంత సరళతరంగా లేదు. తెల్లవారక ముందే రాజభటులకు వార్త అందించి, వారందర్నీ గ్రామంలోకి రప్పించాడు తిరుమలయ్య. ఇంటిలోనుంచి కదలనిస్తే నీకు ఏదైనా సహాయం చేస్తారన్న అనుమానంతో నీ తల్లిదండ్రుల్ని, నీ స్నేహితుల్ని గ్రామందాటి బయటికి పోకూడదని కట్టడి చేశాడు.

దొమ్మరివాళ్ళు దొరికి, నీ పక్షాన సాక్ష్యం చెప్పేలోపుగా నీమీద విచారణ పూర్తి అయిపోతుంది. రచ్చబండ దగ్గరే నిన్ను ఉరి తీయిస్తానని ప్రగల్భాలు పలకుతున్నాడు ఆ దుష్టుడు తిరుమలయ్య" అంటూ తమ గ్రామంలో నెలకొని వున్న పరిస్థితిని అతనికి వివరించాడు.

పెద్దరెడ్డి ప్రయత్నాలకు లింగాపురంలో తాను సృష్టించిన అలజడి వార్త కూడా తోడు అయితే ఎలా వుంటుందో వూహించుకునేసరికి వికలమైపోయింది శ్రీధరుడి మనస్సు. అతని అలజడిని గమనించి సానుభూతిగా భుజం తట్టాడు మరిడయ్య. తన వీపుకు వేలాడుతున్న సంచీని తీసి అందులోని వస్తువుల్ని నేలమీద పెట్టాడు.

"తిండి తిప్పలు లేకుండా ఈ చిట్టడవిలో సంచరిస్తూ వుంటావని అనిపించింది నాకు. అందుకే తగిన ఏర్పాట్లతో బయలుదేరి వచ్చాను" అంటూ ఒక తాబేటికాయను అతనికి అందించాడు.

మర్రి ఆకుల విస్తరిలో భద్రపరచబడిన ఆహారపదార్థాలను చేతిలో పెట్టాడు.

"ఆకలి తీరిన తర్వాత మాట్లాడుకుందాం. ముందు ఆరగించు" అని బలవంతం చేశాడు.

తాబేటికాయలోని చల్లటినీటితో గొంతు తడుపుకుని ఆహారపదార్థాలను భుజించాడు మరిదయ్య.

"నిన్ను చంపటానికి ప్రయత్నించి ఆ పని చేతకాక దూరంగా పారిపోయిన ఆ దొమ్మరివాళ్ళను వెతికి పట్టుకోగలిగినా, తోలుబొమ్మలాట జరుగుతున్న ప్రదేశంలోనుంచి నిన్ను ఇవతలికి తీసుకువచ్చిన వ్యక్తి ఎవరో తెలిసినా, తిరుమలయ్య ప్రయత్నాలను మనం తేలికగా అడ్డుకోవచ్చు. అందుకు కొద్దిపాటి వ్యవధి కావాలి...

తిరుమలయ్యకు తెలియకుండా ఆ పని జరగాలంటే చాలా శ్రమ పడాలి" అంటూ తన దుస్తులలో నుంచి అరవై రెండు బంగారు నాణేలున్న మూటను తీసి అతనిచేతిలో పెట్టాడు.

"తిరుమలయ్య ఆగ్రహం కాస్తంత చల్లారి, తాము స్వేచ్ఛగా గ్రామం బయటికి రాగలిగేటంతవరకూ ఎక్కడైనా తల దాచుకోమని మీ తండ్రిగారు ఇచ్చిన సొమ్ము ఇది. మన రాజధాని నగరం ధనదుపురంలో ఆంజనేయస్వామి ఆలయం పక్కన నా బంధువు నివసిస్తున్నాడు. ఇక్కడి విశేషాలను వివరిస్తూ అతనికి ఒక లేఖ వ్రాశాను.

మీ తండ్రిగారి దగ్గిరినుంచి సరయిన వర్తమానం వచ్చేటంతవరకూ నువ్వు మా బంధువు ఇంట్లో తలదాచుకోవచ్చు" అంటూ దుస్తుల్లోనే వున్న లేఖను కూడా అతని చేతిలో పెట్టాడు.

ఎంత వద్దనుకున్నా చెమ్మగిల్లకుండా వుండలేకపోయాయి శ్రీధరుడి కనులు.

"తిరుమలయ్యకు తెలిస్తే ఏదో ఒక కారణాన్ని చూసి నీ కుటుంబాన్ని వెలివేయిస్తాడు. నామీది కక్షనంతా నీమీద తీర్చుకుంటాడు. తెలిసి తెలిసి ఇంతటి సాహసం చేయటం దేనికి?" అస్పష్టంగా అడిగాడు.

"లేక లేక కలిగిన కొడుకుతోపాటు తిరుమలయ్య వృషభానికి బలి కాబోతున్న నా భార్యను కాపాడినవాడివి నువ్వు. ఇప్పుడు నీమీద పడిన నింద ఆ సంఘటన మూలకంగా ఉద్భవించిందే అని నాకు తెలుసు.

కొద్దిగానైనా నీ ఋణం తీర్చుకోకపోతే నాకు పుట్టగతులుండవు. అందుకే ఎవరికీ అనుమానం రాకుండా వస్త్రాలమూటను వెంటబెట్టుకుని గ్రామంలో నుంచి బయటపడ్డాను.

గంగానమ్మ గుడిదగ్గర మూటను దాచి నీకోసం వెతుకుతున్నాను."

అంటూ ఇంకేదో గుర్తుకు వచ్చినట్లు తల విదిలించి దుస్తుల్లో నుంచి ఒక పిడిబాకును బయటికి తీశాడు.

"రాజరాజనరేంద్రుడి సైన్యంలో దళపతిగా పనిచేసిన మీ తాతగారి ఆయుధం ఇది. దీని ఘనతకు మచ్చరాకుండా చూసుకోమని మీ తండ్రిగారు మరీ మరీ చెప్పారు" అంటూ శ్రీధరుడికి అందించాడు. బాకును దట్టీలో పెట్టుకుంటూ బండమీదినుంచి లేచి అతని పాదాలను తాకాడు శ్రీధరుడు.

"క్షేమంగా వెళ్లి లాభంగా రావాలి నువ్వు. నీ మూలకంగా మాకు, మన గ్రామానికి ఎవరూ ఊహించనంత పేరుప్రతిష్ఠలు కలగాలి. ఇంక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే కదులు. ఆ తిరుమలయ్య అనుచరుల కంట పడకుండా జాగ్రత్తగా రాజధాని నగరాన్ని చేరు..." అంటూ అతన్ని కౌగిలించుకుని సాదరంగా వీడ్కొలిపాడు మరిడయ్య.

చేయని నేరాన్ని నెత్తిన వేసుకుని చేతకానివాడిలా పారిపోతున్న తనకు తన గ్రామానికి పేరుప్రతిష్ఠలు తెచ్చిపెట్టడం ఎలా సాధ్యపడుతుందోనని ఆలోచిస్తూ ఉత్తరదిశగా అడుగులు వేశాడు శ్రీధరుడు.

మరునాడు సూర్యుడు పడమటి దిశలో పడిపోతుండగా అతనికి అగుపించారు కొండప్రాంతంలో కట్టెలు సేకరించటానికి ఏదో గ్రామంలో నుంచి బయలుదేరి వచ్చిన వ్యక్తులు కొంతమంది.

తిరుమలయ్య అనుచరులు ఎవరైనా అటుగా రావటం సంభవిస్తే తన జాడలను గురించి వారికి తెలియటం ఇష్టం లేనందువల్ల తనను గురించిన వివరాలను గోప్యపరిచాడు శ్రీధరుడు.

ధనదుపురానికి అవతలి ప్రక్కగా వుండే చంపానగరాన్ని గురించి వారికి తెలియచెప్పాడు.

"ఇంటివద్ద జరుగుబాటు సరిగ్గా లేనందువల్ల నా మేనమామల దగ్గిరకి పోతున్నాను" దట్టీలోవున్న పిడిబాకును కూడా వారికి కనిపించకుండా దాచుకుంటూ అన్నాడు.

"నీలాపురి ఇక్కడికి దాదాపు ఇరవైక్రోసుల దూరంలో వుంటుంది. అక్కడికి చేరుకునేవరకూ నువ్వు దారిలో ఆగకూడదు. మధ్యలో ఏ గ్రామం కనిపించినా

అటుకేసి వెళ్లగూడదు" తనదగ్గిర మిగిలివున్న రెండు రొట్టెల్ని అతనికి ఇచ్చి, తన సొరకాయ బుర్రలోని నీళ్ళను అతని దోసిటిలో పోస్తూ చెప్పాడు వారిలో ఒకతను.

ఎక్కడా ఆగకుండా ఇంకో ఇరవై క్రోసుల దూరం ప్రయాణం చేయటం తనవల్ల అయ్యేపని కాదని అనిపించింది శ్రీధరుడికి. ఆ మాటను బయట పెట్టకుండా రొట్టెల్ని ఆరగిస్తూ వారితో మరికొద్దిసేపు మాట్లాడాడు.

"నీలాపురి చేరుకునేలోపుగా ఎక్కడయినా ఆగితే వచ్చే నష్టం ఏమిటో నాకు తెలియచేయగలరా?" అంటూ తన అనుమానాల్ని బహిర్గతం చేశాడు.

"చీకటిపడబోతున్న సమయంలో మాట్లాడుకోవాల్సిన మాటలు అవి. నాలుగు కాలాలపాటు క్షేమంగా వుండాలనే కోరిక వున్నట్లయితే మేము చెప్పినట్లు చేయి" ముక్తసరిగా సమాధానం చెప్పి, నడుము ఎత్తున ఎదిగివున్న పొదలమధ్యలో నుంచి తమ దారిన తాము వెళ్లిపోయారా వ్యక్తులు.

వారన్న ఆ మాటల వెనుక దాగుకుని వున్న అర్ధాన్ని గ్రహించటానికి విపరీతమైన ప్రయత్నం చేస్తూ ముందుకు సాగాడు శ్రీధరుడు.

చీకట్లు దట్టం అయిన ఒక ఘడియ తర్వాత చిన్న కుగ్రామాన్ని చేరుకున్నాడు. నడిచి నడిచి అలసిపోయి వున్న తనను చూడగానే గ్రామస్థులు ఆహ్వానిస్తారని, ఆ రాత్రి గడిపేందుకు చోటు చూపిస్తారని అనుకున్నాడతను.

గ్రామంలో అడుగుపెట్టిన తర్వాత ఒక్కళ్ళు కూడా ఇళ్ళల్లోనుంచి బయటికి రాకపోయేసరికి అతన్ని ఆవరించుకున్నది విపరీతమయిన ఆశ్చర్యం.

చీమ చిటుక్కుమన్నా పెద్దగా వినిపించేటంత నిశ్శబ్దంతో నిండివున్నాయి ఇళ్ళు. అన్నీ పాడుబడినట్లు బోసిగా కనిపిస్తున్నాయి.

కట్టెలు కొట్టుకునే వ్యక్తులు చెప్పిన మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తుండగా, గ్రామమధ్యంలో వున్న ఒకే ఒక్క వీధిలో నాలుగుసార్లు అటూ ఇటూ నడిచాడు శ్రీధరుడు. ఒక ఇంటిముందు అగుపించిన నులకమంచాన్ని వీధిమధ్యలోకి లాగి, మేను వాల్చబోతుండగా అతని చెవులకు చేరింది ఆ శబ్దం.

నులకమంచం మీదినుంచి ఛెంగున లేచి, ఆసద్దు వినవచ్చిన ఇంటికేసి పరుగుతీశాడు శ్రీధరుడు. ఓరగా వేసివున్న తలుపుల్ని బలంగా వెనక్కి నెడుతూ, లోపలిభాగంలో కనిపించిన దృశ్యాన్నిచూసి నివ్వెరపోయాడు.

పదిసంవత్సరాల వయసుండే బాలికను చేతుల్లో పొదువుకుని కన్నీరు మున్నీరైపోతున్నది ఒక వృద్ధురాలు.

"తెల్లవారేవరకూ కాస్తంత ఓపికపట్టు తల్లీ... పెదవులు కదిలించి నీ బాధను బయటికి రానీయకు బిడ్డా... సద్దు బయటికి వస్తే క్షణాలమీద గాలిలో కలిసిపోయాయి మన ప్రాణాలు ..." అంటూ తనలో తను కుమిలిపోతున్నది.

"దాహం అవుతున్నది నాయనమ్మా! గొంతు ఎండిపోతున్నది" అస్పష్టమైన మాటలతో ఆమెను వేడుకుంటున్నది.

చేతుల్లో వున్న బిడ్డను చినుగుల చాపమీద పరుండబెట్టి, ఒక మూలగా వున్న మంచినీటి పాత్ర దగ్గిరికి పోయింది వృద్ధురాలు. ఖాళీపాత్ర అది. తలక్రిందులుగా చేసి చూసినా క్రిందపడలేదు ఒక్క బొట్టు కూడా.

"బావిదగ్గిరికి పోయి నీళ్ళు తీసుకువచ్చేలోపల జరగకూడనిది ఏదైనా జరిగిపోతుందని భయంగా వున్నది తల్లీ... వెలుగు వచ్చేదాకా ఓర్చుకోమ్మా... తెల్లవారగానే నువ్వు కోరుకున్నన్ని నీళ్ళు తెచ్చి యిస్తాను..." ఖాళీపాత్రను వదిలి, తన మనవరాలి దగ్గిరికి తిరిగివస్తూ అనునయించింది ఆమె.

ఎందుకుపోయినట్లు అయిన పెదవుల్ని నాలుకతో తడుపుకుంటున్న బాలికను చూసి ఆగలేకపోయాడు శ్రీధరుడు. తన ఆగమనాన్ని వారికి తెలియచేయకుండా గుమ్మంలో నుంచే వెనుదిరిగి, నులకమంచం కనిపించిన ఇంటి దగ్గిరకి వచ్చాడు.

గట్టిగా మూసివున్న ఆ ఇంటితలుపులు, అతని భుజపు తాకిడికి రెండే రెండు క్షణాల్లో పెద్దశబ్దంతో బార్లా తెరుచుకున్నాయి. లోపల వున్న మంచినీటి పాత్రను అందుకుని పరుగులాంటి నడకతో వృద్ధురాలి దగ్గిరికి వచ్చాడతను.

"పడుకో తల్లీ... కళ్లు మూసుకుని నిద్రపో..." అంటూ ఎందుకో తల ఎత్తింది వృద్ధురాలు.

మంచినీటి పాత్రతో ప్రత్యక్షం అయిన శ్రీధరుడిని గమనించేసరికి, భయంతో వెడల్పు అయ్యాయి ఆమె కనులు. అనారోగ్యంతో బాధపడుతున్న బిడ్డ అక్కడ లేకుండా వున్నట్లయితే, వెర్రిగా అరిచి వెనక్కి పడిపోయి వుండేది ఆమె.

తను పడిపోతే తన బిడ్డ అన్యాయమైపోతుందన్న మాట ఆ సమయంలో ఆమెకు విపరీతమైన తెగింపును యిచ్చింది.

"ఎవరు నువ్వు? ఎవరివి?" కీచుగా అడుగుతూ ఛెంగున లేచింది ఆమె చినుగుల చాపమీదనుంచి. ఒక గోడదగ్గిరవున్న కొడవలిని చేతిలోకి తీసుకుని గుమ్మం దగ్గిరికి పరుగెత్తుకు వచ్చింది.

గట్టిగా గాలివీస్తే ఎగిరి అవతల పడిపోయేటట్లున్న ఆమె జీర్ణదేహంలోని అపూర్వశక్తిని చూసి చిన్నగా నవ్వేశాడు శ్రీధరుడు.

"మీకు అపకారం చేయటానికి నేను రాలేదు అవ్వ...నీ మనవరాలి దాహం తీర్చటానికి వచ్చాను..." అంటూ తను తెచ్చిన మంచినీటి పాత్రను ఆమెముందు పెట్టాడు.

కొడవలిని ఎత్తి అతని శిరస్సు మీద మోదబోతూ, ఆఖరిక్షణంలో ఆగిపోయిందా వృద్ధురాలు.

"నువ్వు ఎవరివో నాకు చెప్పలేదు" అనుమానం నిండిన కనులతో చూస్తూ అడిగింది.

కట్టెలు కొట్టుకునే వ్యక్తులకు చెప్పిన మాటల్నే ఆమెకు కూడా వినిపించాడు శ్రీధరుడు. "ఈ రాత్రి గడిపి వెలుగురాగానే వెళ్ళిపోదామని వచ్చాను. గ్రామం ఖాళీగా వుండటం ఏమిటో అర్థం కావటంలేదు" గుమ్మం వద్దే కూర్చుంటూ అన్నాడు.

నిస్త్రాణగా పడివున్న మనవరాలికి మంచినీరు ఇచ్చి, ఆమె నుదుటిమీద అరచేత్తో అద్దుతూ గాఢంగా నిట్టూర్చింది వృద్ధురాలు.

అప్పటికి రెండుమాసాలనుంచీ ఆ గ్రామాన్ని పట్టి పీడిస్తోందిట ఒక యక్షిణీభూతం.

చీకటిపడిన రెండు మూడు ఘడియలకల్లా గ్రామంలో ప్రవేశించి మనిషి కనిపిస్తే మనిషిని, పశువు కనిపిస్తే పశువును పొట్టన పెట్టుకుపోతున్నదిట.

"కత్తులు కర్రలు పట్టుకుని కాపలా నిలబడినా, మంత్రవాది మహ లక్ష్మయ్యను పిలిచి మారణహోమాలు చేయించినా ఫలితం కనిపించలేదు... ప్రాణాలమీద ఆశతో,చీకటిపడకముందే ఇక్కడికి దగ్గర్లో వున్న కొండగుట్టల

మీదికి వెళ్లిపోతున్నారు మా వాళ్ళు. పిల్లాజెల్లలతో, పశువులతో ప్రతిరోజూ అలా పారిపోవడం, తెల్లవారిన తర్వాత తిరిగిరావడం చాలా బాధాకరంగా వున్నది.

నా మనువరాలు కదలలేని పరిస్థితిలో వుండడంవల్ల ఈ రోజు మేము యిక్కడ దిగబడిపోయాము" ఒక మట్టిముంతలో వున్న చద్ది అన్నాన్ని తెచ్చి అతనిముందు పెడుతూ గద్గదస్వరంతో తన బాధల్ని చెప్పుకున్నది ఆమె.

కట్టెలు కొట్టుకొనే వ్యక్తులు, నీలాపురి చేరేవరకూ ఎక్కడా ఆగవద్దని ఎందుకు హెచ్చరించారో అప్పుడు అర్థమై చిన్నగా నవ్వేశాడు శ్రీధరుడు.

"ఏ తల్లి కన్నబిడ్డవోగాని గట్టిగా చూస్తే దిష్టి తగిలేలా వున్నావు. మా కోసం నీ ప్రాణాలను పోగొట్టుకోకు నాయనా... నీ దారిన నువ్వు గ్రామంలో నుంచి వెళ్లిపో..." తలుపులదగ్గరే నిలబడి అతన్ని తప్పించటానికి ప్రయత్నించింది వృద్ధురాలు.

ఆ మాటలు తనకు వినబడనట్లు నటిస్తూ దూరంగా వున్న నులకమంచాన్ని ఆ ఇంటిముందుకు తెచ్చుకున్నాడు శ్రీధరుడు.

"తలుపులు వేసుకుని నువ్వు విశ్రాంతి తీసుకో. నా గురించి ఆందోళన చెందవలసిన అవసరంలేదు. యక్షిణీ భూతాలను చూసి బెదిరే మనిషిని కాదు నేను" అంటూ మంచం మధ్యలో కూర్చున్నాడు.

అర్థరాత్రి కావస్తూ వుండగా రెక్కల్ని తపతపలాడిస్తూ గాలిలోకి లేచాయి అక్కడికి సమీపంలోని ఒక చెట్టుమీద విశ్రాంతి తీసుకుంటున్న పక్షులు.

అదిరిపడి మంచం మీది నుంచి క్రిందికి దూకిన శ్రీధరుడి కనులకు వెంటనే అగుపించిందొక బ్రహ్మాండమైన కొండచిలువ.

ఇరువది ధనువుల పొడవును మించి వున్నది దాని మహాకాయం. అరచేతి వెడల్పున కనిపిస్తున్నాయి క్రూరమైన దాని కనులు.

రెక్కల్ని విదిలిస్తూ తన రాకను గురించి హెచ్చరికలు చేస్తున్న పక్షులవంక తలయెత్తి చూస్తూ, వేగంగా ముందుకు వచ్చేస్తున్నది అది.

కత్తుల్ని, కర్రల్ని పట్టుకుని కాపలా కాసిన గ్రామస్థులకు అది ఎందుకు కనిపించలేదో అప్పుడు అవగతం అయింది శ్రీధరుడికి.

వేగంగా ప్రవహించే నీటిజాలు మాదిరి నిశ్శబ్దంగా కదులుతోంది ఆ క్షుద్రజీవి. తనను ఎవరైనా గమనించేలోపుగా వచ్చిన పనిని పూర్తిచేసుకొని వెళ్ళిపోతున్నది కాబోలు. తమను యక్షిణీభూతం పీడించుకు తింటున్నట్లుగా భావిస్తున్నారు గ్రామస్థులు.

పక్షులవంక చూడటాన్ని మాని, అతనిమీదే తన దృష్టిని కేంద్రీకరించిందా కొండచిలువ.

జానెడు పొడుగున నాలుకల్ని విరజాపుతూ వేగంగా వచ్చి అతనిమీది కలబడింది.

నడుము ఎత్తుకు లేచిన దాని తలను పిడిబాకుతో రెండుసార్లు బలంగా పొడిచి, వేగంగా వెనక్కి దూకాడు అతను. భరించరాని బాధ కలిగింది కాబోలు, చెవులు చిల్లులు పడిపోయేటట్లు వికృతధ్వనుల్ని వెలువరించింది కొండచిలువ.

వెడల్పుగా తెరుచుకున్న నోటిలోంచి వేగంగా లోపలికి బయటికి కదులుతున్న నాలుకల్ని ఒకే వేటుతో మధ్యకు తెగకొట్టేశాడు శ్రీధరుడు.

దాని తల విసురుకు తలక్రిందులు అయిపోకుండా దూరంగా పరుగు తీశాడు.

అతను ఎదురుచూడని విధంగా తర్వాత అర్థం అయింది శ్రీధరుడికి అసలు సంగతి.

నడుముమీద పొడిచినా, తలమీద కొట్టినా ఇసుమంతగా కూడా పట్టించుకోని ఆ క్షుద్రజీవి విపరీతమైన బాధతో విచలితమైపోతున్నది. నాలుకలు మధ్యకు తెగిపోవటం వల్ల తను ఎటు పోతున్నదో, ఎలా పోతున్నదో తనకే అర్థంకానంత వేగంతో పారిపోతున్నది ఆ గ్రామంలో నుంచి.

గ్రామ పొలిమేరలను దాటి, దట్టమైన పొదలమధ్యగా, చిట్టడవివంటి ప్రదేశాన్ని చేరుకున్నది ఆ కొండచిలువ. కనిపిస్తున్నట్లే కనిపించి ఒక్కక్షణంలో మటుమాయం అయిపోయింది.

పట్టిన పట్టు వదలకుండా ఆ ప్రదేశాన్నంతా అడుగడుగు గాలించాడు శ్రీధరుడు. అర్థఘడియ తర్వాత అగుపించింది అతనికి, ఎండిపోయిన ఆకులతో కప్పబడిన ఒక దిగుడుబావి.

శిథిలావస్థకు చేరుకొన్న ఆ బావి మెట్లమీదుగా లోపలికి పోయి, ఆకుల కింద చుట్టలు చుట్టుకు పడుకొని వున్నది ఆ అజగరం.

అది అక్కడినించి అవతలికి పోలేదని గ్రహించి వెంటనే, వెనుతిరిగి వడివడిగా గ్రామంలోకి వచ్చాదు శ్రీధుడు. అతని అడుగుల చప్పుడును ఆలకించి, తలుపు సందులోనుంచి భయం భయంగా చూస్తున్నది వృద్ధురాలు.

"మీ గ్రామాన్ని పీడిస్తున్న యక్షిణీభూతాన్ని నేను చూశాను. నిప్పు కావాలి అవ్వా..." అంటూ తలుపుల్ని తెరిపించి ఇంటిలోపల వున్న ఆముదపు దీపం సహాయంతో చిన్న కాగడాలు వెలిగించుకున్నాడు శ్రీధరుడు.

"ఇక నువ్వు నిర్భయంగా బయచటికి రావచ్చు. నీకు, నీ మనవరాలికి హాని చేయగల అమానుషశక్తి ఏదీ ఈ చుట్టుపట్ల లేదు" అంటూ వచ్చినదారినే వెనుతిరిగి, దిగుడుబావిని చేరుకున్నాడు.

మూడు జానల ఎత్తున బావిచుట్టూ పేరుకొని వున్నాయి చెట్లమీదినుంచి రాలిపడిన ఎండుటాకులు. వాటిని ముందుగా అంటించాడు. మంటలు బావిచుట్టూ వ్యాపించిన అనంతరం, కాగడాని బావిలో విసిరిపడేశాడు. భగ్గుమని నాలుకలు జాస్తూ పైకిలేతిన మంటలవేడిని భరించలేక రెండు నిలువుల ఎత్తుకు తలను లేపిందా కొండచిలువ.

చెవులు చిల్లులు పడేలా బుసలు పెడుతూ, విరిగిన మెట్లమీదగా తిరిగి బావి పైభాగంలోకి వచ్చేసింది. ముందుచూపుతో బావిచుట్టూ శ్రీధరుడు సిద్ధం చేసిన అగ్నిజ్వాలలు దాని వేగాన్ని తగ్గించేశాయి.

అప్పటికే మేఘాలు లేచి ఆకాశంలోనుంచి రాలిపడిన పిడుగుమాదిరి వచ్చి, శ్రీధరుడి భుజాలమీద పడనే పడింది ఆ జగరం.

పిడిబాకును ఎడమచేతిలో బిగించి పట్టుకునే వున్నడు శ్రీధరుడు. పొగ మూలకంగా కనులు కనిపించకపోయనా, స్పర్శనిబట్టి ఎడా పెడా పొడిచాడు రెండుపోట్లు.

ఒంటిమీద పడిన బాకుపోట్లు మరింత బాధను కలిగించాయి. ఫలితంగా తనంతట తనే క్రిందికి జారిపోయింది అది. జారిపోతూ పోతూ శరీరంలో వున్న శక్తినంతా కూడగట్టుకుని తోకతో అతని నడుముమీదమోదింది.

కనిపించని రాక్షసహస్తం ఏదో మోదినట్లు గింగిరాలు తిరుగుతూ పోయి పాతిక అడుగుల దూరంలో వున్న ముళ్ళపొదలమీద పడ్డాడు శ్రీధరుడు.

చురకత్తులవంటి ముళ్ళు శరీరాన్ని చీల్చివేయకుండా చేతుల్ని జాచి, అతినెమ్మదిగా వెనక్కిజరగబోతుండగా అగుపించింది అతనికి ఆ పొదలమధ్య కట్టబడి వున్న చలువరాతి మండపం ఒకటి.

ఎక్కడ వున్నదో ఎవరికీ తెలియని ఆ కుగ్రామానికి సమీపంలో అంత అందమయిన మండపాన్ని నిర్మించవలసిన అవసరం ఎవరికి కలిగింది? ఎవరికి కలిగిందో, ఎందుకు కలిగిందో తెలుసుకునే అవకాశం అతనికి లభించలేదు. నడముమీది మోది అతన్ని అవతలకు విసిరేసిన తర్వాత, బావిచుట్టూ చెలరేగితున్న మంటల్లో గిలగిలా కొట్టుకున్నది కొండచిలువ.

ఎండుటాకులన్నిటినీ తోకతో చెల్లాచెదురు చేస్తూ దిగుడుబావిలోకి దొర్లిపడింది.

గుబగుబలాడుతున్న గుండెలతో అప్పటివరకూ శిలావిగ్రహంలా నిలుచుని వున్న శ్రీధరుడిలో వెంటనే చలనం వచ్చింది. అక్కడా ఇక్కడా మిగిలిన ఆకుల్ని, ఎండుపొదల్ని ఒకచోట చేర్చి బావిలోకి నెట్టి, లోపల వున్న మంటల్ని పెద్దవి చేశాడు.

ఆఖరిసారిగా రెండు ధనువుల ఎత్తుకులేచి దభీమని క్రింద పడిపోయిందా క్షుద్రజీవి. శాశ్వతంగా ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయింది.

బిగపట్టి వుంచిన ఊపిరిని బయటికి వదులతూ, గ్రామంవైపు అడుగులు వేశాడు అతను.

* * *

"సంవత్సరకాలం నుంచి మాగ్రామాన్ని పట్టుకున్న పీడను వదిలించి మాకు ఎనలేని మేలు చేశావు... నీ రుణం ఎలా తీర్చుకోవాలో అర్థం

కావటంలేదు" అంటూ శ్రీధరుడి చేతుల్ని పట్టుకుని కనులకు అద్దుకోబోయాడు గ్రామస్థులందరికీ పెద్దవాడిలా అగుపిస్తున్న వృద్ధుడు ఒకతను.

"నీకంటే చాలా చిన్నవాడిని నేను. నాకు నమస్కరించి చిన్నబుచ్చకండి. విధిలేని పరిస్థితుల్లో ఆ భూతాన్ని ఎదుర్కోగలిగానే కానీ, ఇంకో పరిస్థితిలో నేనుకూడా మీ మాదిరిగానే కొండల్లోకి పారిపోయి వుండేవాడినే..." అంటూ తన సాహసాన్ని మరుగు పరుచుకోవటానికి చూశాడు శ్రీధరుడు.

ఆ విషయాన్ని గమనించలేనంత అమాయకులు కారు ఆ గ్రామస్థలు. పెద్దపెద్ద కంఠాలతో జయ జయధ్వానాలు చేస్తూ, అతన్ని అభినందిస్తూ ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకువచ్చారు.

"నువ్వు మాకు అతిథివి. పూజనీయుడివి. రెండు మూడు దినాలు మాతోనే వుండి మా మర్యాదల్ని స్వీకరించాలి" అంటూ కొండచిలువను ఏ ఇంటిదగ్గర వుండగా చూశాడో, ఆ ఇంటిలోనే అతనికి వసతి ఏర్పాటు చేశారు.

మర్రి ఆకులతో కుట్టబడిన ధస్తరిలో మధురభక్ష్యాలు వచ్చాయి. మట్టి పాత్రల నిండుగా రుచికరమైన ఆవుపాలు ఇవ్వబడ్డాయి.

"పూర్వం ఎప్పుడో కొన్ని వందల సంవత్సరాల క్రిందట కర్మరుడనే మంత్రవాది తన ప్రియురాలితో కలిసి ఈ ప్రాంతాలకు వనవిహారం చేయటానికి వచ్చాడట. దారి కాచి తనను మట్టుబెట్టబోయిన దోపిడీ దొంగల్ని మంత్రశక్తితో భస్మంచేయ ప్రయత్నిస్తుండగా అతని ముంజేతికి వుండే రాగికంకణం ఒకటి జారి ఎక్కడో పడిపోయిందట..."

దిగుడుబావి గురించి, దాని సమీపంలోని చలువరాతి మండపాన్ని గురించి అడిగిన శ్రీధరుడితో చెప్పటం మొదలు పెట్టాడు గ్రామపెద్ద.

"రెండువందలమంది పనివారిని పిలుచుకువచ్చి తన కంకణంకోసం ఈ పరిసర ప్రాంతాలన్నిటినీ వెతికించాడట కర్మరుడు. వారి అవసరాల నిమిత్తం ఆ దిగుడుబావిని, తను వారి పనిని పరివేక్షించటానికి ఆ మండపాన్ని నిర్మింపజేశాడట..." తన తాత తండ్రులు తనకు చెప్పిన విషయాలను మననం చేసుకుంటూ శ్రీధరుడికి చెప్పాడతను.

"రాగి కంకణాన్ని వెతకటంకోసం తీసుకురాబడిన పనివారి మూలకంగానే మా గ్రామం ఉద్భవించింది. మేమందరమూ వారి సంతతివారమే" అంటూ ఆ కథను ముగించారు.

కుతూహలాన్నిఅణుచుకోవటం శ్రీధరుడికి అసాధ్యం అయింది.

"కర్మరుడు పారవేసుకున్న కంకణం ఏమయింది? అతనికి లభించిందా?" అని ప్రశ్నించాడు.

పెదవి విరిచి తల అడ్డం తిప్పాడు గ్రామపెద్ద.

"కర్మరుడు జీవించి వుండగా ఆ కంకణం అతనికి లభించలేదట. అతనికి నాలుగైదు తరాల మా వంశకుడు ఒకతను నాగలి కట్టి భూమిని దున్నతుండగా నాగేటి చాలులోనుంచి బయటపడింది" అంటూ ఒక పాతకాలపు చెక్కపట్టెలోనుంచి బరువైన రాగికంకణాన్ని తీసి శ్రీధరుడి చేతికి యిచ్చాడు.

చిత్రవిచిత్రమైన లతలతో, గుర్తులతో, అర్థంకాని మాటలతో బహు సుందరంగా తయారుచేయబడిన ఆ కంకణాన్ని చూసి మెచ్చుకున్నాడు శ్రీధరుడు.

"పేరుకు మంత్రకంకణమే అయినా, దీనిలో మంత్రశక్తులు వుండేవనేమాట కట్టుకథ. మంత్రశక్తుల్నే గనుక ఇది కలిగివుంటే చీకటివేళల్లో గ్రమాన్నివదిలి దూరంగా పారిపోవలసిన గతి మాకు పట్టివుండేది కాదు. నువ్వు

చేసిన సహాయానికి ధనధాన్యాదుల్ని బహుమతిగా యివ్వలేకపోయినా , మాకు ఎందుకూ పనికిరాని ఈ కంకణాన్ని సంతోషంగా అర్పించుకోగలము. నీవంటి అసహాయశూరుడి హస్తానికి సరైన ఆభరణం కాగలదు యిది" అంటూ అతనికి ధానధత్తం చేస్తున్నట్లు ప్రకటించాడు.

"మీ గ్రామం ఉద్భవించటానికి కారణభూతమైన ఆభరణం యిది. మీ దగ్గిరే వుండటం శ్రేయస్కరం" అంటూ తిరిగియిచ్చి వేయటానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలం అయ్యేసరికి, విధిలేక దుస్తుల్లో భద్రపరచుకున్నాడు శ్రీధరుడు.

ఆటాపాటా తెలిసిన వారెవరైనా వుంటే పక్కగ్రామం నుంచి పిలిపించి, తమ అతిథికి ఆ రాత్రి చక్కటి వినోధ కాలక్షేపం ఏర్పాటు చేయటానికి నిర్ణయించుకున్నారు గ్రామస్థులు.

అతను చేసిన ఘనకార్యాన్ని గురించి అందరికీ తెలియచేయాలని నిశ్చయించుకున్నారు.

ఉపకారం చేసిన వ్యక్తిని సముచితంగా సత్కరించాలనే తపనలో తల మునకలైపోతున్నారు వాళ్ళు. తద్వారా తనగురించి చుట్టుపక్కల వుండే గ్రామాలన్నింటికీ చాటింపు వేయబోతున్నారు.

తిరుమలయ్య అనుచరులు అటురావడం జరిగితే, పనికట్టుకుని అడగవలసిన అవసరం లేకుండానే బట్టబయలైపోతాయి తన జాడలు.

వద్దని వారస్తే వినిపించుకునే స్థితిని దాటిపోయిన గ్రామస్థులతో మాటలు పెంచుకోవటం అవసరమని భావించి, తనకు తోచిన ఒకే ఒక మార్గాన్ని ఎంచుకున్నాడు శ్రీధరుడు.

ఎవరికీ అగుపించకుండా గ్రామంలోనుంచి బయటపడ్డాడతను. వేగంగా అడుగులు వేస్తూ నీలా నగరానికి దారితీసే రాచబాటవైపు వెళ్లపోయాడు. చీకట్లు మరో అర్ధఘడియకు జగతిని చుట్టుముడతాయని అనిపిస్తూ వున్న సమయంలో, బాటకు పాతిక ధనువుల దూరంలో అగుపించింది అతనికి ఒక మంచినీటి కొలను.

స్వేదంతో తడిసి ముద్ద అయిన కరచరణాలను శుభ్రపరచుకుని, చల్లటి నీటితో కడుపు నింపుకోవాలని అనుకుంటూ అటుగా బయలుదేరిన అతన్ని వెంటనే అడ్డుకున్నారు అశ్వాలను అటుగా వచ్చిన రాజభటులు అనేకమంది.

"ముందు పోవలదని గట్టిగా హెచ్చరిస్తుంటే మూగవాడిలా నిలబడి మిర్రి మిర్రి చూస్తావేమిటి? వెనక్కి తగ్గు...దూరంగా వెళ్ళిపో..." చిందులు తొక్కుతున్న తన అశ్వాన్ని అతనిమీదికి పోనిస్తూ కరుకు కంఠంతో హెచ్చరించాడు అదరికంటే ముందుగా అతన్ని సమీపించిన భటుడు.

"ఈ బాటమీద ప్రయాణం చేసేవారి దాహార్తిని తీర్చటానికి ధర్మాత్ములు ఎవరో త్రవ్వించిన కొలను అది. నాదికాదు, మీదికాదు... మన అందరిదీ... అందులో దాహం తీర్చుకోవద్దని అనటానికి కారణం ఏమైనా వున్నదా?" మృదువుగా అడిగాడు శ్రీధరుడు.

మాటలు మృదువుగానే వున్నా, ఆమాటల వెనుకవున్న వెక్కిరింపును తేలికగానే అర్థం చేసుకుని కోపంతో ఊగిపోయాడు ఆ భటుడు.

"మమ్మల్ని చూసీ చూడగానే పది ధనువుల దూరం పక్కకు తొలగి వినయంగా నిలబడవలసిన సామాన్యుడివి నువ్వు. ఎదురుప్రశ్నలు వేసే ధైర్యం

నీకు ఎక్కడినుంచి వచ్చింది?" అంటూ తన దట్టీలో దోపుకుని వున్న వెదురుచువ్వను తీసి అతని ముఖం మీద ఝళిపించాడు.

ఆఖరిక్షణంలో నేర్పుగా తలను ప్రక్కకు వంచి, ఆ దెబ్బనుంచి తప్పించుకున్నాడతను.

అదే సమయంలో, ఎడమచేతిని ముందుకువిసిరి ఆ భటుడు అశ్వాన్ని బలంగా మోదాడు.

పుట్టి బుద్ధెరిగిన తర్వాత అంతటి దెబ్బను ఎన్నడూ అనుభవించి ఎరుగదు కాబోలు, చెవులు చిల్లులు పడేలా సకిలిస్తూ ముంగాళ్ళను గాలిలోకి ఎత్తిందా అశ్వం.

అనుకోని విధంగా తన వాహనం వెనుక పాదాలమీద నిలబడటంతో, పట్టుజారి వెనక్కి పడిపోయాడతను. తల నేలకు పొడుచుకోవడంతో తెలివి తప్పి తలను వ్రేలాడదీశాడు. ఆ దృశ్యాన్ని చూసేసరికి కట్టులు తెంచుకున్నది మిగిలినవారి క్రోధం.

కొలను నీటితో దాహాన్ని తీర్చుకుని, తీరికగా అడుగులు వేస్తూ నీలా నగరంలోకి పోవాలనే మాటల్ని మరిచిపోయాడు శ్రీధరుడు.

"ప్రకృతిమాత ప్రసాదించిన నీటిమీద కూడా అధికారాన్ని ప్రదర్శించే మీరు రాజభటులు కాదు... రాక్షసులు... ఒంటరివాడిననే ఉద్దేశ్యంతో ఏదైనా చేయవచ్చునని అనుకుంటున్నారు కాబోలు...మీరు మీ జన్మలో మరచిపోలేని గుణపాఠం నేర్పి పంపిస్తాను... రండి రండి" అని వెక్కిరిస్తూ, క్రిందపడిన భటుడి దగ్గిరవున్న కరవాలాన్ని చేతిలోకి తీసుకున్నాడు.

గొంతులు చినిగిపోయేలా గావుకేకలు పెడుతూ అతన్ని కమ్ముకున్నారు ఆ భటులు...

కమ్ముకున్న మరుక్షణంలోనే తమ ఆయువులు గాలిలోకి ఎగిరిపోతుండగా, గాయపడిన హస్తాలను గుండెలకు అదుముకుంటూ వెనక్కి పారిపోయారు కొంతమంది.

కంటికి కనిపించనంత వేగంతో కరవాలాన్ని తిప్పుతూ మంచినీటి కొలనుకేసి నెట్టుకుంటూ పోయాడు శ్రీధరుడు మిగిలినవారందర్నీ. వెనుక వున్న ప్రమాదాన్ని గురించి గమనించుకునే లోపుగానే పాదాలు పట్టుతప్పడం వల్ల, తలక్రిందులుగా కొలనులో పడిపోయారు చాలామంది. పడకుండా నిలదొక్కుకున్న ఇద్దరు భటుల్ని పదిధనువుల దూరం తరిమి తరిమి కొట్టాడు శ్రీధరుడు.

దిగజారిన ధైర్యాన్ని కూడగట్టుని వారందరూ మరోసారి తనమీద దాడి చేయకముందే ఆ ప్రదేశాన్ని వదిలి దూరంగా వెళ్ళి పోవటం ఉత్తమం అనిపించింది అతనికి. అనిపించిన పరుక్షణం అందుబాటులో వున్న అశ్వాన్ని ఒకదాన్ని పట్టుకుని, బాటమీదికి పరుగులు తీయించాడు.

రాజభటులమీద ఆయుధాల్ని ప్రయోగించటం, వారి వాహనాల్ని అక్రమంగా స్వాధీనం చేసుకోవటం ఉరిశిక్షకు పాత్రమయ్యే నేరాలని తెలుసు. బలవంతంగా వశపరుచుకున్న ఆ అశ్వంమీద వుండగా పట్టుబడితే ప్రాణాల మీది ఆశను వదిలివేసుకోవటం తప్ప మరో మార్గమేదీ వుండదని కూడా తెలుసు.

అందుకే నీలానగరంలో ఆగలేదతను. ఆయాసంతో వగరుస్తున్న వగరుస్తున్న వాహనాన్ని అదిలించి, తూర్పుదిక్కు తెల్లబడుతుండగా ధనదుపుర నగర ద్వారాలకు దగ్గరగా వెళ్ళిపోయాడు.

తన అశ్వాన్ని నగర ద్వారాలకు సమీపంలో వున్న ఒక చెట్లతోపులో వదిలేశాడు.

తూర్పుదిక్కు పూర్తిగా తెల్లబడకముందే తలుపుల్ని తెరిచి, నగరప్రవేశాన్ని కోరేవారందర్నీ లోపలికి అనుమతించటం అక్కడి అచ్చు కావలివారికి ఎప్పటినుంచో అలవాటు. కానీ అందుకు భిన్నంగా ద్వారాలను మూసేవుంచారు వారు ఆ రోజు.

"నీలానగరానికి చెందిన రాజభటుల్ని ఎవరో దుండగీడు ఎదిరించి, వారి వాహనాల్లో ఒక అశ్వాన్ని అపహరించుకుపోయినట్లు ఇంతకుముందే కాగడా సంకేతాలద్వారా వారికి తెలిసిందట. వెలుగు పూర్తిగా వచ్చిన తర్వాతగానీ ఎవరినీ లోపలికి పంపించరట. విసుగు చెందిన కంఠంతో శ్రీధరుడికి చెపుతూ, కటిక నేలమీద చతికిల బడ్డాడు, చాలాసేపటినుంచీ అక్కడ నిలుచుని వున్న వృద్ధుడు ఒకతను.

ముందు వెనుకలు చూసుకోకుండా,తదనంతరం పరిణామాన్ని గురించి ఆలోచించుకోకుండా తనుచేసిన దుస్సాహసం, ఎంత దూరం వచ్చేసిందో అర్థం అయ్యేసరికి చేదుగా తయారయింది శ్రీధరుడి నోరు.

అక్కడి పరిస్థితుల్ని గురించి వివరంగా తెలుసుకోవటం కోసం మెల్లిగా వృద్ధుడి సమీపంలోకి చేరుకున్నాడు.

"రాజుగారి కోశాగారాన్ని కొల్లగొట్టి పారిపోతూ పారిపోతూ అశ్వం మీదినుంచి పడిపోయిన గజదొంగ గర్గుడి మూలకంగా వచ్చిన తంటా ఇది...

పట్టుబడిన తర్వాత కూడా అందర్నీ వేధిస్తున్న ఆ దుర్మార్గుడికి ఎటువంటి శిక్షను విధించినా పాపంలేదు" మరోసారి తనంతట తనే సంభాషణను ప్రారంభించాడు ఆ వృద్ధుడు.

దారుణమైన దోపిడీలు, అనితరసాధ్యమైన దొందతనాలు చేసి చేసి, దురదృష్టవశత్తూ దొరికిపోయిన గజదొంగ గర్గుడి గురించి రకరకాల కథలను వినివున్నాడు శ్రీధరుడు.

నీలా నగరంలో రాజభటులను హింసించిన దుండగీడు కోసం నగరద్వారాలను మూయటానికి, పట్టుబడి చెరసాలలో మగ్గిపోతున్న ఆ గజదొంగకు గల సంబంధం ఏమిటో అంతుబట్టక ఆశ్చర్యంగా చూశాడతను వృద్ధుడి ముఖంలోకి.

"నిన్న ఉదయం గర్గుడిమీద విచారణ పూర్తి అయిందిట. ఈ రోజు సాయంత్రం ప్రజలందరి సమక్షంలోను అతన్ని బహిరంగంగా ఉరి తీస్తారట..." చిన్నగా నవ్వుతూ అన్నాడు వృద్ధుడు.

గజదొంగ గురించి తను విన్న విశేషాలన్నీ గుర్తుకు వచ్చేసరికి చివుక్కుమన్నది శ్రీధరుడి మనస్సు.

కలవారిని దోచుకుని లేనివారికి పంపకం చేస్తాడట ఆ గజదొంగ. తను దోపిడీ సొత్తును అక్కడే వదిలి తలవంచుకుని వచ్చేస్తాడట.

అతను పట్టుబడినందుకు సంతోషిస్తున్న వారి సంఖ్యకంటే, బాధపడుతున్న వారి బలగమే చాలా అధికంగా వున్నారట.

శ్రీధరుడి మనసులోని మాటలు తనకు అర్థం అయినట్లు తలవూపుతూ, నగరద్వారాల వైపు చూపించాడు వృద్ధుడు.

"గర్గుడి అనుచరులలో స్నేహితులలో ఎవరో ఒకరు అతన్ని రక్షించటం కోసం ఈ సాయంత్రం లోపల గట్టి ప్రయత్నం చేస్తారని వీళ్ల అనుమానం. అందుకే రాజ్యంలో ఎక్కడ ఏ విధమైన అలజడి చెలరేగినా ఇక్కడ ఉలిక్కిపడటం జరుగుతోంది.

నేరస్థుడిగా అగుపించే వ్యక్తి ఎవరైనా యిటుగా వస్తున్నట్లు సమాచారం అందగానే నగరద్వారాల్నిమూసి పరిశోధనలు ప్రారంభిస్తున్నారు" అంటూ, శ్రీధరుడి మనసులో అడుగుపెట్టిన అనుమానాన్ని నివృత్తి చేశాడు.

అదే సమయంలో నురుగులు కక్కుతున్న అశ్వాన్ని వెదురుచువ్వలతో అదిలిస్తూ అతివేగంగా వచ్చి అక్కడ ఆగాడు ఒక అశ్వికుడు.

"ఇతడి వాలకం చూస్తుంటే నాకేదో అనుమానంగా వున్నది. తెల్లగా తెల్లవారిన తరువాత కూడా నగరంలోకి పోయే యోగం మనకు లేనట్లుగా తోస్తోంది" కూర్చున్న చోటినుంచి లేచినిలబడుతూ లోగొంతుకతో శ్రీధరుడికి మాత్రమే వినిపించేటట్లు అన్నాడు వృద్ధుడు.

అతని మాటలు పూర్తి అవుతుండగా, అశ్వంమీదినుంచి క్రిందికి దూకి, అక్కడ గుమిగూడి వున్న వారందరి వంకా చూశాడు ఆ అశ్వికుడు.

"సేనాపతులవారి కుమారుడు నాసీరదేవుడు వకుళాపురం నుంచి విచ్చేస్తున్నారు. దారి వదిలి దూరంగా పొండి మీరందరూ...గుంపుగా నిలిచి వారి చలనానికి అభ్యంతరాలు కల్పించకండి.." ఖంగు ఖంగుమంటున్న కంఠంతో హెచ్చరికలు చేస్తూ, అచ్చు కావలివారి దగ్గిరికి పోయాడతను.

"నాసీరదేవుడంటే సేనాపతి ముద్దుల బిడ్డడు. ఆడింది ఆటదా పాడింది పాటగా పెరిగిన కుమారరత్నం. అందరితోపాటు మనం కూడా వినయవిధేతలను ప్రదర్శించకపోతే కష్టాల్లో కూరుకుపోతాం" అంటూ శ్రీధరుడి చేతిని పట్టుకుని వెనక్కి లాగాడు ఆ వృద్ధుడు.

రాజధాని నగరాన్ని దర్శించి వచ్చిన తన గ్రామస్థుల ద్వారా నాసీరదేవుడిని గురించి, అతని అహంకారాన్ని గురించి వినివుండటం వల్ల, అతనెలా వుంటాడో చూడాలన్న కోరికతో వృద్ధుడి చేతిని మృదువుగా వదిలించుకుని అక్కడే నిలుచున్నాడు శ్రీధరుడు.

ఎంతోసేపు ఎదురు చూడవలసిన అవసరం లేకుండానే పావుఘడియ తరువాత పదిమంది అశ్వికులు తనను అనుసరించి వస్తుండగా అక్కడ ప్రత్యక్షం అయ్యాడు నాసీరుడు.

అతను వుపయోగిస్తున్న వెదురుచువ్వ దెబ్బలను భరించలేక తలను అటూ ఇటూ విసురుతున్నది అలసిపోయివున్న అతని అశ్వం. దీనాతిదీనంగా ఘోష చేస్తున్నది. ఆ దృశ్యాన్ని చూసిన మరుక్షణం అతను ఎంతటి నిర్దయుడో ఒకరు చెప్పవలసిన అవసరం లేకుండా తనంతట తనే అర్థం చేసుకోగలిగాడు శ్రీధరుడు.

అటువంటి మనుషిని చూడటంకోసం తను అంతగా ఎదురు చూసినందుకు సిగ్గుపడుతూ వెనుతిరిగి దూరంగా వెళ్లిపోబోయాడు.

"ఆగు...అక్కడే ఆగు..." ఖంగుమంటున్న కంఠంతో అతన్ని హెచ్చరిస్తూ తన అశ్వాన్ని అతనికి సమీపంలో నిలిపాడు నాసీరుడు.

తను చేసిన తప్పిదమేమిటో తెలియక ఆశ్చర్యంగా అతనివంక చూశాడు శ్రీధరుడు.

"మిమ్మల్ని వీక్షించిన తర్వాత మాకు అభివాదం చేయకుండా వెన్ను చూపించగల మొనగాడివా నువ్వు...!" కరుకుకంఠంతో అంటూ చేతిలోని వెదురుచువ్వను బలంగా ఝళిపించాడు నాసీరుడు.

ఎటువంటి తగాదాలలోను తల దూర్చకూడదనీ అంతకుముందే తీసుకున్న నిర్ణయాన్ని మరిచిపోయాడు శ్రీధరుడు.

పళ్ళు బిగపట్టి తన ఎడమచేతిని ముందుకు జూచి, నాసీరుడి దగ్గిర వున్న వెదురుచువ్వను వడిసి పట్టుకోబోయాడు.

అతని ఉద్దేశ్యం అశ్వంమీద ఠీవిగా కూర్చునివున్న నాసీరదేవుడికి అవగతం అయ్యేలోపుగా మెరుపువేగంతో కదిలి ముందుకు వచ్చేశాడు దూరంగా తొలగిపోయిన వృద్ధుడు.

తనేం చేస్తున్నాడో నాసీరుడికి అర్థం అయ్యేలేపుగా వెనుకనుంచి అతన్ని గట్టిగా కౌగిలించి పట్టుకుని –

"గ్రామసీమల్లో సంచరించటమేకానీ, నగరవీథుల్లోకి ఎన్నడూ వచ్చిన మనిషి కాదు ఇతను. పెద్దవారితో ఎలా మాట్లాడాలో, ఎటువంచి గౌరవాన్ని నెరపాలో తెలియని అమాయకుడు. అన్యథా భావించకుండా ప్రథమ తప్పిదం కింద క్షమించండి. నాసీరులవారికి జయము...జయము" అంటూ వెనక్కి తీసుకెళ్లిపోయాడు.

చేతిలోని వెదురుచువ్వను దట్టీలో అమర్చుకుంటూ విజయగర్వంతో మీసాలు మెలివేశాడు నాసీరుడు. తన వామహస్తంతో అచ్చు కావలివారికి సైగ చేశాడు. వెంటనే కదిలారు వారందరూ.

గడియల్ని తొలగించి మూసివున్న నగర ద్వారాలను తెరిచి పట్టుకున్నారు.

తలను క్రిందికి వాల్చివున్న తన అశ్వాన్ని కాలిమడమలలో బలంగా అదిమి,ముందుకు కదిలించాడు నాసీరదేవుడు.

ఎంతోసేపటినుంచి ఆరుబయట నిలుచుని వున్నందువల్ల, అదేపనిగా వీస్తున్న చలిగాలి తన వంటికి సరిపడనందువల్ల, ఎంత ప్రయత్నించినా ఆపుకోవటం అసాధ్యమైనందువల్ల గట్టిగా తుమ్మాడు అక్కడ వున్నవారిలో ఒకవ్యక్తి.

హెచ్చరిక లేకుండా తన అశ్వాన్ని అటుకేసి దుమికించాడు నాసీరుడు.

దట్టీలో భద్రపరచుకున్న వెదురుచువ్వను బయటికి తీయలేదతను ఈ సారి. అశ్వపు జీనుకు తగిలించివున్న పొడవాటి చర్మపు కొరడాను చేతిలోకి తీసుకుని ఆ వ్యక్తిమీద ప్రయోగించాడు.

బాధను భరించటం అసాధ్యమై బిగ్గిరిగా అరిచాడా వ్యక్తి. తన తప్పిదాన్ని మన్నించమని వేడుకుంటూ మోకాళ్ళమీద కిందకి వాలిపోయాడు.

అయినాసరే ఆగలేదు నాసీరుడు.

"నీవంటి అపశకునపక్షులు మా నగరంలోకి రావటానికి వీలులేదు. నీ అపరాధానికి తగిన శిక్ష అనుభవించి తీరాల్సిందే..." అంటూ అశ్వాన్ని కాలిమడమలతో అదిలించాడు.

ఒపిక లేకపోయినా, ముంగాళ్ళను గాలిలోకి ఎత్తింది ఆ వాహనం. వజ్రాయుధాలవంటి గిట్టలతో ఆ వ్యక్తి తలను నేలకేసి అదమబోయింది.

ఆ పైన చేతకానివాడిలా ఆ దృశ్యాన్ని చూస్తూ నిలబడటం అసాధ్యమై పోయింది శ్రీధరుడికి.

తనేం చేస్తున్నాడో తనకే తెలియని విచిత్రమైన ఆవేశం ఆసమయంలో అతన్ని ఆవరించుకున్నది.

గట్టిగా పట్టుకుని వెనక్కి వెనక్కి లాగుతున్న వృద్ధుడి చేతుల్ని ఒక్క విదిలింపుతో వదిలించుకున్నాడతను. వడిశెలలోనుంచి వెలువడిన రాయిలా పోయి, నాసీరుడి అశ్వాన్ని తన ఎడమభుజంతో బలంగా నెట్టాడు. అతను అలా వచ్చిపడతాడని ఊహించకపోవడం వల్ల , సరయిన అదనులో అడ్డుకోలేక పోయాడు నాసీరుడు.

కిందపడిన వ్యక్తి శిరస్సును గిట్టలతో నొక్కబోతున్న అశ్వం, అడుగులు తడబడడంతో అవతలికి జరిగి ముందుకు తూలింది.

చర్మపు కొరడాను గాలిలో గిరికీలు కొట్టిస్తున్న నాసీరుడు కాస్తా, తల్లక్రిందులై అశ్వం తలమీదినుంచి క్రిందికి పడిపోయాడు.

దెబ్బ చాలా బలంగా తగలటం వల్ల కీచుకంఠంతో గుండెలు జలదరించేటట్లు గావుకేక పెట్టాడు.

భయాందోళనలతో కపించిపోతూ, తమ వాహనాల మీదినుంచి క్రిందికి దూకారు అతన్ని అనుసరించి వచ్చిన అశ్వికులు.

కిందపడిపోయిన నాసీరుడు దగ్గిరికి పరుగుదీశారు వారిలో కొందరు. దట్టీలకు వేలాడుతున్న కరవాలాన్ని అందుకుంటూ శ్రీధరుడి మీదికి మీదికి లంఘించారు మిగిలినవారు.

ఎడమపాదంతో నేలను అదిమి, దక్షిణహస్తంతో తొడను చరుస్తూ గొంతెత్తి అక్కడివారందరూ అదిరిపోయేటట్లు పొలికేక పట్టాడు శ్రీధరుడు.

తన దట్టీలోనుంచి పిడిబాకును బయటికి తీస్తూ ముందుకు దూకి ఆ భటుల్ని ఎదిరించాడు.

చేతిలేని కరవాలాలు అమాంతంగా ఎదిరి ఆవలపడిపోయేసరికి, విపరీతమైన భయంతో వెనక్కి పారిపోయారు ఇద్దరు భటులు.

"రండి...రండి...అందరూ రండి..." అని బిగ్గరిగా కేకలు పెడుతూ అచ్చుకావలివారి దగ్గరికి పరుగుతీశారు మిగిలినవారు.

"పారిపో నాయనానా... ఏ తల్లి కన్నబిడ్డవో గానీ వెంటనే దూరంగా తొలగిపో...నాలుగు కాలాలపాటు క్షేమంగా వుండాలనే కోరిక నీకు వుంటే వెంటనే అవతలికి వెళ్లిపో..."

ఆవేదనతో నిండిన కంఠంతో తనతో మాట్లాడిన వృద్ధుడు హెచ్చరించటంతో ఒళ్ళు తెలిసింది శ్రీధరుడికి. ఆ సమయంలో తను ఎంతటి తప్పిదాన్ని చేశాడో అర్థం అయింది. అంతకుముందు చేసిన నేరానికి శిక్ష పడినా పడకపోయినా, ఇప్పుడు కావించిన అకృత్యానికి ప్రాణాలను కోల్పోవడం మాత్రం తథ్యం.

ఆ మాటలు మనసులో మెదులుతుండగానే అతని చెవులకు చేరింది అశ్వికుల సాయంతో లేచి నిలబడిన నాసీరుడి వికృతకంఠం.

"పట్టుకోండి ఈ నీచుడిని...కాళ్ళు చేతులు బంధించి మా తండ్రిగారి వద్దకు తీసుకుపొండి...పదిమంది ఎదుటా వాడిని కొరడా వేయించందే నాకు నెమ్మది లభించదు...పట్టుకోండి " అని అక్కడ వున్నవారందర్నీ హెచ్చరించాడు.

కదలకుండా నిలబడితే అతని ఆగ్రహం తమ మీదికి కూడా ప్రసరిస్తుందేమోనన్న భయంతో కూడబలుక్కున్నట్లు ఒకేసారి కదిలారు నగర ప్రవేశం కొరకు వేచియున్న వారందరూ.

"పారిపో నాయనా ... ఇక్కడినుంచి పారిపోయి నీ ప్రాణాలు దక్కించుకో."

అని హెచ్చరిస్తూ తానుకూడా ముందుకు వస్తున్న వృద్ధుడిని చూసిన తర్వాత వదిలిపోయింది శ్రీధరుడిని ఆవరించుకుని వున్న అయోమయావస్థ.

దగ్గరికి వచ్చిన వ్యక్తుల్ని తన పిడిబాకుతో అదిలించి, దూరంగా పారిపోయేటట్లు చేశాడతను. మీదిమీదికి వచ్చిన అచ్చుకావలి భటులు నలుగుర్ని చిటికెలో కిందకి దొర్లించి ఒక్కసారిగా పరుగు మొదలు పెట్టాడు.

"పట్టుకోండి అతగాడిని...నగరానికి దూరంగా పారిపోకముందే పట్టి బంధించండి."

క్రూరమైన స్వరంతో అందర్నీ మరోసారి హెచ్చరించాడు నాసీరదేవుడు.

నగరానికి దూరంగా పారిపోచూస్తే పట్టుబడడం క్షణాలమీద పని అని శ్రీధరుడికి తెలుసు.

అంతకుముందు తన వాహనాన్ని వదినిన చెట్లతోపుకేసి పరుగెత్తినట్లే పరుగెత్తి, చటుక్కున ప్రక్కకు తిరిగాడతను.తను ఏం చేస్తున్నాడో అక్కడి వారందరికీ అర్థం అయ్యేలోపుగా నగర ద్వారాలను సమీపించి, వింటినుంచి వెలువడిన బాణంలా నగరానికి వెళ్లిపోయాడు.

## 5

నాలుగు లక్షలమందికి పైగా జనాభా, లెక్కపెట్టడానికి వీలుకానన్ని వీధులు కలిగివున్న ఆ మహానగరంలో తనను చెతికిపట్టుకోవటం ఎవరికీ సాధ్యపడదని అనుకున్నాడు శ్రీధరుడు.

అర్ధఘడియ కూడా గడవకముందే తప్పని తేలిపోయింది అతని అభిప్రాయం. నగరద్వారాల దగ్గిర వున్న యుద్ధభేరీలవంటి పెద్ద పెద్ద భేరీలను అదేపనిగా మ్రోగించి, నగర రక్షణకు నియుక్తులైన రాజభటుల్ని హెచ్చరించారు అచ్చుకావలివారు.

చిందులు తొక్కుతున్న అశ్వాలను అధిరోహించి గుంపులు గుంపులుగా వీధుల్లోకి వచ్చేశారు ఆ భటులు.

నగరమధ్యలో వున్న ఆంజనేయ స్వామి ఆలయం దగ్గిర నిలబడి మరిడయ్య బంధువు నివసించే ఇంటికోసం వెతుకుతూ వారిని గమనించాడు శ్రీధరుడు.

మరిడయ్య బంధువు ఇంటిలో తను ఆశ్రయం పొందిటం మంచిది కాదేమో నన్న ఆలోచన మొదటిసారిగా అడుగుపెట్టింది అతని మనసులో.

ఆ రోజు నగరంలోకి కొత్తగా వచ్చినవారిని గురించి ఆరాలు తీస్తున్నారు ఆ భటులు. మరిడయ్య బంధువు ఇంటికి చుట్టుపట్ల నివసించేవారు ఎవరైనా తనను గురించి ఆ భటులకు తెలియజేసిన మరుక్షణం రట్టు అయిపోయింది తన గుట్టు.

తను పట్టుబడమే కాకుండా, ఒక నేరస్థుడికి ఆశ్రయం యిచ్చినందుకు మరిడయ్య బంధువును కూడా ఆ భటులకు పట్టివ్వటం జరుగుతుంది.

పరిస్థితులు తనకు అనుకూలంగా మారేవరకు అతని దగ్గిరికి పోకూడదని నిర్ణయించుకుంటూ పక్కకు తిరిగి దగ్గిర్లో వున్న ఒక ఇరుకువీధివైపు కదులుతుండగా, అతన్ని గమనించారు భటులు.

అశ్వం మీదినుంచి పడటంవల్ల తలకు తగిలిన గాయానికి పెద్దకట్టు కట్టించుకుని స్వయంగా ఆ దళానికి నాయకత్వం వహిస్తున్నాడు నాసీరుడు.

క్రిందినుంచి పైదాకా ఒకసారి చూసిన వెంటనే గుర్తుపట్టాడతను శ్రీధరుడిని. గుర్తుపట్టిన వెంటనే గుండెలు చెదిరిపోయే శృతిలో బిగ్గరగా అరిచాడు.

"వీడే..నగరంలోకి పారిపోయి వచ్చిన దుర్మార్గుడు వీడే... పట్టుకోండి" అంటూ తన అశ్వాన్ని అతనిమీదికి దుమికించాడు నాసీరుడు.

దుస్తుల్లో వున్న పిడిబాకును చివ్వున బయటికి లాగి, నాసీరుడి ఎడమ పాదంమీద బలంగా పొడిచాడు శ్రీధరుడు.

అతనంత వేగంగా, అంత దురుసుగా తనని ఎదిరిస్తాడని వూహించక పోవటంవల్ల ఆ దెబ్బ నుంచి తప్పించుకోలేకపోయాడు నాసీరుడు. వెర్రిగా అరుస్తూ కాలును వెనక్కి లాక్కున్నాడు.

అదే సమయంలో తనమీదికి వచ్చిన అశ్వాన్ని ఎడమపిడికిలితో గట్టిగా మోదాడు శ్రీధరుడు.

చెవులు చిల్లులు పడేటట్లు సకిసిస్తూ,వెనుక కాళ్ళమీద పైకి లేచిందా అశ్వం. గాయపడిన పాదాన్ని చేతులలో నొక్కుబోతున్న నాసీరుడిని తల్లక్రిందులుగా వెనక్కి పడవేసింది.

"పట్టుకోండి... ఆ దుర్గార్గుడిని వెంటనే బంధించండి..." అని ఆజ్ఞ యిస్తూ,తన అశ్వంమీది నుంచి క్రిందికి దూకి తల్లక్రిందులుగా పడిపోయిన నాసీరుడి దగ్గిరికి పరిగెత్తాడు ఒక భటుడు.

తనను పట్టుకోవటానికి ఎవరు వస్తున్నారో, ఎంతమంది వస్తున్నారో తెలుసుకోవాలని ఎంతగా అనిపించినా తల వెనక్కితిప్పితే పట్టుబడిపోవడం తథ్యమనే అనుమానంతో సూటిగా ముందుకు పరుగులు తీశాడు శ్రీధరుడు.

అడుగుకు ఆరుగురు చొప్పున అతని మార్గాన్ని నిరోధించటం మొదలు పెట్టారు ఒక ఇరుకువీధిలో నివసించే పౌరులు.

చేతిలోని పిడిబాకును విసురుగా వూపుతూ వారందర్నీ దూరంగా తరిమేశాడు శ్రీధరుడు.

భయాందోళనలతో కంపించిపోతూ వారు చేస్తున్న ఆర్తనాదాల్ని లక్ష్య పెట్టకుండా ఆ వీధిచివర వున్న ఇంకో పెద్ద వీధిని సమీపించాడు.

సరిగ్గా అదే సమయంలో అతని మార్గానికి అడ్డువచ్చింది ఒక పచ్చల పల్లకీ.

గంభీరమైన కంఠాలతో శ్రమ తెలియకుండా ఏవేవో నినాదాలు చేస్తూ పల్లకీని బోయీలు అతన్ని గమనించలేదు.

సరైనసమయంలో తన పరుగువేగాన్ని తగ్గించుకోవటం సాధ్యపడక అందరికంటే ముందున్న బోయీని బలంగా ఢీకొన్నాడు శ్రీధరుడు.

కీచుగా అరిచి పల్లకీ దండాన్ని వదిలేశాడా బోయీ. ప్రక్కకు పడిపోయాడు.

పల్లకీ బరువును తనొక్కడే భరించలేక తనుకూడా పట్టును వదిలేయబోయాడు రెండవబోయీ.

"అయ్యయ్యో... పల్లకీ పడిపోతున్నది... హేమసుందరి పల్లకీ తల్లక్రిందులు కాబోతున్నది..."

అంటూ పెద్దగా అరిచారు ఆ దృశ్యాన్ని చూసిన పౌరులు కొంతమంది.

తన మూలకంగా క్రిందపడిపోయిన బోయీని పైకి లేపటానికి ముందుకు వగబోతూ ఆ అరుపుల్ని ఆలకించాడు శ్రీధరుడు.

బోయీ భుజాల్ని పట్టుకునే ఆలోచనను వెంటనే విరమించుకుని పల్లకీ దండాన్ని తన భుజంమీదికి అమాంతంగా లాగుకున్నాడు.

తల్లక్రిందులు కాబోతున్న పల్లకీ తిరిగి మామూలుగా నిలబడింది. జలతారు తెరల్ని ఒకచేత్తో ప్రక్కకు తొలగించి అతనికేసి చూసింది హేమసుందరి.

తను ఎక్కడ వున్నాడో వెంటనే మరచిపోయాడు శ్రీధరుడు. ఏ పరిస్థితిలో వున్నాడో కూడా విస్మరించి ఆమె సుందరమైన వదనారవిందం వైపే తదేకంగా చూస్తూ నిలబడిపోయాడు.

"రాచవీధిలో నడిచేటప్పుడు ముందు వెనుక చూసుకుని నడవాలని తెలియదా? ఎదుట ఏమున్నదో చూసుకోకుండా పరుగులు తీయటం మీకు అలవాటా?" కనులు చిట్లించి చూస్తూ మృదుమధురమైన కంఠంతో అడిగింది హేమసుందరి.

ఆమె అన్న ఆ మాటలతో తిరిగి ఈ లోకంలోకి వచ్చేశాడు శ్రీధరుడు.

"నీవంటి అతిలోకసుందరి ఎదురుగా వస్తుంటే ఎవరికి కనిపిస్తుంది దారి?" మెల్లిగా లేచి నిలబడిన బోయీకి తన భుజంమీది పల్లకీ దండాన్ని అందిస్తూ చిన్నకంఠంతో అన్నాడు.

ఆ మాటలకు ఆగ్రహం తెచ్చుకోవాలని ఎంతగా ప్రయత్నించినా, వీలుపడక పోవటంతో కనుల్ని క్రిందికి దించుకున్నది హేమసుందరి. ఎందుకో సిగ్గు ముంచుకు వచ్చేసిందామెకు.

"రాచవీధిలో నిలబడి కనిపించిన ప్రతివారితోను ఇచ్చకాలు వల్లిస్తూ వుంటే నీ పని అయిపోతుంది. ఇరుకువీధిలో అశ్వాల్ని నడిపించటం వీలుపడనందు వల్ల వేగంగా నీ వెనుక రాలేకపోయారు నగరరక్షకులు. ఇంకా ఆలస్యం చేశావంటే కాలినడకనే వచ్చి నీ భరతం పడతారు" ఉన్నట్లుండి ఒక సుపరిచిత కంఠం వీధి అవతలివైపునుంచి హెచ్చరించటంతో హేమసుందరి ముఖాబ్జం మీదినుంచి అతి బలవంతంగా చూపుల్ని మరలించుకున్నాడు శ్రీధరుడు.

కోరచూపులతో తనవంకే చూస్తున్న బోయీ భుజం తట్టి వీధి రెండోప్రక్కకు పరుగుతీశాడు.

తమలపాకులు, పొకచెక్కలు అమ్మబడే ఒక దుకాణంముందు నిలుచుని వున్నాడు నగరద్వారాల దగ్గిర అతనితో మాట్లాడిన వృద్ధుడు.

"నువ్వు నగరాన్ని చూడటానికి వచ్చావో, నగరంలోని బంధువులను కలుసుకోవటానికి వచ్చావో లేక సేనాపతి కుమారుడు నాసీరుడితో తలపట్లు పట్టటంకోసమే అరుదెంచావో అర్థం కావటంలేదు" శ్రీధరుడి ఎడమచేతిలోనే వున్న పిడిబాకు వంక చూస్తూ అన్నాడా వృద్ధుడు.

తమలపాకుల దుకాణం దగ్గిరికి వచ్చిన కొందరు పౌరులు కూడా అతని మాదిరిగా తనచేతిలోని ఆ ఆయుధంవంక విచిత్రంగా చూస్తూ వుండటాన్ని గమనించి నాలుక కరుచుకున్నాడు శ్రీధరుడు.

"జరగవలసిన నష్టం ఏదో జరిగిపోనేపోయింది. ఇప్పుడు పశ్చాత్తాపపడి నందువల్ల ప్రయోజనం ఏమీ వుండదు. ముందు ఇక్కడినుంచి దూరంగా పారిపోకపోతే ప్రమాదంలో చిక్కుపడక తప్పదు" అంటూ అతని చేతిని పట్టుకుని ప్రక్కనే వున్న మరో ఇరుకువీధిలోకి లాగాడు వృద్ధుడు.

అశ్వాలను వదిలి కాలినడకన వచ్చిన నగరరక్షకులు తమలపాకుల దుకాణంముందు నిలబడే సమయానికి చాలాదూరం వెళ్లిపోయారు వారిద్దరూ.

* * *

"ధనదుపుర సార్వభౌముడి అనుగ్రహాన్ని పూర్తిగా పొందిన అతిలోక సుందరి, అపూర్వనర్తకి హేమసుందరి పల్లకీని నువ్వు ఢీ కొన్నావు. ఆమె పల్లకీలో నుంచి క్రింద పడిపోయి వుంటే ఏం జరిగేదో ఆలోచించావా?" ఎక్కడా ఆగకుండా వేగంగా అడుగులు వేస్తూ శ్రీధరుడిని ప్రశ్నించాడు వృద్ధుడు.

వయసు మీరిపోతున్నా కొంచెంగా కూడా మందగించని అతని నడకలోని వేగాన్ని గమనించి ఆశ్చర్యపడుతూ తల అడ్డంగా తిప్పాడు శ్రీధరుడు.

"రాజభటులు రావాల్సిన అవసరం లేకుండానే వట్టిచేతులతో నీ ప్రాణాలు తీసేసేవారు ఆ వీధిలో నివసిస్తున్న పౌరులు అందరూ. వున్న బాధలకు తోడుగా కొత్తబాధల్ని ఆహ్వానించటం తెలివిగలవారి లక్షణం ఎంతమాత్రం కాదు" అంటూ వున్నట్టుండి ఒక చిన్న వీధిమధ్యలో ఆగిపోయాడు వృద్ధుడు.

తనను తరిమిన నగర రక్షకులు ఎవరైనా అటుగా వస్తున్నారేమోనన్న అనుమానంతో చుట్టూ చూసిన శ్రీధరుడికి అగుపించారు యిద్దరు మహాకాయులు.

"ఈ మహానగరంలో రకరకాల నేరాలు చేసి జీవించేవారు నివసించే ప్రదేశం యిది. అటువంటి వారందరికీ మకుటంలేని మహారాజులు ఈ మహాకాయులు" లోగొంతుకతో అంటూ వారిని గురించి తెలియజేశాడు వృద్ధుడు.

"నగర రక్షకులతో గొడవపడి యిటుగా వచ్చాడు ఈ యువకుడు. ఇతని కోసం వెతుకుతూ వాళ్ళుకూడా వచ్చేశారు, రెండో కంటివాడికి తెలియకుండా రహస్యజీవనం చేస్తున్న ఎంతోమంది జీవితాలను దుర్భరం చేసేస్తారు."

ఉరుములాంటి కంఠంతో అంటూ శ్రీధరుడి ముందుకు వచ్చాడు ఒక మహాకాయుడు.

అతను మరొక్క అడుగు ముందుకు వేస్తే తన దట్టీలోని పిడిబాకును చివ్వున బయటికి లాగాలని అనుకుంటున్న శ్రీధరుని చేతిని గట్టిగా అదిమి కనులతోనే హెచ్చరిక చేశాడు వృద్ధుడు.

"రకరకాల కారణాలతో రాజభటులకు కనిపించకుండా పారిపోయి వచ్చినవారు చాలామంది ఈ చుట్టుపట్ల తలలు దాచుకుంటున్నారు. వారితో పోల్చుకుంటే మేము చాలా అల్పులం. సేనాపతి కుమారుడు నాసీరదేవుడిని గాయపరచటం తప్ప మరోనేరం చేయలేదు ఈ యువకుడు" మృదుస్వరంతో తమనుగురించి ఆ మహాకాయుడికి తెలియజేశాడు.

సేనాపతి కుమారుడైన నాసీరుడ్ని గాయపరచటమనే మాట చెవులపడగానే విచిత్రంగా మెరిశాయి ఆ మహాకాయుడి కనులు.

"ఎంతోకాలంగా మేము చేయాలని అనుకుంటున్న పనిని యితను చేసినందుకు సంతోషించాలనే వున్నది. తన కుమారుడిని గాయపరిచిన వ్యక్తి కోసం సేనాపతి పట్టుదలగా వెతికిస్తాడని భయంగా కూడా వున్నది" ముఖం మీదికి పడుతున్న జేబురు జుట్టును వెనక్కి నెట్టుకుంటూ అన్నాడతను.

ఆ పైన అతనితో మాటలు పెంచుకోలేదు వృద్ధుడు. తన దట్టీలోనుంచి నాలుగు బంగారు నాణేల్ని తీసి అతని ముందుకు జాచాడు.

రెండు క్షణికాలు ఆలోచించి, ఆ నాణేల్ని స్వీకరించాడు మహాకాయుడు.

"శ్యామల యిల్లు ఖాళీగానే వున్నది. కాంచీపురంలో సైనికుడిగా పనిచేసే ఆమె భర్త యింకా తిరిగిరాలేదు" అంటూ వెనుతిరిగి అంతకుముందు తను నిలుచున్న ప్రదేశంలోకి వెళ్లిపోయాడు.

"మనగురించి వీరు నగరరక్షకులకు తెలియచేయకుండా ఆగుతారా?"

పాతిక ధనువుల దూరం ముందుకు పోయిన తరువాత మెల్లిగా వృద్ధుడిని పలుకరించాడు శ్రీధరుడు.

"మనం యిచ్చిన నాణేల్ని స్వీకరించకుండా వున్నట్లయితే నువ్వు అనుకుంటున్న విధంగానే జరిగి వుండేది. నాణేల్ని తీసుకున్న తర్వాత నోరు విప్పే అలవాటు వీరికి లేదు... నేరాలు చేసి బ్రతికే వీరందరికీ కొన్ని కఠినమైన నియమాలున్నాయి. వాటిని పొరపాటున కూడా అధిగమించరు.

మనంతట మనం రాజభటులు కళ్ళల్లో పడితే తప్ప. చుట్టుపట్ల నివసించే వారిద్వారా మన గురించి వారికి తెలియదు" అంటూ ఒక చిన్న పెంకుటింటి ముందు ఆగాడు వృద్ధుడు.

చక్కటి పూలచేట్ల మధ్యలో అందంగా కట్టబడి వున్న ఆ యింటి సౌందర్యాన్ని చూసి మెచ్చుకోలుగా తలవూపుతున్న శ్రీధరుడిని చూసి కనులు చిట్లించింది ఆయింటి తలుపుల్ని తెరిచి బయటికి తొంగి చూసిన ఒక యువతి.

శ్రీధరుడి వయస్సే వుంటుంది ఆమెకు. చంకలో రెండు సంవత్సరాల వయసుండే పసిబిడ్డడు వున్నాడు.

పోయినసారి వచ్చినప్పుడు నువ్వు నాలుగు బంగారు నాణేలు ఎగవేసి పోయావు. నిన్ను నా ఇంటిలోకి అడుగుపెట్టనివ్వను"శ్రీధరపడి ముఖంమీది చూపుల్ని వృద్ధుడికేసి మరలిస్తూ కోపంగా అన్నదామె.

తనను చూసి చేతులు చాస్తున్న ఆమె బిడ్డడిని చనువుగా పలుకరిస్తూ దట్టీలోనుంచి పదినాణేలను తీసి ఆమెకు అందించాడు వృద్ధుడు.

"నాతోపాటు ఈ యువకుడు కూడా నాలుగురోజులు ఇక్కడ వుంటాడు" అంటూ ఆమె అనుమతికోసం ఎదురుచూడకుండా లోపలికి అడుగువేశాడు.

ఇద్దరు వ్యక్తులు విశ్రాంతి తీసుకోవటానికి అవసరమైన వసతులన్నీ ఆ గృహంలో వుండటాన్ని గమనించి తృప్తిగా తలవూపాడు శ్రీధరుడు.

"మంచినీటి బావి ఇక్కడకి సమీపంలోనే వున్నది. మీరు స్నానాలు పూర్తిచేసేసరికి భోజనం సిద్ధం అవుతుంది" శుభ్రమైన రెండు వస్త్రాలను తెచ్చి శ్రీధరుడికి అందిస్తూ చెప్పింది శ్యామల.

స్నానం చేయడానికి వృద్ధుడితో కలిసి ఆమె చూపించిన మంచినీటి బావి దగ్గిరికి పోయాడు శ్రీధరుడు.

వంటినలుముకుని వున్న దుమ్మును పూర్తిగా వదిలించుకుని శ్యామల ఇచ్చిన దుస్తుల్ని ధరించాడు.

ముడుతలు పడిపోయి చినిగిపోవటానికి సిద్ధంగా వున్నట్లు అగుపించే తన పాతదుస్తుల్ని ఒఖమూలగా పెట్టి, ఆమె వడ్డించిన ఆహారాన్ని తృప్తిగా భుజించాడు శ్రీధరుడు.

స్వగ్రామం నుండి బయలుదేరిన క్షణంనుంచీ విశ్రాంతి లేకపోవడంవల్ల వెంటనే ముంచుకువచ్చింది అతనికి నిద్దుర.

"ప్రొద్దు పడమరకు తిరిగింది. సంధ్యాసమయం కావటానికి ఇంకో రెండు ఘడియలు మాత్రమే వున్నది వ్యవధి" వున్నట్లుండి శ్యామల కంఠం బిగ్గిరిగా వినిపించటంతో, ఉలిక్కిపడి కనులు తెరిచాడు అతను.

అప్పటివరకూ మందిరద్వారం దగ్గిర తచ్చాడుతున్న శ్యామల బిడ్డడు, వచ్చీరాని మాటలు మాట్లాడుతూ తల్పంమీదికి ఎగబ్రాకి, అతని గుండెలమీద కూర్చున్నాడు.

"దిగు నాయనా... క్రిందకు దిగు" అని అతన్ని అవతలికి లాగబోయిన తల్లిని వారించి, అతని బుగ్గల్ని ముద్దాడాడు శ్రీధరుడు.

"నగరంలోని వారందరూ కోదండరాముడి ఆలయం దగ్గిరికి పోతున్నాయరు. కోలాహలుడు కూడా ఇంతకుముందే అక్కడకి వెళ్ళిపోయాడు" తళతళమెరుస్తున్న ఒక పాత్రనిండా మంచినీటిని తెచ్చి అతనికి అందిస్తూ చెప్పింది శ్యామల.

తనను అక్కడికి తీసుకువచ్చిన వృద్ధుడిపేరు కోలాహలుడని అప్పుడు తెలుసుకున్నాడు శ్రీధరుడు.

"తను తిరిగిరావటం ఆలస్యం అవుతుందని నీకు చెప్పమన్నాడు కోలాహలుడు. రాకపోయినా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదని కూడా

అన్నాడు" పెద్ద పళ్ళెరంనిండా రుచికరమైన ఫలాల్ని నింపి తల్పం దగ్గిర పెడుతూ వివరించింది ఆమె.

ఆ ఫలాల్లో రెండింటిని ఆమెబిడ్డ నోటికి అందించి, మరో రెండింటిని తనూ ఆరగిస్తూ తన పరిస్థితిని అంచనా వేసుకున్నాడు శ్రీధరుడు.

కోలాహలుడు తిరిగివచ్చినా రాకపోయినా తను మరికొన్ని దినాలు అక్కడే గడపటం మంచిది. నగర రక్షకుల సందడి తగ్గుముఖం పట్టిన తరువాత మరిడయ్య బంధువు దగ్గిరికి వెళ్ళాలి. తన తండ్రివద్ద నుంచి సమాచారం ఏదయినా వచ్చిన మరుక్షణం తనకు తెలియచేయమని చెప్పిరావాలి.

"కోదండరాముడి ఆలయం దగ్గిరికి పోవాలనే కోరిక నీకులేదా?" ద్వారం దగ్గిర నిలబడుతూ. అతని ఆలోచనలకు అడ్డుతగిలింది శ్యామల.

ఆ మాటలతో ఈ లోకంలోకి వచ్చేశాడు శ్రీధరుడు. ఒడిలో వున్న బిడ్డడిని క్రిందకి దించుతూ ప్రశ్నార్థకంగా ఆమెవంక చూశాడు.

"నగర ప్రజలందరి సమక్షంలోను గజదొంగ గర్గుడికి కోదండరాముడి ఆలయం దగ్గిర ఉరిశిక్ష అమలు జరుపబోతున్నారు. కోలాహలుడితో కలిసి తిరుగుతున్న నీకు ఇది తెలియకపోవడం విచిత్రంగా వున్నది" తన దగ్గిరికి వచ్చిన బిడ్డడిని చంకకు ఎత్తుకుంటూ ఆశ్చర్యంగా అన్నది శ్యామల.

ఆమె మాటలకు నొచ్చుకోలేదతను. మతిమరుపు వున్న మనిషిలా చిరునవ్వు నవ్వి, తన దుస్తుల్ని వదిలిన మూలకేసి చూశాడు.

"నువ్వు నిద్రపోతున్నప్పుడు శుభ్రపరిచి ఎండలో వేశాను. ఒక్కక్షణం ఆగితే ఇప్పుడే తీసుకువస్తాను" అంటూ బిడ్డడితో ఇంటి ప్రక్కభాగంలోకి పోయి అతని దుస్తుల్ని తీసుకువచ్చింది శ్యామల.

"నిన్ను చూస్తుంటే కోలాహలుడికి సరైన స్నేహితుడిగా కనిపిస్తున్నావు రెండు మాసాలపాటు హాయిగా ఉపయోగించుకోవటానికి సరిపడే ధనపు మూటను మాసిపోయిన దుస్తుల్లో అజాగ్రత్తగా వదిలేస్తారా ఎవరయినా?" అంటూ అతని దట్టీలో వుండవలసిన బంగారునాణేల సంచీని, పిడిబాకును కూడా అతని చేతికి ఇచ్చింది శ్యామల.

ఆమెను అవతలికి పోనిచ్చి దుస్తుల్ని మార్చుకుంటుండగా గుర్తుకు వచ్చింది శ్రీధరుడికి కొండచిలువను వధించినందుకు కృతజ్ఞతగా మారుమూల గ్రామస్థులు ఇచ్చిన రాగికంకణం.

"ఇది నీకు ఎక్కడ లభించిందోగానీ, విచిత్రంగా వున్నది. మా నగరం వెలుపల నల్లరాతి గుట్టమీద వుండే భైరవి ఆలయం దీనిమీద చెక్కబడి వున్నది" పదిక్షణాల తర్వాత తిరిగి మందిర ద్వారం దగ్గిరికి వస్తూ, రాగి కంకణాన్ని అతనికి యిచ్చింది. మురికిపట్టిన దుస్తుల్ని శుభ్రపరిచే సమయంలో ఆ కంకణాన్ని చూసి, దాన్ని కూడా చక్కబరిచినట్లుంది ఆమె. తరతరాలుగా ఆవరించుకుని వున్న మకిలి తొలిగి తళతళలాడిపోతున్నది అది.

మారుమూల గ్రామస్థుడు అభిలషించినట్లుగానే ఆ కంకణాన్ని దక్షిణ హస్తానికి అలంకరించుకుని పిడిబాకుని దట్టీలో దోపుకున్నాడు శ్రీధరుడు.

"కోలాహలుడు తిరిగి వచ్చినా, రాకపోయినా, మరికొన్ని దినాలు నేను ఇక్కడే వుండి తీరాలి. నీకు అవసరమైన నాణేల్ని నువ్వు తీసుకో... నన్ను అడగవలసిన అవసరంలేదు" అంటూ , ఇంటిలోనుంచి బయటికి వచ్చాడు. కొద్దిదూరం నడిచిన వెంటనే అగుపించింది కోదండరాముడి ఆలయ గోపురం.

ఇసుకవేస్తే క్రిందికి రాలనంతగా అక్కడ కిక్కిరిసిపోయి నిలబడి వున్న జనసమూహం మధ్యలోనుంచి ఎంతో ప్రయత్నం మీద ఖాళీస్థలం అంచుల్ని చేరుకున్నాడు శ్రీధరుడు.

రెండు నిలువుల ఎత్తున కట్టబడింది గర్గుడిని ఉరి తీయటానికిఉపయోగపడే వేదిక.

"రాజద్రోహం చేసేవారికి, రాజధనాన్ని అపహరించ చూసినవారికి విధించ బడే కఠినశిక్షను ప్రజలందరూ గమనించండి.. నేరాలు చేసి శిక్ష పడకుండా తప్పించుకు తిరగటం చాలా సులభమనే మాటను మీరందరూ మరిచిపోండి." అక్కడ గుమిగూడి వున్న ప్రజలందరివంకా చూస్తూ సంభీరమైన కంఠంతో హెచ్చరించాడు ధనదుపుర సార్వభౌముడు.

"సూర్యాస్తమయం కాబోతున్నది... గజదొంగ గర్గుడిని తీసుకురావటానికి అనుమతించండి..." నిలువెత్తు ఆసనాన్ని అధివసించి వున్న మహారాజు దగ్గిరికి పోయి వినయంగా అర్థిస్తున్న మహామంత్రులవారిని చూసి ఊపిర్లు బగపట్టారు ప్రజలు.

కోరమీసాలను కొనగోట సవరించుకుంటూ కొద్దిగా తలపంకించాడు మహారాజు.

"తప్పుకోండి... గజదొంగ గర్గుడిని తీసుకువచ్చే భటులకు దారివదలండి. ప్రక్కకు తప్పుకోండి..." అంటూ ప్రజలందర్నీరాజదండాలతో వెనక్కి నెడుతూ అటువచ్చారు రాజభటులు.

వారిమార్గాన్ని నిరోధించకుండా దూరంగా జరిగాడు శ్రీధరుడు. బలమైన ఇనుపసంకెళ్ల మధ్యలో బందీగా వుండికూడా, చిరునవ్వుల్ని చిందిస్తూ వస్తూన్న

గర్గుడిని గమనించేసరికి అంతులేకుండా పోయింది అతని ఆశ్చర్యానికి. కరకు కత్తుల్ని గట్టిగా పట్టుకుని గర్గుడికి నాలుగుపక్కలా నడుస్తున్నారు పదిమంది సైనికులు. వారందరికీ కొంచెం ముందుగా అడుగులు వేస్తున్నాడు కారాగృహాధిపతి.

"ఇంకా కొద్దిసేపటిలో ప్రణాలు పోగొట్టుకోబోతున్నాడని తెలిసికూడా అలా నవ్వుతాడేమిటి గర్గుడు? పిచ్చిగాని పట్టలేదు కదా!" గర్గుడి ప్రవర్తనకు విస్తుబోతూ శ్రీధరుడిని ప్రశ్నించాడు పక్కనే నిలబడివున్నపౌరుడు ఒకతను.

తనుకూడా ఆ విషయాన్ని గురించి ఆలోచిస్తున్నట్లుగా అతనికి చెప్పబోయేంతలో శ్రీధరుడి దృష్టిని ఆకర్షించాడు గర్గుడి వెనకగా ఒక అశ్వం మీద వస్తున్న నాసీరుడు. ఆ రోజు ఉదయం కాలికి తగిలిన గాయానికి చాలా పెద్ద వస్త్రాన్ని కట్టించుకున్నాడతను.

తలమీద గాయానికి అంతకుందు కట్టిన కట్టును అలాగే వుంచుకున్నాడు.

అతని దృష్టిని తనమీదికి ప్రసరించకముందే ముఖాన్ని చాటుచేసుకోవటం చాలామంచిదని అనుకుంటూ వెనుకంజ వేయబోతున్న శ్రీధరుడికి చాలా సమీపంలోకి వచ్చి ఎందుకో తడబడ్డాడు గర్గుడు.

పాదాలకు బిగించివున్న ఇనుపగొలుసులు అడుగుల కదలికకు అటూ ఇటూ కదిలి చీలమండలకు బలంగా కొట్టుకున్నాయి కాబోలు,బాధగా నొసలు విరుస్తూ ముందుకు వంగాడు.

పారిపోయేందుకు ప్రయత్నం చేయబోతున్నాడనే భావించి వెర్రిగా అరిచారు అతనికి కాపున్న సైనికులు. తమచేతుల్లో వున్న కత్తుల్ని అతని వెన్నుకేసి గురిపెట్టారు.

గిరుక్కున వెనుతిరిగి గర్గుడి సమీపంలోకి చేరుకున్నాడు కారాగృహాధిపతి.

"తప్పించుకోవటానికి నువ్వు ప్రయత్నించటం వృధా...ఆ పని నీవల్ల కాదు. అనవసరంగా నీ శరీరాన్ని బాధలకు గురిచేసుకోకు..." అని హెచ్చరిస్తూ, అతని భుజాల్ని పట్టుకుని పైకి లేపాడు.

బాధను దిగమింగుకుంటూ లేచి నిలబడిన గర్గుడి వెన్నుమీద తన చేతిలోని వెదురుచువ్వను ఝుళిపించాడు అశ్వంమీద వస్తున్న నాసీరుడు.

"నీకు విధించబడిన శిక్షను చూడటం కోసం సార్వభౌములే స్వయంగా వచ్చివున్నారు. వారిని వేచియుండేటట్లు చేయటం మహాపరాధం. అందుకు శిక్ష చాలా అధికంగా వుంటుంది" అధికారదర్పం నిండిన కంఠంతో దురుసుగా అన్నాడు.

ఉరిశిక్ష విధించబడి,మరికొద్దిసేపటిలో ప్రాణాలను పోగొట్టుకోబోతున్న మనిషికి అంతకంటే అధికశిక్ష ఎలా విధింపబడుతుందో అర్థంకాలేదు ఆ మాటల్ని ఆలకించిన శ్రీధరుడికి.

నాసీరుడు అధిరోహించిన అశ్వం తనకు సమీపంలోకి రాగానే దట్టీలో వున్న పిడిబాకుపై తనకు తెలియకుండానే చేయివేశాడు.

"ఎన్ని ఎదురుదెబ్బలు తగిలినా నీకు జ్ఞానం కలగటంలేదు. ఒకసారి ఎవరిమైనా ద్వేషించటం మొదలు పెడితే నీ కంఠంలో ప్రాణం వున్నంతవరకూ ఆ విషయాన్ని మరిచిపోవని నాకు అనిపిస్తోంది" కరుకుకంఠం ఒకటి మెత్తగా తనచెవుల్లో మాట్లాడేసరికి, ఒక్కసారిగా ఉలిక్కిపడి పక్కకు చూశాడతను.

ఎప్పుడు వచ్చాడోగాని, నిశ్శబ్దంగా వచ్చి అతనివెనుక నిలుచుని వున్నాడు కోలాహలుడు.

"జనం మధ్యలో నిలుచుంటే గర్గుడి ముఖం మనకు కనిపించదు. అందరి కంటే ముందు నిలబడి దగ్గర్లో నుంచి చూద్దాం" అంటూ శ్రీధరుడి చేయి పట్టుకుని ముందుకు లాగాడతను.

దూరంగా వెళ్ళిపోయిన నాసీరుడి వంక ఒకసారి చూసి అతన్ని అనుసరించాడు శ్రీధరుడు.

ఎంతో ప్రయత్నం మీద ముందువరుసల్లోకి పోయి, వేదికకి సమీపంలో నిలుచున్నాడు.

కరచరణాలకు బంధించి వున్న ఇనుపగొలుసుల్ని ఊడదీసి గర్గుడిని వేదిక మీద నిలబెట్టారు సైనికులు.

పెద్దకంఠంతో రాజాజ్ఞను అతనికి చదివి వినిపించాడు మహామంత్రి.

"ఉరితాడు నీ కంఠాన్ని అలంకరించబోయేందుకు ముందుగా నీ మనసులో ఆఖరికోరిక ఏదైనా వుంటే ధనదుపుర సార్వభౌములకు నిర్భయంగా విన్నవించుకోవచ్చు. ప్రాణ భిక్ష కాకూడదా కోరిక..." అని వెల్లడించాడు.

అధికారమన్నా, అధికారులన్నా ఇసుకంత కూడా లక్ష్యంలేని గర్గుడు ఎటువంటి కోరిక కోరతాడో చెవులారా వినటానికి ఉవ్విళ్ళూరుతూ, ఊపిర్లు బిగపట్టారు ధనదుపుర ప్రజానీకం.

"జగదభిరాముడైన కోదండరాముడి దివ్యసమక్షంలో నేను చేసిన నేరాలకు శిక్షను అనుభవించవలసి రావడం నా అదృష్టంగానే భావిస్తున్నాను. ప్రాణాలను పోగొట్టుకునేందుకు ముందు ఒక్కసారి ధ్వజస్తంభంమీది చిరుగంటల్ని మ్రోగించానని వున్నది, సార్వభౌములు అందుకు అనుమతి ఇప్పిస్తారని ఆశిస్తున్నాను" గంభీరమైన కంఠంతో తన ఆఖరికోరిక వెల్లడించాడు గర్గుడు.

నివ్వెరపోయారు అక్కడ గుమికూడి వున్న పౌరులందరూ.

చెరసాలలో వుండగా ఆరగించటానికి వీలుపడని రుచికరమైన పదార్థాలను తెప్పించమంటాడని అనుకున్నారు కొందరు.

తనకు అత్యంత ఆప్తులైన వారి నామధేయాన్ని వెల్లడించి వారితో రెండు క్షణాలసేపు సంభాషించాలనే కాంక్షను వ్యక్తపరుస్తాడని భావించారు మరికొంతమంది. ప్రాణాలు పోయిన తర్వాత తన ఆత్మశాంతికి చేయవలసిన కర్మకాండల్ని గురించి సూచిస్తాడని భ్రమపడ్డారు చాలామంది.

తమ ఊహలకు పూర్తిగా విరుద్ధమైన కోరికను అతను వెల్లడించేసరికి విపరీతమైనటువంటి ఆశ్చర్యంతో తలమున్కలైపోతూ సార్వభౌములవారివైపు దృష్టిని మరలించారు అందరూ.

ఆలయం దగ్గిర నిలబడి ఆ తతంగాన్నంత తదేకదీక్షతో చూస్తున్న కోదండ రాముడి పూజారుల్లో కలకలం చెలరేగింది ఒక్కసారిగా.

"ధర్మవిరుద్ధమైన గర్గుడి కోరికను మీరు అంగీకరించవద్దు... అతని నీడ కూడా పవిత్ర ఆలయం మీద పడకూడదు" పెద్దకంఠంతో బిగ్గిరిగా అరిచి తమ అభ్యంతరాన్ని సార్వభౌములకు విన్నవించుకున్నాడు అతిముఖ్యుడైన పూజారి ఒకతను.

"మరణశిక్షను అనుభవించబోతున్న వ్యక్తికి ఆలయప్రవేశం నిషిద్ధమో కాదో తేల్చుకోవాల్సిన సమయం కాదు యిది. నిలుచున్న చోటినించి ఆ గర్గుడిని అవతలికి పోనిస్తే తిరిగి మనకు చిక్కుతాడో...చిక్కడో...ఏ మాత్రం అవకాశం లభించినా మన కళ్ళు కప్పి అదృశ్యుడు అవుతాడు అతను. మరో కోరిక ఏదైనా

కోరుకోమని చెప్పండి మహాప్రభూ..." సార్వభౌముల సమీపం లోకి పోయి చిన్నకంఠంతో తన అభిప్రాయాన్ని తెలియచేశాడు మహామంత్రి.

"నా చివరి కోరికను తీర్చేందుకు మీకు అభ్యంతరం ఏదైనా వుంటే ఆ విషయాన్ని వెంటనే వెల్లడించండి. ధ్వజస్తంభం మీద గంటల్ని మ్రోగించాలనే కోరికతప్ప మరెటువంటి కోరికా నాకులేదు. మీరు విధించిన శిక్షను యిక వెంటనే అమలుపరచవచ్చు" సమస్త ప్రజానీకానికి వినిపించేటట్లు పెద్ద కంఠంతో అంటూ తనకు తనే తలారి చేతిలోని ఉరిత్రాటిని మెడకు తగిలించుకున్నాడు గర్గుడు.

అతని ధైర్యానికి, అతని నిర్భయత్వానికి మెచ్చుకోలుగా తలలు ఊపారు అక్కడ వున్న పౌరులందరూ.

అదే సమయంలో ఏదో నిశ్చయానికి వచ్చినట్లు తల విదిలించి, గర్గుడివైపు దృష్టిని సారించాడు ధనదుపుర సార్వభౌముడు.

"సాంప్రదాయం ప్రకారం ఉరిశిక్ష విధించబడిన నేరస్థుడి ఆఖరి కోరికను తీర్చవలసిన బాధ్య మాపైన వున్నది. ఆ కోరిక ధర్మబద్ధమై వుండాలనే విషయం నేరస్థుడికి తెసిసివుండాలి. నేరం నిరూపితమైన నీకు ఆలయంలో అడుగుపెట్టే అర్హతలేదు. ఆలయంలో అడుగుపట్టకుండా ధ్వజస్తంభంమీది గంటల్ని మ్రోగించగలిగితే మాకు ఎటువంటి అభ్యంతరం లేదు" గంభీరమయిన కంఠంతో ప్రజలందరికీ వినిపించేలా గజదొంగకు చెప్పాడు.

ఆలయంలోకి పోకుండా, ధ్వజస్తంభం మీదికి ఎగప్రాకకుండా ఆ గంటల్ని మ్రోగించటం ఎలాగో అర్థంకాలేదు పౌరులందరికీ.

ఇనుపగొలుసుల రాపిడికి కాయలు కాచిన కరాలను ఒకటిగా చేర్చి అభివాదం చేశాడు గర్గుడు.

"ధనదుపుర సార్వభౌములకు జయము జయము. కరుణాసముద్రులకు నా వినయపూర్వక ప్రణామయు" అంటూ వేదికను సమీపంలో వున్న ఒక రాజభటుడివైపు చేతిని జాచాడు. అతనిచేతిలో వున్న రాజదండాన్ని అడిగి తీసుకున్నాడు.

రాజదండాన్ని రెండుసార్లు చేతుల్లో గిరగిరా తిప్పి, యుద్దసమయంలో బరిశెను విసిరేందుకు సిద్ధపడే సైనికుడి మాదిరి శరీరాన్ని వెనక్కివంచాడు గర్గుడు.

హుమ్మని ఒకసారి హుంకరించి చేతిలోని రాజదండాన్ని ధ్వజస్తంభంమీదికి విసిరాడు.

తోకచుక్క మాదిరి రివ్వున గాలిలోకి లేచి సూటిగా పోయింది అది.

ధ్వజస్తంభం పైభాగంలో వున్న పెద్ద కంచుగంటలకు తగిలింది.

అక్కడి వారందరి గుండెలు ఝల్లుమనేటట్లు ఖంగున మ్రోగిందా గంట.

ఆశ్చర్యాన్ని అణుచుకోవడం చేతకాక కరతాళధ్వనులు చేయిబోయి, ఆఖరి ప్రయత్నంలో ఆగిపోయారు పౌరులందరూ.

ఎందుకంటే – ధ్వజస్తంభం మీది కంచుగంట ఖంగుమంటున్న సమయంలోనే గింగిరాలు తిరుగుతూ స్తంభంమీదినుంచి క్రిందిపడిందొక పెద్ద పట్టుగుడ్డ మూట. అస్తమించబోతున్న సంధ్యాపతి అరుణకిరణాలు పడి కనులు మిరుమిట్లు గొలిపే కాంతుల్ని వెలువరించాయి ఆ మూటలో నిక్షిప్తపరచబడి వున్న నగలు, బంగారు నాణేలు.

క్రిందపడగానే నలుదిక్కులకు వెదజల్లబడ్డాయి అవి... ఆలయ ప్రాకారాల మీదా, గాలిగోపురాలమీదా అధివశించి వున్న పౌరుల్లో విపరీతమైన కలవరాన్ని సృష్టించాయి.

"పదండి... అందరూ పదండి... ఆలయస్తంభంమీదినించి అపూర్వసంపద నేలను తాకింది. ఎవరు ముందుగా పోగలిగితో వారికే స్వంతం అవుతుంది ఆ సొత్తు...త్వరగా పదండి..." గొంతు చినిగిపోయేటట్లు అరిచి వేదికచుట్టూ నిలబడి వున్న పౌరుల్ని హెచ్చరించాడు కోలాహలుడు.

అతని మాటలు పూర్తికాకముందే ఆలయం దగ్గిర చెలరేగింది దారుణమయిన తొక్కిసలాట. తళతళా మెరిసిపోతూ ఆలయప్రాంగణం నిండా పడిన ఆభరణాల్ని, బంగారు నాణేల్ని చేజిక్కించుకోవటం కోసం ఒకేసారి ఎగబడ్డారు అక్కడ వున్న పౌరులు.

ఆ దృశ్యాన్ని చూసి తాము అక్కడికి ఎందుకు వచ్చారో మరిచిపోయారు వేదికకు సమీపంలో వున్నపౌరులు. ఒకరినొకరు నెట్టుకుంటూ, ఒకరి కరచరణాలకు మరొకరు అడ్డుపడుతూ అటుకేసి పరుగులు తీశారు.

కన్నుమూసి కన్ను తెరిచటంలో ఆరంభం అయిన ఆ సందడిని అదుపులో పెట్టటం రాజభటులకు అసాధ్యమైపోయింది.

కొండరాతిలో మలచిన విగ్రహం మాదిరి చలనం లేకుండా వేదిక మీద నిలబడి వున్న తలారిని తన ఎడమభుజంతో వెనక్కి నెట్టాడు గర్గుడు.

తను ఏం చేస్తున్నాడో రాజభటులకు అర్థం అయ్యేలోపుగా చెంగున వేదికమీదినించి జనంమధ్యలోకి దూకేశాడు. అనుకోని విధంగా ఆలయం దగ్గిర చెలరేగిన కలకలంవైపే చూస్తున్న సార్వభౌములు, మహామంత్రి, సేనాధిపతులు తెలివిన పడేసరికి చాలా ఆలస్యం అయిపోయింది.

అడ్డువచ్చిన వారిని రాజదండానతోను, బరిశెలతోను ఇష్టం వచ్చినట్లు అదిలిస్తూ పరుగులు తీయటం ప్రారంభించారు రాజభటులు.

"గర్గుడిని పట్టుకున్నవారికి, పట్టుకోవటంలో సహకరించినవారికి పదివేల బంగారునాణేలు బహూకరించబడతాయి. ఆలయం దగ్గిర వెదజల్లబడిన సంపద యావత్తూ ఆ వ్యక్తికే యిచ్చివేయటం జరుగుతుంది" యుద్ధభేరివంటి కంఠాలతో పౌరుల్ని హెచ్చరించటం మొదలు పెట్టారు వారిలో కొందరు.

చీకట్లు నగరమార్గాన్ని చుట్టుముట్టే సమయం దగ్గిర పడుతున్నకొద్దీఅధికం అయిపోతున్న ఆ సంరంభం మధ్యలో చిక్కుపడకుండా, వచ్చిన దారినే శ్యామల ఇంటికేసి వెళ్లిపోవాలన్నకోరికతో వడివడిగా అడుగులు వేస్తున్న శ్రీధరుడి మార్గాన్ని నరోధించారు కొందరు భటులు.

"రాజభటులు కనులు కప్పి మటుమాయం అయిపోయిన గర్గుడిని నువ్వు చూశావా?" రాజదండంతో అతని గుండెలను తడుతూ అడిగాడు వారిలో ఒకతను.

వామనహస్తాన్ని ఎత్తి ఆ దండాన్ని అవతలికి నెట్టాలన్న కోరికను అతి ప్రయత్నంమీద అదుముకుంటూ తల అడ్డంగా తిప్పాడు శ్రీధరుడు.

నీడల మాదిరి తనను అనుసరించే అశ్వకులను వెంటబెట్టుకుని అదే సమయంలో అక్కడికి వచ్చేశాడు సేనాపతులవారి బిడ్డడు నాసీరుడు.

"ఎవరితను? ఎందుకునిలబెట్టారు యిక్కడ?" అధికారం ప్రతిఫలిస్తున్న కంఠంతో అడుగుతూ ముందుకువచ్చి శ్రీధరుడి ముఖంలోకి చూశాడు.

"గర్గుడిని విడిపించటానికి ఈ రోజు ఉదయం నగరంలోకి వచ్చిన దుండగుడు ఇతనే.. చూస్తారేమిటి... బంధించండి.. కరచరణాలను విరగదీసి అవిటివానిగా మార్చేయండి..." పెద్దగా అరుస్తూ, తన అశ్వాన్ని శ్రీధరుడిమీదికి దుమికించాడు.

దట్టీలో వున్న పిడిబాకును ఈసారి బయటికి తీయలేదు శ్రీధరుడు. తనగుట్టు రట్టయిందని అర్థమయిన మరుక్షణం, తన గుండెల్ని తడుతున్న రాజదండాన్ని రెండుచేతులతోను పట్టుకుని బలంగా వెనక్కి లాగాడు. అతడు అలా చేస్తాడని వూహించకపోవడం వల్ల కాస్తంత అజాగ్రత్తగా వున్నాడు ఆ దండాన్ని పట్టుకున్న భటుడు. ఆ అదుటుకు తూలి ముందుకు పడ్డాడు...అలా పడటంలో శ్రీధరుడి మీదికి వస్తున్న నాసీరుడి అశ్వానికి అడ్డు తగిలాడు .

చెవులు చిల్లులు పడిపోయేటట్లు శబ్దాలు చేస్తూ ముంగాళ్ళను గాలిలోకి ఎత్తిందా అశ్వరాజం.

తన చేతుల్లోకి వచ్చేసిన దండాన్ని తలమీదినుంచి గిర్రున తిప్పి గాలిలోకి లేచిన ఆ అశ్వపు పాదాలమీద బలంగా మోదాడు శ్రీధరుడు. అడ్డు రాబోయిన మరో ఇద్దరు భటుల భుజాలు విరిగిపోయేటట్లు కొట్టి ముందుకు పరుగు తీశాడు.

ముంగాళ్ళు గాయపడటంవల్ల కుదురుగా నిలబడటం అసాధ్యమై ముందుకు తూలింది నాసీరుడి వాహనం. అతన్ని కూడా క్రిందపడవేసింది.

"పట్టుకోండి...పారిపోతున్న ఆ దుర్మార్గుడిని వెంటనే పట్టి బంధించండి" అనివెర్రిగా అరుస్తూ వీధిమధ్యలో నిట్టనిలువుగా పడిపోయాడు సేనాపతుల వారి ముద్దు బిడ్డడు.

"పట్టుకోండి...పారిపోతున్న గర్గుడిని బంధించండి...గర్గుడిని బంధించండి" వున్నట్లుండి అతనికంటే బిగ్గరిగా అరిచాడు శ్రీధరుడు. తన దారికి అడ్డు రాబోయిన పౌరులకు, చేతిలోనే వున్న రాజదండంతో ఆ వీధిచివరి భాగంలోకి చూపించాడు.

నిజంగానే గర్గుడు అటుకేసి పోతున్నట్లు భావించారు వారందరూ... భావించిన మరుక్షణం పెద్ద పెద్ద గొంతులతో గుండెలు జలదరించేటట్లు కేకలు పెడుతూ పరుగులు మొదలుపెట్టారు.

పడినచోటినుంచి వెంటనే పైకి లేవబోయిన నాసీరదేవుడిని పొరపాటుగా క్రిందికి నెట్టేశారు కొందరు పౌరులు. అంతకుముందు తగిలిన దెబ్బలు తిరిగి రక్తాన్ని స్రవించటం ప్రారంభించేసరికి తెలివిని కోల్పోయినట్లు అచేతనంగా వుండి పోయాడా వీరాధివీరుడు.

ఆ దృశ్యాన్ని వీక్షించటం జరిగివుంటే తృప్తిగా తలపంకించి వుండేవాడు శ్రీధరుడు.

వీక్షించే అవకాశం అతనికి లభించలేదు. తను అరిచిన అరుపుల్లో నిజం లేదని అందరికీ అవగతమయ్యేలోపుగా ఆ ప్రదేశాన్ని వదిలి దూరంగా వెళ్లిపోవాలన్న తొందరలో శ్యామల ఇంటికి దారితీసే వీధిని వదిలి, నగర ద్వారాలకు దగ్గర్లో వుండే వేశ్యావాటికవైపు పరుగు తీశాడతను.

## 6

ధనదుపుర సార్వభౌముడి విలాసమందిరం కంటే మిన్నగా కళ్ళు చెదిరేలా తన భావనాన్ని అలంకరింపచేసింది శివకామిని ఆ రోజు.

"ఒత్తిడి పనులవలన ఒక్కక్షణం కూడా తీరిక లేకుండా తిరుగుతున్న నాసీరదేవులవారు విచ్చేస్తున్నామని సందేశం పంపించారు. నా జన్మ, నా కూతురిజన్మ ధన్యమైపోయే రోజు యిది" అడుగకపోయినా అప్పటికి పది పండ్రెండుసార్లు చెప్పింది వంచిన తలలు ఎత్తకుండా పనిచేసి తమకు రావల్సిన భృతికోసం ఓపికగా వేచిచూస్తున్న అలంకారికులకు.

నాసీరదేవులవారిని గురించి తమకు తెలిసిన మాటల్ని ఆమెకు తెలియచేయాలని అనుకునికూడా ఆమె ఆనందాన్ని చెడగొట్టటం యిష్టం లేక మౌనంగా వుండిపోయారు వాళ్ళ.

"మీరు అడిగిన దానికంటే మరి నాలుగు నాణేలు హెచ్చుగా యిస్తున్నాను. తీసుకోండి" అంటూ కొన్ని వెండినాణేల్ని వారి చేతిలో పెట్టింది శివకామిని.

ముసిముసిగా నవ్వుకుంటూ వెళ్లిపోతున్న ఆ అలంకారికులను భవనోపరి భాగంలో నుంచి గమనించి దీర్ఘంగా నిట్టూర్చింది హేమసుందరి.

తల్లికి అగుపించకుండా తన మందిరంలో దాచుకున్న కావేటిరంగని చెక్కబొమ్మముందు మోకరించి కన్నీళ్ళపాలైంది ఆమె.

"దూరంగా తొలగిపోయిందని అనుకున్న ఆపద తిరిగి చేరువలోకి వచ్చేసింది. నీటముంచినా పాలముంచినా ఇక నీదే 'భారం'" అని మనవి చేసుకుంటూ వుండగా ఆమె కర్ణేంద్రియాలకు చేరాయి పెద్దపెద్ద అరువులు.

"పట్టుకోండి... బరిసెలు విసిరి ప్రాణాలను బలిపుచ్చుకోండి... ఉరికంబం మీదినుంచి గర్గుడిని తప్పించిన ఆ దుర్మార్గుడి పీచం అణచండి" భూనభోంతరాలు దద్దరిల్లిపోయేలా వున్న ఆ కేకల్ని ఆలకించి తన మందిరంలో నుంచి క్రిందికి వచ్చిందామె.

"గర్గుడిని తప్పించటానికి పెద్దపథకం రచించిన అతని అనుచరుడు ఎవరో ఇటుగా పారిపోయి వచ్చాడట. అతన్ని పట్టుకోవటం కోసమే పాట్లు పడుతున్నారు వీరందరరూ" భవనముఖద్వారం దగ్గిర ప్రత్యక్షం అయిన హేమసుందరిని చూసి వెనక్కి వస్తూ లోగొంతుకతో చెప్పింది సౌదామిని.

"మన నాసీరుదేవులవారు కనిపించరేమిటి ఈ జనంలో ...ఇటువంటి వీరకృత్యాల్లో పాలుపంచుకోవటం యిష్టం వుండదా వారికి?" ఉరుకులు పరుగులు పెడుతున్న పౌరుల్ని, రాజభటుల్ని తదేకదీక్షగా చూస్తూ సౌదామినిని అడిగింది శివకామిని.

"నాసీరదేవులవారు ఈ రోజునకూడా మన భవనానికి విచ్చేస్తారన్న నమ్మకం నాకులేదు. ఈ పౌరులు, ఈ రాజభటులు ఎవరికోసం మన వాటికలోకి ప్రవేశించారో ఆ వ్యక్తి మూలకంగా దారుణమైన దెబ్బలు తగిలాయట నాసీరులవారికి. నాలుగైదు దినాలదాకా తనంతట తను లేచి నిలబడే పరిస్థితి లేదట..." అంటూ అసలు విషయాన్ని అతి నెమ్మదిగా ఆమె చెవిన వేసింది సౌదామిని.

ఆమె ఊహించినట్లు ఆగ్రహోదగ్రురాలు కాలేదు శివకామిని.

తలమీద చేతులు పెట్టుకుని ముఖద్వారం దగ్గిరే కూర్చుండిపోయింది.

"నా ఉన్నతిని చూసి సహించిలేని వారెవరో తిరిగి ప్రయోగాలు చేయటం మొదలు పెట్టారు. మేము బాగుపడటం భరించలేని విషయంగా వున్నది మన చుట్టుపట్ల నివసించేవారికి" అంటూ దీర్ఘాలు తీయటం ప్రారంభించింది.

"వీధిలోని వారందరూ మనవంకే చూస్తున్నారు. అందరూ తమలో తాము నవ్వుకుంటున్నారు. లోపలికి వచ్చికూర్చో... నడివీధిలో పాటలు పాడకు..." అని హెచ్చరించింది హేమసుందరి.

భవనాన్ని అలంకరించటం కోసం తను వెచ్చించిన వెండినాణేలన్నీ కనుల ముందు మెదలి మరింతగా శోకించింది శివకామిని.

అదే సమయంలో ఆమె భవన ముఖద్వారం దగ్గిర ప్రత్యక్షం అయ్యారు పదిమంది రాజభటులు.

"వేశ్యావాటిక చివరిభాగం వరకూ పోయినా మాకు అగుపించలేదు ఇటుగా పారిపోయివచ్చిన దుండగీడు" ఒక అడుగు ముందుకు వేసి వినయంగా చెప్పాడు వారిలో ఒకతను.

"ఆయుధాల్ని ధరించిన పోటుగాళ్ళు మీరందరూ, చూస్తూ చూస్తూ వుండగా పారిపోయిన ఆ దుండగీడు నడివీధిలో నిలబడే వుంటాడా? చీకటిమాటున ఏ ఇంటిచాటునో తలదాచుకుని వుంటాడా?" కోరగా చూస్తూ అడిగింది శివకామిని.

"తను అపూర్వనృత్యంతో ప్రభువుల మనసును రంజిపచేసే హేమసుందరికి జనయిత్రులు మీరు. మీ నోటివెంట పొల్లుమాట పొరపాటున కూడా రాబోదని మాకు తెలుసు... మీరన్నట్లుగానే ఆ దుండగీడు చీకటిని ఆసరాగా చేసుకొని ఎక్కడో తలదాచుకుని వుంటాడనే మేముకూడా భావిస్తున్నాము.అందుకే ఈ వాటికలోని భవనాలన్నింటినీ శోధించటానికి బయలుదేరాం..." అంటూ ఆమె అనుమతికోసం ఆగకుండా ముందుకు అడుగువేశాడు భటుడు.

ముందు మందిరాన్ని, వెనుక భాగంలో వున్న హేమసుందరి మందిరంముందు నిలబడ్డారు రాజభటులు.

"జయము జయము... కావేటి రంగనికి జయము జయము..." రెక్కల్ని తపతపలాడిస్తూ వెంటనే పలికింది పంజరంలోని రాచిలుక. కనులకు గుండ్రంగా తిప్పుతూ అతనివంక విచిత్రంగా చూసింది.

ముందుకు వేయబోయిన పాదాన్ని వెంటనే వెనక్కి తీసుకుంటూ సౌదామిని వంక చూశారు ఆ భటులు.

"ఇది...ఇది... ఈ చిలుక మీ పెంపుడు చిలుకా?" అని అడిగాడు.

"మేము చిలుకల్ని పెంచుకోకూడదా?" వెంటనే ఎదురుప్రశ్న వేసింది సౌదామిని.

"మీరు మా ప్రశ్న తప్పుగా అర్థం చేసుకోకండి... చిలుకలు, శునకాలు మొదలైన పెంపుడు జీవాలు వున్న ప్రదేశంలోకి కొత్తమనిషి గనుక వస్తే గోల చేసేస్తాయవి. పంజరంలోని ఈపక్షి చాలా ప్రశాంతంగా వుండటాన్ని గమనిస్తే కొత్తమనిషి ఎవరూ యిక్కడికి రాలేదని మాకు అర్థం అవుతున్నది.

ఇక ఈ మందిరాన్ని శోధించాల్సిన అవసరంలేదు" అంటూ వెనుతిరిగి క్రిందిభాగంలోకి వచ్చేశారు ఆ భటులు.

సౌదామిని చేయిపట్టుకుని తన మందిరంలోకి లాగింది హేమసుందరి.

"కోదండరాముడి ఆలయం దగ్గిర జరిగింది ఏమిటో నాకు వివరంగా చెప్పు..." అని బ్రతిమాలింది.

కోదండరాముడి ఆలయం దగ్గిర జరిగింది ఏమిటో తనకు తెలిసినంత వరకూ క్లుప్తంగా నాలుగు మాటలలో ఆమెకు తెలియజేసింది సౌదామిని.

"సేనాపతులవారి కుమారుడిని కొట్టింది ఎవరు?" అడగలేక అడగలేక అడుగుతున్నట్లు అస్పష్టంగా అడిగింది హేమసుందరి.

పెద్దగా నవ్వి, ఆప్యాయంగా ఆమె బుగ్గను చిన్నగా గిల్లింది సౌదామిని.

"నీ వరుస చూస్తుంటే నాసీరులవారిని నాలుగైదు దినాలవరకూ లేచి నిలువ లేని పరిస్థితిలోకి నెట్టిన ఆ దుండగీడును అభిమానించేటట్లు అగుపిస్తోంది.

తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మంచిదికాదు సుమా!" అంటూ వెనుతిరిగి మందిర ద్వారాన్ని అధిగమించింది.

ఎందుకో గాలిలో విహరిస్తున్న అనుభూతి హేమసుందరని ఆవరించుకున్నది. ఛెంగున కదలి కావేటిరంగని బొమ్మ ముందుకు పోయిందామె. నృత్యం చేస్తున్నట్లు వయ్యారంగా చేతుల్ని జోడించి నృత్యభంగిమలోనే ఆ దేవదేవునికి నమస్కారించింది.

'నా కోరిక తీర్చు ప్రభూ... నన్నీ నరకంనుంచి బయటికి పంపించు... శ్రీరంగం వచ్చి నీ ముందు గజ్జె కడతాను... నీ మహిమను అందరికీ చాటి చెపుతాను...' మనసులోనే అనుకుంటూ తన శయ్యవైపు అడుగువేసింది.

"కోవేటిరంగనికి జయము, కొత్తమనిషికి జయము జయము..." ఉన్నట్లుండి మాట్లాడింది పంజరంలో ఎగురుతున్న ఆమె చిలుక.

అదిరిపడింది హేమసుందరి.

"కొత్తమనిషికి జయమంటున్నావు... ఎవరే ఆ కొత్తమనిషి?" అనుమానంగా చూస్తూ అడిగింది.

తల అటూ ఇటూ తిప్పుతూ, రెక్కల్ని విదిలించిందా చిలుక. "కొత్త మనిషి... కొత్తమనిషి..." అంటూ ఆ మందిరంలో ఒక మూలగా వున్న పెద్ద మందసంవైపు చూసింది. గుబగుబలాడుతున్న గుండెల్ని చిక్కబట్టుకుంటూ అటుకేసి అడుగువేసింది హేమసుందరి.

"మరోపది నిమిషాలవరకూ నా గుట్టు రట్టు అవదనే భావించాను. నీ రాచిలుక నా బండారాన్ని బట్టబయలు చేయదనే భావించాను..." అంటూ ఆ తెరవెనుకనుంచి ఇవతలకు వచ్చాడు శ్రీధరుడు.

కెవ్వున అరవబోయి ఆఖరిక్షణలో తనను తనే అదుపు చేసుకున్నది హేమసుందరి. గుండెలమీద చేయివేసుకుంటూ వెనక్కి జరిగింది.

ఆ రోజు ఉదయం నడివీధిలో నలుగురు చూస్తూండగా అకస్మాత్తుగా తన పల్లకీని ఢీకొట్టిన యువకుడు అతనేనని గుర్తుపట్టిందామె.

క్రిందపడిబోతున్న పల్లకీని పడిపోకుండా ఆపటం కోసం అతను పల్లకీ దండాన్ని భుజంమీదికి లాగుతున్న దృశ్యం కనులముందు మెదలేసరికి ఒక్కసారిగా ఝల్లుమన్నది ఆమె శరీరం.

మెరుపుకంటే వేగంగా కదలగల శక్తి గలవాడు కాబట్టే, నాసీరదేవుడిని గాయపరిచి, రాజభటుల చేతికి దొరికకుండా తప్పించుకు రాగలిగాడు అతను.

తనులేని సమయంలో సౌదామిని మందిరంలోకి వచ్చినా, రెక్కల్ని తపతపలాడిస్తూ, కేకలు పెట్టే తన రాచిలుక అతని ఆగమనన్ని రాజభటులకు తెలియచేయకుండా ఎలా ఆగగలిగంది?ఇంద్రజాల మహేంద్రజాల విద్యలు తెలిసిన మనిషా అతను?

గజదొంగ గర్గుడిని ఉరికొయ్యమీదినుంచి తప్పించటం కోసం వచ్చిన దుండగీడు కూడా అతనేనని సౌదామిని చెప్పిన మాటలు మనసులో మెదిలోసరికి కొద్దిగా వివర్ణమైంది వదనం.

నాసీరుడు వంటి కాముడికుడికి బుద్ధి చెప్పటం వేరు... గజదొంగ గర్గుడి వంటి నేరస్థుడిని రక్షించటం వేరు...

తనుకూడా నేరస్థుడు అయివుంటాడు ఇతను. గర్గుడి మాదిరిగా ప్రజలను దోచుకుని హృదయంలేని దొంగగా జీవిస్తూ వుండివుంటాడు.

అటువంటి దుండగీడును తనంతట తను తన మందిరంలో కూర్చోబెట్టటం పొరపాటు అయిందని అనిపించి చివ్వున తల ఎత్తి శ్రీధరుడి ముఖంలోకి చూసిందామె.

"ఉరికొయ్యకు వ్రేలాడుతూ వుండవలసిన గర్గుడు తప్పించుకుపోవటానికి నేను సహకరించినట్లుగా అనుమానపడుతున్నావు నువ్వు. అవునా?" అడిగాడు శ్రీధరుడు.

తన మనసులోని మాట మనసులో వుండగానే తెలుసుకోగలిగిన అతని చతురతను చూసి విస్తుబోయింది హేమసుందరి.

"నీ ముద్దుముఖం మీద ఒట్టువేసి చెపుతున్నాను. సేనాపతులవారి కుమారుడిని అశ్వంమీది నుంచిక్రిందికి నెట్టటం ఒక్కటే నేను చేసిన నేరం. రాజభటుల ఆర్భాటాన్ని చూసి గర్గుడికి, నాకు సంబంధాన్ని అంటగట్టారు ఈ నగరపౌరులు" ఆమె సమాధానం కోసం ఎదురుచూడకుండా చెప్పాడు శ్రీధరుడు.

తన వదనంమీద ఒట్టువేయ సాహసించిన అతని ధైర్యాన్ని చూసి కోపగించుకోవాలో, అతని రసిక హృదయాన్ని మెచ్చుకోవాలో అర్థం కాలేదు ఆమెకి.

"ఈ రోజు ఉదయం నీ పచ్చల పల్లకిని ఢీకొట్టిన సందర్భంలో నిన్ను మొట్టమొదటిసారిగా చూశాను. మరోసారి చూడాలని, నీతో సంభాషించాలనీ అనుకున్న మాట వాస్తవం. అయితే ఆ కోరిక తీర్చుకోవటానికి మాత్రం ఇక్కడికి రాలేదు. రాజభటుల ఎద్దడినుంచి తప్పించుకోవటానికి వచ్చాను" అంటూ పెరటితోటలో ఎత్తుగా ఎదిగివున్న పున్నాగవృక్షాన్ని ఆమెను చూపించాడు శ్రీధరుడు.

సౌధోపరిభాగం వరకూ విస్తరించి వున్న ఆ చెట్టు కొమ్మలమీదినించి లాఘవంగా అతను తన మందిరంలోకి వచ్చివుంచాడని గ్రహించింది ఆమె.

"నీ మందిరంలో అడుగుపెట్టిన వెంటనే నీ నామాన్ని ఉచ్చరిస్తూ గొడవ చేయటం ప్రారంభించింది నీ రాచిలుక. అదృష్టవశాత్తూ నెత్తిమీద చిటికవేసి బ్రతిమాలుకోగానే నోటిని అదుముకుని మౌనంగా వుండిపోయింది" పంజరంలోని చిలుకవైపు చూపిస్తూ జరిగింది ఏమిటో చెప్పాడు అతను.

"పిలువని పేరంటంలా వచ్చి నీకు అసౌకర్యాన్ని కలిగించినందుకు నన్ను మన్నించు..." అని అంటూ చటుక్కున మందిరద్వారాన్ని అధిగమించి, పున్నాగవృక్షపు కొమ్మల సహాయంతో పెరటితోటలోకి దూకాడు శ్రీధరుడు.

తొంగిచూస్తున్న ఆ ముద్దురాలికి కృతజ్ఞతాసూచకంగా చేసైగ చేసి చీకట్లలో కలిసిపోయాడు.

సౌధోపరిభాగంనుండి ఆమె తన మందిరంలోకి అడుగులు వేస్తుండగా, వినవచ్చాయి ఆ రోదన ధ్వనులు. ఉలిక్కిపడి అటుకేసి చూసిన ఆమె కనులకు అగుపించింది రెండు గృహాలకు అవతలగా నివసిస్తూ వుండే సుందరాంగి ఇంద్రవదన.

నాలుగు సంవత్సరాల క్రితం ఒక అగ్నిప్రమాదంలో చిక్కబడి ఒళ్ళంతా కాలిపోవటంవల్ల వికృతరూపిణిగా మారిపోయిందా పడుచు. ఆ రోజునుంచీఆమెను చుట్టుముట్టాయి కష్టాలు. సౌందర్యోపాసకులైన రసికులు రాకపోకల్ని తగ్గించుకునేసరికి దుర్భరదారిద్ర్యం ఆమెను చుట్టుముట్టింది.

నాలుగేళ్ళ వయసు కలిగి వున్న తన బిడ్డను పెంచుకోవటం కోసం పడరాని పాట్లు పడుతోంది. పరిచయం కల పెద్దమనుషుల ఇళ్ళల్లో పరిచారికగా పనచేసి పూటలు గడుపుకుంటోంది.

తనతల్లి గమనిస్తే గొడవచేస్తుందని తెలిసికూడా క్రిందికి వెళ్లకుండా వుండలేకపోయింది హేమ.

"ఇందువదన ఎందుకనో పెద్దగా కేకలు పెడుతూ ఏడుస్తున్నది. ఏమైందో ఒకసారి చూపివస్తావా?" అని సౌదామినికి చెప్పబోతూ, ముఖద్వారంలోనే నిలబడి వున్న తన తల్లిని గమనించి ఆ మాటల్ని తనలోనే అదుముకున్నది ఆమె.

అంతలోనే లోపలికి వచ్చింది వీధిలోకి పోయివున్న సౌదామిని.

"ఇందువదన బిడ్డకు ఏదో వ్యాధివలన మైకం ముంచుకువచ్చింది. ఏం చేయాలో తోచక తల్లడిల్లిపోతోంది పాపం" సానుభూతిగా పెదవులు విరుస్తూ శివకామినికి చెప్పింది.

"వ్యాధి వచ్చివచ్చిన బిడ్డను ఒడిలో పెట్టుకుని ఏడుస్తూ కూర్చుంటే వచ్చిన రోగం తగ్గిపోతుందా? వైద్యుడికి వర్తమానం పంపటమో, తనే అతని దగ్గిరకి పోవటమో చేయాలి గదా!" నిరసనగా అన్నది ఆమె.

"మనకు సమీపంలో వున్న వైద్యుడు మహాపిసినారి. వెండినాణేల మ్రోత వినబడందే వచ్చినవారి నాడిని పరిశీలించడు. వెండినాణేల మాట దేవుడెరుగు, రాగికాసులు కూడా లేవుట ఇందువదన దగ్గిర..." అంటున్న సౌదామిని పలుకుల్ని ఆలకించి వెనుతిరిగింది హేమసుందరి. తన మందిరంలో నుంచి పది వెండినాణేల్ని తీసుకువచ్చి ఆశ్చర్యంగా చూస్తున్న సౌదామిని చేతిలో పెట్టింది.

"త్వరగా వెళ్లి ఇందువదనకు ఇచ్చి రావాలి... బిడ్డను వైద్యుని దగ్గిరికి తీసుకువెళ్లమని చెప్పు... వెళ్ళు, త్వరగా వెళ్ళు" అంటూ వీధిగుమ్మం వైపు నెట్టింది.

హేమసుందరివైపు కోపంగా చూడబోయి, అందువల్ల ఎటువంటి వుపయోగమూ లేదని గ్రహించడం వల్ల ముఖం ముడుచుకున్నది శివకామిని.

దానధర్మాల విషయంలో ఆమె హెచ్చరికల్ని కొంచెంగా కూడా సరుకు చేయదు హేమసుందరి. అరిచినా, అల్లరిచేసినా పట్టించుకోనే పట్టించుకోదు.

పరుగులాంటి నడకతో ఇందువదన ఇంటికి పోతున్న సౌదామిని వైపే చూస్తూ ముఖద్వారం దగ్గిరే నిలబడింది హేమసుందరి.

గర్గుడిని తప్పించిన దుండగీడు కోసం వెతికి వెతికి అలుపు వచ్చింది కాబోలు, ఒకరి తరువాత ఒకరుగా వేశ్యావాటికలో నుంచి ఆవలికి వెళ్లి పోతున్నారు అంతకుముందు గుంపులు గుంపులుగా అటుకేసి వచ్చిన నగర పౌరులు.

బిడ్డను ఒడిలో పెట్టుకుని బెంబేలు పడుతున్న ఇందువదన వికృతవదనం వంక అసహ్యంగా చూస్తూ తలలు పక్కకు తిప్పుకుంటున్నారు.

కన్నీరు మున్నీరవుతున్న ఇందువదనకు ధైర్యం చెప్పి,అక్కడికి కొద్దిదూరంలోనే వున్న వైద్యుని ఇంటికి తనే స్వయంగా వెళ్ళింది సౌదామిని.

తలుపుల్ని తట్టి అతన్ని నిద్రలేపింది.

హేమసుందరి యిచ్చిన వెండినాణేల్ని అతని దోసిటిలో పోసి పరిస్థితిని వివరించింది.

వనమూలికలు, విషపాషాణాలు వున్న చెక్కపెట్టెను చంకనపెట్టుకుని వడివడి అడుగులతో ఇందువదన యింటికి ఏతెంచాడు ఆ వైద్యశిఖామణి.

పది నిముషాలపాటు బిడ్డను, బిడ్డనాడిని పరిశీలించి చూసి పెదవి విరిచాడు.

"నా మేధకు అందటంలేదు ఈ బిడ్డను బాధిస్తున్న వ్యాధి ఏమిటో. రాచవీధిలోని ఉపమన్యులవారి వద్దకు వెళ్లవవలసిందే... ఆలసించటం అతి ప్రమాదకరం" అని చెపుతూ తన చెక్కపెట్టెతో సహా వెనక్కి వెళ్ళిపోయాడు ఆ వైద్యుడు.

పిసరంత వైద్యంకూడా చేయకుండా హేమసుందరి యిచ్చిన వెండి నాణేలన్నింటిని స్వంతం చేతులు వూపుకుంటూ వెళ్ళిపోతున్న ఆ పెద్దమనిషి వంక కోపంగా చూసింది సౌదామిని.

రాచవీధిలోని ఉపమన్యులవారి వద్దకు వెళ్లితీరాలన్న మాట చెవులపడేసరికి మైకం వస్తున్నట్లు గోడకు చేరగిలపడిపోయింది ఇందువదన .

రాజాధిరాజులకు, కోట్లకు పడగలు ఎత్తిన ధనవంతులకు తప్ప సామాన్యులెవరికీ వైద్యం చేయని భిషకుడు ఆ ఉపమన్యుడు. అతను తనబిడ్డకు వైద్యం చేయడం అంటే తూర్పున ఉదయించవలసిన సూర్యుడు పడమటినుంచి పైకి రావడమే.

బిడ్డమీద ఆశను వదిలేసుకుని బావురుమనటం మొదలు పెట్టిన ఇందువదన వంక నిస్సహాయంగా చూస్తూ నిలబడిపోయిన సౌదామిని గమనించి అటుకోసి బయలుదేరింది హేమసుందరి.

"ఎక్కడికి పోతున్నావే? వేళకాని వేళల్లో వీధుల్లో సంచారం చేస్తే నలుగురూ ఏమనుకుంటారో ఆలోచించావా?" భద్రకాళిలా విరుచుకుపడుతున్న

తల్లిని లక్ష్యపెట్టకుండా,ఇందువదన ఇంటిముందుకు పోయి ప్రశ్నార్థకంగా సౌదామినివంక చూసింది.

జరిగింది ఏమిటో చెప్పింది సౌదామిని.

"మనం ఎంతోకొంత ధనం ఇవ్వవచ్చు. ఎంత యిచ్చినా చీకటి పడిన తర్వాత ఎవరినీ చూడడు ఆ ఉపమన్యుడు. మనగురించి ఆయనకు తెలియక ముందే భుజాలు పట్టుకుని వీధిలోకి గెంటివేస్తారు ఆయన భవన రక్షకులు" లోగొంతుకతో తనకు తెలిసిన మాటల్ని కూడా వినిపించింది.

అచేతనంగా పడివున్న బిడ్డవంకా, బిడ్డతల్లి అయిన ఇందువదన వంకా చూసి గాఢంగా నిట్టూర్చింది హేమసుందరి.

"మాటలు చెప్పటం తప్ప మనం చేయగలిగింది ఏమీలేదు. బయటికి వస్తే ఏదైనా సహాయం చేయవలసి వస్తుందని తలుపులు గట్టిగా మూసుకున్నారు మన ఇరుగుపొరుగు వారందరూ..." అంటూ హేమ చేయి పట్టుకుని వెనక్కి లాగింది సౌదామిని.

ఆశ్చర్యంగా ఆమెముఖంలోకి చూసింది హేమ.

"ఏమీ చేయలేనప్పుడు యిక్కడ వృధాగా నిలబడటం అనవసరం. మీ తల్లి ఆగ్రహం అధికం అయిపోకముందే వెళ్లిపోదాం..." అన్నది సౌదామిని.

కనులు మూసుకుని కావేటిరంగడిని తలచుకున్నది హేమసుందరి. "నీవు తప్ప ఈ సమయంలో యింకెవరూ ఈ భాగ్యరాలికి సహాయం చేయలేరు.నువ్వే ఏదైనా చేయాలి... ఈబిడ్డను కాపాడాలి..." అనికోరుకుంటూ వెనుతిరగబోతుండగా, పదఘట్టనల సవ్వడితో ప్రకంపించిపోయింది ఆ వీధి.

అదిరిపడి చూసిన ఆమె కనులకు ఆదరాబాదరాగా పరుగు తీస్తున్న రాజభటులు అనేకమంది వెంటనే అగుపించారు.

"ఎందుకైనా మంచిదని మేము ఆవలికి వెళ్లపోకుండా ఈ వేశ్యావాటిక చుట్టూ కాపలా నిలబడ్డాం. చీకటిమాటున నక్కినక్కి అడుగులు వేస్తూ మమ్మల్ని తప్పించుకోవటానికి ప్రయత్నంచాడు గర్గుడిని తప్పించిన దుండగీడు. కేకలు పెట్టేసరికి ఇంకోసారి యిటుగా పారిపోయి వచ్చాడు" అని చెపుతూ ముందుకు వెళ్ళిపోయారు వారిలో కొందరు.

"ఈ సమయంలో అమాయకులు ఎవరూ వీధిలో సంచరించటం మంచిది కాదు. వెంటనే మీ గృహంలోకి వెళ్లిపొండి..." విపరీతమయిన దుఃఖంతో అలమటించిపోతున్న ఇందువదనను గురించి పట్టించుకోకుండా, హేమని హెచ్చరించారు మరికొందరు.

"అంతుపట్టని వ్యాధితో బాధపడుతున్నవారికి సహాయం చేయటంకంటే, దుండగీళ్ళను, దొంగలను పట్టుకోవటమే వీరికి ముఖ్యం. వీళ్లు అసలు మనుష్యులు కాదు..." కోపంగా కనబోతున్న హేమసుందరి నోటిని బలవంతంగా అదిమి వెనక్కి మరోసారి లాగింది సౌదామిని.

"మనకు సంబంధించని విషయాలను గురించి మాట్లాడటం మంచిది కాదు. మనదారిన మనం వెళ్ళిపోవటమే శ్రేయస్కరం" అని బుద్ధిచెప్పబోతూ మాటల్ని మధ్యలోనే మింగేసిందామె.

అడుగుల చప్పుళ్ళతో వీధినంతా కంపింపచేస్తూ ముందుకుపోయిన రాజ భటులవంక చూడటంలేదు హేమసుందరి. ఇందువదన ఇంటికి నలుబది ధనువుల దూరంలో వున్న ఒక పెద్ద వృక్షంవైపు చూపుల్ని పరుపుకున్నది.

పరుగులు తీస్తూ వచ్చిన రాజభటుల కంటపడకుండా ఆ వృక్షంచాటున వదిగి నిలుచున్నాడు ఒక యువకుడు. హేమసుందరి తనను గమనించిందని అర్థంఅయింది కాబోలు, చిరునగవుల్ని వెలయిస్తూ యివతలికి వచ్చాడు.

"ఏమిటీ మీ ధైర్యం? ముందుకుపోయిన భటుల్లో ఎవరయినా వెనుతిరిగి చూస్తే ఏమౌతుందో ఆలోచించుకున్నారా?" ఆందోళన నిండిన కంఠంతో అడుగబోయిన హేమసుందరిని వారిస్తూ, గోడకు చేరగిలబడి వున్న ఇందువదనవంక చూశాడతను.

"ఏమైంది ఈమెకు? ఒడిలో వున్న బిడ్డ వ్రేలాడబడిపోతున్నది దేనికి?" అని అడుగుతూ ముందుకు వంగి ఇందువదన భుజంమీద చేయివేశాడు.

తన బిడ్డను రక్షించగలవారెవరూ లేరని గుండెను రాయిచేసుకున్న ఆ అభాగ్యురాలు, అనుకోని విధంగా వినవచ్చిన ఆ సానుభూతి పలుకుల్ని ఆలకించి మరోసారి కన్నీరు మున్నీరయింది.

"ఏమైందమ్మా? ఏమైంది నీ బిడ్డకు? ఏమైందో వెంటనే నాకు చెప్పు" అంటూ ఆమె ముందు మోకరించి కూర్చోబోతున్న యువకుడిని వారించి, జరిగిందేమిటో వివరంగా చెప్పింది సౌదామిని.

"రాచవీధిలోని ఉపమన్యుల వారివద్దకు వెళితే తప్ప బిడ్డ జీవించదు.

చీకటిపడిన తర్వాత ఆయన దగ్గిరికి వెళ్లి వైద్యం చేయించుకోగలిగిన వారెవరూ లేరని పెద్దపేరు."

ఆ మాటల్ని వినగానే ఆ యువకుడిలో వచ్చిన మార్పు ఆమెకు విపరీతమైన ఆశ్చర్యాన్ని కలుగజేసింది.

ఇందువదనను పలుకరించే ప్రయత్నాన్ని వెంటనే విరమించుకుని, ఆమె ఒడిలోని బిడ్డను ఒక్కసారిగా తన భుజం మీదికి ఎత్తుకున్నాడతను.

"ఆలసించకుండా రాచవీధిలోకి దారితీయి తల్లీ. ఉపమన్యువు గృహం ఎక్కడ వున్నదో నాకు చూపించు... అవసరానికి ఉపయోగపడని విద్యను నేర్పటం దేనికో అతన్ని అడుగుతాను" అంటూ వెనుతిరిగి తను వచ్చిన దారినే పెద్దపెద్ద అడుగులు వేయటం మొదలుపెట్టాడు.

వేశ్యావాటిక చుట్టూ రాజభటులు మాటువేసివున్న సంగతిని అతనికి గుర్తుచేయబోయి అప్పటికే అతను పదిధనువుల దూరం వెళ్లిపోవటంతో ఆగిపోయింది హేమసుందరి.

"నువ్వుకూడా వారితోపాటు వెళ్ళు... ఉపమన్యువు గృహం దగ్గిర ఏం జరుగుతుందో నాకు వివరంగా చెప్పు" అని సౌదామినితో చెపుతూ, ఏదో జ్ఞప్తికి వచ్చినట్లు తలవిదిలించింది.

పరుగులాంటి నడకతో ఆ యువకుడిని అనుసరిస్తున్న ఇందువదన వంక చూస్తూ "ఏమిటమ్మా? ఏమయింది?" అని ప్రశ్నించింది సౌదామిని.

"నేను ఇంతకుముందు ఇచ్చిన వెడినాణేలు యిక్కడి వైద్యానికి అర్పించుకున్నాం. ఉపమన్యువు ఎంత కావాలని కోరతాడో ఎవరికీ తెలియదు" అంటూ అటూ ఇటూ చూసి తనమెడలోని హారం ఒకదాన్ని తీసి ఆమెచేతిలో పెట్టింది హేమసుందరి.

"నీ తల్లికి ఈ విషయాలు తెలిస్తే నా గొంతు నులిమి చంపేస్తుంది. దగ్గిర వుండి మీ ఇంటిని గుల్ల చేయిస్తున్నానని తిట్టిపోస్తుంది" భయం భయంగా అంటున్న సౌదామిని మాటల్ని వినిపించుకోకుండా ముందుకు నెట్టింది.

ఎవరికయినా సహాయం చేయాలని నిశ్చయించుకున్న తరువాత ఆమె ఎవరి మాటల్ని లక్ష్యపెట్టదని అనుభవపూర్వకంగా తెలిసివుండటం వల్ల అయిష్టంగానే కదిలింది సౌదామిని.

దూరంగా వెళ్ళిపోతున్న యువకుడిని, ఇందువదనను అనుసరించింది.

* * *

రాజదండాలను బిగించి పట్టుకుని, చిమ్మచీకటిలోకి పట్టిపట్టి చూస్తున్న రాజభటుల మధ్యలోనుంచి రాచవీథిలోకి అడుగుపెట్టాడు శ్రీధరుడు.

"ఎవరు మీరు...? ఎక్కడికిపోతున్నారు?" కరుకు కంఠాలతో ప్రశ్నించబోయి, అతని భుజంమీద బిడ్డనుచూసి ఆ ప్రశ్నలను తమలోనే అదుముకున్నారు ఆ భటులు.

"మీరు అనవసరంగా ఉపమన్యువు దగ్గిరికి పోతున్నారు. ఆయన మీకు వైద్యం చేయడు. ఇంకెవరైనా వుంటే చూసుకోండి..." సౌదామిని నోటివెంట అసలు విషయాన్ని తెలుసుకుని, ఆర్ధ్రత నిండిన కంఠంతో ఉపదేశించాడు అదరికంటే కాస్తంత వెనుకగా నిలబడివున్న భటుడు ఒకతను.

ఆ మాటల్ని లక్ష్యపెట్టకుండా సూటిగా ముందుకే దారితీశాడు శ్రీధరుడు. పావుఘడియ తర్వాత ఇందువదన చూపించిన ఒక మహోన్నత సౌదం ముందు నిలుచున్నాడు.

విచ్చుకత్తుల్నిపట్టుకుని శిలావిగ్రహాల్లో అక్కడ కాపలా నిలబడివున్నారు నలుగురు భటులు.

సౌధంముందు ఆగినవారిని చూసి నిర్లక్ష్యంగా తలలు ఎగురవేశారు.

"చీకటి పడిన తరువాత దేవుడు స్వయంగా దిగివచ్చినా వైద్యం చేయటానికి ఉపమన్యులవారు అంగీకరించరు. ఇక్కడే నిలబడి మీ సమయాన్ని వృథా చేసుకోకుండా ఇంకెక్కడికైనా వెళ్లటం చాలామంచిది " నిర్మొహమాటంగా తమ అభిప్రాయాన్ని తెలియజేశారు ఆ భటులు.

"ఆ మాట ఉపమన్యులవారి నోటివెంట వింటే మాకు ఎంతో కొంత తృప్తి లభిస్తుంది. ఒక్కసారి శ్రమ అనుకోకుండా వారికి మా గురించి తెలియజేయండి" భుజంమీద బిడ్డ శిరస్సును నిమురుతూ వినయంగా వేడుకున్నాడు శ్రీధరుడు.

"ఒకసారి వీలుపడదని చెప్పిన తర్వాత మళ్ళీ మళ్ళీ ప్రాధేయపడటం వల్ల వుపయోగమేదీ వుండదు. మర్యాదగా వెళ్లకపోతే అనవసరమైన బాధలకు గురికావాల్సి వస్తుంది. కరుకుకంఠంతో హెచ్చరిస్తూ శ్రీధరుడి గుండెలమీద చేయివేసి వెనక్కి నెట్టాడు వారిలో ఒకతను.

బిడ్డతోసహా వెల్లికిలా పడిపోబోయి, ఆఖరిక్షణంలో నేర్పుగా నిలదొక్కుకున్నాడు శ్రీధరుడు.

"వీళ్ళతో గొడవపడడంవల్ల వుపయోగం వున్నట్టు నాకు అనిపించటంలేదు. వీళ్ళు చెప్పినట్లే మరో వైద్యుడి దగ్గిరికిపోవటం మంచింది..." ముందుకు వస్తూ అతనికి నచ్చచెప్పటానికి ప్రయత్నించింది సౌదామిని.

ఆమె మాటల్ని వినిపించుకోలేదు అతను.

భటుడి చేయి తన గుండెల్ని తాకిన మరుక్షణం అధికం అయిపోయింది అతని పట్టుదల.

"చీకటి పడిన తర్వాత యిక్కడికి రావటమంటే, క్షమించరాని నేరం ఏదో చేసినట్లుగా భావిస్తున్న ఈ భవన రక్షకులకు బుద్ధి చెప్పాల్సిందే" అంటూ తన భుజంమీద బిడ్డను తల్లికి అందించాడు.

"ముక్కుముగం తెలియని మాకోసం మీరు అనవరసమైన శ్రమకు గురికావద్దు. మరో చోటికిపోయి మా అదృష్టాన్ని పరీక్షించుకుంటాం" గద్గద స్వరంతో విన్నవించబోయింది ఆ ముద్దురాలు.

ఆ మాటల్నికూడా లక్ష్యపెట్టలేదు శ్రీధరుడు.

తనను వెనక్కి నెట్టిన భటుడి ముఖం పగిలిపోయేటట్లు పిడికిలితో బలంగా పొడిచాడు.

కీచుగా అరవటానికి నోటిని తెరిచాడతను. అరుపు బయటికి రాకముందే తూలి వెనక్కి పడ్డాడు.

కన్నుమూసి కన్ను తెరిచేటంతలో జరిగిపోయిన ఆ దారుణాన్ని చూసి మిగిలిన ముగ్గురూ తనమీదికి లంఘించకముందే సుడిగాలి మాదిరి వారిని కమ్ముకున్నాడు శ్రీధరుడు.

ఏం జరుగుతుందో సరిగా అర్థంకాకముందే మొదళ్ళు నరికిన వృక్షాల మాదిరి విరుచుకుపడిపోయారు ఆ భటులు ముగ్గురూ.

"నేను పిలిచేటంతవరకూ మీరిక్కడినుంచి కదలవద్దు" అని ఇందువదనను, సౌదామినినీ హెచ్చరిస్తూ, అచేతనంగా పడివున్న బిడ్డను అమాంతంగా తన భుజంమీదికి తీసుకున్నాడు శ్రీధరుడు.

నిర్మానుష్యంగా వున్న రాచవీధిని ఒకసారి కలియజూసి, పెద్దపెద్దఅడుగులతో భవనం లోపలికి పోయాడు. అందమైన పట్టుతెరలతో

అలంకరించబడి వున్నఒక సుందర మందిరంలో పుష్పకవిమానం వంటి విశాలమైన హంస తూలికా తల్పంమీద అతనికి అగుపించాడు ఉపమన్యుడు.

శ్రీధరుడి దక్షిణహస్తం తన భుజాన్ని తట్టేసరికి వులిక్కిపడి కనులు తెరిచాడతడు.

"ఎవరు? ఎవరు నువ్వు?" ఆందోళన నిండిన కంఠంతో అడుగుతూ చుట్టూ చూశాడు.

చెట్టంత మనిషిని ఎట్టఎదుట పెట్టుకుని అతనిలా దిక్కులు చూడటం దేనికో తెలియక చిన్నగా గొంతు సవరించుకున్నాడు శ్రీధరుడు.

అప్పుడు అతనికేసి చూశాడు ఉపమన్యువు.

"ఎవరు నువ్వు? ఎలా వచ్చావ్ యిక్కడికి?" కోపంగా అడుగుతూ చేతుల్ని ముందుకు జాచాడు.

అప్పుడు... అతనలా చేతుస్ని ముందుకు జాచినప్పుడు అర్థమయింది శ్రీధరుడికి అసలు విషయం. అపర ధన్వంతరిగా పేరుపొందిన ఆ ఉపమన్యువుకు చీకటిసమయంలో కనులు కనిపించవు.

తన నిస్సహాయస్థితిని కప్పిపెట్టుకోవటం కోసమే చీకటిపడిన తరువాత ఎవరినీ తన దగ్గరికి రానీయటంలేదతను.

కాదు కూడదని ఎవరయినా మొండిగా ప్రవర్తిస్తే, కరుకుగా మాట్లాడి వెనక్కి పంపించేయటానికి రాక్షసులవంటి సేవకుల్ని భవనరక్షకులుగా నియమించుకున్నాడు ఉపమన్యవు.

"ఎవరు నువ్వని అడుగుతుంటే సమాధానం ఇవ్వవేం? నువ్వు ఎవరివి? ఎందుకువచ్చావ్?" మరింత బిగ్గరగా ప్రశ్నిస్తూ, తల్పంమీదినుంచి క్రిందికి దిగాడు ఆయన.

అవసరం అయితే అతన్నికూడా భవనరక్షకులను హింసించినట్లు చిత్రహింసలు పెట్టటానికి సిద్ధంగా వున్న శ్రీధరుడిలో అతనికి తెలియకుండానే వచ్చింది చలనం. రెండు అడుగుల ముందుకేసి భుజంమీద బిడ్డను అతని పాదాలదగ్గిర పరుండబెట్టాడు. ముందుకు జారిపడిన అతని చేతుల్ని రెండింటినీ పట్టుకుని కనులకు అద్దుకున్నాడు.

బిడ్డ శరీరం తన పాదాలకు తగిలిన వెంటనే ముడిపడింది ఉపమన్యువు భృకుటి.

చటుక్కున వంగి బిడ్డ నుదుటిమీద చేతిని వేశాడతను. బిడ్డపక్కనే మోకరించి కూర్చుంటూ నాడిని పరిశీలించాడు. పదిక్షణికాలు కూడా పూర్తిగా గడవకముందే బిడ్డను పీడిస్తున్న వ్యాధి అవగతమైంది కాబోలు, నిఠారుగా లేని నిలబడ్డాడు.

"ఇప్పటికే చాలా ఆలస్యం అయింది. భగవంతుడిమీద భారంవేసి మన ప్రయత్నం ఏదో మనం చేద్దాం" అంటూ వెనుతిరిగి హంసతూలికా తల్పానికి ఆవలిపక్కన వున్న మందసం దగ్గిరికి పోయాడు.

రకరకాల వనమూలికలతోను, చిత్రవిచిత్రమైన భస్మాలు, లేపనాలు, చూర్ణాలు కలిగివున్న చిన్నచిన్న పేటికలతోను నిండివున్నదా మందసం.

"నీలిరంగు కాంతిని వెలువరించే శంఖ భస్మపు మూట ఈ మందసంలో వున్నది. జాగ్రత్తగా వెతికి తీయగలవా? తన వెనుకే వచ్చిన శ్రీధరుడి భుజంమీద చేయివేస్తూ అడిగాడు ఉపమన్యువు.

మొదటిసారిగా భగవంతుడ్ని తలచుకున్నాడు శ్రీధరుడు. గుబగుబలాడుతున్న గుండెల్ని చిక్కబట్టుకుని ఆ మందసంలోనికి చేతిని పోనిచ్చాడు.

"అగరుధూపపు వాసనల్ని వెదజల్లుతుంది నేను చెప్పిన మూట. త్వరగా బయటికి తీయాలి, ఆలస్యం అయినకొద్దీ ప్రమాదపు అంచులకు చేరు కుంటుంది బిడ్డ" జీవం లేనట్లున్న కనుల్ని అటూ ఇటూ తిప్పుతూ అతన్ని తొందరపెట్టాడు ఉపమన్యువు.

అతని ఆదేశాలను పాటించటం కంటే, మరో నలుగురు భవనరక్షకులను ఎదిరించి యుద్ధం చేయటమే చాలా తేలిక అనిపించింది శ్రీధరుడికి.

భవనం ముందుభాగంలో చాప చుట్టమాదిరి పడిపోయి వున్న భవన రక్షకులకు తెలివివచ్చి, గొంతులు చినిగిపోయేటట్లు అరుపుల్ని ఆరంభిస్తే తన పరిస్థితి ఎలా తయారవుతుందో వూహించటానికి ప్రయత్నం చేస్తుండగా, మందసం అడుగుభాగంలో అగుపించింది అతనికి నీలిరంగులో వున్న పట్టుగుడ్డ.

ఆలస్యం చేయకుండా వెటనే అతన్ని బిడ్డదగ్గిరికి తీసుకువచ్చాడు ఉపమన్యువు.

"చిటికెడు భస్మాన్ని పెదవులమీద వుంచు. మరో చిటికెడు పొడిని తీసి నాశికారంధ్రాల ద్వారా లోపలికి పంపించు. త్వరగా... త్వరగా..." బిడ్డపక్కన మోకించి కూర్చుంటూ హెచ్చరించాడు.

కరకు కత్తుల్ని, వాడిగా వుండే బరిశెల్ని పట్టుకున్న రాజభటులు తనను వీధులవెంట పరుగులు తీయించినప్పుడు కూడా భయపడలేదు శ్రీధరుడు.

ఇప్పుడు ఉపమన్యువు చెప్పిన పనులను చేయటానికి ధైర్యంచాలక బేలగా చూశాడు ఆ వైద్యుడి వంక. చూపులేకపోయినా అతని తడబాటును తేలికగానే పసిగట్టగలిగాడు ఉపమన్యువు.

"భానుడు అస్తమించిన తరువాత ఎవరికీ వైద్యం చేయనని తెలిసి కూడా మొండిగా లోపలికి వచ్చినవాడివి నువ్వు. పిరికివాడిలా ప్రవర్తించకు. బిడ్డ ప్రాణాలు దక్కాలంటే నేను చెప్పినట్లు చేయవలసిందే..." అతని భుజం తడుతూ వుత్సాహపరిచాడు.

పట్టుగుడ్డ మూటలోని భస్మాన్ని బిడ్డ పెదవులమీద వుంచాడు శ్రీధరుడు.

అతను చెప్పినట్లు నాశిక రంధ్రాల దగ్గిర పెట్టి, మృదువుగా బిడ్డబుగ్గల్ని తట్టాడు.

రెండుక్షణాలు కూడా గడవకముందే గట్టిగా తుమ్మింది బిడ్డ. మెల్లిగా కనులు తెరిచి చుట్టూ చూసింది. అది గమనించి ఆనందాన్ని అణుచుకోవటం అసాధ్యమై, చటుక్కున ఉపమన్యువు పాదాలను తాకాడు శ్రీధరుడు.

"రెండు రోజులకు సరిపడే భస్తాన్ని తీసి భద్రపరచుకో. గోక్షీరంలో కలిసి ముప్పొద్దులా తాగించు. బిడ్డకు ప్రమాదం తప్పిపోయింది" అతని చేతిని ఆసరాగ తీసుకుని తల్పంవైపు అడుగులు వేస్తూ చెప్పాడు ఉపమన్యువు.

పట్టుగుడ్డలోంచి భస్మాన్ని అతను చెప్పినట్లు భద్రపరచుకొని మందసాన్ని మూసివేశాడు శ్రీధరుడు. "మీ భవనరక్షకులను నేను గాయపరచి లోపలికి

వచ్చాను. వారికి స్పృహ తెలిసేదుకు వైద్యం చేయాలి" తల్పంపక్కన నిలబడుతూ తనుచేసిన ఘనకార్యాన్ని అతనికి తెలియచేశాడు.

అంతా విని చిన్నగా నవ్వేశాడు ఉపమన్యువు.

"వారికి తెలివి వచ్చేలోపుగా నువ్వు ఇక్కడినుంచి వెంటనే వెళ్ళిపోకపోతే, వైద్యం నీకు కూడా చేయవలసి వస్తుంది. చిన్న చిన్న దెబ్బలను లక్ష్యపట్టే నీరసులు కాదు వారు...మరి కొద్దిసేపటిలో తమంతట తామే లేచి కూర్చోగలరు" అంటూ శ్రీధరుడి చేతిని పట్టుకున్నాడు.

"చికిత్స చేసినందుకు ప్రతిఫలం ఏమివ్వాలో మీరు చెప్పలేదు. ఎన్ని బంగారు నాణేలు యిస్తే మీ రుణం తీర్చుకోగలనో నాకు తెలియటం లేదు" మెల్లిగా అన్నాడు శ్రీధరుడు.

"నా గురించి, నా నిస్సహాయతను గురించి ఎవరికీ చెప్పకుండా వుండటమే నీనుంచి నేను ఆశిస్తున్న ప్రతిఫలం. అంతకుమించిన నాకేమీవద్దు. క్షేమంగా వెళ్లిపో..." అంటూ తల్పంమీద మేను వాల్చి కనులు మూసుకున్నాడు ఉపమన్యువు.

మరోసారి అతని పాదాలను తాకి ప్రణామం చేశాడు శ్రీధరుడు. తనంతట తనే లేచి కూర్చోవడానికి ప్రయత్నిస్తున్న బిడ్డను చేతుల్లోకి తీసుకుంటూ భవనం వెలుపలికి వచ్చాడు.

ఆత్రుత నిండిన కనులతో భవనద్వరం వైపు చూస్తూన్నారు బిడ్డతల్లి ఇందువదన, సౌదామిని.

కదలిక లేకుండా పడివున్న బిడ్డ యిప్పుడు తల ఎత్తి తమవంక చూసేవారికి పట్టరాని సంతోషంతో పరవశించిపోయారు వారిద్దరూ.

"మానవులు కాదు మీరు. మాకోసం భువికి దిగివచ్చిన దేవతలు. మీరు సహాయం చేయకపోతే ఈ రోజు నా బిడ్డ నాకు దక్కివుండేదికాదు" శ్రీధరుడి చేతులు పట్టుకుంటూ గద్గదస్వరంతో అన్నది ఇందువదన.

ఉపమన్యులవారు యిచ్చిన భస్మాన్ని ఆమెచేతుల్లో పెట్టి ఆయన చెప్పిన మాటలన్నిటినీ యధాతంథంగా వినిపించాడు.

"నాకోసం మీ వాకిటిదగ్గిర మాటువేసి రాజభటులు యిటుగా రాకముందే ఇళ్ళకు వెళ్ళిపొండి. తాత్సారం చేయవద్దు" అని వారి వేశ్యావాటికవైపు పంపించబోతుండగా, తను కల్పించుకున్నది అంతవరకు మౌనంగా వున్న సౌదామిని.

"ఎంత యిచ్చారు ఉపమన్యుల వారికి?" పట్టినపట్టు వదలకుండా ఒకటికి రెండుసార్లు అడిగింది.

ఒక్క చిల్లిగవ్వ కూడా ఆయన తననుంచి ఆశించలేదని చెప్పబోయి ఆఖరిక్షణలో ఆ మాటల్ని తనలోనే అదుముకున్నాడు శ్రీధరుడు.

చీకటిపడిన తరువాత వచ్చినవారికి చికిత్స చేసి పంపాడని బయటికి పొక్కిన వెంటనే ఆ వైద్యశిఖామణి మీద చెలరేగుతాయి రకరకాల వూచ్చేస్తాయి ఆ వూహలకు.

ఏ విషయం నలుగురికీ తెలియకూడదని ఆయన అతిరహస్యంగా వుంచుకున్నాడో అది ఏదో ఒకవిధంగా అర్థం చేసుకున్నది సౌదామిని. తనకు హేమసుందరి యిచ్చిన రతనాల హారాన్ని పమిటె చాటునుంచి బయటికి తీసి అతనిచేతుల్లో పెట్టబోయింది.

"ఉపమన్యుల వారికి సమర్పించి కృతజ్ఞతలు తెలియజేసుకోండి..." అంటున్న ఆమెవంకా, ఆ హారంవంకా మార్చి మార్చి చూశాడు శ్రీధరుడు. నవ్వును ఆపుకోవడం చేతకాక చిరునవ్వు నవ్వాడు.

"ఎందుకు నవ్వుతున్నారు? మా మాటల్లో తప్పు ఏదైనా ధ్వనించిందా?" చిరుకోపంతో వెంటనే ప్రశ్నించింది సౌదామిని.

"ఉపమన్యుల వారు అడిగిన ప్రతిఫలాన్ని ఆయనకు అందించటం జరిగిపోయింది. నీ నెచ్చెలికి ఈ విషయాన్ని తెలియచేయి. ఇక మీరు ఒక్కక్షణం కూడా యిక్కడ నిలుచోవద్దు. త్వరగా వెళ్ళిపోండి" అంటూ వారిని మరోసారి బయలుదేరదీశాడు శ్రీధరుడు.

పాతిక ధనువుల దూరం వెళ్ళి వారు ఒక మలుపులో అదృశ్యం అయిన తరువాత మెల్లిగా వెనుతిరిగి తనదారిన తాను వెళ్ళిపోయాడు.

## 7

నిద్రపోకుండా అదేపనిగా అల్లరిచేస్తున్న కొడుకును ఎత్తుకుని యింటి ముందు నిలబడి వున్నది శ్యామల. జోలపాటలు పాడుతూ నిద్రబుచ్చటానికి ప్రయత్నిస్తోంది. వడివడిగా అడుగులు వేస్తూ వస్తున్న శ్రీధరుడిని గమనించగానే బిడ్డడిని క్రిందికి దించి, పెద్ద కంచుపాత్రతో నీటిని తీసుకువచ్చింది.

కరచరణాలను శుభ్రపరచుకుని, ఆమె బిడ్డడిని తను తీసుకున్నాడు శ్రీధరుడు. ముద్దుమాటలు చెపుతూ, ఇంటిముందున్న పూలతోటలో తిప్పాడు. చిన్నచేతులతో అతని కంఠాన్ని కౌగిలించుకుని హాయిగా నిదురలోకి జారిపోయిన కొడుకును చూసి ఆశ్చర్యపోయింది తల్లి.

"భయపట్టినా, బ్రతిమాలినా ససేమిరా నామాట వినలేదు. నిశాచరుడి మాదిరి నన్ను కాల్చుకు తిన్నాడు. నీ దగ్గిరికి వచ్చిన వెంటనే నిదురించటం చాలావింతగా వున్నది" అంటూ బిడ్డకు అందుకుని తన మందిరంలోకి తీసుకుపోయింది.

తను లేని సమయంలో కోలాహలుడు అక్కడికి వచ్చాడో లేదో తెలుసు కోవటం కోసం, తన మందిరంలోకి తొంగిచూశాడు శ్రీధరుడు. యింటివెనుక భాగంలోకి కూడా పోయివచ్చాడు.

"కోలాహలుడు కోసమే నువ్వు వెతుకుతూ వుండివుంటే వెతకటం అనవసరం. అతను రాలేదు" అతని చర్యల్ని అర్థం చేసుకుని చెప్పింది శ్యామల.

చక్కటి పీటను అతని మందిరంలో వాల్చి, మర్రిఆకులతో కుట్టిన విస్తరిని ఆ పీటమీద పరిచిందామె.

వేడివేడి ఆహారపదార్థాలను వడ్డించి ఒకప్రక్కగా కుర్చున్నది.

ఆ రోజు సాయంసమయంలో తను వీధిలోకి వెళ్లిన దగ్గిర్నించి మొదలు పెట్టి ఉపమన్యులవారి భవంతి దగ్గిర జరిగిన రగడ వరకూ ఒక్క అంశాన్ని కూడా వదిలిపెట్టకుండా అన్నీ చెప్పాడు శ్రీధరుడు.

"ముక్కూ ముగం తెలియని నన్ను సోదరుడి కంటే ఎక్కువగా అభిమానించిన నీముందు ఈ విషయాన్ని దాచిపెట్టటం నాకు చేతకాలేదు" అంటూ భోజనం చేసి, విస్తరిముందు నుంచి లేచాడు.

పెదవి విప్పి ఒక్కమాట మాట్లాడలేదు శ్యామల. అతను ఆహారం తీసుకున్న ప్రదేశాన్ని శుభ్రపరిచి, మౌనంగా తన మందిరంలోకి వెళ్ళిపోయింది.

పడకమీద మేనువాల్చాడు శ్రీధరుడు. మూడు ఝాములు గడిచి నాలుగో ఝాము ప్రారంభం అవుతున్న సమయంలో మాగన్నుగా పట్టింది ఒక కునుకు.

ఆ కలతనిద్దురలో అతని ఎదుట ప్రత్యక్షం అయింది అందాలు చిందే హేమసుందరి వదనసరోజం.

ఎక్కడలేని తెగింపును తెచ్చి పెట్టికుంటూ ఆమెచేతిని గట్టిగా పట్టుకున్నాడు శ్రీధరుడు.

"మరులుగొలిపే నీ విశాలనేత్ర యుగళివంకే చూస్తూ కాలం గడిపేయాలని వున్నది. తీరుతుందా నా కోరిక?" ధైర్యంగా ప్రశ్నించాడు.

ముత్యాలవంటి పర్వరస కనిపించేలా ఫక్కున నవ్వింది హేమసుందరి.

"మక్కువ తీర్చుకోవాలనే కోరిక వుంటే రేపు సాయంత్రం ఒక్కసారి భైరవీ ఆలయానికి వచ్చి చూడు..." అంటూ అతని చేతిని వదిలించుకుని దూరంగా వెళ్ళిపోయింది.

"ఆగు...అక్కడే ఆగు...అప్పుడే వెళ్లిపోకు..." బిగ్గరిగా పిలుస్తూ ఆమెవెనుక పరుగుతీయబోయి, పడకమీదినుంచి కిందపడ్డాడు శ్రీధరుడు.

కల వెంటనే కరిగిపోయింది.

ఎదుటవున్న గవాక్షంలో నుంచి అప్పుడే ఉదయిస్తున్న బాలభానుడు అగుపించాడు.

నేలకు పొడుచుకుని పోటేత్తిపోతున్న తలను తడుముకుంటూ పైకిలేస్తున్న సమయంలో కనిపించింది మందిరద్వారంలో నిలబడి ఆశ్చర్యంగా చూస్తున్న శ్యామల.

"వెళ్లిపోవద్దని బిగ్గరిగా అరుస్తుంటే నీ స్నేహితులు ఎవరైనా వచ్చారేమో అనుకున్నాను..." ఉబికివస్తున్న నవ్వును అతిప్రయత్నంమీద అదుముకుంటూ వెంటనే అన్నది ఆమె.

బుడిబుడి నడకలతో ఆమె వెనుకనుంచి వచ్చి తనమీదికి దుమికిన ఆమె బిడ్డడిని ఒడిలో కూర్చోపెట్టుకుంటూ తన స్వప్నవృత్తాంతాన్ని సవివరంగా చెప్పాడు శ్రీధరుడు.

"రంగనాథుడి విగ్రహం ఒకటి ఆమె మందిరంలో వున్నది. కావేటిరంగని కొలిచేవాళ్ళు భైరవీఆలయం దగ్గిరికి వెలా వెళ్లగలరు?" తన మనసులో మెదులుతున్న అనుమానాన్ని వెల్లడించాడు.

శైవమతానికి, శాక్తేయానికి, వైష్ణవానికి మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమంటున్న కాలం అది. ఆ వైషమ్యాలకు దృష్టిలో వుంచుకొనే అతనలా ప్రశ్నించాడని గ్రహించి సాలోచనగా తలపంకించింది శ్యామల.

"మన సేనాపతులవారి ముద్దులబిడ్డడు, పలుమార్లు నీ చేతిలో భంగపడిన మహావీరుడు నాసీరదేవులవారి కళ్ళు హేమసుందరిమీద పడ్డాయని, బెదిరించో, భయపెట్టో, లేక ప్రలోభపెట్టో ఆమెను వశపరచుకోవటానికి యత్నిస్తున్నాడని ఒక నీలివార్త నగరంలో ప్రచారం అవుతోంది" మందిరం లోపలికి వచ్చి ఒక పక్కగా నిలబడుతూ చెప్పిందామె.

"నాసీరదేవుడి బెడదనుండి తప్పించుకోవాలంటే ఒక్క కావేటి రంగడిని కొలిస్తే సరిపోదని భావించి వుంటుంది హేమసుందరి. తీక్షణ ప్రధావమైన శక్తులు కల భైరవిని పూజిస్తే తప్ప తరుణోపాయం స్ఫురించదని నమ్మి వుంటుంది..." అతని కలకు అర్థాన్ని వివరిస్తూ, చిన్నగా నవ్వేసింది.

కలలో వినిపించిన మాటలు నిజమని నమ్మి వాటిని తను ఆమెకు సమగ్రంగా చెప్పటమూ, ఆ మాటలకు అర్థాన్ని ఆమె వివరించటమూ తమ అవివేకానికి చిహ్నాలని తెలిసికూడా నవ్వకుండా వుండలేకపోయాడు శ్రీధరుడు.

"పరాయివారు ఎవరు ఎంత ముద్దుచేసినా కన్నెత్తికూడా చూడని నా బిడ్డ నువ్వు యిక్కడికి వచ్చిన క్షణంనుంచీ నీ సాహచర్యాన్ని యిష్టపడుతున్నాడు.నా జోలపాటల్నికూడా లెక్కచేయని ఈ నిశాచరుడు నీ భుజాలమీదికి చేరుకున్న మరుక్షణం నిద్రకు ఉపక్రమించాడు" అతని చేతుల్లోనుంచి బిడ్డడిని తీసుకుని తలను మూర్కొంటూ అన్నదామె.

"పగటిపూట వీక్షిస్తే రాత్రివేళ కలలోకి వచ్చేటంత వికృతంగా వుండే ఇందువదనను చూసి అసహ్యించుకోకుండా,ఆమె బిడ్డను రక్షించటానికి నువ్వు చేసిన సాహసం మరెవరూ చేయలేరు. నీవంటి మనిషికి అతిథ్యం ఇవ్వగలగటం నా అదృష్టంగా భావిస్తున్నాను" అంటూ అవతలికి వెళ్లిపోయింది.

అనుకోని విధంగా ఆమె నోటివెంట వెలువడిన ఆ పొగడ్తలను ఆలకించే సరికి విపరీతమైన సిగ్గుతో ఎర్రగా కందిపోయింది శ్రీధరుడి ముఖం.

"హేమసుందరి కోరిక ప్రకారం ఈ రోజు సాయంత్రం భైరవి ఆలయానికి పోతున్నావా లేదా?"

ఫలహారాల పళ్ళెరాన్ని తెచ్చి అతని అందిస్తూ అడిగింది శ్యామల.

తలఎత్తి చూస్తే ఆమె మరింత వెక్కిరిస్తుందన్న భయంతో ఏమీ మాట్లాడకుండా ముఖాన్ని ఇంకా క్రిందికి దించుకున్నాడు శ్రీధరుడు.

"నిన్ను వెక్కిరించటానికి రాలేదు నేను. వేకువఝామున వచ్చిన కలలు నిజం అవుతాయని అందరూ అనుకునే మాటలో యదార్థం ఎంత వున్నదో తెలుసుకోమని చెప్పటానికి వచ్చాను" మృదుస్వరంతో అతన్ని మందలించిందామె.

యధాప్రకారం తప్పటడుగులు వేస్తూ తన దగ్గిరికి వచ్చిన బుడతడికి ఫలహారాన్ని అందిస్తూ తల అడ్డంగా తిప్పాడు శ్రీధరుడు.

"గర్గుడి విషయంలో గొడవ చల్లారేటంతవరకూ నగరంలోకి పోదలచుకో లేదు నేను. వీధిలోకి వెళ్లి అనవసరమైన లేనిపోని గొడవల్లో చిక్కుపడే ఉద్దేశ్యం నాకులేదు" అని చెప్పబోతుండగా టకటకమని మ్రోతలు చేసింది ముఖద్వారం .

ఎదుట వున్న బిడ్డడిని సున్నితంగా పక్కకునెట్టి దట్టీలోని బాకును బయటికి లాగాడు.

కొదమసింహం మాదిరి ద్వారప్రవేశంవైపు కదలబోతుండగా వారించింది శ్యామల.

"వచ్చింది ఎవరో తెలుసుకోకుండా తొందరపడటం అవివేకం అనిపించుకుంటుంది" అంటూ తన బిడ్డడికి ఎత్తుకుని ముఖద్వారం దగ్గిరికి వెళ్లింది.

కుతూహలాన్ని అణుచుకోవటం అసాధ్యమై అటుకేసి తొంగిచూసిన శ్రీధరుడికి అగుపించారు ద్వారం దగ్గిర నిలుచుని వున్న మహాకాయులు ఇద్దరు.

గజదొంగ గర్గుడిగురించి ఆరాలు తీయటానికి ఏతెంచిన ధనదుపురపు రాజభటులలోని వారు కారు ఆ వ్యక్తులు. ఆ వాడలో నివసించే నేరస్థులకు రక్షణ కల్పించే నాయకులు.

"నీ ఇంటికి వచ్చిన యువకుడితో ఒకసారి మాట్లాడాలని వచ్చాము శ్యామలమ్మా..." చనువుగా లోపలికి వచ్చేశారు వారిద్దరూ.

"ఈ రోజు తెల్లవారుతున్న సమయంలో మా దగ్గిరికి వచ్చింది వికృత రూపిణి అయిన ఇందువదన. గతరాత్రి తన బిడ్డకు ప్రాణదానం చేసిన మహావీరుడితో మాట్లాడాలని ఆమెకోరిక..."

శ్రీధరుడి ఎదుట నిలబడుతూ మృదుస్వరంతో చెప్పాడు మొదటి వ్యక్తి.

వేశ్యావాటికలో నివసించే ఇందువదన తనకోసం రావటం దేనికో అర్థంకాక అయోమయంగా శ్యామలవైపు చూశాడు శ్రీధరుడు.

"ఆమె బిడ్డకు వ్యాధి మరోసారి తిరగబెట్టిందేమో!" జాలి ధ్వనించే కంఠంతో అన్నది శ్యామల.

ఆ మాటేగనుక నిజం అయితే ప్రత్యేకంగా ఆమె తనకోసం అంతదూరం రావాల్సిన అవసరం లేదని శ్రీధరుడికి తెలుసు. కోరినంత ధనం యిస్తే ఎటువంటి వారికైనా ఉపమన్యులవారు పగటిసమయంలో తప్పకుండా దర్శనం యిస్తాడు.

అతను కోరే ప్రతిఫలాన్ని తప్పకుండా ఇందువదన చేతికి యిచ్చి పంపిస్తుంది హేమసుందరి.

తన బిడ్డను గురించి వచ్చివుండదామె. తన జాడల్ని తెలుసుకుని రాజభటుల చెవిలో ఊదటానికి బయలుదేరి వుంటుంది...

తదేకంగా శ్రీధరుడి ముఖంలోకి చూస్తున్న రెండో మహాకాయుడికి వెంటనే అవగతమైపోయాయి అతని మనసులోని ఆలోచనలు.

"మా రక్షణలో వున్న మనిషికి అపకారం చేయటానికి వచ్చినవారిని మేము ప్రాణాలతో వదిలిపెట్టము. ఇందువదన నీకు అపకారం చేయటానికి రాలేదు.

నీతో ఒక ముఖ్యమైన విషయాన్ని గురించి చెప్పటానికి వచ్చింది. నువ్వు అనుమతిస్తే ఆమెను వెంటనే పిలిపిస్తాము" భుజంమీద చేయివేసి అనుమానంగా అన్నాడతను.

ఆ మాటలకు శ్యామల ఎటువంటి అభ్యంతరాలు తెలుపకపోవటంతో, తలవూపకతప్పలేదు శ్రీధరుడికి.

వెంటనే ముఖద్వారం దగ్గిరికిపోయి వీధిలో నిలబడివున్న తమ సహచరులు ఎవరికో సైగ చేశాడు ఆ మహాకాయుడు.

పావుఘడియ తరువాత బెదురుచూపులు చూస్తూ శ్యామల ఇంటిలోకి వచ్చింది వికృతరూపిణి ఇందువదన.

మహాకాయుల మధ్యన నిలబడిన శ్రీధరుడిని గమనించగానే వింతగా ప్రకాశించింది ఆమె వదనం. రెండు అంగల్లో అతన్ని సమీపించి పాదాలను తాకి నమస్కరించబోయింది.

అంతమంది ఎదుట ఆమె నెరుపుతున్న మర్యాదలకు సిగ్గుతో కందిపోయింది అతని ముఖం.

"నీ బిడ్డకు ఎలా వుందమ్మా? హాయిగా ఆడుకుంటున్నదా?" తన భావాలను దాచుకునేటందుకు గబగబా పరామర్శించాడు.

"మీ దయవల్ల క్షేమంగానే వున్నది నా బిడ్డ. ఉపమన్యులవారిచ్చిన భస్మాన్ని ఆవుపాలతో కలిపి తాగించాను..." అంటూ ఏదో చెప్పబోయిన మాటల్ని ఆపింది ఇందువదన.

ఆమె ఎందుకలా ఆగిపోయిందో అర్థం చేసుకున్నది శ్యామల. మహాకాయులిద్దరికీ సైగచేసి వాకిట ముందున్న తోటలోకి తీసుకుపోయింది.

తన పలుకులు వారి చెవులకు చేరవని రూఢి చేసుకుని శ్రీధరుడికి కాస్తంత దగ్గిరిగా జరిగింది ఇందువదన.

"హేమసుందరిని సేనాపతులవారి కుమారుడికి అర్పించాలని ఆమెతల్లి శివకామిని అభిలషిస్తోంది. ఈ విషయం మీకు తెలుసనే భావిస్తున్నాను" అన్నది.

అంతకుముందే శ్యామలతో తన సంభాషణను జ్ఞప్తికి తెచ్చుకుంటూ తెలుసునన్నట్లు తలవూపాడు శ్రీధరుడు.

"తను అనుకున్న పనికి ఎన్నెన్నో ఆటంకాలు ఎదురవుతూ వుండటంవల్ల కలవరపడుతోంది ఆమె. తాము బాగుపడటాన్ని చూసి ఓర్వలేని వారెవరో చేతబడి చేయించారన్న అనుమానంతో, ఈ రోజు సాయంత్రం కుమార్తెను నగరం వెలుపలి భైరవీ ఆలయానికి తీసుకుపోతున్నది."

ఇందువదన ముఖంలోకి చూస్తూ శిలావిగ్రహమైపోయాడు శ్రీధరుడు. వేకువజామున వచ్చిన కలలు నిజంగానే నిజం అవుతాయా?

"మీ మనస్సులో, ఏదో సంశయం వుద్భవించింది. అదేమిటో నాకు తెలియచేస్తే సంతోషిస్తాను" అని వెంటనే అర్థించింది ఇందువదన.

"ఈ విషయాలు నువ్వు నాకు ఎందుకు చెపుతున్నావ్?" అని ప్రశ్నించాడు శ్రీధరుడు.

"ఆపదలో చిక్కబడిన నా బిడ్డను కాపాడటానికి నోరుతెరిచి అడుగకముందే వైద్యుడిని పిలిపించింది హేమసుందరి. అతను కోరిన వెండినాణేలను తనే యిచ్చింది. ఆమె బాగును కోరుకోటం నా ధర్మం."

"నువ్వు చెప్పదలుచుకున్న విషయమేమిటో వివరంగా చెప్పు" తొందరించాడు శ్రీధరుడు.

"భైరవీ ఆలయంలో పూజారి వట్టి నికృష్టుడు. భైరవిని పూజించటానికి వచ్చినవారిని తన మాయమాటలతో మోసగించటం అతని నైజం."

ఆమె తనకు చెప్పదలచుకున్నదేమిటో అప్పటికీ అర్థంకాలేదు శ్రీధరుడికి.

"పూజారి మాటలకు మోసపోయివట్టి ధనాన్ని కోల్పోతారని నేను భయపడటంలేదు. వాడు వట్టి కామాంధుడు... భైరవీపాదతీర్థమనే పేరుతో మత్తుమందు కలిపిన నీటిని త్రాగించి అత్యాచారాలు చేయటంలో సిద్ధహస్తుడు. అన్నెం పున్నెం తెలియని అమాయకురాలు హేమసుందరి అతని వలలో పడిపోకముందే అడ్డుపడగల సాహసులు మీరు ఒక్కరేనని విశ్వసిస్తూ యిక్కడికి వచ్చాను" అసలు విషయాన్ని సూటిగా వెల్లడించింది ఇందువదన.

ముఖంమీద ఎవరో చాచికొట్టిన అనుభూతి కలిగి అలాగే చూస్తూండి పోయాడు శ్రీధరుడు.

"ఈ విషయాలు నీకు ఎలా తెలుసు?" రెండు క్షణికాల తరువాత తేరుకుని అడిగాడు.

"దారుణమైన అగ్నిప్రమాదంలో చిక్కబడి సర్వస్వాన్ని కోల్పోకముందు ఒకసారి భైరవి అనుగ్రహాన్ని అర్థించటానికి అతని దగ్గిరికి వెళ్ళాను నేను. నాకు కలిగిన బిడ్డ ఆ దుర్మార్గుడి ప్రసాదమే..." నీరునిండిన కనుల్ని పయ్యెద కొంగుతో తుడుచుకుంటూ చెప్పింది ఇందువదన.

ఆ పైన అతని దగ్గిర నిలబడటానికి మనస్కరించనట్లు గిరుక్కన వెనుతిరిగి బయటికి పరుగుతీసింది.

* * *

"ఇందువదన పలుకుల్లో అసత్యాలు వుంటాయనుకోవడం లేదు. ఏదో ఒకటి చేయకపోతే హేమసుందరి అన్యాయం అయిపోవటం తథ్యం" శ్రీధరుడి మాటల్ని వింటూ సాలోచనగా అంది శ్యామల.

ఇందువదన అక్కడికి తీసుకువచ్చిన మహాకాయులిద్దరూ అవతలికి వెళ్లిపోయేదాకా ఆగాడు శ్రీధరుడు. ఆ తరువాత ఆమెను తన మందిరంలో సావకాశంగా కూర్చుండబెట్టి తనకు తెలిసిన విషయాలన్నింటినీ ఆమె చెవిన వేశాడు. ఇప్పుడు ఆమె పలికిన పలుకుల్ని ఆలకించేసరికి మరింతగా ఆందోళనకు గురి అయింది అతని అంతరంగం.

గర్గుడి కోసం, అతన్ని తప్పించిన దుండగీడుకోసం నగరాన్ని జల్లెడ వేస్తున్నారు రాజభటులు. నగరద్వారాన్ని మూసి కట్టుదిట్టమైన కాపలా ఏర్పాటుచేసి వుంటారు. వారిని ఏమార్చి నగరం వెలుపల వుండే భైరవీ ఆలయం దగ్గిరికి పోవటం అంటే మాటలు కాదు... పట్టుబడితే ఆ తరువాత చెప్పుకోవటానికి ఒక్కమాట కూడా మిగలదు...

అతని అంతరంగంలో ఆందోళనను అర్థంచేసుకుని సానుభూతిగా తల వూపింది శ్యామల.

"గర్గుడిని తప్పించిన దుండగీడువి నువ్వేనని ప్రచారం చేస్తున్న రాజభటులు ఎవరైనా నిన్ను చూడటం జరిగితే నీ ప్రాణాలు పోతాయనే మాటలో అసత్యం ఏమీలేదని నాకుతెలుసు.

కానీ అన్నెం పున్నెం ఎరుగని అమాయకురాలికి అన్యాయం జరుగబోతున్నదనే మాటను కూడా నువ్వు మరిచిపోకూడదు. ఆమెకు ఏదైనా

జరగరానిది జరిగితే అది మీ మూలంగానే జరిగినట్లు నేను భావిస్తాను" ఎదురుగా కూర్చుంటూ ఖచ్చితమైన కంఠంతో అన్నది.

హద్దులేకుండా పోయింది శ్రీధరుడి ఆశ్చర్యానికి.

"హేమసుందరికి ఏదైనా అన్యాయం జరిగితే అందుకు బాధ్యుడిని నేను ఎలా అవుతాను?" అయోమయంగా చూస్తూ అడిగాడు.

"సేవాపతులవారి కుమారుడికి ఆమెను అర్పించనీయకుండా అడ్డుపడిన అడ్డంకివి నువ్వు! ఈ నగరంలో అడుగుపెట్టిన క్షణం నుంచి అతగాడిని గాయపరుస్తున్నావ్. అడుగుతీసి అడుగువేయలేని నిస్సహాయస్థితిలో అతడ్ని నెట్టివేస్తూ వచ్చావ్. నీ మూలంగానే అతను హేమసుందరి ఇంటికి వెళ్ళలేక పోయాడు. అతను తమ దగ్గిరికి రాకపోడంవల్లనే హేమసుందరిని భైరవీ ఆలయానికి తీసుకుపోతున్నది ఆమె తల్లి... ఈ ఇబ్బందులన్నింటికీ కారకుడివి నువ్వే."

అంతకుముందు రెండు క్షణికాల వరకూ ఎంతో అనుమానయంగా మాట్లాడిన శ్యామల ఉన్నట్లుండి తనను నిందించటం మొదలుపెట్టేసరికి మతిపోయినట్లు అయింది శ్రీధరుడికి.

"ఇప్పుడు నన్నేం చేయమంటావ్? ఏంచేస్తే నీ దృష్టిలో నేను మంచి మనిషిగా మారతాను?" విసుగునిండిన కంఠంతో ప్రశ్నించాడు.

తనవంకా, అతనివంకా విచిత్రంగా మార్చి మార్చి చూస్తున్న బిడ్డడిని ముద్దుపెట్టుకుంటూ తల్పంమీదనించి లేచింది శ్యామల.

"ఎంత వద్దని అనుకున్నా విధి నిన్ను హేమసుందరి దగ్గిరికి నెట్టుకుంటూ పోతున్నదని నా అనుమానం. ఫలితాన్ని భగవంతుడికి వదిలిపెట్టేసి ఒకసారి

నువ్వు భైరవీ ఆలయం దగ్గిరికి వెళ్ళిరావటమే మంచిదని నా అభిప్రాయం" అంటూ బిడ్డడితో సహా తన మందిరంలోకి వెళ్ళిపోయింది.

రకారకాల ఆలోచనలతో కందిరీగల తుట్టెలా తయారైన తలను తడుముకుంటూ మందిరంలో అటూ ఇటూ తిరగసాగాడు శ్రీధరుడు.

నగరద్వారం దగ్గిర నిలబడివుండే రాజభటుల కనులుకప్పి అవతలికి పోవటం ఎలాగో అతనికి అంతుబట్టకముందే అపరాహ్ణవేళ అయింది.

చెక్కపీటను అతని మందిరంలోనే వాల్చి మర్రి ఆకుల విస్తరిలో ఆహారపదార్థాలను వడ్డించింది శ్యామల. బావి దగ్గిరికి పోయి తలారా స్నానం చేసి వచ్చాడు శ్రీధరుడు. పిడిబాకును,రాగికంకణాన్ని సవరించుకుంటూ ఆహారాన్ని ఆరగించాడు.

అతను తన దగ్గిర దాచిన ధనపు సంచీలోనుంచి పాతిక బంగారు నాణేలను మూటకట్టి అతనిచేతికి అందించింది శ్యామల.

"ధనపు మ్రోతలను వింటే తమను తాము మరిచిపోయే మనుషులు ఎంతో మంది వున్నారు నగరంలో. వీటి సహాయంతో నీ పనులు జరిగిపోవచ్చని నేను భావిస్తున్నాను" ఆశ్చర్యంగా చూస్తున్న శ్రీధరుడికి ఆ నాణేలను ఎందుకు తెచ్చి యిచ్చిందో వివరించి చెప్పింది.

చేతులు జోడించి నమస్కరించబోతున్న అతన్ని వెంటనే వారించిందామె.

"పెద్దవాళ్ళు చిన్నవారిని ఆశీర్వదించాలి. అభివాదం చేయకూడదు. నువ్వు వెళ్ళే పని దిగ్విజయమవ్వాలని మా కులదేవతను ప్రార్థిస్తాను... హేమసుందరి భైరవి ఆలయాన్ని చేరుకోవడానికి ముందే నువ్వు అక్కడికిపోయి, అక్కడ పరిస్థితుల్ని అంచనా వేయటం మంచిది..." అంటూ తొందరపెట్టింది.

నాణేల మూటను దట్టీలో దాచుకుంటూ ఆమె బిడ్డడిని ముద్దాడి ముఖద్వారాన్ని అధిగమించాడు శ్రీధరుడు.

కరకుకత్తుల్ని పట్టుకొని కొండరాళ్ళతో మలచిన విగ్రహాల మాదిరి నిలబడిన నగరద్వారం దగ్గిర కాపలాభటులను చూసినకొద్దీ అతడ్ని వివశుణ్ని చేయసాగింది తీవ్రమైన అలజడి.

తమకు తెలియకుండా ఒక్కపిట్టనుగాని, చిన్నపురుగునుగాని పోనీయడం లేదు వారు. తమ ఎదుటికి వచ్చిన వారందర్నీ శల్యపరీక్ష చేసినట్లు క్రిందినించి పైదాకా పరిశీలించి పంపిస్తున్నారు.

శ్యామల చెప్పినట్లు దట్టీలోని బంగారునాణేలను ఎరగా చూపిస్తే తనకోరిక నెరవేరుతుందనే నమ్మకం బలహీనపడుతుండగా, అంగడి దగ్గిర్నించి కదలి మరికొంచెం ముందుకుపోయాడు శ్రీధరుడు.

మిగిలిన వారందరికీ కొంచెం ఎడంగా నిలుచునివున్న రాజభటుడిని సమీపించి పలుకరింపుగా చిన్న చిరునవ్వు నవ్వాడు.

"ఎవరు నువ్వు? ఎందుకు వచ్చావు యిక్కడికి?" శ్రీధరుడివైపు అనుమానంగా చూస్తూ వెంటనే ప్రశ్నించాడు భటుడు.

"గర్గుడిని, అతని సహచరుడిని మన భటులు పట్టుకోగలరనే నమ్మకం నీకేమైనా వున్నదా?" అటూ ఇటూ కదులుతున్న నగర రక్షకబృందాలవైపు చూపిస్తూ అడిగాడు శ్రీధరుడు.

"ఆ విషయాలు నీకు అనవసరం. పిచ్చిమాటలు మాట్లాడకుండా వచ్చిన దారినే వెనక్కి వెళ్ళిపో... వెళ్ళు...వెళ్ళు..." కరుకుకంఠంతో హెచ్చరిస్తూ తలను పక్కకు తిప్పుకున్నాడా భటుడు.

సందిగ్ధ పరిస్థితిలో చిక్కుపడ్డాడు శ్రీధరుడు. తనితో సంభాషణను ఎలా పొడిగించాలో తెలియక, వెనక్కి మరలబోతుండగా, వెర్రిగా అరిచి పక్కకు దూకాడా భటుడు.

తనను గుర్తించడం వల్లనే అతనలా కేకపెట్టాడని భావించి, దట్టీలో వున్న పిడిబాకును వేగంగా బయటికి లాగబోతూ, ఆఖరిక్షణంలో తనను తాను అదుపు చేసుకున్నాడు శ్రీధరుడు.

చెవులు చిల్లులు పడిపోయేలా పిచ్చికేకపెట్టింది అతను పలుకరించేందుకు ప్రయత్నించిన భటుడు ఒక్కడేకాదు... నగరద్వారాన్ని రక్షించడానికి నిలబడిన భటులందరూ అదేవిధంగా అరుపులు మొదలుపెట్టారు.

మొదలు పెట్టటంతో ఆగలేదు వారు. తమ ఆయుధాలన్నింటినీ ఒక పక్కన పెట్టి నగరద్వారాలను ఆనుకుని వున్న కొన్ని పూరిపాకల దగ్గిరికి ఎవరో తరుముతున్నట్లు పరుగులు తీస్తున్నారు.

ఆశ్చర్యం నిండిన కనులతో అటుకేసి చూసిన శ్రీధరుడికి వెంటనే అగుపించించాయి ఆ పాకల్ని ఆకలిగా ఆరగిస్తున్న అగ్నిజ్వాలలు.

చూస్తూ చూస్తూ వుండగానే రెండు తాడిచెట్ల ఎత్తుకు లేచాయి ఆ మంటలు. ఆకలిగొన్న పాముల్లా నాలుకలు విరజాస్తూ, సమీపంలోని గృహసముదాయాల మీదికి వంగుతున్నాయి.

"నీళ్ళను తీసుకురండి...నీళ్ళు... నీళ్ళు..." కంచుగంటల వంటి కంఠాలతో ఒకరిమొకరు హెచ్చరించుకుంటూ ఆ మంటల సమీపంలోకి పోతున్న భటులవంకే చూస్తూ, మట్టిబొమ్మలా నిలబడిపోయిన శ్రీధరుడిని ముందుకు నెట్టారు ఆ దృశ్యాన్ని చూసిన గుంపులు గుంపులుగా వచ్చిన పౌరులు.

క్రిందకు పడిపోబోయి తననుతాను సంభాళించుకుంటున్న సమయంలో శ్రీధరుడికి జ్ఞానోదయం అయింది.

నగరద్వారాలను అధిగమించి అవతలికి పోవటాని అంతకంటే మంచి అదను మరొకటి పది దినాలపాటు వేచియున్నా తనకు లభిస్తుందా?

ఆ మాట మనసులో మెదలగానే అటుకేసి అడుగులు వేశాడతను.

మంటల దగ్గిరికి పోయిన సహచరులవంకే చూస్తూ నిలబడిన ఇద్దరే ఇద్దరు భటులకు వినయంగా నమస్కరించి ద్వారాలవైపు తలవూలాడు.

"నగరాన్ని వదిలి వెళ్ళేందుకు నీకు ఇంతకంటే మంచిసమయం మరొకటి లభించలేదా? ఒక్క నిమిషం ముందుగా వస్తే మీ సొమ్ము ఏమి పోయిందిట?" కోపంగా అడుగుతూ అతన్ని ముందుకు నెట్టాడు ఒకతను.

ఆలస్యం చేస్తే అతని మనసు మారిపోతుందన్న అనుమానంతో వడివడిగా అడుగులు వేశాడు శ్రీధరుడు.

అరక్షణంలో ద్వారాల్ని దాటి నగరం వెలుపలికి చేరుకున్నాడు.

సరైన సమయంలో ఎవరో కావాలని సృష్టించినట్లుగా ప్రత్యక్షం అయిన అగ్నిదేవునికి శతకోటి వందనాలు అర్పించుకుంటూ అల్లంతదూరంలో అగుపిస్తున్న భైరవీ ఆలయంవైపు సాగిపోతున్న అతనికి తన వెనుకే ద్వారాలను అధిగమించిన మరో ఇద్దరు వ్యక్తుల్ని గమనించడం చేతకాలేదు.

అతనిలోపాటు ఆలయంవైపు అడుగులు వేయలేదా వ్యక్తులు. అక్కడికి సమీపంలో వున్న చెట్ల తోపులోకి పోయి, ఎత్తుగా ఎదిగివున్న చెట్లమాటున అదృశ్యమయినారు.

* * *

ఆంధ్రదేశాన్ని ఇక్ష్వాకువంశీయులు పరిపాలిస్తున్న కాలంలో నిర్మించబడి నటువంటిది ధనదుపుర నగరద్వారం వెలుపలి భైరవీ ఆలయం. సుందర ప్రాకారంతో, రమణీయమైన మండపాలతో, చూడచక్కని పుష్ప నికుంజాలతో అలరారుతూ వుంటుంది.

నగరంలోని అలజడి కారణంగా భక్తజనులెవ్వరూ రాకపోవటం వల్ల నిర్మానుష్యంగా అగుపిస్తున్నాయి ఆలయపరిసరాలు. భుజాలమీదికి పరుచుకుంటున్న పొడవాటి కేశాలను వామహస్తంతో సవరించుకుంటూ ఒంటరిగా ముఖమండపంలో నిలుచుని వున్నాను ఆలయపూజారి.

ఆలయంప్రవేశం చేసి అమ్మవారి దర్శనభాగ్యం పొందాలన్న కోరికను అతి బలవంతంగా అదుముకుంటూ మండప సమీపంలోని ఒక పొదరింటివైపు కదిలాడు శ్రీధరుడు.

పొదరింటి చాటున కూర్చుండబోతున్న సమయంలో అతనికి అగుపించారు పూజారి శిష్యులు ఇద్దరు. ముఖమండపంలో ఒంటరిగా వున్న తమ గురువుగారిని వదిలి, వారిద్దరు పొదలమధ్య తచ్చట్లాడుతూ వుండటానికి కారణం ఏమిటో అవగతంకాలేదు శ్రీధరుడికి.

ఆ శిష్యుల కంటపడకుండా వుండటంకోసం పొదిరింటి మధ్యభాగంలోకి జొరబడ్డాడు.

శ్రీధరుడు దాగున్న పొదరింటికి ఆరు ధనువుల దూరంలో ఆగిపోయాడు ఒక శిష్యుడు.

"భైరవీమాత పూజావిధానాలను అభ్యసించటానికి వచ్చాను నేను భవిష్యత్లో ఏదో ఒక ఆలయానికి పూజారిగా కుదురుకుని హాయిగా కాలం

గడపవచ్చని ఆశించాను. అసలు విషయాన్ని పక్కనపెట్టి, అవసరంలేని పనులన్నింటినీ చేయిస్తున్నాడు మన గురుదేవుడు..." స్వేదబిదువుల కారణంగా కనులలోకి జారుతున్న కుంకుమబొట్టును తుడుచుకుంటూ వాపోవడం మొదలు పెట్టాడు.

"నీ మాటలు గురువుగారికి వినబడితే భవిష్యత్‌లో పూజారిగా కాదు, ఆలయంలో పనిచేసే పరిచారికుడిగా కూడా కాలం గడపలేవు. అనవసరమైన మాటల్ని కట్టిపెట్టి అప్పజెప్పిన పనిని పూర్తిచేయి" వెంటన అతన్ని హెచ్చరించించాడు రెండవ శిష్యుడు.

"భైరవీ ఉపాసకుల పరివేక్షణలో శక్తి మతశాస్త్రాలకు అనుగుణంగా నిర్మించబడిన ఆలయం ఇది. శాక్తేయానికి సంబంధించిన శిల్పాలే ఇక్కడ వున్నాయి. అందుకు విరుద్ధమైన రూపాలుగాని, విగ్రహాలుగాని పొరపాటున కూడా మనకు అగుపించవు.

శిష్యరికం ప్రారంభించిన తొలినాటినుంచీ మనం ఈ ప్రదేశాలను వెతుకుతూనే వున్నాము. ఇంతకాలంగా అగుపించని ఆ విరుద్ధరూపాలు ఇప్పటికిప్పుడు మన కళ్ళపడతాయని అనుకోవటం వట్టి భ్రమ మాత్రమే" విసుగు నిండిన కంఠంతో అంటూ, ఒక బండరాయిమీద కూర్చున్నాడు మొదటి శిష్యుడు.

శక్తి ఆయాల్లో అగుపించని విరుద్ధరూపం ఏమిటో, అది ఎలా వుంటుందో అర్థంకాలేదు వారి మాటల్ని ఆలకిస్తున్న శ్రీధరుడికి.

శిష్యపరమాణువులు తనున్న పొదలోకి తొంగిచూస్తే ప్రమాదం ముంచుకు వస్తుందన్న అనుమానంతో, చప్పుడు చేయకుండా వెనక్కి జరిగాడు అతను.

అలా జరుగుతున్న సమంలో అప్రయత్నంగా మొదటి శిష్యుడు కూర్చుని వున్న బండరాయిమీదకి మరలాయి అతని చూపులు. ఉద్యానవనంలో విహరించడానికి వచ్చిన భక్తులు సేదతీర్చుకోవటం కోసం అందంగా అమర్చబడిన శిలాఖండిక అది. కరచరణాలను ముకుళించి చూస్తున్న ఒక వానరం మాదిరి వున్నది.

వైష్ణవమతంలో మాత్రమే అగుపించే వానరరూపం శక్తిమతానికి చెందిన ఆ భైరవీ ఆలయానికి ఎలా వచ్చింది? ఆ ప్రశ్న మనసులో ఉదయిస్తూ వున్న సమయంలో శ్రీధరుడి కనులముందు హఠాత్తుగా మెదిలాయి తన ముంజేతి కంకణంమీద చిత్రించబడివున్న బొమ్మలు.

ప్రముఖంగా అగుపిస్తున్న ఆలయపు బొమ్మను చూచి భైరవీ ఆలయంగా గుర్తించింది శ్యామల.

ఆలయం పక్కనే అగుపిస్తోంది కరచరణాలను ముడుచుకు కూర్చున్న ఒక మహావానరం...

ఆ రూపం కోసమేనా ఆలయపూజారి తన శిష్యులను అచ్చోటికి పంపి వెతికిస్తున్నది?

అనుతోని విధంగా మనసులో ఉదయించిన ఆ ప్రశ్నకు సమాధానం లభించకముందే తనగుట్టు రట్టు అవుతుందని తెలిసి, ఎడమచేతితో నేలను తడిమాడు శ్రీధరుడు. చేతికి అందిన రాతి శకలాలను తీసుకుని పొదరింటి బయటికి విసిరాడు.

గింగిరాలు తిరుగుతూ వేగంగా పోయి, అక్కడికి కొద్దిదూరంలో వున్న చిన్న నీటికొలనులో పడ్డాయి ఆ రాతిశకలాలు. నీటిని చెల్లాచెదురు చేసి చిన్న

శబ్దాన్ని సృష్టించాయి. అది విని పొదరింటిలోకి తొంగిచూడాలనే కోరికను విరమించుకుని అటు పరుగుతీశాడు రెండవశిష్యుడు.

"ఏమిటది? ఏమిటా శబ్దం..?" అని అడుగుతూ మొదటి శిష్యుడు తను కూర్చున్న శిలాఖండిక మీదినించి లేవగానే, పొదరింటిలోంచి ఇవతలకు జారుకున్నాడు శ్రీధరుడు. ఒక నల్లరాతి మండపం చాటుకు పోయి మోకరించి కూర్చున్నాడు.

"నీటిపైన వచ్చిన జలచరాలకోసం పక్షులేవో నీటిని తాకివుంటాయి. అందుకే అల్లకల్లోలమైంది నీరు" సాలోచనగా అంటున్న రెండో శిష్యుడి మాటలకు అంగీకారసూచకంగా తలవూపుతూ బద్ధకంగా ఒళ్ళు విరుచుకున్నాడు మొదటి శిష్యుడు.

"ఈ రోజుకు ఇంతటితో మన వెతుకులాటను విరమించుకుందాం. విరుద్ధరూపాలు ఏవీ ఈ రోజునకూడా మనకు అగుపించలేదని గురువుగారికి విన్నవించుకుందాం" అంటూ ముఖమండపం వైపు నెమ్మదిగా అడుగులు వేశాడు రెండో శిష్యుడు.

వెతుకులాటనుంచి విముక్తి లభించినందుకు ఆనందిస్తూ, అతన్ని అనుసరిస్తున్న మొదటి శిష్యుడు కనుమరుగు కాగానే, తన మోచేతి దగ్గిర కంకణాన్ని క్రిందికి జార్చి పరిశీలనగా చూశాడు శ్రీధరుడు.

శిలాఖండికలోని రూపం మాదిరిగా లేకపోయినా, భైరవీ ఆలయాన్ని ఆనుకుని కొట్టవచ్చినట్లే అగుపిస్తోంది మహా వానరస్వరూపం.

ముఖమడపంలోనే నిలబడి తనదగ్గిరికి వచ్చిన శిష్యులతో సంభాషిస్తున్న పూజారిని ఒక కంట గమనించుకుంటూ, మరోసారి పొదరింటి దగ్గిరికి జరిగి, ఆ శిలాఖండికమీద చేయివేశాడు శ్రీధరుడు.

పదిమంది బలాఢ్యులు కలిసికట్టుగా ప్రయత్నించినా ఎత్తలేనటువంటి బరువుల్ని సైతం పైకి లేపగల అతని బలిష్టహస్తాలకు అతి తేలికగా లొంగి పోయిందా ఖండిక. పక్కకు దొర్లి తన క్రిందవున్న ఒక పల్లపు ప్రదేశాన్ని అతనికి కనిపింపచేసింది.

చేయిపడిన మరుక్షణం ముక్కలైపోవటానికి సిద్ధంగా వున్నట్లున్న చిన్న లోహపేటిక ఒకటి వెంటనే అగుపించింది అతనికి ఆ పల్లపు ప్రదేశంలో.

ఎంతోకాలంగా ఆలయపూజారి వెతికింపచేస్తున్న విరుద్ధరూపంలోని రహస్యం ఏదో ఆ పేటికలో భద్రపరబడి వుంటుందని గ్రహించగానే శ్రీధరుడిని ఆవరించుకున్నది విపరీతమైన ఆవేశం. ఊపిరి బిగబట్టి లోహపేటికను పైకి తీశాడతను. పల్లపు ప్రదేశంలోనుంచి, శిలాఖండికను యధాస్థానంలోకి జరిపి, రాతిమండపం చాటుకుపోయి పేటికను తెరిచాడు.

తరతరాలుగా అందులో బంధింపబడివున్న మంత్రశక్తి ఏదీ అతని కనుల ఎదుట కనిపించలేదు... కోటి సూర్యప్రభలతో వెలుగొందే మణిమాణిక్యాలు ప్రత్యక్షం కాలేదు. చిలుముపట్టిన చిన్న రాగిరేకు ఒకటి అగుపించింది. అతనికి అర్థంకాని అక్షరాలు ఏవో ఆ రాగిరేకుమీద లిఖించబడి వున్నాయి.

కొలనులోని నీటితో ఆ రేకును శుభ్రపరిచి తీరుబడిగా ఆ అక్షరాలను అర్థం చేసుకోవాలని అతను అనుకుంటూవుండగానే, ముఖమండపంలో

నిలుచునివున్న ఆలయపూజారి, పెద్దకంఠంతో తన శిష్యుల్ని హెచ్చరించటం తెలిసివచ్చింది అతనికి.

"మహా పూజకు ఏర్పాట్లు వేగిరం చేయండి... ధనదుపుర ఆస్థాననర్తకి హేమసుందరి మన ఆలయానికి విచ్చేస్తోంది" అంటూ ముఖమండపంలో నుంచి ఆలయ ముఖద్వారం దగ్గిరికి పోయాడతను.

హేమసుందరి ఆగమన వార్త చెవులపడిన మరుక్షణం తను చేస్తున్న పనిని గురించి మరిచిపోయాడు శ్రీధరుడు. రాగిరేకును దట్టీలో భద్రపరుచుకున్నాడు. అది భద్రపరచబడిన లోహపు పేటికను పొదరింటిలోకి విసిరి, ఆలయానికి సమీపంలోకి వెళ్ళాడు.

నడుము ఎత్తున కట్టబడి వున్న ఒక గోడచాటున మోకరించి ముఖద్వారం వైపు చూశాడు.

ధనదుపుర సార్వభౌముడు బహూకరించిన పచ్చల పల్లకీలో రాలేదు హేమసుందరి. సామాన్యురాలివలె ఒక వృషభ శకటంలో వచ్చింది.

పూజాదికాలకు అవసరమైన సామాగ్రిని బండిలోనుంచి తీసుకువచ్చే బాధ్యతను సౌదామినికి అప్పగించి, ముందుగా ఆలయంలోకి వచ్చిన శివకామినికి సాదరంగా ఆహ్వానం పలికాడు ఆలయపూజారి.

"భయంకరమైన క్షుద్రశక్తులు మీ కుమార్తెమీద కన్ను వేయటంవల్లనే మీరు అనుకున్న పనులు జరగటం లేదు. ఈరోజు మొదటి యామం ముగిసేలోగా మహాపూజ చేసి శక్తుల్ని చిన్నాభిన్నం చేసి వేస్తాను" ఉరుములాంటి కంఠంతో ఆమెకు వాగ్దానం చేశాడు.

కాంతవంతం అయింది శివకామిని వదనం. చేతులు జోడించి అతనికి నమస్కరించిందామె.

"మొదటి యామం మాత్రమే కాదు. అవసరం అయితే నాలుగో యామం వరకూ పూజ చేయండి. మా బాధలు తీరటమే నాకు కావాల్సింది" అంటూ దోసిళ్ళ బంగారు నాణేలను అందించింది.

గర్భగుడి ముందు నిలబడిన శిష్యులను పిలిచి ఆ నాణేలను అవతల వుంచమని అదేశించాడు ఆలయపూజారి. సామాన్యమైన పూజను కావించి తీర్థప్రసాదాలను ఆమెకు, సౌదామినికి మాత్రమే ఇచ్చాడు.

"మహాపూజ సమయంలో భూతప్రేతాలు అనేకం ఈ ఆలయం చుట్టూ విలయతాండవం చేయటానికి వస్తాయి. పూజాసమయంలో నేను రచించిన మంత్రపుముగ్గుల మధ్య కూర్చుంటుంది కాబట్టి, మీ కుమార్తెకు వాటివల్ల ఎటువంటి హాని కలగనేరదు. పూజను తిలకించే యితరులకు మాత్రం చెరుపు చెయ్యటానికి చూస్తాయి అవి..." అంటూ ఆలయద్వారాలవైపు చేయిచూపాడు పూజారి.

అతని వుద్దేశ్యం అవగతమై వెలవెలబోయింది శివకామిని. ఆందోళన నిండిన చూపులతో సౌదామినివైపు చూసింది.

"నాకు భూతప్రేతాలంటే భయంలేదు...అమ్మగారిని అవతలికి పంపిస్తాను. నేను ఇక్కడే వుంటాను" దృఢస్వరంతో చెప్పింది సౌదామిని.

"మహాపూజను తిలకించటానికి వచ్చే శక్తులు చాలా భయంకరంగా వుంటాయి. వాటిని చూడటం, చూసి ప్రాణాలతో వుండటం సామాన్యులకు సాధ్యపడే పనులు కావు. అమ్మవారి సాన్నిధ్యంలో కూర్చునే మీ కుమార్తెకు

ఎటువంటి అసౌకర్యము కలుగదు. మీరు వెళ్లి మొదటి యామం గడిచాక తిరిగిరండి... వెళ్ళండి" అంటూ శివకామిని సమాధానంకోసం ఎదురు చూడకుండా గర్భగుడిలోకి వెళ్ళిపోయాడు.

"పూజ ప్రారంభించవలసిన వేళ అయింది. మీరు వెళ్లిరండి తల్లీ! త్వరగా బయలుదేరండి" అంటూ తొందరచేస్తున్న పూజారి శిష్యులవంక, సౌదామిని వంక నిస్సహాయంగా చూసింది శివకామిని.

"మహాపూజను మరోసారి చేయిద్దాం. ఇప్పుడు అంతా కలిసి వెళ్ళిపోదాం" అన్నది సౌదామిని.

హేమసుందరిని వీక్షిస్తున్న దుష్టశక్తుల్ని వెంటనే రూపుమాపించకపోతే తనకోరిక వెంటనే నెరవేరదనే భయం శివకామిని మనసును గట్టిపరిచింది.

"మొదటి యామం వరకే కదా పూజ జరిగేది! అంతవరకూ నగరద్వారాల దగ్గిరే నిలుచుని వుందాం. అక్కడ భటులతో మాట్లాడుతూ వుంటే సమయం గడిచిపోతుంది" అంటూ కుమార్తెకు చూపులతోనే జాగ్రత్త చెప్పి ఆలయం బయటికి వెళ్ళింది.

బేలగా చూసిన హేమసుందరి బుగ్గలు నిమిరి ఆమెను అనుసరించింది సౌదామిని. వారిద్దరూ ఎక్కిన వృషభ శకటం నగరద్వారాల దగ్గరికిపోగానే ప్రాకారపు తలుపులన్నిటినీ మూసి గడియలు పెట్టారు పూజారి శిష్యులు. ద్వారపాలకుల మాదిరి ముఖద్వారం దగ్గిర కాపలా నిలబడ్డారు.

ఉరుములు వురిమినట్లు భీకరంగా ధ్వనించే కంఠంతో మంత్రాలు చదువుతూ, తళతళ మెరుస్తున్న వెండిపాత్రలో భైరవ పాదతీర్థాన్ని తెచ్చి హేమసుందరికి అందించాడు పూజారి.

ఇందువదన పూజారి గురించి చెప్పినమాటలు చెవుల్లో మార్మోగుతుండగా, వద్దు వద్దని బిగ్గిరిగా అరవాలనుకున్నాడు శ్రీధరుడు.

భక్తి తన్మయత్వంలో మునిగిపోయి అందరి భక్తులమాదిరి పూజారిచ్చిన ఆ తీర్థాన్ని అతిగా పుచ్చుకోలేదు హేమసుందరి. పాత్రను చేతిలోకి వంపుకుని పెదవులకు ఆనించుకున్నది.

"పుచ్చుకో... త్వరగా పుచ్చుకో..." అంటూ గర్భగుడివైపు తిరిగిన పూజారి చూడకుండా చేతిలో మిగిలిన తీర్థాన్ని పమిటచెరగుకు అద్దేసింది.

ఆ దృశ్యాన్ని చూసి ఆమెను హెచ్చరించే ప్రయత్నాన్ని విరమించుకున్నాడు శ్రీధరుడు.

మరోసారి ఏదో మంత్రాన్ని చదువుతూ నాలుగునిమిషాల తర్వాత ఆమెను సమీపించాడు పూజారి. వున్నట్టుండి ఆమె భుజాన్ని పట్టుకుని దగ్గిరికి లాగుకునే ప్రయత్నం చేశాడు.

అతని చేతిని అలవోకగా తప్పించుకుని వెనక్కి జరిగింది హేమసుందరి. మహాపూజ పేరుతో అతను చేయదలుచుకున్నది ఏమిటో, వెంటనే అవగతం కావటం వల్ల భయంతో వణికిపోతూ ముఖమండపంలో నుంచి ప్రాకారాల దగ్గిరికి పారిపోయే ప్రయత్నం చేసింది. ఆమె తను యిచ్చిన పాదతీర్థం సేవించలేదని తెలుసుకున్నాడు పూజారి.

అయినాసరే వెనుకంజ వేయలేదతను.

"ఈ ఆలయంలో నిన్ను కాపాడగలవాడు ఎవడూ లేడు...నా కోరిక తీర్చకపోతే నీ ప్రాణాలు తీసి ఈ ఆలయంలోనే ఖననం చేయిస్తాను... నిన్ను భూతప్రేతాలు ఎత్తుకుపోయాలని అందరినీ నమ్మిస్తాను..." అని హెచ్చరిస్తూ

వెన్నంటి ఎంతోదూరం పోకముందే పట్టుకున్నాడు. సింహం ఎదుటపడిన లేడిపిల్ల మాదిరి గజగజ వణికిపోతూ, వున్నట్టుండి తెలివిని కోల్పోయింది హేమసుందరి.

ఆపైన చూస్తూ నిలబడటం చేతకాలేదు శ్రీధరుడికి. రాతిగోడ చాటునుంచి లేచి అటు పరిగెత్తాడు.

బిగువు సడలిన జలతారు వస్త్రంమాదిరి వ్రేలాడబడిపోయిన హేమ సుందరిని భుజంమీదికి ఎత్తుకుని, ఆలయం వెనుక వుండే పూపొదలకు మధ్యకు తీసుకుపోవాలని అనుకున్నాడు పూజారి.

అనుకోని విధంగా తనకేసి వస్తున్న ఆకారాన్ని గమనించి, భూనభోంతరాళాలు బ్రద్దలైపాయేటట్లు సింహనాదం చేశాడు. సింహనాదం చేయటంతో ఆగలేదు. ముఖమండపానికి ఎదురుగా భూమిలో పాతిపెట్టబడి వున్న అమ్మవారి త్రిశూలాన్ని అమాంతంగా వూడబెరికి అతనికేసి గురిపెట్టాడు.

ఆలస్యం చేస్తే తన ప్రాణవాయువులు అనంత విశ్వంలో కలిసిపోవడం తథ్యమని గ్రహించి, వెనుకా ముందు చూసుకోకుండా దట్టీలో వున్న పిడిబాకుని లాగి బలంగా ముందుకు విసిరాడు శ్రీధరుడు. కందిరీగ మాదిరి ఝుంకారం చేస్తూ వేగంగాపోయి, పూజారికంఠంలో దిగబడింది ఆ బాకు.

చేతిలోని త్రిశూలాన్ని నేలకు వదిలేశాడు పూజారి. అస్పష్టమైన శబ్దాలు చేస్తూ, మొదటి నరికిన చెట్టులా విరుచుకుపడిపోయాడు.

కటికనేలమీద పడివున్న హేమసుందరికి తెలివి తెప్పించే వ్యవధిగాని, జరిగిందేమిటో చెప్పి ఆమె భయాన్ని వుపశమింపజేసే అవకాశం గాని శ్రీధరుడికి లభించలేదు.

ఆలయపూజారి చేసిన సింహనాదం అతని శిష్యుల్ని ఆత్రుతకు గురిచేసింది.

"ఏమైంది గురుదేవా? ఏమిటి సంగతి?" అని ప్రశ్నిస్తూ తలుపుల్ని తెరిచి లోపలికి చూశారు వారిద్దరూ.

విగతజీవుడై పడివున్న తమ గురుదేవుడిని గమనించేసరికి వారిని ఆవరించుకున్నది విపరీతమైన భయం."ఆలయంలో అడుగిడిన దుండగీడు మా గురుదేవుల్ని హతమార్చాడు. రక్షిండండి... కాపాడండి..."

అని గావుకేకలు పెడుతూ నగరద్వారం దగ్గిరికి పరుగుతీశారు.

ఆ అరుపుల్ని ఆలకించేసరికి వేపాకులు నమిలినట్లు అయింది శ్రీధరుడి నోరు. తను చేసిన పని తనకు ఎటువంటి ఇబ్బందిని కలిగించబోతున్నదో తలుచుకునేసరికి చలిగాలి వీచినట్లు జలదరించింది అతని శరీరం.

నగరద్వారం దగ్గిర రాజభటులు అక్కడికి వచ్చి తనను గమనించేలోపుగా ఆ ప్రదేశాన్ని వదిలి అవతలికి వెళ్ళిపోటవమే శ్రేయస్కరం.

అడ్డదిడ్డంగా పడివున్న ఆలయపూజారి కంఠంలో దిగబడిన తన పిడిబాకును చేతుల్లోకి తీసుకుంటూ , హేమసుందరి ముఖాబ్జం వైపు దృష్టిని సారించాడు శ్రీధరుడు.

"ఆలయాన్ని చుట్టుముట్టి ఆ దుండగీడును వెంటనే బంధించండి... ఒక్క అడుగు కూడా అవతలికి వేసే అవకాశం లభించనీయకండి..." అని కేకలు పెడుతూ ప్రాకార ద్వారం ముందు ప్రత్యక్షం అవనే అయ్యారు నగరద్వారం దగ్గిర రాజభటుల్లో కొంతమంది.

తనకుమార్తెకు ఎటువంటి ఆపద వాటిల్లిందో తెలియక గుండెలు బాదుకుంటూ వారివెనుక వస్తున్న హేమసుందరి తల్లిని కూడా గమనించి ఆలయపూజారి రక్తంతో మలినమై వున్న పిడిబాకును అలాగే దుస్తుల్లో భద్రపరుచుకుంటూ ఉత్తరదిశలో వున్న ప్రాకారం దగ్గిరికి పరుగుతీశాడు శ్రీధరుడు.

అవలీలగా ప్రాకారాన్ని అధిగమించి అవతలి పక్కన వున్న పొదల్లోకి పారిపోయాడు.

అతన్ని బంధించటానికి తాము కూడా పొదల్లోకి పరుగులిడుతున్న భటులను గురించి ఎంతమాత్రమూ పట్టించుకోకుండా కుమార్తె చెంతకు పోయి, పెద్దకంఠంతో శోకాలు పెట్టడం మొదలు పెట్టింది శివకామిని.

"అరిచి కేకలు పెట్టి మీరు అనవసరం వ్యధకు గురి కావద్దు. మన హేమకు ఎటువంటి ఆపదా ఎదురుకాలేదు... ఆలయపూజారి హతమారిపోవటాన్ని చూసి స్పృహ కోల్పోయి వుంటుంది, అంతే" అంటూ ఆమెను వూరడించి, హేమతలను తన ఒడిలోకి తీసుకున్నది వెనుకగా వచ్చిన సౌదామిని.

పూజారిని హతమార్చిన దుండగీడును వుద్దేశించి గొంతు చించుకుని వినకూడని మాటలు వినిపిస్తూ మెటికలు విరిచింది శివకామిని.

అచేతనంగా పడివున్న హేమబుగ్గల్ని నిమురుతూ, మృదుస్వరంతో ధైర్యం చెప్పింది సౌదామిని.

"కనులు తెరిచి మా వంక చూడు తల్లీ... ఒక్కసారి తలెత్తి మా యిద్దర్నీ పరికించు..." అంటూ ఆమెకు తెలివిని తెప్పించింది.

వెచ్చటి కన్నీరు కపోలాలమీదికి జాలువారుతుండగా సౌదామిని గుండెల్లో తలదాచుకున్నది హేమ.

"మనం ఇక క్షణం కూడా ఈ ప్రదేశంలో వుండకూడదు... వెంటనే మన గృహానికి వెళ్లిపోదాం" అంటూ తమవెనుకే ఆలయం దగ్గిరికి వచ్చిన వృషభ శకటం వైపు చూసింది శివకామిని.

"ఇక్కడ జరిగింది ఏమిటో మీ కుమార్తెకు తెలిసేవుంటుంది. పారిపోయిన దుండగీడు పట్టుబడినా, పట్టుబడకపోయినా మీ కుమార్తె మన నగరరక్షకులకు తనకు తెలిసిన విషయాన్ని చెప్పితీరాలి..." ఆమె వుద్దేశ్యాన్ని అర్థంచేసుకుని వెంటనే హెచ్చరించారు వారికి కాపుగా అక్కడ నిలబడిన రాజభటుడు.

"నగర రక్షకులందరికీ మా గృహం ఎక్కడ వున్నదో బాగా తెలుసు. అవసరం అయిన వెంటనే వర్తమానం పంపించండి...వెంటనే వచ్చి మాకు తెలిసింది మనవి చేసుకుంటాం" అంటూ కుమార్తె చుట్టూ చేతులు చుట్టూ శకటంవైపు నడిచింది.

"ఎంత ఆపద తప్పిందే తల్లీ! నీకోసమే వచ్చివుంటాడు ఆ దుండగీడు... నీ వంటిమీద ఆభరణాలన్నిటినీ, దోచుకోవటానికి పథకం వేసి వుంటాడు. దైవస్వరూపులయిన పూజారి అడ్డుకోవడంతో ముప్పు తప్పింది నీకు..." అంటూ శకటంలో కూర్చోబెట్టి చోదకుడికి సైగ చేసింది.

తన ఒంటిమీది ఆభరణాలను దోచుకోవటానికి ప్రయత్నించే దుండగీడును ప్రతిఘటించి, ఆ ప్రయత్నంలో ఆలయపూజారి అసువుల్ని కోల్పోవటం జరిగినట్లుగా ఆమె నగరరక్షకులకు చెప్పమంటున్నదో, నిజంగానే అలా భావిస్తున్నదో హేమసుందరికి అంతుబట్టలేదు.

పారిపోయిన దుండగీడును పట్టుకోవటం కోసం పరుగులు తీసిన తమ సహచరులు అప్పట్లోవెనక్కి వచ్చే అవకాశం లేదని అర్థమై, వృషభశకటాన్ని నగరంలోకి పోనిచ్చారు రాజభటులు.

తమ శకటానికి ఎదురుగా వచ్చి, విచిత్రంగా చూసిన వారందరికీ ఆలయంలో జరిగిన దారుణాన్ని గురించి వివరించి చెపుతూ, అర్థఘడియ తర్వాత తమ గృహాన్ని చేరుకున్నది శివకామిని.

సౌదామిని భుజాల్ని ఆసరాగా చేసుకుని తన మందిరంవైపు అడుగులిడుతున్న హేమని చిన్నకంఠంతో పిలిచింది అప్పుడే వచ్చిన ఇందువదన.

"గుమ్మంలో నిలబడి మాటలాడే ఓపిక నాకులేదు. నా మందిరంలోకి రమ్మని చెప్పు..." అంటూ ముందుకు సాగింది హేమసుందరి.

వికృతరూపిణి అయిన ఇందువదన తమ ఇంటిలోకి అడుగుపెట్టటం శివకామినికి ఇష్టం వుండదని తెలిసికూడా, ఆమె చూడకుండా సైగచేసింది సౌదామిని.

అలసట నిండిన కనుల్ని అరిచేతులతో నెమ్మదిగా అద్దుకుంటూ, అన్యమనస్కంగా తన శయ్యమీద పరుండి వున్న హేమసుందరి సమీపంలో కొచ్చి నిలబడింది ఇందువదన.

"వీధిలోని వారందరూ వింతగా చెప్పుకోవటం ప్రారంభించారు... భైరవీ ఆలయంలో నీ ఆభరణాలను అపహరించే ప్రయత్నం జరిగిందనీ, ఆలయ పూజారి అసువులు బాశాడనికూడా అందరూ అనుకుంటున్నారు..." చిన్న కంఠంతో మాటలు మొదలు పెట్టిన ఆమెవంక విసుగ్గా చూసింది హేమసుందరి.

"నీ ఆభరణాలను దోచుకోవచ్చిన దుండగీడు ఎవరో నీకు తెలుసా? అతన్ని నువ్వు చూశావా?" అడిగింది ఇందువదన.

క్రిందికి వాలిపోయాయి హేమసుందరి కనులు. తనతల్లి చెపుతున్నన్నట్లు నగరరక్షకుల దగ్గిర చెపితే, ఇందువదన అడిగిన మాటనే వారు కూడా అడుగుతారని అవగతమయ్యేసరికి ఒక్కసారిగా కాంతివిహీనం అయింది ఆమె వదనం.

హేమసుందరి మనసులో మెదులుతున్న ఆలోచనలు ఎటువంటివో తనకు పూర్తిగా తెలిసినట్లు చిన్నగా నవ్వింది ఇందువదన.

"ఆలయ పూజారి ఎటువంటివాడో నాకు బాగా తెలుసు... ఆ మాటను ముందుగా చెపితే నీ తల్లి వినిపించుకోదేమేనన్న భయంతో నేను ఒక పని చేశాను" అంటూ ఆరోజు ఉదయం తను చేపట్టిన కార్యాన్ని గురించి ఆమెకు వివరించింది.

"నా అభ్యర్ధనను మన్నించి మీకోసం ఆలయప్రవేశం చేసివుంటాడు శ్రీధరుడు... పూజారిని యమపురికి పంపింది అతనే అయివుంటాడు... రాజభటులు తనను గుర్తించి రభస చేయకుండా పారిపోయివుంటాయి... అంటూ మాటల్ని పూర్తిచేసింది.

విప్ఫారిత నేత్రాలతో ఆమె ముఖంలోకి చూస్తూ ఆ పలుకుల్ని ఆలకించింది హేమసుందరి.

"నగరరక్షకుల దగ్గిర జరిగింది ఏమిటో తెలియచెప్పేముందు నా మాటల్ని బాగా గుర్తుపెట్టుకో... నీ మానాన్ని కాపాడటానికి ప్రయత్నించిన మనిషిని ఉరికంబానికి ఎక్కిస్తావో, లేక అభిమానించి ఆదరిస్తావో ఇక నీ ఇష్టం" అంటూ

హఠాత్తుగా శయ్యమీదినించి లేచి మందిరంలో నుంచి బయటికి వెళ్ళిపోయింది ఇందువదన.

తనతల్లి కనులపడకుండా ఒకపక్కగా నెలకొల్పుకున్న కావేటి రంగని బొమ్మముందుకుపోయి నిలుచున్నది హేమసుందరి.

ఆలయపూజారిని హతమార్చి రాజభటులకు చిక్కకుండా పారిపోయిన దుండగీడును గురించి నగర రక్షకులందరికీ తెలిసిపోయింది కాబోలు, ఒక క్షణికం కూడా ఆలసించకుండా అందరకీ ఆ విషయాన్ని ఎరుకపరిచే ప్రయత్నాలు ప్రారంభించారు.

"భైరవీ ఆలయపూజారిని దారుణంగా హతమార్చి మా భటులకు చిక్కకుండా పారిపోయన దుండగీడును గురించి పూర్తి సమాచారాన్ని మాకు అందించగలవారికి విలువయిన బహుమతులు యిప్పించటం జరుగుతుంది...

నగర రక్షకభటుల నాయకులు సింహకేతులవారి ఆజ్ఞ యిది..." పెద్ద కంఠంతో బిగ్గరగా చాటిస్తూ, చెవులు చిల్లులు పడేటట్లు అదేపనిగా భేరీలను మ్రోగిస్తూ నగరంలో సంచరించటం మొదలు పట్టారు కొంతమంది రాజభటులు.

జరిగిన సంఘటనలకు ప్రత్యక్షసాక్షి అయిన తనను పిలిపించి వివరాలు తెలుసుకోకుండా తమకు తోచిన మాటల్ని అందరికీ వినిపిస్తున్న నగర రక్షకుల మీద ఏవగింపు కలిగింది హేమసుందరికి.

వడివడి అడుగులతో మందిరంలో నుంచి బయటికి వచ్చిందామె.

"ఎక్కడికే బయలుదేరావ్?" తల్లి కంఠం కరుకుగా వినిపించడంతో ప్రక్కకు చూసింది.

వంట ఇంటి ద్వారం దగ్గిర ఆసనం వేయించుకుని హాయిగా కూర్చుని వున్నది శివకామిని, సౌదామిని తెచ్చి యిచ్చిన క్షీరపాత్రను చేతిలో పట్టుకుని క్రూరంగా చూస్తున్నది

"మీరందరూ భావిస్తున్నట్లు నా ఆభరణలను అపహరించే ప్రయత్నం జరగలేదు... ఆలయంలో జరిగింది ఏమిటో నగర రక్షకులకు వెంటనే తెలియచేయాలి... నన్ను కాపాడిన వ్యక్తిమీద నింద పడకుండా రక్షించాలి" బింకంగా అన్నది హేమసుందరి.

పూర్తివివరాలు చెప్పకపోయినా అసలు విషయాన్ని అతితేలికగా గ్రహించింది ఆవులిస్తే ప్రేవులు లెక్కపెట్టగల శివకామిని.

చేతిలోని క్షీరపాత్రను చివ్వున విసిరికొట్టిందామె. చరచరా వచ్చి హేమసుందరి చేతిని పట్టుకున్నది.

"ఆలయంలో ఏం జరిగిందో నీకు సరిగ్గా తెలియదు.నీ ఆభరణాలను దోచుకునే దుండగీడు మూలకంగానే పూజారి మరణించాడు. నగర రక్షకులకు తెలియవలసిన మాటలు ఇవే...

వీటికి వ్యతిరేకంగా ఒక్క విషయంకూడా వారి చెవులకు చేరటానికి వీలులేదు..." ఖచ్చితమైన కంఠంతో అంటూ ఆమెను వెనక్కి నెట్టింది.

"అన్యాయం ఇది... అక్రమం...నగర రక్షకుల ఎదుట యదార్థాన్ని దాచిపెట్టటం రాజద్రోహం..." జీరపడిన కంఠంతో వేడుకున్నది హేమసుందరి.

ఆ మాటల్ని లక్ష్యపెట్టలేదు శివకామిని.

కూతురిని మరింత వెనక్కి వెట్టి ఆమె మందిరం వైపుచేయి చూపించింది.

ఆమెకు నచ్చచెప్పటం ఇక అసంభవం అని గ్రహించి, నీరునిండిన కనులను తుడుచుకోనుకూడా తుడుచుకోకుండా తన మందిరంలోకి వెడలిపోయింది హేమసుందరి.

అర్ధఘడియ తర్వాత క్షీరపాత్రను తీసుకుని అక్కడికి వచ్చింది సౌదామిని.

"సౌదామినీ... వచ్చావా సౌదామినీ... వచ్చావా..." రెక్కల్ని తపతపలాడిస్తూ ఆమెను పలుకరించింది పంజరంలోని రాచిలుక.

విసుగ్గా తలవిదిలిస్తూ, హేమసుందరి కోసం మందిరమంతా కలియ జూసింది సౌదామిని.

కనిపించలేదామెకు హేమసుందరి. మందిరం వెనకభాగంలో ఒక గవాక్షపు అంచునగట్టిగా కట్టిన పొడుగాటి వస్త్రం అగుపించింది.

తల్లికి అగుపించకుండా హేమసుందరి ఆ వస్త్రం సహాయంతో క్రిందికి దిగివుంటుందని గ్రహించి నివ్వెరపోయింది సౌదామిని. గొంతెత్తి బిగ్గరగా ఒక కేకపెట్టింది.

ఆ అరుపును విని, పరుగు పరుగున వచ్చింది శివకామిని. జరిగింది ఏమిటో తెలుసుకుని గుండెలు బాదుకోవటం మొదలుపెట్టింది. గవాక్షపు అంచులనుండి క్రిందికి వ్రేలాడుతున్న వస్త్రాన్ని పైకిలాగి, ఆమెను బలవంతాన క్రిందికి తీసుకువచ్చింది సౌదామిని.

"భైరవీ ఆలయంలో జరిగిన సంఘటనల గురించి నగర రక్షకులకు తెలియచేయటం కోసమే వెళ్ళివుంటుంది హేమసుందరి. మనంకూడా అక్కడికే వెళదాం..." అంటూ వీధిలో అటుగా వెళుతున్న ఒక వృషభశకటాన్ని ఆపి అందులో కూర్చుండబెట్టింది.

కొమ్ములకున్న చిరుమువ్వల్ని గలగలలాడిస్తూ కదిలాయి శకటానికి పూన్చి వున్న వృషభాలు.

వేశ్యావాటికను దాటి అవి రాచవీధికి అడుగుపెట్టిన తర్వాత తమ పొరుగింటి వెనుకభాగంలో నుంచి ఇవతలకు వచ్చింది హేమసుందరి.

తడబడుతున్న అడుగులతో ఇందువదన గృహాన్ని సమీపించి తలుపు తట్టింది.

ఊయలలో పరుండివున్న తన బిడ్డ బుగ్గల్ని నిమురుతూ జోలపాట పాడుతున్నది ఇందువదన. ఆశ్చర్యంగా చూస్తూ తలుపులు తెరిచింది.

"నాకు నేనే సహాయం చేసుకోలేని నిస్సహాయస్థితి నాది. నాకు సహాయం చేసిన ఇతరులకు ఎటువంటి మేలు చేయగలనో నాకు అర్థం కావటంలేదు" అంటూ పమిటచెంగు చాటునుంచి ఒక తాళపత్రాన్ని తీసి ఆమెకు అందించింది హేమసుందరి.

పదునైన ఘంటంతో ముత్యాలవంటి అక్షరాలు లిఖించబడి వున్నాయి ఆ పత్రంమీద.

భైరవీ ఆలయంలో పూజారి చేయబోయిన అకృత్యన్ని కనులకు కట్టినట్లు వివరించి చేవ్రాలు చేసింది హేమసుందరి.

"నగరంలోని అలజడి ఒకింత సద్దుమణిగిన తర్వాత సింహకేతులవారికి ఈ పత్రాన్ని అందచేస్తే నాకు మానం దానం చేసిన ఆ వీరుడిమీద పడిన నిందలు తొలగిపోతాయి. ఇప్పుడున్న పరిస్థితిలో ఇంతకుమించి నేను ఏమీ చేయలేను" అంటూ వెనుతిరగబోతుండగా, ఆమె చేతిని పట్టుకుని ప్రశ్నార్థకంగా చూసింది ఇందువదన.

"సేనాపతులవారి బిడ్డడిని మా ఇంటికి రప్పించాలన్న కోరికతో తప్పించిపోతున్నది మా తల్లి. నేడో రేపోతనే స్వయంగా అతన్ని వెంటబెట్టుకు వచ్చేస్తుంది. ఆ పని జరగకముందే ఇంటిని వదిలి పారిపో నిశ్చయించుకున్నాను" తలచుకుంటూ తను చేయబోతున్నదేమిటో తెలియచేసింది హేమ.

విపరీతమైన ఆశ్చర్యంతో విశాలమైనాయి ఇందువదన కనులు. తల్లి తనపక్కన లేకుండా ఇంటిని వదిలి బయటికి రావటం ఎలాగో తెలియని ఆ సుకుమార సుందర స్వరూపిణి ఒంటరిగా ఇల్లు వదిలి పారిపోతుందా?? ఎక్కడికి?? ఎక్కడికో హేమసుందరికి కూడా తెలియదు.

"ఇక్కడే వుండి నా మనసును చంపుకోవడం నాకు చేతకాదు. ఎక్కడికో ఒకచోటికి వెళ్ళిపోతాను..." అని అన్నదామె రుద్ధమైన కంఠంతో.

అప్పుడు కూడా ఆమెచేతిని వదిలిపెట్టలేదు ఇందువదన. "ఇక్కడే వుండి మనసును చంపుకుని జీవచ్ఛవంలా జీవితం గడపమని చెప్పేటంత మూర్ఖురాలిని కాదు నేను. కానీ నిన్ను రక్షించిన శ్రీధరుడి చర్యల కారణంగా నగరద్వారం దగ్గిర రాజభటుల సందడి చాలా అధికం అయివుంటుంది. వారికి తెలియకుండా, నీ గురించి తెలిసినవారి కళ్ళపడకుండా ద్వారాలను ఎలా అధగమిస్తావ్?" అని అడిగింది.

ఆ ప్రశ్నలకు సమాధానాలు హేమసుందరి దగ్గిర లేవు."ఎలాగో నువ్వు చెప్పు... నాకు ఈ సహాయం చేస్తే జన్మజన్మలకు నీకు రుణపడివుంటాను" అంటూ ప్రాధేయపడింది.

కన్నీటి చారికలతో మలినపడిన ఆమె సుందరవదనంలోకి చూస్తూ గాఢంగా నిశ్వసించి ఒక పలుచటి దుకూలాన్ని తెచ్చి ఆమె భుజాలనిండుగా

కప్పింది ఇందువదన. ఊయలలో నిదురిస్తున్న తన బిడ్డను ఎత్తుకుని, వెనుక ద్వారం గుండా ఒక సన్నటి మార్గంలోకి హేమసుందరిని తీసుకుపోయింది.

పావుఘడియ నడిచిన తరువాత వారికి ఎదురయినాయి తాటియాకులతో కప్పబడివున్న పాకలవంటి ఇళ్ళు కొన్ని.

హేమసుందరిని ఒకపక్కగా నిలబడమని నిర్దేశించి, ఒంటరిగా ఆ ఇళ్ళ మధ్యకు వెళ్ళింది ఇందువదన. పదినిమిషాల తరువాత ఒక దృఢకాయుడిని వెంటబెట్టుకుని ఆమె దగ్గిరికి వచ్చింది.

నీడలలో నిలబడివున్నా, నిలుచునివున్న తీరునుబట్టి ఆమె ఎవరై వుంటుందో వెంటనే గ్రహించాడు దృఢకాయుడు. వినయ విధేయతలను ప్రదర్శిస్తూ చేతులుకట్టుకు నిలబడ్డాడు.

"నీలా నగరానికి నలుబది యోజనాల దూరంలో వున్న తరళాపురానికి ఈమెను తీసుకుపోవాలి.

అక్కడి పెరుమాళ్ళ కోవెల దగ్గిర స్నేహితురాలు ఒకామె నివసిస్తున్నది. పేరు చంచల. ఆమెకు అప్పగించి తిరిగిరావాలి.

ఈ విషయాలు ఎవరికీ తెలియకూడదు. ధనదుపుర ఆస్థానసర్తకి నగరద్వారాలను దాటి ఆవలికి పోతున్నదని రాజభటులకు కూడా అర్థం కాకూడదు" చిన్నకంఠంతో చెప్పింది ఇందువదన.

ఆమె తనకేసి చూడకముందే, ఇంటిలోనుంచి తను తీసుకువచ్చిన పట్టువస్త్రపు మూటలోనుంచి పాతిక బంగారునాణేలను ఎంచి అతని దోసిటిలో పోసింది హేమసుందరి.

వికసించిన వదనంతో ఆమెకు నమస్కరించి వెనక్కి పరుగుతీశాడు ఆ దృఢకాయుడు.

పావుఘడియ తరువాత ఒక వృషభ శకటాన్ని తీసుకువచ్చి ఆమె ఎదుట నిలబెట్టాడు.

"మన నగరంలోని విపణవీధికి సరుకులను తీసుకువచ్చే పనిమీద నీలానగరం వెళ్ళేందుకు అనుమతిపత్రం నావద్ద వున్నది. ఆ పత్రాన్ని చూపిస్తే నగరద్వారం దగ్గిర ఎటువంటి గొడవ జరుగదు..." అంటూ నగరంలో నుంచి రహస్యంగా బయటికిపోయే మార్గాన్ని వారికి వివరించాడు.

భుజంమీద బిడ్డను రెండోపక్కకు మార్చుకుంటూ హేమసుందరిని ఆప్యాయంగా దగ్గిరికి తీసుకుని బుగ్గను ముద్దాడింది ఇందువదన.

"తరళాపుర పెరుమాళ్ళ కోవెలలో నృత్యంచేసి జీవనం కొనసాగించుకుంటూ వుంటుంది మా స్నేహితురాలు చంచల. ఆమె అండలో వుండగా నీకు ఎటువంటి కష్టము ఎదురుకాదు.

కొంతకాలం కనిపించకుండా వుంటే నీ తల్లి తన మనసును తప్పకుండా మార్చుకుంటుంది.

ఆ శుభఘడియ ఏతెంచిన వెంటనే నువ్వు ఇంటికి వచ్చేయవచ్చు... క్షేమంగా వెళ్ళి లాభంగా తిరిగి రా" అంటూ వీడ్కోలిపింది.

శకటాన్ని ముందుకు నడిపే వృషభాల కోసం ఎండుగడ్డి మోపులు రెండింటిని శకటం క్రిందిభాగంలోని చిన్నతొట్టివంటిది అమరికలలో పేర్చి వుంచాడు దృఢకాయుడు.

ఆ అమరికలో కూర్చుండజేసి హేమసుందరిమీద ఎండిగడ్డిని దట్టంగా పరిచాడు.

నీరునిండిన కనులతో చూస్తూ నిలబడిన ఇందువదనకు నమస్కరించి శకటాన్ని నగరద్వారాలవైపు కదిలించాడు.

అతను ముందుగా చెప్పినట్లే జరిగింది అక్కడ,నీలానగరానికి రాకపోకలు జరిపేటందుకు అనుమతిని సూచించే అధికారపత్రాన్ని చదువుకుని అతని శకటాన్ని నగరద్వారాలను అధిగమించనిచ్చారు కాపలాగా వున్న రాజభటులు.

తమను గమనించేవారు ఆ చుట్టుపట్ల ఎవరూ లేరని నిశ్చయమయిన తరువాత హేమసుందరిని శకటంలోకి మార్చాడు దృఢకాయుడు.

"తెల్లవారేసరికి స్ఫురదా పట్టణం సమీపంలోకి పోగలం తల్లీ. అంతవరకూ హాయిగా విశ్రమించండి..." అంటూ వృషభాలను అదిలించి శకటాన్ని వేగంగా నడపటం మొదలుపెట్టాడు.

శకటంలో పరిచి వున్న ఎండుగడ్డి బుగ్గలకు తగిలి గిలిగింతలు పెడుతుండగా, కళ్ళు మూసుకుని గాఢనిద్దురలోకి ఒరిగిపోయింది హేమసుందరి.

## 8

"హెచ్చరిక... స్ఫురదా పట్టణ పౌరులందరికీ ధనదుపుర సార్వభౌముల వారి హెచ్చరిక..."

యుద్ధభేరీవంటి కంఠాలతో చెవులు చిల్లులు పడిపోయేటట్లు అరుస్తూ స్ఫురదాపట్టణం నడిబొడ్డున వున్న నాలుగు వీధుల కూడలిలో నిలుచున్నారు పాతికమంది రాజభటులు.

చేస్తున్న పనులను వదిలి వారిచుట్టూ గుమికూడారు స్ఫురదా పట్టణ పౌరులు అనేకమంది.

"ధనదుపుర భైరవీ ఆలయంలో జరిగిన అమానుష సంఘటన గురించి మీకందరికీ తెలిసేవుంటుంది. ఆలయ పూజారిని హతమార్చి ఆలయపవిత్రతను పాడుచేసిన హంతకుడు రాజభటుల చేతికి చిక్కకుండా ఇటుగా పారిపోయి వచ్చినట్లు వర్తమానం అందింది...ఆజానుబాహుడు, స్ఫురద్రూపి అయిన ఆ దుర్మార్గుని పట్టుకోవటంలో మాకు సహాయం చేయవలసిందిగా మిమ్మల్ని అర్థిస్తున్నాం..."

ఉరుములు ఉరిమినట్లు వాక్రుచ్చి, అక్కడినుంచి మరో ప్రదేశానికి బయలుదేరారు రాజభటులు.

భైరవీ ఆలయంలోని దుర్ఘటనను గురించి ఆ రోజు తెల్లవారకముందే వార్తలు స్ఫురదా పట్టణానికి చేరుకుని వున్నాయి.

"వయసు మళ్ళినవాళ్ళు కూడా హంతకుడిని వెతుకుతూ నగర సంచారానికి సిద్ధపడుతున్నారు. వయసులో వున్న నువ్వు మట్టిముద్దలా కూర్చుంటావేమిటి?" శ్రీధరుడిని ప్రశ్నించాడు నాలుగు వీధుల కూడలిలోని ఒక పలహారశాల యజమాని.

భైరవీ ఆలయంపక్కనుంచి ప్రారంభం అయ్యే ముళ్ళపొదల మధ్యగా ప్రయాణం చేసి చేసి విపరీతంగా అలసిపోయాడు శ్రీధరుడు. తెల్లవారటానికి యింకో అర్థగడియ మాత్రమే వున్నగట్టుకుని మరీ హెచ్చరించిన తరువాత కూడా కదలకుండా అక్కడే కూర్చుని వుంటే అతనికి అనవసరమైన అనుమానాలు

కలుగుతాయన్న భయంతో, ఆరగించిన మధురపదార్థాలకు ఒక వెండినాణేన్ని అర్పించుకుని వీధిలోకి వచ్చాడు శ్రీధరుడు.

పట్టణ పొలిమేరలవైపు బయలుదేరబోతుండగా అతని దృష్టిని ఆకర్షించింది ఒక దృశ్యం.

ఆ పౌరమధ్యలో వున్న ఒక పెద్దదుకాణంముందు గుంపుగా నిలబడి వున్నారు అనేకమంది పౌరులు.

వారందరూ చూస్తుండగానే బక్కచిక్కివున్న ఒక పౌరుడిని పొడుగాటి కొరడాలతో దారుణంగా హింసిస్తున్నాడు ఆ దుకాణం యజమాని.

కత్తులతో గీరినట్లు ఎర్రని చారికలు శరీరంమీద ప్రత్యక్షం అవుతుండగా, ఆ భాదను భరించలేక నేలమీదపడి పొర్లిగింతలు పెడుతున్నాడు ఆ పౌరుడు.

అది తనకు సంబంధించిన వ్యవవహారం కాదని శ్రీధరుడికి తెలుసు...

ప్రస్తుతం తను చిక్కబడివున్న విషమ పరిస్థితుల్లో నోరెత్తి మాట్లాడినా, పన్నెత్తి ఎవరైనా పలుకరించినా తప్పే అవుతుందని కూడా తెలుసు.

అందుకే ముందుకుపోయి ఆ గొడవకు కారణం ఏమిటో తెలుసుకోవాలన్న కోరికను అతి ప్రయత్నం మీద అదుముకున్నాడతను.

తలవంచుకుని తన దారిన తను వెళ్ళిపోబోయాడు.

మూడు అడుగులు వేయగలిగాడు అతను. నాలుగో అడుగు వేయబోతుండగా, చేతులు జాచి దీనాతిదీనంగా కేకలు పెట్టాడు దెబ్బలు తింటున్న పౌరుడు.

"అయ్యా... చంపేస్తున్నారు నన్ను... తీసుకున్న అప్పు తీర్చివేసిన తరువాత కూడా తప్పుడు మాటలతో నన్ను మోసం చేస్తున్నారు... రక్షించండి ప్రభూ కాపాడండి..." అని వేడుకున్నాడు.

ఒంటిమీద వాలబోయిన కొరడాను తప్పించుకుని, అతని దగ్గిరికి పరుగెత్తుకు వచ్చాడు.

తను ఏం చేయబోతున్నాడో అతనికి తెలిసేలోగానే అతని పాదాలను చేతులతో చుట్టి బావురుమని ఏడ్చాడు.

అతని వెనుకే కొరడాను ఝళిపిస్తూ వచ్చిన దుకాణదారుని సేవకుడి వైపు కనుబొమలు ముడివేస్తూ చూశాడు శ్రీధరుడు. ఆ సేవకుడు మర్యాద పూర్వకంగా ఒక్కక్షణం ఆగి, అవతలికి తప్పుకునే అవకాశం అతనికి యిచ్చి వుంటే చరిత్రపుటలకు ఎక్కి వుండేది కాదు స్ఫురదాపట్టణం.

ఒక్కక్షణం కాదుగదా, క్షణంలో పదోవంతు కాలం కూడా ఆగలేదా దుకాణదారుడి సేవకుడు. చర్మపుకొరడాను పైకెత్తి బలంగా ముందుకు విసిరాడు.

ఉడుము మాదిరిగా శ్రీధరుడి పాదాలను పట్టుకుని వున్న పేదపౌరుడికి తగలవలసిన దెబ్బ శ్రీధరుడికి తగిలింది.

ఎరుపుజీరలను పులుముకున్న కనులతో, పిడికిళ్ళు బిగించి పెద్దపులిలా ఆపేసరికి మీదికి లంఘించాడు శ్రీధరుడు.

జరిగిన పొరపాటుకు క్షమాపణ కోరలేదా సేవకుడు. రాక్షసుడి మాదిరి వికృతంగా నవ్వుతూనే మరోసారి కొరడాను ప్రయోగించబోయాడు.

తనను తాను పూర్తిగా మరిచిపోయాడు శ్రీధరుడు.తను ఎటువంటి పరిస్థితుల్లో చిక్కబడివున్నాడో విస్మరించాడు. తాచుపాము మాదిరి తన

ముఖంమీదికి వచ్చేస్తున్న కొరడా చివర భాగాన్ని ఎడమచేతితో అడ్డుకుంటూ, అతని ముఖం పగిలిపోయేటట్లు కుడి పిడికిలితో పొడిచాడు.

బాధను భరించటం అసాధ్యమైపోయింది సేవకుడికి. కొరడాను వదిలేసి చేతులతో ముఖాన్ని,కప్పుకుంటూ వెనక్కి పడిపోయాడు.

పడిపోతూ పడిపోతూ "రండి...రండి... అందరూ రండి... త్వరగా వచ్చి ఈ అహంభావి అంతు చూడండి..." అని బిగ్గరిగా అరిచాడు.

ఆ అరుపుల్ని ఆలకించిన మరుక్షణం బిలబిలలాడుతూ దుకాణం ప్రక్కభాగంలోనుంచి వచ్చేశారు మరో పదిమంది సేవకులు.

దొరికిన వారిని దొరికినట్లుగా మట్టి కరిపించాడు శ్రీధరుడు. చేతికి అందు బాటులోకి వచ్చిన వారిని ఎత్తి దుకాణంముందు పడిపోయేటట్లు విసిరాడు.

"పట్టుకోండి... ఆ దుర్మార్గుడిని వెంటనే పట్టుకోండి...రాజభటులను పిలిచి కారాగృహానికి తరలించండి..." జీరపడిన కంఠంతో బిగ్గిరిగా అరిచాడు ఆ దృశ్యాన్ని చూసిన దుకాణపు యజమాని.

రాజభటులను పిలవమన్న మాట చెవులపడేసరికి తారాపథానికి చేరుకున్నది శ్రీధరుడిని ఆవరించుకున్ని వున్న క్రోధం. కన్నుమూసి కన్ను తెరచేటంతలో దుకాణంలోకి జొరబడి యజమాని వెన్ను విరిగిపోయేలా రెండుపోట్లు పొడిచాడు. ఎదురుగా అగుపించిన ప్రతివస్తువును వీధిలోకి విసిరి యుద్ధ వాతావరణాన్ని సృష్టించాడు.

అతని ఉధృతని చూసి అమితంగా భయపడిపోయారు అక్కడ గుమికూడివున్న పౌరులు. చత్రాతిమీది కొట్టిన చిల్లపెంకుల మాదిరి చిటికెలో చెల్లాచెదురై పోయారు.

తనను తన దుకాణాన్ని సర్వదా కాపాడుతూ వుండవలసిన తన సేవకులు కూడా ఆ పౌపులతోపాటు పలాయన మంత్రాన్ని పఠిస్తూ వండటం గమనించి విపరీతమైన ఆందోళనకు గురి అయ్యాడు దుకాణపు యజమాని.

"మీరు ఇంత శౌర్యవంతులని తెలియక తొందరపడ్డాము మేము...దయచేసి మమ్మల్ని క్షమించండి... ఈ ఒక్కసారికి మా తప్పును మరిచిపోండి" అంటూ శ్రీధరుడి చేతులు పట్టుకుని కన్నీరు విడిచాడు.

ఒకింత శాంతించింది శ్రీధరుడి ఆగ్రహం. అల్లంతదూరంలో నిలబడి వున్న పేదపౌరుడిని దగ్గిరికి పిలుస్తూ దుకాణదారుని వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

"చెల్లిపోయింది యితని ఋణం...పూర్తిగా చెల్లిపోయింది" ఆలస్యం చేస్తే అతను మనసు మార్చుకుని మరోసారి విధ్వంసకృత్యాలను మొదలుపెడతాడన్న భయంతో ముమ్మారు గట్టిగా ఘోషించాడు దుకాణపు యజమాని.

కృతజ్ఞతతో నిండిన చూపులతో తనకు పాదాభివందనం చేయబోతున్న పేదవాడిని అక్కడినించి అవతలకు పంపించివేశాడు శ్రీధురుడు. తన దారికి అడ్డుగా అగుపించిన ఒక పెద్ద మట్టిపాత్రను వీధిమధ్యలో పడేటట్లు ఒక తన్ను తన్ని, తనుకూడా యివతలికి వచ్చేశాడు.

"తను చేసే మోసాలకు మద్ధతు యివ్వటం కోసం మూటలకు మూటలు వెండినాణేలను నగరపాలకుడికి బహుమానంగా సమర్పించుకుంటూ వుంటాడు ఈ దుకాణపు యజమాని. మీరు చేసిన పనికి ప్రతీకారం చేయనిదే నిద్రపోడు...మీరు ఎంత త్వరగా నగరాన్ని విడిచిపోతే అంత మంచిది...'

ఇవతలకు వచ్చిన శ్రీధరుడిని చేతిసైగతో దగ్గిరికి పిలిచి, చిన్నకంఠంతో హెచ్చరించాడు ఒక ఇంటిచాటున నిలబడివున్న నగరపౌరుడు ఒకతను.

అతనా మాటలు చెపుతూ వుండగానే ప్రతీకార ప్రయత్నాలు ప్రారంభించనే ప్రారంభించాడు దుకాణ యజమాని.

దూరంగా పారిపోయిన సేవకులను పెద్ద కంఠంతో పిలుస్తూ, వినకూడని పదాలతో యిష్టం వచ్చినట్లు నిందించాడు.

"వెళ్ళండి...త్వరగా వెళ్ళి నగరపాలకుల వారిని స్వయంగా యిక్కడికి రమ్మని చెప్పండి... వెళ్ళండి..." అని ఆజ్ఞలు జారీ చేశాడు.

నగరాన్ని వదిలి దూరంగా పారిపొమ్మని సూచించిన పౌరుడిని గురించి పట్టించుకోకుండా, మరోసారి దుకాణంవైపు పరుగు తీయబోతూ ఆఖరి క్షణంలో ఆగిపోయాడు శ్రీధరుడు.

చిట్టి తంబూరాలను చేత ధరించి, కఠిన శిలలను కూడా కరిగించే శ్రావ్యమైన కంఠాలతో భగవన్నామస్మరణ చేస్తూ గుంపుగా ఆ వీధిలోకి వస్తున్నారు వైష్ణవదాసులు అనేకమంది.

పండు తమలపాకువంటి పచ్చటి శరీరచ్ఛాయ కలిగిన అరువది సంవత్సరాల వయస్సుండే ఒక సమున్నతమూర్తి నాయకత్వం వహిస్తున్నాడు వారందరికీ.

కావేటి రంగడి ప్రియభక్తుడు, వైష్ణవమాత పీఠాధిపతి రామానుజాచార్యుల వారు స్వయంగా వచ్చారు మన నగరానికి! ఎంత సుదినం!! ఎంతటి అదృష్టం!!!' భక్తిప్రపత్తులు ప్రతిఫలించే కంఠంతో బిగ్గిరిగా అరుస్తూ, ముందుకు పరిగెత్తాడు నగరాన్ని వదిలిపొమ్మని శ్రీధరుడికి సూచించిన పౌరుడు.

అతనొక్కడే కాదు... అంతకుముందే శ్రీధరుడి క్రోధాన్ని చూసి దూరంగా పారిపోయిన పౌరులు కూడా వచ్చేశారక్కడికి ... నగరపాలకుడికి వర్తమానం పంపబోతున్న దుకాణపు యజమాని కూడా వేగంగా పోయి ఆ భక్తవరేణ్యుని ముందు సాగిలపడ్డాడు.

చిరుదరహాసపు కాంతులతో ముఖమండలం చంద్రబింబం మాదిరి ప్రకాశిస్తుండగా,దక్షిణ హస్తాన్నెత్తి వారందరినీ ఆశీర్వదిస్తూ ముందుకు వచ్చాడు ఆ పవిత్రమూర్తి.

దుకాణపు యజమాని దగ్గిరికి పోయి మరోసారి తన శౌర్యప్రతాపాలను ప్రదర్శించాలో, వెనెతిరిగి దూరంగా వెళ్ళిపోవాలో తేల్చుకోలేక శిలావిగ్రహంలా నిలబడి వున్న శ్రీధరుడివైపు ఎందుకో మరలాయి ఆయన చూపులు.

ఆ భగవద్భక్తుడు చూస్తూ వుండగా దురుసుగా ప్రవర్తించటం ఉచితంగా వుండదనే నిర్ణయానికి వచ్చి గిరుక్కున వెనుతిరిగి నగర పొలిమేరలవైపు దారితీసే వీధిలోకి వెళ్ళిపోయాడు శ్రీధరుడు.

పావుఘడియ కూడా గడవకముందే, అతని గమనానికి కలిగింది మరో విఘ్నం.

పొలిమేరకు దగ్గిరిగా వుండే ఒక చిన్నఖాళీస్థలంలో మూరెడు ఎత్తుండే ఒక కొండరాయిని నిలబెట్టి, వైష్ణవ దాసుల మాదిరి భక్తిగీతాలను గానం చేస్తున్నారు అనేకమంది బాలబాలికలు.

నగరంలోని వచ్చిన రామానుజాచార్యుల వారిని చూసిన తరువాతనే వారికి ఆ బుద్ధి పుట్టిందని గ్రహించి, అనేక విధాలుగా వారిని మందలిస్తున్నారు అటుగా వచ్చి పోతున్న పౌరులు అనేకమంది.

మందలించిన కొద్ది అధికం అయిపోతున్నది ఆ బిడ్డల పట్టుదల. ఖాళీస్థలం సమీపంలోకి వచ్చిన వారందర్నీ అడ్డగించి, భగవంతుడి ప్రసాదం అంటూ గుప్పెడు మట్టి చేతుల్లో పోస్తున్నారు.

కఠిన పదాలతో వారిని నిందిస్తున్నారు కొందరు... తమలో తాము నవ్వుకుంటూ ఆ మట్టిని అవతలికి , తమ దారిన తాము వెళ్ళిపోతున్నారు మరికొందరు.

వడివడిగా అడుగులు వేస్తూ వచ్చిన శ్రీధరుడిని కూడా అడ్డుకున్నారు ఆ చిన్నారులు.

"కోనేటిరంగని ప్రతిష్ఠ జరిగింది... పాదరక్షల్ని వదిలి దర్శనం చేసుకుని వెళ్ళండి..." ముద్దుమాటలతో చెప్పింది ఒక బాలిక.

తన తొందరను తనలోనే దాచుకుని, పాదరక్షలను వదిలాడు శ్రీధరుడు.

కొండరాతి దగ్గరికి పోయి దోసిలి ఒగ్గాడు.

మూడుమూరల పొడుగుండే వస్త్రాన్ని పూజారి మాదిరి నడుము చుట్టూ చుట్టుకొని, అతనికి అన్నిరకాలుగా సహాయపడ వలసిందిగా కావేటి రంగని ప్రార్థించాడు ఒక బాలుడు. తనపెద్దల దగ్గిర నేర్చుకున్న శ్లోకాన్ని కూడా చదివాడు.

నమో బ్రహ్మణ్య దేవాయ
గో బ్రహ్మణి హితాయచ
జగద్ధితాయ కృపాయ
గోవిందాయ నమోమనః

తనున్న పరిస్థితి మరుపుకు వచ్చేటంత పరవశత్వం శ్రీధరుడిని ఆవరించుకున్నది. ఆ చుట్టుపట్ల సంచరిస్తున్న వారందరూ తనవంక ఆశ్చర్యంగా చూస్తున్నారని తెలిసికూడా, కొండరాతికి సాష్టాంగ నమస్కారం చేశాడు.

"కావేటి రంగడి ప్రసాదం యిది. తీసుకోండి" అందరి మాదిరిగా తమను వెక్కిరించి అవతలికి పోకుండా, తమ కల్పనలో పాలుపంచుకుంటున్న అతన్ని హెచ్చరించింది ఆ బాలిక.

ఆమె తనచేతుల్లో పోసిన మట్టిని భక్తిపూర్వకంగా కనులకు అద్దుకుని, నోటిలో వేసుకున్నాడు శ్రీధరుడు.

వెక్కిరింపుగా నవ్వారు ఆ దృశ్యాన్ని చూస్తున్న వారందరూ.

"చిన్న పిల్లలతో చేరి చిన్నపిల్లడి మాదిరిగా ప్రవర్తిస్తున్నావు... నీకు సిగ్గుగా లేదా?" అనికూడా అడిగారు.

"భగవంతుడికి నమస్కరించటానికి సిగ్గు ఎందుకు?" ఆశ్చర్యంగా వారిని ప్రశ్నించాడు శ్రీధరుడు.

"ఆ కొండరాయి భగవంతుడా...?" హేళనగా అన్నాడు వారిలో ఒకతను.

అక్కడి వారందరి మాదిరిగా తమను వెక్కిరించకుండా, తమ ఆటలో పాలుపంచుకున్న శ్రీధరుడికి ఎదురైన పరిస్థితిని గమనించేసరికి చిన్నబుచ్చుకున్నారా పసిబిడ్డలు అందరూ... తలలు వంచుకున్నారు.

కాంతులు కోల్పోయిన ఆ చిన్నారుల ముఖాల్ని చూసేసరికి రెట్టింపు అయింది శ్రీధరుడి పట్టుదల. హేళనగా మాట్లాడిన పౌరుడి మాటలకు సమాధానంగా చిరునవ్వు నవ్వి తన దారిన తను వెళ్ళిపోయాడు.

"భగవంతుడు ఎవరు? ఎక్కడ వుంటాడో చెప్పగలరా మీరు?" స్థిరంగా నిలబడుతూ సూటిగా వారిని అడిగాడు.

అతనలా ఎదురు ప్రశ్న వేస్తాడని ఊహించకపోవటం వల్ల వెంటనే సమాధానం చెప్పలేకపోయారు వారందరూ.

"మహారాజులు కట్టించిన అద్భుతమయిన ఆలయాల్లోని శిలావిగ్రహాలే మీ దృష్టిలో భగవంతుడికి ప్రతిరూపాలు. అవి కూడా ఈ కొండరాయివంటి శిలలతో తయారుచేయబడినవనే సంగతిని మీరు విస్మరిస్తున్నారు. అసలు భగవంతుడు నిరాకారుడనీ, నిర్గుణుడనీ, ఎవరు ఏ రూపంలో ధ్యానిస్తే ఆ రూపంలో అగుపిస్తాడనీ పెద్దలు చెప్పిన మాటల్ని మీరు మరిచిపోతున్నారు. మాటలుకూడా సరిగా రాని ఈ బిడ్డలు ఆ పెద్దల మాటల ప్రకారమే రూపం లేని ఈ కొండరాయిలో అగుపిస్తున్న భగవంతుడు తమకు కనిపించటం లేదని అనేవారు నిజంగా అంధులే..."

ఆవేశం నిండిన కంఠంతో పెద్దగా వారందరికీ చెప్పాడు శ్రీధరుడు. భగవంతుడికి భక్తితో అర్పించబడిన పదార్థం అది. ఎటువంటిది అయినా భగవత్ప్రసాదంగానే భావించబడుతుందని కూడా తెలియచేయబోతుండగా అడ్డంకి ఎదురయింది అతని వాక్ప్రవాహానికి.

నోళ్ళు తెరుచుకుని నిలబడి వున్న పౌరుల మూలకంగా రాలేదా అడ్డంకి. రాచవీధిలో సంచరించటంతో ఆగకుండా, పొలిమేరల దగ్గిర వున్న చిన్న చిన్న వీధులను కూడా సందర్శించే కోరికతో అటుగా వచ్చిన వైష్ణవ దాసులనుంచి ఎదురయింది.

భుజాల మీదినించి జారిపోతున్న పట్టువస్త్రాన్ని ఎడమచేతితో సరిచేసుకుంటూ, ఖాళీస్థలం ఆవలి ప్రక్కన నిలబడి, చిరునవ్వులు వెలువరిస్తూ శ్రీధరుడి వైపు చూశారు వైష్ణ బృందానికి నాయకత్వం వహిస్తున్న శ్రీరామానుజా చార్యుల వారు.

తన ఉపన్యాసం ఆయన కర్ణేంద్రియాలకు చేరిందని గ్రహించి అమితంగా సిగ్గుపడ్డాడు శ్రీధరుడు. చటుక్కున తలను ప్రక్కకు తిప్పుకున్నాడు.

"ఒక్క నిముషం ఆగునాయనా... నా ప్రభువును దర్శించుకుని నీతో ఒక మాట మాట్లాడతాను" అంటూ అతన్ని ఆగమని సైగచేశారు రామానుజుల వారు. భుజాలమీది వస్త్రాన్ని నడుముచుట్టూ కట్టుకుని, ఖాళీస్థలంలోని కొండరాయికి నమస్కారం చేశారు.

రాజాధి రాజుతో కూడా అభివాదాలు చేయించుకునే ఆ మహామనిషి తమదగ్గిర ఆగటమే కాకుండా, తాము నెలకొల్పిన కొండరాతిముందు ప్రణమిల్లేసరికి అవాక్కయిపోయారా పసిబిడ్డలు.

"దేవ దేవుడయిన గోవిందుని కీర్తిస్తూ ఇందాక ఒక శ్లోకం చదివారు మీరు... మరోసారి చదవగలరా?" పూజారి మాదిరిగా నిలబడిన బాలుడి వంక చూస్తూ మధురవాక్కుతో అర్థించారు రామానుజులు.

శ్రీధరుడికి వినిపించిన శ్లోకాన్నే తడబడుతున్న కంఠంతో ఆ మహనీయునికి కూడా వినిపించాడా బాలుడు.

"కావేటిరంగని ఆలయాన్ని వదిలి దూరంగా వచ్చిన బాధ ఇప్పుడు పూర్తిగా ఉపశమించింది..." ఆనందభాష్పాలు కనుకొలకుల్లో ప్రత్యక్షం అవుతుండగా, తమశిష్యులతో అన్నారు రామానుజులవారు.

"ఈ భాగ్యాన్ని నాకు కలుగచేసిన ఆ యువకునితో మాట్లాడిన తరువాత మనం ముందుకు పోదాము" అని కూడా అంటూ, ప్రసాదంగా భావించబడుతున్న మట్టినే మరీ మరీ అడిగి స్వీకరించారాయన.

తనతో సంభాషించాలనే అభిలాషను ఆయన వ్యక్తం చేసినప్పటికీ, ఆయనతో మాట్లాడుతూ నిలబడితే అందరి దృష్టిని అధికంగా ఆకర్షించటం జరుగుతున్న భయంతో, ఎవరూ చూడకుండా చల్లగా పొలిమేరలవైపు సాగిపోయాడు శ్రీధరుడు.

"భగవత్ స్వరూపాన్ని గురించి సామాన్యులకు సైతం చక్కగా అర్థం అయ్యేలా చెప్పిన ఆ యువకుడు నిజంగా గొప్పవాడు... అతని పరిచయ భాగ్యం యిప్పుడిప్పుడే కలగటం కావేటిరంగనికి ఇష్టం లేనట్లు అగుపిస్తోంది" శ్రీధరుడి కోసం నలుదిక్కులను పరికిస్తూ అన్నారు రామానుజులవారు.

అంతటి మనిషి పిల్లలు నిలబెట్టిన కొండరాయికి నమస్కరించటాన్ని గమనించి, తాముకూడా ముందుకు కదిలారు అక్కడి పౌరులు... బిడ్డలు అందించిన మట్టినే మహాప్రసాదంగా స్వీకరించి కావేటి రంగనికి జయ జయధ్వానాలు చేశారు.

వారందరితో కలిసి తనుకూడా కొండరాయికి నమస్కరించి, కాస్తంత మట్టిని ఉత్తరీయపు కొంగులో భద్రపరుచుకున్నాడు ధనదుపురంనుంచి హేమసుందరిని తీసుకువస్తున్న దృఢకాయుడు.

నగరంలోకి అడుగిడితే హేమసుందరిని ఎవరైనా గుర్తుపడతారన్న అనుమానంతో వృషభశకటాన్ని నగరానికి దూరంగా ఒక చెట్లతోపులో వదిలి వచ్చాడతను.

పరుగు పరుగున వెళ్ళాడతను ఇప్పుడు ఆ చెట్లతోపు దగ్గిరికి. నగరంలో నుంచి తను తీసుకువచ్చిన మట్టిని కూడా ఆమెకు అందించాడు.

"రామానుజులవారిని దర్శించలేని దురదృష్టవంతురాలిని నేను... అభాగ్యురాలిని..." నీరునిండిన కనులతో తన దురదృష్టాన్ని నిందించుకుంటూ ఆ మట్టిని కనులకు అద్దుకుని స్వీకరించింది హేమసుందరి.

ఆమె తను తీసుకువచ్చిన పదార్థాలను భుజించిన తరువాత వృషభశకటాన్ని ముందుకు కదిలించాడు దృఢకాయుడు.

ఇక్కడినుంచి తరళాపురిని చేరుకునేటంతవరకూ మనం అరణ్యమార్గంలోనే ప్రయాణం చేయవలసి వున్నది . అడవి జంతువులు కొన్ని అప్పుడప్పుడు మన మార్గానికి అడ్డుగా ప్రత్యక్షం అవుతూ వుంటాయి. ధైర్యంగా కూర్చోవాలి తల్లీ... ఎట్టి పరిస్థితిలోనూ అధైర్యపడకూడదు..." అంటూ ఆమెను హెచ్చరించాడు.

నగరంలో వుండగా రామానుజులవారి శిష్యుడు మొదలియాండన్ తనకు చేసిన ఉపదేశాన్ని మననం చేసుకుంటూ కూర్చున్నది హేమసుందరి.

పోను పోను దట్టం కాసాగింది వారు అడుగిడిన అరణ్యం. వర్షాలు కురిసినప్పుడు వేగంగా ప్రవహించే నీటిజాలుల వల్ల ఎగుడు దిగుళ్ళతో, ఎత్తు పల్లాలతో అసహ్యకరంగా మారి వున్నది వారు అనుసరిస్తున్న మార్గం.

దృఢకాయుడు ఆశించినంత వేగంగా సాగలేదు ప్రయాణం . సాయం సమయం అయ్యేలోపుగా ఏదైనా గ్రామాన్నో, పల్లెనో, చేరుకోవచ్చనే ఆశ వట్టి ఆశగానే మిగిలిపోయింది.

"ఈ రాత్రికి మనం ఏదో ఒక చెట్టుక్రింద కాలక్షేపం చేయవలసిందే... అడవి జంతువుల వల్ల ప్రమాదం ఎదురవకుండా నెగడు వేస్తాను" అంటూ శకటాన్ని ఒక పెద్ద వటవృక్షం క్రింద ఆపివేశాడతను. చుట్టూ వున్న పొదలలోకి వెళ్ళి, ఎండుకొమ్మల్ని, చితుకుల్ని ఏరుకు వచ్చాడు.

నెగడు వేయటంలో అతడికి సహాయపడిన హేమసుందరి, స్ఫురదా పట్టణంలోనుంచి అతను తీసుకువచ్చిన ఆహారపదార్థాల్లో ఎక్కువ భాగం అతనికే ఇచ్చి, అక్కడికి సమీపంలో వున్న చిన్న కొండవాగులో దాహం తీసుకువచ్చింది.

వెనక్కు వస్తున్న సమయంలో ఎందుకో అనుమానం వచ్చింది ఆమెకు. గుబగుబలాడుతున్న గుండెలను చిక్కబట్టుకుంటూ శకటచోదకుడిని హెచ్చరించింది.

నెగడు ముందునుంచి ఛెంగున లేచి, శకటంలో భద్రపరిచిన పొడుగాటి బరిశెను చేతుల్లోకి తీసుకున్నాడతను.

అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది. బ్రహ్మరాక్షసుల మాదిరి వికవికమని నవ్వుతూ వారి ఎదుట ప్రత్యక్షం అయ్యారు పదిమంది ఆజానుబాహులు.

## 9

చీకటి పడుతున్న సమయంలో ఎదుట అగుపించిన ఒక పెద్ద వెలగచెట్టు దగ్గిర ఆగిపోయాడు శ్రీధరుడు.

మిగలపండి నేలవ్రాలిన నాలుగుపళ్ళను ఆరగించి, అక్కడికి సమీపంలో అగుపించిన ఒక చిన్న అడవి వాగులో దాహం తీర్చుకున్నాడు.

ఆగి ఆగి వినిపిస్తున్న అడవి జంతువుల అరుపుల్ని ఆలకిస్తూ, ఆ రాత్రి గడిపేందుకు అనువైన స్థలంకోసం అన్వేషిస్తుండగా వినవచ్చింది ఆ ఆర్తనాదం.

ఆపదలో చిక్కుబడిన స్త్రీ ఎవరో ఆర్తిగా అరిచిన అరుపు అది.... నరమానవులు ఎవరూ అగుపించని ఆ అరణ్యంలో తన బాధను గమనించే వారు ఎవరైనా కనిపిస్తే బాగుండునని ఆశతో పిలిచిన పిలుపు.

రాత్రి గడిపేందుకు అనువైన ప్రదేశాన్ని వెతుక్కునే ఆలోచనను వెంటనే ప్రక్కకు నెట్టి అటుకేసి పరుగుతీశాడు శ్రీధరుడు. అడ్డువచ్చిన ముళ్ళపొదల మధ్యలోనుంచి నేర్పుగా ముందుకుపోయి ఒక వటవృక్షాన్ని చూశాడు.

ఆ వృక్షానికి పదిబాహువుల దూరంలో నిలబెట్టబడి వున్నది ఒక వృషభ శకటం...ఆ శకటానికి అల్లంత దూరంలో అందమైన ఒక స్త్రీ మూర్తిని చుట్టుముట్టి కనిపించారు పదిమంది ఆజానుబాహులు.

"రక్షించండి... నన్ను ఈ దుర్మార్గుల బారినుండి ఎవరైనా దయామయులు వచ్చి కాపాడండి..." శ్రీధరుడు వింటూ వుండగానే ఎలుగెత్తి మరోమారు ఆక్రోశించిందా స్త్రీ.

శరీరంలోని రక్తం సెగలు పొగలు వెలువరిస్తుండగా దట్టీలోని పిడిబాకును ఎడమచేతిలోకి తీసుకుంటూ, ఆ ఆజానుబాహుల మీదికి లంఘించాడు శ్రీధరుడు.

ఎదురుచూడని విధంగా వచ్చి తమను ఎదిరించిన ఆ యువకమూర్తిని చూసి బెంబేలుపడ లేదా రాక్షసులు. అతను వంటరిగానే వచ్చాడని అర్థం అయిన తరువాత మరింతగా అతిశయించింది వారి ధూర్తవ్యం.

"మమ్మల్ని ఎదిరించి ప్రాణాలతో నిలబడగలిగిన యోధుడు ఇంతవరకూ కనిపించలేదు. నువ్వు మమ్మల్ని జయించలేవు..." అంటూ తమ ఆయుధాల నెత్తి అతన్ని చుట్టుముట్టారు.

"పారిపో... దూరంగా పారిపోయి నీ ప్రాణాల్ని కాపాడుకో... పారిపో..." అని ఆ స్త్రీమూర్తిని హెచ్చరిస్తూ తన పిడిబాకుతో వారిని చికాకుపరచటం మొదలుపెట్టాడు శ్రీధరుడు.

అతను ఆశించినట్లు అవకాశం లభించగానే దూరంగా పరుగులు తీయలేదా స్త్రీమూర్తి ... వటవృక్షం దగ్గిర వున్న వృషభ శకటాన్ని సమీపించింది. అక్కడ తీవ్రమైన గాయాల మూలకంగా నేలకూలిపోయిన ఒక దృఢకాయుడి ముందు మోకరించి కూర్చున్నది.

చెవులు చిల్లులు పడేటట్లుగా అరిచి ఆమెను మరోసారి హెచ్చరించాలని అనుకున్నాడు శ్రీధరుడు. తన చుట్టుముట్టిన ఆజానుబాహుల వేగం క్షణ క్షణానికి అధికం అవుతూ వుండటంతో ఆ పని చేయలేకపోయాడు.

తాచుపాముల మాదిరి మెలికలు తిరుగుతూ అతని బాకు పోట్లనుంచి తప్పించుకుంటున్నారు వాళ్ళు. తమ ఆయుధాలతో అతన్ని గాయపరచి క్రిందికి నెట్టాలని పట్టుదలగా ప్రయత్నాలు చేస్తున్నారు.

తమను ఎదిరించి ప్రాణాలతో నిలబడగల యోధుడు ఎవరూ లేరని అంతకుముందే వారు పలికిన పలుకులు, చెవుల్లో మార్మోగి చేదుగా తయారయింది శ్రీధరుడి నోరు.

ధనదుపురంలో తనకు తారసపడిన రాజభటుల మాదిరిగా పిడిబాకును చూసి తడబడి పోవటం లేదు వారు...

ఎడమచేతికి చాలా దగ్గర్లోకి వచ్చిన ఒక వ్యక్తి గుండెల్ని తీవ్రంగా గాయపరచేందుకు ప్రయత్నం చేస్తూ, ఎగుడు దిగుడుగా వున్న నేలమీద కాలు మెలికపడి, ముందుకు తూలాడు శ్రీధరుడు.

గొల్లున అరిచారా ఆజానుబాహులు. తన చేతిలోని ఒక గండ్రగొడ్డలిని అమాంతంగా గాలిలోకి ఎత్తి అతని శిరస్సును ఖండించే ప్రయత్నం చేశాడు వారిలో ఒకతను.

ప్రాణాలమీద ఆశను వదిలేసుకున్నాడు శ్రీధరుడు... చేతిలోనుంచి జారిపోయిన పిడిబాకును మరింత గట్టిగా పట్టుకోవటానికి ప్రయత్నిస్తూ కనులు మూసుకున్నాడు.

క్షణంలో పదోవంతు కాలం గడిచిపోయినా గండ్రగడ్డలి తన శిరస్సును ఖండించకపోవటంతో కలిగింది అతనికి ఆశ్చర్యం . తల తిప్పి ప్రక్కకు చూసేసరికి అగుపించిన దృశ్యం అతన్ని కర్తవ్యవిమూఢుడిని చేసివేసింది.

అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగపరుచుకుని, అతని ప్రాణాలను బలి తీసుకునే ఆలోచనను విరమించుకున్నట్లు అతనికి దూరంగా జరిగారు ఆజానుబాహులు అందరూ. తమ ఆయుధాల్ని గట్టిగా బిగించి పట్టుకుంటూ తమచుట్టూ వున్న పొదలవైపు చూస్తున్నారు.

చూస్తూ వుండగానే ఆ పొదలలోనుంచి రివ్వు రివ్వున దూసుకు రాసాగాయి. పలుకురాళ్ళవలె కఠినంగా వుండే పచ్చి వెలుగపళ్ళు....

వెర్రిగా అరిచి ముఖాలకు చేతుల్ని అడ్డుపెట్టుకున్నారు కొందరు ఆజానుబాహులు. ఆయుధాల్ని వదిలి దూరంగా పరుగులు తీశారు మరి కొందమంది.

వెలగపళ్ళను విసురుతున్నది ఎవరో శ్రీధరుడికి అర్థంకాలేదు. అర్థం చేసుకోవాలని కూడా అతను అనుకోలేదు. అయాచితంగా వచ్చిన ఆ అవకాశాన్ని వెంటనే సద్వినియోగ పరుచుకున్నాడతను. క్రిందినించి లేచి పెద్దపులి మాదిరి ఆజానుబాహులమీద విరుచుకుపడ్డాడు.

వ్యవధి లభించిన మరుక్షణం దూరంగా పారిపోవాల్సిన ఆ యువకుడు అలా ఎదిరించ వచ్చేసరికి నిర్విణ్ణులైపోయారు ఆజానుబాహులు. ఆగకుండా వచ్చిపడుతున్న వెలగపళ్ళ వర్షానికి తోడుగా అతని పిడిబాకుపోట్లు కూడా తోడయ్యేసరికి వేగంగా దిగజారిపోయింది వారి ధైర్యం.

అంతకుముందే అవతలికి పారిపోయిన వారిని వెంటనే అనుసరించారు. కన్ను మూసి కన్ను తెరిచేంతలో పొదల మధ్యకు పోయి అదృశ్యమైనారు.

"ఎవరు? అవసర సమయంలో దేవతల మాదిరి వచ్చి నన్ను కాపాడింది ఎవరు??" పిడిబాకును దక్షిణ హస్తంలోకి మార్చుకుంటూ పెద్ద కంఠంతో పిలిచాడు శ్రీధరుడు.

ఆజానుబాహులు పారిపోయిన వెంటనే ఆగిపోయింది వెలగపళ్ళ వర్షం... చీమ చిటుక్కుమన్నా పెద్దగా వినిపించేటంత నిశ్శబ్దం ఆ ప్రదేశాన్ని ఆవరించుకున్నది.

"దయచేసి నా ఎదుటికి రండి... నన్ను కాపాడినందుకు కృతజ్ఞతలను తెలియచేసుకోనివ్వండి..." రెండు అడుగులు ముందుకు వేసి, పొదలవంక పరీక్షగా చూస్తూ మరోసారి అర్థించాడు శ్రీధరుడు.

"పారిపోయిన దుర్మార్గులు మరికొంతమంది సహచరుల్ని కూడాగట్టుకుని యిక్కడికి రాకముందే ఈ ప్రదేశాన్ని వదిలిపెట్టిపోవటం నీకు క్షేమకరం.

వృషభశకట చోదకుడు చావుబ్రతుకుల్లో వున్నట్లు అగుపిస్తోంది... ఇక్కడికి నాలుగు యోజనాల దూరంలో చిన్న గ్రామం ఒకటి వున్నది... అక్కడి వైద్యుని వద్దకు అతన్ని చేర్చటం చాలా మంచిది..." వెంటనే వినవచ్చింది ఒక గంభీరకంఠం.

అది ఎవరిదో గుర్తు పట్టటానికి శ్రీధరుడు చేసిన ప్రయత్నం వృధా అయింది. పరుగు పరుగున అటుకేసి పోయిన అతనికి పొదల వెనుక ఒక్క పురుగుకూడా అగుపించలేదు.

"అడగకుండా వచ్చి తనను ఆపద బారినుంచి కాపాడిన ఆ అజ్ఞాతవ్యక్తికి శిరస్సు వంచి నమస్కరిస్తూ వృషభశకటం దగ్గిరికి వచ్చేశాడతను.

అజ్ఞాత వ్యక్తి చెప్పినట్లుగానే వంటిమీది గాయాల మూలకంగా ప్రాణాలు పోగొట్టుకునేందుకు సిద్ధంగా వున్నాడు క్రిందపడి వున్న దృఢకాయుడు.

అతని ముందు మోకరించి అమితంగా దుఃఖిస్తున్న స్త్రీమూర్తిని అనునయ వాక్యాలతో వూరడించబోతూ, అదిరిపడ్డాడు శ్రీధరుడు.

"నువ్వా! హేమసుందరీ నువ్వేనా!!!" ఆశ్చర్యం నిండిన కంఠంతో అంటూ స్థాణువులా నిలిచిపోయాడు.

బుగ్గలమీదికి జాలువారుతున్న భాష్పధారల్ని పమిటచెంగుతో అద్దుకుంటూ గద్గదస్వరంతో తను అక్కడికి ఎలా వచ్చిందో అతనికి తెలియచేసింది ఆమె.

"నన్ను కాపాడటం కోసం తన ప్రాణాల్ని బలిపెట్టబోయాడు ఇతను..." అంటూ జరిగినదేమిటో వివరించింది.

చేతిలోని పిడిబాకును దట్టీలో దోపుకుంటూ వృషభంను అదిలించి శకటానికి పూన్చాడు శ్రీధరుడు. నిస్తేజంగా పడివున్న శకటచోదకుడిని మెత్తటి గడ్డిమీద పరుండబెట్టి హేమసుందరికి సైగ చేశాడు. అజ్ఞాతవ్యక్తి చెప్పిన మాటల్ని మననం చేసుకుంటూ శకటాన్ని సాధ్యమైనంత వేగంతో ముందుకు కదిలించాడు.

రెండు ఘడియాల తరువాత అతనికి అగుపించింది అజ్ఞాతవ్యక్తి చెప్పిన కుగ్రామం. పగలంతా కాయకష్టం చేసిచేసి అలిసిపోయి వుండటంవల్ల, చీకటిపడిన వెంటనే నిద్రలకు ఉపక్రమించారు ఆ గ్రామస్థులు. చిరుగంటల్ని గలగలలాడిస్తూ తన గ్రామంలోకి వచ్చిన వృషభ శకటాన్ని గురించి పట్టించుకోలేదు.

ఒక్కప్రక్కగా వంటరిగా వున్న ఇంటి తలుపుల్ని తట్టి యజమానిని నిద్ర లేపాడు శ్రీధరుడు. అతని సహాయంతో గ్రామం మధ్యలో వున్న వైద్యుడి గృహానికి శకటచోదకుడిని తీసుకుపోయాడు.

చిటికెలో గ్రామమంతా వ్యాపించింది ఆ విషయం. నిద్ర కనులను నులుముకుంటూ గుంపుగా వచ్చిన గ్రామస్థులందరి సమక్షంలోను శకటచోదకుని పరీక్షించి బరువుగా నిట్టూర్చాడు వైద్యుడు.

గాయాలు బలమైనవి కాకపోయినా, రక్తాన్ని అధికంగా కోల్పోవటంవల్ల ఇతని శక్తి క్షీణించిపోయింది... అదృష్టం బాగుంటే ఒక మాసంలోపుగా కోలుకోవచ్చు.. నా మీద నమ్మకం వుంటే వైద్యం చేస్తాను..." అంటూ శ్రీధరుడి ముఖంలోకి చూశాడు.

ఒక మాసం రోజులు అక్కడే వుండి శకటచోదకునికి వైద్యం చేయించటం లోని సాధకబాధకల్ని తరిచి చూసుకున్నాడు శ్రీధరుడు.

భైరవి ఆలయ పూజారిని హతమార్చిన దుండగీడు కోసం దేశం నలుమూలలా గాలించే రాజభటులు ఎవరైనా ఆ గ్రామంలోకి వస్తే?

శ్రీధరుడి ఆలోచనల్ని వెంటనే అర్థం చేసుకుని, అతనికి బదులుగా తానే సమాధానం యిచ్చింది హేమసుందరి.

"ఒక్క మాసం మాత్రమే కాదు.. నాలుగు మాసాల వ్యవధి అవసరమైనా సరే ఇతనికి పూర్తి ఆరోగ్యం చేకూరాలి... అందుకు ఎంత ధనం కావాల్సి వచ్చినా యిస్తాను" అంటూ తన వద్ద వున్న ధనవు సంచీలోనుంచి దోసెడు బంగారు నాణేలను వైద్యునికి అందించింది.

తృప్తిగా తల వూపుతూ అప్పటికప్పుడు శకటచోదకునికి చికిత్స ప్రారంభించాడు వైద్యుడు. వనమూలికల్ని చూర్ణంచేసి అతని గాయాలమీద అంటించాడు. పరిశుభ్రమైన వస్త్రంతో కట్లుకట్టి ఏవో కషాయాల్ని అతని నోటిలోకి వంపాడు.

"తెల్లవారేసరికి తెలివి వస్తుంది" అంతవరకూ ఇతన్ని మాట్లాడించే ప్రయత్నం చేయవద్దు..." అంటూ శ్రీధరుడికి, హేమసుందరికి తన ఇంటి వెనుకభాగంలో వున్న చిన్న పాకను చూపించాడు.

కుతూహలం నిండిన కనులతో తమవంకే చూస్తున్న గ్రామస్థులందరికీ నమస్కరించి ఆ పాకలో వున్న చెక్కబల్లమీద కూర్చున్నది హేమసుందరి. అక్కడ వున్న ఒకే ఒక నులకమంచాన్ని శ్రీధరుడికి చూపించింది.

అలసిపోయి వుండటంవల్ల ఎటువంటి అభ్యంతరాన్ని తెలియచేయలేదు శ్రీధరుడు. మంచంమీద మేను వాల్చిన నిమిషంలో నిద్రలోకి జారిపోయాడు.

తూర్పుదిక్కు మరికొద్దిసేపటికి తెల్లబడబోతున్నదనగా, అతని భుజం తట్టి నిద్రలేపింది హేమసుందరి.

"శకటచోదకునికి తెలివి వచ్చింది. ఒక మాసంపాటు తను ఎక్కడికీ కదలకూడదని వైద్యుడు చెప్పిన మాటను అతనికి వివరించాను... అందుకు అవసరమైన ధనాన్ని అతనికి యిచ్చాను.. వృషభశకటాన్ని మనం తీసుకు పోదాం..." అంటూ అతన్ని ప్రయాణానికి తొందర చేసింది.

తన మనసును కలవరపరుస్తున్న సమస్యకు సమాధానం లభించటంతో తృప్తిగా తలవూపి, వృషభాలను శకటానికి తొందర చేసింది.

తన మనసును కలవరపరుస్తున్న సమస్యకు సమాధానం లభించటంతో తృప్తిగా తలవూపి, వృషభాలను శకటానికి పూన్చాడు శ్రీధరుడు.

అంతకుముందే వైద్యునితో మాట్లాడి వచ్చింది కాబోలు వెంటనే శకటంలో కూర్చున్నది హేమసుందరి.

"తరళాపురి పెరుమాళ్ళ కోవెల దగ్గిరికి పోవాలి నేను..." అంటూ అతనికి సూచనలు యిచ్చి మెత్తగా పరిచి వున్న ఎండుగడ్డి మీద మేనువాల్చింది.

ధనదుపురం నుంచి బయలుదేరినది మొదలు ఎక్కడా ఆగకుండా ప్రయాణం చేస్తున్నందువల్ల దుమ్ము,ధూళితో మలినమై వున్నది ఆమె వదనం... అయినా సరే అపురూపంగా అగుపిస్తున్న ఆమె సౌందర్యాన్ని తనివితీరా వీక్షిస్తూ శకటాన్ని నడిపాడు శ్రీధరుడు... మధ్యాహ్న సమయానికి శూరమంగళమనే ఒక గ్రామాన్ని చేరుకుని, గ్రామంమధ్యలో వున్న రచ్చబండ దగ్గిర శకటాన్ని ఆపాడు.

* * *

"రూకలు తీసుకుని భోజనం పెట్టే పూటకూటి యిళ్ళు మా గ్రామంలో లేవు. తెలిసినవారు ఎవరూ లేకపోతే మీకు భోజనవసతి ఇచ్చట లభించదు" నిర్మొహమాటంగా శ్రీధరుడికి చెప్పాడు రచ్చబండమీద కూర్చుని వున్నవారిలో ఒక గ్రామస్థుడు.

ప్రయాణపు బడలికతో వడలిపోయిన హేమసుందరి వంక చూస్తూ, శకటాన్ని ముందుకు కదిలించాడు శ్రీధరుడు.

పది ధనువుల దూరం కూడా పోకముందే పెద్దగా పిలిచి, అతని దృష్టిని తనకేసి మరలించుకున్నాడు అటుగా వస్తూ, రచ్చబండ దగ్గిర గ్రామస్థుడి మాటల్ని ఆలకించిన ఒక బ్రాహ్మణుడు.

ఊర్ధ్వపుండరాలను ధరించి వైష్ణవ దాసుని మాదిరి అగపిస్తున్నాడతను. యాయవారం చేసి భుక్తిని గడుపుకుంటున్నట్లు శుభ్రమైన ఒక జోలెను భుజానికి తగిలించుకుని వున్నాడు.

భిక్షకోసం అతను తమను ఆపాడని అనుకుని విసుగు నిండిన కనులతో అతనివంక చూశాడు శ్రీధరుడు.

"అతిథి మర్యాదలు చేయటం మా గ్రామంలో వారికి అలవాటు లేదు. పరాయివారు ఎవరు గ్రామంలోకి వచ్చినా కటువుగా మాటాడి పంపించి వేయటం వారికి ఒక వినోదం.. అన్యధా భావించకుండా మీరు నా ఇంటికి విచ్చేయండి. ఈ రోజుకు నా ఆతిధ్యాన్ని అంగీకరించి నన్ను ధన్యుడిని చేయండి..." శకటం ముందుకు వస్తూ ఆర్ద్రత నిండిన కంఠంతో అన్నాడా బ్రాహ్మణుడు.

అతన్ని గురించి తప్పుగా ఊహించినందుకు సిగ్గుపడుతూ, శకటాన్ని అతని వెనుకే గ్రామం ఆవలి ప్రక్కన ఒంటరిగా వున్న పూరిపాక దగ్గిరికి పోనిచ్చాడు శ్రీధరుడు.

అలసట అధికమై తలలు వ్రేలాడవేస్తున్న వృషభాలను అక్కడికి దగ్గిర్లో వున్న చిన్న నీటిగుంట దగ్గిరికి తీసుకుపోయాడు. కడుపునిండా నీరు త్రాగిన తరువాత వాటిని శకటపు చక్రాలను కట్టి, ఎండుగడ్డిని వాటిముందు పెట్టాడు.

వాటి శరీరాలను పట్టివున్న స్వేదాన్ని గడ్డిపరకలతో అద్దుతూ వుండగా, మెత్త మెత్తని అడుగులతో అతన్ని సమీపించింది హేమసుందరి.

"మన పరిస్థితిని గమనించి అతిథ్యం యిచ్చారుగాని, తమతోపాటు మరో యిద్దరిని భరించేశక్తి వారికి లేదు..." శకటానికి సమీపంలో వున్న ఒక బండరాయిమీద కూర్చుంటూ మృదుస్వరంతో చెప్పింది.

శకటంలోనుంచి దిగిన ఆమెను చూసిన వెంటనే సాదరంగా ఆహ్వానించి లోపలికి తీసుకుపోయింది బ్రాహ్మణుని భార్య. ఆమె కాచియిచ్చిన వేడినీటితో స్నానం చేసింది హేమసుందరి... ఆమె యిచ్చిన నేత వలువల్ని ధరించింది.

చినిగిపోవటానికి సిద్ధంగా వున్న ఆ ముతక వస్త్రాలు హేమసుందరి అందాల్ని తగ్గించటానికి బదులుగా ద్విగుణీకృతం చేయటాన్ని గమనించి మెచ్చుకోలుగా తలపంకించాడు శ్రీధరుడు.

"అతిథి అభ్యాగతులంటే సాక్షాత్ భగవత్ స్వరూపులుగా భావించే ఈ దంపతులకు మనం తప్పకుండా భారం అవుతాం... ఏదో ఒకటి చేసి వీరికి మనం సహాయపడాలి..." తన పలుకుల్ని శ్రీధరుడు ఆలకించటం లేదని భావించి కాస్తంత పెద్దగా అన్నది హేమసుందరి.

ఆ మాటలతో ఉలిక్కిపడి తన చూపుల్ని మరలించుకున్నాడు శ్రీధరుడు.

ఆదరించి ఆతిథ్యం ఇవ్వటానికి సిద్ధపడిన ఆ బ్రాహ్మణ దంపతులకు తాము భారం కాకూడదని అనుకుంటే చేయవలసిన పని ఒక్కటే వున్నది. ఆతిథ్యం యిచ్చినందుకు కృతజ్ఞతాసూచకంగా ఎంతో కొంత ధనం ముట్టచెప్పటం... లేదా సాధ్యమైనంత త్వరగా అక్కడినుంచి కదలి తమదారిన తాము వెళ్ళిపోవటం...

అలసటతో తలలు వ్రేలాడదీసి వున్న వృషభాలను చూసేసరికి తమదారిన తాము వెళ్ళిపోవడం వెంటనే సాధ్యపడదని తెలిసివచ్చింది అతనికి.

మరొక్క రోజయినా వాటికి విశ్రాంతి ఇచ్చి తీరాలి...

శ్రీధరుడి ఆలోచనలు పూర్తికాకముందే యింటిలోనుంచి వినవచ్చింది ఒక జేగంట ధ్వని....

"పూజామందిరంలోని దైవస్వరూపానికి పూజ చేయటం పూర్తి అయి నట్లుంది. నైవేద్యం పెట్టగానే మనకు పిలుపు వస్తుంది" అంటున్న హేమసుందరి మాటలు పూర్తికాకముందే వాకిటిలోకి వచ్చింది బ్రాహ్మణుడి భార్య.

"లోపలికి వచ్చి హారతిని కనులకు అద్దుకోండి..." అని వారిని పిలవబోతూ ఎందుకో ఆగిపోయిందామె.

ఆమె తలను ప్రక్కకు తిప్పి అల్లంతదూరంలో వున్న వీధివంక చూడటాన్ని గమనించి తనుకూడా అటుకేసి చూశాడు శ్రీధరుడు.

పాదరక్షలు కూడా లేకుండా పడిపడి వచ్చింది ఒక పదునారేండ్ల బాలిక... బ్రాహ్మణుడి భార్యను చూసి బావురుమని ఏడుస్తూ ఆమె గుండెలమీద వాలిపోయింది.

ఆమె ఎవరో, ఎందుకలా రోదిస్తున్నదో తెలుసుకోవాలన్న కోరికతో రెండు అడుగులు ముందుకు వేశాడు.

అంతలోనే ఆ ఇంటిద్వారంలో ప్రత్యక్షం అయ్యాడు బ్రాహ్మణుడు. తన చేతిలో వున్న కర్పూరహారతిని అతనికి, హేమసుందరికి చూపించాడు.

వెక్కి వెక్కి ఏడుస్తున్న బాలికను బలవంతంగా తన గుండెలనుండి విడదీసి, ఆ హారతిని కనులకు అద్దింది బ్రాహ్మణుడి భార్య. పమిటచెంగుతో ముఖాన్ని తుడుస్తూ లోపలికి తీసుకుపోయింది.

"కావేటిరంగని కృపాకటాక్ష వీక్షణాల ఫలితంగా నాకు కలిగిన బిడ్డ... పేరు తులసి. ఇక్కడికి నాలుగు యోజనాల దూరంలో వుండే వైకుంఠపురం ఆమె అత్తవారి ఊరు" ఆ బాలికను గురించి చెబుతూ అతిథులను లోపలికి ఆహ్వానించాడు బ్రాహ్మణుడు.

ఇంటి మధ్యభాగంలో రెండు చాపలు పరిచింది బ్రాహ్మణుడి భార్య. విరిగిపోవటానికి సిద్ధంగా వున్న రెండు చెక్కపీటలను వేసి, మర్రి ఆకుల విస్తళ్ళను ఆ పీటలమీద వుంచింది.

"కాలాతీతమైంది. భోజనాలు చేసి ప్రయాణ బడలిక తీరేవరకూ హాయిగా విశ్రాంతి తీసుకోండి" పక్కనే కూర్చుని తాటియాకుల విసనకర్రతో విసురుతూ మృదుస్వరంతో చెప్పాడు బ్రాహ్మణుడు.

సెగలు వెలువరిస్తున్న వరి అన్నము, పెరటితోటలో కాసిన సొరకాయ కూర తప్ప మరే యితర పదార్థాలు లేని అతి సామాన్యమైన భోజనం అది.

ఆదరణతో నిండిన ఆ బ్రాహ్మణుడి మాటల వల్లనో, మరే యితర కారణాల వల్లనో అమృతతుల్యంగా అనిపించింది శ్రీధరుడికి.

మారు వడ్డించమని అడగబోతున్న అతన్ని కనులతోనే వారించింది హేమసుందరి. బ్రాహ్మణుడు చూడకుండా తల అడ్డంగా తిప్పింది.

తన తెలివిక్కువతనానికి సిగ్గుపడుతూ,తృప్తి కలిగినట్లు పెద్దగా త్రేన్చాడు శ్రీధరుడు.

ఇంటివెనుక భాగంలో వున్న నీటితొట్టి దగ్గిర చేయి కడుగుకుని వృషభ శకటం దగ్గిరికి వచ్చేశాడు.

తనను చూసి తలలు వూపుతున్న వృషభాలను ఆప్యాయంగా పలుకరించి, శకటం అడుగుభాగంలో వున్న అమరికలో మేనువాల్చాడు. వెంటనే వచ్చి అతన్ని ఆవరించుకున్నది నిద్రాదేవత. ఒక ఘడియకాలం గడిచిన తర్వాత అతన్ని నిద్రలేపింది హేమసుందరి.

"వైకుంఠపురంలో పౌరోహిత్యం చేసి పొట్టపోసుకునే ఒక బాహ్మణుడికి యిచ్చి వివాహం చేశారు వీళ్ళు తమబిడ్డని. కట్నకానుకల విషయంలో ఏదో తేడా వచ్చి పుట్టింటికి తరిమినట్లు అగుపిస్తోంది" అతని చెవిదగ్గిర నోరుపెట్టి రహస్యంగా చెప్పింది.

స్త్రీ సహజమైన కుతూహలంతో ఆమె సేకరించిన విషయాల్ని విని బద్ధకంగా ఆవలించాడు శ్రీధరుడు. పక్కకు వత్తిగిల్ల కనులు మూసుకోబోతుండగా, భుజాన్ని మరింత గట్టిగా అదిమిందామె.

"శబ్దం చేయకుండా వెళ్ళి వాళ్ళ సంభాషణను ఆలకించు... త్వరగా వెళ్ళు" చనువుగా ఏకవచనంతో సంబోధిస్తూ తొందర పెట్టింది.

చాటుమాటన నిలబడి ఇతరుల సంభాషణల్ని ఆలకించటం తనకు ఇష్టం లేకపోయినా, ఆమె మరీ మరీ బలవంతం చేయటంతో, అమరికలో నుంచి లేచి ఇవతలికి వచ్చాడు శ్రీధరుడు.

బ్రాహ్మణుడి ఇంటికి ఎడమచేతివైపున వున్న ఒక పున్నాగవృక్షం క్రింద నిలబడి చెవులు రిక్కించాడు.

ఇంటి మధ్యభాగంలో కూర్చుని వున్నారు బ్రాహ్మణుడు, అతని భార్య. వారు అగుపించకపోయినా, వారిమాటలు స్పష్టంగానే అతని చెవులకు చేరుతున్నాయి.

తమబిడ్డకు పట్టిన గతిని తలచుకొని అదేపనిగా దుఃఖిస్తున్నది బ్రాహ్మణుడి భార్య.

"యాయవారం చేస్తే తప్ప పూట గడవని నిరుపేదలమని తెలిసికూడా గౌంతెమ్మకోరికలు కోరితే ఎలా? ఇప్పుడు ఏంచేస్తే మన బిడ్డ బ్రతుకు నాశనం కాకుండా వుంటుంది?" అని వాపోతున్న భార్యను అనునయించటానికి శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నాడు బ్రాహ్మణుడు.

"అన్యాయం న్యాయం అనేమాటలు తనకు అనవసరమని అంటోంది మా అత్తయ్య. ఇంకో నాలుగురోజుల్లో జరుగబోయే గ్రామదేవత కళ్యాణోత్సవాల సమయంలో తమ ఇంటికి చుట్టాలు వస్తారట... వచ్చిన వారందరికీ సేవలు చేసేందుకు సేవకులు కావాలిట..."

కట్నకానుకలు ఇవ్వలేకపోయినా, కనీసం ఉత్సవాలు జరిగే సమయంలో ఇద్దరు సేవకులనైనా పంపించమని మీతో చెప్పమన్నది. సేవకులను

తీసుకురాకుండా ఇంటిగడప తొక్కవద్దని అన్నది" గద్గద స్వరంతో తండ్రికి తెలియచేసింది బ్రాహ్మణుడి కుమార్తె.

"అనుకోని విధంగా అరుగుదెంచిన ఇద్దరు అతిథులకు కడుపునిండా భోజనం పెట్టలేని హీనస్థితి మనది.. పూటకు గతిలేని మనం సేవకులు ఇద్దర్ని ఎలా పంపించగలం...?" వృధాభరిత స్వరంతో ప్రశ్నించాడు బ్రాహ్మణుడు.

"తను చెప్పినట్లు చేయకపోతే నన్ను యిక రానీయరు... తన కొడుక్కు ఇంకోపిల్లను చూసి వివాహం చేస్తారట.." అంటున్న బిడ్డను కౌగిలించుకుని మరింత పెద్దగా శోకించటం మొదలు పెట్టింది బ్రాహ్మణుడి భార్య.

ఆపైన అక్కడ నిలువలేకపోయాడు శ్రీధరుడు. తులసి అత్తవారి ఇంటికి అప్పటికప్పుడు బయలుదేరి ఆమె అత్తమామల అంతు చూడాలన్నంత క్రోధం అతన్ని ఆవరించుకుంది.

లక్షాధికారులు, కోటీశ్వరులు, మడిమర్యాదలు కలిగియుండే ధనవంతులు తప్ప ఆరణపు దాసదాసీలను ఆడబిడ్డల వెంట అత్తవారింటికి పంపే ఆచారం మరెవ్వరిలోను లేదు. పౌరోహిత్యం చేసి బ్రతికే సాధారణ వ్యక్తి తమ తాహతుకు మించిన కోరికలు కోరటం సమర్థనీయమా?

పెదవివిప్పి చెప్పకపోయినా, అతని అంతరంగంలో మెదలుతున్న మాటల్ని తేలికగా అర్థం చేసుకున్నది వృషభశకటం దగ్గిర వున్న హేమసుందరి.

"బలప్రయోగంతో తులసి కాపురం చక్కబడదు. ఆడబిడ్డను ప్రసవించటం కంటే గొడ్రాలిగా మిగిలిపోవటమే మంచిదనే మాట వీరి విషయంలో యథార్థమని తేలుతున్నది" అతని భుజంమీద చేయివేస్తూ అనునయంగా అన్నది.

ప్రయాణభారంతో డస్సిపోయివున్న తమను ప్రేమతో ఆదరించి ఆతిథ్యం ఇచ్చిన ఆ బ్రాహ్మణ కుటుంబానికి వచ్చిన ఇబ్బందిని తలుచుకున్న కొద్దీ అధికం కాసాగింది శ్రీధరుడి హృదయ వేదన.

"వీరి కష్టాన్ని చూస్తూ చేతకానివాడిలా నిలబడిపోవటం నాకు నచ్చటం లేదు. వీరికి మనం సహాయపడలేనప్పుడు యిక్కడ వుండటం అనవసరం. ఈ రాత్రికి వూరిబయట కాలక్షేపం చేద్దాం. సూర్యోదయం అవగానే మనదారిన వెళ్ళిపోదాం" తలల్ని వంచి తన చేతుల్ని గోరాడుతున్న వృషభాలను ముద్దు చేస్తూ తన నిర్ణయాన్ని వినిపించాడు.

ఎదురు చెప్పకుండా అందుకు అంగీకరించవలసిన హేమసుందరి, ఆ మాటలు తనకు నచ్చనట్లు నొసలు విరవటంతో ఆశ్చర్యం కలిగింది అతనికి.

"ముక్కూ మొగం తెలియని మనల్ని ఆదరించి ఆతథ్యం యిచ్చిన ఈ బ్రాహ్మణుడికి సహాయం చేయాలి..." అంటున్న ఆమె మాటల్ని ఆలకించేసరికి మరింత అధికం అయిందా ఆశ్చర్యం.

వృషభశకటంలో వరిగడ్డి మాటున దాచివుంచిన తన నాణేలమూటను తీసి అతని ముందుంచింది హేమసుందరి. మాటలతో చెప్పవలసిన అవసరం లేకుండానే ఆమె అభిప్రాయాన్ని అవగతం చేసుకుని చిన్నగా నవ్వాడు శ్రీధరుడు.

"ఆడపిల్ల వెంట అత్తవారింటికి అరణపు దాసదాసీలను పంపించటం మాటలు కాదు. పనిచేయవలసింది పది పదిహేను దినములే అయినా,పంపించిన వారిని జీవితకాలమంతా పోషించవలసిన బాధ్యత ఈ బ్రాహ్మణుడి మీద పడుతుంది. నువ్వు ఇవ్వజూపుతున్న ధనం అందుకు సరిపోతుందా?" అంటూ

తులసి అత్తవారు కోరిన కోరికలోని అసహజత్వాన్ని ఆమెకనులకు కట్టేటట్లు వివరించాడు.

అంతదూరం ఆలోచించలేక పోయినందుకు నొచ్చుకున్నది హేమసుందరి.

తను అనుకున్న పనికి మొదటిలోనే అడ్డంకి ఎదురయ్యేసరికి చిన్నబోయింది ఆమె వదనం.

"అయితే మనం వీరికి సహాయం చేయలేమా? అభంశుభం తెలియని ఆ బిడ్డబ్రతుకు అన్యాయం కాకుండా ఆపలేమా?" చెమ్మగిల్లిన కనుల్ని ఎత్తి అతని ముఖంలోకి చూస్తూ అడిగింది.

"అందుకు ఒక్కటే మార్గం వున్నట్టు నాకు గోచరిస్తున్నది..." తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు ముఖంపెడుతూ అన్నాడతను.

ప్రాణం లేచివచ్చినట్లు అనిపించింది కాబోలు "ఏమిటది? ఏమిటా మార్గం?" ఆత్రుత నిండిన కంఠంతో అడిగిందామె.

"రేపు చీకటిపడే వేళలో వైకుంఠపురాన్ని చేరుకుని, ధనదుపురంలోని సేనాపతుల వారి కుమారుడికి పట్టిన గతినే తులసి అత్తమామలకు పట్టించటం, ఈ సమస్యకు సరైనటువంటి పరిష్కారం. తాహతు మించిన కోరికలు కోరకుండా అడ్డుకోగలిగే మార్గం బలప్రయోగం ఒక్కటే..."

అతనేదో గొప్ప ఆలోచన చెపుతాడని ఆశించి ఆత్రుతగా ఎదురు చూసింది హేమసుందరి.

అతని మాటల్ని పూర్తిగా ఆలకించేసరికి కోపంతో కందిపోయింది ఆమె వదనం.

"ఎప్పుడు చూసినా ఎవరినో ఒకరిని హింసించాలనే ఆలోచన తప్ప మరోమాట నీ మనసులో మెదలదు" అంటూ ముఖాన్ని పక్కకు తిప్పుకున్నది.

కోపం ఆమె అందాన్ని రెట్టింపు చేస్తున్నదని అనబోయి, ఆ మాటలు ఆమెను మరింత రెచ్చగొడతాయేమోనన్న భయంతో చిన్నగా నవ్వి, మౌనంగా వుండిపోయాడు అతను.

నాలుగు నిమిషాలు కూడా గడవకముందే తగ్గిపోయింది హేమసుందరి కోపం.

"ఈ కుటుంబానికి ఎంతోకొంత సహాయం చేయాలని నాకు అన్పిస్తోంది. బలప్రయోగపు మాటల్ని మరిచిపోయి, ఏదైనా ఉపాయం చెప్పు" అని భుజంమీద చేయివేసి బ్రతిమాలుకున్నది.

ఆమె సామీప్యం తన హృదయంలో ఏదో అలజడిని రేపటం మొదలుపెట్టే సరికి, అత్యవసరమైన పని అప్పుడే గుర్తువచ్చినట్లు దూరంగా జరిగాడు శ్రీధరుడు. అతను పెదవివిప్పి మాట్లాడటం మొదలు పెట్టకముందే ఇంటి లోంచి బయటికి వచ్చి వారిని చూశాడు బ్రాహ్మణుడు.

"విశ్రాంతి తీసుకుంటూ వుంటారని అనుకుంటున్నాను. మా ఇంటి వాతావరణం మీకు అంత నచ్చినట్లుగా అగుపించడంలేదు.." చిరునవ్వు నవ్వుతూ వారిని పలుకరించాడు.

హృదయంలోని బాధను బలవంతంగా దిగమ్రింగుకుని అతను అంత స్వచ్ఛంగా ఎలా నవ్వగలుగుతున్నాడో శ్రీధరుడికి అంతుబట్టలేదు.

"భోజనం అయిన తర్వాత ఎంతోసేపు విశ్రాంతి తీసుకోలేదనేమాట వాస్తవమే...మీరు మీ సహధర్మచారిణితో ఏదో ఇబ్బందిని గురించి తర్జన భర్జన

పడుతున్నట్లు అనిపించి ఇక్కడే నిలబడిపోయాము..." సాధ్యమైనంత మృదువుగా అతని పరిస్థితిని గురించి సంభాషణ ప్రారంభించటానికి ప్రయత్నించాడు.

మనసు విప్పి తన బిడ్డకు ఎదురైన కష్టాన్ని గురించి చెప్పకుంటాడని ఎదురు చూసిన శ్రీధరుడిని ఆశాభంగమే కలిగింది.

గాఢంగా నిట్టూర్చి ఆకసంవైపు చూశాడతను.

"ఆ కావేటిరంగని నమ్ముకుని జీవితాన్ని వెళ్ళదీస్తున్నాము మేము. నీట ముంచినా పాలముంచినా ఆ రంగడిదే భారం..." ముక్తసరిగా చెపుతూ వెనుతిరిగాడు ఇంటిలోకి వెళ్ళిపోవటానికి.

పురుషప్రయత్నం అనేమాటను గురించి ఆలోచించకుండా బాధ్యతల నన్నిటినీ భగవంతుడిమీదే నెడుతున్న ఆ బ్రాహ్మణుడిని వెనక్కి తిప్పి పరుషంగా మాట్లాడాలని అనిపించింది శ్రీధరుడికి.

తులసికి వచ్చిన కష్టాన్ని ఆ గ్రామంలోని పెద్దలందరికీ తెలియజేసి వారిద్వారా ఏదో ఒక పరిష్కార మార్గాన్ని ఎన్నుకోకుండా,కావేటిరంగని పేరుమీద చేతులు ముడుచుకుని కూర్చోవటం సబబా?

మాట్లాడకుండా వుంటే శ్రీధరుడు ఆ బ్రాహ్మణుడితో వాదించటం మొదలు పెడతాడని అనుమానం కలిగింది కాబోలు, చటుక్కున అతన్ని పట్టుకుని వెనక్కి లాగింది హేమసుందరి.

"మనం వెంటనే ఇక్కడినుంచి వెళ్ళిపోతున్నాం...శకటాన్ని సిద్ధం చేయి నేను ఇంటిలోని వారికి చెప్పి వస్తాను" అంటూ అతనికి ఒకపనిని పురమాయించి, బ్రాహ్మణుడి వెనుకనే లోపలికి వెళ్ళింది.

బ్రాహ్మణుడి ఇల్లాలికి, వారి బిడ్డ తులసికి వీడ్కోలు పలికి ఆమె వెలుపలికి వచ్చే సమయానికి వృషభాలను పూన్చి శకటాన్ని సిద్ధం చేశాడు శ్రీధరుడు. ఆశీర్వాద పూర్వకంగా దక్షిణహస్తాన్ని ఎత్తిన ఆ బ్రాహ్మణోత్తముడికి నమస్కరించి ముందుకు కదిలించాడు.

పొలిమేరలను అధిగమించి తరళాపురి మార్గంవైపు శకటాన్ని మరల్చబోతున్న సమయంలో అతన్ని నిలవరించింది హేమసుందరి.

"తరళాపురికి కాదు ఇప్పుడు మనం పోవల్సింది...వైకుంఠపురానికి" అతని పక్కనే సర్దుకుని కూర్చుంటూ వెల్లడించింది.

ఆశ్చర్యంతో నోటమాట రాక ఆమెవంకే చూస్తూ వుండిపోయాడు శ్రీధరుడు.

"తులసికి వచ్చిన కష్టం తీరాలంటే వైకుంఠపురంలోని గ్రామదేవత ఉత్సవం పూర్తి అయ్యేటంతవరకూ ఆమె అత్తవారింట పనిచేయటానికి అరణపు దాసీలు కావాలి... బయటివారిని పిలిస్తే జీవితకాలమంతా పోషించవలసి వస్తుందని నువ్వు అనన్నావు...అవునా ?" అతని భావాలతో తనకు ఏ మాత్రం నిమిత్తం లేనట్లు అడిగింది హేమసుందరి.

ఆమె ఆలోచన ఏమిటో అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ తలవూపాడు శ్రీధరుడు.

"అరణపు దాసీగా నేను వెళ్ళి తులసి అత్తవారింట పనిచేస్తాను...అవసరం తీరిన వెంటనే నా దారిన నేను వెళ్ళిపోతాను" నిక్కచ్చిగా తన నిర్ణయాన్ని అతనికి వినిపించి, ఇక ఆ విషయంలో ఎటువంటి వాదనా చేయటం తనకు ఇష్టంలేనట్లు ముఖాన్ని పక్కకు తిప్పేసుకున్నది ఆమె.

సముద్రపు లోతును, స్త్రీ హృదయాన్ని అంచనా వేయటం అసంభవమనే మాట ఒకటి గుర్తుకువచ్చి ఎదురు చెప్పకుండా శకటాన్ని వైకుంఠపురం వైపు నడిపించాడు శ్రీధరుడు.

కొంత విరామం లభించివున్నందు వల్ల ఉత్సాహంగా అడుగులు వేశాయి వృషభాలు. చీకటి పడుబోతున్న సమయంలో వైకుంఠపురాన్ని చేరుకున్నాయి. గ్రామమధ్యంలో వున్న గ్రామదేవత ఆలయం దగ్గిర తులసి అత్తవారిని గురించి విచారించి మరో పావుఘడియ తరువాత, ఒక మధ్యరకపు పెంకుటింటి ముందు శకటాన్ని ఆపాడు శ్రీధరుడు.

ముఖద్వారం ముందు నిలబడి అసురసంధ్య సమయమని కూడా చూసుకోకుండా ఇరుగు పొరుగమ్మలతో ముచ్చట్లాడుతున్నది ఒక లావుపాటి మధ్యవయస్కురాలు. తమ వాకిటిముందు ఆగిన శకటాన్ని చూసి ప్రశ్నార్థకంగా నొసలు విరిచిందామె.

తన ఒంటిమీద ఆభరణాలన్నింటినీ మూటగా కట్టి ధనపు సంచీతోపాటు శకటంలోని గడ్డిక్రింద దాచిపెట్టింది హేమసుందరి. బండిమీదినుంచి దిగి ఆమెకు వినయంగా నమస్కరించింది.

"ఎవరు మీరు? ఎవరు కావాలి మీకు?" వేళకాని వేళలో ఆతిథ్యం ఇవ్వమని అడుగుతారేమోనని అనిపించింది కాబోలు, దురుసుగా ప్రశ్నించింది తులసి అత్తగారు.

"మీ కోడలిగారి పుట్టింటినించి వచ్చాను. ఉత్సవ సమయంలో మీకు చేదోడు వాదోడుగా వుండమని నన్ను పంపించారు" తానెవరో విడమరిచి చెపుతూ, ఒకపక్కగా అగుపించిన చీపురును తీసుకుని, వీధివాకిలిని శుభ్రం

చేయటం మొదలు పెట్టింది హేమసుందరి. ఆమె వూహించని విధంగా తనను కూడా ఒక సేవకుడికింద మార్చుకున్నాడు శ్రీధరుడు.

శకటాన్ని ఒకపక్కగా నిలిపి, వృషభాలను చక్రాలకు కట్టివేశాడు. పరాయి ఇళ్ళల్లో మగపనివారు చేయవలసిన పనులను గురించి తనకు పూర్తిగా తెలిసినట్లు ఇంటి వెనుక భాగంలోని బావిదగ్గిరికి వెళ్ళాడు.

ఆశ్చర్యం నిండిన కనులతో అదేపనిగా చూస్తున్న ఇరుగమ్మల వంక సగర్వంగా చూసి ఇంటిలోకి వెళ్ళిపోయింది తులసి అత్తగారు.

బావిచెంతన వున్న పెద్ద పెద్ద నీటితొట్టెలు రెండింటినిండా నీటిని తోడిపోశాడు శ్రీధరుడు.

వీధివాకిలిని శుభ్రంచేసి నీరు చల్లింది హేమసుందరి. సంధ్య ముగ్గులతో వాకిలిని సింగారించి లోపలికి వచ్చింది. "మేము తీసుకువచ్చిన శకటంలో రేపు మీ కుమారులవారిని శూరమంగళం పంపించండి... మా అమ్మాయిగారిని వెంటబెట్టుకు రమ్మని చెప్పండి" అని తులసి అత్తగారికి సలహా ఇస్తూ, వంటింటి గుమ్మంలో నిలబడింది.

అంటు కాబట్టి ఆమెను లోపలికి రానీయలేదు తులసి అత్తగారు. అంట్ల గిన్నెలను, పాత్రలను తెచ్చి గుమ్మం అవతల పడవేసింది.

"శుభ్రంగా తోమి పసుపునీటిని జల్లాలి... శుభ్రత నాకు ముఖ్యం" సేవకుల చేత సేవలు చేయించుకోవటానికి అలవాటు పడివున్నదానిలా అధికారయుత మైన కంఠంతో ఆదేశించింది.

"గూట్లో దీపం వెలిగించగానే నోటిలో ముద్దపెట్టుకోవటం మాకు బాగా అలవాటు... ఎక్కడా ఆగకుండా ప్రయాణం చేయటంవల్ల ఆకలి బాగా వేస్తోంది.

త్వరగా వంట చేయండి తల్లీ..." బావికి ఆవలివైపున వున్న కట్టెపేళ్ళ గుట్టలను చక్కగా సర్దిపెడుతూ బిగ్గరగా ఆమెకు చెప్పాడు శ్రీధరుడు.

ఆ మాటలకు పెద్దావిడ నొచ్చుకుంటుందేమోనని భయపడింది హేమసుందరి.

"పిలవని పేరంటం మాదిరి వచ్చినవాడివి, వంచిన తల ఎత్తకుండా పని చేసుకోక ఆ వెర్రిఅరుపులు దేనికి?" కోపంగా చూస్తూ శ్రీధరుడిని అడిగింది.

అధికంగా శ్రమపడటంవల్ల ఆమె ముఖంమీద ప్రత్యక్షం అయివున్న స్వేద బిందువుల్ని చూస్తూ చిన్నగా నవ్వాడు శ్రీధరుడు.

"నీకు నేను ముందుగానే చెపుతున్నాను... నీ మూలకంగా ఇక్కడ ఏదైనా అల్లరి జరిగితే మాత్రం నేను సహించను..." తర్జనతో అతన్ని బెదిరిస్తూ వంటపాత్రలను శుభ్రం చేసేందుకు ఉద్యుక్తురాలైంది హేమసుందరి.

పుట్టి బుద్ధెరిగిన తరువాత నృత్యం చేయటం తప్ప మరో శారీరక శ్రమ ఏదీ చేయటం ఎరుగని ఆమెకు కాస్తంత కష్టమనే అనిపించింది ఆ పని.

పావుఘడియ గడిచిన తరువాత ముంచుకురానే వచ్చింది ప్రమాదం. వంట ఇంటిలో నుంచి బయటికి తొంగిచూసి ముక్కుమీద వేలు వేసుకున్నది తులసి అత్తగారు.

"పని చేయటానికి వచ్చావా లేక మా ఇంటిలో పడి తేరగా భోజనం ఆరగించటానికి వచ్చావా? రెండు విఘడియల్లో పూర్తికావాల్సిన పనిని మూడు ఘడియలు గడిచినా పూర్తిచేయకపోవటంలో నీ ఉద్దేశ్యం ఏమిటి?" గ్రామదేవత ఉత్సవాల్లో వుపయోగించే కొమ్ముబూరా మాదిరి వికృతస్వరంతో నోటికి వచ్చినట్లు

మాట్లాడింది. ఆమె అంత దురుసుగా మాట్లాడుతుందని అనుకోలేదు హేమసుందరి. చేస్తున్న పనిని ఆపి అలాగే చూస్తూ వుండిపోయింది.

"గట్టుమీది గంగానమ్మలా అలా గుడ్లప్పగించి చూస్తావేమిటే? పని పూర్తిచేసే ఆలోచన వున్నదా లేదా?"భూతం మాదిరి విరుచుకు పడుతున్న తులసి అత్తగారిని వెంటనే సముదాయించాడు అంతవరకూ మౌనంగా నిలబడిన శ్రీధరుడు.

"కొత్త ప్రదేశం కావటంవల్ల పనిలో వేగం కనిపించటంలేదు....ఇంట్లో సంధ్యదీపాలు వెలిగించి మీరు సిద్ధకండి తల్లీ.... చిటికెలో దగ్గిరవుండి పూర్తి చేయిస్తాను ఈ పనిని..." అంటూ హేమసుందరిని పక్కకు జరగమని సైగచేశాడు.

అరవీర భయంకరులని పేరుపొందిన ధనదుపుర రక్షకభటుల్ని, రాజభటుల్ని నగరమంతా పరుగులు తీయించిన ఆ యువకుడు తన జీవితమంతా వంటపాత్రలను శుభ్రం చేయటంలోనే గడిపినట్లు పదినిమిషాల్లో పని పూర్తిచేయటాన్ని గమనించి ఆశ్చర్య చకితురాలైంది హేమసుందరి.

విపణి వీధినుంచి అప్పుడే బేరమాడి తీసుకువచ్చిన కొత్తపాత్రల మాదిరి తళతళ మెరిసిపోతున్న వంటగిన్నెలన్నిటిని గుమ్మం ముందు వరుసలో పేర్చి యజమానురాలిని పిలిచాడు శ్రీధరుడు.

"పసుపునీళ్ళు జల్లుకొని మైల ఏమైనా వుంటే తొలగించుకోండి" అని హెచ్చరిస్తూ ఇంటి ముందుభాగంలోకి వెళ్ళాడు.

ఆ ఊరికి చివరిభాగంలో వుండే ఒక గృహస్థు ఇంటికి ఏదో శుభకార్యం జరిపించటం కోసం వెళ్ళి అప్పుడే తిరిగివచ్చారు ఇంటి యజమాని, అతని కుమార రత్నం.

వినయవిధేయతలతో తమకు స్వాగతం చెప్పిన యువకమూర్తిని చూస్తూ విస్తుబోయారు వారిద్దరూ.

తనెవరో, అక్కడికి ఎందుకు వచ్చాడో ముక్తసరి మాటలతో వారికి చెప్పాడు శ్రీధరుడు.

వారి భుజాలమీద వున్న తండువాల మూటల్ని ఇంటిలోకి చేర్చాడు. పాదప్రక్షాళనకు నీరు అందించాడు. స్వయంగా తడి అద్ది నులకమంచాలమీద కూర్చుండజేశాడు. వంట యింటిలో వున్న యజమానురాలిని హెచ్చరించి మంచితీర్థం ఇప్పించాడు.

"ఇటువంటి సమర్థుడైన సేవకుడిని పంపించగలిగి వుండికూడా, ఇంత వరకూ బీదఅరుపులు అరిచిన మీ వియ్యంకుడిని క్షమించకూడదు... బుద్ధిచెప్పి తీరాల్సిందే..." లోగొంతుతో తన అక్కసు వెడలగ్రక్కింది తులసి అత్తగారు.

ఉన్న నాలుకకు ముందువేస్తే కొండనాలుక ఎగిరిపోయినట్లు, తన వినయ విధేయతలు తులసి తండ్రికి మరిన్ని బాధలు తెచ్చి పెట్టబోతున్నట్లు అర్థమై, అప్రయత్నంగా పిడికిళ్ళు బిగించి, అంతలోనే తనను తాను సముదాయించుకున్నాడు శ్రీధరుడు.

"అలసిపోయి వచ్చిన మీరు మాటలతో కాలక్షేపం చేస్తూ కూర్చోకండి. రేపు మా అమ్మాయిగారిని తీసుకురావాలి... సూర్యోదయం కాకముందే మనం ప్రయాణం అవ్వాలి..." అంటూ వారిని హెచ్చరించాడు.

"అందుకు గ్రామంలో అడిగి వేరెవ్వరినో శకటాన్ని నడిపేందుకు పిలిపిస్తాము. నువ్వు వెళ్ళటానికి వీలుపడదు, నీకు చేతినిండా పని వున్నది" నిర్మొహమాటంగా అతనికి చెప్పింది తులసి అత్తగారు.

బరువైన బరిశెల్ని, పదునైన కరవాలాన్ని ఉపయోగించి ఉపయోగించి కాయలు కాచివున్న తన హస్తాలతో ఆమెనోటిని అదిమితే ఎలా వుంటుందో అని ఆలోచిస్తున్న శ్రీధరుడి వెన్నుతట్టింది హేమసుందరి.

తన ఆలోచనల్ని తనలోనే అదుముకుంటూ, వృషభశకటం దగ్గిరికి వెళ్ళాడు శ్రీధరుడు.

తలను వంచి తనగుండెల్ని ఆబగా తడమటం మొదలు పెట్టిన వృషభాల కట్లువిప్పి బావిదగ్గిరికి తీసుకుపోయి నీరుపెట్టాడు... వరిగడ్డి పరకలతో వాటి శరీరాలను తుడిచి శకటం దగ్గిరికి తీసుకువచ్చాడు. పెంపుడు జంతువుల మాదిరి అతని వెనుకే ఆనందంగా అడుగులు వేస్తున్న ఆ వృషభాలను చూసి మెచ్చుకోలుగా తలవూపింది హేమసుందరి.

అర్థఘడియ తరువాత వారిద్దరికీ ఇంటివెనుక విస్తళ్ళు వేసి భోజనం పెట్టింది తులసి అత్తగారు.

"మీ చేతివంట అద్భుతం తల్లీ.... ఇటువంటి వంటకాల్ని, ఇంతవరకూ నేను రుచి చూడలేదు..."అని మెచ్చుకుంటూ ఆరగించాడు శ్రీధరుడు.

చూస్తూ చూస్తూ వండగానే నలుగురు తినవలసిన ఆహారాన్ని తనొక్కడే తిని, ఇంకా తనకు చాలదన్నట్లు ముఖంపెట్టాడు.

అంతకుముందు తులసి తండ్రిగారి ఇంటిలో అతన్ని హెచ్చరించిన కనులతోనే సైగల చేసింది హేమసుందరి. అతను పట్టించుకోకపోవడంతో చేతిని జాచి అతని తొడను గట్టిగా గిచ్చింది.

అయినాసరే ఆగలేదు శ్రీధరుడు.

"బండెడు చాకిరీ చేయించుకొని కడుపునిండా తిండి పెట్టడానికి బాధ పడుతూ వుంటారు అనేకమంది. సేవ చేసేవారికి తిండిపెట్టడం చేతకానివారికి సేవకులు ఎందుకో నాకు అర్థంకాదు.

మన తులసమ్మ ఇల్లు అటువంటిది కాకపోవటం నిజంగా మన అదృష్టం..." ఖాళీ అయిన పాత్రలవంకా తనవంకా మార్చి మార్చి చూస్తున్న తులసి అత్తగారికి వినిపించేటట్లు పెద్దకంఠంతో అన్నాడు.

వంటింటి అవతలి గుమ్మంలో నిలబడిన ఆ యింటి యజమానికి పరిస్థితి అర్థమైపోయింది. "అతని మాటల్లో అసత్యం ఏమీలేదు. చాకిరీ చేసినవారికి కడుపునిండా భోజనం పెట్టడం చేతకాలేదని ఊళ్ళో ఎవరికైనా తెలిసిందంటే మన పరువు మట్టికొట్టుకుపోతుంది... వెంటనే అతనికి ఏదో ఒక పదార్థాన్ని వడ్డించు..." లోగొంతుకతో భార్యను హెచ్చరించాడు.

వండిన పదార్థాలన్నీ అప్పటికే అయిపోవడం వల్ల, అటకమీద పిండి వంట పాత్రల్ని అతనిచేత కిందికి దింపించింది తులసి అత్తగారు.

తృప్తిగా ఆరగించి హాయిగా త్రేన్చాడు శ్రీధరుడు.

"పిండివంటలు చాలా బాగున్నాయి తల్లీ... మన వృషభాలకు కూడా రుచి చూపిస్తే సంతోషంగా మనకు సేవలు చేస్తాయి" అంటూ పట్టెడు వంటకాల్ని తీసుకుపోయి వృషభాలచేత తినిపించాడు.

తన చూపులకే గనుక మానవుల్ని మసిచేసే శక్తి వుండివుంటే, అతన్ని అప్పటికే అనేకసార్లు భస్మరాసిగా మార్చివుండేది తులసి అత్తగారు.

తనకు తన పెనిమిటికి, తన కుమారుడికి కూడా లేకుండా మొత్తం ఆహారాన్ని అతితేలికగా ఆరగించగలిగిన అతనికి బుద్ధి ఎలా చెప్పాలో ఆలోచిస్తూ,

ఖాళీ అయిన పాత్రలన్నిటినీ మరోసారి బయటపెట్టి శుభ్రం చేయమని అదేశించింది.

తమ విస్తళ్ళను పెరటితోటలో దూరంగా పడవేసి, గబగబా ఆ పాత్రల దగ్గిరికి పోబోతున్న హేమసుందరిని వారించి, ఇంకోసారి వాటిని మిలమిల మెరిసిపోయేటట్లు తోమాడు శ్రీధరుడు.

"కడుపునిండాక కొద్దిసేపైనా విశ్రాంతి తీసుకోవాలి. తీసుకోకుండా పనిలోకి దిగితే ఆహారం అతిత్వరగా జీర్ణమై తిరిగి ఆకలివేస్తుంది. అయ్యగారు భుజించాక ఏమైనా మిగిలితే నన్ను పిలవండి తల్లీ" అని హెచ్చరించి వృషభశకటం దగ్గరకి వచ్చాడు.

నోరు తెరిచి మరొక్కమాట మాట్లాడితే, సరాసరి వంట ఇంటిలోకి వచ్చి ఆహారపాత్రల దగ్గిరే కూర్చుంటాడని భయపడింది తులసి అత్తగారు.

శబ్దం కాకుండా వంటపని ముగించి తన భర్తకు, బిడ్డకు వడ్డించింది. తనుకూడా ఆరగించి నిశ్శబ్దంగా వంట ఇంటి తలుపుల్ని మూసివేసింది.

వృషభశకటపు ముందుభాగంలో మేనువాల్చిన శ్రీధరుడి పక్కనే కూర్చుని అతని ముఖంలోకి పరిశీలనగా చూసింది హేమసుందరి.

"నేను సృష్టిస్తున్న గందరగోళం మూలకంగా తులసికి ఎటువంటి యిబ్బందీ ఎదురుకాదు... ఆమె సుఖశాంతులతో కాపురం చేసుకోవాలనే నీ కోరికకు ఏ విఘ్నము కలుగదు... అనవసరమైన ఆలోచనలతో నీ మనసును కలత బెట్టుకోకు... హాయిగా నిద్రపో..." నోరు తెరిచి అడగకముందే ఆమె మనసులోని ప్రశ్నలకు సమాధానం యిచ్చేశాడతను.

అతని భుజంమీద చేయివేసి గట్టిగా అదిమింది హేమసుందరి. తన సంతోషాన్ని ప్రకటించేందుకు అంతకంటే ఇంకేం చేయాలో తెలియక. అతను తీసే కూనిరాగాల్ని ఆలకిస్తూ మరికొద్దిసేపు అక్కడే గడిపి శకటం వెనుక భాగంలోకి వెళ్ళి విశ్రమించింది.

వృషభాలను మరోసారి పరామర్శించి తనుకూడా నిద్దురకుపక్రమించాడు శ్రీధరుడు. రాక్షసుడి మాదిరిగా పనిచేయటం వల్ల చిటికెలో ఒళ్ళు తెలియకుండా పోయింది అతనికి. సూర్యోదయం కాకముందే నిదుర కనులను నులుముకుంటూ ఇంటిముందుకు వచ్చింది తులసి అత్తగారు.

అలసిపోయిన శ్రీధరుడు తెల్లవారేదాకా నిద్రలేవడని ఆమె ఉద్దేశ్యం. అరిచి కేకలు పెట్టి అతన్ని తీవ్రాతి తీవ్రంగా నిందించాలని ఆమె కోరిక...

అప్పటికే వాకిలిని శుభ్రంచేసి, కళ్ళాపి చల్లింది హేమసుందరి. మహారాజ భవనాలముందు తప్ప మరెక్కడా కనిపించనటువంటి అందమైన ముగ్గులతో వీధివాకిలిని అలంకరించింది.

"వంటపాత్రలు బయట పెట్టండమ్మా... నిద్రలేచిన మరుక్షణం ఆవురావు మంటూ తిండికి తయారవుతాడు... కడుపు నిండకపోతే ముందు నన్ను తినేస్తాడు. ఆ తరువాత మిమ్మల్ని..." తులసి అత్తగారివంక ఓరగా చూస్తూ నిద్రలేవగానే శ్రీధరుడు చేయబోయే పనుల్ని వివరంగా చెప్పింది.

బాసిపట్లు వేసుకుని శ్రీధరుడి భోజనం చేసిన పద్ధతి కనులముందు మెదలి విపరీతమైన ఆత్రుతకు గురి అయింది తులసి అత్తగారు. పరుగులాంటి నడకతో లోపలికి వెళ్ళిపోయింది.

ఆమె ఆందోళనను గమనించి చిరునవ్వు నవ్వుకుంటున్న హేమసుందరిని కౌగలించుకుని బుగ్గల్ని ముద్దాడాలన్న కోరికను అతిబలవంతంగా అదుముకుంటూ బండిలోనుంచి దిగాడు శ్రీధరుడు.

అదే సమయంలో ఉత్తరీయాన్ని భుజాలనిండా కప్పుకుంటూ ఇంటిముందు ప్రత్యక్షం అయ్యాడు తులసి మామగారు.

"పడమటి వీధిలో రత్నశ్రేష్ఠి భవంతి వుంటుంది. నువ్వు వెంటనే వెళ్ళి ఆయన నిద్రనుంచి మేల్కొనేవరకూ భవంతిముందు నిలబడు.

మేల్కొని ఆయన బయటికి వచ్చిన తరువాత నా మాటగా ఒక శకటచోదకుడిని పంపించమని అర్థించు...మీ అమ్మాయిగారిని నేనే వెంటబెట్టుకు వస్తాను" అని ఆదేశించాడు.

తను అక్కడ లేని సమయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించమని హేమసుందరికి సైగచేసి వీధిలోకి వచ్చాడు శ్రీధరుడు.

గ్రామదేవత కళ్యాణోత్సవాలు దగ్గిర పడుతూండటం వల్ల కాబోలు చుట్టాలతో, పక్కాలతో కళకళలాడిపోతున్నాయి గ్రామంలోని ఇళ్ళన్నీ.

నవ్వులతో, కేరింతలతో తెల్లవారకముందే యిళ్ళముందు గంతులు వేస్తున్నారు పిల్లలు.

ఠీవిగా అడుగులు వేస్తున్న శ్రీధరుడిని ఆపి యక్షప్రశ్నలు అనేకం వేశారు అనేకమంది గ్రామస్థులు.

"తండ్రీ కొడుకులు ఇద్దరూ కలిసి సంపాదించినా సుఖంగా బ్రతకటానికి వీలు కనిపించని పరిస్థితి... వియ్యంకుడ్ని బెదిరించి సేవకుల్ని పిలిపించుకోవటం

విచిత్రంగానే వున్నది..." మొహమాటం లేకుండా తమ అభిప్రాయాలను వెల్లడించారు వారిలో కొందరు.

ఉబికివస్తున్న దరహాసాన్ని బలవంతంగా అణిచిపెట్టుకుంటూ పడమటి వీధిలో రత్నశ్రేష్ఠి సౌధం ముందుకు వెళ్ళాడు శ్రీధరుడు. అక్కడ పనివారికి తనెవరో చెప్పుకుని శ్రేష్ఠిగారి కోసం ఒకపక్కగా నిలుచున్నాడు.

సూర్యోదయం అయిన అర్ధఘుడియకు సౌధంలో నుంచి బయటికి వచ్చి అతనికి దర్శనం యిచ్చాడు రత్నశ్రేష్ఠి.

అతని విన్నపాన్ని ఆలకించి విసుగునిండిన ముఖంతో ఒక సేవకుడిని అతనితో పంపించాడు.

గ్రామదేవత ఆలయంముందు నిలబడి భయభక్తులతో అమ్మావారికి దండంపెట్టుకున్నాడు ఆ సేవకుడు...

"అనుగ్రహిస్తే అన్ని కోరికల్ని తీరుస్తుంది ఈ తల్లి... ఆగ్రహం వచ్చిందంటే అధఃపాతాళానికి అణిచివేస్తుంది" నడుముమీద చేతులు వేసుకొని నిలబడిన శ్రీధరుడితో అన్నాడు.

ఆ గ్రామదేవత పేరేమిటో, ఆమె శక్తిసామర్థ్యాలు ఎటువంటివో అతని నోటివెంట వినాలని అనిపించింది శ్రీధరుడికి ... మాటలతో కాలక్షేపం చేస్తూ అక్కడే నిలబడితే తులసి మామగారికి ఆగ్రహం వస్తుందనే అనుమానం కలిగి, గబగబా తలవంచాడు... చేతులు జోడించి నమస్కరించబోతుండగా, ఆలయగోపురాన్ని అంతకుముందే ఎక్కడో చూసినట్లుగా అనిపించింది.

జ్ఞప్తికి తెచ్చుకునే ప్రయత్నంచేసే వ్యవధి అతనికి లభించలేదు. ఆ ఆలోచన అతనిలో అడుగుపెడుతున్న సమయంలోనే చెవులు చిల్లులు పడిపోయేటట్లు

ఆలయం వెనుకభాగంలో నుంచి అతని కర్ణేంద్రియాలకు సోకాయి పెద్ద పెద్ద అరుపులు.

ఉలికిపాటును కప్పిపెట్టుకుంటూ రత్నశ్రేష్టి సేవకుడితో సహా అతను ఆలయ వెనుకభాగంలోకి వెళ్ళేసరికి అగుపించింది పెద్ద గుంపు.

"చనిపోయాడు... రత్నశ్రేష్టి మనుమడు అమ్మవారి నూతిలోపడి ప్రాణాలు పోగొట్టుకున్నాడు..." ఆందోళన నిండిన కంఠంతో బిగ్గరగా అరుస్తున్నారు వారిలో అనేకమంది.

అడ్డుగా వున్న వారందర్నీ పక్కకు నెడుతూ ముందుకు పోయిన శ్రీధరుడికి అగుపించింది పాతాళలోకానికి దారితీసేటంత లోతుగా వున్న పెద్ద నూయి.

"వర్షాలు పడని నడి వేసవికాలంలో నాలుగు తాడిచెట్ల లోతు వుంటాయి నీళ్ళు. ఇప్పుడు ఎంత లోతుంటాయో చెప్పలేం. ఆకతాయి పిల్లలతో చేరి నూతిమీదికి ఎక్కాడు రత్నశ్రేష్టి మనుమడు... నీటిలోపడి చాలా సమయం అయింది."

నడుము ఎత్తువున్న అడ్డుగోడ దగ్గిర నిలబడి ఆందోళన నిండిన కంఠంతో అన్నాడు ఒక వృద్ధ గ్రామస్థుడు.

ఆ మాటల్ని ఆలకించిన మరుక్షణం శ్రీధరుడిని అక్కడే వదిలి తన యజమాని కోసం పరుగుతీశాడు రత్నశ్రేష్టి సేవకుడు.

ఆ అడ్డుగోడ అంచుమీద చేతులువేసి లోపలికి తొంగిచూడబోయిన శ్రీధరుడిని వెంటనే అడ్డుకున్నాడు అక్కడే వున్న మరో వృద్ధుడు.

"కళ్ళు తిరిగి లోపలికి పడ్డావంటే ప్రాణాలతో పైకి రాలేవు... నరబలిని కాంక్షించే నూయి ఇది... సంవత్సరానికి కనీసం ఒకరినైనా బలి తీసుకుని తీరుతుంది" అంటూ వెనక్కి లాగాడు.

ఎక్కడో అట్టడుగున అగుపిస్తున్న నీటిమీద ఏదో ఆకారం గిలగిలలాడుతున్నట్లు అనిపించింది శ్రీధరుడికి.

అనిపించిన తరువాత అందరి మాదిరిగా మాటలు చెవుతూ, కేకలు వేస్తూ నిలబడటం అతనికి చేతకాలేదు.

తన భుజాల్ని పట్టుకున్న వృద్ధుడి చేతుల్ని వదిలించుకుని, తనేం చేస్తున్నాడో అక్కడివారందరికీ అర్థం అయ్యేలోపుగా అడ్డుగోడ మీదికి ఎక్కేశాడు.

"అయ్యయ్యో! ఏమిటి ఈ అఘాయిత్యం? ఆగు నాయనా...ఆగు" ఆందోళన నిండిన కంఠంతో అరిచాడు అతన్ని ఆపిన ఆ వృద్ధుడు.

ఆ మాటలు తన చెవులకు చేరకముందే అమాంతంగా నూతిలోకి దుమికాడు శ్రీధరుడు.

కన్నుమూసి కన్ను తెరిచేటంతలో అట్టడుగుకుపోయి తండువాల మూట తాకినట్లు పెద్దశబ్దంతో నీటిని తాకాడు. ఊపిరి ఆగిపోయిన అనుభూతి కలిగింది అతనికి ఆ అదటు కారణంగా.

కనులు బైర్లుకమ్మి, మైకం ముంచుకు వస్తున్నట్లుగా కూడా అనిపించింది.

పళ్ళబిగువున ఆ బాధలన్నిటినీ భరిస్తూ నీటిలో మునిగాడు. చేతుల్ని వెడంగా జాచి నూయి లోపలిభాగాన్ని తడిమాడు.

రెండు నిముషాల అనంతరం అతని చేతులకు తగిలాడు స్పృహ కోల్పోయి నీటి అడుగుభాగానికి జారిపోతున్న రత్నశ్రేష్ఠి మనవడు.

జీవం లేనట్లు వ్రేలాడబడిపోయిన ఆ బుడతడిని ఎడమచేతితో గుండెలకు అదుముకుంటూ,అతివేగంగా పైకి వచ్చాడు శ్రీధరుడు.

అదేపనిగా నీటిని తాగటంవల్ల వుబ్బిపోయింది ఆ బిడ్డడి ఉదరం.

వెంటనే ఆ నీటిని వెడలగ్రక్కించి, గుండెలను గట్టిగా అదమకపోతే అతను జీవించటం అసంభవం.

ఆకాశంలోని చుక్కమాదిరి ఎంతోదూరంలో అగుపిస్తున్న నూయి పై భాగం వంక చూస్తూ తీవ్రమయిన ఆలోచనల్లో చిక్కుకుపోయాడు శ్రీధరుడు.

చేయివేస్తే జారిపోయేటంత నునుపుగా వున్నాయి నూతిగోడలు.

తనంతట తానుగా పైకి చేరుకునే ప్రయత్నం చేయటం కుదరదు.

గంగాళాలు మాదిరి నోళ్ళను తెరిచి గావుకేకలు పెట్టటం తప్ప, నూతిలో దూకిన మనిషికి ఏదో ఒకవిధంగా సాయపడాలనే ఆలోచన రావటంలేదు నూతిచుట్టూ గుమికూడి వున్న పౌరులకు.

ఆలస్యం జరిగేకొద్దీ తన చేతుల్లో వున్న బిడ్డడి పరిస్థితి విషమించి పోతుందేమోనన్న భయంతో తనుకూడా గొంతు చించుకుని కేకలు పెట్టాడు శ్రీధరుడు.

"త్రాటిని తీసుకువచ్చి లోపలికి వదలండి... ఏదయినా పొడుగాటి తాడును వెంటనే తీసుకురండి..." అంటూ పై భాగంలో గుమికూడిన వారిని హెచ్చరించాడు.

మరో పదిక్షణికాలు గడిచిన తరువాత కూడా వారు తన అరుపుల్ని అర్థం చేసుకున్న లక్షణాలను ప్రదర్శించకపోవడంతో ముంచుకు వచ్చేసింది అతనికి విపరీతమైన కోపం.

"ఈ బిడ్డిడికి ఏదైనా జరిగితే అందుకు మీరే బాధ్యులు అవుతారు. నేను పైకి వచ్చిన మరుక్షణం మీ అందరి అంతూ చూసి తీరతాను..." అని అంటూ, నునుపుగా వున్న గోడలమీద పట్టుచిక్కించుకునే ప్రయత్నం ప్రారంభించాడు.

అంతలోనే అతను ఎదురుచూడని విధంగా కాలసర్పం మాదిరి మెలికలు తిరుగుతూ వచ్చి అతనిమీద పడిందొక లావుపాటి చేంతాడు.

"చివరిభాగంలో వున్న వుచ్చుముడిని నీ నడుముకు బిగించుకో... త్వరగా... త్వరగా బిగించుకో..." నూతి లోపలికి వంగుతూ పెద్ద కంఠంతో అరిచాడు ఎవరో పుణ్యాత్ముడు.

ఒక్కక్షణం కూడా ఆలస్యం చేయకుండా ఆ త్రాటిని తన నడుముకు చుట్టుకుని రత్నశ్రేష్ఠి మనవడిని మరింత గట్టిగా గుండెలకు అదుముకున్నాడు శ్రీధరుడు.

ఎక్కడో నూయి అడుగుభాగంలో వున్న మనిషికి వినిపించేటంత బిగ్గరగా అరవగలగటమే కాదు, ఎంతటి బరువునైనా అవలీలగా పైకి చేదుకోగలిగిన బలాన్నికూడా కలిగి వున్నాడు, త్రాటిని నూతిలోకి వదిలిన పుణ్యాత్ముడు.

పదే పదిక్షణికాల్లో క్షేమంగా పై భాగంలోకి చేర్చాడు శ్రీధరుడిని.

తన గుండెలమీది బుడతడిని అందుకోబోయిన పౌరుల్ని తీక్షణ వీక్షణాలతో బెదిరించి దూరంగా నెట్టివేస్తూ,నూయిపక్కనే బండరాయిమీద బిడ్డను పరుండబెట్టాడు శ్రీధరుడు.

"వైద్యుడిని పిలిపించండి. ఇప్పటికైనా తెలివి తెచ్చుకుని మీ గ్రామవైద్యుడిని వెంటనే ఇక్కడకు తీసుకురండి" అని వారందర్నీ హెచ్చరిస్తూ బిడ్డడి ఉదరంలో చేరిన నీటిని వెడల గ్రక్కించాడు.

వనమూలికలున్న పేటికను గట్టిగా పట్టుకుని గ్రామవైద్యుడు ఆ ప్రదేశంలోకి వచ్చే సమయంలో కనులు తెరిచి చూశాడు రత్నశ్రేష్ఠి మనవడు.

తీవ్రమైన దుఃఖంతో తల్లడిల్లిపోతూ ఒకపక్కగా నిలబడివున్న రత్నశ్రేష్ఠికి అతన్ని అందించి, తమ చుట్టూ వున్న పౌరులవైపు తిరిగాడు శ్రీధరుడు.

"నూతిలోకి త్రాటిని వదిలి ఈ బిడ్డడికి ప్రాణదానం చేసిన పుణ్యాత్ముడు ఎవరు?" వారందరివంకా పరిశీలనగా చూస్తూ ప్రశ్నించాడు.

పదిక్షణాలు కాదుగదా, పదినిముషాలు గడిచినా లభించలేదు అతని ప్రశ్నకు సమాధానం.

అవసర సమయంలో త్రాటిని తీసుకువచ్చి నూతిలోని వారిని బయటికి లాగాలన్న ఆలోచన చేసింది ఎవరో ఎంత ఆలోచించినా అర్థంకాలేదు అక్కడి పౌరులకు.

ఒకరి ముఖాలు మరొకరు చూసుకుంటున్న ఆ పెద్దమనుషుల నందరినీ నోటికి వచ్చిన కఠినమయిన మాటలతో తీవ్రంగా నిందించాడు శ్రీధరుడు.

అలా చేయటంవల్ల తనకు ఆయాసం కలగటమే తప్ప, వారిలో ఎటువంటి మార్పు రాదని అర్థమై, మెల్లిగా ఇంటిదారి పట్టాడు.

రత్నశ్రేష్ఠికి తమ అవసరాన్ని వివరించి శకట చోదకుడితో అతను తిరిగి వస్తాడని, వచ్చిన వెంటనే ప్రయాణం ప్రారంభించవచ్చనీ అనుకుంటున్నాడు తులసి మామగారు.

అతను ఒంటరిగా రావటాన్ని గమనించేసరికి వచ్చేసింది ఆయనకు కోపం.

"అప్పచెప్పిన పనిని వదిలి వీధులవెంట వాహ్యాళికి వెళ్ళావా? అసలు నీ వుద్దేశ్యం ఏమిటి?" అతను చెప్పబోయిన మాటల్ని వినిపించుకోకుండా పెద్ద కంఠంతో నిందించటం మొదలు పెట్టాడు.

బావిదగ్గిర చేస్తున్న ఏదో పనిని సగంలోనే వదిలి ఇంటిముందుకు పరిగెత్తుకు వచ్చింది హేమసుందరి.

ఆమెను చూసేసరికి మరింత అధికం అయిపోయింది ఆ బ్రాహ్మణుడి కోపం.

"చెప్పిన పనిని చేయకుండా వీధులవెంట తిరిగివచ్చాడు ఇతడు...చేస్తున్న పనిని వదిలేసి వింత చూడటానికి వచ్చావు నువ్వు... మీ ఇద్దరూ పనిదొంగలు, మీకు తిండిపెట్టటం శుద్ధ దండగ... మీకంటే నోరు వాయి లేని ఆ పశువులే చాలా నయం" అంటూ రెచ్చిపోయాడు.

సరైన కారణం లేకుండా అతను తమను తిట్టిపోస్తున్నందుకు కించిత్తుకూడా బాధపడలేదు హేమసుందరి. ఆ మాటలకు కినిసి శ్రీధరుడు అతని మీదికి పోతాడని భయపడింది.

"అనవసరమైన నిందల్ని నెత్తిమీద వేసుకుని నేరస్థుడి మాదిరి నిలబడటం నీకు అలవాటైపోయినట్లు నాకు అనిపిస్తోంది. ఈయనకు ఇంత కోపం వచ్చే పని నువ్వు ఏం చేశావ్?" శ్రీధరుడి సమీపంలో నిలబడి అతనికి మాత్రమే వినిపించేటట్లు రహస్యంగా అడిగింది.

"ఊరివాళ్ళ సొమ్ములతో పండుగ చేసుకోవాలని అనుకునే ఈ పెద్దమనిషికి రత్నశ్రేష్ఠిని ఒప్పించి శకట చోదకుడిని తీసుకురాలేదని కోపం వచ్చింది. అపర కుబేరుడైన ఆ శ్రేష్ఠిని తిట్టే ధైర్యంలేక, నన్ను

ఆడిపోసుకుంటున్నాడు..." ఊబికి వస్తున్న నవ్వును అణిచి పెట్టుకోవటానికి విఫల ప్రయత్నం చేస్తూ చెప్పాడు శ్రీధరుడు.

గఁయ్ గఁయ్ మని కేకలు పెడుతున్న బ్రాహ్మణుడికి వినిపించలేదా మాటలు. వంట ఇంటిలోనుంచి విసవిసా వస్తున్న అతని భార్యకు వినిపించాయి.

వినిపించిన వెంటనే భద్రకాళి మాదిరి తనుకూడా అతనిమీద విరుచుకు పడబోతూ, ఎందుకో చటుక్కున నోటిని అదుముకున్నది ఆమె.

గట్టిగా అదుముకోవడమే కాదు, పమిటచెంగును భుజాల చుట్టూ కప్పుకుని ఒకపక్కగా ఒదిగిపోయింది.

"ఏమైంది ఈమెకు? ఏదైనా మంత్రం చదివి వాక్బంధం చేశావా?" ఆమెవంక ఆశ్చర్యంగా చూస్తూ ప్రశ్నించిన హేమసుందరి చేతిని గట్టిగా అదిమి వీధివైపు చూపించాడు శ్రీధరుడు.

మంది మార్భలం వెన్నంటి వస్తుండగా, బంధుమిత్రులందరూ చుట్టుముట్టి అడుగులు వేస్తుండగా కొడుకును, కోడల్ని వెంటబెట్టుకుని, తన మనమడితో సహా ఆ ఇంటిముందుకు వచ్చాడు రత్నశ్రేష్ఠి.

"నీ వియ్యంకుడు పంపించిన సేవకుడు ఈరోజు నా వంశాన్ని నిలబెట్టాడు. నిలువెత్తు బంగారం ఇచ్చినా అతని ఋణం తీర్చుకోలేను... అతని పాదాలకు నమస్కరించి కృతజ్ఞతలు తెలియ చేసుకోవటానికి వచ్చాను..." నోరు తెరిచి ఆశ్చర్యంగా చూస్తున్న బ్రాహ్మణుడితో అన్నాడతను.

అనటంతో ఆగలేదు... సూటిగా శ్రీధరుడి ముందుకు వచ్చి చేతులు జోడించాడు. తన మనవడితో అతని పాదాలను తాకించాడు.

ఒకరి వెనుక ఒకరుగా తనముందుకు వస్తున్న ఆయన పరివారాన్ని చూసి ఒకింత బిడియపడ్డాడు శ్రీధరుడు.

"మీరు కృతజ్ఞతలు తెలియచేసుకో వలసింది నాకు కాదు.. సరైన సమయంలో త్రాటిని నీటిలోకి వదిలి నన్ను బయటికి లాగిన పుణ్యాత్ముడికి. ముందుగా అతను ఎవరో, ఎక్కడ వుంటాడో తెలుసుకోండి" అన్నాడు శ్రీధరుడు.

తన మనవడిని చుట్టుముట్టిన ప్రమాదం తప్పిపోయిందని తేటతెల్లమైన మరునిముషంలోనే ఆ పుణ్యాత్ముడిని గురించి తెలుసుకునే ప్రయత్నం చేసినట్లు అతనికి చెప్పాడు రత్నశ్రేష్టి.

"పరాయి గ్రామానికి చెందిన ఎవరో ఇద్దరు నూతిదగ్గరకి వచ్చి నీకు త్రాటిని అందించినట్లుగా నాకు తెలిసింది. నువ్వు బయటికి రాగానే వారు అవతలికి వెళ్ళిపోయారట...ఎంత వెతికినా అగుపించలేదు..." అంటూ బ్రాహ్మణుడివైపు తిరిగాడు.

రత్నశ్రేష్టి అంతటి మనిషి తన ఇంటిముందుకు రావటమే కాకుండా, తను తిట్టిపోస్తున్న సేవకుడిని పొగడ్తలతో ముంచివేయటాన్ని చూసి బిత్తరపోతున్నాడు ఆ పెద్దమనిషి.

ఈ క్షణంలో ఈ మహనీయుడికి నీ ఇంటి చాకిరీనుంచి శాశ్వత విముక్తి కలిగించదలుచుకున్నాను. అందుకు నీకు ధనం కావాలో, అతనికి బదులుగా మరో సేవకుడు కావాలో వెంటనే తేలియజేయి..." అన్నాడు రత్నశ్రేష్టి.

ఏమని సమాధానం ఇవ్వాలో అర్థంకాక నీళ్ళు నమలటం మొదలు పెట్టిన బ్రాహ్మణుడికి వెంటనే సైగచేసింది అతని భార్య.

"అనుకోని విధంగా వచ్చిన ఈ అవకాశాన్ని వదులుకోవద్దు మనం... ధనాన్నే కోరుకుందాం... జీవితాంతం హాయిగా బ్రతికేందుకు అవసరమయినన్ని బంగారునాణేలను అడుగుదాం..." అతని చెవి దగ్గరగా నోరు పెట్టి రహస్యంగా బోధించింది.

రహస్యమని ఆమె అనుకున్నదిగాని, ఆ మాటలు శ్రీధరుడి కర్ణేంద్రియాలకు చేరనే చేరాయి.

ఎన్ని బంగారునాణేలను అడిగినా అప్పటికప్పుడు తెప్పించి ఆ ఇంటిగుమ్మంలో రాశిగా పోయించేందుకు సిద్ధంగా నిలబడిన రత్నశ్రేష్టి వంకా, పరాయివారి కష్టాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవటానికి తపన పడుతున్న తులసి అత్తమామల వంకా మార్చి మార్చి చూస్తూ తల విదిలించాడతను.

అయాచితంగా వచ్చిన ధనాన్ని చూసుకున్నకొద్దీ అధికమైపోతుంది వారి అహంకారం.

తమకు అటువంటి అదృష్టం కలగటానికి కారకురాలైన తులసిని గౌరవంగా చూసుకునే లక్షణాలు వారిలో అగుపించటం లేదు. వారి మనస్సులలో పాదుకుని వున్న అత్యాశను తొలగించి, తులసి జీవితాన్ని బాగుచేయాలనే కోరికతో వచ్చాడు తను... ఆ పని పూర్తిగాకముందే తను అవతలికి వెళ్ళిపోకూడదు.

తన సహధర్మచారిణి చెప్పిన మాటలకు సంబరంగా తలవూపుతూ తులసి మామగారు రత్నశ్రేష్టి దగ్గిరికి చేరుకోకముందే అడ్డుపుల్ల వేశాడు శ్రీధరుడు.

"గ్రామదేవత కళ్యాణమహోత్సవాల సమయంలో ఈ ఇంటికివచ్చే చుట్టాలకు సేవ చేయటంకోసం పంపించబడినవాడిని నేను.

ఉత్సవాలు పూర్తి అయ్యేటంతవరకూ ఇక్కడినుంచి కదిలే ఆలోచన నాకు లేదు.

"నా కర్తవ్యం నేను నిర్వహించటానికి మీరు ధనం ఇవ్వజూపాల్సిన అవసరం లేదు... మీ వితరణ గుణానికి నా నమస్సులు..." అంటూ తన నిర్ణయాన్ని అప్పటికప్పుడే రత్నశ్రేష్టికి వినిపించాడు.

ఎదుటి మనిషి ముఖంలోకి చూసిన వెంటనే అతని మానసిక పరిపక్వతను అంచనా వేయగల శక్తి రత్నశ్రేష్టికి వున్నది. ఆ శక్తి మూలకంగానే వ్యవసాయంలోను, వ్యాపారంలోను అమితంగా ధనాన్ని సంపాదించుకోగలిగాడు అతను.

ఎన్ని చెప్పినా, ఎంతగా బ్రతిమిలాడినా శ్రీధరుడి నిర్ణయం మారదని ఇప్పుడు అవగతం అయింది అతనికి. తన కుమారుడిచేత, కోడలిచేత అతని పాదాలకు నమస్కరింపజేసి, మారు మాటాడకుండా వెనుతిరిగాడతను.

తమ చేతులకు అందినట్లే అంది అంతలోనే మటుమాయం అయిపోయిన సువర్ణనాణేల సంచులను మనసులో తలచుకుంటూ, అలా జరగటానికి కారకుడైన శ్రీధరుడిమీద కారాలు మిరియాలు నూరింది తులసి అత్తగారు.

"పదిమందికి సరిపడే తిండిని నువ్వు ఒక్కడివే ఆరగించటం తప్ప, ఆరగించిన తిండికి సరిపడే పని ఏం చేస్తున్నావ్?" అని విరుచుకుపడింది.

చేజారిపోయిన బంగారునాణేల మూటల్ని తలుచుకుని ఆమె అలా అక్కసును వెళ్ళగ్రక్కుతున్నదని తెలుసుకాబట్టి అధికంగా ఆలోచించలేదు శ్రీధరుడు.

"మీరు పెట్టిన తిండికి సరిపడే పని నాకు చూపించండి. చేయకపోతే అప్పుడు నిందించండి. వట్టి పుణ్యానికి నోరు పారేసుకోవడం మంచిదికాదని ఎవరో చెపుతుండగా విన్నాను..." వినయవిధేయతలు నిండిన కంఠంతో మెల్లిగా అన్నాడు.

ఎంతగా వినయవిధేయతల్ని ప్రదర్శించినా ఆ మాటల్లో ఇమిడి వున్న హెచ్చరికను వెంటనే గమనించి, ఒక్కక్షణంపాటు శిలా విగ్రహమైపోయింది తులసి అత్తగారు.

అంతలోనే తేరుకుని ఏదో అనటానికి సిద్ధపడబోతుండగా ఆమెచేతిని పట్టుకుని లోపలికి తీసుకుపోయాడు ఇంటియజమాని.

కలలో జరిగినట్లు ఒకదాని వెనుక ఒకటిగా జరిగిపోతున్న ఆ సంఘటనల్ని ఆశ్చర్యం నిండిన కనులతో చూస్తోంది హేమసుందరి.

"నువ్వంటే ఈ గయ్యాళిగంపకు అసహ్యం కలిగింది. ఏదో ఏదో ఒక కఠినమైన పని అప్పగించి నిన్ను కష్టాలపాలు చేసి తీరుతుంది" ఆందోళన నిండిన కంఠంతో శ్రీధరుడితో అన్నదామె.

చిన్నగా నవ్వి ఆమె భుజం తట్టాడు శ్రీధరుడు. ఎటువంటి కష్టాన్నయినా ఎదుర్కోవటానికి తను సిద్ధంగానే వున్నట్లు ఆమెకు తెలియచెప్పబోతుండగా, వడివడిగా అడుగులు వేస్తూ అతని దగ్గిరికి వచ్చారు బ్రాహ్మణ దంపతులు.

"మన గ్రామానికి దక్షిణదిశలో వున్న అడవికి పోయి విస్తళ్ళు కుట్టుకునే ఆకుల్ని కోసుకురావాలి. అడవిమధ్యలో వున్న కొండవాగు దగ్గిర చక్కటి దర్భలు లభిస్తాయి. రెండు మూడు మాసాలకు సరిపోయే దర్భల్ని సేకరించుకు రావాలి."

వెంటనే బయలుదేరి చీకటి పడేలోగా ఈ పనుల్ని పూర్తి చేయాలి."

దృఢస్వరంతో తన భర్తకంటె ముందుగా తనే అతనికి పనుల్ని అప్పచెప్పింది బ్రాహ్మణి.

"దక్షిణదిశలో వున్న అడవిలోకి పోవాలా? దక్షిణ దిశలోకా?" వున్నట్లుండి తీవ్రమైన ఆందోళనకు గురిఅవుతూ రెట్టించి అడిగింది హేమసుందరి.

తను చేయవలసిన పని ఏమిటో తెలిసిన వెంటనే వినయంగా తలవూపి వెనుతిరగబోతున్న శ్రీధరుడికి ఆశ్యర్యాన్ని కలిగించింది ఆ ప్రవర్తన.

"విస్తళ్ళు కుట్టుకునే ఆకుల్ని కోసుకురావటానికి, దర్భల్ని ఏరకు రావటానికి దక్షిణదిశగా బయలుదేరకూడదని నియమం ఏదైనా వున్నదా?" చిన్నగా నవ్వుతూ ఆమెని ప్రశ్నించాడు.

"అక్కడ... ఆ దిశలో నరమాంసపు రుచిమరిగిన మహావ్యాఘ్రం ఒకటి మాటువేసి వున్నదని ఇందాక ఎవరో అనుకుంటుంటే విన్నాను. ఆరితేరిన వేటగాళ్ళు కూడా ఆహుతి అయిపోయారట. ఆ దిశను పూర్తిగా విసర్జించారట గ్రామస్థులందరూ..." కంపిస్తున్న కంఠంతో చెప్పింది హేమసుందరి.

తమ నోటివెంట వెలువడిన మాటల్ని ఎట్టి పరిస్థితుల్లోను వెనుతీసుకునే అలవాటు తమకు లేదన్నట్లు నిఠారుగా నిలబడివున్న బ్రాహ్మణ దంపతుల వంక చూస్తూ మరోసారి నవ్వాడు శ్రీధరుడు.

అంతకుముందు హేమసుందరి తలపోసినట్లు కఠినాతి కఠినమైన పనుల్ని అప్పగించి తనను కష్టాలపాలు చేయాలని మాత్రమే అనుకోవటంలేదు ఆ పుణ్యదంపతులు...

తమ కోరికలకు అడ్డుగా నిలిచిన తనను పూర్తిగా అడ్డుతొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు.

"వద్దు...ఈ పనికి నీవు పోవద్దు..."

క్షణక్షణానికి అధికం అయిపోతున్న ఆందోళనను ఎంత ప్రయత్నించినా అణుచుకోవటం చేతకాక పిచ్చిగా అరవబోయిన హేమసుందరిని చూపులతోనే వారించి, వీధివైపు కదలబోయిన హేమసుందరిని చూపులతోనే వారించి, వీధివైపు కదలబోతున్న శ్రీధరుడిని చేయిపట్టి ఆపాడు బ్రాహ్మణుడు.

"మనకు కావల్సిన ఆకుల్ని, దర్భల్ని నువ్వు ఒక్కడివే మోసుకురాలేవు. వృషభశకటాన్ని తీసుకుపోతే పని చాలా సులువు అవుతుంది" అని చక్కటి ఆలోచన చెప్పాడు.

శూరమంగళ గ్రామానికి వెళ్ళి తులసిని వెంటబెట్టుకు రావాలనే మాటలను అతను ఎందుకు మరిచిపోయాడో అర్థమై, అతని కుటిల భావనలకు కాస్తంత అసహ్యించుకున్నాడు శ్రీధరుడు.

ఒకవేళ హేమసుందరి భయపడుతున్నట్లు దక్షిణదిశలో మహావ్యాఘ్రమే గనుక మాటువేసి వుంటే, మనిషి జాడలకంటే ముందుగా అది వృషభాల జాడల్ని ఇట్టే పసికడుతుంది.

బుగ్గమీదికి వచ్చేసిన కన్నీటిని పమిటెచెంగుతో అద్దుకోవటానికి ప్రయత్నించను కూడా ప్రయత్నించకుండా బేలగా నిలబడిపోయిన హేమసుందరికి కన్నుగీటాడు శ్రీధరుడు.

"చీకటి పడేలోపుగా వచ్చి నీ ముందు వాలతాను. అమ్మగారిని అడిగి భోజనం సిద్ధం చేయించి వుంచు. అనవసరమైన ఆందోళనతో నీ మనసు కష్టపెట్టుకోబోకు" అంటూ వృషభాలను అదిలించి బండి కట్టాడు శ్రీధరుడు.

చీకటిపడిన క్షణంనుంచీ ఎక్కడికీ కదలకుండా విశ్రాంతి తీసుకుని వుండటం వల్ల రెట్టించిన ఉత్సాహంతో ఛెంగు ఛెంగుమని చిందులు తొక్కుతూ ముందుకు కదిలాయి వృషభాలు. కన్నుమూసి కన్ను తెరిచేటంతలో ఆ వీధిమలుపును అధిగమించి దక్షిణదిశగా పరుగుతీశాడు.

## 10

వైకుంఠపురం గ్రామ పొలిమేరలకు రెండు గోరుతాల దూరంలో వుంటుంది తులసి అత్తమామలు సూచించిన అటవీప్రదేశం. మధ్యాహ్నవేళకు ముందుగానే అక్కడికి చేరుకోవాలనీ, చీకట్లు చుట్టుముట్టడానికి కాస్తంత ముందుగానే అక్కడికి చేరుకోవాలనీ, చీకట్లు చుట్టుముట్టడానికి కాస్తంత ముందుగానే ఇంటిదారి పట్టాలనీ అనుకుంటూ వృషభాలను పరుగులు తీయించబోయిన శ్రీధరుడిని వెంటనే అడ్డుకున్నారు గ్రామపొలిమేరల్లో సంచరిస్తున్న పౌరులు అనేకమంది.

"గ్రామదేవత ఆలయంలో పూజాదికాలు నిర్వర్తించే ముసలి పూజారితో కలుపుకుని ఇప్పటివరకూ పన్నెండుమందిని పొట్టన పెట్టుకున్నది ఆ అడవిలో తిరుగాడుతున్న మువ్వన్నెల మెకం. మహంతీనగరం నుంచి రత్నశ్రేష్ఠి రప్పించిన ముగ్గురు వేటగాళ్ళను కూడా నమిలి మింగేసింది.

నాలుగు కాలాలపాటు హాయిగా బ్రతకాలనే కోరిక వున్నవారెవరూ అటుకేసి పోకూడదు" అంటూ ఆ అడవి గురించి, అందులో సంచరిస్తున్న పెద్దపులిని గురించి అతనికి తెలియజేశారు.

పనికట్టుకుని వారందరూ అలా హెచ్చరించిన తర్వాత ఏదో ఒక సమాధానం చెప్పకపోతే భావ్యంగా వుండదనిపించి, తన యజమాని అప్పగించిన పనిని గురించి వారికి తెలియజేశాడు శ్రీధరుడు.

"నా జాడలు ఆ దుష్టమృగానికి తెలిసేలోపుగా ఇలా పోయి అలా వచ్చేస్తాను. అది నామీదికి ఎగబడేవరకూ ఆగను. గట్టిగా మాట్లాడితే అడవి సరిహద్దుల దగ్గిరే ఆగుతాను..." అంటూ అందరికీ నమస్కరించి బండిని ముందుకు పోనిచ్చాడు.

అతని అమాయకత్వానికి జాలిపడడమే కాకుండా, అతన్ని అటువంటి వల్లమాలిన పనికి ప్రేరేపించిన తులసి మామగారిని నోటికి వచ్చిన కఠిన పదాలతో నిందించారా పౌరులు.

"ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలిపెట్టకూడదు. అన్నెం పున్నెం ఎరుగని ఈ అమాయకుడిని చేజేతులా మృత్యుముఖంలోకి పంపిస్తున్న ఆ పెద్దమనిషికి తగిన శాస్తి మనం చేసి తీరవలసిందే..." అని నిర్ణయించుకుని తమపనుల్లో నిమగ్నమైపోయారు.

వారందరికీ చెప్పినట్లు అడవి మొదట్లోనే ఆగిపోలేదు శ్రీధరుడు. అడుగుతీసి అడుగు వేయటానికి వీలుకానంత దట్టంగా ఎదిగివున్న ముళ్ళపొదల పక్కనుంచి అతిజాగ్రత్తగా ముందుకు నడిపించాడు వృషభాలను.

అడవి మధ్యభాగంలో వుండే కొండవాగును చేరుకోగానే, అక్కడ అగుపించిన ఒక వటవృక్షం క్రింద శకటాన్ని నిలబెట్టాడు. వాగు ఒడ్డున వత్తుగా పెరిగివున్న పచ్చికలోకి వృషభాలను వదిలాడు.

"పచ్చిమేత లభించిందన్న సంతోషంలో మిమ్మల్ని మీరు మరిచిపోకండి. మీ చుట్టూ వున్న పరిసరాల్ని ఒకకంట కనిపెట్టుకుంటూ వుండండి" అని వాటిని హెచ్చరిస్తూ, తను వచ్చిన పనిని పూర్తిచేసుకునే ప్రయత్నాలు మొదలు పెట్టాడు.

ఎంతో సేపు వెతుకులాడవలసిన అవసరం లేకుండానే, వృషభాలను వదిలిన ప్రదేశానికి వంద ధనువుల దూరంలో అగుపించాయతనికి మంచి మంచి ఆకులతో నిండివున్న లోలుగు చెట్లు.

పావుఘడియలో పదిచెట్లను దులిపి, క్రిందపడిన ఆకులన్నింటినీ పెద్ద పెద్ద కట్టలుగా కట్టాడు.

ఒకదాని తరువాత ఒకటిగా వాటిని మోసుకొచ్చి శకటంలో వరుసగా పేర్చాడు.

వాగు ఒడ్డున వత్తుగా పెరిగివున్న రెల్లు పొదలనుంచి తులసి మామగారు మరీమరీ చెప్పిన దర్భలను సేకరించాడు. ఆ మోపులను కూడా శకటం మీదికి చేర్చేసరికి మధ్యాహ్నం మించిపోనే పోయింది.

దూరప్రదేశాల్లో పనిచేయటానికి పంపించే సేవకులకు మధ్యాహ్న భోజనాన్ని మూటకట్టి యివ్వాలనే ఆలోచన రాని తులసి అత్తమామల్ని తలచుకుని గాఢంగా నిట్టూరుస్తూ, చేసేదేంలేక వాగునీటితోనే కడుపు నింపుకున్నాడతను.

ధనదుపురంనుంచి బయలుదేరినప్పటినుంచీ పచ్చిమేతకు ముఖం వాచి వున్నాయి కాబోలు, వంచిన తలల్ని ఎత్తకుండా వాగు ఒడ్డునే తిరుగుతున్నాయి వృషభాలు . కొండవాగులో నుంచి తమ దగ్గిరికి వచ్చిన అతన్ని గమనించను కూడా గమనించలేదు.

చేతికి అందిన ఒక చెట్టుకొమ్మను మధ్యకు విరిచి బాణాకర్ర మాదిరి తయారుచేస్తూ, ఆ చుట్టుపట్ల వున్న వృక్షాలను, అడవి పొదలను నిశితంగా పరిశీలించి చూశాడతను.

మృత్యుదేవతకు ప్రతిరూపంవంటి మహావ్యాఘ్రమే గనుక ఆ అడవిలో సంచరిస్తూ వుంటే, తన జాడల్నో తన వృషభ జాడల్నో పసికట్టి తప్పకుండా వచ్చేసి వుండాలి అక్కడికి.

మిట్టమధ్యాహ్నవేళ దాటిపోతున్నప్పటికీ అది ఆ దరిదాపుల్లోకి ఇంకా రాకపోవటానికి కారణం ఏమై వుంటుంది?

గ్రామస్థులందరూ కట్టుకట్టి అటుకేసి తొంగిచూడటం మానుకున్నందువల్ల ఆహారం లభించక మరో ప్రాంతానికెక్కడికైనా వలస వెళ్ళిపోయిందా? లేక సరైన అవకాశం కోసం ఎదురుచూస్తూ ఆ చుట్టుపట్లే ఎక్కడో మాటువేసి కూర్చున్నదా??

మధ్యాహ్న సూర్యుడు పశ్చిమ దిశలోకి మరలిన తరువాత కూడా ఆ క్రూరమృగం అక్కడికి అరుదెంచే జాడలు అగుపించకపోవడంతో, విసుగు పుట్టి వృషభాలను అదిలించాడతను.

నవనవలాడుతున్న పచ్చిమేతను వదిలి అవతలికి పోవటం తమకు నచ్చనట్లు అవి తలల్ని విదిలిస్తూంటే విడవకుండా బండి దగ్గిరికి లాక్కువచ్చాడు.

అలవాటు ప్రకారం తలతో అతని గుండెల్ని తడమబోతూ, ఎందుకనో అదిరిపడింది ఎలపటి వృషభం. నాసికారంధ్రాల్ని పెద్దవి చేసి తాచుపాము మాదిరి భయంకరంగా బుసపెట్టింది.

సరైన అదనుకోసం చూస్తూ మాటువేసి వున్న మహావ్యాఘ్రం గంతులు వేస్తూ వచ్చి తన మీదికి లంఘించ బోతున్నదనే అనుకున్నాడు శ్రీధరుడు.

వృషభాలను బండికి కట్టే ప్రయత్నాన్ని వెంటనే విరమించుకుని, మెరుపులా వెనక్కి దూకాడు.

క్రిందపెట్టిన చెట్టుకొమ్మను చేతుల్లోకి తీసుకుంటూ పక్కకు చూశాడు.

నరమాంసం రుచిమరిగిన పెద్దపులి అగుపించలేదతని కనులకు. పదునైన వేటకత్తుల్ని పట్టుకుని యమభటుల మాదిరి వచ్చేసిన నలుగురు దృఢకాయులు కనిపించారు. వారెవరో, ఎందుకలా తనమీదికి దుముకుతున్నారో తెలుసుకునే అవకాశం గాని, వ్యవధిగాని శ్రీధరుడికి లభించలేదు.

అతను తమను గమనించాడని అర్థమైన మరుక్షణం చెవులు చిల్లులు పడిపోయేటట్లు సింహనాదాలు చేశారు వాళ్ళు.

"కొట్టండి... నరకండి... ఒకే ఒక్క వేటుతో నేలకూల్చండి" అని ఒకరినొకరు హెచ్చరించుకుంటూ తమ ఆయుధాల్ని అతనిమీద ప్రయోగించారు.

తనకంటె ముందుగా వారి ఆగమనాన్ని గమనించి పెద్దగా బుసకొట్టిన ఎలపటి వృషభానికి మనసులోనే కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ, చెట్టు కొమ్మను గిర్రున తిప్పాడు శ్రీధరుడు.

కన్నుమూసి కన్ను తెరిచేటంతలో ఎగిరి ఆవల పడిపోయింది ఒక దృఢకాయుడి చేతిలోని వేటకత్తి. నారికేళఫలం పగిలినట్లు వికృతశబ్దం చేస్తూ పగిలిపోయింది అతని శిరస్సు.

బాధను భరించటం అసాధ్యమై గావుకేకలు పెడుతూ నేలకూలిపోతున్న ఆ వ్యక్తిని చూసి ఒక్కక్షణంపాటు విపరీతమైన అలజడికి గురి అయ్యారు మిగిలిన ముగ్గురూ.

అతంలోనే తేరుకుని రెట్టించిన పట్టుదలతో శ్రీధరుడిమీద కలబడబోయారు గాని, అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది.

ముక్కుముఖము తెలియని తన మీదికి హెచ్చరిక కూడా లేకుండా వచ్చి పడ్డారన్న కక్షతో రగులుకుపోతూ, తన చేతిలోని చెట్టుకొమ్మను మరింత వేగంగా విసిరాడు శ్రీధరుడు.

గుర్తుపట్టడానికి వీలుకాని విధంగా నజ్జునజ్జుయి పోయింది రెండో దృఢకాయుడి ముఖం. గుండెలమీద బలమైన దెబ్బ పడడంతో మొదలు నరికిన చెట్టులా విరుచుకుపడిపోయాడు మూడో వ్యక్తి.

తమ సహచరులు ముగ్గురు తల్లకిందులైపోవటాన్ని చూసేసరికి ధైర్యం దిగజారిపోయింది ఆఖరి వ్యక్తికి. చేతిలో వున్న వేటకత్తిని అవతలకు విసిరి ఒక్కసారిగా వెనుతిరిగాడు. గాలిని మించిన వేగతో పొదలలోకి దూసుకు పోయాడు.

అతన్ని అంత తేలిగ్గా వదిలపెట్టడం యిష్టంలేక తను కూడా పొదలలోకి అడగుపెట్టాడు శ్రీధరుడు.

పావు యోజన దూరం ఎక్కడా ఆగకుండా పరుగులు తీసి అడవికి చివరి భాగంలో వున్న చిన్న కొండగుట్టను చేరుకున్నాడు ఆ దృఢకాయుడు . ఆ గుట్ట మొదల్లో వున్న ఒక చిన్న గుహముందు నిలబడి కేకలు పెట్టాడు.

ఎగసుకు వస్తున్న ఆయాసాన్ని అణచుకునే ప్రయత్నం కూడా చేయకుండా ఆ ప్రదేశంలోకి వచ్చిన శ్రీధరుడికి అగుపించారు గుహలోనుంచి బయటికి వస్తున్న మరో నలుగురు ఆజానుబాహులు.

వారుగాని, వారితో మాటలు మొదలు పెట్టిన దృఢకాయుడుగాని తనను గమనించి, ఆయుధాల్ని అందుకునే వరకూ ఆగలేదు శ్రీధరుడు. తన చేతుల్లోని చెట్టుకొమ్మను గిరిగిరా తిప్పుతూ సుడిగాలి మాదిరి పోయి వారిమీద కలబడ్డాడు.

ఏం జరుగుతున్నదో అక్కడివారికి అర్థం అయ్యేలోపుగానే అంతం అయిపోయిందా పోరాటం. తలలు పగిలి నేలకూలిపోయారు ముగ్గురు...

"అడవిలో అగుపించిన అపరిచితులమీద హెచ్చరిక కూడా లేకుండా దాడిచేసే మీకు ఈ కక్ష సరిపోదు. కాళ్ళూ చేతుల్ని బంధించి తల్లక్రిందులుగా చెట్లకొమ్మకు వేలాడదీయాలి... అప్పుడుగాని మీకు బుద్ధిరాదు..." తనలో తను అనుకుంటూ గుహ లోపలికి తొంగి చూశాడు శ్రీధరుడు. అక్కడ అగుపించిన దృశ్యాన్ని చూసేసరికి విపరీతమైన ఆశ్చర్యంతో శిలావిగ్రహం మాదిరి బిగుసుకుపోయాడు.

అడవిలో లభించే సన్నపాటి తీగెలతో కాళ్ళూ చేతులూ కదలకుండా బంధించబడి వున్నారు నలుగురు వ్యక్తులు ఆ గుహ లోపలిభాగంలో. గుహలోకి తొంగిచూసిన శ్రీధరుడిని గమనించగానే బాధాసూచకమైన శబ్దాలు చేశాడు వారిలో వున్న ఒక వృద్ధుడు.

తన ఆశ్చర్యం నుంచి తేరుకుని ఛెంగున అతని సమీపంలోకి పోయాడు శ్రీధరుడు. అదేపనిగా చెట్టుకొమ్మను తిప్పటం వల్ల స్వేదంతో తడిసివున్న హస్తాలను తన వస్త్రాలకు తుడుచుకుని అతని కరచరణాలను కట్టివున్న అడవితీగెల్ని వూడదీశాడు.

అరిచి కేకలు పెట్టకుండా ఏవో ఆకుల్ని ఆ వ్యక్తినోటిలో కుక్కి వుంచారు గుహముందు పడిపోయిన దృఢకాయులు.

వాటిని తొలగించిన శ్రీధరుడి చేతులను కనులకు అద్దుకుంటూ కన్నీరు విడిచాడు ఆ వృద్ధుడు.

"ఈ అడవిలో నరమాంసాన్ని ఆరగించడానికి అలవాటుపడిన వ్యాఘ్రం ఒకటి సంచరిస్తోందని చెప్పారు వైకుంఠపురం గ్రామస్థులు. వ్యాఘ్రం అగుపించలేదు. రాక్షసులవంటి ఈ మానవులు కనిపించారు" మిగిలిన వారి బంధనాలను సడలించి, వారందరినీ గుహ వెలుపలికి తీసుకువస్తూ అన్నాడు శ్రీధరుడు.

గుహకు కొంచెం దూరంలో వున్న నీటిగుంట వద్దకు వెళ్ళి, ఆ నీటితో కరచరణాలను శుభ్రపరుచుకున్నారా వ్యక్తులు. దాహం తీర్చుకున్నారు.

"ఎప్పుడో ఎన్నో వందల సంవత్సరాల క్రితం కర్మరుడనే మాంత్రికుడు అపూర్వమైన నిధిని సంపాదించి మా గ్రామదేవత ఆలయంలో భద్రపరిచాడట. నరబలులతో ఒక క్షుద్రదేవతను తృప్తిపరిచి మా గ్రామదేవత కళ్యాణోత్సవాల సమయంలో ఆలయంమీదికి పంపకం చేయాలని, ఆ నిధిని తను వశపరుచుకోవాలని అనుకుంటున్నాడు ఒక కాపాలికుడు... అడవిలోకి వచ్చిన అమాయకుల్ని బంధించి ఆ దేవతకు బలిస్తున్నాడు.

గ్రామస్థులకు అనుమానం కలగకుండా వుండేందుకు మహా వ్యాఘ్రం సంచరిస్తున్నట్లుగా గుర్తుల్ని సృష్టిస్తున్నాడు. ఆ నరరూప రాక్షసుడికి పట్టుబడిన వారిలో మేము నలుగురమే ప్రాణాలతో మిగిలాము. ఇంకో రెండు రోజులు గడిస్తే మమ్మల్ని కూడా తన క్షుద్రశక్తికి బలి యిచ్చేసి వుండేవాడతను..." అచేతనంగా పడివున్న కాపాలికుడి అనుచరుల వంక అసహ్యంగా చూస్తూ శ్రీధరుడికి చెప్పాడు మొట్ట మొదట బంధవిముక్తుడైన వృద్ధుడు.

"చీకటిపడే సమయం వరకూ క్షుద్రశక్తిని ఉపాసించి, ఈ గుహదగ్గిరికి వస్తాడు కాపాలికుడు... తను వచ్చి ఇక్కడి దురంతాన్ని వీక్షించక ముందే అవతలికి వెళ్ళిపోవటం భావ్యంగా వుంటుంది..." తడబడుతున్న కంఠంతో తన భయాన్ని ఎరుకపరిచాడు.

క్షుద్రదేవతను తృప్తిపరచటానికి సాటి మానవులను బలిపశువులుగా వుపయోగించుకునే ఆ కాపాలకుడికి భయపడి దూరంగా పారిపోవడం చిన్నతనమనిపించింది శ్రీధరుడికి.

"అతను ఎక్కడ వుంటాడు?" గుహ ముందుభాగంలో వదిలిన తన చెట్టుకొమ్మను తిరిగి చేతుల్లోకి తీసుకుంటూ అడిగాడు.

మంత్రతంత్రాలు నేర్చిన ఆ మాంత్రికుడి ముందుకు పోవటం శ్రేయస్కరం కాదని అతనికి నచ్చచెప్పే ప్రయత్నం చేసి విఫలుడైనాడు వృద్ధుడు.

"ఈ కొండగుట్ట వెనుక ఒక శింశుపవృక్షం వుంటుంది...దాని క్రింద కూర్చుని మంత్రాలను చదువుతూ వుంటాడు" అని చెపుతూ శ్రీధరుడిని అటుగా తీసుకుపోయి, ఆ వృక్షాన్ని చూపించాడు.

మంత్రశక్తులు కల కాపాలికులకు కోపాన్ని తెప్పిస్తే కాళ్ళూ చేతులూ చచ్చుపడిపోయేటట్లు చేయగలరనీ, తెలివిని తప్పించి ప్రాణాలు తీయగలరనీ ఎన్నెన్నో కథలను విని వున్నాడు శ్రీధరుడు. అయినా వాటిలో ఒక్కటికూడా ముందుకు పోనీయకుండా అతన్ని ఆపలేకపోయింది.

భుజాలమీదికి వేలాడుతున్న పొడవాటి కేశాలను వామహస్తంతో అలవోకగా సవరించుకుంటూ అదేపనిగా ఏవో మంత్రాలను వల్లిస్తున్నాడు

శింశుపవృక్షం క్రింద కూర్చుని వున్న కాపాలికుడు...మధ్య మధ్యలో తన ఎదుటి వున్న మట్టి బొమ్మకు నమస్కరిస్తున్నాడు.

చెట్టుకొమ్మను రెండు చేతులతో బిగించి పట్టుకుని మొట్టమొదటగా ఆ బొమ్మను కొట్టాడు శ్రీధరుడు. అదిరిపడి పైకి లేవబోయిన కాపాలికుడి శిరస్సును కూడా వ్రయ్యలు చేసేశాడు.

మంత్రాలు చదువుతున్నవాడు చదువుతున్నట్లుగానే వెనక్కి వాలిపోయాడు కాపాలికుడు.. స్పృహను కోల్పోయి కనులు తేలవేశాడు.

అప్పటికప్పుడు అడవితీగెలను సంపాదించుకు వచ్చి అతని కరచరణాలను బంధించాడు శ్రీధరుడు.

గుహముందు పడివున్న అతని అనుచరులకు కూడా అదేగతిని పట్టించి, వృద్ధుడిని, అతనితోపాటు బంధవిముక్తులైన వ్యక్తుల్ని హెచ్చరించాడు.

"కొండవాగు దగ్గర నా వృషభశకటం వున్నది. అక్కడ పడిపోయిన వారు మరికొంతమంది వున్నారు. వారితోపాటు నేను వచ్చేటంతవరకూ జాగ్రత్తగా మసలుకోండి..వారిలో ఎవరైనా కనులు తెరిచిన మరుక్షణం తిరిగి తెలివి తప్పిపోయేటట్లు కొట్టండి..." అంటూ అతివేగంగా కొండవాగు దగ్గిరికి తిరిగి వచ్చాడు.

చీకట్లు చుట్టుముట్టబోతున్న సమయం దగ్గిర పడుతున్నందువల్ల బెదురు చూపులతో అతనికోసం ఎదురు చూస్తున్నాయి శకటం దగ్గిరే నిలబడి వున్న అతని వృషభాలు.

వెంట తీసుకువచ్చిన అడవి తీగెలతో అలాగే పడిపోయి వున్న దృఢకాయులందర్నీ బంధించి బండిమీదికి ఎక్కించాడు శ్రీధరుడు. తనను చూసి

సంతోషంగా తలలు విదిలిస్తున్న వృషభాలను ఆప్యాయంగా ముద్దు చేస్తూ, బండికి కట్టి కొండగుట్టవైపు నడిపించాడు.

* * *

"ఎక్కడున్నావే నువ్వు? ఏం చేస్తున్నావ్?" వికృతకంఠంతో బిగ్గరగా పిలుస్తూ బావిదగ్గిరికి వచ్చిన బ్రాహ్మణిని చూసి లేచి నిలబడింది హేమసుందరి.

శ్రీధరుడిని అడవికి పంపించిన క్షణంనుంచీ ఆమెచేతే తమ ఇంటిని శుభ్రం చేయించటం మొదలుపెట్టింది ఆ గయ్యాళి... మెత్తటి మట్టిని తెప్పించి అరుగుల్ని మెత్తించింది.

"చాకిరీ చేయటానికి వచ్చిన అరణపు సేవకులు మీరు... తేరగా తిని కూర్చోవటానికి ఎట్టి పరిస్థితులలోను వీలుపడదు. రోజుకు ఒకపూట మాత్రమే మీకు ఆహారం ఇవ్వబడుతుంది... అందుకు యిష్టం లేకపోతే వచ్చిన దారినే వెనక్కి పొండి..." ఖంగు ఖంగుమంటున్న కంఠంతో హెచ్చరించింది.

ఆహారం తీసుకోకపోవటం వల్ల కనులు బైర్లు కమ్ముతున్నట్లు అనిపించినా లక్ష్యపెట్టకుండా పనిచేసింది హేమసుందరి. అరుగుల్ని మెత్తటం పూర్తి అయిన తర్వాత బావి దగ్గిరికి వచ్చి కూర్చున్నది.

వద్దు వద్దని చెప్పినా వినకుండా అడవిలోకి పోయిన శ్రీధరుడిని గురించే ఆలోచిస్తోంది ఆమె అంతరంగం.

తనకు సంబంధించిన పనులను వదిలిపెట్టి, సంబంధంలేని వ్యవహారాల్లో వేలుపెట్టటం అతని నైజం...సజావుగా తిరిగి రాగలడా? కారణం లేకుండానే పదే పదే నీటితో నిండిపోతున్న కనుల్ని పమిటచెంగుతో తుడుచుకుంటూ వుండగా వచ్చి పడింది బ్రాహ్మణి.

"చీకటి పడకముందే తిరిగిరావాలని ఆ తిండిపోతుకు చెప్పాము... చెప్పామా లేదా?" నడుముమీద చేతులు వేసుకుంటూ అడిగింది.

తిండిపోతు ఎవరో తనకు తెలుసు కాబట్టి, క్షణం కూడా ఆలస్యం చేయకుండా తలవూపింది హేమసుందరి.

చెప్పినప్పుడు పెద్ద బుద్ధిమంతుడిలా తలవూపి, ఇప్పుడు అతను చేస్తున్నదేమిటి? చీకటిపడి ఎంత సమయం అయింది? ఏడీ అతగాడు?" శ్రీధరుడు రాకపోవటానికి ఆమె కారకురాలని తను భావిస్తున్నట్లుగా ప్రశ్నించి, అంతటితో తన కోపం చల్లారలేదు కాబోలు, ఆమె తలమీద గట్టిగా మొత్తింది ఆ ఇల్లాలు.

పుట్టి బుద్ధెరిగిన తరువాత అటువంటి దెబ్బతిని ఎరుగను హేమసుందరి... ఆశ్చర్యం, బాధ అన్నీ కలిసి అంతరంగాన్ని కలవరపరితే సరికి అలాగే బొమ్మలా నిలబడిపోయింది.

"చెప్పిన పనిని చెప్పినట్లు చేయటం చేతకాని మిమ్మల్ని అని ప్రయోజనం లేదు. మిమ్మల్ని మా మీదికి పంపకం చేసిన ఆ పాపిష్టిముఖాన్ని అనుకోవాలి" అంటూ తన కోడలిని గుర్తుతెచ్చుకుని తిడుతూ మెటికలు విరిచింది బ్రాహ్మణి.

రత్నశ్రేష్ఠి ఇవ్వజూసిన ధనవు సంచులు తమచేతికి అందకుండా శ్రీధరుడు అడ్డుపడ్డాడన్న కచ్చతో ఆమె అలా రెచ్చిపోతున్నదని తెలుసు కాబట్టి, ఒక్కమాటకూడా మాట్లాడలేదు హేమసుందరి.

మెటికలు విరవటంతో తృప్తిపడలేదు బ్రాహ్మణి.

"చీకటి పడకముందే తిరిగివస్తే ఏదైనా పని చేయాల్సి వస్తుందని, వీధుల వెంట తిరుగుతూ వుండి వుంటాడా తిండిపోతు... వాడి అంతు చూడకపోతే నేను మారుపేరు పెట్టుకుంటాను..." బ్రహ్మరాక్షసి మాదిరి అరుస్తూ వెను తిరిగింది.

వెనుతిరిగి నాలుగే నాలుగు అడుగులు వేసిందామె. అంతలోనే హఠాత్తుగా మూతపడిపోయిందామె నోరు... ఎవరో చేయివేసి అదిమినట్లు చటుక్కున ఆగిపోయింది వాక్ప్రవాహం.

అడవిలోకి పోయిన శ్రీధరుడు తిరిగి వచ్చాడేమోనన్న ఆశతో, "నాదస్వరాన్ని విన్న నాగినిలా వెంటనే తల ఎత్తిచూసింది హేమసుందరి.

శ్రీధరుడు అగుపించలేదు...గుంపుగా ఆ ఇంటిముందుకు వస్తున్న గ్రామస్థులు కనిపించారు. వారందరి మధ్య అడుగులు వేస్తున్న గ్రామపెద్దలు, వారితోపాటు వస్తున్న రత్నశ్రేష్ఠి కనిపించారు.

పమిటచెంగును భుజాలచుట్టూ చుట్టుకుంటూ పరుగులాంటి నడకతో ఇంటిముందుకు పోయి, ముఖద్వారం ప్రక్కగా వదిగి నిలుచున్నది బ్రాహ్మణి.

"ఇంటి యజమానిని పిలవండి. గ్రామపెద్దలు ఇంటిముందుకు వచ్చారని చెప్పండి. వెంటనే బయటికి రమ్మని చెప్పండి..." ముఖద్వారానికి సమీపంగా పోతూ బిగ్గరగా అన్నాడో గ్రామస్థుడు.

ఆ మరునాడు జరిపించవలసిన ఏదో శుభకార్యానికి అవసరమైన సంబరాల జాబితాను సరిచూసుకుంటున్నాడు ఇంటి యజమాని ... ఉత్తరీయాన్ని సర్దుకుంటూ బయటికి వచ్చాడు.

"ఈ గ్రామానికి అంతటికీ నువ్వు పురోహితుడివి... మంచిని గురించి చెడును గురించి అందరికీ వివరించి చెప్పవలసిన వాడివి..." ఇంటిముందుకు వచ్చిన పెద్దలను లోనికి ఆహ్వానించాలనే కనీసజ్ఞానం కూడా లేకుండా నోరు తెరుచుకు చూస్తున్న ఆ బ్రాహ్మణుడితో అన్నాడు ఒక గ్రామపెద్ద.

ఆ మాటలతో ఈ లోకంలోకి వచ్చేశాడా బ్రాహ్మణుడు... ముఖద్వారం ప్రక్కనే నిలబడిన తన భార్యతో వారందరికీ ఆసనాలను వేయించమని చెప్పబోతుండగా వారించాడతన్ని ఆ గ్రామపెద్ద.

"ఇంటికి వచ్చినవారికి చేయవలసిన మంచి మర్యాదల్ని గురించి మాట్లాడటంలేదు నేను... మన గ్రామం యొక్క కట్టుబాట్లను గురించి నీకు గుర్తు చేస్తున్నాను..." నడుముమీద చేతులు వేసుకకుంటూ కోరగా అన్నాడు.

ఆ మాటలతో రక్తమంతా హరించుకుపోయినట్లు తెల్లబడింది బ్రాహ్మణుడి ముఖం.

"మీరు ఏం మాట్లాడుతున్నారో నాకు అర్థం కావటంలేదు..." తడబడుతున్న కంఠంతో అన్నాడు.

తమ వెనుక నిలబడిన గ్రామస్థుల్లో కొంతమందిని ముందుకు రమ్మని చేయి వూపాడు గ్రామపెద్ద.

"ఈ పెద్దమనిషికి నా మాటలు అర్థం కావటంలేదట... అర్థం అయ్యేటట్లు మీరు చెప్పండి..." గంభీరమైన కంఠంతో ఆదేశించాడు.

ఆ రోజు ఉదయం తాము దక్షిణదిశలో వున్న పొలిమేరల దగ్గిర పనీపాట్లు చేసుకుంటూ వుండగా వృషభశకటాన్ని వేగంగా నడిపిస్తూ శ్రీధరుడు అటుగా వచ్చిన వైనాన్ని ఆ బ్రహ్మణుడికి, అక్కడికి వచ్చి వింతగా చూస్తున్న ఇంకా అనేకమంది గ్రామస్థులకు వివరంగా చెప్పారు వాళ్ళు.

"అడవిలో వున్న వ్యాఘ్రం మూలకంగా మనం ఎవరమూ అటుకేసి పోకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాం... ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా నడుచుకున్న వారికి శిక్షలు వేయాలని కూడా అనుకున్నాం...

అన్నెం పున్నెం ఎరుగని ఒక అమాయకుడిని అటుకేసి పంపించాడు ఈ బ్రాహ్మణుడు... మన నిర్ణయాలు ఇతనికి వర్తించవా?" అందరికీ వినిపించేలా పెద్ద కంఠంతో సూటిగా ప్రశ్నించాడు.

ఇంటి పైభాగంలో వున్న పెద్ద దూలం ఒకటి హఠాత్తుగా మధ్యకు విరిగి తన తలమీద పడినట్లు అదిరిపడ్డాడు బ్రాహ్మణుడు.

పట్టుబట్టి తను తన భార్యా శ్రీధరుడిని ఆ అడవిలోకి పంపించిన వైనం ఇలా గ్రామస్థులందరకీ తెలిసిపోతుందని, అది ఒక పెద్ద తగాదాకింద మారుతుందని అనుకోలేదతను...

వెర్రిముఖంతో అలాగే నిలబడిపోతే పరిస్థితి మరింత విషమంగా మారిపోతుందని అర్థమైన అందరికీ చేతులు జోడించి నమస్కారాలు చేశాడతను.

"శుభకార్యాలు జరిపించడానికి అవసరమైన దర్భలు, విస్తళ్ళు నిండుకున్నాయన్న ఆలోచన తప్ప, ఆ అడవిలో మహావ్యాఘ్రం ఒకటి సంచరిస్తోందన్న మాట మాకు గుర్తుకురాలేదు. ఈ ఒక్క తప్పును మన్నించండి... ఇకముందు ఇలా జరుగకుండా జాగ్రత్తపడతాను..." అని తప్పును కప్పి పెట్టుకొనే మాటల్ని మొదలుపెట్టబోతుండగా, భుజంమీద ఉత్తరీయాన్ని గాలిలోకి విదిలిస్తూ, నేలను బలంగా తన్నాడు ఒక గ్రామపెద్ద.

"ఇకముందు ఇలా జరగకుండా జాగ్రత్త ఎలా పడతావ్? అడవిలోకి పోయిన ఆ అమాయకుడు ప్రాణాలతో తిరిగివస్తాడని అనుకుంటున్నావా నువ్వు? మహంతి నగరం నుంచి మన రత్నశ్రేష్ఠి రప్పించిన వేటగాళ్ళ కంటే వీరాధివీరుడా అతను?" అని కోపంగా ప్రశ్నించాడు ఆ గ్రామస్థుడు.

"మా కోడలి పుట్టింటినుంచి వచ్చిన అరణపు సేవకుడు అతను. అతనితో పని చేయించుకునే హక్కు మాకులేదా?" ఉక్రోషం నిండిన కంఠంతో వెంటనే కల్పించుకున్నది ముఖద్వారం చాటున నిలబడి వున్న బ్రాహ్మణి.

"అరణపు సేవకులతో పనులు చేయించుకునే హక్కులను గురించి మేము మాట్లాడటంలేదు. ఆ పనులు గ్రామ కట్టుబాట్లకు విరుద్ధంగా వుండకూడదనే మాటను మీకు తెలియచేయటానికి వచ్చాము" వెంటనే సమాధానం ఇచ్చాడు ఒక గ్రామపెద్ద.

అతని కంఠంలో ఇమిడివున్న కాఠిన్యాన్ని గమనించి తన మాటల సరళిని ఆమె మార్చుకుని వున్నట్లయితే బాగుండి వుండేది. అలా చేయలేదామె.

"ఈ కట్టుబాట్లు గిట్టుబాట్లు నాకు అనవసరం. మా ఇంటి పనివాళ్ళతో మా ఇష్టం వచ్చిన పనులు మా ఇష్టం వచ్చినప్పుడు చేయించుకుంటాము" అంటూ దురుసుగా మాట్లాడింది.

ఆ మాటల్ని ఆలకించి ఆగ్రహోదగ్ధులు అయ్యారు అక్కడి గ్రామస్థులందరూ.

"మనమీదా, మనం ఇచ్చే దక్షిణ తాంబూలాలమీదా ఆధారపడి బ్రతికే ఈ బ్రాహ్మణుడి కుటుంబానికి గర్వం చాలా అధికం అయిపోయింది. మనకట్టుబాట్లను ధిక్కరించే ధైర్యం వచ్చేసింది. వీళ్ళని ఇంతటితో వదిలిపెట్టకూడదు" ముక్తకంఠాలతో బిగ్గరగా అరిచారు అందరూ.

తన భార్య నోటిని మూయించడం తన శక్తికి మించిన పని అని అందరికీ అర్థం అయ్యేటట్లు ఆమెను పల్లెత్తుమాట ఏమీ అనకుండా శిలావిగ్రహంలా నిలుచున్న బ్రాహ్మణుడివంక చూశారు గ్రామస్థులు.

తమ నిర్ణయాన్ని అతనికి వినిపించబోతూ ఎందుకో ఆగిపోయారు వాళ్ళు.

బ్రాహ్మణుడనే గౌరవభావంతో వాళ్ళు అలా తటపటాయిస్తున్నారనుకుని భ్రమపడి మరింత బిగ్గరగా కేకలు పెట్టారు గ్రామస్థులు.

"అభం శుభం తెలియని అమాయకురాలైన కోడలిని రాచి రంపాన పెట్టే రాక్షస కుటుంబం అది... ఇటువంటివాళ్ళు అసలు మన గ్రామంలో వుండకూడదు... మీ నిర్ణయం ఏమిటో త్వరగా వినిపించండి" అంటూ అక్కడ వున్నవారందరూ తొందర చేయబోతుండగా చేతుల్ని గాలిలోకి ఎత్తి అందరినీ నిశ్శబ్దంగా వుండమని హెచ్చరించాడు ఒక గ్రామపెద్ద.

గ్రామపెద్దలు ఎటువంటి నిర్ణయం తీసుకోవాలని గ్రామస్థులంతా కోరుకుంటున్నారో చూచాయగా అర్థం అయ్యేసరికి మిన్ను విరిగి మీద పడినట్లు అయింది బ్రాహ్మణి దంపతులకి.

చేసిన తప్పుకు శిక్షగా గ్రామంనుంచి బహిష్కరిస్తారేమో అన్న భయం క్షణ క్షణానికి అధికం అయిపోతుండగా చేతులు జోడించి రత్నశ్రేష్ఠి వైపు తిరిగాడు ఆ బ్రాహ్మణుడు.

మట్లాడవద్దని అతనికి , అక్కడ వున్న గ్రామస్థులకు అందరికీ మరోసారి సైగచేసి, ఆ వీధిమలుపువైపు చూపుల్ని మరలించాడు ఆ గ్రామపెద్ద.

"పొలిమేరల దగ్గిర ఏదో సందడి ప్రారంభం అయింది. అదేమిటో తెలుసుకోవటం చాలా మంచిది" అని అందరికీ చెప్పబోతుండగా, ఆయాసంతో వగరుస్తూ అక్కడికి వచ్చాడో యువకుడు.

"పొలిమేరల దగ్గిరికి పదండి అందరూ... త్వరగా పదండి.. పుట్టి బుద్ధెరిగిన తరువాత మీరెవరూ చూసివుండని దృశ్యాన్ని చూద్దురుగాని... త్వరగా

పదండి..." ఆయాసాన్ని అణుచుకునే ప్రయత్నం కూడా చేయకుండా అందరినీ హెచ్చరించాడు.

అతన్ని అదిలించి అసలు విషయాన్ని తెలుసుకోవటానికి గ్రామపెద్దలందరూ చేసిన ప్రయత్నాలు వృధా అయ్యాయి.

బ్రాహ్మణుడి గురించి, అతనికి విధించవలసిన శిక్షను గురించి పూర్తిగా మరిచిపోయినట్లు అటుకేసి పరుగులు తీశారు అక్కడి గ్రామస్థులందరూ.

తమను కూడా రమ్మనమని వారు చేసిన సైగలను నిర్లక్ష్యం చేయలేక వారందరి వెనుకగా పొలిమేర దగ్గిరికి పోయిన గ్రామపెద్దలకు, రత్నశ్రేష్టికి అగుపించాడు శ్రీధరుడు.

గ్రామదేవత బొమ్మను భుజాలమీదికి ఎత్తుకున్నట్లు అత్యుత్సాహముతో అతన్ని మోసుకు వస్తున్నారు కొందరు యువకులు. గొంతులు చినిగిపోయేటట్లు జయజయధ్వానాలు చేస్తున్నారు.

వారందరి వెనుకగా వస్తున్న వృషభశకటాన్ని, ఆ శకటంమీద బంధింపబడి వున్న అపరిచిత వ్యక్తుల్ని, వారి వెనుకగా నిలబడి గ్రామస్థులందరికీ అభివాదం చేస్తున్న ఒక వృద్ధుడిని చూసేసరికి విపరీతమయిన ఆశ్చర్యం గ్రామపెద్దల్ని ఆవరించుకున్నది.

అంత సందడిలోను వారిని గమనించి, యువకుడి మాదిరిగా శకటం మీదినుంచి క్రిందికి దూకాడా వృద్ధుడు. పరుగు పరుగున దగ్గిరికి వచ్చి అడవిలో జరిగిన సంఘటనల్ని వివరించాడు. తాము ఆ గ్రామానికి పెద్దలమనే సంగతిని మరిచిపోయి, గ్రామస్థులందరి మాదిరిగా తాముకూడా శ్రీధరుడికి జయజయధ్వానాలు చేశారు గ్రామపెద్దలు.

మహావ్యాఘ్రం వాతపడి మరణించి మట్టిలో కలిసిపోయారని అనుకుంటున్న వారిలో నలుగురు ప్రాణాలతో తిరిగి రావటాన్ని చూసేసరికి హద్దులు లేకుండా పోయాయి వారి ఆనందానికి!!

"చనిపోయాడని మేము అనుకుంటున్న మా ముసలి పూజారిని, ముగ్గురు గ్రామస్థుల్ని ప్రాణాలతో వెనక్కు తీసుకువచ్చి మాకు మహోపకారం చేశావు... నీకు ఏం కావాలో కోరుకో ... నీ కోరిక ఎటువంటిదయినా నేను తీరుస్తాను... మణులు కావాలా, మడిమాన్యాలు కావాలా, ధనం కావాలా?" ఆనందాతి రేకంతో తనను తాను మరిచి యువకుల భుజాలమీది నుంచి శ్రీధరుడిని దింపించి అడిగాడు రత్నశ్రేష్టి.

శకటం మీద వున్న కాపాలికుడిని, అతని అనుచరులను కొందరు యువకులు గ్రామం మధ్యలో వున్న ఒక కట్టడంలోకి నెట్టి తలుపుల్ని గట్టిగా బంధించేవరకూ ఆగాడు శ్రీధరుడు.

"మహంతీ నగరంలో వున్న రాజప్రతినిధికి ఇప్పుడే వర్తమానం పంపిస్తాను. వందమంది సైనికులతో వచ్చి వీరిని రాజధానికి తరలించమని. మహారాజు ఎదుట వీరి అత్యాచారాలను విచారించి సరయిన శిక్ష పడేటట్లు చూడమని చెపుతాను" అతని ఆలోచనలు తనకు అర్థం అయినట్లు అన్నాడు రత్నశ్రేష్టి.

వందమంది సైనికులతో రాజప్రతినిధిని ఆ గ్రామానికి రప్పిస్తారనే మాట అతని నోటినుంచి వెలువడేసరికి వేపాకులు నమిలినట్లు చేదుగా తయారయింది శ్రీధరుడి నోరు.

కాపాలికుడిని అతని అనుచరుల్ని బంధించి తమతో రాజధానికి తీసుకు పోవటంతో ఆగరు వాళ్ళు. మహారాజు ఎదుట విచారణ జరిపించే సమయంలో సాక్ష్యం పలకటానికి తనను కూడా రాజధానికి రమ్మని ఆదేశిస్తారు.

ఏ ప్రమాదాన్నుంచి తప్పించుకోవటానికి తను అలా ఊళ్ళు పట్టుకు తిరుగుతున్నాడో ఆ ప్రమాదం తిరిగి తనను చుట్టుముట్టటానికి సిద్ధం అవుతోంది. రాజధానిలో అడుగుపెట్టిన మరుక్షణం తనను గుర్తుపడతారు అక్కడి రాజభటులు.

కాపాలికుడిని విచారించేందుకు ముందుగానే తనను విచారించి కారాగారంలోకి నెట్టివేస్తారు.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్? రాజప్రతినిధి నా మాటల్ని మన్నించి ఇక్కడికి రాదని అనుకుంటున్నావా?" అని రత్నశ్రేష్ఠి పలుకరించేసరికి తన ఆలోచనల్ని బలవంతంగా అదుముకుంటూ చిరునవ్వు నవ్వాడు శ్రీధరుడు.

ముసలి పూజారి కుటుంబీకులు వచ్చి అతని పాదాలకు నమస్కరించి పోయారు. పూజారితోపాటు విడిపించబడిన గ్రామస్థుల బంధుమిత్రులందరూ ఒకరి తరువాత ఒకరుగా వచ్చి అతనికి తమ కృతజ్ఞతలు తెలియచేసుకున్నారు.

"మన గ్రామంలో అడుగుపెట్టిన తరువాత సామాన్యులెవరూ చేయలేని పనుల్ని వంటరిగా చేసి చూపించిన వీరుడు ఇతను... అరణపు సేవకుడిగా హీనమైన జీవితాన్ని గడపటం బాగోలేదు... ఏదో ఒకటి వెంటనే చేసి మనం కృతజ్ఞతలు తెలియచేసుకోవాలి..." అదను చూసుకుని రత్నశ్రేష్ఠి చెవిలో వూదాడు ఒక గ్రామపెద్ద.

తులసి అత్తమామల్ని అప్పటికప్పుడు గ్రామమధ్యలో వున్న రచ్చబండ దగ్గరికి పిలిపించాడు రత్నశ్రేష్టి. వారు అడిగినంత ధనం ఇచ్చి శ్రీధరుడికి దాస్యవిముక్తి కలిగించాలని అతని ఉద్దేశ్యం.

అయితే ఆ పలుకులు అతని నోటినుంచి వెలువడకముందే అకస్మాత్తుగా విచిత్రమయిన మలుపు తిరిగాయి అక్కడి పరిస్థితులు.

అంతకుముందు బ్రాహ్మణుడి భార్య గ్రామపెద్దల ఎదుట మాట్లాడిన మాటల్ని మరోసారి గుర్తుకు తెచ్చుకుని విపరీతమైన కోపంతో వెర్రిగా కేకలు పెట్టారు గ్రామస్థులు.

"వీరిని కూడా కాపాలికుడితోపాటు బంధించాలి... కాపాలికుడి దుర్మార్గపు పనుల్లో వారికి కూడా భాగం వుండే వుంటుంది. అతను తలపెట్టిన నరబలి కార్యక్రమానికి ఉపయోగపడేందుకు తమ సేవకుడిని బెదిరించి అడవిలోకి పంపారు. సందేహంలేదు..." అంటూ అందరినీ రెచ్చగొట్టాడు వారిలో ఒకతను.

గొల్లున అరిచి ముందుకు రాబోయిన గ్రామస్థులను చూసేసరికి విపరీతమైన భయంతో బెంబేలెత్తిపోయారా దంపతులు. కంపించిపోతున్న కరాలను ఒకటిగా చేరుస్తూ రత్నశ్రేష్టి దగ్గరికి పరుగు తీశారు.

ముందుకు రాబోయిన గ్రామస్థులందరినీ మంచిమాటలతో కదలకుండా నిలబెట్టాడు శ్రీధరుడు.

"ఎవరి పనుపున నేను వీరి యింటికి అరణపు సేవకుడిగా వచ్చానో, ఆ అమాయకురాలి జీవితం నాశనమవటం నాకు ఇష్టంలేదు... కాపాలికుడి దుర్మార్గపు పనుల్లో వీరికి భాగంలేదు.

దయచేసి నా మాట నమ్మండి..." అంటూ వారిని వేడుకున్నాడు.

"మీరు రాచిరంపాన పెట్టాలని అనుకుంటున్న మీ సేవకుడి మనస్తత్వం ఎలాంటిదో మీకు అర్థం అయిందా? ఇంత జరిగిన తర్వాత కూడా అతనితో సేవలు చేయించుకోవాలనే మీరు కోరుకుంటున్నారా?" బ్రాహ్మణ దంపతులకేసి చూస్తూ అడిగాడు రత్నశ్రేష్టి.

చెంపలు వేసుకుని అతడికి, శ్రీధరుడికి అభివాదాలు చేశారా దంపతులు.

"అర్హతను మించిన కోరికలు కోరామని మాకు బాగా అర్థం అయింది. రేపే మేము వెళ్లి మా కోడల్ని తీసుకువస్తాము... మాతోపాటు ఇతన్ని, ఇతని స్నేహితురాలిని తీసుకుపోయి మా వియ్యంకుడికి అప్పగించి వస్తాను..." అని విన్నవించుకున్నాడు.

మణులు కావాలా మాన్యాలు కావాలా అని రత్నశ్రేష్టి మరోసారి తనను నిర్బంధించకముందే చల్లగా వెనక్కి జరిగి యింటికి వచ్చేశాడు శ్రీధరుడు. శకటంమీది ఆకుల్ని, దర్భల మోపుల్ని యింటిముందు భాగంలో దించి అటూ యిటూ చూస్తుండగా అగుపించింది బావిదగ్గర నిలబడి వున్న హేమసుందరి.

"పొద్దుపోయి చాలాసేపయింది... విశ్రాంతి తీసుకుంటూ వుంటావని అనుకున్నాను" ఆమె ఎదుటికిపోతూ మృదుస్వరంతో పలకరించాడతను.

కన్నీటి చారికలతో మలినం అయివున్న ముఖాన్ని ఎత్తి అతనికేసి చూసిందామె.

"దుఃఖిస్తున్నావా? దుఃఖం దేనికి?" ఆశ్చర్యంగా ప్రశ్నించబోయి, ఆమె ఒక్కసారిగా తనను కౌగలించుకునేసరికి ఆ మాటల్ని మింగేశాడు శ్రీధరుడు.

"నువ్వు వెళ్ళిన ప్రదేశంలో నిజంగా మహావ్యాఘ్రమే వుండి, నీకు ఏదయినా అపకారం జరిగివుంటే నేను ఏమయిపోయేదాన్నో ఆలోచించావా?" వెక్కిళ్ళు పెడుతూ ప్రశ్నించింది హేమసుందరి.

ఆమె సామీప్యం తనలో రకరకాల అనుభూతుల్ని రేకెత్తించటం మొదలు పెట్టేసరికి సమాధానం ఇవ్వకుండా అలాగే నిలుచుండిపోయాడు శ్రీధరుడు.

రెండు నిమిషాల తరువాత తనను తాను సంబాళించుకుని దూరంగా జరిగింది హేమసుందరి.

అంతకుముందు మాట్లాడినట్లు ఆదరణపూర్వకమైన మాటలు మరికొన్ని ఆమె నోటివెంట వినవస్తాయని ఎదురుచూసిన శ్రీధరుడికి ఆశాభంగమే ఎదురయింది.

"వద్దు వద్దన్నకొద్దీ ఏవేవో పాడుపనులు చేయటం, అందరి దృష్టిని ఆకర్షించటం నీకు అలవాటయిపోయింది. మహంతీనగరం నుంచి రాజప్రతినిధిని రత్నశ్రేష్ఠి రప్పిస్తే నీ పరిస్థితి ఏమౌతుందో ఆలోచించుకున్నావా?" కోపం నిండిన కంఠంతో అడిగిందామె.

మరచిపోదామని అనుకుంటున్న మాట మరోసారి మనసును కలత పరచటం మొదలుపెట్టేసరికి, దీర్ఘంగా నిట్టూర్చాడు శ్రీధరుడు. బావి దగ్గిర్నించి వెనుతిరిగి వృషభశకటం దగ్గిరికి వచ్చేశాడు.

కాపాలికుడి దయవల్లనో, కాపాలికుడికి తులసి అత్తమామలకు బాంధవ్యాన్ని అంటగట్టిన గ్రామస్థుల చలువవల్లనో చక్కదిద్దబడింది తులసి కాపురం. ఎటువంటి మార్పు రావాలని తను అభిలషించాడో ఆ మార్పు తులసి అత్తమామల్లో వచ్చేసింది.

తమంతట తాముగా వారిద్దరూ అరణపు సేవకులు తమకు అవసరం లేదనే మాటను బయటపెట్టారు కాబట్టి, ఇక తనుగాని, హేమగాని వుండాల్సిన అవసరం లేదు. తమ కదలికలు రెండో కంటివాడికి అగుపించకుండా ఆ గ్రామాన్ని వదిలి అవతలికి వెళ్ళిపోవటానికి అభ్యంతరం ఏదీ లేదు.

తనతోపాటు శకటం దగ్గిరికి వచ్చిన హేమసుందరిని విశ్రాంతి తీసుకోమని హెచ్చరిస్తూ మరోసారి వీధివైపు అడుగులు వేశాడు శ్రీధరుడు.

ఒకే ఒక పని ముఖ్యమైనది మిగిలివున్నది. అది కూడా పూర్తిచేసుకోగలిగితే ఆనందంగా ఆ ప్రదేశాన్ని వదిలి వెళ్లిపోవచ్చు.

మనసులోని మాట ఏమిటో తనకు చెప్పకుండా వెళ్ళిపోతున్న ఆ యువక మూర్తిని చూస్తూ గాఢంగా నిట్టూర్చింది హేమసుందరి. అతని రాకకోసం ఎదురుచూస్తూ అలాగే శకటం ముందుభాగంలో కూర్చున్నది.

* * *

కాపాలికుడి బారిన పడి అతని క్షుద్రదేవతకు బలైపోకుండా, ప్రాణాలతో తిరిగిరాగలిగిన తమవారి అదృష్టాన్ని పొగడుతూ రచ్చబండ దగ్గిరే గుమికూడి వున్నారు గ్రామస్థులు.

శ్రీధరుడి చేతిలో దారుణమైన దెబ్బలు తిన్న కాపాలికుడికి, అతని అనుచరులకు గ్రామవైద్యుడిచేత వైద్యం చేయించి, వారి గాయాలకు కట్లు కట్టించటంలో తీరికలేకుండా వున్నారు కొందరు యువకులు.

అప్పటికప్పుడు మహంతీ నగరానికి ప్రయాణం అవుతున్నారు మరికొంతమంది. రాజప్రతినిధికి రత్నశ్రేష్ఠి వ్రాసి ఇచ్చిన లేఖను దట్టీలో

భద్రపరచుకుంటున్నాడు ప్రయాణం అయిన వారందరికీ నాయకత్వం వహిస్తున్న రత్నశ్రేష్టి కుమారుడు.

"మీరు మహంతీ నగరాన్ని చేరుకునే సరికి తెల్లవారిపోతుంది. ఆలస్యం చేయకుండా వెంటనే రాజప్రతినిధి మందిరం ముందుకు వెళ్ళండి.

జరిగింది ఏమిటో వివరంగా చెప్పి లేఖను అతని చేతికి యివ్వండి. వెంటనే ఇక్కడికి బయలుదేరి రావటం చాలా మంచిదని చెప్పండి."

అప్పటికి ఆరోసారి అందరికీ సూచనలు యిచ్చి, తను స్వయంగా ఉపయోగించే ఆశ్వశకటాన్ని వారి పరం చేశాడు రత్నశ్రేష్టి. దగ్గిర వుండి పొలిమేరలదాకా వారిని సాగనంపాడు.

కాపాలికుడిని, అతని అనుచరులను తప్పించుకోకుండా గట్టి కాపలాను ఏర్పాటు చేశారు గ్రామపెద్దలు.

గ్రామమంతా ఆదమరిచి వున్న సమయంలో అతను మంత్రాలను చదివి, తన క్షుద్రశక్తులను గ్రామంమీదికి పంపకం చేయకుండా నోటినిండా గుడ్డముక్కల్ని కుక్కి మంత్ర పఠనానికి వీలులేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

అర్థరాత్రి గడిచిపోయిన తర్వాత కదిలారు అందరూ ఆ ప్రదేశంలో నుంచి. ఒకరి తర్వాత ఒకరుగా తమ తమ నెలవులకు వెళ్ళిపోయారు.

అక్కడి సంరంభం సద్దుమణిగేదాకా ఒక ఇంటిచాటున నిలచున్నాడు శ్రీధరుడు. తన కదలికలు ఎవరికంటా పడవని నిశ్చయమయ్యాక గ్రామదేవత ఆలయం దగ్గిరికి పోయాడు.

అమ్మవారికి పవళింపు సేవను జరిపిన తరువాత తలుపుల్ని మూసి, తమ దారిన తాము వెళ్ళిపోయారు అర్చకస్వాములు. ఆలయ గోపురపు ప్రధాన ద్వారాన్ని కూడా మూసివేశారు.

రెండు నిలువుల ఎత్తున్న ప్రాకారాన్ని దక్షిణదిశలో నుంచి అవలీలగా అధిగమించి ఆలయ ప్రాంగణంలోకి అడుగుపెట్టాడు శ్రీధరుడు.

ధనదుపురంకోట వెలుపల వున్నభైరవీ ఆలయం మాదిరిగానే ఎప్పుడో కొన్నివందల సంవత్సరాల క్రితం నిర్మించబడినట్లు కనిపిస్తున్నాయి అక్కడ వున్న కట్టడాలన్నీ.

ధ్వజస్తంభం దగ్గిర ఒక చిన్నగూటిలో వున్న చమురు దీపం దగ్గిరికిపోయి, వత్తిని ఎగద్రోశాలు శ్రీధరుడు. ఆ వెలుగులో తన ముంజేతి కంకణాన్ని పరిశీలించి చూశాడు.

గ్రామదేవత ఆలయ గోపురాన్ని ఎక్కడో చూసినట్లు అనిపించటంలో అసందర్భం ఏదీలేదని వెంటనే తెలిసివచ్చింది అతనికి.

ధనదుపురం భైరవీ ఆలయపుబొమ్మ తరువాత ఆ కంకణంమీద చెక్కబడివున్నది ఆ గ్రామదేవత ఆలయ గోపురమే. ఆ గోపురం పక్కనే వున్నది పడగవిప్పి బుసలు కొడుతున్న కాలనాగు చిత్రం ఒకటి.

కంకణాన్ని తిరిగి ముంజేతికి అమర్చుకుంటూ ఆలయం చుట్టూ రెండుసార్లు ప్రదక్షిణం చేశాడు శ్రీధరుడు.

మూడవసారి అడుగులు వేస్తుండగా అతని దృష్టిని ఆకర్షించింది గర్భగుడి వెనుక భాగంలోని ఒక దేవతాశిల్పం.

మూరెడు ఎత్తున పడగను ఎత్తి ఆ శిల్పపు శిరస్సుమీద నృత్యం చేస్తున్నది ఒక కాలనాగు బొమ్మ.

తోకను పట్టుకున్నాడు శ్రీధరుడు... నడుమును స్పృశించాడు....

మెడమీదినుంచి పడగ వరకూ పోయాయి అతని చేతివేళ్ళు....

ఉన్నట్లుండి వికృతశబ్దాలు చేస్తూ పక్కకు జరిగింది పడగక్రింద వున్న దేవతాశిల్పం తన వెనుక భాగంలో వున్న గూటిని, అందులోని లోహపు పేటికను అతనికి అగుపింపచేసింది.

గుబగుబలాడుతున్న గుండెల్ని చిక్కబట్టుకుంటూ ఆ పేటికను అందుకొని, దట్టీలోని పిడిబాకు సహాయంతో మూతను తెరిచాడు శ్రీధరుడు.

భైరవీ ఆలయ ప్రాంగణంలో లభించిన రాగిరేకు వంటిదే మరొకటి ఆ పేటికలో కనిపించి అతని ఆశ్చర్యాన్ని అధికం చేసింది.

కాపాలికుడు వూహించినట్లు కర్మరుడి నిధి ఆ ఆలయంలో భద్రపరచి లేదు... ఆ నిధికి సంబంధించిన వివరాల్లో కొన్ని భాగాలు మాత్రమే అక్కడ నిక్షేపించబడ్డాయి. ఆ విషయం తెలియక అనవసరమయిన కష్టాలను కొనితెచ్చుకున్నాడతను... గ్రామస్థుల ఆగ్రహానికి గురై ప్రాణాలను పోగొట్టుకోబోతున్నాడు.

ఉన్నట్లుండి రెండు వానచినుకులు తన శిరస్సుమీద పడటంతో వులిక్కిపడి ఆకాశం వంక చూశాడు శ్రీధరుడు.

అంతవరకూ ఎంతో నిర్మలంగా వున్న ఆకసం కాస్తా నల్లటి దట్టమయిన మబ్బులతో నిండిపోతున్నది... దారుణమైన వర్షం ప్రారంభం అవబోతున్నదనటానికి సూచనగా గాలి స్తంభించిపోయింది.

లోహపు పేటికలో లభించిన రాగిరేకును దట్టీలో జాగ్రత్తగా భద్రపరుచుకుని, పేటికను దేవతా విగ్రహం వెనుక భద్రపరిచినాడు తను... కాలనాగును అదిమి విగ్రహాన్ని యధాస్థానంలోకి జరిపాడు.

ఆ పని అవుతున్న సమయంలోనే అధికం అయింది వర్షం....

చూస్తూ చూస్తూ వుండగానే నీటితో నిండిపోయింది ఆలయ ప్రాంగణం.

ఆలయ ప్రాకారం మీదినుంచి అవతలికి దుమికి, పరుగులాంటి నడకతో తులసి అత్తవారింటికి చేరుకున్నాడు శ్రీధరుడు.

తనకోసం ఎదురుచూస్తూ శకటంలో ముడుచుకు కూర్చున్న హేమసుందరికి చేయివూపి, వృషభాలను శకటానికి కట్టాడు.

"లోపలికి వచ్చి విశ్రాంతి తీసుకోమని గట్టిగా పట్టుబట్టింది తులసి అత్తమ్మ... నీ గురించి అదేపనిగా అడిగింది..." లోగొంతుకతో అతనికి చెప్పింది హేమసుందరి.

అక్కడ ఇంకొక్క క్షణం ఆలస్యంచేస్తే ఆమె ఇంటిలోనుంచి బయటికి వచ్చి తనను గమనిస్తుందన్న భయంతో నిశ్శబ్దంగా శకటాన్ని కదిలించి వీధిలోకి తీసుకువచ్చాడు శ్రీధరుడు.

క్షణక్షణానికి అధికం అయినపోతున్నది వర్షం... కుండలతో కుమ్మరించినట్లు వీధుల్ని నింపేస్తున్నాయి నీళ్ళు. తెల్లవారిన తర్వాత తమ శకటపు గుర్తులు ఎవరికీ అగుపించకుండా వుండేందుకు ఆ నీరు ఎంతగానో వుపయోగపడుతుందని గ్రహించి, వృషభలను అదిలించాడు శ్రీధరుడు.

పావుఘడియలో ఆ గ్రామపు పొలిమేరల్ని మరలించాడు.

తెల్లగా తెల్లవారే వరకూ ఎక్కడా ఆగకుండా ప్రయాణం చేసి, ఒక చిట్టడవి ముందు భాగంలో బండిని దించాడు.

తూర్పుదిక్కు తెల్లబడటమే మాదిరి దట్టంగా ముసురుకునే వున్నాయి ఆకాశంలోని మేఘాలు.

ఊపిరి తీసుకునే వ్యవధి కూడా ఇవ్వటం ఇష్టంలేనట్లు అదేపనిగా కురుస్తూనే వున్నది వర్షం.

దోసిళ్ళలో పడిన ఆ వర్షపునీటితోనే కడుపుల్ని నింపుకొని, అర్థఘడియ తర్వాత తిరిగి ముందుకు సాగారు. సాయం సమయం అవుతూ వుండగా, ఒక వటవృక్షాన్ని ఎంపికచేసుకుని ఆగిపోయారు.

దట్టీని పిడిబాకుతో అడవిలోకి పోయి, కొన్ని అడవి దుంపల్ని సేకరించుకు వచ్చాడు శ్రీధరుడు. శకటంలోని ఎండుగడ్డిని వుపయోగించి,శకటం క్రిందిభాగంలో చిన్నమంట వేశాడు. అడవిదుంపల్ని ఆ మంటల్లో పెట్టి హేమసుందరిని పిలిచాడు.

క్షణం కూడా విశ్రాంతి ఇవ్వకుండా అదేపనిగా కురుస్తున్న వర్షం వలన చికాకుకు గురి అవుతున్నాయి వృషభాలు. ఎంత అదిలించినా ఆగకుండా తాముకూడా శకటం క్రిందికి చొచ్చుకువచ్చేశాయి.

తనవంతు దుంపల్లో రెండింటిని వాటికి పెట్టి, ఎపపటి వృషభం నడుము మీద తల ఆనించుకుని పడుకున్నాడు శ్రీధరుడు.

"ఒక్కమాట కూడా చెప్పకుండా మటుమాయం అయిపోయిన మనగురించి వైకుంతపురం గ్రామస్థలు ఏమని అనుకుంటూ వుంటారో

ఊహించగలవా?" తడిసిపోయిన పమిటచెంగును గట్టిగా పిండుకుంటూ అడిగింది హేమసుందరి.

వైకుంఠపురం గ్రామస్థులు తమను గురించి ఏమని అనుకుంటూ వుంటారో నన్న విషయాన్ని గురించి ఆలోచించటంలేదు శ్రీధరుడు. ధనదుపురంలో తలదాచుకోమని పంపిన తన తండ్రిని గురించి యోచిస్తున్నాడు...సుడిగాలిలో చిక్కబడిన ఎండుటాకు మాదిరి ఎక్కడెక్కడికో తరలిపోతున్న తనను గురించి, తను చిక్కపడిన పరిస్థితులను తలిస్తే ఆయన ఎంత బాధపడతారో తలుచుకునేసరికి అతన్ని దిగులు ఆవరించుకున్నది.

హేమసుందరిని తరళాపురానికి చేర్చిన వెంటనే తను వెనుతిరిగి ధనదుపుర పరిసరాల్లోకి వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్న తర్వాత కొలదిగా ఉపశమించింది అతని అంతరంగంలోని అలజడి.

ఆగి ఆగి వీస్తున్న ఈదురుగాలిని, అదేపనిగా కురుస్తున్న వర్షాన్ని లెక్క చేయకుండా నిదురలోకి జారిపోయాడతను. చీకటి సమయంలో అడవి జంతువులు ఏవైనా తమమీదికి వచ్చిపడకుండా ఓపిక వున్నంతవరకూ కాపలా కుర్చున్నది హేమసుందిరి.

ఓపిక నశించగానే అతని భుజంమీద తలపెట్టుకుని తనుకూడా నిద్రపోయింది.

* * *

"ఎవరిదయ్యా ఈ శకటం? ముంచుకు వస్తున్న ప్రమాదాన్ని గురించి పట్టించుకోకుండా నిబ్బరంగా నిద్రిస్తున్నది ఎవరు?" ఖంగుమంటున్న కంఠం ఒకటి బిగ్గిరిగా వినవచ్చేసరికి వులిక్కిపడి కనులు తెరిచాడు శ్రీధరుడు.

కదలకుండా పడుకుని వున్న హేమసుందరిని హెచ్చరించి, వృషభాలను బండి క్రిందినుంచి బయటికి తీసుకువచ్చాడు.

అప్పుడప్పుడే తెల్లబడుతున్నది తూర్పుదిక్కు... చీకటి తెరలు విడివడక ముందే ఆగిపోయింది వర్షం....ఆహ్లాదకరంగా అగుపిస్తోంది చుట్టూ వున్న ప్రకృతి.

"వర్షం వెలిసిన తరువాత ప్రకృతిమాత అందాలను చూస్తూ పరవశించి పోవాలని అనుకోవటం సహజం... కానీ వర్షం కారణంగా మనల్ని చుట్టుముట్టే ప్రమాదాల్ని మాత్రం మరిచిపోకూడదు" చుట్టూ చూస్తున్న శ్రీధరుడిని హెచ్చరించింది అంతకుముందు వినవచ్చిన కంఠం.

ఉలికిపాటును నేర్పుగా కప్పిపెట్టుకుంటూ తలను పక్కకు తిప్పిన శ్రీధరుడికి పది ధనువుల దూరంలో అగుపించాడు ఒక గ్రామీణుడు.

పది మూరల నిడివి వుండే మందపాటి వస్త్రాన్ని తలపాగా మాదిరిగా తలకు చుట్టుకుని, ఒంటిమీది దుస్తుల్ని మోకాళ్ళపైకి మడిచి పట్టుకుని శ్రీధరుడి వంకే నిశితంగా చూస్తూన్నాడతను.

"రాత్రి పగలు తేడా లేకుండా కురిసిన వానవల్లి ఈ అడవిలోని వాగులు వంకలు పొంగి పోటెత్తిపోతున్నాయి. ఇటువైపే వచ్చేస్తోంది ఒక జలప్రవాహం...శకటాన్ని వెంటనే ఇవతలికి నడిపించకపోతే ఆ నీటిలో చిక్కబడి కొట్టుకుపోతుంది" తనంతట తనే తెలియచేశాడతను గట్టిగా అరవటానికి వెనక వున్న కారణాన్ని.

అటువంటి మాటల్ని రెండవసారి చెప్పించుకునే అలవాటు శ్రీధరుడికి లేదు. ఒక్కక్షణం కూడా ఆలస్యం చేయకుండా వృషభాలను బండికి కట్టి, ఒక మెరక ప్రదేశం మీదికి నడిపించాడు.

సరిగ్గా ఒక పావుఘడియ తర్వాత ఉరుకులు పరుగులు పెడుతూ వచ్చి వటవృక్షాన్ని చుట్టుముట్టింది జలప్రవాహం. వికృతశబ్దాలు చేస్తూ ఒక పక్కగా ఒరిగిపోయిందా మహావృక్షం.

సరైన సమయంలో వచ్చి తమ ప్రాణాలను కాపాడిన ఆ గ్రామీణుడికి కృతజ్ఞతలు తెలియచేసుకున్నాడు శ్రీధరుడు. అతనితోపాటు అక్కడికి రెండు క్రోసుల దూరంలో వున్న ఒక కుగ్రామానికి శకటాన్ని తీసుకుపోయాడు.

జలప్రవాహంలో చిక్కబడి తల్లక్రిందులైపోకుండా వారిని కాపాడినందుకు ఆ గ్రామస్థులు కూడా తమ మనిషిని మెచ్చుకున్నారు.

"వర్షం కారణంగా వచ్చిన అలసట తీరేవరకూ మీరు మాగ్రామంలోనే వుండవచ్చు... అయితే సరైన ఆతిథ్యం ఇచ్చేందుకు మేము ఎవరమూ యిక్కడ వుండటంలేదు... మా ఇళ్ళల్లోని వృద్ధులు మాత్రమే వుంటారు..." ఆ మాటలు చెప్పటానికి ఎంతగానో బాధపడుతున్నట్లుగా ముఖం పెడుతూ అన్నాడు గ్రామపెద్ద.

కట్టెలు కొట్టుకోవటానికో,తమ పశువులకు గ్రాసాన్ని పోగుచేసుకోవటానికో వారందరూ అడవిలోకి వెళతారని అనుకున్నాడు శ్రీధరుడు. రోజుల తరబడి గ్రామానికి దూరంగా వుండిపోతారని భావించాడు.పది నిముషాలు కూడా గడవకముందే తప్పని తేలిపోయింది అతని అభిప్రాయం.

కొట్టెలకోసం, పశువులకు పనికివచ్చే గ్రాసం కోసం అడవిలోకి వెళ్ళటం లేదు ఆ గ్రామస్థులు. పెళ్ళిళ్ళకు, పెద్ద పెద్ద తిరునాళ్ళకు పోతున్నట్లు అందమైన దుస్తుల్ని ధరించి తమతమ శకటాల్లో కూర్చున్నారు.

ఆశ్చర్యంగా చూసిన హేమసుందరిని పక్కకు పిలిచి అందుకు కారణాన్ని మెల్లిగా వివరించింది గ్రామపెద్ద మూడవభార్య.

"ఇక్కడికి రెండురోజుల ప్రయాణంలో వున్న వైకుంఠంలో అమ్మవారు గ్రామస్థులందరికీ అగుపించిందని తెల్లవారు జామున మాకు ఒక మాట తెలిసింది. ఆ తల్లిని దర్శించుకుని పునీతులవ్వాలని పోతున్నాం మేము అందరమూ..."

తాము వదిలి వచ్చిన వైకుంఠపురంలో తమకు కనిపించని దేవత గ్రామస్థులకు ఎప్పుడు దర్శనమిచ్చిందో హేమసుందరికి అర్థంకాలేదు.

ఆమె వదనంలో ప్రతిఫలిస్తున్న ఆశ్చర్యాన్ని గమనించి శ్రీధరుడికి కూడా వినిపించేటట్లు పెద్దకంఠంతో తన మాటలకు పూర్తి వివరణ యిచ్చింది గ్రామపెద్ద భార్య.

"గ్రామదేవత ఆలయంలో ఏవో నిధులు వున్నాయన్న నమ్మకంతో గ్రామస్థుల్ని కొందరిని క్షుద్రదేవతలకు బలి యిచ్చే ప్రయత్నాలు చేశాడట ఒక కపాలికుడు. తన బిడ్డలకు జరుగుతున్న అన్యాయాన్ని చూసి సహించలేక తన సోదరుడైన పోతురాజుతో సహా మనవరూపంలో గ్రామ పురోహితుడి ఇంటికి వచ్చిందట... తన సోదరుడు పోతురాజును అడవిలోకి పంపి ఆ కాపాలికుడి ఆటలు కట్టించిందట...ఆ పని పూర్తి అయిన వెంటనే రాత్రి రాత్రిఎవరికీ అగుపించకుండా మాయం అయిపోయిందిట....

తమ మధ్యకు వచ్చి తమ కళ్ళముందే నిలబడిన ఆ తల్లిని గుర్తు పట్టలేక పోయినందుకు బాధపడుతూ, బ్రహ్మాండమయిన కొలువులు కొలిపించుకున్నారట వైకుంఠపురం గ్రామస్థులు...

మహంతీనగరం నుంచి వచ్చే రాజప్రతినిధికి తమ జాడలు తెలియకుండా వుండేందుకు రాత్రి రాత్రి వైకుంఠపురాన్ని వదిలి వచ్చేశాడు శ్రీధరుడు....

తమ అంతర్ధానానికి అటువంటి కట్టుకథలను అంటగడతారని మాత్రం వూహించలేదు... తనను పోతురాజుగాను, హేమసుందరిని గ్రామదేవతగాను భావిస్తారని పొరపాటున కూడా అనుకోలేదు.

"మా మాటలమీద నమ్మకం లేదా?" అతని ముఖంలోకూడా ప్రతిఫలించిన ఆశ్చర్యాన్ని గమనించి కాస్తంత వేడిగానే అడిగాడు గ్రామపెద్ద.

"తన ఆలయానికి ధర్మకర్తగా, తన తలమీదికి వజ్రాల కిరీటాన్ని చేయించిన భక్తుడిగా పేరుపొందిన రత్నశ్రేష్టి మనవడిని మానవమాత్రులెవరూ దిగలేని లోతైన నూతిలోంచి బయటికి తీశాడు పోతురాజు, అందుకు సంతోషించి ధనధాన్యాదులు యిస్తానన్న రత్నశ్రేష్టి మాటల్ని వినిపించు కోలేదుట...

మామూలు మనుషులెవరైనా అటువంటి పని చేయగలరా? ధనధాన్యాదుల్ని తిరస్కరించగలరా? గ్రామస్థులు అభిమానాన్ని సంపాదించిన తర్వాత ఎవరికీ చెప్పకుండా మాయం అయిపోగలరా?" అంటూ ప్రారంభించిన అతని భార్య మాటలకు అతి వేగంగా తలవూపి, అప్పటికప్పుడు తన వృషభాలను ప్రయాణానికి సిద్ధం చేశాడు శ్రీధరుడు.

"ఆలస్యం చేస్తే తాము విన్న కథల్ని మరీ మరీ తలుచుకుంటారు వీళ్ళు... మన ఇద్దరి ఆకారాలను వైకుంఠపురంలోని ఆ కథలతో పోల్చి చూస్తారు.

అనుమానం అంటూ వచ్చిందంటే మన పని అయిపోతుంది. మన జాడలు మహంతీనగర రాజప్రతినిధికి, అతని ద్వారా ధనదుపుర సార్వభౌముడికి

తెలిసిపోతాయి" అంటూ, గ్రామపెద్దకు నమస్కరించి తరళాపురివైపు పరుగులు తీయించాడు.

సూర్యుడు నడినెత్తి మీదికి చేరుకునే సమయం లోపల వారికి ఎదురైనారు , వైకుంఠపురం గ్రామదేవత దగ్గిరికి పోతున్న మరో నాలుగు గ్రామాల ప్రయాణీకులు. చీకటి పడేలోపల ఇంకో పది గ్రామాలవారు అగుపించారు.

అలసటతో వడిలిపోకుండా అవసరమైనంత విశ్రాంతిని తీసుకుంటూ ప్రక్కలకు కూడా చూడకుండా ప్రయాణాన్ని కొనసాగించాడు శ్రీధరుడు. జనావాసాల జోలికి పోకుండా, నిర్మానుష్య ప్రదేశాల్లోనే విడిదిచేస్తూ, పది దినాల తర్వాత తరళాపురికి పదిక్రోసుల దూరంలో శకటాన్ని నిలిపాడు.

విశ్రాంతి తీసుకోవటానికి కాదు అలా నిలిపింది. తరళాపురికి అడ్డుగా ప్రవహించే ఒక బ్రహ్మాండమయిన నదిని అధిగమించటం ఎలాగో తెలియక పోవటం వల్ల నిలబడిపోయాడు.

వైకుంఠపురం నుండి బయలుదేరుతుండగా కురిసిన వర్షాల కారణంగా కొట్టుకుపోయిందిట ఆ నదిమీద ఎప్పుడో పురాతన కాలంలో కట్టిన చెక్కల వంతెన.

"ఇంకో రెండు మూడు వారాలవరకూ నదిలోని ప్రవాహపు వేగం వుపశమించదు. నీటివేగం తగ్గితే తప్ప ఆవలి గట్టుకు చేరుకోవటం కుదరదు. మంచి ప్రదేశాన్ని ఎంచుకుని "బండిని దింపండి... మీకు అవసరమైన ఆహార పదార్థాలను నేను తెప్పించి యిస్తాను..." అన్నాడు తరళాపురిలోని రాజప్రతినిధి అక్కడికి పంపించిన ఒక రాజభటుడు.

రెండు మూడు వారాలపాటు ఎక్కడికీ కదలకుండా రాజభటులు కాపలా వున్నప్రదేశాలలో నిలబడిపోవటానికి అంగీకరించలేదు శ్రీధరుడి అంతరంగం.

రోజులు గడిచినకొద్దీ అధికం అవుతాయి అవతలి వారితో పరిచయాలు. పరిచయాలతోపాటు ప్రశ్నలు వేయటం కూడా ఎక్కువే అవుతుంది. ఎవరికీ తెలియకూడని రహస్యాలు బట్టబయలు కావటం మొదలు అవుతుంది.

తరళాపురిని సమీపిస్తున్నకొద్దీ ముభావంగా, మౌనంగా శకటంలోనే కూర్చుండి పోతున్న హేమసుందరికి అర్థం కాలేదు శ్రీధరుడి మనసుని పీడిస్తున్న బాధ. నది ఒడ్డున నిలబడిపోవటం అతనికి ఇష్టం లేదని తెలిసిన వెంటనే, "ఏం చేద్దామని అనుకుంటున్నావు?" అని ప్రశ్నించింది.

"నది పొంగు తగ్గి తిరిగి ప్రయాణించటం ప్రారంభం అయ్యేవరకు కావేరి తీరాన వున్న శ్రీరంగం వెళ్ళివద్దాం... అక్కడికి అనేక ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల మధ్య మనల్ని గుర్తుపట్టేవారు ఎవరూ వుండరు. మనల్ని గురించి తెలుసుకోవాలన్న ఆత్రుత కూడా ఎవరికీ వుండదు..." అన్నాడు శ్రీధరుడు.

పొంగి పోటెత్తుతున్న తరళాపురి నది శ్రీరంగం దగ్గిర కావేరిలో కలిసి పోతుందని అంతకుముందే అక్కడి రాజభటుడి ద్వారా తెలుసుకొని వున్నది హేమసుందరి.

ఆమె ముఖం ఒక్కసారిగా కాంతివంతం అయింది. ఎందుకనో ఎంత ఆలోచించినా అర్థంకాలేదు శ్రీధరుడికి.

## 11

నాలుగు రోజులపాటు ఎక్కడా ఆగకుండా ప్రయాణం చేసి, ఐదవ రోజు సాయం సమయంలో శ్రీరంగాన్ని చేరుకున్నారు హేమసుందరి, శ్రీధరుడు. ఏడు

ప్రాకారాలతో, మహోన్నతాలైన ప్రాకార ద్వారాలతో, అంబరాన్ని చుంబిస్తున్నట్లుండే ఆలయ శిఖరాలతో, అహర్నిశలూ భగవన్నామ స్మరణ చేస్తూ వుండే భక్తగణాలతో, భూలోక వైకుంఠంలా భాసించే ఆ పుణ్యక్షేత్రాన్ని చూసి మైమరచిపోయింది హేమ.

వద్దు వద్దని శ్రీధరుడు ఎంతగా వారించినా వినకుండా, వరదనీటితో పోటెత్తిపోతున్న కావేరిలో దిగి తలారా స్నానమాచరించింది. తడిదుస్తులతోనే ఆలయగోపురం వైపు చూస్తూ కరకమలాలను ఒకటిగా చేర్చింది.

పుండరీకాక్షుడా పురుషోత్తముడా

నవనీతచోరుడా నందగోపాలా

కలిములిచ్చేవాడ కావేటి రంగా

మునిజన వంద్యుడా మనవి చేకొనమా

అంటూ ఆ కమనీయ క్షేత్రంలో కొలువై యుండే దేవతా సార్వభౌముడికి భక్తిప్రపత్తులతో నమస్సుమాంజలులు సమర్పించింది.

తరళాపురి సమీపంలో అన్నాళ్ళపాటు నిలువకుండా శ్రీరంగం చూసి వద్దామని చెప్పిన వెంటనే ఆమె ముఖం కాంతివంతం అవటానికి కారణం అప్పుడు అవగతమైంది శ్రీధరుడికి.

"రంగనాథుడికి ఏమని మనవి చేసుకోబోతున్నావు?" అని అడుగుతూ శకటాన్ని దించాడతను. సుడులు తిరుగుతున్న కావేరి నదీజలంలోకి వృషభాలను తీసుకుపోయి వాటి శరీరాలమీద బురదను, దుమ్ము ధూళిని వదిలించాడు.

కడుపునిండా నీటిని త్రావించి శకటం దగ్గిరికి తీసుకువచ్చాడు.

"నా తల్లి ధాష్టీకం నుంచి నన్ను బయటపడవేస్తే కావేటిరంగని ముందు నాట్యాం చేస్తానని మొక్కుకున్నాను. ఆ మొక్కు తీర్చుకునే అవకాశం యిప్పించమని వేడుకున్నాను.." అల్లంత దూరంలో వున్న ఆ ఆలయశిఖరం వంకే తదేకంగా చూస్తూ అతనికి చెప్పింది హేమసుందరి.

గుభిల్లుమన్నాయి ఆ మాటల్ని విన్న శ్రీధరుడి గుండెలు.

తాము ఎవరో, ఎందుకు అలా వృషభశకటంలో అదేపనిగా ప్రయాణం చేస్తూ వస్తున్నారో ఎవరికీ తెలియకుండా వుండేందుకు శ్రీరంగం రావటం జరిగింది. భువనైకమోహన రూపంతో ఆమె ఆలయమండపంలో గజ్జె కట్టటం అంటూ జరిగితే దాగుతుందా తమ గుట్టు??

అదేమాట ఆలస్యం చేయకుండా ఆమెకు వివరించి చెప్పాడతను. తరళాపురికి తిరిగి వెళ్ళేటంతవరకూ తలలు వంచుకుని కాలక్షేపం చేయటం తనకు, ఆమెకు చాలా మంచిదని కూడా బోధించాడు.

"ఎవరో ఏదో చేస్తారని భయపడి భగవంతుడి ముందు ఆడిన మాటను మరిచిపోవటం మహాపరాధం కాదా?" అతను చెప్పిన వాటన్నిటికీ అంగీకరించినట్లు తల వూపినట్లే ఊపి, ఉన్నట్లుండి తన అభిప్రాయాన్ని వెల్లడించింది హేమసుందరి.

ఆమె మాటలు విని బండి ముందుభాగంలోని వెదురు గడలకేసి శిరస్సును బాదుకోవాలన్నంత విసుగు శ్రీధరుడిని ఆవరించుకున్నది.

"భగవంతుడి ముందు మాట్లాడిన మాటల్ని మరచిపోమ్మని నేను అనటంలేదు. ఆ మాటల్ని నిలబెట్టుకోవటానికి ఇది సరైన సమయం కాదని అంటున్నాను. నీ గురించి, నా గురించి ఎవరూ ఆలోచించని రోజున ధైర్యంగా

పదిమంది ఎదుటా పడవచ్చని చెపుతున్నాను..." ముంచుకు వస్తున్న కోపాన్ని అతిప్రయత్నంమీద అదుముకుంటూ అన్నాడు.

"ధనదుపురం నుంచి బయలుదేరిన క్షణంనుంచి నన్ను ఆ కావేటి రంగడే కాపాడుతూ వస్తున్నాడు...ఇప్పుడు కూడా అతడే నన్ను రక్షిస్తాడు" దృఢస్వరంతో సమాధానం యిచ్చింది హేమసుందరి.

ధనదుపురంలో భైరవీ ఆలయ పూజారినుంచి, స్ఫురదాపురి సమీపంలో దొంగల బారినుంచి ఆమెను కాపాడింది కావేటిరంగడేనా అని అడుగుదామని అనుకున్నాడు శ్రీధరుడు. కానీ కావేటిరంగని ప్రేరణ మూలకంగానే నువ్వు నన్ను కాపాడావని ఆమె వాక్రుచ్చితే నోరు మెదపటానికి వీలుండదనే భయంతో మౌనంగా వుండిపోయాడు.

తన మాటలు అతనికి విపరీతమైన కోపాన్ని తెప్పించాయని గ్రహించి మెల్లగా అతని సమీపంలోకి వచ్చింది హేమసుందరి.

"నారాయణుడిని నమ్మి చరించినవారికి ఎటువంటి కీడు కలుగనేరదని రామానుజులవారి శిష్యుడు స్వయంగా నాకు చెప్పాడు. శ్రీరంగంలో వుండగా మనల్ని గుర్తించి, గొడవ చేసేవారెవరూ వుండరని నాకు నమ్మకంగా వున్నది" అంటూ అనునయించటానికి ప్రయత్నించింది.

అప్పటికీ పెదవి విప్పలేదు శ్రీధరుడు.

దివినుంచి దిగవచ్చిన దేవకన్యమాదిరి ఆమె ఆలయమండపంలో నృత్యం చేస్తూవుంటే చూసినవారు ఆమెను గురించిన వివరాలు సేకరించకుండా ఆగగలరా? తెలిసినవారికి, తెలియనివారికి ఆమె సొగసును గురించి వర్ణించకుండా వుండగలరా?

ఆలోచించినకొద్దీ అన్నీ అనర్థకాల్ని కలిగించే దృశ్యాలే కనులముందు మెదలటం మొదలయ్యేసరికి మరింత చికాకుకు గురి అయ్యాడు శ్రీధరుడు.

"నా మాట విను... శ్రీరంగంలో వుండగా మనం పరాయివారి దృష్టిని ఆకర్షించే పనులు చేయటం మంచిదికాదు... నీ మొక్కును గురించి కొంత కాలంపాటు మరిచిపో.." సాధ్యమైనంత మృదువుగా ఆమెకు నచ్చచెప్పటానికి ప్రయత్నం చేశాడు.

నీరుకారుతున్న పమిటచెంగును గాలికి అడ్డుగా ఎత్తిపట్టుకుని తడి ఆర్చుకోటానికి సిద్ధమౌతూ తలను పక్కకు తిప్పుకున్నది హేమసుందరి.

అధికతరం అయింది శ్రీధరుడి కోపం.

"నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో... మంచిమాటలు చెపితే చెవిన పెట్టని వారితో అధికంగా మాట్లాడటం అనవసరం. నిన్ను అడ్డుకోవటానికి, వద్దని అనటానికి నేను ఎవరిని?" అని ఆవేశంగా అంటూ శకటం దగ్గర్నుంచి అవతలికి వెళ్ళిపోయాడు.

పది నిముషాలు గడిచిన తరువాత కూడా అతను వెనక్కి రాకపోవటాన్ని గమనించి, గిట్టలతో నేలను గీరుతూ పెద్దగా రంకె పెట్టింది ఎలపటి వృషభం. శకటం అడుగుభాగంలో పదిలపరిచిన ఎండుగడ్డిని తీసి తన ముందు వేయలేదని కోపం వచ్చింది దానికి.

మరికొద్ది సేపటికి తనే అతనికోసం బయలుదేరింది. రెండు వందల ధనువుల దూరంలో ఓ రాయిమీద కూర్చుని వున్నాడు శ్రీధరుడు. వెనుకగా వచ్చి తన భుజాలను తలతో గోరాడబోయిన ఆ జంతువు ముఖం మీద కొట్టటానికి చేతిని ఎత్తాడు.

అతనికంటె వేగంగా చేతిని జాచి అడ్డుకున్నది హేమసుందరి. "నా మీద కోపం వస్తే నన్ను నిందించాలి.. నోరులేని యీ జీవంమీద ఎందుకు కచ్చ?" అని అడిగింది.

చేతిని బలవంతంగా వెనక్కి తీసుకుంటూ తలను పక్కకు తిప్పుకున్నాడు శ్రీధరుడు. అక్కడినించి మరోపక్కకు పోబోతుండగా చటుక్కున అతని దారిని అడ్డగించింది హేమసుందరి.

"భైరవీ ఆలయంలోను, స్ఫురదాపురి సమీపంలోను నా అభిమానాన్ని కాపాడినవాడివి నువ్వు.

నీ సహాయం లేకపోతే నేను ఇంతదూరం క్షేమంగా రాగలిగి వుండేదాన్ని కాదు. శ్రీరంగంలో నృత్యం చేయటం నీకు సమ్మతం కాకపోతే అలాగే మానివేస్తాను. ముందుచూపు లేని మాటలతో ఇక నిన్ను విసిగించను" అని అంటూ వుండగానే ఆమె కనుదోయినుండి జలజలా కపోలాలమీదికి జాలు వారాయి బాష్పధారలు.

ఆ కన్నీటిని చూసేసరికి సూర్యరశ్మి సోకిన మంచుతెరల మాదిరి మటుమాయం అయిపోయింది శ్రీధరుడి కోపం. "అవేం మాటలు హేమసుందరీ? సాటి మనిషిగా నాకు చేతనయిన సాయం చేశానే గాని పని కట్టుకుని నీకు తోడ్పడ్డాననిగాని, పెద్ద ఘనకార్యం చేశానని గాని నేను అనుకోవటంలేదు" అంటూ ఆమె కన్నీటిని తుడవబోయాడు.

ఆ చేతిని ముఖానికి అదుముకుంటూ వెక్కి వెక్కి ఏడ్చింది హేమసుందరి.

ఆ సమయంలో కంటికి కనిపించని రాక్షసహస్తం ఏదో తన గుండెల్ని అదిమేస్తున్నంత బాధ శ్రీధరుడిని ఆవరించుకున్నది.

"శ్రీరంగంలో కుదురుగా కుదురుకున్న తర్వాత వీలుని బట్టి నీ మొక్కును తీర్చుకోవడం గురించి ఆలోచన చేద్దాం. నువ్వు బాధపడకు..." అంటూ ఆమెను అనునయించాడు.

చీకటి తెరలు ఆ ప్రదేశాన్ని చుట్టముట్టటానికి సిద్ధం అవుతున్న తరుణంలో కూడా వారిలో కదలిక కనిపించకపోయేసరికి, గిట్టలతో నేలను గీరి మరోసారి రంకెపెట్టింది ఎలపటి ఎద్దు.

దాని రంకెను విని వడివడిగా ఉలికిపాటును కప్పిపెట్టుకోవటానికి ప్రయత్నిస్తూ ఈ లోకంలోకి వచ్చేశాడు శ్రీధరుడు. వడివడిగా శకటం దగ్గిరికి తిరిగివచ్చి, అడుగు భాగంలోని అమరికలోనుంచి గడ్డిని తీసి వృషభాల ముందు వేశాడు. అర్ధఘడియ తరువాత ఆకలి తీరి అతనివంక చూశాయి అవి.

"పట్టణంలోని వెళ్ళిన తరువాత మీరు చాలా జాగ్రత్తగా మసులుకోవాలి... అడవుల్లో సంచరించినట్లు అటూఇటూ ఇష్టం వచ్చినట్లు పరుగులు తీయటం కుదరదు..." అని వాటికి బుద్ధులు చెపుతూ శకటానికి పూన్చి, ముందుకు కదిలించాడు.

రంగనాథుడికి ఏవో విశేషార్చనలు జరిగినట్లు ఆ సమయంలో అదేపనిగా మ్రోగుతున్న ఆలయంలోని గంటల్ని వింటూ మొదటిప్రాకారాన్ని అధిగమించి శ్రీరంగంలో అడుగుపెట్టారు వారు.

రెండో ప్రాకారాన్ని ఆనుకుని వున్న ఒక ధర్మసత్రం ముందు శకటాన్ని ఆపారు.

* * *

"ఎవరినైనా సరే, ఎటువంటి వారినైనా సరే, రెండు దినాలు మాత్రమే అనుమతిస్తాము ఈ సత్రంలో బస చేయటానికి. మూడవరోజు తెల్లవారకముందే అవతలికి వెళ్ళిపోయి తీరాలి..." శ్రీధరుడు అందించిన ఒక బంగారు నాణేన్ని తీసుకున్న తరువాత కూడా నిక్కచ్చిగా తమ నియమాలను గురించి అతనికి చెప్పాడు సత్రంలో వున్న అధికారి ఒకతను.

అందుకు వింతపడలేదు శ్రీధరుడు. రెండుదినాలు గడిచిన తరువాత తాము మరియొక ప్రదేశాన్ని వెతుక్కోవాల్సి వస్తుందని కూడా ఆలోచించలేదు.

ఉడికీ ఉడకని ఆహారాన్ని చిల్లులు పడిన విస్తరాకులలో వడ్డించి మరో రెండు బంగారునాణాలను అడిగి పుచ్చుకున్నది సత్రంలోని వంట పుట్టి.

"శకటాలను, వృషభాలను నగరంలోకి రానీయకూడదు... కులోత్తుంగ చోళ చక్రవర్తి నియమించిన ఆలయ నిర్వాహణాధికారి గనుక మీ బండిని చూస్తే పది బంగారు నాణేలను అపరాధంగా ఇచ్చుకోమంటాడు" అని కూడా చెప్పింది ఆమె.

రాత్రి రెండవఝాము గడిచిపోతున్నప్పటికీ నిద్రపోకుండా వృషభాల దగ్గరే కూర్చుని వున్న శ్రీధరుడిని సమీపించింది హేమసుందరి.

"ఎండలోనూ వానలోను మనకు అండగా నిలబడిన ఈ జీవాలను నగరం వెలుపల ఒంటరిగా వదలటం నాకు యిష్టంలేదు" వంటపుట్టి మాటలను తలుచుకుంటూ ఆమెకు చెప్పాడు శ్రీధరుడు.

"అందుకు ఇంత ఆలోచన దేనికి? ప్రాకారాల వెలుపల ఎన్నెన్నో గృహాలుండటం నేను చూశాను... ఒక మంచి గృహాన్ని చూసి బాడుగకు

తీసుకోటం ఏమంత కష్టమైన పనికాదుగా..." తడుముకోకుండా చెప్పింది హేమసుందరి.

ఒకటి రెండు వారాలకంటే ఎక్కువ దినాలు అక్కడ వుండదలుచుకోని తాము ప్రత్యేకించి బాడుగ ఇంటిని కోరుకోవటం సముచితంగా వుండదేమోనని అనుకున్నాడు శ్రీధరుడు.

"ఆలయ నిర్వహణాధికారికి అనవసరంగా పది బంగారునాణేలను ధార పోయటం ఉచితంగా వుంటుందా?" అతని ఆలోనలను గ్రహించి వెంటనే వెక్కిరించింది హేమసుందరి.

ఆ వెక్కిరింపుతో ఒక కొలిక్కి వచ్చాయి శ్రీధరుడ్ని వేధిస్తున్న ఆలోచనలు .

"పొద్దుపోయేవరకూ నిద్దురపోకపోతే ఆరోగ్యం చెడిపోతుంది... వెళ్ళి పడుకో..." గద్దించినట్లుగా అన్నాడు అతను ఆమె మాటలు విని.

తనలో తాను నవ్వుకుంటూ తమకు కేటాయించబడిన మందిరంలోకి పోయింది హేమసుందరి. చినిగిపోవటానికి సిద్ధంగా వున్న చిరుచాపను ఇంకోమారు గట్టిగా దులిపి, మందిరద్వారానికి కాస్తంత దూరంగా పరుచుకుని, విశ్రమించింది.

తలతో తన భుజాల్ని తడుముతున్న ఎలపటి వృషభం మూపురాన్ని నిమురుతూ శకటం ముందుభాగంలోనే పడుకున్నాడు శ్రీధరుడు.

తిరిగి అతను కనులు తెరిచేసరికి సూర్యోదయం అవనే అయింది. తలక్రింద చేయి పెట్టుకుని అమాయకంగా నిద్రిస్తున్న హేమసుందరిని మందిర గవాక్షంగుండా చూసి, క్షణాలమీద వృషభాలను శకటానికి పూన్చాడతను.

"అమ్మగారు ఇంకా నిదుర లేవలేదు. ఒంటరిగా మీరెక్కడికి పోతున్నారు?" అంటూ అతనికి ఎదురు రానేవచ్చింది వంటపుట్టి.

హేమసుందిని తన అర్థాంగిగా భావిస్తున్నదని అర్థం అయ్యేసరికి ఘల్లుమన్నాయి శ్రీధరుడి గుండెలు. ఆ మాటలు హేమసుందరి చెవుల పడితే ఆమె ఎంతగా బాధపడుతుందో ఊహించుకునేసరికి, కాళ్ళూ చేతులూ ఆడలేదతనికి.

"అత్యవసరమైన ఒక పనిమీద నగరం వెలుపలికి పోతున్నాను. త్వరగా తిరిగివస్తానని చెప్పు... నిద్ర లేవగానే ఆహారపు ఏర్పాట్లు చూడు..." గతరాత్రి ఆమె వడ్డించిన చప్పిటి మెతుకుల్ని తలుచుకుని ముఖం చిట్లిస్తూ వంటపుట్టికి చెప్పాడు.

అప్పటికీ ఆమె ఎదుటినుంచి కదలకపోవటంతో, అసలు విషయం అర్థమై ఒక బంగారునాణేన్ని తీసి యిచ్చాడు. పుత్ర పౌత్రాభివృద్ధిగా అతన్ని ఆశీర్వదిస్తూ దారి వదిలిందామె.

"మీవంటి దయామయులు నలుగురంటే నలుగురు వచ్చి విడిది చేస్తే చాలు... ఒక మాసం రోజులపాటు హాయిగా వెళ్ళమారిపోతుంది మా బ్రతుకు" అంటూ సత్రం లోపలిభాగంలోకి వెళ్ళిపోయింది. అక్కడే నిలుచుని వుంటే సత్రపు అధికారి కూడా వచ్చి చేయిజాస్తాడన్న అనుమానంతో వృషభాలను అదిలించి, రాచవీధివైపు నడిపించాడు.

మొదటి ప్రాకారాన్ని దాటి ఎంతో దూరం పోవాల్సిన అవసరం లేకుండానే, విశాలమైన పూతోట మధ్య అతనికి అగుపించింది ఒక గృహం.

"ఈ గృహపు యజమాని కొంగుదేశం వెళ్ళాడు... యింకో నాలుగైదు మాసాలవరకూ తిరిగి రావటం కుదరదని, మర్యాదస్తులు ఎవరైనా కోరితే కాపురం పెట్టించమని వర్తమానం పంపాడు..." పూతోట ముందు శకటాన్ని ఆపి,

ఇంటివంక తేరిపార చూస్తుండగా, లోపలినుంచి వచ్చి అతనికి తెలియచేశాడు పూతోటలో పనిచేస్తున్న వృద్ధుడు ఒకతను.

ఇంటి యజమానికి చెందిన వస్తువులన్నింటినీ వెనుకభాగంలో వున్న రెండు మందిరాలలో సర్దించి ముందు భాగాన్నంతటినీ తను పుచ్చుకున్నాడు శ్రీధరుడు. వృద్ధుడు కోరిన పది బంగారునాణేలను అతనికి సమర్పించుకుని, వృషభాలను ఇంటివెనుక భాగంలోని విశాలమైన ఖాళీ స్థలంలో కట్టివేశాడు.

"వీటిని నా కన్నబిడ్డల మాదిరి చూసుకుంటాను... వీటిని గురించి ఆలోచించకుండా మీరు నగరంలోని వింతలు విశేషాలను చూసుకోవచ్చు" మచ్చికగా తన చేతుల్ని మూర్కొంటున్న ఆ మూగజంతువుల మూపురాలను నిమురుతూ అతనికి చెప్పాడు తోటమాలి వృద్ధుడు.

వంతపాత్రలకు, వంట దినుసులకు అవసరమైన నాణేల్ని అతనికే ఇచ్చి ఆ రోజుకు తాము వచ్చేలోపల ఆహారం సిద్ధం చేయవలసిందిగా ప్రార్థించి నగరంలోకి బయలుదేరాడు శ్రీధరుడు.

మొదటి ప్రాకారాన్ని అధిగమించబోతుండగా, ఒక ఫలహారశాల ముందు అతనికి అగుపించింది పెద్దగుంపు.

ఎంత అణుచుకున్నా ఆగని కుతూహలం కారణంగా అటుకేసి అడుగులు వేశాడతను. గుంపు వెలుపలి భాగంలో నిలబడి ముందుకు తొంగిచూశాడు.

ఎంతోదూరం నుంచి దీర్ఘకాలంగా ప్రయాణం చేసి వస్తున్నట్లు, దుమ్ము ధూళితో నిండిన దుస్తులు ధరించి అగుపించాడతనికి ఒక పౌరుడు.

పెద్దకంఠంతో ఏదో విషయాన్ని గురించి అక్కడి వారందరికీ చెవుతూ భయం నిండిన కనుల్ని గిర్రు గిర్రున తిప్పుతూ, చేతుల్ని ఊపుతున్నాడు.

"ఏమిటి విశేషం? అతను చెపుతున్నది ఏమిటి?" పదినిముషాల పాటు ఆలకించినా ఆ పౌరుడు ఉపయోగిస్తున్న భాష తనకు అర్థంకాక పోవడం వల్ల పక్కనే వున్న మధ్యవయస్కుడు ఒకతన్ని పలుకరించాడు శ్రీధరుడు.

"దక్షిణ దేశంలో సంచరించటానికి వెళ్ళిన రామానుజాచార్యుల వారు తమ యాత్రను విరమించుకుని శ్రీరంగం వచ్చేస్తూన్నారట..."గుంపు మధ్యలోని పౌరుడి మీదినుంచి చూపుల్ని తిప్పకుండానే సమాధానం ఇచ్చాడా మధ్యవయస్కుడు.

అంతమంది గుంపుగా నిలబడి చెవులప్పగించి వినవలసినంత విశేషం ఆ మటాల్లో అగుపించలేదు శ్రీధరుడుకి.

వైష్ణవమత ప్రచారానికి కంకణం కట్టుకున్న రామానుజాచార్యుల వారు నివసించేది శ్రీరంగంలోనే. కావేరీతీరాన వుంటుందని చెప్పబడే వైష్ణవక్షేత్రమే ఆయన నివాస స్థానమట.

మత ప్రచారానికి బయలుదేరిన ఆ మహానుభావుడు తిరిగి తన నివాస స్థలానికే తిరిగిరావటంలో విశేషం ఏముంటుందిట? గుంపు మధ్యలో నిలబడిన పౌరుడు ఉపన్యసించడం పూర్తి అయింది.

తమలో తాము గుసగుసలాడుకుంటూ తలా ఒకపక్కకు వెళ్ళిపోతున్నారు అక్కడ చేరిన వారందరూ.

"రామానుజాచార్యుల వారు వట్టిగా తిరిగి రావటంలేదు. ఒక భయంకర మైన వర్తమానం చెవులపడటం వల్ల ఆఘమేఘాలమీద వచ్చేస్తున్నారు."

శ్రీధరుడి వదనంలో తాండవిస్తున్న అనుమానపు ఛాయల్ని గమనించి తనంతట తనే అతనికి చెప్పాడు అంతకు ముందు అతను మాట్లాడించిన మధ్య వయస్కుడు.

"ఏమిటా భయంకరమైన వర్తమానం?" వెంటనే అడిగాడు శ్రీధరుడు.

"ఉత్తర భారతాన్నంతటినీ అల్లకల్లోలం చేస్తున్న ఓ గుంపు దక్షిణ దేశంలో దోపిడీలు నిర్వహించాలని తల పెట్టిందట... శ్రీరంగాన్ని దృష్టిలో వుంచుకుని వేగవంతాలైన అశ్వాలమీద బయలుదేరారట."

అవకాశం లభించినప్పుడల్లా సింధునదిని దాటి వచ్చి ఉత్తర భారతదేశంలో అల్లకల్లోలాలను సృష్టించే దోపిడీ మూకల్ని గురించి చిన్నతనం నుండీ ఎన్నో కథలు విన్నాడు శ్రీధరుడు.

కళ్యాణి చాళుక్యులు, వేంగీ చాళుక్యులు విజయకేతనమెత్తిన ధ్వజస్థంభాల మాదిరి దక్షిణపథానికి కాపుండబట్టి, వింధ్య పర్వతాలను అధిగమించలేక పోయారు ఆ దుండగులు. రాజరాజనరేంద్రుడి కుమారుడయిన రాజేంద్రుడు తన మేనమామ కురమార్తెను వివాహమాడి, కులోత్తుంగ చోళుడనే పేరుతో మేనమామ రాజ్యానికి వెళ్లిపోవడంతో బలహీనపడిపోయింది వేంగీ చాళుక్యల విజయసింహాసనం.

ఆష్టకష్టాలు పడి రాజరాజ నరేంద్రుడు సాధించుకున్న సామ్రాజ్యం కాస్తా ముక్కలు చెక్కలై, ధనదుపుర సార్వభౌముని వంటి సామంతరాజుల ఏలుబడిలోకి వెళ్ళిపోయింది. అన్నదమ్ముల మధ్య ఉద్భవించిన అంతఃకలహాల కారణంగా దుర్బలమైపోయింది కళ్యాణి చాళుక్యల ప్రాభావము. తమ తగాదాలనే తప్ప, తమ

చుట్టూ జరుగుతున్న దురంతాల్ని గురించి పట్టించుకునే స్థితిలో ఆ పాలకులు లేరు!

ఒకరినీడ మరొకరి మీద పడటానికి కూడా ఇచ్ఛగించని సామంతరాజులు తమ తమ తగాదాలలో తలమున్కలయి వున్న చక్రవర్తులు తమను ఎదిరించలేరని యింతకాలానికి దక్షిణపథంవైపు చూపుల్ని సారించి వుంటుంది యిప్పుడు తరలి వస్తున్న దొంగల గుంపు.

దోపిడీలు చేయటం, అడ్డుపడిన వారిని దారుణంగా నరికి ముక్కలు ముక్కలు చేయటం, ప్రజలందరిలోను విపరీతమైన భయాన్ని కలిగించడం మాత్రమే వారి దాడులలోని ముఖ్యమైన ఉద్దేశ్యం... సామ్రాజ్యాస్థాపన మాత్రం కాదు.

వ్యక్తిగతమైన కక్షలకు, కార్పణ్యాలకు పెద్దపీట వేసే సామంతులు, రాజన్యులు మిడతల గుంపువంటి ఆ దుర్మారుల్ని నిలువరించగలరా?

భగభగలాడే అగ్నిజ్వాలల్లో మాడి మసి అయిపోతున్న గృహసముదాయాలు, రక్తపు మడుగుల్లో మునిగి తేలుతున్న మృతదేహాలు, సంపదలన్నిటినీ సంపూర్ణంగా పోగొట్టుకుని కాంతి విహీనాలయిన దేవాలయాలు తన కనుల ముందు మెదిలేసరికి మ్లానమయిపోయింది శ్రీధరుడి వదనం. బరువెక్కిన గుండెలతో ప్రాకార ద్వారాల్ని అధిగమించి తాము బసచేసిన ధర్మసత్రాన్ని చేరుకున్నాడతను.

"విన్నావా? ఈ దారుణ వార్తను నువ్వు విన్నావా?" అని ప్రశ్నిస్తూ, సత్రపు వాటికలోనే అతనికి ఎదురయింది హేమసుందరి.

హాయిగా నిద్ర లేచింది కాబోలు, కాంతివంతమయి కనిపిస్తోంది ఆమె వదనం. నక్షత్రాల మాదిరి ప్రకాశవంతమై అగుపిస్తున్నాయి ఆమె విశాల నేత్రాలు.

"రంగనాథుడిని దర్శించుకునే ఆలోచనకు స్వస్తి చెప్పి ఎవరి గ్రామాలకు వారు తిరిగి వెళ్ళిపోతున్నారట యిక్కడికి వచ్చిన భక్తులందరూ...

నరరూప రాక్షసులవంటి దోపిడీ దొంగలు వింధ్యాచలాన్ని దాటి ఇటుగా వచ్చేస్తున్నారట... అప్పుడెప్పుడో సోమనాథ దేవాలయానికి పట్టిన గతే యిప్పుడు ఈ శ్రీరంగేశునికి కూడా పడుతుందని అందరూ భయపడుతున్నారు" శ్రీధరుడి వదనంలో ప్రతిఫలిస్తున్న భావాలను గురించి ఆలోచించకుండా తన మానాన తను గబగబా చెప్పుకుంటూ పోయిందామె.

అంతకుముందు కొద్దిసేపటి క్రితమే తను విన్న ఆ విశేషం, అప్పుడే ఆమె కర్ణేంద్రియాల వరకూ ఎలా వచ్చిందో అర్థంకాలేదు శ్రీధరుడికి.

అర్థం చేసుకోవటానికి అతను ప్రయత్నించక ముందే, తట్టాబుట్టల్ని సర్దుకుని సత్రంలోనుంచి బయటికి వస్తూ అతనికి అగుపించారు అక్కడ విడిది చేసి వున్న భక్తులు కొంతమంది.

"బ్రతికివుంటే మరోమారు వచ్చి రంగనాథుడిని సేవించుకుంటాము. మొండిగా యిక్కడే వుండి ప్రాణాలను పోగొట్టుకునేటంత పిచ్చివాళ్ళం కాదు మేము..." తమను నిలువరించటానికి ప్రయత్నించిన సత్రపు అధికారితో పరుషంగా మాట్లాడుతూ, వీధిలోకి వెళ్ళిపోయారు వారందరూ.

వారితోపాటు తను కూడా వీధివైపు అడుగులు వేయబోయిన అధికారిని మధ్యలోనే అడ్డగించి కదలకుండా నిలబెట్టాడు శ్రీధరుడు.

"ఆపదమొక్కులవాడిగా ప్రసిద్ధిగాంచిన తిరుపతి వెంకటేశ్వరునికి ధీటైన దైవం ఈ రంగనాథుడు... తలల్ని ఉత్తరించే ఆపదలు చుట్టుముట్టినప్పుడు దైవాన్ని మాత్రమే నమ్ముకోవాలనే మాటను మరిచిపోయిన ఆ పిరికివారిని అడ్డుకోవటం ఎందుకు?" సూటిగా కనుల్లోకి చూస్తూ ప్రశ్నించాడు.

"ఈ రోజు ఉదయమే కులోత్తుంగ చోళ చక్రవర్తి వద్దనుంచి వచ్చిన వర్తమానం గురించి తెలియకపోవటం వల్ల యిలా మాట్లాడుతున్నారు..." అతని చేతులను వదిలించుకుని వీధిలోకి పరుగెత్తటానికి ప్రయత్నిస్తూ ఆందోళన నిండిన కంఠంతో అన్నాడు సత్రపు అధికారి.

"కులోత్తుంగ చోళ చక్రవర్తి వద్దనుంచి ఏమని వచ్చింది వర్తమానం?" ఆశ్చర్యంగా చూస్తూ వెంటనే అడిగాడు శ్రీధరుడు.

వింధ్యపర్వతాలను దాటి మన దక్షిణాపథానికి వచ్చేసిన దోపిడీ దొంగలను ఎదుర్కొనటానికి సన్నాహాలు జరుగుతున్నాయట... వేంగీ చాళుక్య సామంత రాజులందర్నీ హెచ్చరించి సైన్యాలను సిద్ధం చేయిస్తున్నారట... శ్రీరంగంలోని భక్తులు తమ తమ గ్రామాలకు యిప్పుడు వెళితే అనవసరమైన భయాందోళనలు గ్రామసీమల్ని చుట్టుముడతాయనీ, ఎవ్వరినీ ప్రాకార ద్వారాలను దాటనీయ వద్దని ఆజ్ఞలు పంపారు.

దోపిడీ మూకలు వెనుతిరిగేంత వరకూ శ్రీరంగంలోని వారందరూ శ్రీరంగంలోనే వుండిపోవాలనీ, అవసరం అయితే అందరికీ ఉచిత భోజనాదులను కల్పించమనీ వార్త..." తన అదుపాజ్ఞలో వుండవలసిన భక్తులు సత్రాన్ని వదిలి వెళ్ళిపోయారని తెలిస్తే మాట పడవలసి వస్తుందన్న భయంతో తను అలా ప్రవర్తిస్తున్నట్లు తెలియజేశాడు అతను.

అంతకుముందు తమతో రెండు రోజులకు మించి భక్తులెవరూ అక్కడ నిలువబడరాదని పెద్ద పెద్ద నియమాలను ఉచ్ఛస్వరంతో ఉచ్ఛరించిన పెద్దమనిషి వున్నట్లుండి మాట మార్చడాన్ని గమనించేసరికి నవ్వు ఆగలేదు శ్రీధరుడికి.

"ఎందుకా నవ్వు? అవతలివారి బాధను చూస్తే నీకు నవ్వు వచ్చి తీరుతుందా?" ఒక పక్కగా నిలబడి ఆ సంభాషణను విన్న హేమసుందరి కోరగా ప్రశ్నించేసరికి నవ్వును బలవంతంగా అదుముకుని, సత్రపు అధికారిని వదిలేశాడతను.

వీధిలోకి వెళ్ళిపోయిన భక్తులను , అప్పుడే అక్కడికి వచ్చిన కొందరు రాజభటుల సహాయంతో బలవంతంగా వెనక్కి తీసుకురావటానికి అతను పడుతున్న అవస్థను ఓరకంటితో చూస్తూ, తమ మందిరం వైపు కదలబోయాడు.

"అడిగే ప్రశ్నకు సమాధానం చెప్పి అడుగు ముదుకు వేయి..." కరుకుగా అంటూ అతన్ని కదలకుండా నిలబెట్టింది హేమసుందరి.

"ఏమిటా ప్రశ్న?" ఆశ్చర్యంగా అడిగాడు శ్రీధరుడు.

"కొత్త ప్రదేశంలో నన్ను ఒంటరిగా వదిలి, తూర్పు దిక్కు తెల్లబడకుండా ఎక్కడికి వేంచేశావు నువ్వు? కనులు తెరవగానే నువ్వు కనిపించకపోయే సరికి ఎంత భయపడ్డానో నీకు తెలుసా?" అప్పటికప్పుడు కోపాన్ని తెచ్చుకుంటూ అన్నది హేమసుందరి.

ప్రాకారాలను అవతలగా తను సిద్ధంచేసిన నూతన గృహాన్ని గురించి ఆమెకు చెప్పబోయి ఆఖరిక్షణంలో ఆ మాటలను నోటిలోనే అదుముకున్నాడు శ్రీధరుడు. కొత్త ఇంటిలో గృహప్రవేశం చేయటానికి తను హేమసుందరీ సహితంగా బయలుదేరితే సత్రపు అధికారి ఒప్పుకుంటాడా? అందరి మాదిరిగానే

శ్రీరంగాన్ని వదలి వెళ్ళిపోయేందుకు అదొక ఎత్తుగడగా భావించి రాజభటులను పిలిపించదూ?

సరైన కారణం లేకుండా మౌనం వహించటం శ్రీధరుడికి అలవాటు లేని సంగతి హేమసుందరికి విదితమే... తను ఏదైనా విషయాన్ని గురించి కోపంగా మాట్లాడితే, అరమూసిన కనులతో స్వచ్ఛంగా నవ్వే అతను, అలా నవ్వకుండా నిలబడిపోయాడంటే, అందుకు బలమైన కారణం ఏదో వుండి వుంటుందని ఆమె ప్రజల విశ్వాసం.

"నేను పలికిన పలుకుల్లో తప్పు ఏదైనా వున్నదా?" తెచ్చిపెట్టుకున్న కోపం కాస్తా ముఖంమీద నుంచి మటుమాయం అయిపోతుండగా లోగొంతుకతో ప్రశ్నించింది హేమసుందరి.

అప్పుడు కూడా అసలు విషయాన్ని ఆమె చెవిన వేయలేదు శ్రీధరుడు.

"ముంచుకు వస్తున్న ఆపదనుంచి తప్పించుకోవటానికి శ్రీరంగేశుని ప్రార్థన చేయకుండా, శ్రీరంగాన్ని వదిలి వెళ్ళిపోజూస్తున్నారు భక్తులందరూ. నిర్మానుష్యంగా వుండి వుంటుంది ఆలయం. తనివి తీరా దైవదర్శనం చేసుకోవటానికి మంచి అవకాశం ఇది" అంటూ ఆమెను ముందుకు లాగబోయాడు.

వినకూడని మాట ఏదో అతని నోటినుంచి వెలువడినట్లు అదిరిపడి అతని చేతుల్ని విదిలించి కొట్టి దూరంగా జరిగింది హేమసుందరి.

"తులసి పుట్టింటివద్ద శూరమంగళంలో మార్చుకున్నప్పటినుంచీ వదిలి పెట్టకుండా ధరిస్తున్న వలువలు ఇవి... ఇటువంటి వాటితో దైవదర్శనానికి

బయలుదేరటం మహా పాపం... చచ్చినా నేను రాను" అంటూ అక్కడే నిలబడితే అతను మరోసారి బలవంతం చేస్తాడని తమ మందిరంలోకి వెళ్ళిపోయింది.

"ఎటువంటి వలువలతో రంగనాథుడిని దర్శించుకోవాలని అనుకుంటున్నావు నువ్వు?"

"ఎటువంటివైనా సరే... నూతన వస్త్రాలు కావాలి... నూతన వస్త్రాలు ధరించనిదే ఈ సత్రపు సరిహద్దుల్ని దాటేది లేదు" అంది హేమసుందరి.

విపణివీధి ఎక్కడ వున్నదో సత్రపు అధికారిని అడిగి తెలుసుకున్నాడు శ్రీధరుడు. వీధుల్లోని సందడిని గమనిస్తూ, భక్తాగ్రేసరుల హావభావాలను చూసి తనలో తను నవ్వుకుంటూ అటుకేసి పోయాడు.

అంతకు ముందురోజు రాత్రి రెండో ఝాము వరకూ ఎంతో సంభరంతో జరిగిన వ్యాపారాలన్నీ చప్పబడిపోయేసరికి బిక్కముఖాలతో తమ దుకాణాల ఎదుట నిలుచుని వున్నారు యజమానులు.

అందరి మాదిరిగా ఆరాటాన్ని ప్రదర్శించకుండా కులాసాగా వస్తున్న శ్రీధరుడిని ఆకర్షించటానికి ఎన్నెన్నో ప్రయత్నాలు చేశారు.

వీధి మధ్యభాగంలో వున్న ఒక చక్కటి ప్రదేశాన్ని ఎంచుకుని లోపలికి వెళ్ళాడు శ్రీధరుడు... కంచిలో తయారైన పట్టుచీరలను చూపించమని దుకాణదారుని అర్థించాడు.

కనులు మిరుమిట్లు గొలిపే పట్టువస్త్రాలను తీసి అతని ఎదుట పరిచాడు దుకాణపు యజమాని.

వీథుల్లో చెలరేగుతున్న భయోత్పాతాల కారణంగా మా వ్యాపారం మూలన పడింది. మీకు నచ్చిన వలువల్ని ఎంచుకోండి. సాధారణ విలువకంటే కొంచెం తక్కువకే ఇస్తాను" అని ప్రోత్సహించాడు.

మామిడిచిగురు రంగులో మిలమిలలాడిపోతున్న వలువను ఎంపిక చేసి, దానికి జోడీ అయిన స్థనదుకూలాన్ని కూడా తీసి పక్కన పెట్టాడు.

"చేమంతి ఛాయ గలవారికి కూడా చక్కగా వుంటుంది మీరు ఎంచుకున్న వర్ణం... అవసరం అయినప్పుడు ఎవరికయినా అరుపు ఇవ్వటానికి కూడా వుపయోగపడుతుంది. అమ్మగారి శరీరఛాయ ఎటువంటిదో చెప్పండి. వారికి మాత్రమే నచ్చే వర్ణాన్ని తీసి యిస్తాను" అన్నాడు దుకాణపు యజమాని.

ఏదో ఒక విధంగా తనచేత మరికొన్ని వలువల్ని తీయించటానికి అతను నోటికి వచ్చిన మాటలన్నిటినీ మాట్లాడతాడని గ్రహించి, హేమసుందరి శరీర ఛాయను వర్ణించాడు శ్రీధరుడు.

జానెడు వెడల్పు జరీ అంచు కలిగినటువంటి చిలుకపచ్చ రంగు వలువను తీసి అతని ఒడిలో పెట్టాడు దుకాణపు యజమాని.

"పన్నెండు బంగారునాణేలు మాత్రమే వీటి విలువ. ముందుగా మీకు మాట ఇచ్చిన ప్రకారం రెండు నాణేలను వదులుకుంటాను. పది నాణేలను ఇస్తే సరిపోతుంది.." అంటూ అతని సమాధానంకోసం ఎదురు చూడకుండా వలువలు రెండింటినీ చేనేతవస్త్రంలో ముడిచి అతనికి అందించాడు.

దట్టీలోనుంచి నాణేలను తీసి అతనికి అందిస్తుండగా శ్రీధరుడి చెవులకు చేరింది ఆ దుకాణం పక్కనే వున్న ఒక మండపంలోనివారి సంభాషణ.

తూర్పుదిక్కు తెల్లబడకముందే ఆశనిపాతంలా వినవచ్చిన దోపిడీ దొంగల గురించి జరుగుతున్న సంభాషణే అది. భయపడి పారిపోజూస్తున్న భక్తుల్ని రాజభటులు అటకాయించి నగరంలోనే ఆపుచేస్తున్న వైనం కూడా వినవస్తోంది ఆ మాటల్లో.

"ఇళ్ళకు వెళ్ళిపోతామంటున్న భక్తుల్ని బలవంతంగా ఆపటం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటో నాకు అంతుబట్టడం లేదు. ఉచిత భోజనాదుల ఏర్పాటు మూలకంగా రాచగాదెలు నిండుకోవటం తప్ప మరే విధమయిన సౌకర్యము మన నగరానికి కలుగదు.

తీవ్రమయిన భయాందోళనలతో కంపించిపోతున్నవారు మన దుకాణాల దగ్గిరికి రారు... కనీసం రంగనాథుడి ఎదుటికి కూడా పోరు... ప్రాణభయం వారి భక్తిని అణగద్రొక్కేస్తున్నది..." చికాకు నిండిన కంఠంతో చెపుతున్నాడు ఒక వ్యాపారస్థుడు.

"ఏంచేస్తే పరిస్థితి చక్కబడుతుందని నీ అభిప్రాయం?" ప్రశ్నించాడు మరో వ్యాపారస్థుడు.

"దొంగల గుంపును గురించిన వార్తల్ని భక్తులకు చేరకుండా నిరోధించాలి... వారి ఆలోచనలు ప్రక్కదోవలు పట్టకుండా ఉత్సవాల సందడిని హెచ్చించాలి... ఆలయ ప్రాంగణంలో నృత్యప్రదర్శనలు, భజన కార్యక్రమాలు వూపిరి సలపని విధంగా ఏర్పాటు చేయాలి... తాము విన్నమాటలు కట్టుకథ లేమోనన్న అనుమానం వారిలో కలగించి, ఇక్కడే నిలిచిపోయేలా ఆకట్టుకోవాలి..." నిర్మొహమాటంగా తెలియచేశాడా వ్యాపారస్థుడు తన మనసులోని మాటల్ని.

అతని అభిప్రాయాలతో అక్కడివారు ఏకీభవించారో లేదో తెలుసుకునే ప్రయత్నం చేయలేదు శ్రీధరుడు. ఆ మాటలు తన మనసులో ఒక సరికొత్త ఆలోచనను రేకెత్తించేసరికి సాలోచనగా తలవూపుతూ దుకాణపు యజమాని వంక చూశాడు.

నగరంలోని భక్తుల్ని నిలువరించటానికి నృత్యప్రదర్శనలు ఏర్పాటు చేయటం, చేయకపోవటం ఆలయ ధర్మకర్తకు సంబంధించిన విషయం...

ప్రాణాలమీద తీపితో ఎవరికి వారు చెల్లాచెదురు కావటానికి సిద్ధంగా వున్న ఆ సమయంలో గుట్టుచప్పుడు కాకుండా హేమసుందరి మొక్కును తీర్చుకునే ఏర్పాటు చేస్తే ఎలా వుంటుంది?

ఆమె నృత్యాన్ని చూసేందుకు ఆలయంలో భగవంతుడు, ఆలయ పూజారులు తప్ప పరాయి వారెవరూ పనికట్టుకుని రారు. మొక్కుకు మొక్కు తీర్చుకున్నట్లుగా వుంటుంది.

తను భయపడుతున్నట్లుగా నృత్యం చేసే సమయంలో హేమసుందరిని చూసి, ముచ్చట పడటానికి భక్తులు ఎవరూ ఆలయ పరిసరాల్లోకి రారు కాబట్టి, తమను గురించి లోతుగా ఆలోచించేవారెవరూ వుండరు.

ఆ ఆలోచన మనసులో అడుగుపెట్టిన మరుక్షణం ఆలసించలేదు. శ్రీధరుడు. చేనేత వస్త్రంలో మూటకట్టిన వలువలతో పాటు, ఆలయంలోని భగవంతుడి ఎదుట నృత్యం చేయటానికి తగిన వస్త్రాలను కూడా ఎంచి ఇవ్వమని దుకాణదారుని కోరాడు.

సంతోషంతో పరశించిపోతూ అతనికి అవసరమైన వస్త్రాలను తీసి చేనేత వస్త్రపు మూటలోకి చేర్చాడు దుకాణపు యజమాని.

నృత్యం చేసేది ఎవరో ఒకటికి రెండుసార్లు విచారించి, తన సేవకుడిని మరోవీధిలోకి పంపాడు. నాలుగు వెండినాణేల విలువచేసే కాలిగజ్జెల్ని రెండు నాణేలకే తెప్పించి శ్రీధరుడికి ఇచ్చాడు.

దేవతా సార్వభౌముడైన కావేటిరంగని ఎదుట నృత్యం చేయటానికి మామూలు అలంకరణలు సరిపోవు గదా...

గజ్జెలు తెచ్చిన సేవకుడినే మరోసారి ఇంకోచోటికి పంపి అగరు, జవ్వాది, కస్తూరి మొదలైన సుగంధద్రవ్యాలను సేకరింపించాడు. పూజ చేయించటానికి కావలసిన సంబారాలను పెట్టుకునే వెండిసజ్జను కూడా ఇప్పించాడు.

వలువల కోసం వెచ్చించదలచుకున్న పది బంగారునాణేలకు తోడుగా మరో పన్నెండు నాణేలను వదిలించుకుని, తీర్థ యాత్రికుడిలా పెద్దమూటతో సత్రాన్ని చేరుకున్నాడు శ్రీధరుడు.

గవాక్షం దగ్గిరే నిలబడి ఎదురుతెన్నులు చూస్తున్న హేమసుందరి కనులు జలపాతాలయిపోయాయి ఆ మూటలోని ద్రవ్యాలను చూసేసరికి.

"సంతోషం కలిగినా, బాధ ఎదురైనా నీతో వచ్చిన చిక్కు యిదొక్కటే... నిన్ను మాటలతోనో చేతలతోనో హింసిస్తున్నానని అందరూ అనుకోకముందే కనులు తుడుచుకుని సిద్ధంగా వుండు... నేను ఆలయ ధర్మకర్త దగ్గిరికి వెళ్లి వస్తాను" అంటూ సమాధానం కోసం ఎదురుచూడకుండా మరోసారి వీధికేసి కదలబోయిన శ్రీధరుడి చేతిని గట్టిగా పట్టుకున్నది హేమసుందరి.

"మొక్కుతీర్చుకోవాలనే కోరిక కలిగిన తర్వాత తీర్చుకోకుండా వుండము కదా... ఇప్పటికిప్పుడు కాళ్ళు తొక్కుకుంటూ ధర్మకర్త దగ్గిరికి వెళ్ళవలసిన

అవసరంలేదు. భోజనంచేసి కొద్దిసేపు విశ్రాంతి తీసుకెళ్ళ వచ్చును..." అంటూ దూరంలో ఎక్కడో వున్న వంటపుట్టిని పిలువబోయింది.

అంతకుముందు రాత్రి ఆరగించిన ఆహారం యొక్క రుచి మనసులో మెదలి విపరీతంగా భయపడ్డాడు శ్రీధరుడు.

హేమసుందరిని అదిలించి, వంటపుట్టికి సైగ చేయకుండా ఆపాడు అతను. ప్రాకారాల వెలుపల తను మాట్లాడి వచ్చిన ఇంటిని గురించి అప్పుడామెకు చెప్పాడు.

"వంటచేసి సిద్ధంగా వుంచమని తోటమాలికి చెప్పివచ్చాను...ఇప్పుడు మనం ఈ సత్రంలోనుంచి ప్రాకారాల వెలుపలికి పోవటం ఎలాగో ఆలోచిస్తే చాలు అంతా సానుకూలమవుతుంది" అన్నాడు అందుకు మర్గాన్ని ఆలోచిస్తూ.

అతని మాదిరిగా అతిగా ఆ విషయాన్ని గురించి యోచించలేదు హేమసుందరి. సత్రంలోని అతిథులెవ్వరూ వీధిలోకి పారిపోకుండా సత్రపు ముందు భాగంలో పీఠం వేసుక్కూర్చున్న అధికారి చెంతకు పోయి మాటలు కలిపింది.

"కావేటిరంగనికి నలుబది రకాల పుష్పాలతో పూజ చేయించాలని నాకు కోరికగా వున్నది. అందుకు మార్గం సూచించండి బాబయ్యగారూ" అంది.

పూర్తిగా సంతోషించాడు సత్రపు అధికారి. ఆమె మాటలు ఎక్కడో మధురలో వున్న తన కూతురి మాటల్ని గుర్తు తెస్తున్నట్లుగా ఆమెకు చెప్పి, ఆమె కోరిక నెరవేరేందుకు ఒక సులువైన మార్గాన్ని వెంటనే సూచించాడు.

మందిరంలోనే నిలబడి చెవులు రిక్కించి వింటున్న శ్రీధరుడి పెదవుల మీద వెంటనే ప్రత్యక్షం అయిందొక చిరుదరహాసం. అతను సూచించిన మార్గాన్ని ఆలకించేసరికి.

* * *

మొదటి ప్రాకారానికి ఆవలగా వుండే విశాలమయిన పూతోటను గురించి, ఆ తోట మధ్యభాగంలోని భవంతిని గురించే హేమసుందరికి తెలియచేశాడు సత్రపు అధికారి.

"ఆ భవనపు యజమాని ప్రస్తుతం నగరంలో లేడు. కొంగు దేశం వెళ్లిపోయాడు. మళ్ళీ ఎప్పుడు తిరిగివస్తాడో ఎవరికీ తెలియదు. అక్కడి తోటమాలికి ఒకటి రెండు వెండినాణేలను బహూకరించగలిగితే క్షణాల మీద సానుకూలపడుతుంది నీ పని."

తాము విడిది చేయబోతున్న భవనం గురించే అతను చెపుతున్నట్లుగా అర్థమై తనుకూడా చిరునవ్వులు చిందించబోయిన హేమసుందరిని కనుసైగతో వారించాడు శ్రీధరుడు.

"ప్రాకారద్వారాల దగ్గిర కాపలా నిలబడిన రాజభటుల్ని ఒప్పించి ఆవలికి పోవటం మాకు సాధ్యపడుతుందా బాలయ్యగారూ?" అమాయకంగా ముఖం పెడుతూ వెంటనే సత్రపు అధికారిని అడిగింది హేమసుందరి.

రెండు క్షణికాలు ఆలోచించి, పక్కనే వున్న మందసాన్ని తెరిచాడు సత్రపు అధికారి. అందులో భద్రపరచబడి వున్న తాళపత్రాన్ని బయటికి తీసి, వెండి మువ్వల గంటాన్ని అందుకున్నాడు.

తన సత్రంలో విడిది చేసిన ఆ యువతీ యువకులు నగరంలోనుంచి వెలుపలికి ఎందుకు వెళ్ళాలని అనుకుంటున్నారో వివరంగా ఒక పత్రంమీద లిఖించి తన అధికారాన్ని సూచించే ముద్రను కూడా అద్దాడు.

అతని వంటి సహృదయులతో పరిచయం అవటం తమ అదృష్టమని మెచ్చుకుంటూ, ఆ మాటల్ని వినగానే అతని వదనంలో ప్రత్యక్షమయిన వెలుగును చూసి తనలో తను నవ్వుకుంటూ శ్రీధరుడి దగ్గిరికి వచ్చింది హేమ.

పట్టువలువల మూటను భూజానికి తగిలించుకుని సత్రం వెలుపలికి వచ్చాడు శ్రీధరుడు. అధికారి యిచ్చిన తాళపత్రాన్ని చూపిస్తూ ముందుకు సాగాడు.

వారికోసమే ఎదురు చూస్తూ పూతోట ముందు భాగంలో నిలుచుని వున్నాడు భవనం తాలూకు తోటమాలి.

"రాజభటుల ఎద్దడి కారణంగా మీరు నగరంలోంచి బయటికి రాలేరనుకున్నాను" అన్నాడు వారిని చూడగానే.

కొమ్మ కొమ్మకు వంద రెమ్మలు, రెమ్మ రెమ్మకు నాలుగు నాలుగు పువ్వుల చొప్పున విరబూసి వున్న పూపొదల్ని చూసి మైమరిచిపోయింది హేమసుందరి. కూనిరాగాలు తీస్తూ తోటలో విహరించటం మొదలు పెట్టింది.

ఆమె ఆనందానికి అడ్డుపడలేదు శ్రీధరుడు. చక్కని విస్తరలో తోటమాలి వడ్డించిన రుచికరమయిన ఆహార పదార్థాలను ఆరగించి అతని వంటను అమితంగా మెచ్చుకున్నాడు.

శ్రీరంగంమీదికి వచ్చిపడుతోందని అందరూ అనుకుంటున్న దొంగల గుంపును గురించి నీ అభిప్రాయం ఏమిటి?" అతను సిద్ధం చేసిన మెత్తటి పడకమీద మేను వాలుస్తూ అన్నాడు.

"గురు రామానుజాచార్యులవారు అర్థంతరంగా తమ తీర్థయాత్రల్ని ముగించుకుని శ్రీరంగం వచ్చేస్తున్నారని అంటే, కొంచెం గట్టిగా యోచించ వలసిన విషయమే అది" సూటిగా చెప్పకుండా చుట్టుదారిన తన అభిప్రాయాన్ని వెల్లడించాడు తోటమాలి.

ఆ పైన అతన్ని మాటాడించలేదు శ్రీధరుడు. అర్థఘడియపాటు చిన్న కునుకు తీసిన తర్వాత మెల్లగా నగరంలోకి బయలుదేరాడు.

"చీకటి పడకముందే నువ్వు వచ్చేయాలి. ఈ కొత్త ప్రదేశంలో నేను ఒంటరిగా వుండలేను" వీధివరకూ వచ్చి ఒకటికి రెండుసార్లు అతన్ని హెచ్చరించింది హేమసుందరి.

అంతకుముందు నాలుగైదు ఘడియల క్రితం వరకూ ఎంతో సందడిగా అగుపించిన వీథులన్నీ నిర్మానుష్యంగా మారిపోయి వుండటాన్ని చూసి గాఢంగా నిట్టూరుస్తూ ఏడు ప్రాకారాలను అధిగమించి, రంగనాథుని ఆలయం ఎదుటికి పోయాడు శ్రీధరుడు.

భక్తులు ఎవరైనా ఆలయం ఎదుటికి వచ్చిన మరుక్షణం, పొడుగాటి తొండాలను గాలిలో వూపుతూ ఎదురు వచ్చేవి స్వామివారి సేవలకోసం పెంచబడుతున్న కొమ్ముటేనుగులు.

తొండాలతో భక్తుల తలల్ని తడిమి ఆశీర్వదించేవి. వారు అందించిన ఫలాలను స్వీకరించి, ఆలయ ప్రాకారాలను ప్రతిధ్వనించే విధంగా ఘీంకారాలు

చేసేవి. దోపిడిమూకల ఆగమన వార్త వాటిని కూడా కలవరపాటుకు గురి చేసినట్లు, గజశాలలోనే వుండిపోయాయవి ఆ రోజు.

ఆలయ ధ్వజస్తంభం దగ్గిర తనకు అగుపించిన పూజారి ఒకరిని వినయ విధేయతలు నిండిన కంఠంతో ధర్మకర్తను గురించి ప్రశ్నించాడు శ్రీధరుడు.

ఆలయ ప్రాంగణంలోకి అడుగుపెట్టే అర్హతలేని అతి సామాన్యుడి వంక చూసినట్లుగా ఒక చూపు చూసి గర్భగుడి వెనుక భాగంలో వున్న ఒక చిన్న మండపం వైపు తల వూపాడు ఆ పూజారి.

పట్టువస్త్రంలో మేలురకపు దూదిని నింపి తయారు చేయబడిన మెత్తటి దిళ్ళను రెండుపక్కలా వుంచుకుని, వాటిమీదికి ఒదిగి కూర్చుంటూ శ్రీధరుడికి అగుపించాడు ఆలయ ధర్మకర్త.

ఒంటరిగా లేడతను. వెనుకా ముందు పదిమంది పెద్దలు నిలుచుని వున్నారు.

ఊర్ధ్వపుండ్రములతో అలంకరించబడి వున్న శిరస్సులను తడుముకుంటూ అతనితో మాట్లాడుతున్నారు నలుగురు ఆలయ పూజారులు.

"ఏయ్! ఎవరు నువ్వు? ఎందుకు వచ్చావిక్కడికి? వెళ్ళిపో అవతలికి ... వెళ్ళు...వెళ్ళు..." శ్రీధరుడిని చూసీ చూడగానే వికృతమయిన కంఠంతో పెద్దగా అరిచాడు వారిలో ఒకతను.

"ఎంతో దూరంనుంచి వచ్చిన భక్తుడిని నేను... శ్రీవారు అనుమతిస్తే, వారికి ఒక చిన్న విషయాన్ని మనవి చేసుకుందామని అనుకుంటున్నాను" వినయం నిండిన కంఠంతో నెమ్మదిగా తన కోరికను వెల్లడించాడు శ్రీధరుడు.

"ఎంతో దూరంనుంచి వచ్చిన భక్తుడివే అయితే, ఆలయంలోకి వెళ్ళి స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలను పుచ్చుకుని అవతలికి వేంచేయి. శ్రీవారితో మాట్లాడటం ఇప్పుడు కుదిరేపని కాదు... వెళ్ళు...వెళ్ళు" మరింత విదిలించి మాట్లాడాడు ఆ పూజారి.

పట్టుదిళ్ళ మీద ఒదిగి కూర్చున్న ఆలయ ధర్మకర్తతో మాట్లాడటం కంటే, ఆలయంలోని రంగనాథుని దర్శించుకోవడమే చాలా సులభమని తెలిసి, ఒకింత కలవరపాటుకు గురి అయ్యాడు శ్రీధరుడు.

"అయ్యా...మీరు నా మాటల్ని పూర్తిగా విన్న తరువాత మీ అభిప్రాయాన్ని చెప్పండి... రంగనాథస్వామి ఎదుట నృత్యం చేయాలని.." తన కలవరపాటును అణుచుకుంటూ తిరిగి సంభాషణ ప్రారంభించబోతుండగా, అతన్ని ఆపేశాడు మరో పూజారి.

"శ్రీవారు అత్యవసరమయిన వ్యవహారాలను సమీక్షించుకోవడంలో తీరిక లేకుండా వున్నారు. నువ్వు రేపటెల్లుండిలలో ఒకసారి కనిపించు... ఇప్పుడు వెళ్లిపో" అని ఆదేశించాడు.

తీరుబడి చేసుకుని శ్రీవారు తన గోడును వినిపించుకోవడానికి సిద్ధపడే లోపుగా, దోపిడీ దొంగల గుంపు ఆలయం మీదికి వచ్చి పడుతుందేమోనన్న అనుమానాన్ని గనుక అప్పటికప్పుడు వ్యక్తం చేస్తే. వారి ముఖాలలోని భావాలు ఎలా వుంటాయో చూడాలని శ్రీధరుడికి అనిపించిన మాట వాస్తవం.

తన ఎట్ట ఎదుట జరుగుతున్న సంభాషణ అసలు తన చెవులకు చేరటమే లేదన్నట్లు నిర్వికారంగా కూర్చుని వున్న ధర్మకర్తవైపు ఒకసారి పరిశీలనగా చూసి వెనుతిరిగాడు అతను.

కొమ్ముటేనుగులు నిలబడి వున్న గజశాలను దాటి పది ధనువుల దూరం కూడా పోకముందే పరుగులాంటి నడకతో వచ్చి అతన్ని కలుసుకున్నాడు అతన్ని విదిలించి మాటలాడిన మొదటి పూజారి.

"నగరంలోని వణిక్ సార్వభౌములు అనేకమంది మండపంలో వుండటం వలన నీతో సరిగా సంభాషించలేకపోయాను... ధర్మకర్తగారితో నీకేం పని?" పక్కనే అడుగులు వేస్తూ మృదువుగా అడిగాడు.

ధర్మకర్తగారితో తనకు వున్న పనేమిటో అతనికి చెప్పాడు శ్రీధరుడు.

"దోపిడీ దొంగలు వచ్చి పడుతున్నారన్న వర్తమానాన్ని ఆలకించి నగరంలోని భక్తులందరూ కలవరపాటుకు గురి అవుతున్న ఈ సమయంలో నీ మొక్కు చెల్లించుకోటం అంటే మాటలు కాదు...నాలుగు బంగారు నాణేలను యిచ్చుకోగలిగితే, అదను చూసుకుని నీ గురించి ధర్మకర్తకు చెబుతాను" ప్రధాన గోపుర ద్వారం వరకూ వచ్చి అసలు విషయాన్ని నిర్మొహమాటంగా వెల్లడించాడా పూజారి.

అతి పవిత్రమైన ఆ ఆలయ ప్రాంగణంలో అటువంటి మాటల్ని వినవలసి వస్తుందని వూహించలేకపోవటం వల్ల, ఆశ్చర్యం నిండిన కనులతో అతని ముఖంలోకి చూశాడు శ్రీధరుడు.

"నేను అడిగిన నాణేలను యివ్వకుండా నీ అంతట నువ్వు ధర్మకర్తతో, నీ మొక్కును గురించి చెప్పుకోవడం జరిగే పనికాదు. బాగా ఆలోచించుకో..." అంటూ వచ్చిన దారినే వెనక్కి తిరిగాడు పూజారి.

దట్టీలో వున్న నాణేలలో నుంచి నాలుగింటిని ఎంచి అతనికి యిచ్చేస్తే తలనొప్పి లేకుండా స్వరం సానుకూలం అవుతుందని అనిపించినా ఆ పని చేయలేకపోయాడు శ్రీధరుడు.

దేవుడి ఎదుట నృత్యం చేయాలనే అతి చిన్నకోరికను తీర్చుకోవటానికి, ఆలయ పూజారలు అడిగిన నాణేలను యిచ్చుకుని తీరాలా?

పూజారి వూహించినట్లు అతన్ని వెనక్కి పిలిచి, బంగారునాణేలను అతని దోసిటిలో పోయలేదు శ్రీధరుడు. ఆలయ ప్రాంగణంలో నుంచి వెలుపలికి వచ్చి, అక్కడ వున్న ఒక చిన్న మండపంలో బాసిపట్లు వేసుకు కూర్చున్నాడు.

సాయం సమయంలోనో, చీకటి పడేటప్పుడో ఏదో ఒకవేళలో, ఆలయంలో నుంచి బయటికి వచ్చితీరతాడు ధర్మకర్త. అందరూ చూస్తుండగా అతన్ని నిలువరించి తన కోరికను అతని చెవినవేస్తే సరిపోతుంది... అందుకు ఆలయం పూజారులు మధ్యవర్తిత్వం వహించాల్సిన అవసరం లేదు.

వీథిలో సంచరించటానికి బయలుదేరిన ఒకరిద్దరు పౌరుల వంక చూస్తూ, దోపిడీదొంగల గురించి వారు వెలిబుచ్చే అభిప్రాయాలను ఆలకిస్తూ, ఒక ఘడియపాటు మండపంలోనే కాలక్షేపం చేశాడు శ్రీధరుడు. కుడి ముంజేతికి వున్న కంకణాన్ని తీసి పరిశీలనగా చూస్తూ మరో అర్థఘడియసేపు నిరీక్షించాడు.

వైకుంఠపురం గ్రామదేవత ఆలయబొమ్మ తర్వాత ప్రముఖంగా చెక్కబడిన మరో గోపురపు చిత్రమే అతన్ని విపరీతమయిన ఆశ్చర్యానికి గురిచేసింది.

పడమటి దిశలో పడిపోబోతున్న సూర్యభగవానుడి సంధ్య కిరణాల వెలుగులో తళతళ మెరుస్తున్న రంగనాథుడి ప్రధాన గోపురమే అది!

కంటికి ఇంపుగా అగుపించే కలువపూలతో నిండివున్న కోనేటి బొమ్మ ఒకటి ఆ గోపురం పక్కనే అందంగా కనిపిస్తోంది.

కోనేటిలో దిగి స్నానం చేయటానికి వీలుగా చక్కని మెట్ల కట్టబడి వున్నాయి.

ఆ మెట్లకు ఇరువైపులా రెండు కొమ్ముటేనుగులు నిలుచుని వున్నాయి.

అక్కడితో అంతం అయిపోయాయి కంకణంమీది చిత్రాలన్నీ... శ్రీరంగం సమీపంలోకి వచ్చిన క్షణంనుంచీ తను చూసిన, చూస్తున్న అనేక రకాల చెరువుల్ని, దొరువుల్ని, కోనేరుల్ని మనసులో గుర్తుకు తెచ్చుకుంటూ కంకణాన్ని తిరిగి కుడిచేతికి బిగించుకున్నాడు శ్రీధరుడు.

తాము బస చేసిన ధర్మసత్రం వెనుకభాగంలో వున్నది చక్కని మెట్లు కట్టబడి వున్న కోనేరు ఒకటి... తాము బాడుగకు పుచ్చుకున్న భవంతి దగ్గిర కూడా కనిపించింది మరొకటి...

కంకణంమీద సూచించబడిన కోనేరు ఎక్కడ వున్నదో తెలుసుకోవాలంటే అదే పనిమీద శ్రీరంగమంతా కలయ తిరగవలసిందే.

ఆలయ ప్రధాన గోపుర ద్వారం వద్ద అలికిడి క్రమక్రమంగా హెచ్చవటంతో ఆ మాటల్ని మరిచిపోయి అటుకేసి దృష్టి సారించాడతను.

వెండి తొడుగులు తాపడం చేసివున్న రాజదండాలవంటి పెద్ద పెద్ద కర్రల్ని పట్టుకుని పదిమంది భటులు ముందు వెనుకా అడుగులు వేస్తుండగా, బరువైన మహాకాయాన్ని అతిప్రయత్నంమీద కదిలిస్తూ, ప్రధాన ద్వారంలో నుంచి బయటికి వచ్చాడు ధర్మకర్త.

గోపురానికి వంద ధనువుల దూరంలో సిద్ధంగా నిలబడి వున్నది ఒక పల్లకీ... అటుకేసి తిరుగబోతుండగా, అతని ఎదుటికి పోయాడు శ్రీధరుడు.

"పక్కకు తప్పుకో... ధర్మకర్తల దారికి అడ్డుగా రాకూడదు. అవతలికి వెళ్లిపో" ఖంగు ఖంగుమంటున్న కంఠాలతో అతన్ని హెచ్చరించారు ముందు వరసలో వున్న ఆలయభటులు. అప్పటికే అతను ముందుకే రావటాన్ని గమనించి తమ చేతుల్లో వున్న కర్రలతో బలంగా నెట్టారు వెనక్కి.

ఎంత ప్రయత్నించినా నిలదొక్కుకోవటం చేతకాక వెల్లికిలా పడిపోయాడు శ్రీధరుడు.

తిరిగి లేచేసరికి ఆశీనుడు అవనే అయ్యాడు ధర్మకర్త. తనను కలుసుకోవటానికి ఒక అపరిచిత వ్యక్తి ఎంతో ఆత్రంగా ముందుకు రాబోయిన దృశ్యాన్ని అతను కూడా చూసి వున్నాడు. చూసికూడా చూడనట్లే తలను పక్కకు తిప్పుకుని పల్లకీని ముందుకు పోనీయమని సైగ చేశాడు.

వస్త్రాలకు అంటిన దుమ్మును చేతులతో దులుపుకుంటూ ఆలయం ఎదుట నిలబడిపోయిన శ్రీధరుడిని చూసి వెక్కిరింతగా నవ్వాడు బంగారు నాణేలను ఆశించిన పూజారి.

"నేను చెప్పినట్లు చేస్తే తప్ప నీకోరిక నెరవేరదు. నీ అంతట నువ్వుగా ఏమీ చేయలేవు... బాగా ఆలోచించుకో..." అంటూ ఆలయంలోకి వెళ్ళిపోయాడు.

* * *

"దేవుడు వరమిచ్చినా పూజారి ఒప్పుకోడనే మాట అక్షరాలా యధార్థమని తేలిపోయింది. ఇక ఇప్పట్లో నువ్వు నా మొక్కను గురించి ఆలోచించవద్దు" కోపంతో చెక్కిళ్ళు ఎర్రబడిపోతుండగా అన్నది హేమసుందరి.

చీకటి పడిన అర్ధఘడియకు వెనుతిరిగి వచ్చాడు శ్రీధరుడు. ఆలయ ప్రాంగణంలో జరిగిన మాటల గురించి, ఆలయం ఎదుట తన అనుభవాన్ని గురించి ఆమెకు తెలియజేశాడు.

"అవమానం జరిగిందన్న కక్షతో పిడికిళ్ళు బిగించి నువ్వు వారిమీదికి ఎగబడలేదు...అదే పదివేలు...అసలు మనం ఇకమీద ఆ ఆలయం దరిదాపుల్లోకి పోవద్దు" ఉన్నట్లుండి మరో నిర్ణయాన్ని కూడా అతనికి వినిపించిందామె.

"తన ఎట్టఎదుట ఇన్ని అన్యాయాలు జరుగుతుంటే ఆ భగవంతుడు ఎలా భరిస్తున్నాడో నాకు అర్థం కావటంలేదు..." దూరంగా కూర్చుని వున్న తోటమాలి చిన్నకంఠంతో తన అభిప్రాయాన్ని వెలువరచటంలో గాఢంగా నిట్టూర్చి, భవంతి వెనుకభాగంలో వున్న ఖాళీస్థలంలోకి పోయాడు శ్రీధరుడు.

చిన్నపిల్లలు సంబరపడినట్లు అమితమైన సంతోషంతో అతనికి స్వాగతం చెప్పాయి అక్కడ వున్న వృషభాలు. కొమ్ముల్ని బారు చేసి అతని భుజాల్ని అదేపనిగా గోరాడింది ఎలపటి వృషభం.

వాటి అవసరాలన్నీ తీరాయో లేదో ఒకటికి రెండుసార్లు శ్రద్ధగా పరిశీలించి, భవనం ముందుభాగంలోకి వచ్చాడు శ్రీధరుడు.

అంతకుముందు ఎక్కడ కూర్చున్నాడో, అక్కడే అగుపించాడతనికి తోటమాలి.

ఒక్క జానెడు దూరం కూడా ముందుకుగాని, వెనక్కుగాని జరగలేదు.

"వంట ప్రయత్నాలు చేయటంలేదా? మాకు కొత్తదనం పోయేటంత వరకూ నువ్వే వంట చేస్తావని నేను అనుకుంటున్నాను..."

భవంతి ముందుభాగంలో వేయబడిన పట్టెమంచంమీద కూర్చుంటూ అడిగాడు శ్రీధరుడు.

దంతాలన్నీ కనిపించేటట్లు పెద్దగా నవ్వి హేమసుందరివైపు తల వూపి చూపించాడు తోటమాలి.

"అమ్మగారే వంటపని చూస్తున్నారు... మీతోపాటు నాకుకూడా ఇక్కడే భోజనమని గట్టిగా చెప్పారు..." అని అతను చెపుతూ వుండగానే, గుమ్మంలోకి వచ్చింది హేమసుందరి.

"స్నాన సంధ్యలు పూర్తి చేసుకువస్తే భోజనం చేయవచ్చు... ఆలస్యం చేస్తే చల్లారిపోతాయి పదార్థాలు..." అని హెచ్చరించింది.

తమ భవంతికి ఎడమచేతివైపున వున్న కోనేటి దగ్గిరికి పోయి, తృప్తి తీరా స్నానమాచరించాడు శ్రీధరుడు.

అతనికి తెలియకుండానే కోనేటి మెట్లను పరిశీలించాయి అతని కనులు.

రాగి కంకణం మీద చిత్రించబడి వున్నట్లుగా కొమ్ముటేనుగు బొమ్మలు ఆ మెట్ల పక్కన కనిపించకపోయేసరికి ఆ విషయాన్ని గురించి ఆలోచించటం మానుకున్నాడు.

నీటిలో ముంచి గట్టిగా పిండిన తన దుస్తులు బలంగా వీస్తున్న గాలితెరల తాకిడికి చక్కగా ఆరిపోగానే వెనక్కి వచ్చాడతను.

పూలతోట చివరి భాగంలో వున్న బాదంచెట్ల ఆకుల్ని తోటమాలితో తెప్పించి స్వయంగా పెద్దపెద్ద విస్తళ్ళను తయారుచేసి, ఆహారపదార్థాలను వాటలో వడ్డించింది హేమసుందరి.

తోటమాలి చేతివంట కంటే, వెయ్యిరెట్లు రుచికరంగా వున్న ఆ పదార్థాలను వంచిన తల ఎత్తకుండా ఆరగించాడు శ్రీధరుడు.

"పెదవి విప్పి ఒక్కమాట కూడా మాట్లాడకుండా తింటున్నావు... భోజనం రుచికరంగా లేదా? పదార్థాలు బాగోలేదా?" వున్నట్లుండి అతన్ని అడిగింది హేమసుందరి.

"ఇటువంటి భోజనం నా జన్మలో చేసి ఎరుగను తల్లీ... రంగనాథుడి ఆలయంలోని ప్రసాదంకంటే అద్భుతంగా వున్నాయి పదార్థాలు" అడిగింది తనను కాకపోయినా సమాధానం యిచ్చాడు తోటమాలి.

ఒక్కక్షణం అతనివంకా, హేమసుందరివంకా చూసి చిరునవ్వు నవ్వుతూ, విస్తరి ముందునుంచి లేచాడు శ్రీధరుడు.

"అలవాటు లేని పని కావటంవల్ల వంట పాడైపోయింది. అందుకే నువ్వు మాట్లాడటంలేదు... మారు వడ్డించమని కూడా అడగలేదు.. పావుఘడియ తరువాత తనూ భుజించి, భవంతి ముందుభాగంలోకి వస్తూ అన్నది హేమసుందరి.

తులసి అత్తగారిని ఏడిపించుకు తినటానికి తను అపరభీముడి మాదిరి అదేపనిగా విస్తరిని ఖాళీచేసిన దృశ్యాన్ని ఆమె గుర్తుకు తెచ్చుకుంటోందని గ్రహించి, మరోసారి ఆమెవంక చూసి చిరునవ్వు నవ్వాడు శ్రీధరుడు.

అడిగిన మాటకు సూటిగా సమాధానం చెప్పకుండా, చిరునవ్వులు చిందించటం ఈమధ్య నీకు బాగా అలవాటైపోయినట్లుంది..." చిరుకోపంతో అంటూ, భవంతి ముందున్న ఒక చలువరాతి గట్టుమీద ఆసీనురాలైంది హేమసుందరి.

పట్టెమంచంమీద పరున్నాడు శ్రీధరుడు. ఆకాశంలోని తారకల్ని చూస్తూ, అలాగే నిద్రలోకి జారిపోబోతుండగా , అతని భుజం తట్టింది ఆమె. అందంగా చుట్టిన తమలపాకు చిలుకను అందించింది.

"నువ్వు ఆలయ ధర్మకర్తను కలుసుకోవటానికి వెళ్ళినప్పుడు తోటమాలిని నగరంలోకి పంపి తమలపాకులు తెప్పించాను... భోజనం చేశాక తాంబూలం నమిలితే హాయిగా నిద్ర పడుతుందిట..." ఆశ్చర్యంగా చూస్తున్న శ్రీధరుడితో చెప్పింది.

తాంబూల సేవనం తనకు అలవాటు లేదని ఆమెకు తెలియచేయలేదు శ్రీధరుడు... మాట్లాడిన ప్రతిమాటకు ఎదురుచెప్పటం అలవాటైపోయిందనే నింద వేస్తుందన్న అనుమానంతో.

"ఈ నగరం మీదికి వచ్చిపడుతోందని అందరూ అంటున్న దొంగల గుంపు మూలకంగా మనకు ఏదైనా ఆపద సంభవిస్తుందా?" తమలపాకుల పళ్ళెరాన్ని ఒడిలోనుంచి తీసి పక్కన పెడుతూ అతన్ని ప్రశ్నించింది హేమసుందరి.

మొట్టమొదటిసారిగా ఆ మాటల్ని గురించి లోతుగా ఆలోచించడం మొదలుపెట్టాడు శ్రీధరుడు.

"గతంలో ఎప్పుడో ఐదారు దశాబ్దాల క్రిందట ఉత్తరదేశంలోని సోమనాథ దేవాలయంమీద దాడిచేసిన గుంపువంటిదే యిప్పుడు వస్తున్న గుంపు అయితే, తప్పకుండా ఇబ్బందులపాలవుతారు తాము.

సోమనాథ దేవాలయాన్ని నాశనం చేసి అక్కడి అపారసంపదను దోచుకోవటంతో ఆగలేదట అప్పటి గుంపు... ఆలయ పూజారుల్ని, ఆలయ రక్షకుల్ని, అడ్డువచ్చిన వేలమంది పౌరుల్ని ఊచకోత కోసి వెనుతిరిగిందట.

పదిమందో పాతికమందో కాదు ఆ గుంపులోని సభ్యులు... వేలకు వేలమంది నేల ఈనినట్లు వుంటారట...సుశిక్షితులైన సైనికుల్లా కన్ను మూసి కన్ను తెరిచేటంతలో వచ్చి నగరంమీద పడిపోతారట.

తన మాటలు శ్రీధరుడి మనస్సులో ఎటువంటి ఆలోచనల్ని రేకెత్తిస్తున్నాయో పసికట్టి, అతను పరున్న పట్టెమంచం చివరకు వచ్చి కూర్చున్నది హేమసుందరి.

ఈ ఎద్దడి సమసిపోయేవరకూ మనం ఎటైనా వెళ్ళి తలదాచుకోవటానికి అభ్యంతరం ఏదయినా వున్నదా?" చూపుడు వేలితో మంచంపట్టె మీద గీతలు గీస్తూ మృదుస్వరంతో అడిగింది ఆమె.

మిడతల గుంపుమాదిరి వచ్చిపడే ఆ దొంగల ఎదుట నిలబడి ప్రాణాల్ని పోగొట్టుకోవటంకంటె, హేమసుందరి చెప్పినట్లు దూరంగా పోయి తలదాచుకోవటమే ఉత్తమం అనిపించింది శ్రీధరుడికి. ఆ మాట అనుకుంటూ వుండగానే అతని మనసులో మెదిలింది మరో ఆలోచన.

"రేపు ఉదయమే లేచి రంగనాథుడి దర్శనానికి వెళదాం... నీ మొక్కును గూర్చి మరోసారి ధర్మకర్తను అడిగి చూస్తాను... మిగిలిన విషయాల గురించి తరువాత తీరికగా ఆలోచించుకుందాం"అంటూ పక్కకు తిరిగి పడుకున్నాడు.

తెరలు తెరలుగా వీస్తున్న గాలితెర అదటుకు అల్లనల్లన వచ్చి అతని గుండెలమీద పడిన పండుటాకు నొకదాన్ని సున్నితంగా తీసి అవతల పడవేసింది హేమసుందరి. తోటమాలి తెచ్చి ఇచ్చిన మందపాటి వస్త్రాన్ని అతని నడుము వరకూ కప్పి, తను భవంతిలోకి వెళ్ళిపోయింది.

## 12

దోపిడీ దొంగల ఆగమన వార్త చెవులపడిన క్షణంనించీ నగరాన్ని వదిలి దూరంగా వెళ్ళిపోదామని చూసే భక్తులనే తప్ప, నగరం వెలుపలి నుంచి లోనికి వచ్చేవారిని అంతవరకూ వీక్షించలేదు ప్రాకారద్వారాల దగ్గిర కాపలా నిలబడి వున్న రాజభటులు.

విపణివీధి నుంచి శ్రీధరుడు తీసుకువచ్చిన వలువల్లో, చిలుకపచ్చరంగు కంచిపట్టుచీరెను వైష్ణవ సంప్రదాయంలో కట్టుకున్నది హేమసుందరి.

మంచుబిందువుల స్పర్శతో పులకరించిపోతున్న రకరకాల పుష్పాలను పూలసెజ్జలో పెట్టుకున్నది. అగరు, జువ్వాది, కస్తూరి మొదలయిన సుగంధ ద్రవ్యాలను కూడా తీసుకున్నది. రాయంచ మాదిరి నడుస్తూ నగర ద్వారాలను అధిగమించింది.

దివినుండి భువికి దిగివచ్చిన దేవకన్య మాదిరి కనిపిస్తున్న ఆ సుందరమూర్తిని నోళ్ళు తెరుచుకుని చూశారు నగరంలోని వారందరూ.

ఆలయ ధర్మకర్త అనుమతి ఇస్తే అప్పటికప్పుడు ఆమె నృత్యాన్ని ఏర్పాటు చేయాలని నిశ్చయించుకుని వుండటం వల్ల, అందుకు అవసరమైన సరంజామానంతా చేనేత వస్త్రంలో చుట్టి తనవెంట తీసుకువచ్చాడు శ్రీధరుడు.

నగర పౌరుల ఆశ్చర్యాన్ని గమనించి తనలో తను నవ్వుకుంటూ, ఆలయం ఎదుటికి చేరుకున్నాడు.

ఆలయ ప్రాకారం లోపలిభాగంలో నుంచి అదేపనిగా వినవస్తున్న ఘంటానాదాల్ని వింటూ, భక్తి పారవశ్యంతో తనను తాను మరిచిపోయింది హేమసుందరి.

"జయము జయము... కావేటిరంగనికి జయము జయము..."కోకిల స్వరంతో మధురంగా దేవతా సార్వభౌముడికి జయజయధ్వానాలు చేసింది.

ధర్మకర్త ఆలయప్రదేశం చేశారో లేదో తెలుసుకోవటానికి, ఆమెను ఆలయం ఎదుటవున్న మండపం దగ్గిరే వదిలి, నాలుగు అడుగులు అవతలికి వేశాడు శ్రీధరుడు.

విస్ఫారిత నేత్రాలతో హేమసుందరి వైపే చూస్తున్న ఇద్దరు పౌరులను పలకరించబోతుండగా అతని చెవులను చేరింది ఆ సందడి...

"విచ్చేశారు... దక్షిణదేశ యాత్రలను అర్థాంతరంగా ముగించుకుని వెనక్కి వచ్చేసిన రామానుజాచార్యుల వారు నగరంలోకి విచ్చేశారు..." అని కేకలు పెడుతూ ఆలయం దగ్గిరికి పరిగెత్తుకు వచ్చారు కొందరు పౌరులు.

కనుల్ని పెద్దవి చేసి హేమసుందరి వైపు చూస్తున్న పౌరులందరి వదనాల్లోను వెంటనే ప్రత్యక్షం అయ్యాయి విషాదఛాయలు.

"దొంగలు గుంపు వచ్చిపడుతున్నదన్న వర్తమానం అసత్యం కావాలని ఎంతో ఆశించాము. రామనుజాచార్యులవారి రాక ఆ మాటలను బలపరుస్తోంది. మన బ్రతుకులు సంశయంలో పడినట్లే ఇక..." తమలో తాము అనుకుంటూ, అవతలికి వెళ్ళిపోయారు శ్రీధరుడు మాట్లాడించ చూసిన పౌరులు ఇద్దరు.

మరో నాలుగు అడుగులు ముందుకు వేసి, యింకో పౌరుడిని సమీపించబోయిన శ్రీధరుడికి ఆ వీధి చివరిభాగంలో అగుపించింది ఒక ఊరేగింపు.

ద్రవిడ పాశురాల్ని సుమధుర కంఠాలతో గానంచేస్తూ వస్తున్నారు ఆ గుంపులోని వైష్ణవదాసులు అందరూ... ప్రధాన శిష్యులు ఇద్దరు

కైదండలొసగుతుండగా ఊరేగింపు ముందుభాగంలో అడుగులు వేస్తున్నారు గురు రామానుజాచార్యులవారు.

స్ఫురదా పట్టణంలో చూసినప్పటికంటె, ఆయన బాగా నలిగిపోయినట్లు కనిపించారు శ్రీధరుడికి... నిరంతర భగవధ్యానంలో నిర్మలంగా వుండవలసిన ఆయన వదనం అలజడితో కాస్తంత కాంతిహీనంగా అగుపించింది అతని కనులకు.

"అర్థాంతరంగా యాత్రలు ముగించుకుని, ఎక్కడా ఆగకుండా ప్రయాణం చేయటంవలన అలా కనిపిస్తున్నారు... అంతకంటే మరేమీ లేదు" తనలో తనే అనుకుంటూ, మండపం ఎదుట నిలిచివున్న హేమసుందరి దగ్గిరికి తిరిగి వచ్చేశాడతను.

ఎదురువచ్చిన ప్రతి పౌరుడు తనకు పాదాభివందనం చేసిగాని అవలకు పోకపోవడం వల్ల, దాదాపు పావుఘడియ పట్టింది రామానుజాచార్యుల వారు ఆలయం ముందుకు రావటానికి.

"భగవద్దర్శనానికి ముందుగా ఆ యతిరాజుల దర్శనం చేసుకుందాం. ఆలయంలోకి పోయిన తరువాత ఆయనను సమీపించదానికి అవకాశం లభించకపోవచ్చు" అంటూ మండపం దగ్గిరే నిలబడిపోయింది హేమసుందరి.

అడుగులో అడుగు వేస్తూ వచ్చి ఆ మహనీయుడి ఎదుటికి పోయి పాదాభివందనం చేసింది. ఆమె తనచేతిని గట్టిగా పట్టుకోవటం వల్ల, విధిలేక ఆమెను అనుసరించి తనుకూడా ఆ తేజోమూర్తికి ప్రణామం చేశాడు శ్రీధరుడు. దక్షిణహస్తంతో హేమను ఆశీర్వదించారు రామానుజులవారు. అదే పద్ధతిలో

శ్రీధరుడి శిరస్సును స్పృశించబోతుండగా, విపరీతమైన ఆశ్చర్యం ప్రతిఫలించింది వారి నేత్రయుగళిలో.

"నువ్వు స్ఫురదాపట్టణంలో మాకు కనిపించావు... భగవత్ స్వరూపాన్ని పామరులకు కూడా అర్థమయ్యేటట్లు బోధించావు... అవునా?" ఆశీర్వదించటంతో ఆపకుండా అతని భుజంమీద చేయివేసి అనునయస్వరంతో అడిగారు.

తమ ప్రధాన శిష్యులతో తప్ప అపరిచిత వ్యక్తులతో అధికంగా సంభాషించని ఆ పూజ్యమూర్తి, తనకు తానే అలా పృచ్ఛచేస్తూ వుండటాన్ని గమనించి నివ్వెరపోయారు ఆయన వెనక నిలబడి వున్న వారందరూ.

ఆ మాటల్ని విన్నవారందరూ తనవంక వింతగా చూడటం మొదలు పెట్టే సరికి సిగ్గుపడ్డాడు శ్రీధరుడు.

"మీవంటి యతిరాజుల ఎదుట భగవత్ స్వరూపాన్ని గురించి అందరికీ బోధించానని ఎలా చెప్పుకోగలను? నేనెంత నా ప్రజ్ఞ ఎంత?" బిడియంగా సమాధానం చెపుతుండగా, అతని భుజం తట్టి, మరింత దగ్గిరికి తీసుకున్నాడు.

"భగవంతుడు నిరాకారుడని, నిర్గుణుడని తెలుసుకోగలగటమే ఒక ప్రజ్ఞ. నువ్వు ప్రజ్ఞావంతుడికి కాకపోతే, ఈ ప్రపంచంలో మరి ఎవరూ కాదు" అని అంటూ, విశాల నేత్రాలను విప్ఫారితం చేసి చూస్తున్న హేమసుందరి వైపు తల వూపారాయన.

"ఈమె ఎవరు? నీ అర్ధాంగా?" అని అడిగారాయన.

పచ్చి వెలగకాయ గొంతుకు అడ్డుపడినట్లు అయింది శ్రీధరుడి పరిస్థితి. తల తిప్పి హేమసుందరి కేసి చూడటానికి కూడా భయపడ్డాడతను.

"కాదు స్వామీ... ఈమె నా అర్థాంగి కాదు" అని చెప్పబోతుండగా పూర్తిగా వినకుండానే, వామహస్తాన్ని జాచి హేమను దగ్గిరికి తీసుకున్నారు రామానుజా చార్యులవారు.

"కావేటిరంగని విశాల నేత్రయుగళి మాదిరి మీరిద్దరూ నాకు కనిపిస్తున్నారు. రంగనాథుడి దర్శనం చేసుకుందాం పదండి..." అంటూ వారితోపాటు ఆలయం కేసి నడిచారు.

ప్రధాన శిష్యుల కైదండ తప్ప స్వీకరించని ఆ యతిరాజు యిద్దరు యువతీ యువకులు భుజాలమీద చేతులు వేసి ఆలయంలోకి పోవటం గొప్ప చర్చనీయాంశం అయింది ఆ పరిసరాల్లో.

"కులమేమిటో, గోత్రమేమిటో, ఎక్కడినుంచి వచ్చారో తెలియని అపరిచితులతో అంతసేపు సంభాషించటమే కాకుండా వారి భుజాల మీద చేతులు వేసి స్వయంగా ఆలయంలోకి తీసుకుపోవటం ధర్మసమ్మతమేమో కాస్తంత ఆలచోచించండి..." ఊరేగింపులోని ఒక శిష్యుడిని వెనక్కి పిలిచి లోగొంతుకతో రామానుజువారి చర్యల్ని విమర్శించాడు ఆలయం వద్ద నిలుచున్న పౌరుల్లో ఒక ప్రముఖుడు.

తమ గురుదేవుల అనాలోచిత చర్యలకు ఆ సమయంలో తాను సమాధానం చెప్పవలసి వచ్చినందుకు కొంచెం ఉక్రోషపడ్డాడా శిష్యుడు.

"దక్షిణదేశ యాత్రనుంచి తిరిగి రాగానే మఠంలోకి కూడా పోకుండా, స్నానసంధ్యల్ని కావేరి తీరంలోనే ముగించుకుని సరాసరి ఇటు వచ్చేశారు గురుదేవుడు. అదను చూసుకుని మీ అసంతృప్తిని వారికి ఎరుకపరుస్తాను..." అంటూ వడివడిగా అడుగులు వేస్తూ ఆలయ ద్వారాన్ని అధిగమించాడు.

అంతకు ముందురోజునుంచీ గజశాలను వదిలి ఇవతలికి రాని కొమ్ము టేనుగులు ఆ పవిత్రమూర్తిని వీక్షించగానే, మావటీల అనుమతి కోసం నిరీక్షించకుండా పరుగు పరుగున వచ్చేశాయి ఆయన ఎదుటికి.

భక్తుల తలల్ని స్పృశించి ఆశీర్వదించే ఆ మూగజీవాలు, రామానుజాచార్యుల ఎదుట నిమీలిత నేత్రాలతో ఆయన ఆశీర్వచనాల కోసం ఎదురు చూస్తున్నట్లు అనిపించి అచ్చెరువొందాడు శ్రీధరుడు.

దక్షిణ హస్తంలో వాటి ముఖాలను నిమిరి ముందుకు అడుగు వేశారాయన. పూర్ణకుంభంతో చూస్తూ ఆలయంలోకి అడుగుపెట్టాడు.

ఆనవాయితీ ప్రకారం పూజ ప్రారంభించబోయిన పూజారిని చేసైగతో ఆపి, తనతోపాటు లోపలికి వచ్చిన శ్రీధరుడి వైపు చూపించాడు.

"మాకంటే ముందుగా ఆలయం ముందుకు వచ్చిన ఈ యువక మూర్తి పేర పూజ చేయండి" అని ఆదేశించాడు.

వైష్ణవ మత సాంప్రదాయం ప్రకారం శ్రీరంగని ఆలయానికి సర్వాధికారి అయిన ఆ యతిరాజు మాటలకు ఎదురు చెప్ప సాహసం చేయలేకపోయాడా పూజారి.

హేమసుందరి అందించిన సుమధుర సుగంధభరితమైన పుష్పాలతో సుగంధద్రవ్యాలతో స్వామివారిని అలంకరించాడు. శ్రీధరుడిని అడిగి అతని గోత్రనామాలను తెలుసుకున్నాడు.

ఆ తరువాత అతను ఏం చేయబోతున్నాడో తెలియక, అమాయకంగా నిలబడి వున్న శ్రీధరుడి శరీరం మరోసారి జల్లుమంది.

రామానుజులవారు పొరబడినట్లుగానే, పూజారి కూడా పొరపాటు బడ్డాడు. హేమసుందరిని అతని అర్థాంగిగానే తలంచి, "ధర్మపత్నీ సమేతస్య..." అంటూ గోత్ర నామాదుల్ని చదవటం మొదలు పెట్టాడు.

బిగ్గరగా అరిచి ఆ తప్పును సరిచేయాలని అనుకుంటున్న శ్రీధరుడి చేతిని పట్టుకుని గట్టిగా నొక్కింది హేమసుందరి.

"జరిగిపోయినదాన్ని నువ్వు సరిచేయలేవు. పూజకు అంతరాయం కలిగించకు" లోగొంతుకతో అతన్ని హెచ్చరించింది.

భగవంతుడి ఎదుట అటువంటి పొరపాట్లు జరగటం మంచిదికాదని ఆమెకు అర్థమయ్యేలా చెప్పాలని అనుకున్నాడు శ్రీధరుడు.

ఆమె అర్ధనిమీలిత నేత్రాలతో దేవదేవుడి వంకే చూస్తూ వుండటంతో, విధిలేక బలవంతంగా అదుముకున్నాడు తన నోటిలోని మాటల్ని.

అష్టోత్తర నామాలతో రంగనాథుడిని అర్చించి, తీర్థ ప్రసాదాలను వారికి అందించాడు అర్చకస్వామి.

"మీ పేరిట జరిగిన పూజతో ప్రసన్నుడైనాడు కావేటి రంగడు, ఇప్పుడు మీ కోరికల్ని స్వామివారికి విన్నవించుకోండి..." చిరునవ్వుల్ని వెలయిస్తూ వారిద్దరినీ ప్రోత్సహించారు రామానుజులవారు.

"స్వామి ఎదుట నృత్యం చేయాలనే కోరిక తప్ప హేమసుందరికి మరే కోరికా లేదు" అని అనబోయిన శ్రీధరుడి వంక చురుకుగా చూసి నోటిని మూయించింది హేమసుందరి.

అప్పటికే ఆ మాటల్లో సగం రామానుజులవారి కర్ణేంద్రియాలను చేరుకోనే చేరుకున్నాయి.

"నీ రూపలావణ్యాలకు తగిన కోరిక అది...ప్రసన్నవదనుడైన రంగనాథుడు తప్పకుండా తిలకించి మెచ్చుకుంటాడు...వెంటనే వెళ్ళి ధర్మకర్త అనుమతిని అర్థించండి..." వెంటనే అన్నారాయన.

అంతకు ముందురోజు తనకు జరిగిన అవమానాన్ని గుర్తుకు తెచ్చుకునే సరికి స్వల్పంగా వివర్ణమైంది శ్రీధరుడి వదనం.

కారణం ఏమిటో సరిగా తెలియకపోయినా, అతనెందుకో సంకోచిస్తున్నట్లు అర్థమై మరోసారి ఒత్తిడి చేశారు రామానుజాచార్యులు.

"స్వయంగా స్వామిని సేవించుకోవటం తప్ప, ఇతరులు స్వామిని సేవించటాన్ని మేము చూసి చాలాకాలం అయింది.

మఠానికి తిరిగి వెళ్ళే సమయం ఆసన్నం అయ్యేలోపుగా ధర్మకర్త మీకు అనుమతిని ఇవ్వగలిగితే మేము సంతోషిస్తాము" అంటూ కావేటి రంగని ఎదుట పద్మాసనం వేసుకు కూర్చున్నారాయన.

ఆయనకు సమీపంలో నిలబడటం కోసం ఒకరినొకరు నెట్టుకుంటూ, ముందుకు జరుగుతున్న శిష్యగణాన్ని ఓరకంట గమనించుకుంటూ, ఆలయంలో నుంచి బయటికి వచ్చాడు శ్రీధరుడు.

అంతకు ముందురోజు మాదిరిగానే గర్భగుడి వెనుక భాగంలోని మండపంలో, పట్టుతలగడల మీద ఒరిగి కూర్చుని అతనికి అగుపించాడు ఆలయ ధర్మకర్త. అతని పక్కనే నిలువబడి చెవిలో ఏదో రహస్యంగా చెబుతున్న పూజారి, చటుక్కున మాటల్ని ఆపి వెనక్కి జరిగాడు శ్రీధరుడిని గమనించగానే.

"వైష్ణవ మతాధిపతులు ఈ ఆలయానికి సర్వాధికారులే అయినప్పటికీ, ఇంతవరకూ ఎవరూ ఆలయ నిర్వహణా కార్యాల్లో తలలు దూర్చినది లేదు. నీ

గురించి రామానుజులవారు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటన్నట్లుగా తెలిసింది..." వినయంగా నమస్తరించిన శ్రీధరుడిని క్రిందినుంచి పైదాకా పట్టిపట్టి చూస్తూ అన్నాడు ధర్మకర్త.

విఘ్న వినాశకుడైన వర వినాయకుడి బొజ్జ మాదిరి అపరిమితంగా పెరిగి వున్న అతని మహోదరం వంక చూడకుండా వుండటానికి ప్రయత్నిస్తూ, అంజలి ఘటించి తన కోరికను వెల్లడించాడు శ్రీధరుడు.

"భక్తుల మనసుల్నీ ముంచుకు రాబోతున్న ముప్పు కారణంగా కలత చెందుతున్న ఈ సమయంలో సంగీత నృత్యాలతో స్వామిని సేవించటము సమంజసం కాదు... తర్వాత మరెప్పుడైనా చూస్తామని చెప్పండి ..." చెప్పాడు అంతకుముందు అతనితో మాట్లాడిన పూజారి.

తనకు నాలుగు వరహాలు బహుమతిగా ఇవ్వకుండా సరాసరి ధర్మకర్త దరికి రావటం అతనికి కోపకారణం అయిందని శ్రీధరుడికి అర్థం అవుతూనే వున్నది. వున్నపళంగా ఆలయం వెలుపలికి అతన్ని తీసుకుపోయి, తన పిడికిటి పోట్లరుచిని ఒకసారి చూపిస్తే ఎలా వుంటుందోనన్న ఆలోచన అతని మనసులో అడుగు పెట్టబోతుండగా పరుగు పరుగున అక్కడికి వచ్చాడు మరో అర్చకుడు.

"వైష్ణవ మఠంలో ప్రతిష్టించబడి వున్న దేవరాజ స్వామివారికి ఈ రోజు స్వయంగా పూజ చేయాలని గురు రామానుజులవారు అభిలషిస్తున్నారట... ఈతని మొక్కు తీర్చుకోవటం ఈ రోజున కుదరని పక్షంలో మఠానికి వెళ్ళిపోతారట" గర్భగుడిలో నుంచి ఆ మండపానికి వున్న మధ్యదూరం స్వల్పమే అయినా, పది యోజనాలు పరిగెత్తుకు వచ్చినట్లు వగరుస్తూ ధర్మకర్తకు నివేదించాడు.

శ్రీధరుడి కోరికను నిర్మొహమాటంగా తిరస్కరించటానికి సిద్ధపడుతున్న ధర్మకర్త వదనంలో వెంటనే మారాయి రంగులు.

"స్వామివారి సేవలకు సంబంధించి ఎవరికి ఎక్కువ అధికారాలు వున్నాయో కులోత్తుంగచోళుల వారికి విన్నవించి తేల్చుకుంటాను..." కోపంగా అంటూ పక్కన వున్న పూజారికి సైగ చేశాడు.

"నాట్యమండపాన్ని సిద్ధం చేయించు...మన వాద్యగాంధ్రనందర్ని పిలిచి ఈతనికి పరిచయం చేయి..." అని ఆజ్ఞ ఇచ్చి ముఖాన్ని తిప్పుకున్నాడు.

"రామానుజులవారే స్వయంగా నీ గురించి పట్టించుకున్నారంటే నువ్వు సామాన్యుడివి కాదు. వైష్ణవమతానికి ఎన్ని బంగారు నాణేలు బహుమతిగా ఇచ్చావు?"మండపం దగ్గిర్నించి ఇవతలకు రాగానే, శ్రీధరుడిని ప్రశ్నించాడు ఆ పూజారి.

కోపాన్ని అదుముకోవటం అసాధ్యమైపోయింది శ్రీధరుడికి ... అతనికి తెలియకుండానే కదిలింది అతని కుడి పిడికిలి.

ఆలయ రక్షకుడి దగ్గిర వుండే బరువైన చేతికర్ర ఏదో వున్నట్లుండి వచ్చి తన నోటికి తగిలినట్లు భరించరాని బాధతో విలవిలలాడిపోతూ వెనక్కి తూలాడు ఆలయపూజారి. గర్భగుడిలోకి స్వామివారి అభిషేకజలం బయటికి పోయేందుకు ఏర్పాటు చేయబడిన గోముఖం వున్నది అక్కడ. అది వెన్నుకు పొడుచుకోవటంతో బాధ మరింత అధికమై నేలమీద కూర్చుండిపోయాడతను.

కన్నుమూసి కన్ను తెరిచేటంతలో జరిగిపోయిన ఆ సంఘటనను కనులారా చూసిన వారెవరూ లేకపోవటంతో, అతనెందుకు అలా పడిపోయాడో

తెలియక విపరీతమైన ఆందోళనను వెలిబుచ్చుతూ అటుగా పరిగెత్తుకు వచ్చారు ఆ చుట్టుపట్ల సంచరిస్తున్నవారు.

వారందరి కంటే ముందుగా కిందికి వంగి పూజారిని పైకి లేవదీశాడు శ్రీధరుడు. "అయ్యయ్యో స్వామీ... ఏమిటి ఇలా అయిపోయారు? ఏమైంది మీకు?" ఆత్రుతగా అడుగుతూ, అతని పెదవుల చివర్లనుండి జారుతున్న రక్తపుధారను చేతితో అద్దాడు.

పూజారి పడిపోవటానికి అతనే కారకుడని అటు వచ్చినవారిలో ఒక్కరు కూడా అనుకోలేదు. పైతం ప్రకోపించి కనులు తిరిగి వుంటాయని, నీరెండలో నిలబడితే ఒక్కోసారి అలాగే జరుగుతూ వుంటుందని, ఎవరికి తోచిన మాటల్ని వారు చెప్పి, ఒకరి తర్వాత ఒకరుగా వెళ్ళిపోయారు.

నడుముకు చుట్టుకున్న వస్త్రాన్ని వూడదీసి, నమిలి మింగేసేటట్లున్న చూపులతో శ్రీధరుడిని చూశాడు ఆలయ పూజారి.

"అసహజము అసంబద్ధము అయినటువంటి మాట ఏదైనా మరోసారి మీ నోటివెంట వెలువడిందంటే, ఈసారి మీ నోరు ఒక్కటే కాదు, ముఖంకూడా పగిలిపోతుంది. నోటిని అదుపులో పెట్టుకుని మాట్లాడండి స్వామీ" కనుబొమలు ముడిచి క్రూరాతిక్రూరంగా ఆ పూజారివంక చూస్తూ కరుకు కంఠంతో అతన్ని హెచ్చరించాడు శ్రీధరుడు.

"నా ఒంటిమీద చేయి వేసినందుకు తగిన ఫలాన్ని అనుభవిస్తావ్...నీకు భూమిమీద నూకలు చెల్లిపోతాయి" మాటమాటలో దారుణమైన ఆగ్రహాన్ని ప్రతిఫలింపజేస్తూ బెదిరించాడు అతన్ని పూజారి.

"ఈ పవిత్ర ప్రదేశంలో కాకుండా ఇంకెక్కడైనా ఈ మాటలు మీ నోటివెంట వెలువడి వుంటే ఎవరికి నూకలు చెల్లిపోతాయో ప్రత్యక్షంగా చూపించి వుండేవాడిని. పిచ్చి పిచ్చి ఆలోచనలతో మీ మనసును పాడుచేసుకోకుండా నాట్యమండపం దగ్గిరికి దారి తీయండి..." అంటూ బలమైన దెబ్బ తగిలి అయోమయంగా చూసే వ్యక్తిని నడిపించినట్లు బలవంతంగా ముందుకు నడిపించాడు అతన్ని శ్రీధరుడు.

అతని చేతుల్ని విదిలించి కొట్టేందుకు అవసరమైన బలం తనకు లేదని గ్రహించి, విసురుగా అడుగులు వేశాడు పూజారి. ముఖమండపం దగ్గిర నిర్మితమైన వేదికను అతనికి చూపించాడు... అక్కడే కూర్చుని వున్న వాద్యగాండ్రను పరిచయం చేశాడు.

ఆనవాయితీ ప్రకారం అక్కడ నృత్య ప్రదర్శనలు యిచ్చే దేవదాసీలను తప్ప బయటి వారెవ్వరినీ చూసి వుండకపోవటం వల్ల శ్రీధరుడి కోరిక విడ్డూరంగానే వినిపించింది ఆ వ్యక్తులకు.

"పూర్తి సహకారాన్ని నిరభ్యంతరంగా అందిస్తాము... అమ్మగారిని పిలిచి అలంకరణలు చేసుకోమనండి..." అంటూ అప్పటికప్పుడు నృత్య ప్రదర్శనకు ఏర్పాట్లు కావించారు.

వేదిక వెనుక వున్న చిన్న మందిరంలోకి వెళ్లి, పక్కతాళం వేసే ఒక వనిత సహాయంతో తన అలంకరణను పూర్తి కావించుకున్నది హేమసుందరి.

మడులు, మాన్యాలు, విలువైన కానుకలు సమర్పించుకునే భక్తులనే తప్ప, నృత్య ప్రదర్శనలతో భగవంతుడిని సేవించాలని అనుకునే వారిని అంతకు ముందెన్నడూ చూసి వుండకపోవటం వల్ల, ఆలయంలోని వారే కాకుండా, ఆవరణ

వెలుపల సంచరించే పౌరులు కూడా బిలబిలమంటూ వేదిక ముందు గుమికూడారు.

గురు రామానుజులవారే స్వయంగా ఆ ప్రదర్శనను వీక్షింప వేంచేస్తున్నారని తెలిసి మరికొంతమంది భక్తులు కూడా అక్కడ పోగుపడ్డారు.

నిర్మానుష్యంగా వుంటుందని తను భావించిన ఆలయప్రాంగణం క్రమేపీ విపరీతమైన రద్దీతో కిటకిటలాడిపోతూ వుండటాన్ని గమనించి నిరుత్సాహానికి గురి అయ్యాడు శ్రీధరుడు.

అతను తెచ్చి ఇచ్చిన గజ్జెలు కట్టుకుని రాయంచమాదిరి వేదికమీదికి వచ్చింది హేమసుందరి..ఒళ్ళు పులకరించేటటువంటి అందమైన భంగిమలో తనకు నృత్యం నేర్పిన గురువులను తలచుకుంటూ, పక్క వాయిద్యగాండ్రందరికీ నమస్కరించింది.

విఘ్నవినాశకుడైన వరవినాయకుడి ప్రార్థన అనంతరం, "వీణాపాణీ, మంజులభాషిణీ, చదువుల సరస్వతీ..." అంటూ సరస్వతీ ప్రార్థన చేసి ఛెంగు ఛెంగున నృత్యాన్ని ప్రారంభించింది.

వేదికమీది భువనసుందరి గర్భగుడిలోని దేవతా సార్వభౌముడికి అగుపించేందుకు వీలుగా ఆలయపు తలుపులన్నింటినీ విశాలంగా తెరిచి, ఇవతలకు వచ్చేశారు అర్చక స్వాములందరూ.

అత్యంత సుందరమైన కనులతో, తనవంకే తదేక దీక్షగా చూస్తున్నట్లున్న ఆ కావేరీతట నాయకుడిని భక్తిపూర్వకంగా తలుచుకుంటూ తన మనసులోని మాటల్ని నృత్యరూపంలో విన్నవించుకున్నది హేమసుందరి.

ఏ నోము నోచితినో

ఏపూజ చేసితినో

తానేమి వ్రాసెనో

తలమీద విధియని

నిడివి కన్నుల నీరు

నింపుచు వేడితిని

కామిత మీయరా

కమల లోచనుడా

కావేటిరంగా నీ కడకు వచ్చితిని

కాచి రక్షింపుమో కరుణాసముద్రా

ఆలయసేవకు అంకితులైన దేవదాసీలు చేసే నృత్యాలను చూస్తూ వారు గానం చేసే పురాతన గీతాలను మాత్రమే విని విని వున్న ఆ పట్టణ పౌరులకు, ఆలయ సేవకులకు విచిత్రంగా తోచాయి హేమసుందరి పలుకులు.

అపూర్వమైన నృత్యభంగిమలతో ఆమె ఆలయంలోని రంగనాధుడిని ప్రార్థించిన తీరు విపరీతంగా ఆకట్టుకున్నది వారందరినీ... నృత్యం పూర్తి కాకముందే చెవులు చిల్లులు పడేలా కరతాళధ్వనులు చేసి తమ మెచ్చుకోలును వ్యక్తపరిచారు వారందరూ.

ఎప్పుడూ గంభీరంగా వుండే యతిరాజులు శ్రీరామానుజులవారి పెదవుల మీద కూడా అలవోకగా ప్రదర్శించింది ఒక చిరునవ్వు...

ప్రేక్షకులంతా చేసే కరతాళధ్వనులను గాని, శ్రీ రామానుజులవారి కరుణా కటాక్ష వీక్షణాలను గాని గమనించలేదు హేమసుందరి.

అసలు తనచుట్టూ అంతమంది రసజ్ఞులు వున్న విషయం మరిచి పోయినట్లు, ఆలయంలోని దేవదేవుడిమీదనే తన దృష్టిని లగ్నం చేసింది ఆమె.

నీలంపు గాజుల

నిగనిగలు మాసేను

తళుకారు చెక్కిళ్ళ

తమి గందమారేను

చెరకు విల్తుడగన్న

చెల్వుడవె నీవు

చెలియ మనసేమిటో

తెలియంగ లేవా?

కావేటిరంగా కరము వేడితిని

కరిరాజ వరదుడా కోరికను తీర్చు...

ఆకాశం బ్రద్దలై పోయినట్లు కరతాళధ్వనుల చప్పుడు ఆలయ ప్రాంగణంలో అదేపనిగా ప్రతిధ్వనించింది. ఉత్సాహం అధికమైపోయిన పౌరులు కొందరు, కూడని పని అని తెలిసికూడా ఈలలు వేసి మరీ మెచ్చుకున్నారు ఆమెను.

చేతికర్రలను గాలిలో ఊపుతూ, వేదికమీదికి ఎగబడబోయిన వారందరినీ అతి బలవంతంగా వెనక్కి నెట్టారు ఆలయరక్షకులు.

నృత్యం పూర్తి అయిన పిదప పక్కతాళం వేసిన వనిత సహాయంతో కావేటిరంగానికి కర్పూరనీరాజనం సమర్పించి మంగళహారతి పాడింది

హేమసుందరి. వేదికచుట్టూ కిటకిటలాడి పోతున్న రసజ్ఞులందరికీ నమస్కరించి క్రిందికి వచ్చింది.

"కావేటిరంగడు తప్పకుండా నీకు కామితార్థమిస్తాడు. నీ కోరికలు నెరవేరతాయి. అపూర్వ నృత్యంతో ఆ దేవదేవుడిన ఆలకించి ధన్యురాలివి అయ్యావు..." అంటూ ఆమె శిరస్సుమీద చేయివేసి ఆప్యాయంగా ఆశీర్వదించారు శ్రీ రామానుజులవారు.

అంతకు ముందెన్నడూ ఆయన నృత్యం చేసేవారితో మాట్లాడటాన్ని చూసి ఎరుగరు అక్కడ గుమిగూడిన వారు...ఆయన మాటల్ని గురించి విడ్డూరంగా చెప్పుకుంటూ అక్కడినుంచి అదిలారు.

ఆలయప్రాంగణంలో నుంచి ఆవతలికి పోయిన తరువాత కూడా వారు ఆ మాటల్ని మానుకోకపోవటాన్ని గమనించి వ్యాకులతకు గురి అయ్యాడు శ్రీధరుడు. ఏది జరుగకూడదని తను అప్పటివరకూ అనుకుంటూ వచ్చాడో అది జరుగనే జరిగింది.

దోపిడీ దొంగలు వచ్చిపడుతున్నారన్న వార్త ఆలయ ప్రాంగణాన్ని నిర్మానుష్యం చేసివేస్తుందనీ, హేమసుందరి నృత్యాన్ని చూసేందుకు అధిక సంఖ్యలో జనుల ఎవరూ రారనీ అనుకున్నాదానికి పూర్తి విరుద్ధం అయింది పరిస్థితి. శ్రీ రామానుజులవారు స్వయంగా పూనుకుని ఆమె నృత్యానికి ఏర్పాట్లు చేయించారని అందరికీ తెలిసిపోయింది. ఆ మహానుభావుడు స్వయంగా ఆ ప్రదర్శనను తిలకించిన వైనాన్ని కూడా మరిచిపోలేరు ఎవరూ.

ఆమెను గురించి, ఆమె పుట్టు పూర్వోత్తరాల గురించీ ఆరాలు తీయటం మొదలై తీరుతుంది... రహస్యంగా వుంచాలనుకున్న తమ విషయాలన్నీ ఒకటొకటిగా బయటికి వచ్చేస్తాయి.

రామానుజులవారు తమ శిష్యగణంతో వైష్ణవమఠానికి వెడలిపోగానే, హేమసుందరిని హెచ్చరించి ఆలయంలోనుంచి బయట పడేందుకు ప్రయత్నం చేసి చూశాడు శ్రీధరుడు. కానీ ప్రత్యేకమైన పద్ధతిలో స్వామివారిని సేవించు కున్నందుకుగాను, అర్చక స్వాములు మరొకసారి పూజలుసలిపి, ఇంకోమారు తీర్థప్రసాదాలను ప్రసాదించ నిశ్చయించుకోవటంతో అతను అనుకున్నట్టు జరగలేదు.

అందరూ తనను అభినందిస్తుంటే చూసి అతను ఎంతగానో సంతోషిస్తాడని భావించింది హేమసుందరి. అతని వదనంలో అటువంటి భావాలు అగుపించకపోవడంతో చిన్నబుచ్చుకుంది.

ప్రత్యేకపూజ పరిసమాప్తి కాగానే ఆమెను తొందరపెట్టి ఆలయ ప్రాంగణంలో నుంచి ఆవలికి తీసుకుపోయాడు శ్రీధరుడు. అంతకుముందు అక్కడికి నడిచి వచ్చినట్లు తిరిగి కాలినడకన తన విడిదికి బయలుదేరితే, మరిన్ని కనులు ఆమె ముఖమండలాన్ని వీక్షించి బాగా గుర్తుపెట్టుకుంటాయేమో నన్న భయంతో ఒక బాడుగుబండిని మాట్లాడాడు.

అతనివంక చూడను కూడా చూడకుండా ముకుళించిన పద్మంలా ముఖాన్ని ముడుచుకుని ఒకపక్కగా కూర్చున్నది హేమసుందరి.

బండి కదిలిన క్షణంనుంచీ ఆఖరి ప్రాకారాన్ని అధిగమించేవరకూ, ఇళ్ళల్లో వున్నవారు కూడా వెలుపలికి వచ్చి ఆమెను చూడటం కోసం ఆత్రుతను ప్రదర్శించేసరికి మరింత బెంగ పెట్టుకున్నాడు శ్రీధరుడు.

"ఇటువంటి ప్రదర్శన మరొక్కటి చాలు మన గుట్టురట్టు అవటానికి... దోపిడీ దొంగల వార్తలకంటే వేగంగా ధనదుపురం వరకూ పాకిపోతుంది మన గొప్పతనం..." లోగొంతుకతో తన వ్యధను వెళ్ళబోసుకున్నాడు.

ఆ మాటల్లోని యదార్థాన్ని గమనించి అతని అభిప్రాయంతో ఏకీభవిస్తున్నట్లు తన వూపవలసిన హేమసుందరి ముఖాన్ని ఎర్రగా చేసుకుని, ఇంకోపక్కకు తల తిప్పుకున్నది.

మరోసారి ఆమెను పలుకరించే ప్రయత్నంచేసి, అప్పటికీ ఆమె సమాధానం ఇవ్వకపోయేసరికి, అప్పుడు అర్థం చేసుకున్నాడు శ్రీధరుడు ఆమె ప్రవర్తనకు మూల కారణాన్ని.

"దైవంతో సమానులైన సాక్షాత్తు శ్రీ రామానుజులవారే మెచ్చుకున్న నీ నృత్యాన్ని చూసి ఆనందించకపోవటానికి నేను మూర్ఖుడిని కాదు....

వేదికిమీద వున్నప్పుడు నిన్ను చూడటానికి రెండు కళ్ళు చాలవని అనిపించింది..." తమ భవంతిముందు బండిని ఆపించి కిందకి దిగమని ఆమెకు సైగచేస్తూ మృదుస్వరంతో చెప్పాడు.

ఉబికి వచ్చిన సంతోషాన్ని బలవంతంగా అదుముకుంటూ మరింత అలుకను ప్రదర్శించింది హేమసుందరి. 'ఈ మాటలు ముందుగానే చెప్పవచ్చును కదా.. మాటలు చెప్పటం చేతకానివాడివి కాదుగదా...' అని తనలో తను

అనుకుంటూ బయటికి మాత్రం విసురుగా ముఖాన్ని పక్కకు తిప్పుకుని విసనిసా లోనికి వెళ్ళిపోయింది.

ఈ దృశ్యాన్ని వింతగా చూస్తున్న బండి యజమానికి ఒక వెండినాణేన్ని సమర్పించుకుని మెల్లిగా ఆమెను అనుసరించాడు శ్రీధరుడు.

తోటమాలి తెచ్చి ఇచ్చిన నీటితో కరచరణాలను శుభ్రపరచుకుని, ఆ తరువాత అతను అందించిన నీటితో దాహం తీర్చుకుంటుండగా, ఆ భవంతి ముందుకు వస్తూ, అతనికి అగుపించారు ఇద్దరు అపరిచిత వ్యక్తులు.

"ఆలయంలో నృత్యప్రదర్శన ఇప్పించినవారు మీరేనా?" ప్రశ్నార్థకంగా చూస్తున్న శ్రీధరుడిని సమీపించి వినయంగా అడిగాడు వారిలో ఒకతను.

చేతిలోని మంచి తీర్థపు పాత్రను తోటమాలికి అందిస్తూ తల వూపాడు శ్రీధరుడు.

తను భయపడుతున్నట్లే, తమ గుట్టు రట్టయిందేమోనన్న సంశయం అతనికి వెంటనే కలిగింది.

"మమ్మల్ని వైష్ణవమతం కార్యనిర్వహణాధికారి పంపించారు. రామానుజుల వారు మీతో ఒకసారి సంభాషించాలని అనుకుంటున్నారట... వెంటబెట్టుకు తీసుకురమ్మని ఆజ్ఞ ఇచ్చారు..."మృదుస్వరంతో మెల్లిగా అన్నాడా వ్యక్తి.

వారిని చూడగానే మనసులో మెదిలిన భయాన్ని తలచుకుని తనలో తనే నవ్వుకుంటూ, తేలికపడిన మనసుతో, ముందుకు అడుగు వేశాడు శ్రీధరుడు. హేమసుందరిని గురించి మరింత ప్రత్యేకంగా పొగడటం కోసమే అలా కబురు

పంపించి వుంటాడా పూజ్యమూర్తి... ఆయన ఆజ్ఞలను వెంటనే శిరసా వహించటం తన బాధ్యత.

అనవసరంగా అలిగి విసవిసా లోపలికి వెళ్లిపోయిన హేమసుందరి కోపాన్ని వైష్ణవమఠం నుంచి తిరిగి వచ్చిన తర్వాత తీర్చవచ్చని అనుకుంటూ, వారిని అనుసరించాడతను.

"భుజించే సమయం మించిపోతున్నది.... తీరుబడిగా వెళ్ళవచ్చు కదా..... అంత తొందర దేనికి?" అని అడ్డు చెప్పబోతున్న తోటమాలి వంక అదోమాదిరి చూశారు అతన్ని పిలువవచ్చిన వ్యక్తులు.

"వైష్ణవమఠం నుంచి పిలుపు వస్తే తీరుబడిగా వెళ్లి దర్శనం చేసుకుంటారా ఎవరైనా? ఇటువంటి పిలుపు కోసం రాజాధిరాజులు సైతం ఎంతగానో ఎదురు చూస్తూ వుంటారనే సంగతి నీకు తెలియదా?" విసుగు నిండిన కంఠంతో తోటమాలిని మందలిస్తున్నట్లుగా పలికి, వీధిలోకి దారి తీశారు వారు.

పావు ఘడియపాటు నడిపించి, కావేరీ తీరాన్ని ఆనుకుని వున్న ఒక చక్కటి మామిడితోపులోకి శ్రీధరుడిని తీసుకుపోయారు.

"మఠంలో ప్రతిష్ఠంచబడిన దేవరాజు స్వామివారిని పూజించిన అనంతరం ఈతోటలకే వస్తారు గురుదేవులు.... మనం ఇక్కడే వేచియుందాం" అంటూ శ్రీధరుడి చేతిని పట్టుకున్నాడు వారిలో ఒకతను.

అవసరంలేని ఆ చనువును ఎందుకనో సహించలేక , మృదువుగా, ఆ చేతిని అవతలకు నెట్టాడు శ్రీధరుడు. నెడుతూ వుండగానే వచ్చింది అతనికి అనుమానం. సాము గరిడీలు చేసి చేసి రాటు దేలినట్లు కఠినాతి కఠినంగా

వున్నాయి ఆ వ్యక్తి చేతులు. వైష్ణవమత సాంప్రదాయులకు అనుగుణంగా సాత్వికజీవనాన్ని గడిపేవారి అవయవాలు అలా వుండవు.

"ఎవరు మీరు? ఎందుకు నన్నిలా మోసం చేస్తున్నారు?" అని ప్రశ్నిస్తూ, వెనక్కి జరగబోతుండగా, పిడికిలి బిగించి అతని ముఖంమీద బలంగా కొట్టనే కొట్టాడు రెండోవ్యక్తి.

ఎదురు చూడని విధంగా వచ్చిపడిన ఆ దెబ్బనుంచి తప్పించుకోలేక, వెల్లికిలా పడ్డాడు శ్రీధరుడు.

భుజాల చుట్టూ చుట్టుకున్న కాషాయవస్త్రాలను తీసి అవతలకు విసిరేస్తూ వికృత కంఠలతో వెగటు కలిగేటట్లు నవ్వారు ఆ వ్యక్తులు.

"అత్యంత భక్తిశ్రద్దలతో ఆలయ విధులను నిర్వహిస్తూ అందరికీ తలలో నాలుక మాదిరి మసలుకునే మా స్నేహితుడిని గాయపరిచేటంతటి మొనగాడివా నువ్వు? నీ అవివేకానికి తగిన శాస్తి యిప్పుడు జరుగుతుంది చూడు....." అంటూ ఎగిరి అతని గుండెలమీద దుమికాడు మొదటి వ్యక్తి.

తన పిడికిలి పోటుకు నోరు పగిలిన పూజారి కక్ష సాధించుకునే ప్రయత్నం చేస్తున్నాడని వెంటనే అర్థమై గబగబా పక్కకు దొర్లబోయాడు శ్రీధరుడు.

లావుపాటి కొండరాయి ఒకటి అడ్డు పడటంతో అసాధ్యమయింది ఆ పని. అంతలోనే ఆ దుండగుడి కరకు పాదాలు తన భుజాలకు బలంగా తగలటంతో బాధ మరింత అధికం అయింది.

"నీకు వత్తాసు పలికిన రామానుజులే వచ్చి కాపాడతారో, దేవదాసి మాదిరి గజ్జెలు గట్టుకుని గంతులు వేసిన బుట్టబొమ్మే వచ్చి రక్షిస్తుందో బాగా

ఆలోచించుకో...." అంటూ ఒక చెట్టుచాటున దాచి వుంచిన లావుపాటి బడితె నొకదాన్ని తీశాడా వ్యక్తి.

కనుల వెంట నీటిని రప్పించేటట్లున్న బాధను అతి బలవంతంగా అదుముకుంటూ క్రిందినుంచి లేచే ప్రయత్నం చేశాడు శ్రీధరుడు.

అంతలోనే అతని మెడమీద వాలిందా బడితె.... ఆ అదటుకు ఎగిరి మరో నాలుగు అడుగులు దూరంలో పడిపోయిన అతన్ని, రెండో పక్కనుంచి మరో ఆయుధంతో ఎదిరించాడు రెండో వ్యక్తి.

ఎవరికీ అగుపించకుండా దట్టీ వెనుక దుస్తుల్లో భద్రపరచుకుని వున్న పిడిబాకును చేతుల్లోకి తీసుకునే వ్యవధి శ్రీధరుడికి లభించలేదు. గాయపడిన అడవి జంతువు ఓపికను కూడగట్టుకునే లోపుగా విరగబాదినట్లు, బడితెలతో వీరంగం వేసేశారా వ్యక్తులు.

పుట్టి బుద్ధెరిగిన క్షణంనుంచీ, తన తండ్రి శిక్షణలో ఆయుధ విద్యలు నేర్చుకున్న తను, అలా యిద్దరంటే ఇద్దరి దెబ్బలకు తల్లక్రిందులు అయిపోవటాన్ని జీర్ణించుకోలేకపోయాడు శ్రీధరుడు.

మొదటి వ్యక్తి విసిరిన విసురుకు తన శిరస్సు పగిలి, నును వెచ్చని రక్తం ముఖంమీదికి జారుతున్నా లెక్క చేయకుండా, ఎడమచేతిని అడ్డుగా పెట్టి, అతను కొట్టబోతున్న మరో దెబ్బను కాచుకున్నాడతను... అదే వూపులో ఆ బడితెను పట్టుకుని బలంగా గుంజాడు. అతని పని అయిపోయిందనీ, అతను యిక తమను ఎదిరించలేడని భావిస్తున్న ఆ వ్యక్తి, అదిరిపడి పక్కకు దూకటానికి ప్రయత్నించాడు.

అప్పటికే తన చేతుల్లోకి వచ్చేసిన బడితెతో అతని భుజాలు విరిగిపోయే దెబ్బను కొట్టాడు శ్రీధరుడు. గావుకేక పెడుతూ కిందికి జారిపోయిన ఆ వ్యక్తిని వదిలేసి రెండో మనిషికేసి తిరిగాడు.

తన సహచరుడు నేలకూలిపోవటాన్ని చూసి రెట్టింపు ఆగ్రహంతో పళ్ళన్నీ పటపటమని కొరుకుతూ తన చేతిలో వున్న ఆయుధాన్ని ముందుకు విసిరాడు రెండో మనిషి.

ఆ దెబ్బనుంచి తప్పించుకోవటానికి శ్రీధరుడు చేసిన ప్రయత్నం విఫలం అయింది. కంటికి కనిపించనంత వేగంతో వచ్చి అతని భుజంమీద పడిందా బడితె. భుజపు టెముక విరిగిపోయినంత బాధ శ్రీధరుడిని ఆవరించుకున్నది. తన చేతిలో వున్న ఆయుధాన్ని వదిలేసి క్రింద కూర్చుండిపోవాలనే కోరిక కూడా అతనికి కలిగింది.

క్రింద కూర్చోకపోయినా, కూర్చోవాలనే ఆలోచన తన మనసులో అడుగు పెట్టినట్లుగా అవతలి మనిషికి అర్థం అయితే చాలు, తన పని అయిపోతుందని శ్రీధరుడికి తెలుసు.

రెచ్చిపోయి యుద్ధం చేసేస్తాడతను. ఊపిరి తీసుకునే వ్యవధి లేకుండా దెబ్బల వర్షాన్ని కురిపిస్తాడు. నిజంగానే క్రింద కూర్చోపెట్టేస్తాడు.

అటువంటి పరిస్థితి ఎదురు పడకుండా వుండాలంటే, ప్రాణాలమీద ఆశల్ని వదిలేసుకున్నట్లు, జాగ్రత్తలన్నిటినీ గాలికి వదిలేసి ముందుకు లంఘించటం ఒక్కటే ఆ సమయంలో చేయవలసిన పని.

అలాగే చేశాడు శ్రీధరుడు... శరీరంలో మిగిలివున్న కొద్దిపాటి ఓపికంతా తన చేతుల్లోకి రప్పించుకుంటూ సుడిగాలి మాదిరి పేట్రేగిపోయాడు.

అతని భుజపు టెముకను విరగ గొట్టినంత పని చేసిన ఆయుధాన్ని వెనక్కి ప్రయత్నించక ముందే అతని ముక్కూ ముఖం ఏకంచేసి పారేశాడు శ్రీధరుడు.

ఒక్కటంటే ఒక్కటి... అంతకుముందు తన భుజంమీద పడిన దెబ్బ వంటిది మరోసారి తన వంటిమీద పడితే తన అవయవాలు చచ్చు పడిపోయినట్లు క్రిందికి వ్రేలాడబడిపోతాయనే మాటను మరిచిపోయి రాక్షసుడి మాదిరి అతన్ని క్రిందికి నెట్టేశాడు శ్రీధరుడు.

క్రింద పడిపోయినట్లే పడిపోయి, ఉన్నట్లుండి పైకి లేచాడా వ్యక్తి. అతనే కాదు,అతనితో పాటుగా లేచి నిలుచున్నాడు అంతకుముందే నేలను కౌగిలించుకున్న మొదటి వ్యక్తి.

ఇద్దరూ కలిసి కూడబలుక్కున్నట్లుగా వెనక్కి తిరిగారు. ఏం జరుగుతున్నదో శ్రీధరుడికి అర్థం అయ్యేలోపుగా, మామిడితోపు వెనక భాగంలో వున్న ముళ్ళపొదల మధ్యకు వెళ్లి మటుమాయం అయ్యారు.

"ఆగండి... అక్కడే ఆగండి... పిరికిపందల మాదిరిగా పారిపోకండి...ఆగండి..." అని బిగ్గరగా అరిచి వారిని వెక్కిరించాడు శ్రీధరుడు.

వెక్కిరించానని అనుకున్నాడతను. ఆ మాటలు అతని పెదవుల వెనకే వుండిపోయాయి.

అవి బయటికి రాకముందే గిర్రున తిరిగాయి కనులు.

చేతిలోని బడితెను నేలకేసి అదిమి, దానిసహాయంతో నిలబడి వుండటానికి అతను చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.

అతనికి తెలియకుండానే జారి క్రిందపడిపోయిందా ఆయుధం. అదినేలను తాకకముందే దబ్బుమని శబ్దం చేస్తూ విరుచుకు పడిపోయాడతను.

కనుల ముందు నల్లటి పట్టుతెరలు వ్రేలాడగట్టినా అనుభూతి తనను ఆవరించుకోవడంతో పాటు, తెలివితప్పిపోతున్న ఆఖరి క్షణంలో అతని మనసులో మెదిలిన మాట ఒక్కటే ఒక్కటి.

తనను గాయపరిచటంతో తృప్తిని చెంది అంతటితో ఆ విషయాన్ని గురించి ఆ దుండగులు మర్చిపోతే బాగుంటుంది...తను లేని సమయంలో హేమసుందరి జోలికి పోకుండా వుండాలి.

తలమీద ఏర్పడిన గాయంలోనుంచి ఎర్రటిరక్తం అదేపనిగా కారి, కారి, నేలమీద మడుగు కడుతున్న సమయంలో కూడా అతనికి స్పృహ రాలేదు.

మామిడితోపు వెనక భాగంలో వున్న ముళ్ళపొదల మధ్యలో నుంచి ముంగిస ఒకటి ఆ రక్తపు వాసనను పసిగట్టి మెల్లి మెల్లిగా తన ముఖం దగ్గిరికి వచ్చిన విషయం కూడా అతనికి తెలియదు.

సూర్యుడు పడమటి దిశగా మరలబోతున్న సమయంలో చల్లటి చేయి ఒకటి నుదుటిమీద పడేసరికి, మెలకువ వచ్చి కనులు తెరిచాడు.

తెరిచిన వెంటనే అగుపించారు ఇద్దరు వ్యక్తులు.

ముళ్లపొదలలోకి పారిపోయిన వారు తిరిగి రానేవచ్చారని అనుకుంటూ చేతిలో నుంచి జారిపోయిన బడితె కోసం చుట్టూ చూడటానికి ప్రయత్నించాడు.

"కళ్ళు తెరిచి చూడటానికి కూడా నీకు ఓపికలేదు...ఎక్కడో పడిపోయిన బడితెను వెతికి మా తలల్ని పగల గొట్టాలని మాత్రం అనుకుంటున్నావు. నిజంగా నువ్వు చాలా గొప్పవాడివి..." అంటూ వెక్కిరించాడు ఆ వ్యక్తుల్లో ఒకతను.

అతని ముఖాన్ని గుర్తు పట్టలేకపోయడు శ్రీధరుడు... కంఠాన్ని వెంటనే జ్ఞప్తికి తెచ్చుకోగలిగాడు.

"ధనదుపుర సార్వభౌముడు మీకోసం పంపిన రాజభటుల చేతికి దొరికిపోయారనే అనుకుంటున్నాను. గర్గుడితోపాటు నువ్వు కూడా ఉరికంబాన్ని అలంకరించి వుంటావని భావిస్తున్నాను..." అంటూ తిరిగి తెలివిని కోల్పోయాడు.

అది చూసి ఛెంగున లేచాడు అతనితో మాట్లాడిన కోలాహలుడు. "తలమీద గాయానికి గట్టిగా కట్టుకట్టి పట్టుకో ...నేను ఇప్పుడే వస్తాను" అని తన సహచరుడిని హెచ్చరిస్తూ మామిడితోట ప్రక్క భాగంలోకి పరుగు తీశాడు.

దుమ్ముతో, ధూళితో నిండివున్న తన తలపాగాను గట్టిగా విదిలించి శ్రీధరుడి తలకు బిగుతుగా చుట్టి పట్టుకున్నాడు ఆ సహచరుడు.

పది నిముషాలలో తిరిగి వచ్చాడు కోలాహలుడు. మామిడి తోపు ప్రక్క భాగంలోనుంచి ఏవో ఆకుల్ని తెచ్చి, వాటి పసరును శ్రీధరుడి గాయాలమీద పిండాడు.

"గట్టి పిండం కాబట్టి ఇంతవరకూ ప్రాణాలతో నిలువగలిగాడు... మామూలు మనిషి అయినట్టయితే ఆ పాటికి ప్రాణాల్ని పొగొట్టుకుని వుండేవాడు" అని తన సహచరుడితో చెపుతూ, శ్రీధరుడిని చేతులమీద పైకి లేపాడు.

"వైద్యుడి దగ్గిరికి తీసువెళ్ళ వలసిందేనా?" తనుకూడా లేచి నిలబడుతూ అడిగాడు కోలాహలుడి సహచరుడు.

"వైద్య సహాయంకంటే ముందుగా ఇతనికి నీటి సహాయం కావాలి. నేను గాయాలమీద పిండిన పసరు సామాన్యమైంది కాదు... అగ్నిజ్వాలల్లో నిలబడిన అనుభూతిని కలిగిస్తుంది...విపరీతమైన దాహాన్ని కలిగిస్తుంది... కనులు తెరిచిన వెంటనే త్రాగటానికి నీరు ఇవ్వకపోతే వూడి క్రింద పడిపోతుంది అతని నాలుక..." అంటూ వేగంగా అడుగులు వేశాడు.

ఆ మాటలు అక్షర సత్యాలని నాలుగు నిముషాలు కూడా పూర్తిగా గడవక ముందే అతని సహచరుడికి తెలిసివచ్చింది మామిడితోపు ప్రక్క భాగంలో వున్న చిన్న కొలను సమీపంలోకి పోతూ వుండగా మరోసారి కనులు తెరిచి బాధాసూచికమైన శబ్దాలు చేశాడు శ్రీధరుడు."దాహం వేస్తోంది... దాదాపు బాధతో నా నాలుక విరగలాక్కుపోతోంది" అంటూ తన భావాలను వారికి ఎరుక పరిచాడు.

గతంలో ఎప్పుడో కాంచీ పురాన్ని పరిపాలించిన వల్లభరాజుల కాలంలో కట్టబడిన ఆ పూరాతన కాలపు కొలను ఒడ్డున అతన్ని పడుకోబెట్టి, కొలను లోకి దిగాడు కోలాహలుడు. దోసిటతో నీటిని అతని మీదికి వెదజల్లాడు. చక్కటి తామర ఆకును పాత్రలాగా మడిచి నీటిని తీసుకువచ్చాడు.

నీటిముఖం చూసి ఎన్నెన్నో రోజులు గతించిపోయినట్లు ఆబగా త్రాగాడు శ్రీధరుడు.

సన్నగా వెదురుచువ్వ మాదిరిగా వుండే గజదొంగ గర్గుడు అదే పనిగా ప్రయాణం చేస్తూ వుండటం వల్ల కాబోలు మరింత సన్నబడిపోయినట్లు అనిపించింది అతనికి.

ధనదుపురంలోని శ్యామల యింటికి వెళ్లిన సమయంలో ఎలా వున్నాడో యిప్పుడు కూడా అలాగే అగుపిస్తున్నాడు కోలాహలుడు.

గట్టిగా మాట్లాడితే ఒకటి రెండు వత్సరాలు వయసు తగ్గినట్లు చురుకుగా కదులుతున్నాడు. "దోపిడీ దొంగల గుంపులు దక్షిణి దేశాన్ని అల్లకల్లోలం చేయబోతున్న వార్తను విని యిక్కడ తల దాచుకుందామనే కోరికతో వచ్చాము మేము... వచ్చిన వెంటనే దేవకన్యవంటి యువతి ఎవరో కావేటిరంగని ఎదుట

అపూర్వమైను నృత్యాన్ని ప్రదర్శించినట్లు తెలిసింది. ఆ యువతి పోలికలు హేమసుందరికి సరిపోవటంతో మీ గురించి ఆరా తీస్తూ యిటుగా వచ్చాము" శ్రీధరుడి భుజాలను ఆప్యాయంగా అదుముతూ అన్నాడు గజదొంగ గర్గుడు.

"నువ్వు ధనదుపుర నగర ద్వారం దగ్గిర పరిచయం అయిన క్షణం నుంచీ చాలా జాగ్రత్తగా చూస్తున్నాను. నువ్వు చేసే వన్నీ ఆలోచనలేని పనులే. నీ అదృష్టం కొద్దీ మేము ఇక్కడికి రాగలిగాము. రాలేకపోయినట్లయితే... ఈ సరికి నువ్వు ఏమైపోయి వుండేవాడివో తెలుసా?" కనుబొమ్మలు ముడివేస్తూ,చిరుకోపంతో అడిగాడు కోలాహలుడు.

"ధ్వజస్తంభం మీది నగల మూటను నేర్పుగా నీవు రాలగొట్టి బట్టి ఉరికంబం మీదినించి తప్పించుకోగలిగాడు గర్గుడు. రాలగొట్టలేక పోయినట్లయితే ఏం జరిగివుండేదో నువ్వు చెప్పగలవా?" శక్తి లేకపోయినా చిన్నగా నవ్వుతూ ఎదురుప్రశ్న వేశాడు శ్రీధరుడు.

తెచ్చి పెట్టుకున్న కోపం చటుక్కున మాయం అయిపోతుండగా, బిగ్గరగా నవ్వి అతని బుగ్గల్ని మృదువుగా తడిమాడు కోలాహలుడు.

"గర్గుడి గురి చాలా గొప్పదని నాకు తెలుసు. అయినా ఆ తరువాత నువ్వు రాజభటులలో సృష్టించిన అలజడి మాకు ఎంతగానో ఉపయోగించింది. మేము దూరంగా పారిపోవటానికి వీలు కలిగింది. అందుకు మేమే ఆజన్మాంతం నీకు రుణపడి వుంటాం" ఆప్యాయంగా చూస్తూ అన్నాడు.

అతను తన గాయాలమీద పిండిన ఆకు పసరు మరోసారి అగ్నిజ్వాలల్లో నిలబడిన అనుభూతి కలిగించేసరికి నొసలు విరిచాడు శ్రీధరుడు.

అటువంటి మార్పుకోసమే ఎదురు చూస్తున్నాడు కోలాహలుడు... చటుక్కున కొలనులోకి దిగి ఇంకోకసారి అతనిమీద నీటిని చిమ్మాడు... తామరాకుతో తీసుకువచ్చి పెదవుల్ని తడిపాడు.

పడమటి దిశలో పడిపోయిన సూర్యుడు తన వెలుగుల్ని ఉపసంహరించు కొన్న తరువాత కూడా అక్కడినుంచి కదలలేదు వారెవరు... ఆకాశం నిండా నక్షత్రాలు ప్రత్యక్షమైన ఒక ఘడియ సేపటివరకు అక్కడే వుండిపోయారు.

ఆ వ్యవధిలో ధనదుపురం నుండి తాము యివతలకు వచ్చేసిన వైనాన్ని శ్రీధరుడికి వివరించాడు కోలాహలుడు. స్ఫురదా పట్టణం సమీపంలోని చిట్టడవిలో దొంగలపై వెలగపళ్ళు విసిరింది తామేనని అంగీకరించాడు. వైకుంఠపురంలో గ్రామదేవత ఆలయం వెనుక వున్న బావిలోకి మోకుల్ని వదిలి అతన్ని పైకి చేర్చామన్న అంశాన్నీ వప్పుకున్నాడు.

"హేమసుందరిని నువ్వు తరళాపురిలో వదిలిపెట్టి ఇవతలికి వచ్చిన తరువాత నీకు ఎదురు పడదామనే వుద్దేశ్యంతో చాటుమాటుగానే సంచరించాము. తరళాపురికి పోకుండా మీరు శ్రీరంగం రావటంతో, మా అంచనా తప్పిపోయింది. నిన్ను అనుసరించటంలో ఆలస్యం జరిగింది.." అంటూ తాము అక్కడికి ఎందుకు వచ్చారో తెలియజేశాడు.

దక్షిణ దేశాన్ని గజగజలాడించటంతో ఆగకుండా, సూటిగా శ్రీరంగం మీదికి వచ్చి పడుతోందని అందరూ అనుకుంటున్న దొంగల గుంపును గురించి అతని అభిప్రాయం తెలుసుకుందామని అనుకున్నాడు శ్రీధరుడు. అంతలోనే అతని భుజాల క్రిందికి చేతిని పోనిచ్చి పైకి లేపాడు కోలాహలుడు.

"నీకు ఉపయోగించిన ఆకులు నీ అస్వస్థతను చాలావరకు తగ్గించేసి వుంటాయి. కాస్తంత ఓపిక పట్టగలిగితే యిక ఇంటికి వెళ్ళిపోవచ్చు" అంటూ లేచి నిలబడటానికి సహాయం చేశాడు.

అతని భుజాల్ని వదిలిపెడితే మరోసారి క్రిందికి జారిపోవటం జరుగుతుందన్న అనుమానంతోనే గట్టిగా పట్టుకుని, ప్రక్కనే వున్న నీటికేసి తిరిగాడు శ్రీధరుడు. ఇంకోసారి గొంతును తడుపుకొని ఇంటిదారి పట్టవచ్చని అనుకుంటూ మూడు అడుగులు వేశాడు. అటుకేసి నాలుగో అడుగు వేయబోతుండగా, అతని దృష్టిని ఆకర్షించాయి కొలను మెట్లకు రెండువైపులా నిలబడివున్న నల్లరాతి ఏనుగు బొమ్మలు.

శరీరంలోని రక్తమంతా ముఖంలోకి వచ్చేసిన అనుభూతి వెంటనే కలిగింది అతనికి... కనులు గిర్రున తిరిగి క్రింద పడిపోతున్నట్లుగా అనిపించింది.

అదిరిపడి అతన్ని గట్టిగా కౌగిలించి పట్టుకున్నాడు కోలాహలుడు.

"ఏమయింది స్నేహితుడా? మళ్ళీ ఏం తెచ్చి పెట్టుకున్నావ్ నీ నెత్తి మీదికి?" ఆందోళన నిండిన కంఠంతో అడుగుతూ, చుట్టూ చూశాడు గర్గుడు అతని బలహీనతకు కారణమైన అంశం ఏదైనా ఆ చుట్టుపట్ల వున్నదేమో తెలుసుకోవటానికి.

తరాలు గడిచాక కూడా తమ అందాన్ని కోల్పోకుండా గంభీరంగా నిలబడి వున్న కొమ్ముటేనుగు బొమ్మల్లో ఒకదాని నడుమును పట్టుకుని మెల్లిగా ఒక మెట్టుమీద కూర్చున్నాడు శ్రీధరుడు.

"నీ వరుస చూస్తుంటే నీ గాయాలకు నేను చేసిన వైద్యం సరిపోయినట్లు కనిపించటంలేదు.. నడిచే ఓపిక నీకు లేకపోతే నా భుజాల మీద వేసుకుని

తీసుకుపోతాను. ఇక ఇక్కడ వుండటం మంచిది కాదని నాకు అనిపిస్తోంది" అతని ముఖంలోకి చూస్తూ, ఆందోళనగా అన్నాడు కోలాహలుడు.

ఎటువంటి ఇబ్బందికర పరిస్థితి ఎదురయినా ఇసుమంత కూడా చలించకుండా ఎదురెత్తులు వేయటానికి సిద్ధపడే ఆ గజదొంగ సహచరుడిని గమనించి, చిన్నగా నవ్వకుండా వుండలేకపోయాడు శ్రీధరుడు.

అవకాశం అంటూ లభిస్తే రాజ్యాలకు రాజ్యాలను దోచుకునే గర్గుడికి గాని, అతని సహచరుడయిన ఆ కోలాహలుడికి గాని కర్మరుడి రహస్య నిధి రహస్యం గురించి తెలిస్తే, వారి ప్రవర్తన ఎలా వుంటుందో చూడాలని అనిపించి, తన ముంజేతికి వున్న రాగి కంకణం వైపు తల వూపాడు.

కోలాహలుడు తనకు చెప్పవలసిన అవసరం లేకుండానే తన దట్టీలో నుంచి చెకుముకి రాయి నొకదాన్ని తీసి, మెల్లిగా సమీపంలో చిన్న మంట వేశాడు గర్గుడు. ఆ వెలుగులో రాగి కంకణాన్ని పరిశీలించి నోరు వెళ్ళబెట్టాడు కోలాహలుడు.

"మంత్రవాది కర్మరుడి కంకణం యిది... అతని పూర్వీకులు ఎవరో దాచిపెట్టినట్లు అందరూ భావించే అపూర్వ నిధిని కనుగొనటానికి అవసరమైన ఆధారాలు దీనిమీద లిఖించబడి వుంటాయట..." ఆశ్చర్యం నిండిన కంఠంతో గర్గుడికి చెప్పాడు.

తనకు కూడా తెలిసిన విషయాలను తనకే తెలియనట్లు, అప్పుడే వాటిని గురించి తెలుసుకుంటున్నట్లు విచిత్రంగా చూశాడు గర్గుడు.

కోలాహలుడు కంకణాన్ని చూసి నోటిని వెళ్ళబెట్టడం ఆశ్చర్యాన్ని నటించడం, గర్గుడు అతని మాటలకు తల వూపటం, అవన్నీ కాస్తంత కృత్రిమంగా కనిపించాయి శ్రీధరుడి కనులకు.

"మీరు ప్రదర్శిస్తున్న అమాయకత్వాన్ని చూసి నేను మోసపోవటానికి సిద్ధంగా లేను... ఈ కంకణం గురించి మీకు ముందుగానే తెలుసు" కాఠిన్యంతో విసురుగా అన్నాడతను వారి ముఖంలోకి చూస్తూ.

అతను అలా మాట్లాడిన తరువాత మామూలుగా చిరునవ్వు నవ్వాడు కోలాహలుడు.

"ఎంతమంది ఎన్నెన్నో విధాలుగా ప్రయత్నించినా, ఎవరికీ లభించని ఈ అపూర్వ కంకణం నీ వద్ద వున్నదని ధనదుపురంలో శ్యామల యింటిదగ్గిర నాకు అర్థంఅయింది" నవ్వుతూనే చెప్పాడతను.

తన వద్దనున్న బంగారు నగల మూటను, పిడిబాకు, ఆ కంకణాన్ని శ్యామల దగ్గిరే వుంచిన వైనాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు శ్రీధరుడు. ఆ సమయంలోనే ఆ వస్తువును చూసి వుంటాడు కోలాహలుడు. చూసిన వాడు మరి స్వంతం చేసుకునే ప్రయత్నం ఎందుకు చేయలేదు?

రాజ్యాలమీద పడి దోపిడీలు చేసి ఉరికంబాలకు ఎక్కేకంటే, కర్మరుడి నిధిని వెతికి స్వంతం చేసుకోవటం చాలాహాయి అయిన పని కదా!

చల్లారిపోతున్న చితుకుల మంటలో మరికొన్ని ఎండుచితుకుల్ని ఏరుకు వచ్చి పేరుస్తూ అతని భుజం తట్టాడు కోలాహలుడు.

"అమోఘము, అద్భుతము అయినటువంటి ఆ కంకణాన్ని గురించి, ఈ కంకణం వెల్లడించే రహస్యాన్ని గురించి, వీటన్నిటినీ కలిపే ఒక విచిత్రమైన

విషయం గురించి నీకు తెలియకపోవటం వలన ఇంతగా ఆశ్చర్యపడుతున్నావు...నీకు కాకుండా మరెవ్వరికీ యిది లభించి వుండేది కాకదు. నువ్వు తప్ప మరెవ్వరూ ఈ కంకణ రహస్యాన్ని ఛేదించి కర్మరుడి నిధిని చూడలేరు..." అంటూ మంట ఎదుట బాసిపట్టు వేసుకు కూర్చున్నాడు.

కర్మరుడి కంకణాన్ని గురించి తనకు అన్ని విషయాలు తెలిసి పోయాయని అనుకుంటున్నందుకు కొద్దిగా సిగ్గుపడ్డాడు శ్రీధరుడు. ఏనుగు బొమ్మ దగ్గిర సర్దుకు కూర్చుంటూ అతను చెప్పే మాటల్ని వినటానికి సిద్ధపడ్డాడు.

"అనితరసాధ్యమయిన సిద్ధులను పొంది, మంత్ర విద్యలో తమను మించినవారు మరెవ్వరూ లేరని పేరు సంపాదించు కోవటంతోపాటు, అక్షయమయిన అపూర్వనిధిని కూడా ప్రోగుచేశారు కర్మరుడి పూర్వీకులైన మంత్ర వాదులు కొంతమంది. ఆ నిధిని ఒక రహస్యప్రదేశంలో దాచి, దాన్ని కనుగొనేందుకు అవసరమైన మార్గాన్ని ఈ కంకణం మీద చిత్రింప చేశారట" చితుకుల మంటలోకి తదేకంగా చూస్తూ చెప్పనారంభించాడు కోలాహలుడు.

"స్వార్థచింతన లేని సామాన్యుడికి తప్ప మరెవ్వరికీ ఆ నిధి లభించకూడదని ఒక కట్టడి కూడా వారు చేశారట... పరిచయం లేని పరాయి వారికి సైతం ప్రాణాలకు వెరవకుండా సహాయపడగలిగే సాహసవంతుడు అయివుండాలట ఆ సామాన్యుడు... ఎందుకంటే కంకణం మీది ఆధారాలకు ఒక నియమం, ఒక నిబంధన అంటూ ఏమీ వుండవట... దైవానుగ్రహం మీదే ఆ ఆధారాలను కనులారా చూడటం సంభవించిందట."

కోలాహలుడి మాటలు ఆలోచనల్లో ముంచివేశాయి శ్రీధరుడిని.

స్వార్థచింతన తనకు వున్నదో లేదో తనకు తెలియదు... పరాయి వారికి ప్రాణాలకు కూడా వెరవకుండా సహాయపడగలిగే సాహసం తను చేయగలడో లేడో అంతకన్నా తెలియదు.

దైవానుగ్రహం లేకపోతే కంకణం మీది ఆధారాలు కళ్ళపడవనే మాట మాత్రం పూర్తి యదార్థం...

## 13

ఒకదానితో ఒకటి ముడిపడి వున్నట్లుగా, ఒకదాని వెనుక మరొకటిగా జరిగిపోతున్న సంఘటనలన్నింటిని తరిచి తరిచి చూసేసరికి, ఆ విషయాలను ఎలా అర్థం చేసుకోవాలో తెలియని అయోమయ పరిస్థితిలో చిక్కుకుపోయాడు శ్రీధరుడు.

లెక్క పెట్టటానికి ఏమాత్రం వీలు కానన్ని చెరువులు, మంచినీటి కొలనులు కలిగివున్న ఆ శ్రీరంగంలో మరెక్కడికీ తీసుకుపోకుండా, కర్మఠుడి కంకణం మీద చిత్రించబడి వున్న ఆ కోనేటి దగ్గిరికే, ఆలయ పూజారి స్నేహితులైన ఆ దుండగులు తనను తీసుకురావటం వెనుకవున్న కారణం ఏమిటి...? వారు తనను అక్కడికి తీసుకురావటం కోసమే తనకు ఆలయ పూజారితో విరోధం ఏర్పడిందా?

ఆలయ పూజారితో విరోధం ఏర్పడటం కోసమే, రంగనాథుడి ఎదుట నృత్యం చేయాలనే కోరికను హేమసుందరి వెల్లడించిందా?

"కర్మఠుడి నిధిని గురించి ఆలోచనలతో కాలక్షేపం చేస్తుంటే, నీ ఆరోగ్యపరిస్థితి మరింతగా విషమిస్తుంది. మనం వెంటనే ఇక్కడినుంచి వెళ్ళిపోవటం చాలా మంచిది..." అంటూ కోలాహలుడు తన భుజాన్ని స్పృశించడంతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చేశాడు శ్రీధరుడు.

మనసును తొలిచేస్తున్న ఆలోచనలన్నిటినీ అతి బలవంతంగా అదుముకుంటూ, కూర్చున్న ప్రదేశంలో నుంచి లేచాడు. మెట్లకు రెండు వైపులా నిలబెట్టబడి వున్న కొమ్ముటేనుగుల తలల్ని నిమురుతూ, మెట్లకేసి తదేకదీక్షగా చూశాడు.

రాగి కంకణం మీది చిత్రం ఆధారంగా అతను ఏదో రహస్యాన్ని ఛేదించటానికి చూస్తున్నాడని అర్థమై విసిగించకుండా మౌనం వహించాడు కోలాహలుడు.

గర్గుడు మాత్రం అలా కూర్చోలేకపోయాడు. చుట్టుపక్కల వున్న పొదలలోకి పోయి, పెద్ద పెద్ద కొమ్మలన్నింటినీ విరుచుకు వచ్చాడు... వాటితో భోగిపండుగ నాడు గ్రామాల్లో వేయబడే నెగడు వంటి పెద్ద మంటను వేశాడు.

ఆ మంట వెలుగులో నీటి అంచుకుపోయి, అక్కడ మెట్టును మరింతగా పరిశీలనగా చూశాడు శ్రీధరుడు. ఉన్నట్లుండి ముందుకు వంగి, జానెడు లోతు నీటిలో మునిగిపోయివున్న ఆఖరి మెట్టుమీద చేయివేసి బలంగా అదిమాడు.

తలకు తగిలిన గాయం బరువు చేయటంవల్ల అతను ముందుకు తూలి నీటిలో పడిపోతున్నట్లుగా అనిపించి, ఛివాలున లేచాడు కోలాహలుడు. నాలుగే నాలుగు అంగల్లో అతన్ని సమీరించి భుజాలను గట్టిగా పట్టుకోబోయాడు. గట్టిగా అదిమిన మెట్టు కొద్దిగా అటూ యిటూ కదలటాన్ని గమనించి, మరింత ఉత్సాహంగా ఇంకా కొంచెం ముందుకు వంగుతూ, గుర్రుగా చూశాడు శ్రీధరుడు అతని ముఖంలోకి.

"నువ్వు కనిపెట్టబోతున్న రహస్యం ఏమిటో తెలుసుకోవాలన్న కోరిక నాకు లేదు... నాచర్యల్ని అపార్థం చేసుకోకు ..." మెల్లిగా అంటూ వెనక్కి జరిగాడు కోలాహలుడు.

నీరు తగిలితే ఒంటిమీది గాయాలు మరింతగా బరువు చేస్తాయని తెలిసి కూడా ఏ మాత్రం వెనుకంజ వేయలేదు శ్రీధరుడు.

"వద్దు...లోనికి దిగవద్దు" అని ఆందోళన నిండిన కంఠంతో కోలాహలుడు గోల చేస్తున్నా లక్ష్యపెట్టకుండా మోకాలి లోతుకు దిగి, అటూ ఇటూ కదిలిన మెట్టును పట్టుకుని బలంగా పైకి లేపాడు.

ఆ శ్రమకు తిరిగి రేగింది అతని తలమీది గాయం. బొట్లుబొట్లుగా ఆ మెట్టుమీద పడసాగింది అతని రక్తం.

ఆ రుధిరాభిషేకం వల్ల తృప్తిచెందిన ఆ స్థల దేవతలు, చలనాన్ని పొంది అతనికి సహాయపడటానికి నిశ్చయించుకున్నట్లు, కిరకిర శబ్దాలుచేస్తూ పైకి లేచి ఆవల పడిపోయింది ఆ మెట్టు. దానిక్రింద భాగంలో ఎన్నో తరాలనుంచి భద్రపరచి వున్నట్లుగా అగుపిస్తున్న చిన్నమందసం ఒకటి వెలికి చూసింది.

అక్కడితో పూర్తిగా హరించుకుపోయింది శ్రీధరుడి ఓపిక. ముందుకు వంగి తనను పట్టుకోవటానికి చేతులు జాచిన కోలాహలుడిమీదికి నెమ్మదిగా ఒరిగిపోయాడతను.

పసిబిడ్డను కౌగిలించుకున్నట్లు అతన్ని గుండెలకు అదుముకుంటూ, ఒడ్డుమీద నిలుచుని వున్న గర్గుడికి సైగ చేశాడు కోలాహలుడు.

"ఏ పని చేసినా అవతలి వారి కనులు తిరిగి పోయేటట్లు, అటువంటి పని మరెవ్వరూ చేయలేరేమోననే అనుమానం కలిగేటట్లు చేయటం ఈ యువకుడి

నైజం... మనం వెంటనే నగరంలోకి వెళ్లిపోవాలి" అంటూ గట్టుమీదికి చేర్చాడు శ్రీధరుడిని.

నీటిలోకి దిగి, మెట్టుకింద ప్రత్యక్షం అయిన ఖాళీ ప్రదేశంలోని ఆ చిన్న మందసాన్ని చంకలో పెట్టుకున్నాడు గర్గుడు.

స్పృహలేని శ్రీధరుడి గాయాలమీద అంతకుందు పిండిన ఆకుల పసరునే మరోసారి పిండి, అతన్ని భుజంమీద వేసుకున్నాడు కోలాహలుడు. పరుగులాంటి నడకతో నగరంవైపు బయలుదేరాడు.

చంకలో ఇరికించుకున్న మందసాన్ని అతిజాగ్రత్తగా పట్టుకుని అతన్ని అనుసరించాడు గర్గుడు.

పావు ఘడియ పాటు నడువవలసిన దూరాన్ని అతి కొద్దికాలంలోనే అధిగమించి శ్రీధరుడు బాడుగకు తీసుకున్న భవనాన్ని చేరుకున్నారు వారిద్దరూ.

వీధివంకే చూస్తూ భవంతి ముందు భాగంలో నిలువబడి వున్నది హేమసుందరి. నిశ్చలంగా పడివున్న శ్రీధరుడిని చూసి వెర్రిగా అరవబోయింది.

చటుక్కున చేతిని ముందుకు జాచి ఆమెను వారించాడు కోలాహలుడు. "ఇతని ప్రాణాలకు ప్రమాదం ఏదీ లేదుగాని, సరైన వైద్యుడు ఎవరయినా ఈ చుట్టుపట్ల నివసిస్తూ వుంటే, వెంటనే పిలిపించటం చాలా మంచింది... నువ్వు ఆందోళన పడి, ఇతన్ని మరింత ఆందోళనకు గురిచేయవద్దు" అంటూ భవంతి ముందు భాగంలో వాల్చి వున్న పట్టెమంచం మీద పరుండబెట్టాడు శ్రీధరుడిని.

హేమసుందరి తనకేసి చూడకముందే వీధిలోకి పరుగు తీశాడు తోటమాలి.

పది నిమిషాల తరువాత అపర ధన్వంతరివంటి వైద్య శిఖామణి నొకతన్ని వెంటబెట్టుకుని అక్కడికి తీసుకువచ్చాడు.

కనుల నీరు ధారలు ధారలుగా బుగ్గలమీదికి జారుతుండగా, నిశ్శబ్దంగా రోదిస్తున్న హేమసుందరికి ధైర్యవచనాలు చెపుతూ శ్రీధరుడిని పరీక్షించాడా వైద్యశిఖామణి.

"ఇతని గాయాలమీద పసరును పిండిన వారెవరోగాని, నన్ను మించిన వైద్యులై వుంటారు... ఈ గాయాల మూలకంగా ఇతనికి కలుగవలసిన ప్రమాదం ఎప్పుడో తప్పిపోయింది. రక్తం అధికంగా వెలువడటం వల్ల కలిగే నీరసానికి మాత్రమే నేను వైద్యం చేస్తున్నాను. వేడి వేడి క్షీరాన్ని వెంటనే తెప్పించండి" అంటూ తన వద్దవున్న దంతపు పేటికలో నుంచి ఏవో గుళికల్ని బయటికి తీశాడా వైద్యుడు.

మరోసారి వీధిలోకి పరుగు తీసి, ఎవరి దగ్గిరో క్షీరాన్ని సంపాదించాడు తోటమాలి. శుభ్రపరిచిన ఒక లోహపు పాత్రలో పోసి వైద్యుడికి అందించాడు.

తాను సిద్ధం చేసిన గుళికల్ని ఆ పాలలో కలిపి శ్రీధరుడిచేత త్రావించాడు వైద్యుడు. పదినిముషాల అనంతరం అతని నాడిని పరిశీలించి తృప్తిగా తల వూపుతూ లేచి నిలుచున్నాడు.

అప్పటికే దట్టీలో నుంచి తీసి సిద్ధంగా పట్టుకున్న, గుప్పెడు బంగారు నాణేల్ని అతని చేతిలో పోశాడు కోలాహలుడు. వాటిని చూసి ఆశ్చర్యంతో వెడల్పు అయ్యాయి ఆ వైద్యుడి కనులు.

"మాకు అత్యంత ఆప్తుడు ఈ యువకుడు...ఒక విధంగా మాకు ప్రాణదాత... ఇతని కోసం మేము ఏ పనైనా చేస్తాం..." రెండు వెండి నాణేల్ని

ఇవ్వవలసిన చోట అన్ని బంగారు నాణేలను ఇచ్చుకున్నందుకు కారణాన్ని అతనికి బోధపరిచాడు అంతవరకూ మౌనంగా నిలువబడిన గర్గుడు.

"ఒక అర్థఘడియకల్లా తెలివి వస్తుంది ఇతనికి. తెలివి వచ్చేముందు విపరీతయిన చలి వేస్తుంది.. చలి మంటలు, మందపాటి వస్త్రాలు ఏవీ ఆ బాధనుంచి విముక్తిని కలిగించలేవు.

కాస్తంత జాగ్రత్తగా చూసుకోగలిగితే ఎటువంటి ప్రమాదము ఎదురు కాదు" ఆఖరి మాటగా వారి గుండెలు ఝల్లుమనే అంశాన్ని ప్రస్తావించి తోటమాలి వెంట రాగా వీథిలోకి వెళ్ళిపోయాడు వైద్యశిఖామణి.

పావుఘడియ కూడా గడవక ముందే శ్రీధరుడిని బాధించటం మొదలు పెట్టింది దారుణమైన చలి.

ఇంటిలోని వస్త్రాలన్నింటిని తెచ్చి కప్పినా ఉపశమించ లేదతని బాధ. పట్టె మంచంకింద నెగడు వంటి చలిమంటను పెట్టినా ఆగలేదు.

కత్తులతో చీరినట్లు మెలికలు తిరిగిపోతున్నశ్రీధరుడిని చూసి తట్టుకోలేక పోయింది హేమసుందరి. బావురుమని విలపిస్తూ, అమాంతంగా అతనిమీద పడి గట్టిగా కౌగిలించి పట్టుకున్నది.

నెమ్మదిగా ...అతి నెమ్మదిగా తగ్గిపోయింది శ్రీధరుడి శరీరాన్ని చుట్టుముట్టిన చలి...ముత్యాలవంటి స్వేదబిందువులు అతని ముఖం మీద ఆవిర్భవించాయి.

మెల్లిగా కనులు తెరిచి, తనను బాహుపంజరంలో బంధించి వున్న హేమసుందరి ముఖంలోకి చూశాడతను. "నా మీద కోపం తగ్గిపోయిందా?" తడి ఆరిపోయినట్లయిన గొంతుకతో అడిగాడు.

కన్నీటితో మలినమైన ముఖాన్ని పమిటచెంగుతో అద్దుకోను కూడా అద్దుకోకుండా చటుక్కున మంచం దిగి, భద్రకాళి మాదిరి అతని మీద విరుచుకుపడింది హేమసుందరి.

"వద్దువద్దన్న కొద్దీ ఇటువంటి చిక్కుల్లోకి ఇరుక్కుంటావు నువ్వు. మీకు ఏదైనా ప్రమాదం వాటిల్లితే నేను ఏమైపోతానో అనే ఇంగితజ్ఞానం నీకు లేదు..." అంటూ విసురుగా భవంతిలోకి వెళ్లిపోయింది.

రాజాధిరాజులవంటి ధనికులెందరో తమ సర్వస్వాన్ని ఆమె పాదాల ముందు రాశిగా పోస్తామని అంటే నిర్ద్వంద్వంగా తిరస్కరించిన ఆ సుందరి మనసేమిటో ఆమె చర్యల మూలకంగా అర్థమైనందువల్ల వింతగా చూడలేదు కోలాహలుడు.

"నీ అదృష్టాన్ని చూసి ఈర్ష్య పడుతున్నాను స్నేహితుడా..."అంటూ శ్రీధరుడి నుదుటిమీద స్వేదబిందువుల్ని తన భుజంమీది ఉత్తరీయంతో అద్దాడు.

పట్టెమంచం పక్కనే గర్గుడు కిందికి దింపినమందసాన్ని అతని చేత తెరిపించి, అందులోని రాగిరేకును బయటికి తీయించాడు శ్రీధరుడు.

తన దట్టీలోనే అతి భద్రంగా దాచివుంచిన రేకులను కూడా అతనికి ఇచ్చి, వాటిమీద లిఖించబడి వున్న అక్షరాలను చదవమని అర్థించాడు.

"ఎన్నో తరాల క్రితం చేయబడినటువంటివి ఈ రేకులు... వీటి మర్మాన్ని ఛేదించాలంటే కొద్దిపాటి వ్యవధి కావాలి. నువ్వు వీటిని గురించి ఆలోచించకుండా హాయిగా నిద్రపో" అంటూ గర్గుడిని అక్కడే నిలుచుండ నియమించి, రాగిరేకుతో భవంతి వెనుక భాగంలోకి వెళ్ళాడు కోలాహలుడు.

పట్టెమంచంమీది వస్త్రాన్ని ఒకదాని వింజామర మాదిరిగా చుట్ట చుట్టి, శ్రీధరుడికి వీవెన వీయబోతున్న గర్గుడిని వారించింది అప్పుడే భవంతిలో నుంచి బయటికి వచ్చిన హేమసుందరి.

శ్రీధరుడి బాధ్యతను ఆమెను పూర్తిగా అప్పగించి, కోలాహలుడిని అనుసరించాడు గర్గుడు. "అవసరం అయితే ఎలుగెత్తి ఒక కేక పెట్టుతల్లీ... ఇక్కడ వున్నట్లే వచ్చి నీ ఎదుట నిలబడతాను" అంటూ.

అస్తవ్యస్తంగా ముఖంమీదికి వాలుతున్న శ్రీధరుడి ముంగురులను సరిచేసి అతని నుదుటిమీద అదేపనిగా ఆవిర్భవిస్తున్న స్వేదబిందువుల్ని తన పమిట చెంగుతో అద్దింది హేమసుందరి.

"చేసిన ఘనకార్యాలు చాలు... ఇకనైనా కొద్దిసేపు నిద్రపోవటం మంచిది..." అంటూ బలవంతంగా అతని కనుల్ని మూసింది.

పూరేకవంటి ఆమె చేతి స్పర్శకు పులకించిపోతూ, తనకు తెలియకుండానే నిద్రలోకి జారిపోయాడు శ్రీధరుడు. తిరిగి కనులు తెరిచేసరికి, సూర్యుడు బారెడు ఎత్తుకు వచ్చి వున్నాడు.

* * *

"మూడే మూడు విషయాలను గురించి నీతో వెంటనే ముచ్చటించాలని నేను అనుకుంటున్నాను" కనులు తెరిచీ తెలువగానే శ్రీధరుడి ఎదుటికి వస్తూ అన్నాడు కోలాహలుడు.

తలమీది గాయపు బాధ పూర్తిగా కాకపోయినా, మూడొంతులకు కాస్తంత ఎక్కువగానే ఉపశమించటం వల్ల, మెల్లిగా లేచి పట్టెమంచం మధ్యలో బాసిపట్టు వేసుకు కూర్చున్నాడు శ్రీధరుడు.

అంతలోనే అక్కడికి వచ్చేసింది హేమసుందరి. తళతళమెరిసేటట్లు తోమిన ఒక లోహపుపాత్రలో నీటిని తెచ్చి అతనిచేత ముఖాన్ని కడిగించింది.

సూర్యోదయం కాకముందే తోటమాలి తీసుకువచ్చిన గో క్షీరాన్ని అతనిచేత తాగించింది.

"నేను ముచ్చటించదలుచుకున్న మూడు విషయాలు మీకు నిరుత్సాహాన్ని కలిగించేటటువంటివే...ఎక్కువ నిరుత్సాహాన్ని కలిగించే అంశాన్ని ముందుగా వివరించనా?" పట్టెమంచం అంచుమీద కూర్చుంటూ శ్రీధరుడిని అడిగాడు కోలాహలుడు.

రెండుక్షణాలు ఆలోచించి తల అడ్డంగా తిప్పాడు శ్రీధరుడు. తక్కువ బాధను కలిగించే మాటను ముందుగా చెప్పమని కోరాడు.

"ఒంటిమీది గాయాలు మానిపోయినట్లు అనిపించినా సరే, మరో మూడురోజులపాటు నువ్వు మంచం మీదినుంచి దిగకూడదని వైద్యుడు ఆజ్ఞాపించాడు...కాబట్టి నీకు ఈ పట్టెమంచం బందిఖానా మరో మూడు రోజులు తప్పదు..." అతి ముఖ్యమైన రాజకీయపుటెత్తుల్ని చర్చించుతున్న మనిషిలా కుడిచేతి వేళ్ళల్లో ఒకదాన్ని ముడిచి చూపిస్తూ చెప్పాడు కోలాహలుడు.

తలమీది గాయంతోపాటు ఒంటిమీద దెబ్బలు తనను బాధించటం లేదని అంతకుముందే నిశ్చయం చేసుకుని వున్నందువల్ల, ఆ మాటల్ని విని కలవర పాటును ప్రదర్శించలేదు శ్రీధరుడు. రెండో విషయాన్ని చెప్పమని అతన్ని ప్రోత్సహించాడు.

"శ్రీరంగం మీద దాడిచేయటమే లక్ష్యంగా పెట్టుకున్న దోపిడీ దొంగల దండును అడ్డుకోవటంలో ఘోరంగా దెబ్బతిన్నాయట కులోత్తుంగ చోళ చక్రవర్తి

పంపిన సైన్యాలు... ఒకటి రెండు దినాల్లో ఆ దొంగల గుంపు ఇక్కడికి వచ్చి పడటం తప్పనిసరి అని అందరూ అనుకుంటున్నారు. శ్రీరంగం దాదాపుగా నిర్మానుష్యం అయిపోయింది... రాజభటుల కనులు కప్పి ఇక్కడ నివసించే పౌరులుకూడా కొంతమంది పలాయన మంత్రం పఠించేశారు..." రెండోవేలిని ముడుస్తూ వివరించాడు కోలాహలుడు.

నరరూపరాక్షసుల వంటి దొంగలు ఏ క్షణంలోనైనా వచ్చిపడవచ్చనే మాటను అంత ప్రశాంతంగా వెల్లడిస్తున్న అతని గుండె దిటవును చూసి మెచ్చుకోలుగా తల వూపాడు శ్రీధరుడు. అతను అడగకముందే మూడో అంశాన్ని ప్రస్తావించాడు కోలాహలుడు. తన దుస్తుల్లో భద్రపరచుకున్న మూడు రాగిరేకుల్ని తీసి అతని ఎదుట పెట్టాడు.

శ్రీధరుడి తలమీది గాయానికి వుపయోగించిన బైరాగి చిట్కావంటి ప్రయోగం ఏదో చేశాడు కాబోలు, తళ తళ మెరిసిపోతున్నాయి ఆ రేకులు.

"మన తెలుగుభాషకు సరియైన లిపిలేని కాలంలో లిఖించబడటం వల్ల మొదటి ప్రయత్నంలో వీటిని అర్థం చేసుకోవటం చాలా కష్టం అయింది..." అంటూ వాటిమీది అక్షరాలను ఒకటొకటిగా అతనికి ఎత్తి చూపించటం మొదలుపెట్టాడు కోలాహలుడు.

తలమీది గాయం తిరిగి రేగుతుందేమోననిపించి, అతన్ని బలవంతంగా ఆపేశాడు శ్రీధరుడు. వివరాల జోలికి పోకుండా ఆ అక్షరాలకు అర్థాన్ని తెలుపవలసిందిగా ప్రార్థించాడు.

"ఈ మూడు రేకులమీదా చెక్కబడిన మాటలన్నింటినీ కలుపుకుంటే ఒకే ఒక అర్థం స్ఫురించింది నాకు... చెప్పమంటావా?" ఆ రేకుల్ని ఒక చిన్న వస్త్రంలో చుట్టి, అతని తలగడ కింద భద్రపరుస్తూ అడిగాడు కోలాహలుడు.

అసలు విషయం చెప్పకుండా అతను సంభాషణను అలా పొడిగిస్తున్నందుకు కోపం వచ్చి, నొసలు ముడివేశాడు శ్రీధరుడు. అదిగమనించి అతని భుజం తడుతూ పెద్దగా నవ్వాడు కోలాహలుడు.

"కర్మరుడి దగ్గిర ఒక రాగికంకణం వుండేదని, అతని పూర్వులు దాచిపెట్టిన నిధి రహస్యం ఏదో ఆ కంకణంమీద లిఖించబడి వున్నదని తెలిసిన రోజునే నాకు అనుమానం కలిగింది.

సామాన్యులెవరూ ఆ నిధిని సంపాందించలేరని, గట్టిగా మాట్లాడితే ఆ నిధిని వశపరచుకోవటం మానవమాత్రుడికి సాధ్యపడే విషయం కాదని కూడా అనుకుంటూ వుండేవాడిని...ఇప్పుడు నువ్వు సంపాదించిన ఈ ఆధారాలు నా నమ్మకాన్ని బలపరిచాయి...ఈ నిధిని నువ్వు కూడా సంపాదించలేవు..." తన మాటల్ని ఆలకించటానికి ఆ చుట్టుపట్ల పరాయివారెరూ లేరని తెలిసీ, గొంతు తగ్గించి చెప్పాడతను.

అధికం అయిపోయింది శ్రీధరుడి మనసులో అడుగుపెట్టిన కోపం. "ఎందుకనిట? ఇన్ని ఆధారాలను సంపాదించగలిగిన నేను కూడా ఆ నిధిని వశపరచుకోవటం ఎందుకని అసాధ్యం అవుతుందిట?" కోరగా చూస్తూ అడిగాడు.

అతని మాటను లక్ష్యపెట్టకుండా పట్టెమంచం మీదినుంచి లేచి నిలుచున్నాడు కోలాహలుడు.

"శ్రీరంగంలో కొలువై యున్న రంగనాథుడు తిరుపతి క్షేత్రాన్ని చేరుకోగలిగినప్పుడు, ఆ జగదీశ్వరుడిని అనుసరించి అక్కడికి ఎవరైనా మానవుడు వెళ్లగలిగినప్పుడు కర్మరుడి పూర్వీకులు దాచివుంచిన నిధి మానవుల హస్తగతం అవుతుందట..."

క్షణక్షణానికి అధికం అవుతున్న కోపం కాస్తా చన్నీళ్ళు చిలకరించి నట్లు చల్లారిపోయేసరికి, విప్ఫారితమైన నేత్రాలతో కోలాహలుడి ముఖంలోకే చూస్తూ మెల్లిగా వెనక్కి వాలి పట్టెమంచం మీద పరుండిపోయాడు శ్రీధరుడు.

* * *

హేమసుందరి కట్టుదిట్టాల మధ్య రెండురోజులపాటు పట్టెమంచం మీదినుంచి కిందపెట్టలేకపోయాడు శ్రీధరుడు.

వైద్యశిఖామణి ఇచ్చిన సూచనలను తూ.చ. తప్పకుండా పాటింపచేసిందామె శ్రీధరుడిచేత.

కర్మరుడి రాగికంకణం మీది చిత్రాలను ఆధారంగా చేసుకుని, అతని పూర్వీకులు దాచిపెట్టిన రహస్య నిధిని వెలికి తీయాన్న కోరికను పూర్తిగా మనసులో నుంచి తుడిచివేసుకున్నాడు శ్రీధరుడు.

తనకు లభించిన రాగిరేకులమీద లిఖించబడి వున్న శాసనం వంటి మాటలే అందుకు కారణం.

శ్రీరంగంలో కొలువైవున్న రంగనాథుడు తిరుపతి క్షేత్రాన్ని చేరుకోగలిగేది ఎప్పుడు? ఎప్పుడయినా అటువంటి విడ్డూరం జరిగినప్పుడు మానవ మాత్రులకు ఆ దృశ్యాన్నిచూడటం, ఆ జగదీశ్వరుడిని అనుసరించి తిరుపతి క్షేత్రానికి వెళ్లడం అసలు సాధ్యపడే విషయమేనా? ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అనే తేడా

లేకుండా త్రికాలాల్లోనూ పట్టణ ద్వారాల దగ్గరికి పోయి దోపిడీ దొంగల సమాచారాన్ని సేకరించుకు వస్తున్న తన స్నేహితులతో ఇచ్చకాలను ముచ్చటిస్తూ అతి కష్టంమీద తన పట్టెమంచపు బందిఖానాను భరించాడు శ్రీధరుడు.

రెండవరోజు సాయం సమయంలో అతని దగ్గిరికి వచ్చి, నాడిని పట్టుకున్నాడు తోటమాలి స్వయంగా వెంటబెట్టుకు వచ్చిన వైద్యశిఖామణి.

హేమసుందరి తీసుకువచ్చిన మధురాధరవుల్ని ఆరగించి, ఒక పెద్దపాత్ర నిండుగా ఇచ్చిన క్షీరాన్ని త్రాగి తృప్తిగా నిట్టూర్చాడు.

"మీరు చెప్పినట్లు ఈ రెండుదినాల విశ్రాంతి సరిపోతుందా? మరో రెండురోజులపాటు కదలకుండా అతడ్ని కూర్చోబెట్టమంటారా?" తోటమాలి అందించిన తాటియాకుల వీవెనతో విసురుకుంటున్న వైద్యుడిని ప్రశ్నించింది హేమసుందరి.

వచ్చినప్పుడల్లా రుచికరమైన పదార్థాలను తినబెట్టి, కడుపు నిండిపోయేటట్లు గో క్షీరాన్ని త్రాగిస్తుంటే, అటువంటి మర్యాదలను పోగొట్టుకోవటానికి ఏ వైద్యుడైనా ఒప్పుకుంటాడా?

"ఆరోగ్యం సరిగా లేనప్పుడు విశ్రాంతి మన శరీరానికి అత్యంత ఆవశ్యకం. మరో రెండు దినాలపాటు పట్టెమంచం మీదినించి క్రిందికి దిగకుండా పట్టి వుంచటం మంచిదే... అందువల్ల లాభమేగానీ నష్టం వుండదు..." ఆనవాయితీ ప్రకారం ఆ పూట తను అక్కడికి వచ్చినందుకు వారు ఇవ్వవలసిన వెండినాణేల కోసం ఎదురుచూస్తూ ఆమెకు చెప్పాడు వైద్యశిఖామణి.

అతని భుజంమీది ఉత్తరీయాన్ని మెడచుట్టూ చుట్టి తనకు సమీపంలోకి లాగాలనీ, ఒంటిమీద గాయాలు పూర్తిగా మానబట్టిన తరువాత కూడా

కదలకుండా మంచంమీదే కూర్చోవాలనీ ఆశించాడు శ్రీధరుడు. కానీ హేమసుందరి చూస్తూ వుండగా ఆ పనులుచేసే ధైర్యం లేకపోవటం వల్ల మౌనంగా వుండిపోయాడు.

"ఇక నాకు అనుమతిని ఇప్పించండి... దోపిడి దొంగల్ని గురించి అదేపనిగా ఆలోచిస్తూ మతిపోగొట్టుకున్న మన్మథశ్రేష్ఠిగారిని ఓసారి చూసి రావాలి...కాలభైరవమనే విష పాషాణాన్ని అతనికి యివ్వదలచుకున్నాను..." తను చేయబోయే పనుల్ని గురించి చెపుతూ మరోసపారి సాభిప్రాయంగా గర్గుడివంక చూశాడు వైద్యశిఖామణి.

గాఢమైన నిట్టూర్పు విడిచి నాలుగు వెండినాణేల్ని, దట్టీలో నుంచి బయటికి తీశాడు గర్గుడు.

"సమయానికి వచ్చి మీరు చేసిన సహాయాన్ని మేము ఎప్పటికీ మరిచి పోలేము. అవసరం అయితే నేనే స్వయంగా మీ దగ్గిరికి వస్తాను... రోజుకు ఒకసారి మిమ్మల్ని రప్పించి ఇబ్బందులపాలు చేయటం యిక భావ్యం అనిపించుకోదు" అంటూ స్వయంగా వీధివరకూ అతన్ని సాగనంపి వచ్చాడు.

బాసిపట్టువేసుకు పట్టెమంచెం మధ్యభాగంలో కూర్చోబోయిన శ్రీధరుడిని గద్దించి పరుండబెట్టింది హేమసుందరి. వైద్యశిఖామణికి యివ్వగా మిగిలిన క్షీరాన్నంతా అతనిచేత అతి బలవంతంగా త్రాగించింది.

"నాకు ఈ బాధలనుంచి విముక్తి లభించాలంటే మానవుల సహాయం సరిపోదు. ఆ రంగనాథుడే స్వయంగా పూనుకుని ఆమెను నచ్చచెప్పాలి... లేదా దోపిడీదొంగలు వచ్చి ఈ నగరాన్ని అల్లకల్లోలం చేయాలి... " వినోదంగా చూస్తున్న కోలాహలుడితో మొరపెట్టుకున్నాడు శ్రీధరుడు.

అంతవరకూ ఎంతో సౌమ్యంగా, చిద్విలాసంగా నవ్వుతూ వున్న అతని మోము దోపిడీ దొంగల ప్రసక్తి వచ్చేసరికి ఒక్కసారిగా కాంతిని కోల్పోయింది.

"ఆ రాక్షసుల గురించి తలచుకోక స్నేహితుడా ... చిన్న వయసు కాబట్టి నీకు వారిని గురించి తెలియదు... మానవ రక్తానికి ఆశపడే పిశాచాలు కూడా వారిముందు వెలవెలా పోతాయి.

నరమాంసాన్ని ఆరగించటానికి అలవాటుపడిన క్రూర జంతువులు కూడా వారి ఎదుట సాధుజంతువులలా కనిపిస్తాయి...నవ్వులాటకు అయినా సరే వారి ఆగమనాన్ని కాంక్షించకు..." ఆవేదన నిండిన కంఠంతో హెచ్చరిస్తూ, భవంతి వెనుక భాగంలోని ఖాళీస్థలంలోకి వెళ్ళిపోయాడు.

అతనితోపాటు కదలబోయిన గర్గుడి చేతిని కదలకుండా ఆపాడు శ్రీధరుడు.

"ఎటువంటి కష్టాన్నైనా సులభంగా అధిగమించగల ఆ పెద్దమనిషి అలా దిగాలుగా మాట్లాడటానికి కారణం ఏమిటి?"

కోలాహలుడి మాటలకు అర్థాన్ని అతని ద్వారా తెలుసుకోగోరాడు.

గాఢంగా నిట్టూర్చి పట్టెమంచం అంచుమీద కూర్చున్నాడు గర్గుడు.

తోటమాలి అంతకుముందే తీసుకువచ్చి యిచ్చిన పనసతొనల్ని చక్కటి పళ్ళెరంలో పెట్టి అతని చేతికి అందించింది హేమసుందరి.

"ఇప్పటికి ముప్ఫదిఏడు సంవత్సరాలక్రితం ఉత్తరదేశ యాత్రలకని తన భార్యాబిడ్డలతోవింధ్యాచలం ఆవలిపక్కకు వెళ్ళాడు కోలాహలుడు...సోమనాథ దేవాలయంమీద దాడిచేసి అక్కడి సంపదలన్నింటినీ కొల్లగొట్టుకు పోయిన దోపిడీ దొందల గుంపు అదే సమయంలో మరోసారి ఆ ప్రదేశాలమీదికి దాడు

వచ్చిందట... తీర్థయాత్రీకులమని, దైవసేవ చేసుకోవటానికి బయలుదేరినవారిమనీ ఎంతగా వేడుకున్నా వారి మనసులు కరగలేదు.

కోలాహలుడి కనుల ఎదుట అతని భార్యాపిల్లల్ని హతమార్చి వేశారట.

బ్రతుకుమీద విరక్తి చెంది సన్యాసిలా దేశమంతా తిరిగి తిరిగి ధనదుపురం చేరుకున్నాడు...మానవత్వంమీద నమ్మకాన్ని కోల్పోవటం వల్ల నేరస్థుడిగా మారాడు. నాకు గురుదేవుడైనాడు..." దోపిడీ దొంగల ప్రసక్తివచ్చిన వెంటనే కోలాహలుడి వదనం మ్లానం అవటానికి, అతని మనసు అదోలా అయిపోవటానికి గల కారణాన్ని గురించి శ్రీధరుడికి వినిపించాడు గర్గుడు.

పట్టెమంచం పక్కనే చిన్న చెక్కబల్లమీద కూర్చుని కన్నీరు పెట్టుకున్నది ఆ కథను విన్న హేమసుందరి.

"ఎప్పుడు చూసినా నవ్వుతూనో, నవ్విస్తూనో వుండే కోలాహలుడి అంతరంగంలో ఇటువంటి అగ్నిపర్వతం ఒకటి వున్నదని నాకు తెలియదు... తెలియని తనంతో అతన్ని చాలాసార్లు ఎగతాళి చేశాను.. అతని భార్యాబిడ్డల ప్రసక్తిని తీసుకువచ్చి వెక్కిరించాను..." పమిటచెంగుతో కన్నీటిని అద్దుకుంటూ అన్నది.

"ఇప్పుడు వచ్చి పడుతున్నదని అందరూ అనుకుంటున్న దోపిడీ దొంగల ప్రసక్తిని తప్ప మరరేవిధమైన మాట మాట్లాడినా సహించి మనతోపాటు మనసారా నవ్వేయగలడు అతను..." అంటూ పట్టెమంచం అంచుమీదినుంచి లేచి భవంతి వెనుక భాగంలోకి బయలుదేరబోతూ, ఆగిపోయాడు గర్గుడు.

అతనొక్కడే కాదు... బాసిపట్టు వేసుకు కూర్చుంటే హేమసుందరి కయ్యానికి దిగుతుందన్న అనుమానంతో, తలగడమీదికి ఒరిగివున్న శ్రీధరుడు కూడా చటుక్కున లేచి కూర్చున్నాడు.

ఉన్నట్లుండి వారిద్దరిలో వచ్చిన ఆ విచిత్రమైన మార్పును గమనించి, విప్ఫారిత నేత్రాలతో వింతగా చూసింది హేమసుందరి.

"ఏమయింది? ఎందుకలా శిలాగ్రహాల మాదిరి బిగుసుకుపోయరు?" ఆశ్చర్యంగా అడుగుతూ తను కూడా చెక్కబల్ల మీదినించి లేచి నిలబడింది.

అదే సమయంలో ఆఘమేఘాలమీద వారి ఎదుటికి వచ్చేశాడు తెలిసిన వారినెవరినో పలుకరించటానికి వీధిలోకి వెళ్లిన తోటమాలి.

"అయిపోయింది స్వామీ... మన పని అయిపోయింది...మిడతల దండుమాదిరి వచ్చేశారు దోపిడీ దొంగలు... వస్తూనే తమ దమనకాండను ప్రారంభించారు" గోలుగోలున విలపిస్తూ వారికి చెప్పి, తోట చివరిభాగం లోకి పరుగు తీశాడు. అతను అవతలికి పోయిన నాలుగో క్షణంలో ఆ వీధినిండా నిండిపోయారు అశ్వారూఢులైన ఆ నరరూప రాక్షసులు.

* * *

భగభగమని మండుతున్న కాగడాలను పట్టుకుని, తమకు అగుపించిన ప్రతి గృహానికి అగ్నిని ముట్టిస్తున్నారు వారిలో కొందరు...వెర్రిగా, వికటంగా ఒళ్ళు గగుర్పొడిచేలా నవ్వుతూ కనిపించిన స్త్రీల నల్లా అవమానాలకు గురి చేస్తున్నారు మరికొందరు.

ఎదురు తిరగడానికి ప్రయత్నించిన వారందర్నీ నిర్ధాక్షిణ్యంగా తమ కరకు కరవాలాలతో యమపురికి పంపుతున్నారు మిగిలినవారు.

ఒకరు కాదు ఇద్దరు కాదు... వందల సంఖ్యలో అంటువ్యాధి మాదిరి వచ్చి నగరాన్ని మొత్తం చుట్టుముట్టారు. కళ తప్పిన ముఖంతో అలాగే నిలుచుండిపోయిన హేమసుందరి భుజం తట్టి, భవంతి వెనుకభాగం వైపు చూపించాడు శ్రీధరుడు.

"పిచ్చివాడిలా పరుగులు తీసిన తోటమాలిని ఊరడించు... అతని సాయంతో మన వృషభ శకటాన్ని సిద్ధం చేయి...మనం వెళ్లిపోదాం ఇక్కడి నుంచి" అంటూ వుండగానే, పాతికమంది వున్న దొంగల దళం ఆ భవంతి ఎదుటికి రానే వచ్చింది.

పుట్టి బుద్ధెరిగిన నాటినించీ ఆయుధ విద్యల్ని సాధన చేస్తూ వుండి కూడా, పూజారి పంపకం చేసిన యిద్దరే యిద్దరు దుర్మార్గుల చేతిలో చావుదెబ్బ తినటం భరించరాని అవమానంగా భావిస్తున్నాడు శ్రీధరుడు.

పరిస్థితులు ప్రాబల్యం వల్ల అలా జరిగిందనీ. తన బాహువుల్లోని శక్తి ఇసుంత కూడా తగ్గిపోలేదని నిరూ పించుకునే అవకాశం అయాచితంగా లభించినందుకు ఉప్పొంగిపోతూ, అంతకుముందు వరకూ హేమసుందరి ఆశీనురాలయి వున్న చెక్కబల్లను ఎత్తి, దొంగల దళం మీదికి విసిరాడు.

వాలుకనుల వయ్యారి హేమసుందరిని గమనించి పట్టరాని సంతోషంతో పరవశించిపోతున్నాడు ఆ దళానికి నాయకత్వం వహిస్తున్న దొంగ.

విచిత్రమయిన తలపాగాను చుట్టి, జానెడు పొడుగున పెంచుకున్న గడ్డాన్ని దువ్వుకుంటూ తన అశ్వాన్ని ఆమెకేసి పరిగెత్తించబోతున్నాడు.

గింగిరాలు తిరుగుతూ పోయి అతని ముఖానికి తగిలింది శ్రీధరుడు విసిరిన చెక్కబల్ల.

కర్ణకఠోరమైన కంఠంతో దిక్కులన్నీ బ్రద్దలై పోయేటట్లు గావుకేక ఒకటి పెట్టాడు అతను.. రక్తసిక్తమైన తలను చేతితో అదుముకుంటూ అశ్వం మీదినించి జారి క్రిందపడిపోయాడు.

ఆ దృశ్యాన్ని చూసేసరికి తమ ఆగ్రహాన్ని అణుచుకోవటం మిగిలిన దొంగలకు చేతకాలేదు.

శ్రీధరుడికి అర్థంకాని భాషలో కేకలు పెడుతూ, ముందుకు దుమికించారు తమ అశ్వాల్ని.

"మనల్ని నిలువునా నరికి, మన తలల్ని ఉత్తరించి బరిశె మొనలకు గుచ్చుతారట... అందరికీ అగుపించే విధంగా వీధిలో ప్రదర్శిస్తారట... హేమసుందరి అభిమానాన్ని కాలరాస్తారట... మన భవంతిని బుగ్గి చేసేస్తారట..." అంటూ ఆ అరుపులకు అర్థాన్ని శ్రీధరుడికి వివరించాడు గర్గుడు.

అంతకుమించి మాట్లాడే అవకాశం అతనికి లభించలేదు.. ఒకేసారి వచ్చిపడిన ఆ అశ్వికుల్ని పొడుగాటి బాణాకర్ర ఒకదానితో అడ్డుకుంటూ వూపిరి సలపని పోరాటంలో పూర్తిగా లీనమైపోయాడతను.

అతన్ని వదిలి భవంతి వైపు బయలుదేరిన యిద్దరు అశ్వికుల మీదికి అంతవరకూ తను పరుండి వున్న పట్టెమంచాన్ని విసిరాడు శ్రీధరుడు.

అశ్వాలమీదినించి జారి క్రింద పడిపోయిన వారిద్దరినీ తన కరకు పాదాలతో రెండుసార్లు ప్రహరించి, ఒక దొంగ చేతుల్లోనుంచి జారిపడిన కరవాలాన్ని తను స్వాధీనం చేసుకున్నాడు. కరవాలం అతని చేతుల్లోకి వచ్చిన రెండే రెండు నిమిషాల్లో అంతం అయిపోయింది అక్కడి పోరాటం.

గర్గుడి బాణాకర్ర దెబ్బలకు బెదిరి వీధిలోకి పరిగెత్తిన వారి ప్రాణాలే దక్కాయి. చెక్కబల్ల దెబ్బకు బెదిరి వీధిలోకి పరిగెత్తిన వారి ప్రాణాలే దక్కాయి. చెక్కబల్ల దెబ్బకు తల పగిలిన ఆ దళ నాయకుడితో సహా, పదునెనిమిది మంది దొంగల ప్రాణాలను వీరభద్రుడు బలి పుచ్చుకున్నట్లు బలి తీసుకున్నాడు శ్రీధరుడు.

"పారిపోయిన వారు తమ గోడును ఇతర దళాలకు వెల్లడించుకుంటారు. పగ తీర్చుకోవటానికి వారందరూ ఒకేసారి వచ్చిపడితే మనం ఎదుర్కోలేము. పారిపోదాం స్నేహితుడా... ఈ ప్రదేశాన్ని వదిలి దూరంగా వెళ్లిపోదాం" అంటూ వీధిలోకి పరుగు తీయబోయిన శ్రీధరుడి చేతిని గట్టిగా పట్టుకుని, భవంతి వెనుక భాగంలోకి తీసుకుపోయాడు గర్గుడు.

కంపిస్తున్న కరచరణాలను ఎంతో ప్రయత్నంమీద స్వాధీనంలోనికి తెచ్చుకుని, ఒక పూపొదచాటున మోకరించి కూర్చున్న తోటమాలిని వెతికి పట్టుకు వచ్చింది హేమసుందరి... హాయిగా ఆనందంగా తలల్ని వూపుతున్న వృషభాలను కన్నీటితో పలుకరించి, శకటానికి కట్టిస్తోంది.

"కోలాహలుడు ఎక్కడ? కోలాహలుడు ఏమయిపోయాడు?" ఆందోళన నిండిన కంఠంతో అడుగుతూ, అతనికోసం వెతకటానికి బయలుదేరిన శ్రీధరుడిని బలవంతంగా శకటంలోకి నెట్టాడు గర్గుడు.

తనకు గురుదేవుడైన మనిషిని గురించి పట్టించుకోక పోవటానికి గల కారణాన్ని పదిక్షణాల తర్వాత ప్రత్యక్షంగా చూశాడు శ్రీధరుడు.

అంతకుముందు గర్గుడు అనుమానించినట్లే నాలుగు అయిదు వందలమంది సహచరుల్ని వెంటబెట్టుకుని భవనంమీదికి వచ్చిపడ్డారు, అతని బాణాకర్ర దెబ్బలకు పారిపోయిన దొంగలు.

"వీరి విషయంలో మనం అలసత్వం ప్రదర్శించకూడదు. ఎదురు వచ్చిన దొంగను ఎదురు వచ్చిన విధంగానే నరికి ముక్కలు చేయాలి. ప్రాణాలతో వదిలితే, మన ప్రాణాలమీదికి రావటం తథ్యం" వృషభాలను అదిలించి అతివేగంగా అవతలికి పరిగెత్తిస్తూ గర్గుడితో అన్నాడు శ్రీధరుడు.

భవంతికి చెందిన ఖాళీస్థలాన్ని వారు అధిగమించి, దూరంలో వున్న ఒక చెట్లగుంపుకేసి పోతున్నప్పుడు ఫెటఫెటార్భాటాలు చేస్తూ వారి భవనం మీద ప్రత్యక్షం అయ్యాయి మంటలు.

"కట్టుబట్టలతో శ్రీరంగం వచ్చి, రాత్రింబగళ్ళు కష్టపడి సంపాదించుకున్న ధనంతో ఆ భవంతిని నిర్మించుకున్నాడు నా యజమాని...పాతిక సంవత్సరాల ఆయన కష్టం పాతిక క్షణాల్లో అగ్నిపాలు అయిపోయింది... ఇటువంటి దృశ్యాలు చూడటం కోసమేనేమో భగవంతుడు నన్నింకా ప్రాణాలతో వుంచాడు."

చేతుల్లో ముఖాన్ని దాచుకుని బావురుమంటున్న తోటమాలిని ఓదార్చటం ఎలాగో తెలియలేదు హేమసుందరికి.

"ఎక్కడినుంచో వచ్చిన ఆ దుష్ట దుర్మార్గులు తమ చిత్తం వచ్చినట్లు ప్రవర్తిస్తుంటే చూస్తూ వూరుకోవాల్సిందేనా? వారిని అడ్డగించటం ఎవరికీ చేతకాదా?" రోషకషాయిత నేత్రాలతో గుర్గుడి వంక చూస్తూ అడిగింది.

తమ తమకు ఎన్ని విభేదాలు వున్నా, పగవాళ్ళు దండెత్తి వచ్చిన సమయంలో ఐక్యమత్యంగా వుండకపోతే, తామందరి ఉనికికే ప్రమాదం ఎదురవుతుందని గ్రహించలేకపోతున్నారు రాజన్యులు... వాళ్ళు ఆ విషయాన్ని గ్రహించేసరికి పరిస్థితులు విషమిస్తాయి. దోపిడీలకే ప్రాధాన్యత యిస్తున్న ఆ

గుంపులు నెమ్మది నెమ్మదిగా భరతభూమి మీద వేళ్ళూనుకోవటానికి ప్రయత్నాలు చేస్తాయి.

"ఆపండి.. బండిని ఒకసారి ఆపండి... అటు చూడండి...ఒకసారి అటుకేసి చూడండి" వున్నట్లుండి హేమసుందరి బిగ్గరగా కేక పెట్టడంతో అదిరిపడి అటుకేసి చూశాడు గర్గుడు.

పదిమంది ఆడవాళ్ళు, పసిబిడ్డల్ని ఎత్తుకొని పడుతూ లేస్తూ పరిగెత్తుకు వస్తున్నారు శకటం ప్రయాణిస్తున్న మార్గంలోకి. చేతుల్లోని బల్లేలను గాలిలో వూపుతూ తరుముకు వస్తున్నారు పాతికమంది దొంగలు.

వృషభాల కొమ్ములకు కట్టిన పగ్గాలను తోటమాలి మీదికి విసిరి, పాదాల దగ్గిర సిద్ధంగా పెట్టుకున్న కరవాలాన్ని తీసుకున్నాడు శ్రీధరుడు. కూడా బలుక్కున్నట్లుగా గర్గుడితోపాటు క్రిందికి దూకి అటుకేసి పరుగు తీశాడు.

తమ దౌష్ట్యాలను అడ్డుకునే మొనగాళ్ళు ఆ చుట్టుపట్ల ఎవరూ లేరనే గర్వంతో అహంకరిస్తూ వస్తున్నారు ఆ దొంగలు.

అనుకోని విధంగా ప్రత్యక్షం అయిన ఆ యోధుల్ని చూసి చెవులు చిల్లులు పడిపోయేటట్లు కేకలు పెట్టారు.

"వాళ్ల అరుపుల్ని ఆలకించి ఇంకా కొందరు వచ్చిపడేలోగా పని పూర్తి అయిపోవాలి..." అంటూ తన బాణాకర్రను గిర్రున తిప్పటం మొదలుపెట్టాడు గర్గుడు.

జాలి, దయ అనే మాటల్ని మనసులోనుంచి తుడిచి వేసుకున్నట్లు కరవాలాన్ని ప్రయోగించాడు శ్రీధరుడు.

మిగలపండిన తాటిపళ్ళను రాల్చినట్లు ఒకదాని తర్వాత ఒకటిగా ఆ దొంగల తలల్ని నరికి నేలను నెడుతూ, వీరవిహారం చేశాడు.

ఎంత హఠాత్తుగా మొదలయిందో, అంతే హఠాత్తుగా అంతం అయిపోయిందా పోరాటం. తమ భవంతి ఎదుట నేర్చుకున్న పాఠాన్ని స్నేహితులు యిద్దరూ మరిచిపోవడం వల్ల, ఒక్క దొంగ కూడా ప్రాణాలతో మిగలలేదు.

తమ పని పూర్తి అయిన వెంటనే వెనుతిరిగి రాలేదు శ్రీధరుడు. "ఆయుధాలు మనకి ముందు ముందు చాలా అవసరమవుతాయి" అంటూ విగతజీవులైన దొంగల ఆయుధాలన్నింటినీ కట్టకట్టి శకటం దగ్గిరికి తీసుకు వచ్చాడు.

ఆ సమయంలోనే తన కౌగిటలో పొదుపుకుని వున్న నాలుగు నెలల పసిబిడ్డను అతని పాదాలమీద పడుకోబెట్టి, సాష్టాంగ నమస్కారం చేసింది ప్రాణాలు దక్కించుకోవటానికి పారిపోయి వచ్చిన యువతి ఒకామె.

## 14

"రాక్షస సంహారి అయిన శ్రీరంగనాథుడి దయవల్ల ఈ నరరూప రాక్షసులను హతమార్చి మిమ్మల్ని కాపాడగలిగాము. ఇందులో మా గొప్పతనం ఏమీ లేదు" అంటూ ఆ యువతిని వారించాడు శ్రీధరుడు. తన పాదాలచెంత పరుండబెట్టిన బిడ్డను ముద్దాడి తల్లికి అందించాడు.

"హతమారిపోయిన ఈ దుండగులను వెతుకుతూ వీరి సహచరులు ఎవరైనా ఇటుగా వస్తే మరోసారి మనమందరము ప్రమాదంలో చిక్కుబడతాం. పదండి అందరూ...ఈ ప్రదేశానికి దూరంగా వెళ్ళిపోదాం" అంటూ నగరంలో

నుంచి పారిపోయి వచ్చిన ఆ ఆడవారందర్నీ శకటంలో కూర్చుండబెట్టి తోటమాలికి సైగ చేశాడు.

అతని సైగ కోసమే ఎదురు చూస్తున్నాడు తోటమాలి. వెంటనే వృషభాలను అదిలించి, ముందుకు పరుగు తీయించాడు.

తాము సంపాదించిన ఆయుధాల కట్టను భుజాలమీద వేసుకుని , శకటం వెనుక అడుగులు వేశారు శ్రీధరుడు, గర్గుడు. ఖాళీస్థలాన్ని అధిగమించి, వత్తుగా ఎదిగి వున్న చెట్లతోపులోకి పోతుండగా, అగుపించాడు వారికి కోలాహలుడు.

దోపిడీ దొంగలు వీథుల్లోకి వచ్చిన మరుక్షణం తన ఆయుధంతో వారిని ఎదుర్కోవటం మొదలు పెట్టాడు కాబోలు, రక్తసిక్తమై వున్నాయి అతని దుస్తులు. ఎదురు చూడని విధంగా వచ్చిపడిన ఆ ప్రమాదాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియక, ప్రాణాల్ని పోగొట్టుకోబోతున్న అనేకమంది యువకుల్ని అతను కాపాడి, ఆ చెట్లతోపులోకి తీసుకువచ్చాడు.

"పిరికివాళ్ళ మాదిరి నోళ్ళు తెరుచుకు నిలబడితే, మరింతగా రెచ్చిపోయి, ఇంకా ఇంకా అనేక దారుణాలు చేసేస్తారు ఆ దుండగులు. అందరమూ కలిసి వారిని ఎదిరిస్తే తప్పకుండా మనకు విజయం లభిస్తుంది..." దిగాలు పడి నిలబడి వున్న ఆ యువకుల్లో ఉత్తేజాన్ని తీసుకురావటం కోసం శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నాడు.

"సరైన ఆయుధాలు లేకుండా వట్టి చేతులతో యుద్ధానికి సిద్ధపడమనటం భావ్యంగా లేదు..." జీరపడిన కంఠంతో మెల్లిగా తన అభ్యంతరాన్ని తెలియ చేస్తున్నాడు ఆ యువకుల్లో ఒకతను.

పరుగులాంటి నడకతో కోలాహలుడి ప్రక్కకు పోయి, తాము మోసుకు వచ్చిన ఆయుధాలనన్నిటినీ ఆ యువకుల ఎదుట పడవేశారు శ్రీధరుడు, గర్గుడు.

"కాకి మాదిరిగా కలకాలం బ్రతకటం కంటే హంసమాదిరిగా ఆరు క్షణాలు బ్రతకటమే మేలని మన పెద్దలు చెప్పిన సూక్తి. పిరికితనాన్ని ప్రదర్శించి అయిన వాళ్ళందర్నీ పోగొట్టుకుని మీరు జీవితంలో సాధించేది ఏదైనా వుంటుందా?" కోపంగా అంటున్న శ్రీధరుడిని చూసేసరికి ఒక్కసారిగా ముంచుకు వచ్చేసింది ఆ యువకులందరికీ రోషం.

గుంపుగా కదిలి క్రింద వున్న ఆయుధాలన్నింటినీ తమలో తాము పంచుకున్నారు వారందరూ... గుండెలు జలదరించేటట్లు సింహనాదాలు చేస్తూ నగరంవైపు పరుగులు తీశారు.

రెచ్చగొట్టి వదిలేస్తే గుడ్డిగా ముందుకుపోయి అగ్నిలో పడిన శలభాల మాదిరి హతమారిపోతారన్న భయంతో అందరికంటె ముందుగా పరుగులు తీశాడు కోలాహలుడు. అతనికి ఆరు ధనువుల దూరంలో అడుగులు వేశాడు గర్గుడు.

వృషభ శకటాన్ని చెట్లతోపుకు ఆవలి భాగంలో వున్న ఒక తామర కొలను దగ్గిర నిలబెట్టించాడు శ్రీధరుడు. అందులో ఆడవారికి, హేమసుందరికి తగు జాగ్రత్తలు చెప్పాడు.

"నేను కూడా నీతోపాటు వస్తాను... నిన్ను వదిలి వంటరిగా యిక్కడ వుండలేను..." చెమ్మగిల్లిన కనుల్ని అతనికి అగుపించకుండా తుడుచుకుంటూ గద్గద స్వరంతో వేడుకున్నది హేమసుందరి.

మొట్టమొదటిసారిగా తన హృదయంలోని భావాలను చేతల రూపంలో ప్రదర్శించాడు శ్రీధరుడు. ఆమె సుందర వదనాన్ని చేతుల్లోకి తీసుకుని, పెదవుల్ని చుంబించాడు.

"నువ్వు వీరందరికి కాపుగా యిక్కడే వుండాలి... మా ఆయుధాల ధాటికి తట్టుకోలేక ఆ దుర్మార్గులు చేసే ఆక్రందనల్ని నీ కర్ణేంద్రియాలు భరించలేవు..." ముద్దు మాటలతో ఆమె కోరికను సున్నితంగా తిరస్కరించి, తన స్నేహితులు పరుగిడిన దిశలో అడుగులు వేశాడు.

ప్రాకార ద్వారాలను అతను చేరుకునే సమయానికి, దోపిడీ దొంగలందరూ నగరాన్ని వదలి వెనుతిరుగుతూ వుండటం అతని కనుల పడింది.

కరవాలాన్ని బిగించి పట్టుకుని దొరికిన వారిని దొరికినట్లుగా విగత జీవుల్ని చేస్తూ, రెండో ప్రాకారం దగ్గిరికి పోయాడు శ్రీధరుడు.

తమ అశ్వాలను అతి వేగంగా పరుగులు తీయిస్తూ, అతని ఆయుధానికి అందకుండా దూరంగా పారిపోయింది మరోగుంపు.

ఎంతో ప్రయత్నం మీద ఆ గుంపులోని యిద్దరు దొంగల్ని తన కరవాలానికి బలిచేసి, మూడో ప్రాకారాన్ని చేరుకున్నాడతను.

చేరుకుంటూ వుండగానే అతని చెవులకు చేరింది ఒక అరుపు.

"రక్షింపబడ్డాం మనం... రక్షింపబడ్డాం... కులోత్తుంగ చోళ చక్రవర్తి తన అంగరక్షక సైన్యాలతో నగర ప్రవేశం చేశారు... ఆ సైన్యాలను చూసిన దొంగలు పారిపోతున్నారు..." గొంతు చించుకుని అరుస్తూ, వీధుల్లోకి రావటం మొదలుపెట్టారు. అంతవరకూ ఎక్కడెక్కడో దాగుకుని వున్న పట్టణ పౌరులు.

మూడో ప్రాకార ద్వారాల్ని అధిగమించి అటూ యిటూ కలియ చూస్తున్న శ్రీధరుడికి ఒక చిన్న వీధి మొగదల నిలుచుని వున్న కోలాహాలుడు, గర్గుడు కనిపించి కనుల విందొనరించారు.

"నువ్వు లేనిపోని శౌర్యపక్రమాలు ప్రదర్శించి అందరి దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేయకు..." అంటూ శ్రీధరుడిచేతిని పట్టుకొని, తమ దగ్గిరికి లాగాడు కోలాహలుడు.

ఆ మాటలు అర్థంగాక అయోమయంగా గుర్గుడి వంక చూశాడు శ్రీధరుడు.

"మనం నగరంలోకి వచ్చేందుకు కాస్తంత ముందుగా, ఆలయ ప్రాకారాల్ని అధిగమించి గర్భగుడి తలుపుల్ని బ్రద్దలుకొట్టారట దోపిడీ దొంగలు... మొట్ట మొదటగా అగుపించిన స్వామివారి విగ్రహాన్ని తమతో పాటు తీసుకుపోయారట..." లోగొంతుకలో శ్రీధరుడి చెవిలో వూదాడు గర్గుడు.

స్వామివారి విగ్రహం మాయం అయిందనే మాటను వినేసరికి చలిగాలి వీటినట్లు జలదరించింది శ్రీధరుడి శరీరం.

"ఆలయ రక్షకులు ఏం చేస్తున్నారు? తరతరాలనుంచి స్వామివారిని సేవిస్తూ స్వామివారి సంపదను తేరగా ఆరగిస్తూ హాయిగా కాలం గడుపుతున్న అర్చక స్వాములు ఏమైపోయారు? తమకు ఇష్టంలేని పనిని చేసిన వారిమీదికి దుర్మార్గులను ఉసికొల్పటం తప్ప ఇంకేమీ చేతకాదా వారందరికీ?" ఎర్రగా కందిపోయిన ముఖంతో, కర్కశంగా ప్రశ్నించబోయిన శ్రీధరుడి నోటిని బలంగా అదిమి కనులు ఎర్రచేశాడు కోలాహలుడు.

"నువ్వు ఇటువంటి మాటలు మాట్లాడతావని తెలియబట్టే నిన్ను ముందుగా హెచ్చరించాను.. అనవసరమైన శౌర్య పరాక్రమాలను ప్రదర్శించటం అంటే ఇదే..." లోగొంతుకతో వళ్ళు గగుర్పొడిచేటంత క్రూరంగా మాట్లాడుతూ, అతని చేతిని పట్టుకుని ముందుకు అడుగు వేశాడు.

దోపిడీ దొంగలు నగరంలోనుంచి వెళ్లిపోయిన వార్త అందరికీ అవగతం అయినట్లుంది... గుంపులుగా ప్రధాన వీథుల్లోకి వచ్చేయటం మొదలుపెట్టారు పౌరులు.

కాషాయాంబరాలు ధరించిన వైష్ణవ మత దాసులు, బ్రహ్మచారులు ఎంతోమంది వారిలో వుండటాన్ని చూసి, కోలాహలుడి భుజం తట్టాడు శ్రీధరుడు.

"రామానుజ యతీంద్రులు నగరంలోనే వున్నారు...దోపిడీ దొంగలు ఆలయం మీదికి దండెత్తుతారన్న అనుమానంతో, శిష్యులు ఎంతోమంది వద్దు వద్దని ఎంత ప్రాధేయపడినా వినిపించుకోకుండా వచ్చేశారట..." తనకు తెలిసిన విషయాన్ని అతనికి ఎరుకపరిచాడు కోలాహలుడు.

ఆరవ ప్రాకారాన్ని అధిగమిస్తూ వుండగా, వారికి అగుపించాయి కులోత్తుంగ చోళ చక్రవర్తి స్వయంగా వెంటబెట్టుకు వచ్చిన సైన్యాలు.

"స్వామివారి విగ్రహాన్ని దొంగిలించుకు పోయిన సంగతి వీరికి ఇంకా తెలియలేదా?" అని ప్రశ్నించబోతున్న శ్రీధరుడిని మరోసారి వారించాడతను.

"కందకు లేని దురద కత్తిపీటకు ఎందుకు?" అని ప్రశ్నించాడు.

కంద ఎవరో, కత్తిపీట ఎవరో తేల్చుకోవటం చేతకాక మౌనంగా వుండి పోయాడు శ్రీధరుడు.

ఆలయం ఎదుట వున్న చిన్న మండపంలో వారందరికీ అగుపించారు శ్రీ రామానుజులవారు. తీవ్రమైన మనోవేదనతో వ్యాకులపడుతున్నట్లుగా వున్న ఆయన ముఖకవళికల్ని గమనించి గాఢంగా నిట్టూర్చాడు శ్రీధరుడు.

జైన, శైవ మతం ప్రాబల్యం నుండి జనులందర్నీ వైష్ణవమతం వైపు మరలించుకునేందుకు నిరంతర కృషిని సల్పుతున్న మహనీయుడు ఆయన.

భగవంతుడి కృపను పొందటానికి తపస్సులు చేయవలసిన అవసరము లేదని, కఠిన నియమాలను అనుసరించవలసిన పనే లేదని, భక్తి మార్గాన్ని అనుసరిస్తే చాలని సామాన్య ప్రజలకు కూడా చక్కగా అర్థం అయ్యేటట్లు భక్తితత్వాన్ని ప్రభోదిస్తున్నారు.

ఆ భక్తి మార్గానికి అత్యవసరమైన వైష్ణవ ఆలయాలను శత సహస్ర సంఖ్యలో తన భక్తులచేత నిర్మింపచేస్తున్నారు.

వైష్ణవ మత ప్రచారానికి ముఖ్య భూమికల్లో మొదటిది రంగనాథుడి ఆలయం.

ఆ ఆలయంలోనే దొంగతనం జరిగిందని తెలిస్తే ఎలా వుంటాయి పరిస్థితులు?

తనను తాను కాపాడుకోవటం చేతకాని వైష్ణవ దేవుడు తమను ఎలా కాపాడతాడని ప్రజలందరికీ అనుమానం రాదా?

తీవ్రమైన ఆలోచనలతో తల్లడిల్లిపోతున్నట్లు శిరస్సును వంచుకుని కూర్చుని వున్న ఆ మహనీయుడి దగ్గిరికిపోయి, జరిగిన దురంతానికి సానుభూతిని తెలియచేయాలని అనిపించింది శ్రీధరుడికి.

దోపిడీ దొంగలు నగరంలో నుంచి పారిపోయిన క్షణంనుంచీ అతన్నే ఒక కంట కనిపెట్టుకుంటూ వున్నాడు కోలాహలుడు.

"ఎంతోమంది వీరాధివీరులు యిక్కడ వున్నారు...ఈ ఆలయరక్షణ బాధ్యతలను తమ భుజస్కందాల మీద మోయవలసిన మహానుభావులు అనేకులు మనకు ఎదురుగానే నిలుచుని వున్నారు... చోళ సామ్రాజ్యంలోని మంచిచెడులకు పూర్తిగా బాధ్యుడైన కులోత్తుంగ చోళ చక్రవర్తే స్వయంగా నగరంలోకి వచ్చి వున్నారు...ఇంతమంది ఎదుట నువ్వు మాట్లాడకూడని మాట ఏదైనా మాట్లాడితే, మన కొంపలు మునిగిపోతాయి. దయచేసి కాస్తంత సహనాన్ని అలవర్చుకో స్నేహితుడా..." అంటూ అతని భుజాలను గట్టిగా పట్టుకుని కదలకుండా నిలబెట్టేశాడు.

అతను అలా అనటం చాలా మంచిపని అయింది. ఎందుకంటే, అతని మాటలు ముగిసిన మరుక్షణం వంద మాగధులు ముందు అడుగులు వస్తుండగా, సద్బ్రాహ్మణులు స్వస్తి వచనాలను పలుకుతుండగా ఆ మండపము ఎదుటికి వచ్చి గురు రామానుజుల వారికి నమస్కరించాడు కులోత్తుంగ చోళ చక్రవర్తి.

వ్యాసమహర్షి విరచించిన మహాభరతాన్ని నన్నయ్య భట్టారకుల వారి చేత తెనిగింపజేసే ప్రయత్నానికి శ్రీకారం చుట్టిన ఆంధ్ర చక్రవర్తి రాజ రాజ నరేంద్రులవారి ఏకైక సంతానం అతను.

శైవమతం మీది అభిమానంతో వైష్ణవ సాంప్రదాయాలను నిరసించిన రాజుగా ఒకింత చెడు పేరును తెచ్చుకున్న అమాయకుడు.

"ధనదుపుర సార్వభౌముడి దగ్గిర వున్న సేనాపతి వంటి స్వార్థపరులను నమ్మి రాచకార్యాలను నిర్వహించే బాధ్యతలను వారికే పూర్తిగా వదిలివేయటం

వల్ల వచ్చిపడిన నింద అది. మన రాజరాజ నరేంద్రులవారి మాదిరిగానే సర్వమత సమానత్వం అత్యవసరమని నమ్మే మనిషి ఇతను" శ్రీధరుడి మనసులోని ఆలోచనలను ఎప్పటి మాదిరిగానే చాలా తేలికగా గ్రహించి, లోగొంతుకతో వివరించి చెప్పాడు కోలాహలుడు.

"వింధ్యా చలాన్ని దాటి, ఆంధ్ర రాజ్యాలను అధిగమించి, చోళ సామ్రాజ్యంలో దోపిడీలు నిర్వహించడమే లక్ష్యంగా పెట్టుకు వచ్చిన దొంగల గుంపుల్ని నిలువరించటంలో మేము కొద్దిగా లక్ష్యాన్ని తప్పాము. రంగనాథస్వామి వారికి జరిగిన అపచారాన్ని వెంటనే సరిచేస్తాము... మా అంగరక్షక దళం ఆ దుండగుల్ని వెంటాడి స్వామివారి విగ్రహాన్ని క్షేమంగా వెనక్కి తీసుకువస్తుంది..." అర్థనిమీలిత నేత్రాలతో ఆలయ గోపురం వైపే చూస్తున్న యతీంద్రులకు విన్నవించుకున్నాడు చక్రవర్తి.

"జగన్నాటక సూత్రధారియైన కావేటి రంగడి లీలల్ని అర్థంచేసుకోవటం మానవ మాత్రులమైన మనకు సాధ్యం కాదు...ఈ భూమిమీద జరిగే ప్రతి సంఘటనకు ఒక ప్రత్యేక కారణం వుంటుంది...తన విగ్రహాన్ని తనకు తానై దొంగలపాలు చేయటంలో ఆ దేవతా సార్వభౌముడి ఆలోచన ఏమిటో ఎలా తెలుసుకోవటం?" వున్నట్లుండి ఒక చిరునవ్వు తమ ముఖకమలాన్ని ప్రకాశవంతం చేస్తుండగా మృదుస్వరం తో చక్రవర్తిని ప్రశ్నించారు రామానుజులవారు.

చక్రవర్తితోపాటు, అచట నిలుచుని వున్న నగర ప్రముఖులు, అర్చక స్వాములు, వైష్ణవదాసులు అందరూ విపరీతమైన ఆశ్చర్యానికి గురి అయ్యారు ఆ పలుకుల్ని ఆలకించి.

"మీ మాటలు మాకు అర్థం కాలేదు అంటున్నందుకు మమ్మల్ని క్షమించండి... మా అంగరక్షక దళం ఆ విగ్రహాన్ని వెనక్కి తీసుకు రాలేదనా మీ అభిప్రాయం?" నొసలు ముడివేసి చూస్తూ వెంటనే ప్రశ్నించాడు కులోత్తుంగ చోళ చక్రవర్తి.

"అనుమానించటానికి, అనుమానించక పోవటానికి ఆ రంగనాథుడి ఉద్దేశ్యం అవగతం అయినప్పుడు మాత్రమే కదా వీలుపడేది? ఈ పృథ్వికి రక్షకులుగా మీ కర్తవ్యాన్ని మీరు నిర్వర్తించండి... ఫలితాల్ని భగవంతుడికి వదిలివేయండి..." అంటూ నేత్రాలను నిమీలితం చేసుకున్నాడు రామానుజుల వారు.

ఇంకేదో మాట్లాడబోయిన ఆఖరిక్షణంలో ఆ ఉద్దేశ్యాన్ని విరమించుకున్నాడు చక్రవర్తి. మరోమారు ఆ యతిస్వామికి నమస్కరించి, మంది మార్భలము వెంట వస్తుండగా, పురప్రముఖులు సిద్ధం చేసిన భవంతివైపు సాగిపోయారు.

మండపం చుట్టూ చేరిన జనం కూడా పలుచబడటం మొదలు అయ్యేసరికి, కోలాహలుడు ఎంత ఆపినా ఆగకుండా రామానుజుల వారి ఎదుటికి వెళ్ళాడు శ్రీధరుడు. పద్మాసనం మధ్యలో కూర్చుని వున్న ఆయన పాదాల్ని తాకి నమస్కరించాడు.

అతని హస్తాలు తమ పాదాల్ని స్పృశించిన వెంటనే కనులు తెరిచి చూశారా యతిస్వామి. చూసిన వెంటనే చక్కని చిరునవ్వు అయన పెదవుల మీదికి పరిగెత్తుకు వచ్చింది.

"మన స్వామివారికి జరిగిన అపచారం ఏమిటో నీకు తెలిసిందా నాయనా?" ఆదరణ నిండిన కంఠంతో వెంటనే ప్రశ్నించారు.

పెదవి విప్పితే మాట సరిగా వెలుపలికి వస్తుందో లేదోనన్న అనుమానంతో మూగగా తలవూపాడు శ్రీధరుడు.

"గుంపులు గుంపులుగా చీలి వేగవంతమైన అశ్వాలమీద ప్రయాణం చేస్తున్న ఆ దుండగులను నిలువరించటం చక్రవర్తి సైన్యాలకు సాధ్యపడకుండా పోతున్నది. స్వామివారి విగ్రహం ఏ గుంపువద్ద వున్నదో తెలుసుకోగలిగితేనే ఏదైనా చేయటానికి వీలుపడుతుంది. యుద్ధాలకు బయలుదేరినట్లు ససైన్యంగా వెళితే ఆ గుంపు అగుపించదు..." శ్రీధరుడి కనుల్లోకే సూటిగా చూస్తూ అంతవరకూ ఎవరితోనూ ముచ్చటించని మాటల్ని అతనితో చర్చించటం మొదలుపెట్టారా యతిరాజు.

సుశిక్షితులైన చక్రవర్తి అంగరక్షక దళంలోని సైన్యాధిపతులు కూడా గమనించలేని ఆ సూక్ష్మాంశాలు భక్తితత్వపు మాటలు తప్ప మరో మాటకూడా వెలువడని ఆ పూజ్యమూర్తి పెదవులనుండి వివరించటం శ్రీధరుడిని సమ్మోహితుడిని చేసివేసింది.

"మీరు మమ్మల్ని ఆశీర్వదించండి..మీ ఆశీస్సుల బలంతో స్వామివారి కార్యాన్ని తేలికగా పూర్తి చేసుకువస్తాను" తనకు తెలియకుండానే కోలాహలుడు భయపడుతున్న మాటల్ని వుపయోగించాడు శ్రీధరుడు.

గర్భగుడిలోని స్వామి వారి ఎదుట దేదీప్యమానంగా వెలిగే నేతిదీపం మాదిరి మరింత ప్రకాశవంతమయింది రామానుజుల వారి వదనం.

"ఆలయంలోని స్వామివారి విగ్రహం మటుమాయం అయిందని తెలిసిన క్షణంనుంచి మా గుండెలమీద వృషభాలు చిందులు వేస్తున్న అనుభూతి కలగటం మొదలుపెట్టింది... తిరుపతి కొండలమీది వెంకటేశ్వరుడు తన దక్షిణ హస్తంతో తన వద్దకు రారమ్మనమని పిలుస్తున్నట్లుగా అనిపించింది... దైవం మరోసారి తన మహత్తును ప్రజలందరికి ప్రదర్శించటం కోసమే ఈ సంఘటన సంభవించినట్లు తెలిసివస్తోంది..." అంటూ, శ్రీధరుడికి వెనుకే నిలబడి వున్న అతని సహచరుల వంక చూశారు పూజ్యమూర్తి.

తలల్ని వంచి నమస్కారాలు చేశారు వారిద్దరూ...ఆయన పవిత్ర పాదాలను తమ కనులకు అద్దుకున్నారు.

ఒక్కమాటకూడా మాట్లాడకుండా పదిక్షణాలపాటు వారిద్దరి ముఖాల్లోకి చూసి చిన్నగా నవ్వేశారు రామానుజులవారు.

"వెన్న మీగడలను దొంగిలించటంలో స్వామివారికి వున్న నేర్పు అసామాన్య మైనదని మన పురాణాలు మనకు చెపుతున్నాయి.. తన కార్యాన్ని సానుకూల పరుచుకోవటానికి ఎటువంటి వారిని ఎన్నిక చేసుకోవాలో ఆయనకు తెలుసు... రంగనాథుడి పవిత్ర నేత్రయుగళిని ఒక్కసారి చూస్తే సర్వపాపాలు హరించిపోతాయని నానుడి... ఇప్పుడు స్వామివారినే స్వయంగా మీ భుజస్కంధాల మీదికి ఎక్కించుకునే మహద్భాగ్యం మీకు వశం కాబోతున్నది. ధన్యులు మీరు ... ధన్యులు మీకు జన్మ ఇచ్చిన మాతాపితరులు...ధన్యులం అయ్యాము మేము... మీ వంటివారిని కనులారా వీక్షించటం వలన" అంటూ ఆశీర్వాదపూర్వకంగా దక్షిణహస్తాన్ని ఎత్తి రంగనాథ నామస్మరణ చేశారు.

ఆయన ప్రక్కన వున్న శిష్యగణానికి, ఆయన వెనుక నిలిచి వున్న కొందరు అర్చక స్వాములకు ఇసుమంతకూడా అర్థం కాలేదు ఆ సంభాషణ. ఆశ్చర్యం నిండిన కనులతో ఒకరిముఖాలు ఒకరు చూసుకుంటూ శిలావిగ్రహాల మాదిరి అలాగే నిలుచుండిపోయారు వారందరూ.

"మేము ఎవరిమో, మా వృత్తి ఎటువంటిదో రామానుజులవారికి అర్థం అయిందని అంటావా?" మండపం దగ్గర్నించి ఇవతలకు వస్తూ లోగొంతుకతో శ్రీధరుడిని ప్రశ్నించాడు గర్గుడు.

ఆ మాటల్ని గురించి ఆలోచించటంలేదు శ్రీధరుడు... నగరాన్ని వదిలి నాలుగు దిక్కులకు చెల్లాచెదరయిన దొంగల గుంపుల్లో, ఏ గుంపును అనుసరించి బయలుదేరాలో నిర్ణయించుకోవటానికి ప్రయత్నిస్తూ వడివడిగా అడుగులు వేశాడు.

## 15

రంగనాథుడి విగ్రహాన్ని అపహరించిన గుంపును కనిపెట్టడం చాలా కష్టంతో కూడుకున్నదని అని అనుకున్నాడు శ్రీధరుడు. అంతకంటే తేలికైన పని మరొకటి లేదని వెంటనే నిరూపించాడు అతని స్నేహితులు ఇద్దరూ.

రంగనాథుడి ఆలయం దగ్గర్నించి సూటిగా తమ వృషభ శకటం వద్దకు పోయారు వారు... తోటమాలిని, తమ ఆశ్రయం కోరి వచ్చిన ఆడవారిని నగరంలోకి పంపించి, శకటాన్ని ప్రయాణానికి సిద్ధం చేశారు.

తోటమాలితోపాటు హేమసుందరిని కూడా నగరంలోకి పంపే ప్రయత్నం చేశాడు శ్రీధరుడు. ఆమె మొండిగా తిరస్కరించటంతో, తమ వెంట తీసుకువెళ్లటానికి అంగీకరించక తప్పలేదు అతనికి.

అతన్ని హేమకు వెనుక కూర్చోమని ఆజ్ఞాపించి, వృషభ శకటాన్ని తను నడిపాడు కోలాహలుడు... రాత్రంతా ఎక్కడా ఆగకుండా ప్రయాణం చేసి, తూర్పుదిక్కు తెల్లబడుతున్న సమయంలో ఒక గ్రామం దగ్గరకి పోయారు అందరూ.

శ్రీరంగం నుంచి వెనక్కి వస్తున్న సమయంలో ఆ గ్రామంమీద దాడి చేసింది ఒక దొంగల గుంపు.... అనేకమందిని హతమార్చి, విలువైన ఆస్తులతో వెళ్లిపోయింది.

అగ్నికి ఆహుతి అయిన తమ గృహాలను చూసుకుని, గోలు గోలున విలపిస్తున్న ఆ గ్రామప్రజల దగ్గిరికి తాను ఒక్కడే వెళ్ళివచ్చాడు గర్గుడు.

"మనం మరికాస్తంత వేగంగా ప్రయాణం చేయగలిగితే, మధ్యాహ్నసమయంలోపుగా ఈ గ్రామంమీద పడిన దొంగల్ని పట్టుకోవచ్చు..." అంటూ తన అభిప్రాయాన్ని కోలాహలుడికి వినిపించాడు.

రాత్రంతా ప్రయాణం చేసి చేసి అలసిపోయివున్న తమ వృషభాలు అతను కోరుకున్నంత వేగంతో ప్రయాణం చేయటం అసంభవం. అతనికి తెలియచేయబోయిన శ్రీధరుడిని వెంటనే వారించి, తను బండిలోనుంచి దిగాడు కోలాహలుడు.

"సూటిగా వృషభాలను నడిపించు..తొందరపడవలసిన అవసరంలేదు" అంటూ గర్గుడికి సైగచేసి, ఒక్కసారిగా పరుగు మొదలు పెట్టాడు.

తను ఏం చేయబోతున్నాడో కనీసం సూచనప్రాయంగానైనా తెలియచేయకుండా, వున్నట్లుండి అలా పరుగులు తీస్తున్న అతని వుద్దేశించి పెద్దగా కేకలు పెట్టబోయిన శ్రీధరుడిని, వెంటనే ఆపివేసింది హేమసుందరి.

అతని అరుపులు ఆ చుట్టుపట్ల ఎవరయినా దొంగలు సంచరిస్తూ వుంటే, వారికి వినిపిస్తాయని ఆమె భయం. ముందు వెనుక చూసుకోకుండా శ్రీధరుడు వారిమీదికి ఎగబడతాడేమోనని అనుమానం.

దూరంలో వున్న కొన్ని దట్టమైన పొదల్లోకి పోయి అదృశ్యులైన స్నేహితులిద్దరిని గురించి, వారు చేయబోతున్న పనిని గురించీ ఆలోచిస్తూ శకటాన్ని ముందుకు పోనిచ్చాడు శ్రీధరుడు.

మిట్టమధ్యాహ్న వేళ గతించిన అర్ధగడియకు ఒక చెట్లతోపు ఎదుట అతనికి అగుపించాడు గర్గుడు.

"కోలాహలుడు ఎక్కడ...?" చుట్టూ చూస్తూ అతన్ని అడిగాడు శ్రీధరుడు.

ఆ మాటకు గర్గుడు సమాధానం చెప్పకముందే, చెట్లతోపులోనుంచి అతని చెవికి చేరింది దారుణంగా ప్రతిధ్వనించే ఆర్తనాదం ఒకటి.

అదిరిపడి శకటం మీదినించి క్రిందికి దూకాడు శ్రీధరుడు. వింటినుంచి వెలువడిన బాణంలా సూటిగా తోపు లోపలికి పోయేసరికి అగుపించింది ఆ దృశ్యం.

భగభగలాడుతున్న ఒక నెగడు ప్రక్కన నిలబడి వున్నాడు కోలాహలుడు. కాళ్ళుచేతులు కదలకుండా బంధించబడిన వ్యక్తి ఒకతను ఆ నెగడుకు సమీపంలో ఒకచెట్టుకు తల్లక్రిందులుగా వ్రేలాడుతున్నాడు.

ఉయ్యాలను ఊపినట్లు అతన్ని అటూ ఇటూ వూపుతున్నాడు కోలాహలుడు. ఊగినప్పుడల్లా నెగడుకు అత్యంత సమీపంలోకి పోయి, గుండెలు జలదరించేటట్లు కేకలు పెడుతున్నాడు ఆ వ్యక్తి.

"నువ్వు మనిషివా రాక్షసుడివా? ఏమిటి ఈ అకృత్యం?" కోపం నిండిన కంఠంతో ప్రశ్నించబోయి, ఆ వ్యక్తి ఎవరో అర్థం అయేసరికి నోటిలోని మాటల్ని నోటిలోనే మింగివేశాడు శ్రీధరుడు.

వేగంగా వెళ్ళగలిగితే దారిలో తమకు కనిపించిన గ్రామాన్ని దగ్ధం చేసిన దొంగల్ని కలుసుకోవచ్చని గర్గుడు చెప్పిన మాటల్లో అసత్యం ఏమీ లేదు. వేగంగా వచ్చి ఆ గుంపును కలుసుకున్నారు వాళ్ళిద్దరూ. అదను చూసి ఆ గుంపులోని ఒక దొంగను అపహరించి తీసుకువచ్చారు.

కోలాహలుడిని నిందించి, తల్లక్రిందులుగా వ్రేలాడుతున్న ఆ వ్యక్తిని, విడిపించాలనే మాటను పూర్తిగా మరిచిపోయి, అలాగే చూస్తూ మౌనంగా నిలబడిపోయాడు శ్రీధరుడు.

నెగడులోని మంటలు తన శిరోజాల్ని , జానెడు పొడుగున్న గుడ్డల్ని సగం వరకూ మాడ్చివేసిన తరువాత వున్నట్లుండి అన్నాడా వ్యక్తి.

ఆ భాష శ్రీధరుడికి అవగతం కాలేదు. కోలాహలుడికి అర్థం అయింది. ఉయ్యాల ఊపటాన్ని ఆపి ప్రశ్నార్థకంగా నొసలు ఎగురవేశాడతను.

"తమను చూసి భయపడే గ్రామీణులమీద వీరత్వం చూపించటానికి వెనుకంజ వేశారు ఈ దుర్మార్గులు. తమకు ఇసుమంత బాధ కలిగినా ఆగలేరు. ఆకాశం విరిగి పడిపోతున్నట్లు గోలచేస్తారు..." శ్రీధరుడితోపాటు తోటలోకి వచ్చిన గర్గుడు మెల్లిగా అన్నాడు.

తల్లక్రిందులుగా వ్రేలాడుతున్న వ్యక్తి చెప్పిన మాటన్నింటినీ శ్రద్ధగా విని, శ్రీధరుడివైపు చూస్తూ ఆనందంగా నవ్వాడు కోలాహలుడు.

"రంగనాథ విగ్రహాన్ని అపహరించిన గుంపు ఇక్కడికి దగ్గిర్లోనే వున్న వెంకటాద్రి చెరువుకు సమీపంలో విడిది చేస్తుందట. శ్రీరంగం నుంచి తలా ఒకప్రక్కగా పారిపోయిన వారందరూ రేపు తెల్లవారేలోపుగా అక్కడికి చేరుకుంటారట... అందరూ కలిసి కాంచీపురం మీదుగా వెనక్కి వెళ్లిపోతారట..." ఆ వ్యక్తి చెప్పిన మాటలకు అర్థాన్ని అతనికి వివరించాడు.

దట్టీలో వున్న పిడిబాకును బయటికి తీసి ఆ వ్యక్తికేసి కదలబోతున్న గర్గుడి వుద్దేశ్యాన్ని గమనించి వెంటనే అడ్డుకున్నాడు శ్రీధరుడు.

"ఈ కట్లపామును అంతమొందించకపోతే మనం చిక్కుల్లో పడతాం..." అంటున్న గర్గుడిని అవతలకు నెట్టి, ఆ వ్యక్తిని చెట్టుకొమ్మమీదినించి క్రిందికి దింపాడు.

"మనపని పూర్తి అయ్యేంతవరకూ ఇతను ఎవరికంటా పడకూడదు..." అంటూ తను కల్పించుకొని, ఆ వ్యక్తిని ఒక చెట్టు చాటున వున్న పొద దగ్గిర పడుకోబెట్టాడు కోలాహలుడు.

అతన్ని బంధవిముక్తుడ్ని చేయటానికి స్నేహితులు ఇద్దరూ వ్యతిరేకిస్తున్నందువల్ల ఆ పైన ఏమీ మాట్లాడలేకపోయాడు శ్రీధరుడు.

ఆ వ్యక్తిని పట్టుకుని ఆ చెట్లతోపులోకి తీసుకువస్తున్న సమయంలో గుర్గుడికి అగుపించింది ఒక ఫలవృక్షం. వడివడి అడుగులతో పోయి, వడినిండా ఆ ఫలాల్ని కోసుకు వచ్చాడతను ఇప్పుడు.

ఫలాల్ని ఆరగించి, సూర్యుడు పడమటి దిశలో పడి మటుమాయం కాబోతున్న సమయంలో, తిరిగి ప్రయాణం ప్రారంభించారు వారందరూ... రాత్రి

మొదటిఝాము గడుస్తున్న వేళలో వెంకటాద్రి చెరువును సమీపించి, ఒక చిన్న కొండగుట్ట చాటున శకటాన్ని ఆపారు.

* * *

అధికంగా వర్షాలు కురవటం వల్ల బ్రహ్మాండమైన సముద్రంలా అగుపిస్తోంది వెంకటాద్రి చెరువు... మరో నాలుగుదుక్కుల వర్షం పడితే చాలు గట్లు తెగి జలప్రళయం ముంచుకు వచ్చేటట్లు అగుపిస్తోంది అక్కడి పరిస్థితి.

తమ మత వాహనాలను ఆ చెరువు గట్టుమీద వదిలి, చెరువుకు వంద ధనువుల దూరంలో రంగు రంగుల గుడారాలను నిలబెట్టారు ముందుగా అక్కడికి వచ్చిన దొంగలు. స్నేహితులు ముగ్గురూ చూస్తుండగా మరో నాలుగు గుంపులు వచ్చి ఆ గుడారాల ముందు ఆగాయి...

"మనం ఏదైనా చేయదలచుకుంటే వెంటనే చేసేయటం చాలా మంచిది. ఆలస్యం అయితే వారి సంఖ్య అనూహ్యంగా పెరిగిపోయేటట్లు కనిపిస్తోంది" అన్నాడు గర్గుడు.

పది క్షణాలు ఆలోచించి ముందుకు కదిలాడు కోలాహలుడు... పాములా పొట్టమీద పాకుతూ వంటరిగా గుడారాల సమీపంలోకి పోయాడు. అర్ధఘడియ తరువాత పాము మాదిరిగానే నిశ్శబ్దంగా తిరిగి వచ్చాడు.

"ఈ గూండాలందరికీ నాయకుడు ఒకతను ఆకుపచ్చరంగు గుడారంలో వున్నాడు.. రంగనాథుడి విగ్రహం అతని దగ్గిరే వున్నది" తను సేకరించుకు వచ్చిన విషయాన్ని వారికి తెలియచేశాడు.

అర్ధరాత్రి అవుతున్న సమయంలో మందగించింది గుడారాల దగ్గిర సందడి. ఆదమరిచి నిద్రలకు ఉపక్రమించిన తమ సహచరులమీద ఎవరూ దాడి

చేయకుండా, కత్తుల్ని పట్టుకుని కాపలా కాస్తున్నారు కొందరు దొంగలు. వారిలో ఏ ఒక్కరికి అనుమానం వచ్చినా, అక్కడ వున్న వారందరూ నిద్రలు లేచి ఆయుధాల్ని అందుకుంటారు...

"నాయకుడి గుడారం దగ్గిర కాపలా ఇంకా బలంగా వున్నది. వారి మాటలు వినబడేటంత సమీపంలోకి వెళ్ళటానికి నాకు చాలా సమయం పట్టింది" ఆకుపచ్చరంగు గుడారం దగ్గిరికి చేరుకోవటం దాదాపు అసాధ్యం అని ఒక నిర్ణయానికి వస్తూ నిస్పృహ నిండిన కంఠంతో అన్నాడు కోలాహలుడు.

గర్గుడి వదనంలో కూడా అటువంటి నీరసభావమే అగుపించేసరికి, ఏం చేయాలో అర్థం కాలేదు శ్రీధరుడికి. చేతుల్ని వెనక్కి విరిచి కట్టుకుని, వృషభ శకటం దగ్గిరికి తిరిగి వచ్చాడతను.

బండిలో పరిచివున్న ఎండుగడ్డిని తన చేతులతో తానే స్వయంగా వృషభాలకు అందిస్తోంది హేమసుందరి. అర్థనిమీలిత నేత్రాలతో హాయిగా తలలు వూపుతూ ఆరగిస్తున్నాయి ఆ మూగ జంతువులు.

"ఈ చెరువును చూస్తుంటే నాకు భయం కలుగుతోంది. ఎక్కడయినా ఒక్కచోట గండి పడటం అంటూ జరిగితే, పల్లపు ప్రదేశాలన్నీ పూర్తిగా జలమయం అయిపోతాయి. ఈ చుట్టుపట్ల వుండే గ్రామాలు నాశనం అయిపోతాయి" శ్రీధరుడి వదనంలోని భావాలు చీకటిలో సరిగ్గా కనిపించక పోవడంవల్ల, తన మనసులోని మాటను అతనికి తెలియచేసింది హేమసుందరి.

విసుగ్గా తలవూపి, ఆమె ప్రక్కన చతికిలబడబోతూ, తేలు కుట్టినట్లు ఎగిరి పడ్డాడు శ్రీధరుడు. గబగబా బండిలోకి వంగి అందులో భద్రపరచి వున్న రెండు బరిశెల్ని తీసుకున్నాడు.

అతని బాధ ఏమిటో తెలియకపోవటం వల్ల "ఏమయింది?" ఆందోళన నిండిన కంఠంతో అడిగింది హేమసుందరి.

"నువ్వు వెళ్ళి గర్గుడిని, కోలాహలుడిని చెరువు గట్టుమీదికి రమ్మనమని చెప్పు..." అంటూ గట్టుమీదికి పరిగెత్తాడు శ్రీధరుడు.

అక్కడ గుంపులు గుంపులుగా నిలబడి వున్న అశ్వాలు, అతన్ని చూడగానే తలల్ని విదిలిస్తూ, గట్టుమీదినించి క్రిందికి దిగేశాయి.

తన కదలికలు, గుడారాల దగ్గిర వున్న దొంగలకు అగుపించకుండా, నీటి అంచు దగ్గిర మోకరించి, తీసుకువచ్చిన బరిశెల్ని పలుగుల మాదిరి ఉపయోగించాడు శ్రీధరుడు. కోలాహలుడు, గర్గుడు తన దగ్గిరికి వచ్చేసరికి, రెండుమూరల లోతున ఒక పెద్ద రంధ్రాన్ని తయారు చేశాడు.

"నీవు చేస్తున్న పని ఏమిటో నీకు తెలుస్తోందా? ఇంకొక్క మూరెడు దూరం తవ్వితే గట్టుకు గండి పడుతుందని అర్థం అవుతోందా?" ఆందోళనగా అంటూ అతన్ని వారించబోయి, ఆఖరిక్షణంలో అతను ఆఖరిక్షణంలో అతను ఆ పని ఎందుకు చేస్తున్నాడో గ్రహించాడు కోలాహలుడు.

గ్రహించిన మరుక్షణం గర్గుడిని అక్కడ వదిలి, తను గుడారంకేసి కదిలాడు. రెండవ బరిశెను తీసుకుని శ్రీధరుడితో పాటు తవ్వటం మొదలుపెట్టాడు గర్గుడు.

పావు ఘడియ తరువాత ఉన్నట్లుండి కదిలింది చెరువులోని నీరు... గుండెలు జలదరించేటట్లు భీకరమైన శబ్దాలు చేస్తూ, గట్టుకు పెద్దగండిని పెట్టి, గుడారాలవైపు దుమికింది.

చూస్తూ చూస్తూ వుండగానే విశాలమైంది ఆ గండి... నాలుగే నాలుగు నిమిషాల్లో వంద ధనువుల వెడల్పు అయింది.

స్వర్గలోకంనుండి శంభుని శిరస్సు మీదికి వురుకుతున్న ఆకాశగంగ మాదిరి భీకర ధ్వనులతో వచ్చి పడిన జల ప్రవాహం దెబ్బకు కకావికలైపోయింది దొంగల గుంపు.

నిద్రలోనుంచి లేవకముందే నిలువెత్తు జలంలో మునిగి మరణించారు అనేకమంది. లేచిన తరువాత నిలదొక్కుకోవటం చేతకాక దూరంగా కొట్టుకుపోయారు మరికొంతమంది.

నిమ్మకు నీరెత్తినట్లు నిశ్చలంగా, నిశ్శబ్దంగా వున్న ఆ ప్రదేశం ఒక్కసారిగా అరుపులతో , ఆర్తనాదాలతో, కేకలతో అల్లకల్లోలం కావడం మొదలుపెట్టింది.

గుడారాలన్నింటినీ ముంచి, ముందుకు సాగిపోతున్న ఆ ప్రవాహపు వేగాన్ని తట్టుకోవడం కోలాహలుడికి సాధ్యపడుతుందో లేదోనన్న భయం క్రొత్తగా మనసులో అడుగు పెట్టేసరికి బెంబేలు పడిపోయాడు శ్రీధరుడు.

చేతిలో వున్న బరిశెను అవతలికి విసిరి ముందుకు అడుగు వేయబోతుండగా, అగుపించాడతనికి అతని సమీపంలోకి వచ్చిన కోలాహలుడు.

చెరువు నీరు ఆకుపచ్చ గుడారం మీదికి విరుచుకు పడబోతున్న సమయంలో అక్కడికి చేరుకున్నాడతను... నీటి అదటుకు దొంగల నాయకుడు, అతని అనుచరులు కళవళపడుతున్న సమయంలో గుడారంలోకి ప్రవేశించి రంగనాథుడి విగ్రహాన్ని భుజాలమీదికి ఎత్తుకున్నాడు. గుడారం నీటిలో మునిగి పోతుండగా అవతలికి పరుగు తీసి, వృషభ శకటం దగ్గిరికి తీసుకువచ్చాడు.

"తెల్లవారేసరికి నీటి ఉరవడి తగ్గిపోతుంది... చెల్లాచెదురైన వారందరూ తిరిగి ఒకచోటికి చేరుకుంటారు... జరిగింది ఏమిటో తెలుసుకుని మనల్ని వెంటాడతారు... వేగవంతాలైన వారి అశ్వాలకు అందకుండా మనం తప్పించుకోలేం" వెనుతిరిగి వచ్చినదారినే శ్రీరంగానికి వెళ్లిపోదామన్న హేమసుందరి ఆంగోళనకు అభ్యంతరం చెపుతూ అన్నాడతను.

తరతరాలుగా భక్తుల పూజల్ని అందుకుంటున్న రంగనాథుడి పవిత్రమూర్తిని శకటంలో పరుండబెట్టి, వృషభాలను పూన్చాడు శ్రీధరుడు.

"తిరుపతి కొండలకేసి పోదాం...మనం ఏ మార్గాన్ని అనుసరిస్తున్నామో వారికి అర్థం అయ్యేలోగా అక్కడికి చేరుకోవచ్చు..." అంటూ శకటాన్ని కదిలించాడు.

మూడు రాత్రులు, మూడు పగళ్ళు ప్రయాణం చేసిన తర్వాత వారి ఎదుట ప్రత్యక్షం అయ్యాయి తిరుపతి కొండలు.

దొంగల గుంపులు శ్రీరంగం మీద పడిన వార్త ఆ చుట్టుపట్ల వున్న గ్రామాలన్నింటికీ చేరింది కాబోలు, శ్రీరంగంలోని పౌరుల మాదిరి చెల్లాచెదరై పోకుండా, ఆయుధాల్ని ధరించాడు అందరూ. అలసటగా అడుగులు వేస్తూ, తమ గ్రామంలోకి అడుగుపెట్టిన స్నేహితుల్ని సాదరంగా ఆహ్వానించాడు గ్రామ పెద్ద.

వారు శ్రీరంగం నుంచి వస్తున్నట్లు తెలుసుకుని ఎంతగానో సానుభూతి చూపించాడు.

"రంగనాథ విగ్రహం ఆ దొంగలపాలు అయిందని తెలిసింది మాకు... ఎంతో చింతించవలసిన విషయం అది..." అని అన్నాడు.

అతన మాట అన్నప్పుడు అతన్ని బండి దగ్గిరికి తీసుకుపోయి, లోపల పరుండి వున్న లీలామానుష విగ్రహుడిని చూపించాడు కోలాహలుడు.

"ఈ విగ్రహాన్ని మేము స్వాధీనం చేసుకున్నందుకు, ఆగ్రహంతో రగులుకుపోతూ వచ్చేస్తారు ఆ దొంగలు... తమ దారిలో అగుపించిన గ్రామాలన్నిటినీ నేలమట్టం చేసివేస్తారు... మూటా ముల్లె సర్దుకుని సురక్షిత ప్రాంతాలకు తరలండి మీరందరూ...మొండిగా నిలబడి ప్రమాదాన్ని ఆహ్వానించకండి" అని చెప్పాడు.

ఎదురు చెప్పలేదు ఆ గ్రామపెద్ద. తన గ్రామస్థులకే కాదు, ఆ చుట్టుపట్ల వున్న ఇరువది రెండు గ్రామాలకు వెంటనే తెలియజేశాడు ఆ సమాచారాన్ని.

"రంగనాథుడి విగ్రహం తిరిగి లభ్యం అయింది...ఆ విగ్రహం తిరిగి లభ్యం అయింది... ఆ విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్న భక్తులమీద కినుక చెందిన దొంగలు తిరుపతి వైపు కదిలిరావచ్చు...సిద్ధంకండి అందరూ."

శంఖాలు వూదటం ద్వారా, టముకుల్ని మ్రోగించటం ద్వారా, పావు ఘడియలో పదిరెండు ఆమడల దూరం ప్రయాణించింది ఆ వర్తమానం.

భార్యల్ని, బిడ్డల్ని, కదలలేని వృద్ధుల్ని రహస్య ప్రదేశాలలో సురక్షితంగా దిగబెట్టి, ఆయుధాలను ధరించారు గ్రామస్థులు... ఒకరిద్దరుగా గుంపులు గుంపులుగా తిరుపతి కొండ దగ్గిరకి వచ్చేశారు.

తిరుపతి కొండమీదికి కూడా చేరుకున్నది రంగనాథస్వామి వృషభశకటంలో విచ్చేస్తున్న వార్త.

భగభగమని వెలుగుతున్న కాగడాలతో, పూర్ణకుంభాలతో, పచ్చల పల్లకీని తీసుకుని, ఎదురు వచ్చాడు వెంకటేశ్వరుని అర్చక స్వాములు.

దోపిడీ దొంగల గుంపు శ్రీరంగం మీద దాడిచేసిందని తెలిసిన మరుక్షణం విచ్చుకత్తుల వంటి రెండు వేలమంది భటులతో స్వామివారి ఆలయం వద్ద కాపలా కాయటానికి వచ్చిన రాజప్రతినిధి, ఉత్తరీయాన్ని నడుముచుట్టూ చుట్టుకుని రంగనాథస్వామివారి ముందు సాగిలపడ్డాడు.

"తిరిగి మన స్వామి మీద పరులు చేయి వేయాలంటే, మా ప్రాణాలు పోయిన తరువాతనే ఆ పని చేయాలి... సామాన్యులెవరికీ సాధ్యపడని అపూర్వ సాహసం చేసిన మీకు మనసారా నమస్కరిస్తున్నాను..."శ్రీధరుడితో అంటూ ఆడంబరంగా కొండలమీదికి తీసుకుపోయాడతను స్వామివారి విగ్రహాన్ని.

కొండమీద తమకు జరుగుతున్న గౌరవాల్ని తట్టుకోవడం అసాధ్యమయి, కొద్దిగా ఊపిరి పీల్చుకోవటానికి కొండల క్రిందికి వచ్చేశారు స్నేహితులు.

పన్నెండువేలమంది భక్తులు ఆయుధధారులై ఆ కొండల చుట్టూ నిలబడి వుండటం అగుపించింది వారందరికీ.

ఆ భక్తుల వీరలాపాల్ని వింటూ, ఆయుధాల్ని వుపయోగించటంలో వారికి వున్న ప్రజ్ఞాపాటవాల్ని గమనిస్తూ, కొద్దిసేపు అక్కడే కాలక్షేపం చేశారు. తిరిగి కొండల మీదికి మరలుతున్న సమయంలో హేమసుందరి వెలిబుచ్చింది ఒక చిన్న కోరికను.

వారు అడుగులు వేస్తున్న మార్గంలో, ఆమెకు అగుపించింది ఒక పెద్ద పొగడచెట్టు.

రెండు వందల ధనువుల ఎత్తున్న చిన్న కొండగుట్ట మీద వున్నది ఆ వృక్షం.

"ఆ పూలు నాకు కావాలి... తెచ్చిపెట్టగలవా?" అని శ్రీధరుడిని అడిగింది.

వినోదంగా చూస్తున్న తన స్నేహితుల వంక ఒకసారి ఉరిమి చూసి, అటుకేసి కదిలాడు శ్రీధరుడు. ఎత్తయిన ఆ వృక్షం మీదికి చేరుకుని, వడినిండా ఆ పూలను సేకరించాడు. జాగ్రత్తగానే క్రిందికి దిగి, గుట్టమీదినుండి తన వారి దగ్గిరికి వెళ్ళే ప్రయత్నం చేశాడు.

"జాగ్రత్త స్నేహితుడా... చూసి అడుగులు వేయి..." ఎందుకనో వున్నట్లుండి బిగ్గరగి అరిచి అతన్ని హెచ్చరించాడు కోలాహలుడు.

ఎగుడు దిగుడుగా వున్న బండలమీద అతడు తల్లక్రిందులై పోతాడనే భయం వల్ల అలా అరిచి వుండవచ్చతను. వడిలోని పూలవంకే చూసుకుంటూ అడుగులు వేయటం వల్ల ముందుకు తూలవచ్చని కూడా అనుమానపడటం వల్ల అలా హెచ్చరించి వుండవచ్చు.

ఏది ఏమయినా అతను కేకపెట్టిన నాలుగో క్షణంలో, అతను భయపడినట్లే, ఒకచిన్న బండమీద పాదాన్ని మోపి, ఒక్కసారిగా ముందుకు తూలాడు శ్రీధరుడు.

కెవ్వున అరిచి కొండగుట్ట మీదికి పరుగెత్తబోయిన హేమసుందరి కంటే ముందుగా అక్కడికి చేరుకున్నారు గర్గుడు, కోలాహలుడు.

అప్పటికే గట్టు ఆవలి ప్రక్కన వున్న పల్లపు ప్రదేశంలోకి దొర్లుకుంటూ వెళ్ళిపోయాడు శ్రీధరుడు.

వడిలో వున్న పొగడపూలు చెల్లాచెదరైపోతూ వుండగా, చేతుల్ని జాచి దగ్గర్లో వున్న బండరాళ్ళను గట్టిగా పట్టుకోవడానికి ప్రయత్నం చేశాడతను.

ఎండలకు ఎండి, వానలకు తడిపి, ఆకురాయితో అదిమి రుద్దినట్లు నునుపుగా వున్న ఆ బండలమీద పట్టు చిక్కించుకోవటం సాధ్యపడలేదు అతనికి.

దొర్లుకుంటూ దొర్లుకుంటూ వైకుంఠపురం గ్రామదేవత ఆలయం వెనుక వున్న నూయివంటి లోతయిన ఒక గోతిలోకి దభేలున పడిపోయాడు.

అడుగుభాగంలో మామూలు బండరాయే గనుక వుండి వుంటే, ఆ క్షణంలో అతని చరిత్ర పరిసమాప్తి చెంది వుండేది.

బండరాయే వున్నది. కాని రెండు ధనువుల నీటితో నిండివున్నది గొయ్యి...

శిరస్సు వెయ్యివక్కలై విగతజీవుడై పోవాల్సిన శ్రీధరుడు మెత్తటి దూది గుట్టమీద పడినట్లు నీటిలోపడి వెంటనే తేరుకున్నాడు.

"ఒక్కక్షణం ఓపిక పట్టు స్నేహితుడా ... ఒక్కక్షణం ఓపిక పట్టు" అని గొయ్యి పైభాగంలోనుంచి కోలాహలుడు అరిచిన అరుపులు అతని చెవికి చేరాయి.

ఆ గుట్టకు సమీపంలో చిత్తవత్తుగా పెరిగి వున్న అడవి తీగెల్ని సేకరించి అతను మోకు మాదిరిగా తయారుచేసి, గొయ్యిలోకి వదలాలి...ఆ మోకు సహాయంతో నునుపుగా వున్న గొయ్యి గోడల మీదుగా తను పైకి చేరుకోవాలి.

కోలాహలుడి వెనకే ప్రత్యక్షం అయి, ఆందోళన నిండిన కనులతో క్రిందికి చూసిన హేమసుందరికి చేతిని వూపాడు శ్రీధరుడు. కలత చెందవలసినంత ప్రమాదంలో తను చిక్కబడలేదని సూచిస్తూ, సరయిన గుట్టకోసం, గోతి గోడల్ని చేతులతో తడిమాడు.

అలా తడుతున్న సమయంలో నీటి అంచుకు నాలుగు జానల ఎత్తులో అతనికి అగుపించాయి కొన్నిబొమ్మలు.

జల్లుమన్నది అతని శరీరం...వేగంగా కొట్టుకోవటం మొదలుపెట్టాయి అతని గుండెలు... తనకు తెలియకుండానే తల ఎత్తి బిగ్గరగా కేకపెట్టాడు...

అదిరిపడి తొంగి చూసిన కోలాహలుడికి, గర్గుడికి క్రిందికి రమ్మనమని సైగచేశాడు.

రాక్షసుల మాదిరి పనిచేశారు వారిద్దరూ. కరవాలాలతో అడవి తీగెల్ని ఛేదించి అప్పటికప్పుడు బ్రహ్మాండమైన మోకును తయారు చేశారు. ఒక కొనను గుట్టమీది పొగడ చెట్టుకు గట్టిగా బిగించి, రెండవ కొనను గోతిలోకి జారవిడచారు.

వద్దు... వద్దని గుర్గుడు ఎంతగా వారించినా వినిపించుకోలేదు హేమసుందరి. కోలాహలుడు నెత్తి నోరు కొట్టుకుని చెప్పినా ఆగలేదు. వారిద్దరితో పాటు తనుకూడా ఆ గోతిలోకి దిగింది.

నునుపైన గోడమీద బొమ్మల్ని శ్రీధరుడు తనకు చూపించిన మరుక్షణం పిచ్చిపట్టిన వాడిలా వెర్రిగా అరిచి, ఆ గోడను చేతులతో తడిమాడు కోలాహలుడు. అలా తడుముతున్న సమయంలో అతని చేతివేళ్ళకు తగిలింది చిన్న బుడిపెవంటి పలుకురాయి. వత్తిడి అధికం అయ్యేసరికి అటూ ఇటూ కదిలిందది... ఉన్నట్లుండి ప్రక్కకు జరిగింది నునుపుగా వున్న ఆ గోడలోని ఒక రాతిపలక.

ఎన్నో తరాల క్రిందట కావాలనే ఎవరో తయారుచేసిన సొరంగమార్గం ఒకటి ఆ రాతిపలక వెనక భాగంలో ప్రత్యక్షం అయింది.

ఒకరి తరువాత ఒకరుగా స్నేహితులు ముగ్గురూ ఆ మార్గంలోకి ప్రవేశించారు.

హేమసుందరి చేతిని గట్టిగా పట్టుకుని అందరికంటే ముందుగా అడుగులు వేశాడు శ్రీధరుడు.

పాతిక అడుగుల దూరం వెళ్ళిన తరువాత విశాలమైన మందిరం వంటి ప్రదేశం ఒకటి అగుపించింది అతనికి.

గుట్టలు – గుట్టలుగా పడివున్నాయి అక్కడ బంగారపు అచ్చులు... మట్టితో తయారు చేసిన పెద్ద పెద్ద బానల నిండుగా కనిపించాయి అత్యంత విలువైన మణులు, మాణిక్యాలు, వజ్రాలతో, వైఢూర్యాలతో పొదిగి వున్న ఆభరణాలు. వెండితో తయారుచేయబడిన విచిత్రమైన పరికరాలు ఎన్నెన్నో వారి కనుల ముందు కనిపించాయి.

విపరీతమైన ఆశ్చర్యంతో నోళ్ళు తెరుచుకు నిలబడిపోయిన గుర్గుడినీ, కోలాహలుడినీ చూసి చిన్నగా నవ్వుతూ, దగ్గిర్లోనే వున్న ఒక మరకతసింహాసనం మీద హేమసుందరిని బలవంతంగా కూర్చోబెట్టాడు శ్రీధరుడు... చేతికి సమీపంలో వున్న బంగారు నాణేల గుట్టలోనుంచి దోసెడు నాణేలను తీసి ఆమెకు కనకాభిషేకం చేశాడు.

రాగిరేకుల మీద వ్రాయబడివున్న పురాతన కాలపు మాటలు అక్షరాలా యదార్థం అయ్యాయి. ఎన్నెన్నో తరాలనుంచి ఎవరికీ అగుపించని కర్మరుడి అపూర్వనిథి వారికి అగుపించింది.

* * *

రంగనాథుని విగ్రహాన్ని తమ దగ్గిర్నించి తస్కరించిన వారికోసం దొంగల గుంపులు వెతకటం మొదలుపెడతాయని కోలాహలుడు వూహించిన విధంగానే, ఆ మరుసటిరోజు మధ్యాహ్నవేళలో తిరుపతి కొండల ముందు ప్రత్యక్షం అయ్యాయి ఆ గుంపులు.

ఒకటి కాదు... రెండు కాదు... వింధ్యాచలాన్ని దాటి దక్షిణా పథంలోకి అడుగిడిన గుంపులన్నీ కలసికట్టుగా వచ్చిపడ్డాయి.

కోలాహలునితో తమకు నిధి కనిపించిన గుట్టమీదనే నిలవబడి ఆ గుంపులోని దుర్మార్గుల్ని లెక్కవేశాడు శ్రీధరుడు.

అరువది నాలుగు వేలమందికి పైగానే కనిపించారు వారు... రకరకాల ఆయుధాల్ని ధరించి, ఎటువంటి వీరులనైనా చిటికెలో నిర్జించగలమన్న నమ్మకంతో, పోరాటాన్ని ప్రారంభిస్తున్నారు.

"వారిలో ఏ ఒక్కరు కొండలమీదికి వెళ్లినా, మనం చేతగాని వాళ్ళక్రిందే జమకట్టబడతాము. బ్రతికివుంటే మన దైవాలను రక్షించుకున్నవారిగా చరిత్ర పుటల్లో శాశ్వతస్థానాన్ని సంపాదించుకుంటాము. మరణించటం జరిగితే దైవాల కోసం ప్రాణాల్ని వదిలిన వారిగా కీర్తించబడతాము. ఎదిరించండి... ఒక అడుగు కూడా వెనక్కి వేయకుండా చీల్చిచెండాడండి ఆ దుర్మార్గుల్ని" ఉరుమువంటి కంఠంతో కొండల్ని కాపలా కాస్తున్న భక్తులను హెచ్చరిస్తూ, పోరాటం మధ్యలోకి దుమికాడు కోలాహలుడు.

కరవాలాన్ని గిరగిరా తిప్పుతూ అతన్ని అనుసరించాడు శ్రీధరుడు. బలమైన ధనుస్సు నొకదాన్ని సంపాదించి దూరంనుండే బాణాలను ప్రయోగించాడు గర్గుడు.

చెవులు చిల్లులు పడేటట్లు శంఖాలను వూదుతూ, డప్పుల్ని వాయిస్తూ అగ్ని శిఖల మాదిరి దొంగల గుంపుల్ని దహించటం మొదలు పెట్టారు అక్కడి భక్తులు.

సూర్యుడు పడమటి దిశకు దిగిపోతున్న సమయంలో దొంగల ధాష్టీకం కొంచెం అధికం అయినట్లు అనిపించింది శ్రీధరుడికి... భక్తుల ధైర్యం సన్నగిల్లుతున్న జాడలు గోచరించటం మొదలు పెట్టాయి.

అడ్డువచ్చినవారి తలల్ని తాటిపళ్ళ మాదిరిగా నేలకు రాలగొట్టి, అలసటకు గురి అయినాయి అతని హస్తాలు కూడా...

కోలాహలుడి పరిస్థితి కూడా అదేమాదిరి కనిపిస్తోంది... అడుగులు తడబడుతున్నాయి అతనికి... అంతకుముందు వరకూ గుండెలు జలదరించేటట్లు సింహనాదాలు చేసిన అతని కంఠం మూగబోతున్నది ఇప్పుడు...

దొంగల గుంపుల్ని కొండమీదికి పోకుండా అడ్డుకోవడం అసాధ్యం అవుతుందేమోనన్న అనుమానం మనసులో అడుగుపెడుతుండగా శ్రీధరుడికనులకు అగుపించింది ఆఘమేషాలమీద వచ్చిపడుతున్న మరో అశ్విక సైన్యం.

అవికూడా దొంగలకు చెందినవే అయితే , వెనుతిరిగి కొండల మీదికి పరుగు తీయటం కంటే మరో మార్గం లేదని అతను భావించాడు. కోలాహలుడికి సైగచేసి అతన్ని హెచ్చరించబోతుండగా వినవచ్చాయి ఆ అరుపులు.

"రక్షింపబడ్డాం మనం ... రక్షింపబడ్డాం... కులోత్తుంగ చోళ చక్రవర్తి తన అంగరక్షకదళంతో స్వయంగా వచ్చేశాడు..." అని కేకలు పెడుతూ శ్రీధరుడి దగ్గిరికి పరిగెత్తుకు వచ్చాడు గర్గుడు.

అతని మాటలు పూర్తిగా ముగియకముందే, వెనుకనుంచి వచ్చి దొంగల్ని కమ్ముకున్నాడు చక్రవర్తి...అందినవారిని అందినట్లు పూచకోత కోయటం మొదలు పెట్టాయి ఆయన సైన్యాలు.

ఆ తరువాత ఎంతోసేపు కొనసాగలేదా పోరాటం... చీకట్లు ఆ చుట్టుపట్ల వున్న పొదల్ని , గుట్టల్ని ఆవరించుకోవటం మొదలుపెట్టే సమయానికి అంతం అయిపోయింది.

తిరుపతికొండల్ని సమీపించటానికి ప్రయత్నించిన అరువది నాలుగువేల మంది దొంగల్లో పదునెనిమిది వేలమంది మాత్రమే ప్రాణాలు దక్కించుకుని అవతలికి పారిపోగలిగారు.

తిరిగి దక్షిణపథం వైపు కన్నెత్తిచూసే ధైర్యం వారికి మరోమూడు శతాబ్దాల వరకూ రాలేదు... కులోత్తుంగ చోళుడు సింహాసనం మీద కూర్చుని వున్నంత వరకూ అటువంటి దొంగలు ఆంధ్రదేశంలోగాని, దక్షిణ ప్రదేశాల్లోగాని ఎవరికీ అగుపించలేదు.

దారుణమైన దొమ్మియుద్ధంలో గాయాలపాలైన భక్తులను స్వయంగా దగ్గిరికి వచ్చి పరామర్శించాడు. చక్రవర్తి. అశువుల్ని బాసిన అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించి, వారి శరీరాన్ని సగౌరవంగా వారివారి బంధువుల చెంతకు చేర్పించాడు.

వెంకటేశ్వరుని సన్నిధిలో వేడుకగా విడిది చేసివున్న రంగనాథుని పవిత్ర పాదాలకు శిరసా నమస్కరించి, ఆ సాహసకార్యం చేసిన స్నేహితుల్ని తన ఎదుటికి పిలిపించుకున్నాడు.

కోలాహలుడితోను, గర్గుడితోను, హేమసుందరితోను సంప్రదించిన మీదట, కర్మరుడి నిథిని గురించి ఆ చక్కవర్తికి తెలియచేశాడు శ్రీధరుడు.

అతని ముంజేతికి వున్న కంకణాన్ని, అతనివద్ద వున్న రాగిరేకుల్ని చూసి ఆశ్చర్యచకితుడైనాడు కులోత్తుంగుడు. వందమంది అంగరక్షక దళపతులు తనను

అనుసరిస్తుండగా స్వయంగా పొగడవృక్షం వున్న కొండగుట్ట దగ్గిరికి వచ్చాడాయన.

ఆరు ఘడియల కాలం అవసరం అయింది ఆ దళపతులకు, సొరంగంలోని నిధిని వెలికి తీయటానికి.

"తిరుపతి స్వామిని దర్శించవచ్చిన రంగనాథుడి వెనుక ఎవరు వస్తారో వారికే ఈ నిధి లభిస్తుందని చెప్పిన కర్మరుడి పూర్వీకుల ఆంక్షలు అపురూప మైనటువంటివి. వారి ఆంకాంక్షను గౌరవించటం నా కర్తవ్యం. ఈ నిధి మీకే చెందుతుంది...ఇదిమీదే..." ఉదారమైన మనస్సుతో, హృదయపూర్వకంగా అన్నాడు చక్రవర్తి.

వంద తరాలపాటు అనుభవించినా వెయ్యోవంతు కూడా తరగని ఆ అపార సంపద ఏం చేసుకోవాలో శ్రీధరుడికి అర్థంకాలేదు...కోలాహలుడికీ, గర్గుడికీ అసలు బోధపడలేదు.

తిరుపతి కొండచుట్టూ రక్షణవలయంగా నిలబడి ప్రాణాలు అర్పించిన అమరవీరులకు దోసిళ్ళతో బంగారు నాణేలను, వజ్రవైఢూర్యాలను అర్పించింది హేమసుందరి... గాయాలపాలైనవారి ఇళ్ళలో కనకధారలను కురిపింప చేసింది.

విజయోత్సాహంతో చిందులు తొక్కుతున్నవారికి మోసుకు వెళ్ళగలిగినన్ని ధనరాశుల్ని బహూకరించింది.

ఎనుబది రెండు వృషభ శకటాన్ని సిద్ధం చేయించాడు తిరుపతి క్షేత్రపాలకుడైన రాజప్రతినిధి. పచ్చటి తోరణాలతో, కనులవిందు కలిగించే పూమాలలతో వాటిని అలంకరింపచేశాడు.

రంగనాథుని శిల నిలబడిన శ్రీధరుడి శకటం వెనుకగా శ్రీరంగం వైపు కదిలాయి ఆ బళ్లు అన్నీ.

దోపిడీ దొంగల బెడద శాశ్వతంగా తప్పిపోయిందన్న ఆనందంతో పండుగలు జరుపుకుంటున్న ప్రతి గ్రామంలోను,అంతవరకూ ఎవరూ కనివిని ఎరుగని ఘనస్వాగతం రంగనాథస్వామివారికి లభించింది.

ప్రతి ఇంటిముందు శకటం ఆగిపోవాల్సి వచ్చింది. ప్రతి ఇల్లాలు యిచ్చిన మంగళహారుతుల్ని, నైవేద్యాలను స్వామివారు స్వీకరించవలసి వచ్చింది.

స్వామివారు తిరుపతి కొండల్లో తలదాచుకు వచ్చారని తెలిసి, ఆయుధాలతో సేవించవచ్చిన ముప్ఫదిరెండు గ్రామ ప్రజలతోబాటు, మరో ఎనుబది నాలుగు గ్రామాలు ఆ ఊరేగింపులో పాల్గొని, స్వామివారితోబాటు శ్రీరంగానికి వచ్చేశారు.

ఆ వార్త చక్రవర్తి వార్తహరుల ద్వారా ముందుగానే తలుసుకున్న శ్రీరంగం పౌరులు వైకుంఠం మాదిరి అలంకరించారు తమ పట్టణాన్ని. మేళతాళాలతో, పూర్ణకుంభాలతో ఘనస్వాగతం యిచ్చారు.

"వైష్ణవ మత ప్రచారానికి మేము స్వయంగా బయలుదేరినప్పుడు కూడా ఇంతటి జనసందోహాన్ని ఏనాడూ చూడలేదు. అమాయకులైన గ్రామీణుల్ని చైతన్యపరిచి, వారిచో దైవం ఎడల భక్తిని, ఐకమత్యపు భావనను...ఉద్ధీపింప చేయటం కోసమే తనకు తానుగా దొంగలపాలు అయ్యాడు మన స్వామి..." ఆనందభాష్పధారలు అదేపనిగా బుగ్గలమీదికి జాలువారుతుండగా, శ్రీధరుడితో అన్నారు రామానుజులవారు.

అర్చక స్వాముల ఆధ్వర్యంలో వైష్ణవ మత సాంప్రదాయాలకు అనుగుణంగా స్వామివారిని ఆలయ ప్రవేశం చేయించి యధాస్థానంలో ప్రతిష్టింప చేశారాయన.

దోపిడీ దొంగల దౌష్టీకం వల్ల పాడుబడిపోయిన గ్రామాలను పునరుద్ధరించటానికి కర్మరుడి నిధిని ఉపయోగించవలసిందిగా ఆ పవిత్రమూర్తిని అర్థించాడు శ్రీధరుడు.

తిరుపతి కొండల దగ్గిర వున్న చక్రవర్తి శ్రీరంగం చేసుకునేసరికి, ఆ పని ప్రారంభం అయింది.

మంత్రి సామంతులందరూ చూస్తుండగా, కావేటిరంగని సమక్షంలో వారెవరూ వూహించని ఒక ప్రకటన చేశాడు కులోత్తుంగ చోళ చక్రవర్తి.

రాజేంద్ర దేవుడనే నామం గల తను, కులోత్తుంగ చోళుడిగా మారిపోయినట్లే, ధనుర్దాసుడనే నామాన్ని శ్రీధరుడికి స్వయంగా ఎన్నిక చేశాడు.


"ఈ రోజునుంచీ శ్రీరంగం చుట్టుపట్ల వున్న సహస్ర గ్రామాలకు రాజప్రతినిధిగా నియమిస్తున్నాను...కావేటిరంగని ఆలయం సంరక్షణ బాధ్యతలతో పాటు, వైష్టవ మత నిర్వహణ కార్యక్రమాలను కూడా నువ్వే స్వీకరించాలి..." అని ఆజ్ఞలు జారీచేశాడు.

కోలాహలుడిని తనకు మంత్రిగా, గర్భుడిని తన దండనాయకుడిగా నియమించుకున్నాడు శ్రీధరుడు... హేమసుందరిని తన రాణిగా ప్రకటించాడు.

అతని కాలంలో అపూర్వమైన స్థితిని చవిచూసింది వైష్ణవమతం. అతడ్ని తన కుడిభుజంగా భావించారు రామానుజులవారు... స్వయంగా ద్వయ మంత్రానికి అతనికి, హేమసుందరికి ఉపదేశించి వారిని ధన్యుల్ని కావించారు.

వైష్ణవం అంటే ప్రేమించే విధానాన్ని తెలియచేసే మతమని, సర్వజనుల్ని, సర్వజీవుల్ని భగవత్స్వరూపంగా భావించే మనిషే నిజమైన వైష్ణవుడనీ బోధించి అందరి మన్ననలకు పాత్రుడు అయ్యాడు శ్రీధరుడు. చరిత్రపుటల్లో ధనుర్దాసుడిగా శాశ్వతంగా నిలిచిపోయాడు.

-: శుభం :-



# Aananda Jyothy

By

**MADHU BAABU**

SRI SRINIVASA PUBLICATIONS
4/4, A.T. AGRAHARAM, GUNTUR - 522 004.
Ph. No. 0863-2357945